
వేదాంగాలు

# ప్రౌఢ వ్యాకరణము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# విజ్ఞప్తి

తెలుఁగునఁగల వ్యాకరణములలో మిక్కిలి ప్రసిద్ధిగల గ్రంథములు బాల ప్రౌఢవ్యాకరణములు. బాలవ్యాకరణ మనేకాంశములను జక్కఁగా సంగ్రహముగా నిరూపించు నుత్తమగ్రంథము. అందలి సూత్రములను జక్కఁగా విమర్శించి మహాకవుల ప్రయోగములను బర్యవేక్షించి కొన్ని యంశములను సవరించుచును వివరించుచును శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులవారు ప్రౌఢవ్యాకరణ మనఁబడు త్రిలింగ లక్షణశేషమును విరచించిరి. ఇయ్యది బాలవ్యాకరణమునే కాక చింతామణ్యాథర్వణ కారికలంగూడ నచ్చటచ్చటఁ బరామర్శించుచుండును. బాలవ్యాకరణమునకు గుప్తార్థ ప్రకాశికయేకాక బ్రహ్మశ్రీ దూసి రామమూర్తి శాస్త్రిగారును కళాప్రపూర్ణ వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారును గావించిన సువిపులవ్యాఖ్యానములు ప్రచారమున నున్నవి. పూజ్యులు శ్రీ దువ్వూరు వెంకటరమణ శాస్త్రిగారును విపుల ప్రామాణిక వ్యాఖ్య నచిరకాలములో నాంధ్రప్రజల కందింపఁబోవుచున్నారు.

త్రిలింగలక్షణశేషమునకు మాత్రము చాలకాలము వ్యాఖ్యానము లవతరింపలేదు. కొంతకాలమునకుఁ గుమారదేవ పండితీయమను నొక సంగ్రహవ్యాఖ్యమాత్ర ముదయించెను. ఆంధ్రవ్యాకరణ భాష్యకారులనందగిన శ్రీ వ॥ చినసీతారామస్వామి శాస్త్రులవారును ప్రౌఢవ్యాకరణ సూత్రముల నచ్చటచ్చటఁ బ్రసంగవశమున వారి గ్రంథములలో విమర్శించినను బ్రత్యేక విపులవ్యాఖ్యానమును వ్రాసియుండలేదు. అట్టి సమయమున ననగా సుమారు పదునైదు సంవత్సరములక్రిందట నేను నా శక్తి ననుసరించి యొకవ్యాఖ్యను వ్రాసితిని. కాని నేనది స్వయముగా ముద్రింపించి ప్రకటించుట కవకాశము లభింపక శ్రీవిలాస్ పబ్లికేషన్సువారి కిచ్చివేసితిని. ఇంతలో మిత్రులు శ్రీ బులుసు వెంకటరమణయ్యగారు రచించిన సుబోధిని యను వ్యాఖ్యయు వెలువడినది. నా వ్యాఖ్యానము చాలకాలముక్రిందటనే వ్రాయఁబడినను నేటికిఁగాని ముద్రితమగుట కవకాశములేకపోయెను. ఇంతకుమున్నే రెండు వ్యాఖ్యానములతో నీ గ్రంథము కూడియున్నను నా వ్యాఖ్యానమువలనఁగూడ కొంత ప్రయోజనముండునను తలంపున నీ గ్రంథమును బ్రకటించుటకు నే నభిలషించితిని. చక్కని రెండు వ్యాఖ్యానములతో నియ్యది యితఃపూర్వమే ముద్రితమయియున్నను నింకను మఱికొన్ని వ్యాఖ్యానములు విమర్శింపవలసిన యావశ్యకత కలిగియే యున్నది. సుప్రౌఢములగు వ్యాకరణ గ్రంథముల కెన్ని వ్యాఖ్యానము లుదయించినను నింకను జర్చనీయములగు విశేషాంశములు శేషించియే యుండును. కావున నాకు స్ఫురించిన భావములతోఁ దత్త్వబోధిని యనఁబడు నీ వ్యాఖ్యానమును రచించి కుమారదేవపండితీయ, సుబోధినీ వ్యాఖ్యానములంగూడఁ జూచినపిమ్మటఁ గొన్ని యంశములంజేర్చి యాంధ్రప్రజానీకమునకు నా సేవాలేశముం గావించితిని

బాలవ్యాకరణముకంటెఁ బ్రౌఢవ్యాకరణము కొంతవఱకు దుర్బోధమనుట యుచితమే. కొన్ని సూత్రములందుఁగల యతిదైర్ఘ్యము నన్వయక్లేశమును నిందుఁ గొంతకారణములు కానోపును. వ్యాకరణగ్రంథములు విషయస్వభావమునుబట్టియే విపులవ్యాఖ్యానముల నపేక్షించుచుండును. ఇక్కాలమున విద్యార్థులకు నేటి పరీక్షా పద్ధతిలోఁ బ్రౌఢవ్యాకరణసూత్రములు బాలవ్యాకరణమునందలి యేసూత్రమునకు సవరణలో యేసూత్రమునకు వివరణములో తెలిసికొనుటయు నావశ్యకముగా నున్నది. ప్రౌఢవ్యాకరణమునంగల సూత్రమును వివరించుపట్టున సూత్రమునందలి కఠినపదముల యర్థమును వ్రాసి సోదాహరణముగా సూత్రతాత్పర్యమును వివరించుటయేకాక కొన్ని తావుల నా సూత్రార్థము బాలవ్యాకరణమున, నేసూత్రమునకు సవరణమో లేక వివరణమో వివరించితిని. అంతియకాక యాసూత్ర మావశ్యకమో కాదో చర్చించితిని. సూత్రరచనమునంగల గుణదోషములఁగూడ వివరించితిని.

ఈ సందర్భమున సహృదయుల సన్నిధి నొక్కమనవి గావించుట యావశ్యకము. మానవులకు భ్రమప్రమాదములు సహజములు. కనుకనే "ప్రమాదో ధీమతామపి" యని పెద్దలు నుడివిరి. అట్టిస్థితిలో నాబోటి యల్పజ్ఞునికిఁ బ్రమాదములు సంభవించియుండవచ్చును. "గుణదోషౌ బుధోగృహ్ణన్" అనురీతిని వ్యాఖ్యానమునఁగల గుణములను గ్రహించి దోషములను బరిహరింప బుధులకు నా విన్నపములు.

ఆంధ్రభాషా వ్యాకరణశాస్త్రమునకు మహావిపుల వ్యాఖ్యను రచించి యాంధ్రవ్యాకరణశాస్త్రమునకు నూతనగౌరవమును గలిగించిన బ్రహ్మశ్రీ వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రులవారి గ్రంథములును వారి సాన్నిధ్యమును నాకు గొప్ప యుపకార మొనర్చినవి.

నావ్యాఖ్యానములోని యంశములను టీకలోఁజూపి నాయభిప్రాయములనుమఱల వివరించుట యనావశ్యకము. గ్రంథము పరిశీలించిన నాయభిప్రాయములు తెల్లముకాఁగలవు.

ఇందర్ధానుస్వార శకటరేఫాదుల నంతగాఁ బాటింపలేను. కొన్నిచోట్ల విద్యార్థులకు సుబోధములగుటకై సంధికార్యములను గావింపకయే వాక్యములను బ్రయోగించుటయుఁ గలదు.

ఈ గ్రంథము నచ్చువేయించుటకును బ్రకటించుటకును మిక్కిలి పూనికను వహించి ప్రయాసమును లక్ష్యముసేయక కార్యసాధనమునకు సమస్తభారమును వహించిన మేనల్లుఁడు **S. K. A.** కృష్ణమాచార్యులకును సోదరుడు శ్రీభాష్యం అప్పలాచార్యులకును నాయురారోగ్యైశ్వర్యములనిచ్చి శ్రియఃపతి రక్షింపవలయునని మంగళాశాసనముం గావించుటకంటె వారింగూర్చి నే వచియింపవలసినదెద్దియుఁ గానరాదు.

నా యీ వ్యాఖ్యానమును బహువ్యయప్రయాసములను సహించి ప్రకటించి నాశ్రమను సఫలమొనర్చిన శ్రీవిలాస్ పబ్లికేషన్సువారు బహుగ్రంథములను బ్రకటించి యాంధ్రజనుల మన్ననల నందుదురుగాక యని శ్రీనివాసునిఁ బ్రార్థించుచున్నాను.

ఇట్లు
విద్వజ్జన విధేయుఁడు,
శ్రీ. వేం. న. భాష్యకారాచార్యుడు.

# విజ్ఞప్తి

ప్రౌఢవ్యాకరణమునకు నేటివఱకును సమగ్రవ్యాఖ్య లేనందున నట్టివ్యాఖ్య నొకదానిని రచింపుఁడని కోరినంతనే యంగీకరించి తత్త్వబోధినీ వ్యాఖ్యను రచించి మాకందజేసిన వ్యాఖ్యాతలు శ్రీమాన్ శ్రీభాష్యం వేంకటనరసింహ భాష్యకారాచార్యులవారికి మా కృతజ్ఞతాభివందనములు. ఈ పుస్తకము నచ్చొత్తించుటలో సాయపడిన శ్రీ గొడవర్తి సూర్యనారాయణగారికిని, ననతికాలములో నచ్చొత్తించి యిచ్చిన శ్రీ భారతీ ముద్రాపకులకును కృతజ్ఞులము. తెనుగు మాగాణమున భాషాజిజ్ఞాసువులెల్లరును దీని నాదరించిననాడు దీని సార్థకత.

ప్రకాశకులు.

# సంకేతాక్షర వివరణము

| సంకేతము | గ్రంథము | గ్రంథకర్త |
|---|---|---|
| అచ్చ.రా. | అచ్చతెనుఁగురామాయణము | కూచిమంచి తిమ్మకవి |
| అని. | అనిరుద్ధచరిత్ర | కనుపర్తి అబ్బయ్య |
| ఆము. | ఆముక్తమాల్యద | శ్రీకృష్ణదేవరాయలు |
| ఉ.రా. | ఉత్తరరామాయణము | కంకంటి పాపరాజు |
| ఉ.హరి. | ఉత్తరహరివంశము | నాచన సోమన |
| కవిక. | కవికర్ణరసాయనము | సంకుసాల నృసింహకవి |
| కళా. | కళాపూర్ణోదయము | పింగళి సూరన |
| కాశీ. | కాశీఖండము | శ్రీనాథుఁడు |
| క్షేత్రయ. | క్షేత్రయ పదములు | క్షేత్రయ |
| చంద్ర. | చంద్రభానుచరిత్ర | తరిగొప్పుల మల్లన |
| చంద్రా. | చంద్రాంగదచరిత్ర | పైడిమఱ్ఱి వేంకటపతి. |
| జై. | జైమినిభారతము | పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి |
| నిర్వ. | నిర్వచనోత్తరరామాయణము | తిక్కన |
| నై. | నైషధము | శ్రీనాథుఁడు |
| పర. | పరమయోగి విలాసము | సిద్ధరాజు |
| పాంచా. | పాంచాలీ పరిణయము | కాకమాని మూర్తి |
| పాండు. | పాండురంగమాహాత్మ్యము | తెనాలి రామకృష్ణకవి |
| పారి. | పారిజాతాపహరణము | నంది తిమ్మన |
| ప్రభా. | ప్రభావతీ ప్రద్యుమ్నము | పింగళి సూరన |
| భర్తృ. | భర్తృహరి సుభాషితము | ఏనుఁగు లక్ష్మణకవి |
| భల్లా. | భల్లాణచరిత్ర (అముద్రితము) | మల్లవరపు వాలేశ్వరుఁడు |
| భాగ. | భాగవతము | పోతన |
| భాను. | భానుమతి పరిణయము | రెంటూరి రంగరాజు |
| భార. | భారతము | కవిత్రయము |
| భాస్కర. | భాస్కరశతకము | మారద వెంకయ్య |
| భీమ. | భీమఖండము | శ్రీనాథుఁడు |

| సంకేతము | గ్రంథము | గ్రంథకర్త |
|---|---|---|
| భోజ. | భోజరాజీయము | అనంతామాత్యుఁడు |
| మార్క. | మార్కండేయపురాణము | మారన |
| య. | యయాతి చరిత్ర | పొన్నగంటి తెలగన |
| రా. | భాస్కర రామాయణము | భాస్కరాదులు |
| రా.వి. | రాజవాహనవిజయము | కాకమాని మూర్తి |
| రాఘ. | రాఘవ పాండవీయము | పింగళి సూరన |
| రామా. | రామాభ్యుదయము | అయ్యలరాజు రామభద్రుఁడు |
| రుక్మాం. | రుక్మాంగద చరిత్ర | ప్రౌఢకవి మల్లన |
| లక్ష్మీ. | లక్ష్మీనృసింహావతారము (నృసింహపురాణము) | ఎఱ్ఱాప్రెగ్గడ |
| వసు. | వసుచరిత్రము | రామరాజభూషణుఁడు |
| వి.పు. | విష్ణుపురాణము | వెన్నెలకంటి సూరన |
| విక్ర. | విక్రమార్కచరిత్ర | జక్కన |
| విజ. | విజయవిలాసము | చేమకూర వేంకటకవి |
| విజ్ఞా. | విజ్ఞానేశ్వరీయము | కేతన |
| వీర. | వీరభద్రవిజయము | పోతన |
| వేం.పం.చ. | పంచతంత్రము | వేంకటనాథుఁడు |
| శశాం. | శశాంక విజయము | శేషము వేంకటపతి |
| శివ. | శివయోగసారము | కొలనియాది గణపతిదేవకవి |
| శుక. | శుకసప్తతి | పాలవేకరి కదిరీపతి |
| శేష. | శేషధర్మము (అముద్రితము) | సిద్ధకవి |
| సత్య. | సత్యభామా సాంత్వనము | లింగసమఖి కామేశ్వరకవి |
| సా. | సారంగధర చరిత్ర | చేమకూర వేంకటకవి |
| సుమతి. | సుమతి శతకము | |
| స్వా. | స్వారోచిష మనుసంభవము | అల్లసాని పెద్దన |
| హరి. | హరివంశము | ఎఱ్ఱాప్రెగ్గడ |
| హరిశ్చ. | హరిశ్చంద్రోపాఖ్యానము | శంకరకవి |

# విషయసూచిక

విషయము.


సంజ్ఞాపరిచ్ఛేదము ...

సంధిపరిచ్ఛేదము ...

శబ్దపరిచ్ఛేదము ...

కారకపరిచ్ఛేదము ...

సమాసపరిచ్ఛేదము ...

తద్ధితపరిచ్ఛేదము ...

క్రియాపరిచ్ఛేదము ...

కృదన్తపరిచ్ఛేదము ...

వాక్యపరిచ్ఛేదము ...

ముక్తలక్షణవివేచనము ...

# ప్రౌఢ వ్యాకరణము

## తత్త్వబోధినీ వ్యాఖ్య

శ్రీమద్వేంకటనాథం
శ్రితజనమందార మాశ్రితాఘహరమ్ ।
కమలాలంకృతవక్షస
మస్మత్కులదైవతం సదా సేవే ॥

# ప్రౌఢవ్యాకరణము

## సంజ్ఞాపరిచ్ఛేదము

క. సత్యము శ్రేయము జనులకు ;
సత్యము దక్కొండులేదు సద్ధర్మ ; మదే
యత్యలఘు తపఃఫల మిదు ;
నిత్యతఁ బాటిల్లు దాన నిఖిలార్థంబుల్ .

**సూ: ఆంధ్రభాషకు వర్ణంబు లేఁబదియైదు.** ౧

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అఁ అం అః

క ఖ గ ఘ ఙ చ ౘ ఛ జ ౙ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ ళ.

ౡకార గ్రహణము సంస్కృత ప్రాకృత భాషావ్యాకరణజ్ఞుల సమ్మతము. అయ్యది మంత్రశాస్త్ర ప్రసిద్ధము. యవలలవలె రేఫంబును ప్రయత్నభేదంబుచే ద్వివిధంబుగాన శబ్దశాసనాదులచేత నలఘు రేఫము వర్ణాంతరముగా గ్రహింపబడదయ్యె. క్షకారము సంస్కృత వ్యాకరణములయందును, నిఘంటువులయందును, షాంతపద మధ్యము నందుఁ బఠింపబడుటంజేసి యది వర్ణాంతరము గాదు. సంయుక్తాక్షర ని తెలియవలయును.

శ్రీనివాసాయనమః

# తత్త్వబోధినీ వ్యాఖ్య

వ్యా॥ బాలవ్యాకరణమున మూడవ నాల్గవ సూత్రముల వలన నేర్పడిన యర్థము నేకరూపముగా సుబోధ మొనర్చుటకి సూత్రము చెప్పఁబడెను.

అనఁగా నచ్చఁదెనుఁగునకు వర్ణములు ముప్పదియారనియు ఋకారాదులు సంస్కృతపదములతోఁగూడి యుండుననియు బాలవ్యాకర్త చెప్పియున్నాఁడు. తత్సమమిశ్రమగు నీభాషయందు ఏఁబదియై దక్షరములతో వ్యవహారము సాగునని తాత్పర్యము. అందుఁ దత్సమభాషయందలి పదముల యక్షరములవిషయమునను దేశ్యపదాక్షరములవిషయమునను బాలవ్యాకర్త మతమునే యీతఁ డనుసరించెను.

ఉచ్చారణమునందు స్పష్టముగా భేదము కానవచ్చు నక్షరములకు (చ̆, జ̆, ళ...) వేఱుగాఁ బరిగణనముచేసి యుచ్చారణమునందు భేదము (వాడుకలో) లేని యక్షరములకు (య ర ల వ లకు) చింతామణి బాలవ్యాకరణములందువలె వేఱుగాఁ బరిగణనములేకుండ నిందును వర్ణసమామ్నాయము సూచింపఁబడెను.

**సూ: నిర్దేశవిధానోచ్చారణంబులం దఱచుగ 'అ' వర్ణాదులు కారప్రత్యయాంతములును, రవర్ణ మిఫ ప్రత్యయాంతము నగు. ౨**

**ఉ: అకారమునకు ఉకారము వచ్చును, కకారమునకు గకారము వచ్చును, లకారమునకు రేఫము వచ్చును. మొ॥ అకారము, ఇకారము, ఉకారము, రేఫము, మొ॥ తఱచుగ ననుటచేఁ గేవల వర్ణోచ్చారణమునం దీవిధి నిత్యముకాదని తెలియునది.**

వ్యా॥ ఈ సూత్రమునకు వివరణము స్పష్టము :—

తెనుఁగు వ్యాకరణమున నీ సూత్ర మనావశ్యకము. తెనుఁగున వ్యవహరింపబడు తత్సమ పదములకు మూలభూతములగు సంస్కృత ప్రాతిపదికలను

దెనుఁగు వ్యాకరణము సిద్ధింపఁజేయనక్కరలేదు. అవి సంస్కృతవ్యాకరణసిద్ధ ముల యగును. ''వర్ణాత్కారః రస్యేఫః'' ఇత్యాదులవలన నీ సూత్రార్థము లభించినదేయగును.

బాలవ్యాకర్త యీ విషయమును గ్రహించుటచేతనే యీతని వలె నా పదములను సాధింపలేదు. భాషయందుఁ దఱచుగా వాడబడుచున్న ''అకారము'' మున్నగు పదములను సాధించుట కీతని ప్రయత్నమేల? సంస్కృత వ్యాకరణమువలన సిద్ధించిన సంజ్ఞలను గూడ బాలవ్యాకర్త తిరుగఁ దన వ్యాకరణమున స్మరింపలేదు. పరుషసరళాది సంజ్ఞలు కేవలాంధ్రబాషాసంబంధి సంజ్ఞలగుటచే వానిని మాత్రము విధించెను.

చింతామణియు నూతన సంజ్ఞలనే విధించెను. ఇట్టి స్థితిలో నీ సూత్ర కేవలమనావశ్యకము. ఈ సూత్రమున ''తఱచుగ నవర్ణాదులు''అని పఠింపబడ వలసియుండ ''తఱచుగ అవర్ణాదులు'' అనియే ముద్రిత గ్రంథములయందు అన్నిటను గానవచ్చుచున్నది.

''అకారమునకు, కకారమునకు, లకారమునకు'' అనునవి నిర్దేశమునకు ఉదాహరణములు. ''ఉకారము, గకారము, రేఫము'' అనునవి విధానమున కుదాహరణములు. వాక్యములం దొక విషయమును నిర్దేశించి వేరొక విషయము విధింపబడుచుండును. ఈ వాక్యములం దకారమును నిర్దేశించి యుకారాదులను విధించెను. వాక్యములందుఁగాక వేరుగా నుదాహరింపబడిన ''అకారము, ఇకారము'' మున్నగునవి యుచ్చారణమున కుదాహరణములుగా నీయబడినవి. ఆలోచింపగా ''నిర్దేశమునందు'' అని యొక్కమాటతో విధించినఁ జాలును. అట్లు విధించినచో వర్ణమును నిర్దేశించు ప్రతి స్థలమునను నీ కార్యము వచ్చును సంస్కృతమున నట్లే ''వర్ణాత్కారః'' ఇత్యాదులచే విధింపబడెను

''వర్ణాత్కారః రస్యేఫః'' అను వార్తికముచే నీ రూపములు సిద్ధించుచునే యుండఁగా రేఫ ప్రత్యయముల ననువదించి యవి వైకల్పికములని మాత్రమె చెప్పుట కీ సూత్రము రచింపఁబడిన దనుటకును నవకాశము లేదు. ''అద్గుణః, ఇణః షః'' ఇత్యాదులందు కేవల వర్ణనిర్దేశము సర్వసమ్మతముగాఁ గానవచ్చుచునే యున్నది. ''దీర్ఘస్యాఽ ద్వర్ణనిర్దేశే''అను నాథర్వణము దీనికి మూలము.

సూ: ఒకచో హ్రస్వంబు దీర్ఘంబగు. 3

నిర్దేశ విధానంబులం గారేఫ ప్రత్యయములు రానియెడల హ్రస్వమునకు దీర్ఘము వచ్చునని యర్థము.

ఉ: "అ" కు "ఊ" వచ్చును, "కా" కు "గా" వచ్చును, "లా" కు "రా" వచ్చును.

వ్యా॥ నిర్దేశమునందును విధానమునందును దఱచుగా వచ్చెడి కారేఫ ప్రత్యయములు రానియప్పుడు హ్రస్వమునకు దీర్ఘముకూడ నొక్కొకచో వచ్చునని యర్థము.

"అ" కు "ఊ" వచ్చును. ఇత్యాదులు ఉదాహరణములు. అనగా అకారమునకుఊకారము వచ్చునని తాత్పర్యము.

ఈ యుదాహరణ వాక్యములందు "అకు, కాకు, లాకు" అనునవి నిర్దేశమునకును, "ఊ, గా, రా," అనునవి విధానమునకును నుదాహరణములు. మీాదిసూత్రమునఁ జెప్పఁబడిన "నిర్దేశవిధానోచ్చారణములందు" అను పదమంతయు నిక్కడ కనువర్తింపదనియు, నిర్దేశవిధానములందు మాత్రమే యీ దీర్ఘము విధింపబడుచున్నదనియు గ్రంథకర్తయే వివరించెను. ఒక వాక్యమున కారేఫ ప్రత్యయాంతములు ప్రయోగింపబడినచో నయ్యది నిర్దేశముగాని, విధానమునుగాని యగుచుండుననియు, ప్రత్యేకము పదాంతరముతో సంబంధింపక "అకారము" ఇత్యాదిగా నొక్కపదము మాత్రము ఉచ్చరింపబడినచో నచ్చట నుద్దేశ్య విధేయ భావములు ఏవియు భాసింపవు కాన నయ్యది కేవలముగా నుచ్చారణమనియు నాశయము. అట్టి యుచ్చారణమందు మాత్రము కేవల దీర్ఘముండదనియు నిర్దేశ విధానములందు మాత్రమే ధీర్ఘనిర్దేశ ముండుననియు నభిప్రాయము.

ఉ: "జాకువడిచెల్లు రత్నకంకణమనంగ"

ఈసూత్ర మావశ్యకమే. సంస్కృతమున నిట్టి పద్ధతి లేకుండుటచే నీ విధాన మావశ్యకమయ్యెను. ఈ దీర్ఘవిధాన ముచ్చారణార్థము గృహీతమగు స్వరమునకైనను రావచ్చును. కనుకనే "క"కు "గా" వచ్చును అని

యుదాహరించెను. ఇచ్చట ''క, గ,'' ల మీద స్వరములు ఉచ్చారణార్థములే కదా.

క్ అను వర్ణమునకు గ్, అను వర్ణము వచ్చునని యే తాత్పర్యము.

సూ: దీర్ఘంబు దీర్ఘంబు. ౪

నిర్దేశవిధాన విషయములయిన వర్ణములు దీర్ఘములయ్యేనేని యవి యట్లే యుండునని యర్థము.

ఉ: ''ఐ'' కి ''ఔ'' వచ్చును. మొ॥

వ్యా॥ నిర్దేశవిధానములందు హ్రస్వము దీర్ఘ మయినట్లు సహజదీర్ఘము వేరొకవిధముగా మారదనియు దీర్ఘముగనే యుండుననియు విధించెను.

ఈసూత్ర మనావశ్యకము ఏ కార్యమయినను విధింపబడనిచో ప్రాప్తింపదు. ప్రాప్తింపనిచో నిషేధింపనక్కరలేదు. నిషేధము ప్రాప్తిపూర్వకమని నియమముగలదు. ౩ సూ చే హ్రస్వమునకు దీర్ఘము విధింపబడెను దీర్ఘమునకు వేరొకవిధమగు మార్పు దేనిచేతను విధింపఁబడలేదు. అట్టితరి దీర్ఘము దీర్ఘముగానే యుండును. అందుకు విధాన మావశ్యకముకాదు. అయినను భ్రాంతి కలుగకుండుటకు మాత్రమే యీ సూత్రము రచింపఁబడెనని గ్రహింపవలెను.

ఈ మూడుసూత్రములకును బాలవ్యాకరణమున నాధారము లేదు. ౨, ౪ సూత్రము లనావశ్యకములని చెప్పితిమిగదా! (౩ వ సూత్రము విషయముగూడ బాలవ్యాకర్తకు సమ్మతముగాదు అతడు తన వ్యాకరణమున నెచ్చటను హ్రస్వమును దీర్ఘముగా గ్రహింపలేదు.) ఇట్టి దీర్ఘాక్షర నిర్దేశములు కొందరు ఛాందసులు చేసినను సామాన్యముగా వాఙ్మయమునం దిట్టి ప్రయోగము లరుదుగా నుండును. అట్టి ప్రయోగములందును దీర్ఘముతో నిర్దేశించినచో నది హ్రస్వమా, దీర్ఘమా యని సందేహము కలుగుచుండును. అట్టి సందేహస్థానములగు ప్రయోగములు బాలవ్యాకర్తకు సమ్మతములు గాకయే ~~యాతడీ విషయములు స్పృశింపలేదు.~~

సూ: ఒకానొకచో జకారం బుభయంబు నగు. ౫

శ్లేషయందు జకారమొక్కటియె యొకయర్థమున దంత్యమును వేఱొక యర్థమునఁ దాలవ్యము నయ్యెడుననని యర్థము.

ఉ: అకట ! పాండురాజయశ మెన్నవైతి! రాఘు, ౧.ఆ, ౩౧. (ఇట జకారము భారతార్థమునందు దంత్యము, రామాయణార్థము నందుఁ దాలవ్యము నగునని యెఱుంగవలయును).

వ్యా॥ ఒకానొకచోననగా శ్లేషయం దని తాత్పర్యము. ఎట్టి జకారమును శ్లేషస్థలములందుఁ బ్రయోగించినను రెండు విధములుగను దానిని గ్రహింపవచ్చునని భావము. "అకట పాండురాజయశము" అనుచోట రామాయణార్థమున పాండుర + అజయశము అని ఛేదము అపుడు అజశబ్దము సంస్కృతము కావున నందలి జకారము తాలవ్య మగును. భారతార్థమున "పాండురాజ! యశము" అని ఛేదము. పాండురాజ! అనునది సంబోధనమునఁ దత్సమరూపము. ఇయ్యది దంత్యమని యభిప్రాయము

బాలవ్యాకర్త "రాజు శబ్దమును" దంత్యయుక్తముగఁ జెప్పెను. కాని తత్సమపదము దంత్యయుక్తమయినచో శ్లేషకావ్యములందు సంస్కృతాంధ్ర భాషాశ్లేషాదులందు ఒక యర్థమున సంస్కృత పదముగా భావింపవలసివచ్చినపుడు తాలవ్యము కావలసియుండును కదా! అట్టిచోట దంత్యమనినచో నొకయర్థమును తాలవ్యమనినచో వేరొకయర్థమును సిద్ధింపవు. కావున నెట్లు తలంపవలయునను ప్రశ్నమున నట్టి జకార ముభయవిధముగను గ్రహింప వచ్చునని యిందుఁ జెప్పఁబడెను. ఈ విషయము బాలవ్యాకరణమునఁ జెప్పఁ బడలేదు.

[దంత్యతాలవ్యంబులయిన చ, జ లకు సావర్ణ్యమును బాలవ్యాకర్త విధించెను. ఇయ్యది వ్యాకరణమునందు మాత్రమే యని భావించినచో నీ సూత్ర మావశ్యకమే. అట్లుకాక యీ సావర్ణ్యము వాఙ్మయమునందంతటను

గ్రాహ్యామే యని భావించినచో నీ విధాన మనావశ్యక మగును. ఆ పక్షమున సావర్ణ్యమనగా నీ క్రింది విధముగా వ్యాఖ్యానము చేయవలయును.

సమానోవర్ణః సవర్ణః, తస్యభావః సావర్ణ్యమ్, అనగా అన్యోన్య తుల్యత్వము అని భావము. అనగా దంత్య చ జ లు తాలవ్య చ జ తుల్యములు. తాలవ్య చ జ లు దంత్య చ జ తుల్యములు. అనగా తాలవ్యజకారము దంత్య జకారార్థమును దంత్యజకారము తాలవ్య జకారార్థమును నిచ్చునని భావము. కాని యిట్టి క్లిష్టకల్పనముకంటె నీ సూత్రనిర్మాణము ఉచితమని గ్రంథకర్త యాశయముగాఁ దలంపవలయును].

ఒక్క జకారమేగాక చకారముగూడ శ్లేషాదులం దిట్లుభయమును అగుట విధింపవలసియున్నది అట్లు విధింపకపోవుట లోపమే యనఁదగును. చకారముగూడ శ్లేషకావ్యములం దిట్లుభయవిధముగా గానవచ్చుట కవకాశముగలదు "వలము" మున్నగు చోట్ల చకారము దంత్యమయినచో నొక యర్థమును తాలవ్యమయినచో వేరొక యర్థమును నిచ్చుచున్నదిగదా !

"అకట పాండురాజయశ మెన్నవైతి" అను నుదాహరణము సరియయినదికాదు. ఇచట భారతపక్షముననను దాలవ్యముగనే యుచ్చరించుట లోకసిద్ధము. సంబోధనమున "రాజా !" అని తాలవ్యముగనే యుచ్చరింతురు.

బాలవ్యాకర్త రాజు శబ్దమున జకారమునకు దంత్యతను విధించుటయు "ను"కారయుక్తమగునపుడే యని గ్రహింపవలయును.

రాజు, రాజులు, రాజుచేత మున్నగుచోట్ల "ఉ"కార యుక్తమగునపు డీ దంత్యత వినవచ్చుచున్నది. సంబోధనమున "ఉ"కారము వినఁబడలేదు. కావున దత్యంతయు రాదని గ్రహింపనగును. కనుకనే "రాజుశబ్దము" అని యుకారయుక్తముగనే గ్రహించి దంత్యతను విధించెను. "చంద్రా రాజవా నీవు" ఇత్యాదులందు రాజు శబ్దము ఉకారాంత విశేషణముగా పరినిష్పన్నమగు సుబంతమే యగుటచే దంత్యయుక్తముగా వినవచ్చుట విరుద్ధముకాదు.

**సూ: రాజు వైకృతంబని కొందఱందురు** ౬

(అపుడు తత్సమంబునందలి చ జ లు దంత్యములు కావని యూహించునది.)

ఉ॥ తే॥ రాజుచూడంగఁ జెప్పంగరాని కడిమి, నీఁటి
యలఁగ్రుమ్మ నొంచిరి మేటిమగల, య, ౨ ఆ. ౧౭ మొ.

వ్యా॥ "రాజు" అను శబ్దము తద్భవమని కొందరు చెప్పుదురని తాత్పర్యము. అచ్చఁదెనుగు కావ్యమగు యయాతి చరిత్రమున రాజు శబ్దము ప్రయోగింపఁ బడుటచేఁ దత్సమము కాదనియుఁ, దద్భవమే యనియు భావము. తత్సమ శబ్దమునందలి జకార మెల్లయెడలఁ దాలవ్యము కాఁజాలదు. రాజన్ శబ్ద సమమగు రాజు శబ్దమునందు జకారము దంత్యముగనే పలుకఁబడు చున్నది ఎవ్వరును దాలవ్యముగా "రాజు" అని పలుకరు. తత్సమ రూపము లందును "రాజా" మున్నగు సంబోధనాంతములందు మాత్రమే తాలవ్యోచ్చా రణము ప్రసిద్ధము. ఇతర విభక్తి రూపములన్నింటను "ఉ"కార విశిష్టమగుచు దంత్యముగనే పలుకబడుచుండును కనుకనే బాలవ్యాకర్త "రాజు శబ్దం బొక్కటి దంత్య యుక్తంబు గానంబడియెడి"నని చెప్పియున్నాడు. తద్భవము లని చెప్పుటకు వీలుకాని ఖగరాజు, పక్షిరాజు, మున్నగు పదములందు దంత్యత సుప్రసిద్ధము గదా !

రాజు అని తత్సమ శబ్ద మొకటియు, తద్భవ శబ్ద మొకటియుఁ గల దనియు యయాతి చరిత్రాదులందు తద్భవము ప్రయోగింపబడె ననియు గ్రహింపఁదగును.

తద్భవమగు రాజు శబ్ద మంతటను దంత్య యుక్తమే. తత్సమ మగు రాజు శబ్దము మాత్ర మొకచోఁ దాలవ్యయుక్తమును, మిగిలిన విభక్తులందు దంత్యయుక్తమును నగుచుండును. ఇట్టితరి తత్సమములందు చ జ లు దంత్య ములు కావనుట యుక్తముకాదు.

సూ॥ నకారంబసాధారణంబు ద్రుతంబు ౭

ప్రత్యయాగమావ్యయాత్మకమై యుత్వ విశిష్టమయిన నకా రంబు ద్రుత సంజ్ఞకం బని యర్థము. ద్రుతమనగా నొల్లనియెడ మఱఁగిపోవునది యనుట.

ఉ. ప్రత్యయాత్మకమైన నకారమునకు—తాను, నేను, ధనమును, వనమును, చదువుచున్నాను, చదువగలను, మొ॥ ఆగమా

త్మకమయిన నకారమునకు నన్నును, నాచేతను, చదువుచును, చదువుడును మొ॥ అవ్యయాత్మకమయిన నకారమునకు—అన్నయును, తమ్ముండును, మఱియును, ఏనియును మొ॥ వలయుచో నీ ద్రుతంబు నందలి యుత్వంబునకు లోపంబగు. ఉన్నాను ఇత్యాదులందు ద్రుతంబునందలి యుకారంబునకు లోపంబు గలుగదు.

శబ్దశాసనుడు "ద్రుతాఖ్యోనః" అని కేవల నకార గ్రహణము చేయుట ద్రుతమునకు స్థిరత్వసిద్ధికై యని తెలియవలయును.

వ్యా॥ అసాధారణమగు నకారము ద్రుత మనంబడును అసాధారణ మనగా ప్రత్యయాత్మకము కాని, ఆగమాత్మకము కాని, అవ్యయాత్మకము కాని అయి ఉకార విశిష్టమయినట్టిది యని తాత్పర్యము. ద్రుత మనగా ద్రవించు నది. అనగా పోవునది అని యర్థము. కాపున నక్కఱ లేనియెడల లోపించునది యని యీ సంజ్ఞ సార్థక మగుచున్నది.

తాను, నేను,—ప్రథమావిభక్తి ప్రత్యయ నకారము ధనమును, వనమును—ద్వి. వి ప్రత్యయ నకారము. చదువుచున్నాను, చదువగలను—తిఙ్ ప్రత్యయ నకారము.

నన్నును—ఆగమ నకారమని యాశయము. బాలవ్యాకర్త "నా"శబ్ద రూప ప్రక్రియ నుదాహరింపలేదు. నన్నును అని నిపతించుటచే నం దాగమ మేదియో, ప్రత్యయ మేదియో తెలియ శక్యముగాదు.

నాచేతను—ఇందు "తృతీయాదులకు నుగాగమంబగున"ను సూత్ర ముచే జివరి నువర్ణ మాగమ మని తెలియదగును చదువుచును.

అన్నయును మున్నగు వానిలో నువర్ణము సముచ్చయార్థావ్యయము.

కావలసినచో ద్రుతంబు నందలి యుకారము లోపించి నకారము మాత్రమె మిగిలియుండుటయుఁ గలదు. కాని ఉన్నాను — మున్నగుచోట్ల నుత్వలోపము రాదు.

ప్రౌఢవ్యాకర్త ద్రుత స్వరూప నిర్ణయమున నితర వ్యాకర్తల సమ్మతిని చూపుచున్నాడు. బాలవ్యాకర్త యిట్టి యసాధారణ్యమును జెప్పకపోయినను

నాతని యభిప్రాయము మాత్ర మందుకు విరుద్ధముగాదని యీతని యభిప్రాయము. నుగాగమము, నుజీ, మున్నగువానిని విధించుటలో "ఉ"త్వముతోఁ గూడి యుచ్చరించుట కదియేగదా తాత్పర్యము. ద్రుతస్వరంబునకు లోపము విధించు సందర్భము గూడ ద్రుత ముత్వవిశిష్టమనియే తోపించు చున్నది. కాని ''ద్రుతాఖ్యోనః'' అను చింతామణి సూత్రము కేవలనకారమే ద్రుతమని సూచించుచున్నట్లు భాసించుటచే దాని తాత్పర్యమును వివరించు చున్నాడు. కేవల నకారమును గ్రహించి ద్రుతత్వమును విధించుట నకారము గూడ స్థిరములలోనిదే యని తెలియచేయుటకే గాని వేరుకాదని భావము. అనగా ''ద్రుతాఖ్యోనుః'' అనియే సూత్రించినచో పరుష సరళ భిన్నమగు హల్వర్ణము కాకపోవుటచే ద్రుతమునకు స్థిరములలో గణనము లేకపోవునని కేవల నకారమును గ్రహించెనని సీతారామాచార్యులవారి యాశయము.

బాగుగా విమర్శించినచో నీ యభిప్రాయము సరికాదు.

''కచటతపాః'' ఇత్యాది సూత్రద్వయముచేఁ బరుషసంజ్ఞయు, సరళ సంజ్ఞయును జెప్పి తదితరములగు హల్లులన్నియు స్థిరసంజ్ఞలు గలవగునని ''స్థిరా ఇతరే'' అను సూత్రముతోఁ జింతామణి చెప్పియున్నది. హల్లులతో నచ్చులు కూడియున్నను, లేకున్నను నీ సంజ్ఞలు వచ్చుచునే యుండును. ''పూచెం గుముదము'' ఇత్యాదుల నుత్వవిశిష్టమగు కకారమునకుఁ బరుష సంజ్ఞ లేకపోయెనా! అట్లే "ను" అనుదానిలో నున్న నకారము గూడ స్థిర సంజ్ఞ నెట్లయినను బొందుచుండును. ఇందుకు ''ద్రుతాఖ్యోనః'' అను సూత్ర నిర్దేశముతో నెట్టి సంబంధమును లేదు. ''స్థిరా ఇతరే'' అను సూత్రమునఁ జెప్పబడిన యితరశబ్దమునకు ''కచటతపా ఇత్యాది సూత్రద్వయమున సంజ్ఞితములగు పరుష సరళములకుఁ దప్ప మిగిలిన హల్లులకు'' అని యర్థము వచ్చును. అంతకు వెనుకనున్న ''ద్రుతాఖ్యోనః'' అను సూత్రము నేమియు స్పృశింపనక్కరలేదు. ఈ సూత్ర మెట్లు నిర్దేశింపఁబడినను నకారమునకు ద్రుతత్వము సిద్ధించును. దాని యవయవమగు 'ఉ'కార మచ్చనియుఁ బ్రాణ మనియు సంజ్ఞల నొందుచునే యుండును. కాన సీతారామాచార్యులగారి యీ సమర్థనము యుక్తియుక్తముగాఁ గానరాదు

సూ: అకప్రత్యయాంతావ్యయంబు కళయ. ౮

వ్యతిరేకార్థక భూతకాలికాసమాపక క్రియ ద్రుతప్రకృతికము కాదని యర్థము.

ఉ, ఉ, కాదనకిట్టిపాటి యపకారముఁ దక్షకుఁ డేకవిప్రసం, బోధనఁజేసి చేసె; భార. ఆది. ౧ఆ ౧౨౮. హర్ష మదమాన విషాద ములం దొరంగనీక తొలఁగఁద్రోవు, భార. శాంతి. ౨ ఆ ౨౫౩. ప్రాణవ్యపాయంబులేకతగన్; హరి ఉ ౩ఆ ౨౦౩ మొ. (ప్రయోగము లిట్లుండ, 'క, అనఘ యిది యేటి తపమే, మనుపమ దుఃఖితుల మగుట నాధారము లేకను సంతానోచ్ఛేదం, బున ప్రేలెద మధమ లోకముల తెరువు సనన్, భార. ఆది. ౨ఆ. ౧౩౯. ఇందు "లేకను" అని ద్రుతాంతముగా నుండుటవలనం గొంద ఱయ్యది ద్రుతప్రకృతిక మని భ్రమించెదరు.) (చూ. శబ్దపరిచ్ఛేదము ౧౧౬వ సూత్రము).

వ్యా॥ అక ప్రత్యయాంతావ్యయము లనగా "అనక, చదువక, మున్నగు నవి, ఇయ్యవి భూతకాలికములు, నసమాపకములు, వ్యతిరేకార్థకములును, నగు క్రియాపదములు. అనగా బాలవ్యాకరణమున "వ్యతిరేకక్త్వార్థంబునందు కజియగు" అను సూత్రముచే విధింపబడిన కజ్యంతములని తెలియనగును. ఇట్టి యవ్యయము కళయే కాని ద్రుతాంతము కాదని యర్థము.

అనక + ఇట్టిపాటి—ఇది ద్రుతాంతమగునేని యనక నిట్టిపాటి యని యుండును. దొరంగనీక అనుచో కప్రత్యయాంత పదము ద్రుతాంతమగునేని "తొలంగ"ననునది "దొలంగ"నని సరళాదిగా నుండును ఇట్లే లేక అనునది ద్రుతాంతమయ్యేనేని "తగన్" అనునది సరళాదేశముతోఁ జూపట్టును.

బాలవ్యాకరణమున "ద్రుతప్రకృతికములు గాని శబ్దములు కళ లనం బడును" అని సూత్రించి కొట్టక, తిట్టక మున్నగు వానిని గళలుగనే యుదాహ రించెను. అయినను "అనఘ యిది యేటి తపము... ...అను పద్యమున లేక అనునది "ను" అను వర్ణముతోఁ జూపట్టుటచే నిట్టి యవ్యయములు ద్రుతాం

తములని కొందరు భ్రమపడుచుందురు. అట్టి భ్రాంతినిఁ బోగొట్టుటకై యీ సూత్రము రచింపఁబడెను.

ఇందు ''లేక'' అను కళ యగు నవ్యయమునకు శబ్దపరిచ్ఛేదమున ౧౧౬ సూ. చే ''ను'' శబ్దంబుచేరి లేకను అని అయినది. అంతియగాని లేక అనునది సహజముగా కళా శబ్దమే. ''లేకను'' అనునది రెండు శబ్దముల సమ్మేళనము అని భావము. కావున నక ప్రత్యయాంతావ్యయము లన్నియును గళలే యనుట కాటంకము లేదని బాలవ్యాకరణమునే సమర్థించెను. ఈ సూత్రము బాలవ్యాకరణమునకు వివరణమువంటిది.

ఈ సూత్రమున ''అకప్రత్యయాంతము'' అనుట సరిగాదు. అకప్రత్యయము నెవ్వరును విధింపలేదు బాలవ్యాకర్తయు ''కజి'' అనుదానినే విధించెను. అది పరమగునపుడు వచ్చెడి అత్వమును అంతటను వచ్చునది కాదు. పూర్వమ్మున నుకారముండినచో నయ్యది "అ'కారముగా మారును. ఇంక నే వర్ణమున్నను "అ"కారముగా మారదు. దొరంగనీక, లేక, మున్నగు సుద్ధాహృతస్థలముల ''అక'' అను నాకారముతోఁ బ్రత్యయము కానరాదు. అందువలన నిట్టివి కూడ నిస్సంశయముగా సంగ్రహింపబడునట్లు కజి ప్రత్యయాంతమనియే నిర్దేశించుట యుచితము.

సూ: తద్భవమ్ములందును నలఘు రేఫము గలదు. ★ ౯

ఉ॥ కఱకంఠుఁడు, కాఱియ, గఱి, గొఱపము, గొఱ్ఱె, గోఱజము, జీలకఱ్ఱ, పిఱికి, పెఱ, మోఱకు, ఱాఁగ, మొ॥

కఱకంఠుఁడు — గరకంఠ శబ్ద భవము
కాఱియ — కారికా శబ్ద భవము.
గఱి — గరుచ్ఛబ్ద భవము.
గొఱపము — కురప శబ్ద భవము.
గొఱ్ఱె — కురరీ శబ్ద భవము.
గోఱజము — గోరోచనా శబ్ద భవము.
జీలకఱ్ఱ — జీరక శబ్ద భవము.

పిఱికి — భీరుక శబ్దము.
పెఱ — పర శబ్ద భవము.
మోఱకు — మూర్ఖ శబ్ద భవము.

ఱాఁగ — లంకా శబ్ద భవము. మొ॥
(చూ. ప్రయోగములు — ఆంధ్ర శబ్ద రత్నాకరము).

వ్యా॥ బాలవ్యాకరణమున సంజ్ఞ ౧౩ సూ. వివరణమున "శకటరేఫము తత్సమ తద్భవములందు లేదు" అని వ్రాయబడెను. కాని తద్భవములలో నయ్యది కానవచ్చుటచే నీ సూత్రమును వ్రాయవలసి వచ్చెను.

తద్భవంబులందును = వైకృత పదమ్ములనఁబడు తద్భవ పదములందుఁ గూడ, అలఘు రేఫము = శకట రేఫము, కలదు = కానవచ్చుచున్నది. కఱకంఠుడు మున్నగు పదములు తద్భవములు. వీనియందు శకట రేఫము కానవచ్చుచుండుటచే నుదాహరింపబడినవి.

"కఱకంఠుడు" మున్నగుపదములకుఁ బ్రకృతులు చూపబడినవి. కఱకంఠ శబ్దమున 'కఱ' అను భాగము సంస్కృతముకాదు. అయ్యది తెలుఁగు పదము. అద్దానికి సంస్కృతపదమగు కంఠశబ్దముతో సమాసము అగుట సరిపడదు. కర్మధారయ సమాస మయినచోఁ బూర్వపదను త్రీసమ ముగా నున్నది కావున దోషము లేకపోవును. కాని "విషము కంఠమునఁ గలవాడు" అను నర్థమునిచ్చు బహువ్రీహి సమాసమని చెప్పవలసియున్నది. తెలుగు పదములతో సంస్కృత పదమునకు బహువ్రీహి వైయాకరణ సమ్మతము కాకుండుటచే బాలవ్యాకర్త దీనిని గ్రామ్య పదములలోఁ జేర్చి మహాకవులు ప్రయోగించుటచే ననింద్య గ్రామ్యమని తలంచెను.

దీని నహోబలాదులు బాలవ్యాకర్తవలె బహువ్రీహియనియే భావించిరి. కాని యందుఁ బూర్వపదము వైకృతమగుటచే మిశ్రము మని తలంచిరి. బహువ్రీహి మిశ్రముగా నుండుట వ్యాకరణ విరుద్ధము. కావున వారును దీని ననింద్య గ్రామ్యమను నాశయముతోడనే గ్రాహ్య పదములలో నొకదానిఁగా

భావించిరి. మిశ్ర బహువ్రీహి యని వారు వ్రాసినను గ్రామ్యముకాదని వారి యభిప్రాయము కాఁజాలదు గ్రామ్యమే యనియు నయినను అనింద్యమనియు వారి యాశయముగాఁ దెలియనగును. కావున సమా. ౨౭లో ప్రౌఢవ్యాకర్త "మిశ్ర బహువ్రీహి యగుట దుర్ఘట" మని వ్రాయుట చింత్యము.

ప్రౌఢవ్యాకర్త అట్టి క్లిష్ట కల్పన లనావశ్యకములని తలంచి యియ్యది తద్భవమే యని విశదీకరించెను. ఇందలి కంఠ శబ్దమునకు మాత్రము వికారము కలుగలేదని తలంపనగును. అంచయాన, చౌదంతి, మున్నగు సమాసములకుఁ గొన్ని భాగములందు వికారము లేకుండుటయుఁ గలదుగదా! ఇందును అట్లే గరశబ్దము వికృతినిజెంది కంఠశబ్దము వికారమును జెందకపోవుట దోషము కాఁజాలదు అట్టి పద్ధతి తద్భవములందు తఱచుగాఁ గానవచ్చు చున్నదే. ఇంక నిందలి ఠ వర్ణ మనాంధ్ర వర్ణ మగుటచేఁ దద్భవములందట్టి వర్ణ ముండుట యుచితము కాదు గనుక దీని ననింద్య గ్రామ్యముగ సీతారా మాచార్యులవారు తలంచినట్లు శబ్ద రత్నాకరమువలన విశదమగుచున్నది

మిశ్ర బహువ్రీహి యనువారి మతమునను "కఱ"శబ్దము గరశబ్ద భవ మనుట కాటంకము లేదు. కాన నీ సూత్రమున కుదాహరణ మగుటలో విప్రతిపత్తి యనావశ్యకము.

సూ. కారము క్షార శబ్ద భవము. ☆ ౧౦

ఇందు సారూప్యము గనఁబడెడి, క్షార శబ్దము కటు శబ్ద పర్యాయంబునగు "త్రిరాత్ర ముభయో రధశ్శయ్యా, బ్రహ్మచర్యమ్, క్షార లవణ వర్జనఞ్చ" అని యాపస్తంబసూత్రవాక్యము.

వ్యా॥ కారము అను పదము ప్రాకృత సమమని బాలవ్యాకర్త బా॥ వ్యా॥ సంజ్ఞ ౧౯ సూత్రమున వ్రాసెను. కాని వర్ణసామ్యమునుబట్టియే తద్భవశబ్దములకు మూలశబ్దములను నిశ్చయింపవలసియున్నది గాన నీ పదమున వర్ణములలో గల పోలికనుబట్టి క్షార శబ్దభవమనుటయే యుచితము. కటు శబ్దపు పోలిక కంటె క్షారశబ్దపు పోలిక యీ పదమున నధికమని ప్రౌఢ వ్యాకర్త యాశయము.

"కటు శబ్దమునకును, 'కారము'అను శబ్దమునకును నర్థము సమానము. క్షారశబ్దము లవణరస వాచకముగా 'క్షారోదకము' ఇత్యాది వ్యవహారమునఁ గానవచ్చుచున్నది. అట్టి లవణరస వాచకపదమునకు వర్ణసామ్యమున్నంత మాత్రమున భిన్నార్థకమగు క్షారశబ్దము మూలమనుట తగదు." అను శంకకు సమాధానముగా క్షారశబ్దమునకుఁ గటు శబ్దార్థముగూడఁ గలదనియు నందు కాపస్తంబ సూత్రము ప్రమాణమనియు 'త్రిరాత్ర' మిత్యాదివాక్యము నుదాహరించుచున్నాడు.

ఆపస్తంబ సూత్రమున వివాహమునఁ జేయఁదగు త్రిరాత్రదీక్షయందు కారము, ఉప్పు విడువవలసినదిగా విధింపఁబడుచున్నదని తెలిసికొనవలయును. క్షారశబ్దమున కిచ్చట "ఉప్పు"అను నర్థము చెప్పినచో లవణపదప్రయోగము సరిపడకపోవును. పర్యాయపదములకు సహప్రయోగ మయుక్తము. కాన నిచ్చట క్షారశబ్దము కటుశబ్దార్థకమనియే తెలియఁదగునని భావము.

తెనుఁగునఁ దద్భవములను నిర్ణయించుటలో నొకవిషయము గమనింప వలయును. మూల ప్రాతిపదికములందలి వర్ణముల కెట్టివికారమునులేక తెనుగున ప్రయోగముగలదేని తత్సమములనియు, వర్ణవికారముగలిగి చూపట్టినచో నవి తద్భవములనియు గ్రహింపవలయును. సంస్కృతపదములతో వర్ణైక్యము లేని పదములయినను ప్రాకృతపదములతో వర్ణైక్యముండినచో వానిని సంస్కృతభవము లనక ప్రాకృతసమములనియే గ్రహింపనగును. సంస్కృత ప్రాకృత పదములలో వేనితోడను వర్ణైక్యములేక కొంత సారూప్యము మాత్రము గలదేని తద్భవములని నిర్దేశించుచున్నారు. ఇట్టి యభిప్రాయముతోడనే బాలవ్యాకర్త అగ్గి, రాణి, సిరి మున్నగు పదములను ప్రాకృతసమములని చెప్పెనే గాని తద్భవములని వ్రాయలేదు. ప్రాకృతశబ్దములు గూడ సమాన వర్ణములతో కానరానిచో నట్టివానిని మాత్రమే (ఆకసము, చందురుడు, తామర) తద్భవములుగా నాతడు పేర్కొనెను. తద్భవపదములలో గూడ వర్ణసామ్యము సంస్కృత ప్రాకృతశబ్దములలో దేనితో నధికముగానుండునో యా శబ్దములకే యవి వికృతులని నిర్దేశించెను. కనుకనే లచ్చిశబ్దమును లక్ష్మీశబ్దభవమనక "లచ్ఛి"యను ప్రాకృతశబ్దమునకు వికృతి యని నిర్దేశించెను.

తత్సమతద్భవశబ్దములను నిర్ణయించుటకు సంస్కృతశబ్దస్వరూపమువలె ప్రాకృతశబ్దస్వరూపముగూడ తెలిసికొనవలయును. ప్రాకృతశబ్దములను తెలిసి కొనుటయందలి యలసతచే నేఁడు ప్రాకృతసమములనుగూడ సంస్కృతభవ ములనుగాఁ జాలమంది తలంచుచున్నారు. ప్రాకృతసమములకును, సంస్కృత భవములకును భేదము పైరీతిని గ్రహింపదగును

ఇట్టి బాలవ్యాకర్తయాశయము ననుసరింపక "కారము" అనుదానిని ప్రాకృతసమముగా బాలవ్యాకర్త వ్రాసియుండఁగాఁ బ్రౌఢవ్యాకర్త తద్భవ మని వ్రాయుట విమర్శనీయము. ప్రాకృతమునందలి "కారో" అను పదము క్షారశబ్దభవమై యుండునని వ్రాయవలసి, కారము అను శబ్దము కారో అను ప్రాకృతశబ్దమునకు తత్సమము నగుటలో విప్రతిపత్తి యుండరాదు ప్రాకృతసమ మగుచున్న యీ శబ్దమును తద్భవమనుటయు నుచితముగాదు

**సూ. కోటపేఁటలు వైకృతికములు ★ ౧౧**

**ఉ. కోట్టశబ్దభవము కోట, పింఠాశబ్దభవము పేఁట, "కోట్టార ఘట్టహట్టాశ్చ" అని అమర త్రిలిఙ్గశేషము "పింఠావిటజనాశ్రయః" అని అమరపదపారిజాతము. కోట్టశబ్ద పర్యాయంబుగా సంస్కృతం బునఁ గోటశబ్దంబు నొక్కంఢుగానంబడియెడి. దానివలనఁ గలిగిన ధందు లేని యపు డది కుండ లోనగునానివంటిదని యెఱుంగవలయును. పేఁటశబ్దార్థము ప్రకృతియగు పింఠాశబ్దార్థముకంటె నించుకభిన్న ముగా నున్నది. అది వికృతియందు సహజంబ. (చూ. వైకృతదీపిక).**

వ్యా॥ బాలవ్యాకర్త "కోట, పేఁట" అను శబ్దములు దేశ్యములని బాల వ్యా॥ సం॥ ౨ ౧౧ సూ॥ వ్రాసెను. కాని కోట్ట, పింఠా శబ్దములనుండి యివి యుత్పన్నము లయ్యెనని చెప్పుట యుచితముగానఁ తద్భవములేకాని దేశ్య ములు గాఁజాలవు.

"కోట్టారఘట్టహట్టాశ్చ" "పింఠా విటజనాశ్రయః" అను నిఘంటువుల వలన నీయవి సంస్కృతములగుట తెలియనగును కోట్ట, కోట శబ్దముల కర్థమును దుల్యమే. పింఠా, పేఁట శబ్దములకుమాత్రము నించుక యర్థభేదము

కానవచ్చుచున్నది పింరా, పేట శబ్దములకు ''నగరైకదేశములగు జనుల నివాసస్థలములు''అను నర్థముమాత్రము తుల్యమే, పింరా శబ్దమునకుమాత్రము ఆ జనులు ''విటులు'' అను విశేషాంశముకూడ నర్థముగాఁ గాన్పించుచున్నది. ఇట్టి యల్పమగు నర్థభేదము ప్రకృతివికృతులలో నుండుట సహజమేయగుటచే దోషము కాదని తాత్పర్యము.

కోట్ట, కోట శబ్దములు రెండును సంస్కృతమునఁ గలవు. కావునఁ దెనుఁగునఁ గల కోట శబ్దము కోట్ట శబ్దభవ మనుటకంటె కోట శబ్దసమ మనుట యుచితము. అప్పుడు వృక్షాదిశబ్దముల తత్సమరూపములవలె ముపర్ణ కముచేరి ''కోటము''అని కావలసివచ్చునని శంకింపనక్కరలేదు. ''చరిత్రాదుల ముపర్ణకంబునకు లోపంబు బహుళంబుగా నగు'' అను సూత్రముచే ముపర్ణ కము లోపించి కోట యను రూపము కానవచ్చును. కుండశబ్దమల్లె సంస్కృత సమమయ్యు ముపర్ణకలోపమునొంది 'కుండ'అను నాకారము నొందెనుగదా! బహుళగ్రహణముచే దర్భ, పనస, కుండ మున్నగువానియందు ము లోపము నిత్యమని భావింపఁదగును.

కోట అనుశబ్దము, కోట్టశబ్దభవమనిగాని, కోటశబ్దసమమనిగాని తలంప వలయునని సీతారామాచార్యాశయము. ఇటుఁ గుండశబ్దము తత్సమమనియే యభిప్రాయము. (అయ్యది కుండము అనురూపము నొందనప్పుడు వైకృత మనియు, కోట అనునదికూడ వైకృతముకావలసివచ్చుననియుఁ దలంపరాదు).

**సూ. ప్రాణగొడ్డ మగ్రామ్యంబు నాఁదగు. ౧౨**

ఇయ్యది ప్రాణకుట్టక శబ్దభవము. అంచపదము, అంచయాన, లోనగువానివంటిది. (చూ. ఆంధ్రశబ్దరత్నాకరము).

వ్యా॥ ప్రాణగొడ్డము అనుపదము గ్రామ్యమనియు, నార్యవ్యవహార దృష్టమగుటచే గ్రాహ్యమనియు బాలవ్యాకర్త యాశయము. ప్రాణ, అను శుద్ధ సంస్కృతపదము ''గొడ్డము''అను తెనుఁగుపదముతో సమసించుట వ్యాకరణవిరుద్ధము గావున దీనిని గ్రామ్యమని చిన్నయసూరి చెప్పెను.

ప్రౌఢవ్యాకర్త ప్రాణకుట్టక శబ్దమునుండి పుట్టినదానిఁగా దీనిం దలం చెను. ఇందు ''ప్రాణ''అను శబ్దము మాత్రము వికారముచెందక, అంచయాన,

అంచపదము అనువానియందు 'యూన, పద అను పదములవలె సంస్కృత శబ్దమునందలి యాకారముతోఁ గానవచ్చుచున్నదనియు, నంతమాత్రమున దాని తద్భవత్వమునకు భంగము వాటిల్లదనియు భావము ఆంధ్రశబ్దరత్నాకరమున నీ పదము లిట్టివనియే సూచింపబడెను. దానిఁ జూడఁదగుననియు సూచితము. కావునఁ "బ్రాణగొడ్డము" అను శబ్దము గ్రామ్యముకాదనియు శుద్ధమగు తద్భవమనియు సీతారామాచార్యులవారి యాశయము.

**సూ, కపిల శబ్దభవము కపిల శబ్దం బొండుగానంబడెడి. ★ ౧౩**

ఉ. 'అక్కర, అవసరజ్ఞుండయి వ్యాసుఁ డేతెంచె నంత నత్తపసి
కవిలగడ్డంబును గవిలజడలును గవిలకన్నులును దవినయున్నవ నల్లనైన
దీర్ఘపుఁదనువునుజూచి యువిద కన్నుంగవ మొగిచి తెఱవకయుండె
భయమున. భార. ఆది ౪౮. ౨౫౨.

వ్యా॥ సూత్రార్థము సులభము.

బాలవ్యాకర్త "అర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు" అని సూత్రించెను. ఆసూత్రమున జూపిన యుదాహరణపదములలోఁ గొన్ని యా సూత్రమున కుదాహరణములు కాజాలవని ౧౨, ౧౩ సూత్రములచే ప్రౌఢ వ్యాకర్త చెప్పుచున్నాడు అందు కఱకంఠుఁ డను పదముమాత్ర మనాంధ్రవర్ణ మగు ఱకారముండుటచే గ్రామ్యమని యంగీకరించెను. "జీవగఱ్ఱ" అనునదియు గ్రామ్యముకావచ్చును మిగిలినపదములు గ్రామ్యములు కాజాలవని వీరి యాశయము. ప్రాణగొడ్డ మనుపదము మీఁది సూత్రముచే వివరింపఁబడెను.

ఇంకను మిగిలిన కపిలకన్నులు, కపిలగడ్డము, కపిలజడలు అను మూఁడు పదములలో "కపిల" అను పదముగాక "కవిల" అను పద ముండవలయు ననియు నట్లే భారతాదులందుఁ గానవచ్చుచున్నదనియు నీతని యాశయము.

"అవసరజ్ఞుఁడయి వ్యాసుఁడు" అను నక్కరయందు దీ పదములు మూఁడును గానవచ్చుచున్నవి. అచ్చటి పదములనే బాలవ్యాకర్త గ్రహించి మహాకవి ప్రయుక్తములగుటచే గ్రాహ్యములని వ్రాసెను. దాని యాతఁడవి పకారయుక్తములని తలంప నీతఁడు వకారయుక్తములని భావించెను. ఈ యక్కర వకార

ప్రాసముతో నున్నది కవిలగడ్డము అను పదములోని వకారము ప్రాసస్థలమున నుండుటచే పకారము మాత్రము కాదనియు, వకారమేయనియు "కవిల గడ్డము"లో వలె మిగిలినపదములలోఁగూడ "కవిల" పదమే గలదనియు నీతని యాశయము బాలవ్యాకర్త యిచట పకారమున్నదని భావించి స, వ ప్రాసము నంగీకరించిన ట్లూహించునది ఇతరపదములయందు కవిలశబ్దమే గలదని నిశ్చయించి యయ్యది తద్భవపదమనియు నాకారణమున నీ పదములు మూఁడును గ్రామ్యములు కాజాలవనియు ప్రౌఢవ్యాకర్త యాశయము.

ప వ ప్రాసము విషయమునఁ నేకాభిప్రాయము పండితులలోఁ గాన రాదు. ఈ పద్యము వివాదగ్రస్తము నన్నయ భారతమున నిర్వివాదముగా నెచ్చటను ప వ ప్రాస మంగీకరించినట్లు ప్రమాణము కానరాదు ఆ కారణ ముచే నన్నయ కవిలపదమునే ప్రయోగించె నను సీతారామాచార్యులవారి యాశయము సమంజసమనియే తలంపఁదగును.

సూ. గ్రామ్యంబు తత్తజ్జాతి వర్ణ్యంబునం బ్రయోగార్హంబగు ౧౪

ఉ. మొక్కేమసామి, రామా ౨౫. ౭ ఎ.గీ.

ఇతనిసూసి నామేలు బాగెముసేసినాము, య.౧ ఆ. ౧౨౦ మొ॥

వ్యా॥ గ్రామ్యపదము గ్రామ్యజాతి జనులను వర్ణించునపుఁడు ప్రయో గింపవచ్చునని యర్థము. అనఁగా శిష్టజనులు ప్రయోగించిన కటకంరాది పదములేకాక సర్వవిధలక్షణ విరుద్ధపదములును, నాయా గ్రామీణుల వర్ణన సందర్భమున వారి సంభాషణములుగాఁ బ్రయోగింపవచ్చునని గ్రహింపఁ దగును గ్రామ్యజనులను వర్ణించునప్పుడైనను కవి వాక్యములలో నట్టిపదములు వాడరాదు. ఆ జనుల మాటలుగా ననువదించు పట్టుననే యుండదగును అని భావము మొక్కేము = మ్రొక్కితిమి, సూసినా = చూడఁగల, బాగెము = భాగ్యము, సేసినాము = చేసితిమి

ఈ పదములు లక్షణవిరుద్ధములయినను కిరాతుల మాటలుగా ననువ దింపఁబడుటచే నిర్దోషములని తాత్పర్యము. గ్రామ్యజనులకు వ్యాకరణయుక్త శుద్ధపదములతో సంభాషణ సహజముకాదు కావున లక్షణవిరుద్ధమయినను వారి సహజభాషను ప్రయోగించుట కావ్యమున శోభాకరమేయని వారి తలంపు.

ఈ విషయము బాలవ్యాకర్తచేఁ జెప్పబడినదికాదు. తెలగనాదుల ప్రయోగములనుచూచి ప్రౌఢవ్యాకర్త యీ సూత్రమును రచించెను. "గ్రామ్యం తత్తద్విశేషేసాధు" అను నథర్వణకారికయు, కఱకంఠాదిశబ్దముల సాధుత్వమునే యుద్దేశించుచున్నట్లు తోనవచ్చుచున్నది. కాని యిట్టి పామరజన వ్యవహార భాషాప్రయోగార్హతను జెప్పియుండలేదు. అనగా నార్యవ్యవహారదృష్టము లయిన కఱకంఠ, ప్రాణగొడ్డాది గ్రామ్యశబ్దములను బ్రయోగించుట కనుమ తియే యథర్వణాభిప్రాయము. సీతారామాచార్యులగారి యీ సూత్ర నిర్మా ణమున కహోబలపండితుని "గ్రామ్యం తత్తద్విశేషే" ఇత్యాది కారికా వ్యాఖ్యా నమే మూలము కానోపును.

**సూ. ఒకానొకచో ననుకరణవిరహితంబుగ సంస్కృత వాక్యంబు గొనంబడియెడి. ౧౫**

ఉ. "తే. అంటితి నమశ్శివాయ పాపాత్మురాలి" జై.౪అ. ౭౧.

వ్యా॥ బాలవ్యాకర్త తెనుగుభాషలో సంస్కృతపదములను సంస్కృత వాక్యములను ప్రయోగించుటవిషయమున నేమియునుఁ జెప్పియుండలేదు. చింతామణియందుమాత్రము "నపదాన్వవ్యయ సుప్తిఙ్వాతుమునాం" "అను కృతేస్తి వాక్యంతు" అను సూత్రములచే సంస్కృతవాక్య మనుకరణముతో నుండవచ్చునను నభిప్రాయము సూచింపఁబడినది. ఇట్టిస్థితిలో ననుకరణములేని యపుడును సంస్కృతవాక్యము ప్రయోగింపవచ్చుననుట కీ సూత్రము రచిత మని తెలియఁదగును. ఈ గ్రంథము ఒక్క బాలవ్యాకరణమునకే శేషగ్రంథ మనరాదు. చింతామణ్యథర్వణకారికాబాలవ్యాకరణములలో ననుక్తములగు విషయములనుగూడఁ జెప్పుచుండును. కనుకనే బాలవ్యాకరణశేషము అని కాక త్రిలింగలక్షణశేషము అను నామధేయము గూర్పఁబడెను.

తెలుఁగున సంస్కృతవాక్యము ననుకరణము లేకుండఁ బ్రయోగించుట యుఁ గలదని తాత్పర్యము అనగా మహాకవులు ప్రయోగించిరి కావున నట్టివి దుష్టములుకావనియు నట్లు సంస్కృతవాక్యములను బ్రయోగింపవచ్చుననియు భావము.

ఈ యుదాహరణమున "నమశ్శివాయ" అను సంస్కృతవాక్యము అనుకరణము లేకుండఁ బ్రయోగింపఁబడెను.

సాధారణముగా "దాసోహమ్మనె", "మనసిజాయ నమో నమోయనుచు" మున్నగురీతిని సంస్కృతవాక్యములు ''అను'' అను పదముతోఁ గూడియే ప్రయోగింపఁబడుచున్నవి. అయినను నీ సూత్రముచే'' గ్వాచిత్కముగ నను కరణ రహితముగా నుండుట కనుమతింపఁబడెనని భావము.

**సూ. జయ పదం బనుకరణవిరహితంబ తఱచుగ నగు ౧౬**

**ఉ. తరువోజ, జయపూతనాఘాత జయదైత్యదమన, దయ నిమ్ము జీవితదానమ్మునాకు. హరి, పూ. ౭ ఆ.౫౧౮.**

**మ. జయనారాయణ పుండరీకనయనా శార్ఙ్గి జగన్నాయకా!**

**ఉ. హరి.౬ ఆ.౨౦ మొ॥**

**తఱచుగ ననుటచే నొక్కొ-కచో ననుకరణ సహితంబు నగునని యెఱుంగవలయు.**

వ్యా॥ ''జయ'' అను పదము సంస్కృతమున జిధాతులోణ్మధ్యమ పురుషైకవచనరూపము. జయించుగాక, లేదా! జయింపుము, అని దీనికర్థము. ఈ పదము తెనుఁగువాక్యములలోఁ జాలఁ దరచుగాఁ గనఁబడుచున్నది. కాని యనుకరణములేకయే ప్రయోగింపఁబడుచున్నది. కనుక నియ్యది సాధువే యని భావము.

౧౫ సూత్రము సంస్కృతవాక్యమును, ౧౬ సూత్రము సంస్కృత పదములలో నొక్క జయ పదమును అనుకరణరహితముగా ప్రయోగింప ననుమతించుచున్నవి. ఇతరసంస్కృతపదముల కనుకరణము కానియపుడు ప్రయోగార్హత లేనట్లు తెలుచున్నది. కాని సదా మున్నగు నవ్యయములకును ననుకరణరహిత ప్రయోగములు కానవచ్చుచున్నవని గుఱుతింపనగును.

''జయపూతనాఘాత'' అను నుదాహరణమున ''పూతనాఘాత'' మున్నగునని సంస్కృతసంబోధనములే యనుకొని పూర్వసూత్రోక్తరీతి ననుకరణ విరహితవాక్యములేయని తలంచుటకును నవకాశము గలదు కావున ''జయనారాయణ'' ఇత్యాది ద్వితీయోదాహరణమే నిరాక్షేపమగు నుదాహరణము.

ఇది సంజ్ఞాపరిచ్ఛేదము.

# సంధి పరిచ్ఛేదము

సంధి యనగా రెండు పదముల కలయికయే దీనినే సంహితయనియుఁ జెప్పుదురు. అనగా రెండుపదము లెడములేక యుచ్చరించుట. అట్టి యవ్యవహితోచ్చారణము చేయుచున్నప్పుడు కొన్ని యాదేశాదులు రావచ్చును. అట్టి వానిని సంధికార్యము లందురు. ''గురు + ఉపదేశ'' అను పదము లవ్యవధానముగా నుచ్చరించునపుడు గురుశబ్దములోని చివరి యుకారమునకును ఉపదేశపదములోని యుకారమునకును బదులుగా ''ఊ''కారమువచ్చి 'గురూపదేశ'మగును. ఈ యూకారాదేశము సంధికార్య మనఁబడును ఈరెండు పదములను గలిపి పలుకుట సంధియనఁబడును. ఇట్టి సంధిలో వచ్చెడి వివిధ కార్యములను దెలియఁజేయు ప్రకరణము కావున దీనికి సంధిప్రకరణమని పేరువచ్చెను. రెండుపదముల యవ్యవహితోచ్చారణము సంధి యనఁబడును. కాని యీ సందర్భమున వచ్చెడి మార్పులు సంధులనఁబడవు. అట్టివి సంధి కార్యములని చెప్పఁబడును. ఇట్టి యభిప్రాయమే సంస్కృత వ్యాకరణము లందుఁ గానవచ్చును బాలవ్యాకరణమున ''సంధి పరిచ్ఛేదము'' అను నామమునఁగల సంధిశబ్దమునకును నిదియె యర్థము. కనుకనే యీ ప్రకరణమునఁ బరరూపసంధిస్థలములగు స్వరసంధులేకాక ద్రుతసంధి, ప్రాతాదిసంధి, మున్నగు హల్ సంధులుగూడ నిరూపింపఁబడినవి.

ఈ విషయమును గ్రహింపక ''సంధి పరిచ్ఛేదము'' అనుచోటఁగూడ సంధిపదమునకు పారిభాషికమగు పరరూపమే యర్థమని తలంచి యీ ప్రకరణమున కీ నామము సరిపడదను నభిప్రాయమును గొందరు వాఙ్మయ పండితులు పొందియున్నారు. సూత్రములలో సంధిశబ్దముతోఁ గార్యమును విధించునపు డా సంధిశబ్దమునకు బాలవ్యాకర్త నిర్ణయించిన పరరూపమనియు, "సంధి పరిచ్ఛేదము" అను నామమునఁగల సంధిశబ్దమునకు సంస్కృతాంధ్ర భాషాప్రసిద్ధమగు పద సమ్మేళనమనియు నర్థము తెలియవలయును ''సంధి యగును'' ఇత్యాదివాక్యములలో సంధిశబ్దముతో కార్యములను విధించునపుడు

మాత్రము బాలవ్యాకర్త సంధిపరిచ్ఛేద ప్రథమసూత్ర వ్యాఖ్యానసందర్భమున నిర్ణయించిన పారిభాషికమగు పరరూపమే యరమనియుఁ దెలియవలయును.

సూ. శ్రేష్ఠతా వాచకంబులగు నార్యాంబాద్యర్థక శబ్దంబులు పరంబు లగుచో నన్నియచ్చులకును సంధి నిత్యము. ౧

ఉ. రామయ్య, సామయ్య, సీతమ్మ, లక్ష్మమ్మ మొ॥ ఆది శబ్దము అన్న, అక్క అప్ప లను దెలిపెడు.

వ్యా॥ ఆర్యాంబాద్యర్థక శబ్దములు (అయ్య, అమ్మ మున్నగు శబ్దములు) సంజ్ఞావాచకశబ్దముల యంతమునఁజేరి యా వ్యక్తుల శ్రేష్ఠతను వదించుచుండును. ''అంబాది'' అను శబ్దమునందలి ఆదిశబ్దముచే'' ''అన్న, అప్ప'' అను శబ్దములను గ్రహింపవలయునని వృత్తియందు సూచితము కావున నీ యయిదుశబ్దములు పరమగునపుఁ డన్నియచ్చులకును బరస్వరైకాదేశసంధి యగునని యర్థము.

బాలవ్యాకరణమున నత్తునకు బహుళసంధి విధించుటచే రామయ్య, సీతమ్మ మున్నగుచోట్ల నిత్యసంధివచ్చినను నికారమునకు నిత్యసంధి వచ్చుటకైనను నీ సూత్ర మావశ్యకమే ఇందలి యాదిపదముచే ''అరుసు,'' అయి, మున్నగువానిని గూడ గ్రహించి ''తిమ్మరుసు'', ''సీతాయి'' అనువానిని సాధింపవలయునని తలంపనగును. ''అమ్మాజియమ్మ'' అను తెనాలి రామకృష్ణుని ప్రయోగముఁజూపి యిచట నిత్యసంధి లేకుండుటయుఁ గలదని బులుసువారు వ్రాసియున్నారు.

సూ. ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియుఁ జూపట్టెడి. ౨

భూతకాలికాసమాపకక్రియయొక్క యికారమునకుఁ బ్రామాణిక ప్రయోగములందును గొన్నియెడల సంధి గనఁబడుచున్నదని యర్థము.

ఉ. "చాపము నాకందిమ్మనుడు," భార. విరా.౪ ఆ.౧౧౨.

'వెలిచిట్లంబుధినాథనందనులు దోర్వీర్యంబు సాలించిఘుండపు వాలంగ' నిర్వ.౫ ఆ.౮౫.

'ఎఱింగెఱింగి నా వలు విది యేల కట్టుకొనివచ్చును దానవి. భాగ.౯ స్క-౦. ౫౧౫.

శా. నేఁ డేతెంచు ప్రయత్న మున్న నకటా ! నీచేతఁ జెప్పం పఁడే? ప్రభా.ర ఆ. ౧౨౬ మొ॥

వ్యా॥ ఇప్రత్యయాంతావ్యయంబునకు = క్త్వార్థేకారాంతమునకు.

బాలవ్యాకర్త క్త్వార్థంబయిన యిత్తునకు సంధిలేదని చెప్పగా, నది సరి కాదనియుఁ దిక్కనాది ప్రామాణికుల ప్రయోగములలో సంధి కానవచ్చు చున్నదనియుఁ బ్రౌఢవ్యాకర్త యాశయము. భూతకాలికాసమాపకక్రియ యనగా భూతకాలికాసమాపకక్రియారూపదమని గ్రాహ్యము.

(1) అంది + ఇమ్ము = అందిమ్ము, (2) వెఱచి + ఇట్లు = వెఱచిట్లు, (3) ఎఱింగి + ఎఱింగి = ఎఱింగెఱింగి, (4) చెప్పి + అంపడె = చెప్పంపడే.

ఈ యుదాహరణములలో కొన్ని వివాదగ్రస్తములు. అందిమ్ము అనునది యొకశబ్దపల్లవక్రియయనియు, విడదీసి సంధికార్యములను జెప్పనక్కర లేదనియుఁ గొందరి యాశయము. కాని యిచ్చటఁ జెప్పదగిన విషయము గలదు. శబ్దపల్లవమయినచో నయ్యవి యవిభాజ్యములనిగాని యేకపదములని గాని చెప్పనక్కరలేదు.

శబ్దపల్లవములందును రెండవయవములుండును. రెండంశములును గలసి విలక్షణార్థముల నిచ్చుచో శబ్దపల్లవము లనఁబడును. వానియందలి రెండంశ ములకును సంధి విధాయకసూత్రములనుబట్టి సంధికార్యములు రావలసినదే. శబ్దపల్లవములలోని యంశములు పదము లయినచో నాయా వర్ణములకు విహితములగు సంధికార్యములును పదములుకానిచో న పదాదిస్వరసూత్రముచే నిత్యసంధియు వచ్చుచుండును. అంతియగాని శబ్దపల్లవ మయినంతమాత్రమున సంధివిధాన మనావశ్యకము కాఁజాలదు. కావున అంది + ఇచ్చు అనుచోట సంధి వచ్చుననుటకు సరియగునుదాహరణమే. వస్తుగతిచే నియ్యది శబ్దపల్లవము కాఁజాలదు. బాలవ్యాకర్త మతమున విలక్షణార్థాభిధాయకత్వముండినఁగాని శబ్దపల్లవము కాఁజాలదు. అంది = అందుకొని, ఇచ్చుట = ఇచ్చుట అను ప్రత్యే కావయవముల యర్థమే మొత్తమునకును వచ్చుచున్నది. విలక్షణార్థమే యిట

కానరాదు. ఇట్టియర్థముగాక, "అందుసట్లుగా ఇచ్చుట" అను నర్థమునుచెప్పి యట్టియర్థము ప్రత్యేకఖండములకు రాదనియు, నా కారణముచే శబ్దపల్లవమే యనియుఁ జెప్పినను మీఁదఁజెప్పిన రీతిని సంధివిధాన మావశ్యకమే.

కానిచో "నందిచ్చు" అను సిష్టరూపము నిషిద్ధముకావలసివచ్చును. "వెలిచిట్లు" అనునది సరియగుపాఠము కాదన్నచో నీ యుదాహరణము త్యాజ్యమె. మిగిలినవి రెండును గవిత్రయములోనివారివి కాకుండుటచే బాల వ్యాకర్తకు సమ్మతములు కాకపోవచ్చును. ప్రౌఢవ్యాకర్తమాత్రము కవిత్ర యేతరుల ప్రయోగములలో నిట్టివనేకములుండుటచే నీ సూత్రమును రచించెను.

భాగవతమును బ్రమాణముగాఁ గొందఱు లాక్షణికులు గ్రహింపరు. అప్పకవి తిమ్మకవ్యాదు లట్టియభిప్రాయభేదమును సూచించిరి. ప్రౌఢవ్యాకర్త మాత్రము ప్రామాణికప్రయోగములందును గానంబడుచున్నదని వివరించి భాగ వతపద్యము నుదాహరించుటచే భాగవతమునుగూడ బ్రామాణికముగనే గ్రహించెనని తలంపవలసియున్నది. "వెలిచిట్లు" అనుచోట "వెలినిట్లు" అనియుఁ బాఠాంతరముగలదు.

**సూ. కొన్నియెడలఁ బ్రామాణికప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి.** 3

ఉ. "మ, ఘనచక్రాయుధ నిఘ్నక్షత గళద్రక్తాస్య సర్వాంగుని, న్ననుభూతాప్రతిమ ప్రగల్భ పరివాదాంత్రితోద్విక్రమున్" ఉ. హరి.౬ ఆ.౨౨౬. "సర్వము న్నతని దివ్యకళామయమంచు విష్ణునం, దుల్లముసేర్చి" భాగ.౭ స్కంధ.

మ. తరుణీశాత కటాక్షవీక్షల కొనల్దార్కొన్న చోట్లుంబలె, న్నరుశోభావిభవాకరంబులగుచున్ రోమాంకురస్థానముల్, పరఁగున్. కళా.౭ ఆ.౧౦౮. (నన్నయభట్టారకుఁడు "అన్నిష్టసఖనూఁది యున్న దాని" అని ప్రయోగించి "లుక్సంశ్లేషో నాచిద్రుతస్య" అని సంశ్లేష మును నిషేధించుట ప్రయోగవైరళ్య సూచనార్థంబని యెఱుంగునది.

వ్యా॥ నాచనసోమనాథాది మహాకవుల ప్రయోగములందుఁగూడ ద్రుత ద్విత్వము విరళముగాఁ గానవచ్చుచున్నది. కాన నయ్యది ప్రామాణికమే యని తాత్పర్యము.

బాలవ్యాకర్త యీ విషయమును జెప్పియుండలేదు. కవిత్రయప్రయోగములందిట్టివి తఱచుగాఁ గానరాకుండుటయే కారణమయియుండును. ఉత్వ విశిష్టనకారముపై నింకొక నకారముమాత్రముండునని చెప్పి "అదియునుంగాక" అని యుదాహరించెను.

సర్వాంగునిన్ + అనుభూత = ఈ స్థలమున "న్" అనుచోట ఇంకొక నకారముచేరి సర్వాంగునిన్ + న్ + అను భూత = సర్వాంగు ని న్ననుభూత అని యయ్యెను. ఇది ద్వితీయాప్రత్యయాత్మకావ్యయము, ఇట్లే సర్వమున్ + న్ + అతని, బలెన్ + న్ + ఉరు — అనుచోట్లను నూహించునది. ఇయ్యవి యవ్యయాత్మక ద్రుతములు, ను, అనుచోటి యుకారము లోపింపగా మిగిలిన నకార మిక్కడ గ్రహింపఁబడియెనని కొందఱిలయాశయము, ఉత్వలోపము చేయకయే ద్రుతద్విత్వము చేయుటలో లాఘవముప్రక్రియలోఁ గానవచ్చును, ఘన చక్రాయుధ అనుచోట యతిభంగముండుటచేఁ బాఠాంతరమును బులుసువారు చూపిరి అదియును యుక్తమే. (చూ పాఠాంతరము) *

నన్నయభట్టారకుఁడు ద్రుతమున కచ్చుపరమగునపుడు లోపముగాని, సంశ్లేషముగాని రావని "లుక్సంశ్లేషౌ నాచిద్రుతస్య" అను సూత్రమున విశదీకరించెను. ద్రుతము సంశ్లేషమును బొందుట యనగా వేరొకహల్లుతో సంయోగమును జెందుటగదా! ఇట్లు సంశ్లేషమును నిషేధించిన నన్నయ్య "అన్నిష్టసఖి" యని సంశ్లేషరూపమును బ్రయోగించెను ఇచ్చట 'అన్ + ఇష్టసఖి', అని యుండఁగా నకారమున కింకొక నకారముచేరి సంయోగముఁజెంది అన్ + న్ + ఇష్టసఖి = "అన్నిష్టసఖి" అను రూపమును జెందెను. ద్రుతద్విత్వము ద్రుతసంశ్లేషమేగదా! ద్రుతసంశ్లేషము చింతామణిసూత్రముచే నిషేధించియు "అన్నిష్టసఖి" అనుచోటు ద్రుతద్విత్వమనఁబడుచున్న ద్రుతసంశ్లేషము నెట్లు ప్రయోగించును ?

---

* గళద్రక్తార్ద్ర సర్వాంగు నభ్యనుభూతాప్రతిమ ప్రగల్భ పరివాదాంతర్హితోద్వృత్తిక్రమున్.

కావున నాతనియభిప్రాయ మిట్లూహింపనగును. 'ద్రుతసంశ్లేషమును దరచుగాఁ బ్రయోగింపరాదు. క్వాచిత్కముగాఁ బ్రయోగించినను దోషము కాదు.'' కనుకనే భారతమున నిట్టివి విరళముగా నున్నవే కాని తఱచు గానరావు. అని సీతారామాచార్యులవారి వివరణమున కభిప్రాయము.

సీతారామాచార్యులవారి మతమున ద్రుత మాగమప్రత్యయావ్య యాన్యత మాత్మకము గావలయును. ఈ సూత్రమున నుదాహరింపఁబడిన నకారము లన్నియుఁ బ్రత్యయాత్మకములో యవ్యయాత్మకములో యగుటచే ద్రుతము లగుచున్నవి. పెను, కను, మున్నగువానిలోని నకారము లాగమాద్యన్యత మాత్మకములు కానందున ద్రుతములుకాఁజాలవు. ఆకారణముచేతనే రెండు సూత్రములను వేర్వేరుగా రచించుకొని యొకసూత్రముచే (3 ప్రౌ॥వ్యా॥సంధి) ద్రుతమగు నకారమునకును, వేరొకసూత్రముచేఁ దనమతమున ద్రుతమని చెప్పుటకు వీలుకాని శబ్దసహజమగు నకారమునకు (౬ వ సూత్రముచేతను) ను, ద్విత్వము విధించుకొనెను. అన్వాదులలోని నకారము ద్రుతము కాకుండుటచేతనే ౬ సూత్రమున కుదాహరణముగాఁ జూపఁబడెను. అట్టి ధాతుజవిశేషణములు 3వ. సూత్రమున నుదాహరింపఁబడలేదు. ఇట్టిస్థితిలో ''అన్నిష్టసఖి యనుచోట ద్రుతసంశ్లేష మే కాఁజాలదుగదా! అప్పుడు ''లుక్ సంశ్లేషేనాచి'' అను సంశ్లేషనిషేధమునకును, అన్నిష్టసఖియను ప్రయోగము నకును విరోధ మేమున్నది. అన్నిష్టసఖియనుచోట కర్మధారయసమాసమున పెన్వాదుల కడ హల్లునకువచ్చెడి ద్విత్వముగాని ద్రుతద్విత్వమేకాదు. అను అనుచోట ద్రుతమేలేదు. ఈ రెండింటికిని విరోధమే లేదు. కావున ప్రయోగ వైరళ్యసూచనమే సంభవింపదు. వైయర్థ్యము లేనిదే జ్ఞాపనము సాంప్రదాయి కము కాదుగదా!

కావున సీతారామాచార్యులవారి యీ వివరణము ప్రామాదికము. ౬ వ. సూత్రమున ''కర్మధారయ సమాసంబునన్'' అను పదమును దొలగించి యీ యుదాహరణములనుగూడ నా సూత్రముననే లక్ష్యములను గావించి యీ సూత్రమును దీసివేయుట యుచితము - లాఘవమును.

సంశ్లేషమనఁగా ద్రుతము పూర్వాచ్చు నంటియుండుటయని పణ్డితులవారి యాశయము. పద్యాంతమున నకారము పూర్వాచ్చు నంటియుండుటయే సంశ్లేషమున కుదాహరణముగా వీరు చూపుదురు ''అగు బుధసేవన్'' అట్టి

సంశ్లేషము అచ్చు పరమగునపుడు ఉండదనియు,పరాచ్చుతోనేకలిసి యుచ్చరింపఁబడుననియు, నీ సూత్రాశయమని వారియభిప్రాయము.

''ఘనచక్రాయుధ'' ఇత్యాద్యుదాహరణము సరియయినపాఠము కాదనియు నిందు యతి తప్పినదనియు వెంకటరమణయ్యగారు వ్రాసిరి. కాని యిందు మనకు ఉదాహరణము కాఁదగిన ద్వితీయపాదాదిని మార్చవలసిన యావశ్యకత కానరాదు. ఇచట యతిభ్రంశముగాని అర్థవిరోధముగాని కన్పట్టదు. ''అనుభూత'' అనుచోటి అకారమునకును, వాద + అంతః = వాదాంతః అనుచోట దకారోత్తరాకారమునకును యతి కుదురుచునేయున్నది. ప్రథమ పాదమున మొదటియక్షరము సంయుక్తముగానుండుట నిశ్చయము. తత్పూర్వ పాదాంత్యవర్ణము గురువగుట యావశ్యకముగదా! అయినను నర్థానుగుణముగాఁ బూర్వపదములోని దకారమును విడచి ''ఘనచక్రాయుధ'' ఇత్యాదికము నుదాహరించిరి. ఉదాహరణమున దకారమును విడచినంతమాత్రముచే నిచ్చట యతిభ్రంశమనుట తగదు.

''అప్య'' అనుచోట ''ఆర్ద్ర'' అని దిద్దుట బాగుగనేయున్నది. కాని అనుభూత అనుచోట ''అభి'' అను నుపసర్గను జేర్చుట కవసరము కానరాదు. మరికొన్నిచోట్ల మార్చవలయునుగదా! యని యుదాహరణస్థలమునఁగూడ నావశ్యకతలేకున్నను మార్చుట యుచితముకాఁజాలదు. కావున నాచన సోమనాథుని పద్యముగూడ నుదాహార్యమే యగుచున్నది.

**సూ. చిట్టడవిఁ జిట్టి.** ౪

ఇయ్యది తదితరంబులకును నుపలక్షణంబని యెఱుంగునది.

ఉ. చిట్టడవి, చిట్టాముదము, చిట్టీఁదు, చిట్టుడుకు, చిట్టెలుక, చిట్టేలకి ఇత్యాదులందుఁ బూర్వపదంబు చిట్టి శబ్దమని యర్థము. ఇవి సంజ్ఞావాచకములు గాన సంధినిత్యము. హల్లు పరంబగుచో ద్విత్వంబునకు లోపంబు వైకల్పికంబు, చిట్టిచాఁప. చిటిచాఁప. చిట్టితాళము చిటితాళము మొ॥

వ్యా॥ చిట్టడవి మున్నగు సమాసములందుఁ బూర్వపదము చిట్టి అను నదియే కాని చిఱు అనునది కాదని తాత్పర్యము. ఇయ్యది = సూత్రములోని చిట్టడవి అను పదము. తదితరంబులకును = చిట్టాముదము, చిట్టీఁదు మున్నగు

చిట్టిపదఘటిత సమాసములకును, ఉపలక్షణము = సూచకము. అనఁగా సూత్రమునఁ జిట్టడవి అను సమాసమున మాత్రమే పూర్వపదము "చిట్టి"అను పదము అనికాక యిట్టి సమాసముల నన్నింటను పూర్వపదము చిట్టి యనునదియేకాని, "చిఱు" అనునది కాదని తాత్పర్యము.

బాలవ్యాకర్త. "కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దంబుల అడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు" నని సూత్రించుటచే నిందలి పూర్వపదము "కుఱు" అనునదేయని యీతని యభిప్రాయము.

చిట్టెలుక మున్నగు బాలవ్యాకర్త యుదాహరించిన స్థలములందుఁ బూర్వభాగమునకు "చిన్న" అనియే యర్థము. చిట్టి పదముకూడ నట్టియర్థము ననే వాడఁబడుచున్నది. చిట్టివాఁడు, చిట్టిబాబు, చిట్టిపాప, ఇత్యాదులం దీ పదము నంగీకరింపకతప్పదు. ఇచ్చట బాలవ్యాకరణము కూడఁ జిట్టి పదము నంగీకరింపకతప్పదు. ఇక్కడ హల్లులు పరంబులగుటచే ద్విరుక్తటకారాదేశము రాదుగదా! కావున నితరస్థలములందు కానవచ్చుచు నవశ్యాంగీకార్యమగు చిట్టి పదమే చిట్టడవి మున్నగుచోట్లను నున్నదని తలంచుట యుచితమనియుఁ బ్రక్రియాలాఘవ మిట్టిమార్గముననే గలదనియుఁ బ్రౌఢవ్యాకర్త యాశయము.

పూర్వపదము "చిఱు" అనుకొనినచో "ట"కారద్వయాదేశము, ఉత్వ సంధియుఁగూడ నావశ్యకములు - పూర్వపదము చిట్టియనినచో నికారసంధి మాత్రము కర్తవ్యము చిట్టి + అడవి అనుచోట నిత్యసంధి వైకల్పికము కావునఁ జిట్టియడవి అనురూపాంతరము రావలసియుండఁగా సంజ్ఞావాచకములగుటచే నిత్యసంధియే యగుననియు సంధ్యభావరూపముండదనియు వివరించెను.

సంజ్ఞావాచకములకు సంధి నిత్యమని బాలవ్యాకర్తగాని యీతఁడుగాని చెప్పియుండలేదు. సంస్కృతవ్యాకరణ ప్రసిద్ధమగు పద్ధతింబట్టి యీతఁ డిట్లని నియమించెను. ఉన్మత్తగంగము, (ఒకదేశము) మున్నగునవి సంజ్ఞావాచకములు గావున నా పదములు మారరాదని సంస్కృతవ్యాకర్తల యాశయము. వారు సమాసము విషయమున నిత్యమనిరి. కాని సంజ్ఞాశబ్దమున వర్ణానుపూర్వి మారినచో నర్థబోధకము కాదనియే వారి తాత్పర్యము. కావున సంధి విషయమునను వర్ణములు మారరాదనుట యుక్తియుక్తమే యగును.

చిట్టిశబ్దములోని ద్విత్వలోపము అక్కటాది పాఠముచేతనే సిద్ధించును. అట్టి లోపమునకు హలాదిపదము పరమగునపుడుమాత్రము వికల్పమేయని

విశదీకరించుచు నజాది పదము పరమగునప్పుడుమాత్రము ద్విత్వలోపము నిత్యమను వ్యవస్థను సూచించుచున్నాడు

**సూ. కొన్నియెడలఁ దెనుఁగులమీఁది సాంస్కృతిక కతపలకు గదవలు గానంబడియెడి.** ★ ౫

కొన్నియెడల ననఁగాఁ బ్రాసంబులం దని యర్థము.

'వీర ల్గోపించిన నంతకుండుఁ జెడు, మీరా యోర్చువారు?' ఉ.హరి ర ఆ.౫౩. 'ఇట్లు దపంబు సేయుచుండుదు' నిర్వ. ౫ ఆ. ౮. 'వేవణములు' విజ్ఞా. ప్రా.కాం.ర మొ॥

వ్యా॥ కొన్నిచోట్లఁ దెనుఁగుపదములమీఁదనున్న సంస్కృతపదముల "క, త, ప," అను వర్ణములకును (గ స డ ద వాదేశము వచ్చుటచే) గ, ద, వ, అను నాదేశములు కలవని భావము.

(వీరల్ + కోపించిన, ఇట్లు + తపంబు, వే + పణంబు,)

కొన్నియెడల ననుపదమును వివరించుట కభిప్రాయ మేమనగా నిట్టి గదవాదేశములు త్రోసిపుచ్చుటకు వీలుకాని ప్రాసస్థలములందుఁ గానవచ్చుచున్నవి. కనుక నంగీకార్యములే యని భావము. అనఁగా నితరస్థలములందిట్టి యాదేశము లుండరాదని యనుకొనరాదు.

బాలవ్యాకరణమునఁ బ్రథమ మీఁది పరుషములకు వచ్చెడి గసడదవాదేశము "తెనుఁగులమీది సాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు." అని నిషేధింపబడెను. కాని యీ నిషేధము క–త–ప, అను వర్ణములవిషయమునఁ గొన్నిచోట్ల వర్తింపలేదనియు, గ ద వ లు వచ్చుచున్నవనియు మార్పరాని ప్రాసస్థలోదాహరణములను ప్రౌఢవ్యాకర్త చూపుచున్నాడు.

ఈ సూత్రము బాలవ్యాకరణములోని "తెనుఁగులమీది" ఇత్యాది సూత్రమునకు దిద్దుబాటుమాత్రమేకాక "ప్రథమ మీఁది పరుషములకు" అను సూత్రమునందలి బహుళ పదమునకు వివరణము నగుచున్నది?

"కొన్నియెడలన్" అను పదమునకుఁ బ్రాసస్థలములందు అని యర్థము వ్రాయఁబడుటచేతఁ "బ్రాస స్థలములందుమాత్రమే యీ యాదేశము కాని

వచ్చుచున్నది గాని తదితర స్థలములందుఁ గానరాలేదు కావున ప్రాస స్థలము లందుమాత్రమే గ్రాహ్యము. ఇతర స్థలములందు గ్రాహ్యము గాదు '' అని యభిప్రాయపడరాదు ప్రాసస్థలములందు కానవచ్చుటచే నీ యాదేశము ప్రామాణికమే యని చెప్పుటయందే గ్రంథకర్తకుఁ దాత్పర్యము.

అప్పకవ్యాదులు స్వవర్గజ ప్రాసము నంగీకరించిరి అట్టిమతమున నిచ్చట గ, ద, వా, దేశములు చేయఁబడలేదన్నను ప్రాస నియమమునకు భంగము రాదు. కాని స్వవర్గజ ప్రాసములందుగూడఁ బరుషములకును, అనునాసికము లకును, స్వవర్గీయాక్షరములతోఁ బ్రాసమున్న పద్యములనెవ్వరును నుదాహ రింపలేదు. అట్టివి దుర్లభములే యనవచ్చును. ఇందలిమూదవ యుదాహర ణమును ప వ ప్రాస మంగీకరించినచో ద్రోసివేయవచ్చును.

**సూ. కొన్నియెడల ద్వంద్వంబునఁ బదంబుమీఁది చ త ప లకు స ద వ లు గానంబడవు. ౬**

**ఉ. అందచందములు. అని.౫ ఆ.౯౧. 'అప్పాచెల్లెంద్రు' నిర్వ.౩ ఆ.౯౬. 'కండతుండెములు' రామా. రాకపోకలు. భాగ.౧౦ స్క-౦. మొ॥**

వ్యా॥ ద్వంద్వంబునం బదంబు పయి పరుషములకు బాల వ్యాకర్త గ స డ ద వ లను నిత్యముగా విధించెను. కాని కొన్నిచోట్ల గ స డ ద వా దేశమురాని ప్రయోగములుఁ గానవచ్చుచున్నవి. అట్టివియు ప్రామాణికములే యని తాత్పర్యము.

చందము, చెల్లెలు, తుండెము, తోక, అనునవి ద్వంద్వసమాసమునందలి ద్వితీయ పదములు. వీనియందు పై యాదేశము లేకయే ప్రయోగము కాన వచ్చుచున్నది. (ఇవి ప్రాస స్థలములు కానందున ప్రబల ప్రమాణములు కావని వ॥ సీ॥ శాస్త్రిగా రనిరి.) అనఁగా ద్వంద్వమునందును గ స డ ద వా దేశము బహుళ మనుటయే యుచితమని భావము.

**సూ. సర్వపర్యాయంబయిన యెల్లశబ్దమునకు సప్తమియు, నసమా సంబున విశేష్యమునకుముందు ప్రయోగంబునుం జూపట్టెడు. ౭**

ఉ. 'తే. ఎఱిఁగె సకలశాస్త్రముల నెల్లయందు, నధికసాత్త్వి కుఁడ స్త్రీకుఁడనఁగ జనులు;' భార. ఆది. ౨ ఆ. ౧౫౯. 'తే. ఎల్లయం దును దావసియించుటెల్ల, యదియుఁ దనయందు వసియించు టంౘడు వాసు, దేవుఁడనుపేరి కర్థంబు. భార. ఉద్యో. ౨ ఆ. ౩౨౫. 'నేనొకండనే భిక్షావకున్ వత్తునో, యెల్లన్ శిష్యులఁ గొంచువత్తునో. భీమ. ౨ఆ ౧౨౦.

వ్యా॥ బాలవ్యాకర్త (సంధి ౨౪ సూ) "సమాసంబునందు ద్రుతంబు నకు లోపంబగు" నను సూత్రవ్యాఖ్యానమున నెల్లశబ్దము ద్రుతాంతమయిన యవ్యయమని చెప్పెను. అవ్యయమనగా లింగవచనవిభక్తి చిహ్నములు లేనిది. ఎల్లశబ్దమునకు సప్తమీవిభక్తి ప్రత్యయము కానవచ్చుటచే నిది యవ్యయము కాఁజాలదను నభిప్రాయముతో నెల్లశబ్దమునకు సప్తమీవిభక్తి చూపట్టు చున్నదని ప్రౌఢవ్యాకర్త చెప్పెను.

మొదటి రెండు ఉదాహరణములును దీనికి లక్ష్యములు వీనియందు "ఎల్లయందు" అను సప్తమీవిభక్తితోఁ గూడిన ఎల్లశబ్దము ప్రయుక్తము.

'దీని కసమాసంబున విశేష్యంబునకుముందు ప్రయోగములేదు' అనియు నచ్చుటనే బాలవ్యాకర్త చెప్పెను. కాని యసమాసముననే విశేష్యమునకు ముందు శ్రీనాథుడు ద్రుతాంతమగు నెల్లశబ్దమును బ్రయోగించుటచే నీ బాల వ్యాకరణాభిప్రాయము సరికాదని ప్రౌఢవ్యాకర్త పై సూత్రపు రెండవభాగమున వివరించుచున్నాడు.

సమాసము కానిచోట ననగా వ్యస్తస్థలమునందును ఎల్లన్ అనునది విశేష్యమునకుముందు ప్రయోగింపఁబడుచున్నదని యర్థము. 'నేనొకండనే' యిత్యాదిక మిందుల కుదాహరణము. "ఎల్లన్ శిష్యులన్" అనుచోట ఎల్లన్ అనునది శిష్యులన్ అను పదమునకు విశేషణము. ఇయ్యది విశేష్యమగు శిష్యు లన్ అను పదమునకుఁ బూర్వమే ప్రయోగింపఁబడెను. కావున విశేష్యంబునకు ముందు ప్రయోగము లేదను బాలవ్యాకర్తయుక్తి సరిపడదనియుఁ దెలియ నగును. ఎల్లన్ శిష్యులన్ అనునది సమాసమనుటకును నవకాశములేదు. ఇయ్యది సమాసమయినచో "సమాసంబునందు ద్రుతంబునకు లోపంబగు" నను సూత్రముచే ఎల్లన్ అను పదమునందలి ద్రుతమునకు లోపమువచ్చి "ఎల్లకష్టములు" మున్నగువానివలె "ఎల్లశిష్యులన్" అని యుండును.

అవ్యయముకానిచో తృతీయాదీతరవిభక్తులు చేరినరూపములుగూడ నీ పదమునకుఁ జూపట్టును. కాని ఎల్లచేత, ఎల్లకొఱకు మున్నగురూపము లెచ్చటను కానరాలేదు. అంతియకాక వీరులెల్లన్, వనితలెల్లన్, ఫలములెల్లన్ అని మహ న్మహత్య మహద్రూపముల మూఁడింటను నేకవిధముగనే యీ పద ముండును. ఎల్లరు, ఎల్లరన్ మున్నగు మహన్మహతీ బహువచనాంతరూపములు మాత్రము వాడుకలోనున్నను నయ్యవి "వారు" శబ్దసమావేశమున నిష్పన్నములే యని తలంపవచ్చును.

ఇక "నెల్లయందు" ఇత్యాదులు సప్తమ్యంతములని తలంపరాదు. 'అందు' అనునది విభక్తిప్రత్యయమేగాక ప్రత్యేకశబ్దమును గలదని "సాశ్రయా నాశ్రయాపిస్యాత్త్రార్థగత సప్తమీ" యను నథర్వణకారికవలన తెలియఁబడుచున్నది. కావున నియ్యది అందు అను ప్రత్యేకశబ్దముతోఁగూడిన యెల్లపదమేకాని సప్తమ్యంతమగు నెల్ల పదమని తలంపరాదు. అర్థభేదమించుక యున్నను విరోధములేదు కావున నెల్ల పద మవ్యయమనుటయే యుచితము.

సూ. తామర కాకు పరంబగునపుడు పుగాగమం బగు. ౮

ఉ. తామరపాకునీరువలెఁ దల్లడమందిరి పౌరులందఱున్.

హరి. 3 ఆ. 3౫.

వ్యా॥ బాలవ్యాకర్త చిగురుటాకు మున్నగురూపములను సాధించెనే కాని "తామరపాకు" అను రూపమును సాధింపలేదు. కని యట్టిని ప్రాచీన కవుల ప్రయోగములందుఁగూడఁ గానవచ్చుటచే నీ సూత్రమును రచించెను.

ఈ యాగమమున కకార మిత్తునియు ఉకారము ఉచ్చారణార్థమే యనియు గ్రహింపవలయును. తామర + ప్ + అకు = తామరపాకు అని యగును. ఇచట "పు" అని ఉకారముతో గూడినదే యాగమమనినచో తామరపు + అకు అనియుండ నుత్వసంధిగూడ వచ్చినంగాని తామరపాకు అని సిద్ధింపదు.

అప్పుడు ప్రక్రియాగౌరవము వచ్చును. కావున పకారము మాత్రమే యాగమమనుట యుక్తము.

ఈ యాగమము సూత్రమున వైకల్పికమని చెప్పకపోవుటచే నిత్యముగాఁ బ్రాప్తించుచున్నది. కాని యది సమ్మతముకాదు. తామరాకు అనురూపమును

సుప్రసిద్ధము. అందుచే సూత్రమున "పుగాగమంబునగు" అని సముచ్చయముం గూర్చి పుగాగమరహితరూపమునుగూడ సంపాదింపవలసియున్నది.

సూ. తఱచుగఁ గర్మధారయ సమాసంబునం, బెన్వాదుల కడహల్లున కచ్చు పరంబగునపుడు ద్విత్వంబు గానంబడియెడి. ౯౦

ఉ. "పెన్నదరులు" రా.యు.కాం.౧౧౩౧. "పెన్నరదము" రుక్మాం.౩ ఆ.౧౮౦. "పెన్నుద్ది" పాండు.౩ ఆ.౬. "పెన్నూత" శివ.౨౭. "పెన్నొడలు" భోజ.౬ ఆ.౩౭౯. 'కన్నాకు' (కను+ఆకు) భార. భీష్మ.౧ ఆ ౭౬. "పల్లఱపు" (పలు+అఱపు) హరిశ్చ.౪ ఆ.౧౦౯ మొ॥ తఱచుగ ననుటచే "అన్నిష్టసఖ నూఁదియున్నదాని" (అను+ఇష్టసఖి) భార. ఆది.౩ ఆ.౧౪౦. "అన్నుర్వీశుఁడు" నిర్వ.౫౭. "పెన్నురము" రా.యు.కాం ౧౦౧౪. ఇత్యాదులు గ్రాహ్యంబులు. (పెను – పెనుపుశబ్దము లుప్తశేషము)

వ్యా॥ పెన్వాదిశబ్దములలోని నువర్ణము అగమాద్యాత్మకము కానందున ద్రుతముకాఁజాలదు. ఆకారణమున నిందలి ౩వ. సూత్రముచే పెను, కను శబ్దములకు ద్విత్వము వచ్చునని శంకింపరాదు. పలు + అఱపు = పల్లఱపు.

సూత్రమున "తఱచుగ పెన్వాదుల కడహల్లునకు" అని చెప్పుటచే పెన్వాదులకు "అదరులు" మున్నగు నాచ్ఛికశబ్దములు పరంబగునపుడేకాక తత్సమశబ్దములు పరంబగునపుడును నీ ద్విత్వము వచ్చునని తఱచుగ నను పదమువలన లభించిన యర్థమును వివరించెను. ఈ కారణముచే "ఇష్టసఖి" "ఉర్వీశుఁడు" ఉరము అను తత్సమపరకత్వమునను నీ ద్విత్వము ప్రాప్తించెను.

పెను అను శబ్దము పెనుచు ధాతుకృదంతరూపమగు పెనుపుశబ్దమున సమాసము ౩౬సూ.చే "పు" వర్ణము లోపింపగా శేషించిన రూపమని గ్రహింపవలయును.

పెను మున్నగు వానిలోని యుకారమునకు కవిభల్లటుసూత్రముచే నుత్వ లోపము గావించినపిమ్మట యీ సూత్రము ప్రవర్తించునని కొందరనుచున్నారు.

బా॥వ్యా॥ సూ.౧౬ ప్రక్రియచే నుత్వలోపము వచ్చినపిమ్మట ననిచెప్పుట యుచితము. [ఉత్వము లోపింపనిపక్షమున నకారము కడహల్లు కాకపోవును]

అప్పుడు ద్విత్వ మీ సూత్రముచే వచ్చుట కవకాశములేదు. కనుక నుకార లోపము చెప్పవలసివచ్చినది. ఈ పద్ధతిని ప్రక్రియాగౌరవ మేర్పడినది అయినను సూత్రమునకు లక్ష్యమగుటకై యిట్లు చెప్పవలసివచ్చినది. ౩వ. ౯వ, సూత్రములను రెండింటిని దీసివేసి "కొన్నియెడల నకారంబున కచ్చు పరంబగునపుడు ద్విత్వంబు గానంబడియెడి" నని సూత్రించిన నుభయవిధ లక్ష్యములును సిద్ధించియుండును.

సూ కొన్నిచోట్ల షష్ఠీసమాసంబునం దుకారంబున కచ్చు పరంబగు నపుడు నుగాగమంబునకు లోపంబునగు. ౧౦

ఉ. "గోకుల మిల్లిలు దప్పకుండ లక్ష్మీపతి గ్రుమ్మరున్గడియ సేపున రేపున" హరి. పూ.౫ ఆ.౨౦౩.

సీ. దినవెచ్చమునకునై తనమేనఁగల సొమ్ము కొదువకక బచ్చిం టఁ గుదువవైచు పాండు.౩ ఆ.౧౬. "శిరసందంబరయున్" కళా. ౭ ఆ.౧౨౬ మొ॥

వ్యా॥ బాలవ్యాకరణమున ౩౪ సంధిసూత్రముచే "షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చుపరంబగునపుడు నుగాగమంబగు"నను సూత్రముచే రాజు(యొక్క) + ఆజ్ఞ = రాజునాజ్ఞ మున్నగురూపములు సిద్ధించుచున్నవి. ఈ సూత్రము నిత్యముగా నుగాగమమును విధించుచున్నది కాని యుకారాంత శబ్దములకు మాత్రము కొన్నిచోట్లు నుగాగమము రాకపోవుటయుఁ గలదు. కావున బాలవ్యాకరణముచే విధింపఁబడిన నుగాగమమునకు లోపంబు కొన్ని చోట్లు నగునని ప్రౌఢవ్యాకర్త యాశయము.

గోకులము(యొక్క) + ఇల్లిలు = గోకులము నిల్లిలు అని సామాసిక విభక్తిలోపము వచ్చినపిమ్మట నుగాగమము వచ్చినచో నగును. నుగాగమము లోపించుటచే "గోకుల మిల్లిలు" అని యయినది.

బచ్చు(యొక్క) + ఇల్లు. విభక్తి, నుగాగమలోపములు వచ్చి "బచ్చిల్లు" అయినది. "బచ్చునిల్లు" కాలేదు. శిరసు(యొక్క) + అందము. విభక్తి నుగాగమలోపములు వచ్చిన "శిరసందము" ఆయెను, "శిరసునందము" కాలేదు.

బాలవ్యాకరణము విధించిన నుగాగమంబునకు లోపము విధించుట కంటె "నుగామంబు గానంబడదు" అని సూత్రించిన బాగుండును.

ఇందే (౬వ సూత్రమున) "చతపలకు సదవలు గానంబడవు"ఇత్యాదిక మ ట్లేగదా రచింపబడినది అట్లనక నుగామమునకు లోపము విధించుటచేత ముందుగా నుగాగమమును బాలవ్యాకరణముచేతఁ జేసి యీ సూత్రముచే లోపమును జేయవలయును. అక్కరలేనిదానికిఁ బ్రాప్తినిచెప్పి పిమ్మట నిషేధించుట నిరర్థకము. ఇయ్యది ప్రక్రియాగౌరవము. కావున సూత్రమున నుగాగమము గానంబడదని చెప్పుట యుచితము – ఇందలి మొదటి యుదాహరణమున గోకులము అనునది ప్రథమాంతమే యనియుఁ దలంపవచ్చును. షష్ఠీసమాస ఘటితమగు షష్ఠ్యంత మనుకొననక్కరలేదు. ఇల్లిలు దప్పకుండ లక్ష్మీపతి గోకులము గ్రుమ్మరున్" అని, గోకులము అనుదానిని గ్రుమ్మరున్ అను క్రియలోని కన్వయింపవచ్చును. కావున నియ్యది దీని కుదాహరణముగా నిచ్చుట సరిగాదు. మిగిలిన రెండుదాహరణములును నాధునికములు.

**సూ. పూ పూవు.** ౧౧

**అసమాసంబునం బూశబ్దము పూవుశబ్దముయొక్క పర్యాయము గాఁ గానంబడియెడినని యర్థము.**

ఉ. "ఎ.గీ. కాలకంఠుని! శిరసుపూ గగవ గంగ" కాశీ.౧ ఆ.౨

వ్యా॥ "పూ" అను శబ్దము వేరొకటి పూవు అను నర్థమునఁ గలదని సూత్రార్థము. పూరెమ్మ మున్నగు సమాసములందేకాక యసమాసమునందును, "పూ" అనునది పూవు అను నర్థమున ప్రయోగములందుఁ గానవచ్చుటచేత నియ్యది లుప్తశేషముకాదనియుఁ బ్రత్యేకప్రయోగయోగ్యమగు స్వతంత్ర పదమేయనియు వివరణతాత్పర్యము.

"శిరసు పూ"అను శ్రీనాథప్రయోగమున "పూ" అని పుష్పార్థకమునకుఁ బ్రయోగముకానవచ్చుచున్నది. ఇది సమాసపూర్వభాగముకాదు. కనుక పూవు శబ్దములోని లుప్తశేషమనుటకు వీలుకాదు. అని యుదాహరణాశయము.

బాలవ్యాకరణమున "సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు" నను సూత్రమునుదాహరణము లలో పూవు + రెమ్మ = పూరెమ్మ అని యుదాహరించుటచేఁ "బ్రాయిల్లు",

ఇత్యాదులందువలెనే పూవు అను పదములో "పూ" అనునది లుప్తశేషమని తలంపఁబడినది. కాని అట్లు తలంపనక్కరలేదు. పూవు అను పదమువలెనే "పూ" అని వేరొకపదము లోకమునఁ గానవచ్చుచున్నది. అట్టి పూశబ్దమునకు రెమ్మ అను పదముతో సమాసముచెప్పిన పూరెమ్మ అని యగును. పూరెమ్మ అనుదాని సిద్ధికై ప్రాతాదులలో పూవు పదమును జేర్పనక్కరలేదని యీతని యాశయము.

ప్రౌఢవ్యాకర్త యసమాసమున 'పూ' శబ్దము గానవచ్చుచున్నదని వివరణమునఁ జెప్పి "శిరసు పూ" అని యుదాహరించెను కాని యీ కాశీ ఖండ పద్యభాగమునను అసమాసమునందు పూశబ్దము కానరాలేదు. "శిరసు పూ" అనునదియు సమాసమే. కాని పూరెమ్మ మున్నగువానియందువలె సమాసపూర్వభాగమున మాత్రముకాదు. అందుచే నితని వివరణమున "అసమా సంబునన్" అనుదానికి "సమాసేతరస్థలములందు" అని యర్థముసేయక "సమాసపూర్వభాగము కానిచోట్లను" అని యర్థమును జెప్పికొనవలయును.

మఱియు నిచట ప్రాతదియగునిల్లు "ప్రాయిల్లు" అయినట్లే శిరసు పూవగు గగనగంగ "శిరసుపూ గగనగంగ" యయ్యెను. ఇచ్చటను "పూ" అనునది సమాసపూర్వభాగముననే కానవచ్చుచున్నది. ఇదియు పూవుశబ్దము లోని లుప్తశేషమే అనియుఁ దలంపవచ్చును. అప్పుడీసూత్ర మనావశ్యకము. ఉదాహరణమును సరియయినది కాఁజాలదు

ఈ కార్యము లాచ్ఛికములకే వచ్చుననియుఁ దలంపరాదు. బాల వ్యాకర్త యట్లుచెప్పలేదు. కెంధూళి మున్నగునవి తత్సమఘటితములును గలవు.

సూత్రమునందలి బహుళపదబలముచే నైనను దత్సమపద ఘటితస్థలము లందీ కార్యముఁ జేయవచ్చును. ఉత్తరపద మెట్టిదయినను లోపస్థానమగు పూర్వపదముమాత్రము నాచ్ఛికమయియుండినఁ జాలును. బాలవ్యాకర్త యాశయ మట్టిదేయని యీతఁడును ముందుసూత్రమున వివరించుచున్నాడు.

**సూ. సమాసమందుఁ దత్సమంబు పరంబగునపుడును నుగాగమా దులు గానంబడియెడి.** ౧౨

ఉ. "ముంగోపము", "వింజామరము" మొ॥ (వెల్ల+చామరము) సంధియందు వర్ణవికారము. (చూ. సమా. ప. ౭ సూ.)

వ్యా॥ బాలవ్యాకరణమున ''సమాసంబునం బ్రాతాదుల'' ఇత్యాది సూత్రమున కిచ్చిన యుదాహరణములలోఁ దత్సమపదములుకానరాకుండుటచే నాచ్ఛికపదములు పరంబులగునపుడె యీ లోప నుగాగమాదులు వచ్చునని యాతఁడు తలంచినట్లు భాసించుచున్నది. కాని ప్రయోగములుచూడఁ దత్సమ పదములు సమాసమున నుత్తరపదము లగునప్పుడును నిక్కార్యములు రావచ్చు నని యాతఁడు చెప్పుచున్నాడు బాలవ్యాకర్త కిట్టి యభిప్రాయముగలదని పూర్వసూత్ర వ్యాఖ్యానమున వివరించితిని. బాలవ్యాకర్త ''కెంధూళి'' ఇత్యాది ప్రయోగంబులునుం గలవని నుడివి యట్టివానిని నిరసింపలేదు.

అకారణముచేత బాలవ్యాకర్త తత్సమపదంబు పరంబగునప్పుడును నీ కార్యములు వచ్చునని యభిప్రాయపడినట్లు స్పష్టమే. దానిన యీతడీ సూత్రమున వివరించెను. ముందు + కోపము = ముంగోపము. తొలియచ్చు మీఁది వర్ణములకు లోపమువచ్చిన ''ము'' మిగులును. నుగాగమ ద్రుతకార్య ములు రా, ముంగోప మయ్యెను. సమాసము ౨వ. సూత్రమనగాఁ ''గ్రొత్తాదులు లుత్తశేషంబులు దేశ్యంబులతోడం బలెఁ దత్సమంబుతోడం గొన్నియెడలఁ గర్మధారయంబగు''నను సూత్రముచేతఁ దత్సమములతో సమాసము వచ్చినఁ గ్రొత్తాదులలోనివే యీ రెండును నని భావము. ఆ సూత్ర మనావశ్యక మనియు వివరణప్రాయమనియు తద్దృష్టమునఁ జెప్పఁబడును. వెల్ల యను పదమునకు ''విం'' అనునది సంధియందు వర్ణవికారమని వ్రాయుచున్నాడు, (చూ.శ ర.) అట్టిదెచ్చుటను బాలవ్యాకర్తగాని, యీతఁడు గాని విధించి యుండలేదు. ఈ వర్ణవికార మెట్లువచ్చునని తలంచెనో సూచింపలేదు. అంద దుకు ప్రభృతియని భావింపవలయునుగాబోలును. ప్రాతాదిసూత్రమునందలి బహుళగ్రహణముచేతఁ గ్రిందు శబ్దశేషమునకు దీర్ఘమువచ్చినట్లు వెల్ల శబ్దశేష మున నికారముంగూడ వచ్చెనని తలంచుట యుచితము.

కన్ అను పదమువలె మున్ అనునదియు నొకపదముగలదు. మున్ను, మును, మున్ అనునవి సమానార్థకములు.

అట్టి పదమునందలి నకారమునకుఁ ''గోపము'' అను పదము పరమగు నపుడు ద్విత్వకార్యములురాఁగా ముంగోపము, ముఙ్గోపము అను రూపములు సిద్ధించును. కావున నీపద మిచ్చుట ననుదాహార్యము. విం జామధ మనునది

ప్రాతాదిసూత్రముచేతన సిద్ధించును. ఈ సూత్రము కేవలము ప్రాతాది సూత్రమునకు వివరణప్రాయ మనవలయును.

బాలవ్యాకర్త ప్రాతాదిసమాసములలో తత్సమపదముల నుదాహరింప కుండుటచే నట్టిచోట్ల నీ లోప ను గాగమాదులు రావని తలంచెనని ప్రౌఢ వ్యాకర్త యభిప్రాయపడి యీ సూత్రము వ్రాసెను కనుకనే "క్రొత్తాదులు లుప్తశేషంబులు" ఇత్యాది (సమాస ౨౮ సూ) సూత్రముచే మఱల సమాస మును విధించుకొనెను. ఈ సూత్రము సమాసమునైనను విధింపనక్కరలేదు. బాలవ్యాకరణ సమాసపరిచ్ఛేదము· సూత్రముచేఁ గర్మధారయ సమాస మెట్లును బ్రాప్తించుచున్నది.

**సూ. అను కొను లోనగు ధాతుజవిశేషణముల యుత్త్వోకారమునకు హల్లు పరంబగునపుడు లోపంబు వైకల్పికంబు. ౧౩**

ఉ. 'గిరివ్రజమన్పురంబు' భార. సభా.౧ ఆ ౧౭౨. "జడి గొన్ కోర్కుల నింతి తాను మగవేషంబూని" సత్య.౩ ఆ.౧౦౫. "తోడువింటివాఁడు చన్ త్రోవఁ బోక" ఆము.౬ ఆ.౭౮.

వ్యా॥ అను, కొను, చను, మున్నగు నువర్ణాంత ధాతుజవిశేషణముల చివరనున్న యుకారమునకు హల్లు పరంబగునపుడు వికల్పముగా లోపము వచ్చునని సూత్రతాత్పర్యము జడిగొను + కోర్కులు. ఉకారలోపమురాఁగా జడిగొన్కోర్కులు. అను + పురంబు = అన్పురంబు. చను + త్రోవ = చన్త్రోవ. ఈ నువర్ణము ఆగమాద్యాత్మకము కాకపోవుటచే ద్రుతముకాదనియు నక్కా రణమున "ద్రుతస్వరంబునకేని" ఇత్యాది బా॥సూ॥చే॥ నుకారము లోపింప దనియు నాశయము. కాని (బా॥ప్ర॥౫౧౬॥సూ) "పదాంతంబులయి యసం యుక్తంబులయిన" నిత్యాది సూత్రముచే నుగారము లోపించును. సమాసము నందు పూర్వపదముగానున్న ధాతుజవిశేషణమునందలి నుకారముగూడ పదాంతాసంయుక్త నువర్ణమగుటలో నాటంక మేదియునులేదు. సమాస మందున్న నుకారముల కీ విధి వర్తింపదని బాలవ్యాకర్త చెప్పియుండలేదు. కావున నీ సూత్ర మనావశ్యకము.

ఈ యుత్వలోపము వైకల్పికము కావున రానిపక్షమున "అను పురంబు" "జడిగొనుకోర్కులు" అనియు నుండును.

సూ. నెన్నడాములన్ నెఱి దగు. ౧౪

నెన్నడ. నెన్నడుము. ఇత్యాదులందు నెఱి శబ్దము పూర్వ పదంబుగా నుండుట యుక్తమగునని యర్థము. నెఱ పూర్ణార్థకము, నెఱి రమ్యార్థకము.

వ్యా॥ బాలవ్యాకరణమున సంధి ౩౯ "సూ" నెఱ + నడుము = నెన్నడుము అని యుదాహరింపఁబడెను. కాని నెన్నడుము మున్నగుచోట్లఁ బూర్వపదము "నెఱ" అనునదికాదనియు, "నెఱి" అనునదియనియు నీతని యాశయము. నెఱ అను పదమునకుఁ బూర్ణమని యర్థము కావున నది సందర్భానుగుణముగా నుండదు. నెఱి అనునది రమ్యార్థకము గావున సరిపడును. నెన్నడుము = రమ్యమైన నడుము, నెన్నడ = రమ్యమగు నడక యని తాత్పర్యము.

సూ. కొన్ని యెడల నవర్ణంబు పరంబగునపుడు పూర్వ పదాంత్య డకారంబు నకారం బగు. ౧౫

ఉ. రెన్నాళ్లు. 'క. పదిదినము లైదుప్రొద్దులు, పదపడి రెన్నాళ్లు నొక్కపగలున్ రేయున్; భార. ఆది. ౧ ఆ ౬౮. మూన్నాళ్ళు. "ఎ. గీ. చెఱఁగు మాసిన మూన్నాళ్ళు సిగ్గుతోడఁ బతి విలోకనమూర్గంబు పరిహరించి; కాశీ ౨ ఆ. ౭౨. వేన్నాళ్ళు. "తే. వళ్లనీళుల నొండె వేన్నాళ్ళనొండెఁ గడుగ జాతఁ దోమినవొండెఁ గలుగు శుద్ధి. మార్క. ౩ఆ. ౨౫౪.

వ్యా॥ రెండుపదముల సమ్మేళనమునఁ బూర్వపదము చివర డకారంబుండి రెండవ పదము మొదట నకారం బుండెనేని యాడకారము కొన్నిచోట్ల నకారమగునని సూత్రార్థము. రెండు + నాళ్ళు. ఇచ్చట డకారంబు నకారముగా మారి, రెన్ + నాళ్ళు = రెన్నాళ్ళు అని అయినది.

ఈ యుదాహరణములలో డకార మంతమునలేదు. ఉపధగానున్నది. అందుచేఁ జివరనున్న యచ్చుతోఁగూడిన డకారమును గ్రహింపవలయును. అనగా చివరి యక్షరమని గ్రహింపవలయునేగాని వర్ణమని తలంపరాదు. అక్షరమనగా నచ్చును దాని కత్తియుండు హల్లులును. రెండు అనుచోట "రె"

ఒక యక్షరము "ండు" మరియొక యక్షరము, ఇందు రెండవ యక్షరమనగా "ండు" అనునది యగును. దానికి బదులుగా "న్" అనునదివచ్చి "రెన్" అయి ఉత్తరపదముతోఁగలిసి "రెన్నాళ్లు"అని యగును. అనునాసికము కొన్ని చోట్లఁ బూర్వాచ్చునకును, గొన్నిచోట్లఁ బరాచ్చునకు నంగముగా నుండును. పరాచ్చుతో సంబంధించి యుండుటయే తఱచుగాఁ గానవచ్చుచున్నది. కనుకనే ప్రాసాక్షరమునకు పూర్వమున ననుస్వారమున్నచోఁ బ్రాసస్థలమున నంతటను ననుస్వార ముండవలయునను నియమము పాటింపఁ బడుచున్నది. అట్టిచోట్లఁ బూర్వాచ్చునకు సంబంధించినదే యనుకొనినచో ప్రాసనియమముతో దీనికి సంబంధము లేకయేపోవును. "పూర్వస్యపరస్యవా అంగంభవతి" అని. ప్రాతిశాఖ్యము (చూ. చిం. వి. ప)

ఇట్లే మూడు + నాళ్ళు = మూన్నాళ్ళు. వేడి + నీళ్ళు = వేన్నీళ్ళు.

ఈ పదములలో వ్యవహారమున రెణ్ణాళ్ళు. మూణ్ణాళ్ళు. వేణ్ణీళ్ళు అని ణకారము వినవచ్చుచున్నది. కాని నకారము వినఁబడలేదు. మూర్ధ స్థానికమగు డకారమునకు వచ్చు నాదేశము మూర్ధన్యమగు ణకారమగుటయే స్వాభావికముగాని దంత్యమగుట సరికాదు. కావున నీ సూత్రమున "డకారము ణకారంబగు"నని సూత్రించుట యుచితము. అప్పు డీణకారసంయోగముచే రెండవ పదము మొదటినున్న నకారముగూడ మూర్ధన్యముగా మారి "వేణ్ణీళ్ళు" అని యగును. కావున నట్లును విధించుట యుచితము. లేదా నాళ్లు ఇత్యాదులందు మూర్ధన్యమగు ళకారమునకు దంత్యలకారముతో సంయోగమువలె నిచ్చటను మూర్ధన్య ణకారమునకు దంత్యనకారముతో సంయోగముండునని యైనను దలంపవచ్చును. పైరెండు స్థలములందును నుచ్చారణమున మూర్ధన్యమే వినవచ్చుచుండును.

**సూ. హలవసానంబులు పరంబులగునప్పు డేమి శబ్దముయొక్క మికారమునకు లోపంబు వైకల్పికంబు. ౧౩**

ఉ. "నీకే ప్రాంతియే వెన్నలుంబోలున్; హరి. పూ. ౫ఆ. ౨౩౭. "శివము గ్రియ నుండెదిదే!" భాగ. ౯ స్కం. ౪౦౪.

వ్యా॥ "ఏమి"యను శబ్దమునకు హల్లుపరముయినను, బరమందు వర్ణము లెవ్వియును లేకున్నను "మి" అను నక్షరమునకు లోపము వికల్పముగ నగును.

(అవసానము పరంబగుట యనగా అక్షరము లెవ్వియుఁ బరమందు లేకుండుట) నీకేమి + బ్రాఁతియే = మికారము లోపించి నీకేబ్రాఁతియే అని యయ్యెను. "శవముక్రియనుండెదు, ఇదేమి" అనుచోట ఏమిపదమునకు పరముగా వర్ణము లేవియు లేవుకావున మివర్ణమునకు లోపమువచ్చి "ఉండెదిదే"అని యయ్యెను.

## సూ. షష్ఠీసమాసమందలి నిలల మీఁది యచ్చులకు హల్లు పరంబగుచోఁ గొన్నియెడల లోపంబు గానంబడియెడి ౧౩

ఉ. "శా. ప్రీతిన్ సూరెల నశ్వినీసుతుల రాఁబెంపొందు నింద్రున్వలెన్" ఉ. రా ౨ ఆ. 33. "తూలె రజనీచర భాస్కర బింబము ఱ్రుచుల్" రామా. ౫ ఆ ౭౫. అజ్ఞానసాంకముల్ పెంపు" చంద్రా ౧ ఆ ౧౮౭.

వ్యా॥ షష్ఠీతత్పురుష సమాసమున మొదటి పదము చివరనుండెడి ని. ల. అను వానిలోనంగల "ఇ" "అ" అను నచ్చులకు హల్లుపరమగునపుడు కొన్నిచోట్ల లోపము వచ్చుచుండును. ఇంద్రునియొక్క + వలెన్ = సమాసము ౩౮ వ. సూ॥ చే వలె పరంబగుటచే షష్ఠీవిభక్తి వచ్చెను. "సమాస విభక్తికి లోపంబగు" నను బా॥ వ్యా॥ సూ॥ చేఁయొక్క లోపించును. పిమ్మట "ని"అను దానిలోని ఇకారమునకు ఈ సూత్రముచే లోపము—ఇంద్రున్వలెన్ అని యగును.

ఇట్లే భాస్కరబింబములయొక్క + రుచుల్ = భాస్కరబింబముఱ్రుచుల్ అజ్ఞానసాంకములయొక్క + పెంపు = అజ్ఞానసాంకముల్ పెంపు. వీనియందు "ల" అను దానిలోని అకారమునకు లోపము.

ఇది నూతన విషయము. ఈ విషయమును బాలవ్యాకర్త చెప్పియుండ లేదు. ఇంద్రుంబలెన్ అను పాఠమున ద్వితీయ వచ్చుటకు మార్గములేదు. ఉప మేయము ద్వితీయాంతము కాదుగదా? సమాస ౩౮ సూ. చే. ద్రుతము వచ్చుచో ఇంద్రుడుంబలెన్ అని డువర్ణకము వినవచ్చును. కావున నా పాఠము సీతారామాచార్య సమ్మతముకాదు. "తూలెరజనీచర... అనుచోట బింబములు రుచులను తూలెన్ = బింబములు కాంతులను విడచెన్. అని యన్వయించుట యుచితము. "తూలు" ధాతువు తలగు అను ధాతువువలె నంతర్భావిత ప్రేరణ మని గ్రహింపనగును. చూ. క్రి. ప. ౩౪ సూ॥

సూ. మధ్యమపురుష ముపర్ణకంబున కచ్చుపరంబగునపుడును గొన్నియెడల లోపంబు చూపట్టెడి. ౧౮

ఉ. ఆడిదె నీదు పందెము. కళా ౯ ఆ. ౧౧౬. "భవచ్చిత్తేప్సి తంబెద్ది చెప్పనినన్" మార్క ౧ ఆ. ౧౨౭.

వ్యా॥ చూడుము మున్నగు పదములందలి మధ్యమపురుష ముపర్ణకము నకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము బాలవ్యాకర్త చెప్పెను. (చూ. బాల సూ ౪౭ సంధి) అచ్చు పరమగునపుడు వ్యతిరేకార్థకమయినపు డును, అమ్రేడితము పరమగునపుడును, దప్ప లోపము నాతడు చెప్పలేదు. చూడుమనియె అనుచోట నచ్చుపరమగుటచే లోపము లేదనియు నాతడు చెప్పెను. కాని కొన్నిచోట్ల నచ్చుపరమయినను లోపమువచ్చునని ప్రౌఢ వ్యాకర్త సవరించుచున్నాడు. ఆడుము + ఇదె = ముపర్ణకలోపము. ఉత్వసంధి "ఆడిదె" చెప్పుము + అనినన్ = చెప్పనినన్.

("అడితె నీదుపందెము" అనియే సరియగు పాఠము అట్లే చెప్పనినన్ అనుచోట చెప్పనినున్ అనునదియే సరియగు పాఠము. కానిచో యతిభంగ మగును. భవచ్చిత్తేప్సితంబెద్దిచె, ప్పనినున్ సంతత సత్యపాలనుసిగాఁ బుణ్యుం డుకాఁ జూచితిన్ అను పద్యమున "పు" అనునది యతివర్ణముగదా అని సుబో దిని). ఈ సూత్రము బాలవ్యాకరణమునకు వివరణము.

సూ. ధ్వన్యనుకరణ శబ్దముల కనుధాతువు పరంబగుచోఁ గొన్ని యెడల ముగాగమం బగు. ౧౯

ఉ. కనకనమను. రామా. ౬ ఆ. "సలసలమను. పాండు. ౫ ఆ. ౨౦౭ మొ.

వ్యా॥ కొన్ని ధ్వనుల స్వరూపము నక్షరములతో ననుకరించుటగలదు. "కనకనలాడు నిప్పులు" "సలసలమరగు నీరు" ఇట్టివి ప్రసిద్ధములు. కాని యిట్టి శబ్దముల ననుకరించునప్పు డొక్కొకచో "అను"ధాతుజరూప మాశబ్ద ములకుఁ బరమగుచుండును. అట్టిచో వాని కనుధాతువు పరమగునపుడు ముగాగ మము కొన్నిచోట్ల చేరును.

కనకన + అను = ముగాగమముచేరి కనకనమను అనియగును. ఇట్లే సలసల + అను = సలసలమను. ముగాగమమనగా మకారమనియేగాని "ము" అనునదని తలంపరాదు అట్లయినచో ఆగమము చేరిన పిమ్మట ఉత్వసంధి కూడఁ జేయవలసివచ్చును ప్రక్రియాగౌరవమేర్పడును. కనుక ఉకార ముచ్చారణార్థకమనియు కకార మిద్వర్ణమనియుఁ దెలియఁదగును.

సూ. ధ్వన్యను కరణశబ్దంబులు ద్విరుక్తంబుల యగు. ౨౦

గడగడ. వడవడ. తళతళ. వెళవెళ. మొ

వ్యా॥ పూర్వసూత్ర వ్యాఖ్యానమునం జెప్పినట్టి ధ్వన్యనుకరణ స్వరూపములగు శబ్దములు రెండుసారులుచ్చరింపఁబడినవియే యగుచుండును. "గడ" అను ధ్వన్యనుకరణశబ్దము ద్విరుక్తమయి "గడగడలాడెన్" ఇత్యాది రీతిని బ్రయోగింపఁబడును ఒక్కసారిమాత్రము పలుకఁబడి గడ, వడ, అని ప్రయోగింపఁబడవు అని తాత్పర్యము. గడగడ ఇత్యాదు లుదాహరణములు.

ఆలోచింపఁగా ధ్వన్యనుకరణశబ్దములును గొన్నిచోట్ల నద్విరుక్తములు కానవచ్చుచున్నవి. "రివ్వుమని యెగిరెను", "తటాలునన్నెగసె" మున్నగునవి సుప్రసిద్ధములుగదా!

కావున సూత్రమున "ధ్వన్యనుకరణశబ్దంబులు ద్విరుక్తంబులు నగు" నని రచింపఁబడుట యుచితము. (ఈయది బాలవ్యాకరణానుక్తమగు నూతన విషయము) ఇట్లనుటచే ధ్వన్యనుకరణశబ్దము లెప్పుడును ద్విరుక్తములయి యుండునను నభిప్రాయము సరికాదని తెలియఁదగును.

సూ. ఇయ్యవి క్రియావ్యవహితంబులు నగు. ౨౧

ఉ. "వడవడ జమదగ్నిసూతి వడఁకెన్" రామా. ౭౮. ౧౭౦.

వ్యా॥ ఇయ్యవి = పూర్వోక్తములగు వడవడ మున్నగు ధ్వన్యనుకరణ శబ్దములు; క్రియావ్యవహితంబులు = క్రియాపదమునకు దూరముగానున్నవి. అనగా క్రియాపదమునకుఁ బ్రక్కనేయుండక మఱికొన్ని పదములతో వ్యవధానము గలవియును నగును.

ధ్వన్యనుకరణశబ్దము లెప్పుడును నొకపనిలోని తీరునే చెప్పును. ఆ కారణముచే నవి క్రియావిశేషణములే తప్పక కావలయును, వీనికి విశేష్యముగా

''అను'' ధాతువు తఱచు ప్రయోగింపఁబడుచుండును. కొన్నిచోట్ల నితర ధాతువులును విశేష్యములుగాఁ బ్రయోగింపఁబడవచ్చును. అనుధాతువు విశేష్యమగు నపుడు వేరొక క్రియాపద ముండవలయునను నియమమును లేదు. సలసలమను నీరు, కనకనమను నిప్పులు. మున్నగుచోట్ల ననుధాతువుమాత్రమే ప్రయోగింపఁ బడెను ఇతరదాతువులును "గడగడలాడెన్, తళతళ మెరసెన్" మున్నగుచోట్ల విశేష్యములుగాఁ బ్రయోగింపఁబడుచున్నవి. ఇట్లు ఇతరధాతువులకు విశేషణము లగునప్పుడు తఱచుగా విశేష్యములగు క్రియాపదముల కవ్యవహితములుగనే యీ ధ్వన్యనుకరణశబ్దములు కానవచ్చుచుండుటచేఁ గొన్నిచోట్ల వ్యవహితములుగను నుండవచ్చునని యీ సూత్రమునఁ జెప్పుచున్నాడు.

ఉ॥ జమదగ్ని సూతి అనుపదము వడవడ—వడఁకెన్ అనురెండు పదములకును వ్యవధానమును గల్పించెను. సూత్రమునందలి సముచ్చయార్థక''నువర్ణ''ముచే నవ్యవధానమును సిద్ధించుచున్నది.

ఆలోచింప నీ సూత్ర మనావశ్యకము. ''తెనుఁగున నేకవాక్యంబున నొకానొక్కండు తక్క సర్వపదంబులును గ్రమనిరపేక్షంబుగఁ బ్రయోగింపఁజను'' వను బాలవ్యాకరణ సూత్రముచేతనే యీ వ్యవధానము సిద్ధించుచున్నది. ఏని ప్రభృతి శబ్దంబులకుఁ గొన్నింటికిమాత్రము నియమాపేక్షగలదని యీతఁడు చెప్పెను. క్రియావిశేషణముల కెట్టి నియమమును లేదనియు యథేష్టముగాఁ బ్రయోగింపఁ జనుననియు, నాతని ''చల్లగా గాలి వీచెను'', ''వీచెను గాలి చల్లగా'' నిత్యాద్యుదాహరణములంబట్టి స్పష్టమే. ధ్వన్యనుకరణశబ్దములును క్రియావిశేషణములే. ఆ కారణముచే వీనికిని యథేష్టముగాఁ బ్రయోగము సిద్ధించుచునేయున్నది. ఎచ్చటనేని బ్రయోగక్రమము నియతముగా నుండెనేని ఏని ప్రభృతిగణపాఠముచేతనే వానిని సాధించుకొనవచ్చును. కావున నీ సూత్రము ''ఏకవాక్యంబునందు'' అను బాలవ్యాకరణ సూత్రమునకు వివరణ ప్రాయమే!

**సూ. ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశం బగు. ౨౨**

ఉ. ''కమ్మని లతాంతములకు మ్రొమ్మనసి'' భార.ఆది౫ఆ.౧౩౭

**మత్త.** వృష్టిఁజేసె మ్మహానది దీర్ఘికా సరసీనదంబులు నిండఁగాన్, **ఆది ౩ ఆ. ౧౧౩.**

వ్యా॥ ద్రుతమునకుఁ బ్రాసస్థలమున మకారము పరమగుచో మకార మా దేశముగావచ్చును. ఉ॥ లతాంతములకును + మొనసి—ద్రుతమునకు మకారా దేశము. లతాంతములకుమ్మొనసి ఇచ్చట "కమ్మని" అనుచోటి మకారద్వయ మునకు మిత్రముగా మకారద్వయ ముండవలసిన ప్రాసస్థలముననే "మొ" అను నక్షరమును, ద్రుతమునుగూడ నున్నవి. ఆహేతువుచే ద్రుతము "మ్" అని మారినది. ఇట్లే చేసెను + మహానది = చెసెమ్మహానది ఇదియును ప్రాసస్థలమే.

ఈ విషయము బాలవ్యాకర్త చెప్పలేదు ఇయ్యది యావశ్యకమగు విధానమే ఇదిలేనిచో నిందలి యుదాహరణస్థలములు వేరొక మార్గమున సరి పడవు. "కేచి ద్ద్రుతం త్యభిన్నత్వ మనుస్వార మకారయోః"అను నథర్వణకారిక కుదాహరణముగాన హెూబలపండితుఁడు "కమ్మని. " అనుదానిని చూపెను. కాని బాలవ్యాకరణముచే మకారము పరమగునపుడు ద్రుత మనుస్వార మగు టయును లేదు.

ఈ సూత్రము మకారమును నిత్యముగా విధించుచున్నది. అట్లయిన "న్మ" అనునది ప్రాసస్థలమున నుండవలసిన చోట్లంగూడ నీ సూత్రముచే మకారాదేశమువచ్చును. అప్పుడు ప్రాసభంగ మగును. కావున నీ మకారాదేశ మును వికల్పముగనే విధింపవలయును.

సూత్రమునఁ "బ్రాసంబున" ననుమాటయు ననావశ్యకము. ప్రాస స్థలమున మార్పరానివైయుండుటచేఁ గానవచ్చుచున్నవి. ఇతరస్థలములందు పరిశోధకులు విరోధము లేకుండుటచే మార్చియుందురు. కాని యనుప్రాసాది శబ్దాలంకారస్థలములందును నీ మకారాదేశమువచ్చుట యుంగీకరింపనగును.

ఇందు ద్రుతమునఁగల యుకారమునకు లోపముఁజేసి పిమ్మట మకారా దేశము చేయుట కొందఱ కభిమతము. కాని యుగారలోప మనావశ్యకము. "ను" అను దానికి మకారాదేశము చేసినను రూపము సిద్ధించును. ఉత్వ లోపము ముందుగాఁజేయుట ప్రక్రియాగౌరవమగుటయేకాక నిరర్థకము:—

**సూ. ఆమ్రేడితంబు పరంబగునప్పుడు కృత హ్రస్వంబునకు దీర్ఘంబగు. —౨౩**

**ఉ. లేలెమ్ము. పోపొమ్ము, మొ॥**

వ్యా॥ ద్విరుక్తంబునఁ బరరూపము "ఆమ్రేడిత" మనఁబడును. వ్యాకరణ సూత్రముచే దీర్ఘము హ్రస్వముగా మారినది కృతహ్రస్వ మనఁబడును.

కొన్నియెడలం ద్వరితానాదరార్థంబుల రెంటను నగు. (శబ్ద.౧౧౩) ఆదరార్థంబునం ద్విరుక్తి యగు (శబ్ద ౧౧౧ సూ) మున్నగు సూత్రములచేఁ గొన్ని పదములు ద్విరుక్తము లగును అట్టిచోట్ల ద్వితీయరూపము పరమగునపుడు మొదటి రూపములోని కృతహ్రస్వమునకు దీర్ఘము వచ్చునని తాత్పర్యము.

లెమ్ము, పొమ్ము అనునవి శబ్ద౧౧౩ సూ॥చే॥ ద్విరుక్తములయి "లెమ్ము లెమ్ము", "పొమ్ము పొమ్ము" అని యగును. బాల సంధి ౪౯ సూ॥చే పూర్వ పదము నందలి మువర్ణకమునకు లోపమువచ్చి లెలెమ్ము పొపొమ్ము. అని యగును. అప్పు డీసూత్రముచే లె. పొ. అనువానికి దీర్ఘమువచ్చి లేలెమ్ము, పోపొమ్ము అని యగును.

లేచు ధాతువునకును మధ్యమపురుష ముదర్ణము పరమగునపుడు పిలుచు మొదలగు వానికి ముత్తు పరంబగునపుడు కడవ్రాయి బహుళంబుగా లోపించు (బాల. క్రియ ౧౦౧ సూ) నను సూత్రముచే "చు"లోపము ముజ్ఞుపరంబగు నపుడు దీర్ఘంబునకు హ్రస్వంబును, ముదర్ణకంబునకు మాముడియు నగు (బా. క్రి. ౬౧ సూ) నను సూత్రముచే హ్రస్వద్విత్వములును రాఁగా లెమ్ము అని యయ్యెను. ఇట్లే పోవు ధాతువునకు మధ్యమ ముదర్ణకము పరమగునపుడు పోవునకు గుఙ్మత్తులు ముఙ్ఞం బరంబగునపుడు వు లోపంబుం బొదపదలునువి భాషనగు (బా. క్రి. ౯౨సూ)నను సూత్రముచే వులోపంబువచ్చును. హ్రస్వ ద్విత్వములు రాగా పొమ్ము అనియయ్యెను. కుమారదేవ పండితీయమున నీ సూత్ర మనావశ్యకమని వ్రాయుట సరికాదని బులుసువారు నిరూపించిరి. చూడఁదగును—

త్వరితాద్యర్థంబులందు ప్రక్రియావస్థయందే ధాతువునకు ద్విత్వము రాగా లే + ము, లే + ము అని యుండగా పూర్వరూపమునందలి ముదర్ణకమునకు "ఆమ్రేడితంబు పరంబగునపుడు" ఇత్యాది సూత్రముచే లోపము రాఁగా "లేలెమ్ము" అని యగును. ముదర్ణకము లోపించుటచే హ్రస్వము "లే" అను వానికి రాలేదు. అని చెప్పిన నీ సూత్ర మనావశ్యక మనవచ్చును.

ఇది సంధిపరిచ్ఛేదము.

# శబ్దపరిచ్ఛేదము

ప్రాతిపదికములను శబ్దములని ప్రౌఢవ్యాకర్త యుద్దేశించుచున్నాఁడు. బాలవ్యాకరణమునఁ బ్రాతిపదికలు తత్సమములనియు నాచ్ఛికములనియు రెండు తెగలుగా విభజింపఁబడెను. ఆ రెండుపరిచ్ఛేదములలోని శబ్దములను గూర్చియు నీ పరిచ్ఛేదమున జెప్పఁబడును. అట్టి ప్రాతిపదికములను నామములనుట యాంధ్రవ్యాకరణ సంప్రదాయము. ''ప్రాతిపదికం హి నామ,'' అని చింతామణిసూత్రము సంస్కృతవైయాకరణులును ప్రాతిపదికములను నామములని వ్యవహరించిరి. అందు నామవిశేషములగు సర్వాదులను సర్వనామములనియు నితరములను నామములనియు నీతని వ్యవహారము. తత్పురుషవిశేషములగు సమానాధికరణ సమాసములకుఁ గర్మధారయ సంజ్ఞవలెనే నామవిశేషములగు సర్వాదులకు సర్వనామసంజ్ఞ వ్యవహరింపఁబడెనని తెలియనగును. ఈ రెండువిధములైన శబ్దములలో సర్వనామములను మున్ముందుఁ జెప్పఁగలఁడు. ఇచ్చట సర్వనామములను గూర్చి ముందుగాఁ జెప్పఁబడుటచే నామ ప్రకరణమని నిర్దేశించెను. నామములు సుప్రత్యయములతోఁగూడియే ప్రయోగింపఁబడుచుండును.

**సూ॥ శబ్దములు విశేష్యములు విశేషణములని ద్వివిధంబులు. ౧**

**అయ్య, అన్న, అమ్మ, అక్క మొదలగునవి విశేష్యములు. తక్కినవి విశేషణములు.**

విశేషణ విశేష్యముల లక్షణముల ననంతరసూత్రమునం జెప్పును. సూత్రవివరణములు స్పష్టార్థములు. తక్కినవి యనఁగా బ్రాహ్మణుఁడు, పోవువాఁడు, మున్నగునవి విశేషణములని భావము.

ఈ సూత్రము శబ్దములను విభాగము మాత్రము చేయుచున్నది. ఇట్టి విభాగమునకు వ్యాకరణసూత్రము లనావశ్యకము. విశేషణ విశేష్యముల లక్షణములను జెప్పుట యింకను గొంతయుపయోగించును గాని ఈ విభాగము నిరర్థకము.

**సూ. విశేష్యము నా విశేషణముచేఁ దెలుపఁబడు విశేషము కలది. విశేషణము నాజాత్యాది విశేషములను దెలుపునది. ౨**

వ్యా॥ జాత్యాది విశేషములు - అనఁగా జాతి, క్రియ, గుణము మున్నగునవి అట్టివిశేషములను దెలియఁజేయు బ్రాహ్మణుఁడు, పోవువాఁడు, నల్లనివాఁడు, మున్నగునవి విశేషణము లనఁబడును.

బ్రాహ్మణుఁడు అను శబ్దము బ్రాహ్మణత్వము, అను "జాతి" యగు విశేషమును బోధించుచున్నది. పోవువాఁడు అను శబ్దము "పోవుట" అను క్రియయగు విశేషమును బోధించుచున్నది. నల్లనివాఁడు అను శబ్దము "నలుపు" అను గుణమగు విశేషమును బోధించుచున్నది. ఇట్లీశబ్దములు జాత్యాదివిశేషముల బోధించుచుండుటంజేసి విశేషణము లనంబడును.

గమనింపఁదగ్గవిషయ మింకొక్కటి గలదు. జాత్యాదివిశేషములను దెలియఁజేసినంతమాత్రమున విశేషణములనరాదు. ఆవిశేషములు కల్గియున్నట్లు, ఆ శబ్దము బోధింపవలయును. "బ్రాహ్మణుఁడు" అను శబ్దము "బ్రాహ్మణత్వ జాతిగలవాఁడు" అను నర్థమును బోధించుచున్నదిగదా. కేవలము "బ్రాహ్మణ్యము" అను శబ్దము జాతియనువిశేషమును జెప్పుచున్నను నయ్యది విశేషణ మనఁబడదు. కావున "జాత్యాదివిశేషములతోఁ గూడియున్నది అను నర్థము నిచ్చు శబ్దము విశేషణమనఁబడును. బ్రాహ్మణ్యముగలవాఁడు, పోవుటగల వాఁడు, నలుపుగలవాఁడు, అను రీతిని ఒకధర్మముగలవాఁడు అని బోధించు శబ్దము విశేషణ మనఁబడును.

ఇవ్విధమగు విశేషణముచే బోధింపఁబడుచున్న జాత్యాదివిశేషము లెచ్చటనుండునో దానిని బోధించుశబ్దము విశేష్యమనఁబడును. నల్లనిగుఱ్ఱము అనుచోట నల్లని అను విశేషణముచే బోధింపఁబడుచున్న నలుపు అను విశే షముగలది గుఱ్ఱము కనుక దానిని బోధించు గుఱ్ఱము అను శబ్దము విశేష్య మయ్యెను. ఇట్లు తెలియనగును.

ఈ సూత్రమున విశేష్యమును వివరించుటలో విశేషణము అను శబ్దము చేరియున్నది. కావున ముందుగా విశేషణమును వివరించి పిమ్మట విశేష్యమును వివరించుట యుక్తము.

**సూ. విశేషణము జాత్యాదిభేదంబులచే షడ్విధంబు** 3

అవి - జాతిప్రయుక్తవిశేషణము, క్రియాప్రయుక్తవిశేషణము, గుణ ప్రయుక్తవిశేషణము, ద్రవ్యప్రయుక్తవిశేషణము, సంఖ్యాప్రయుక్తవిశేషణము, సంజ్ఞాప్రయుక్తవిశేషణము.

ఉ:- (౧) జాతిప్రయుక్తవిశేషణమునకు — బ్రాహ్మణుఁడు.
(౨) క్రియాప్రయుక్తవిశేషణమునకు — పోవువాఁడు.
(౩) గుణప్రయుక్తవిశేషణమునకు — నల్లనివాఁడు.
(౪) ద్రవ్యప్రయుక్తవిశేషణమునకు — ధనవంతుఁడు.
(౫) సంఖ్యాప్రయుక్తవిశేషణమునకు — ఒక్కఁడు.
(౬) సంజ్ఞాప్రయుక్తవిశేషణమునకు — దేవదత్తుఁడు. మొ॥

వ్యా॥ వెనుకఁ జెప్పబడిన విశేషణము ఆఱువిధములుగా నుండును. విశేషణముచే బోధింపఁబడు విశేషములు ఆఱుతెఱంగుల నుండునుగావున విశేషణము ఆఱువిధములు గలదని చెప్పఁబడెను.

జాతియనఁగా ననేక వ్యక్తులయందుండు ధర్మము. బ్రాహ్మణత్వము ఒక్కవ్యక్తియందుఁగాక అనేకులయం దుండును. కాన నది జాతి యగుచున్నది. ఇట్లే వస్త్రము, పుస్తకము మున్నగునవియు జాతివాచకములు. చంద్రుఁడు మున్నగునవి ఒక్కవస్తువును బోధించునవగుటచే జాతివాచకములు కాఁజాలవు.

క్రియ అనగా పని. వచ్చుట, పోవుట మున్నగునవి. పోవువాఁడు అను విశేషణము క్రియను బోధించుచుండుటంజేసి క్రియాప్రయుక్తవిశేషణ మనఁబడును.

ద్రవ్యమనఁగా నొకపదార్థము ధనము, దండము, పుస్తకము మున్నగునవి ద్రవ్యములు. ధనవంతుఁడు, దండి, పుస్తకవంతుఁడు మున్నగునవి ద్రవ్య ప్రయుక్తవిశేషణము లనఁబడును.

ఇచ్చట ద్రవ్యమనగా లోకమునంగల వాడుకనుబట్టి ధనమని యర్థముగాఁ దలంపరాదు. ధనవంతుఁడు అను నుదాహరణముగూడ నీ భ్రాంతికిఁ దోడ్పడియుండవచ్చును. అట్లు దలంచినచో ''దండి'' యను విశేషణము ఏజాతికిఁ జెందును. ద్రవ్యమనఁగా సంస్కృతభాషలో ధనమని వాడుకయు కలదు. ద్రవ్యమనఁగా జాతి, గుణ, క్రియా ప్రవృత్తినిమిత్తకముకాని ఏకైక వస్తువు అను నర్థముగూడ నాలంకారికాది శాస్త్రజ్ఞుల వ్యవహారమున నున్నది. చంద్రాదిశబ్దములు ఆ పక్షమున ద్రవ్యబోధకములు.

సంఖ్యయనఁగా లెక్కించుట. దానికి సంబంధించు విశేషణము సంఖ్యాప్రయుక్తవిశేషణము. సంజ్ఞయనఁగాఁ బేరు. దేవదత్తుఁడు అనునది ఒకవ్యక్తికి నామధేయము,

విశేషణముల నిట్లానావిధములుగా సంస్కృతవైయాకరణులు విభజింప లేదు శబ్దములయొక్క భేదములను విశేష్యములు, విశేషణములు అని రెండు విధములుగాఁగూడ తలంపలేదు అన్నిశబ్దములును వివక్షనుబట్టి విశేష్యములు గాని, విశేషణములుగాని సందర్భమునుబట్టి కావచ్చును "బుద్ధిమంతుఁడగు కుమారుఁడు" ఇచ్చట కుమారుఁడు అనునది విశేష్యము. "దశరథుని కుమారుఁడగు రాముడు" ఇచ్చట "కుమారుఁడు" అనునది విశేషణము. ఇట్లన్నిశబ్దములును వివక్షనుబట్టి విశేషణములును విశేష్యములునుగూడఁ గావచ్చును.

ప్రౌఢవ్యాకర్తచేసిన విశేష్య విశేషణ విభాగము సరిపడుటయుఁ గష్టము. ఈతడు విశేష్యములుగాఁ జూపిన శబ్దములును నొక్కొక్కచో విశేషణములుగాఁ బ్రయోగింపఁబడును. మాయమ్మయగు యశోద, మాయన్న యగు దేవదత్తుఁడు ఇత్యాదులందు, అమ్మ, అన్న అనునవి విశేష్యములుగగాక విశేషణములుగనే వాడఁబడినవి. విశేషణములుగాఁ జెప్పఁబడిన దేవదత్తుఁడు విశేష్యముగా వాడఁబడినది వీరిమతమున యశోదయనునదియు విశేషణమే యైనను ఇచ్చట విశేష్యమే యయ్యెను. దేవదత్తుఁడు, యశోద, మున్నగు విశేషణములు ఇందలి ౨౨వ. సూత్రముచే విశేష్యములయినం గావచ్చును. "విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షకంబులగు". (౧౨ సూ.) అను సూత్రముచే విశేష్యలక్షకంబులయినం గావచ్చును కాని విశేషణములగుటకు ప్రౌఢవ్యాకరణము అవకాశము నీయదు. కీడు, నల్ల, మున్నగు తెలుఁగుశబ్దములకు ౧౦ వ. సూత్రముచే నుభయధర్మము లుండిన నుండవచ్చునుగాని పిత, భ్రాత మున్నగు తత్సమశబ్దములు విశేషణములగుటకు మార్గములేదుగదా!

ఇంగ్లీషువ్యాకరణములందు భాషాభాగములు అనుపేర పదములను నామవాచకములు, విశేషణములు, సర్వనామములు ఇత్యాదిపద్ధతిని విభజించుట గలదు. ఆపద్ధతిని జూచి వీరును శబ్దముల నిట్లు విభజించియుండఁగురు.

ఇఁక విశేషణముల విభాగముగూడఁ గొంత చర్చనీయముగా నున్నది. సంజ్ఞావాచకములు సామాన్యముగా విశేష్యములుగనే ప్రయోగింపఁబడుచుండును బ్రాహ్మణాదిజాతి ప్రయుక్తశబ్దములును జాలచోట్ల విశేష్యములుగనే వాడఁబడును. క్రియా గుణ ద్రవ్య సంఖ్యా ప్రయుక్త విశేషణములు తఱచుగ విశేషణములే యగుచుండును. ఎచ్చటనైనను విశేష్యము వేఱుగాఁ బ్రయోగింపఁబడనిచో విశేష్యలక్షకము లగుచుండును.

"ఒక్క ధనవంతుఁడు గలఁడు" ఇత్యాదులందు "ధనవంతుఁడగు పురుషుఁడు." ఇత్యాదిరీతిని విశేష్యలక్షకము లగుచుండును శబ్దములను శాస్త్రకారులు జాతి, గుణ, క్రియా, సంజ్ఞ లను నుపాధులనుబట్టి చతుర్విధములుగా విభజించిరి. అట్టివిభాగము చాల నుచితమైనది

విశేషణముల విభాగమున నీ నాలుగువిధములుగాక (జాతిగుణ క్రియా సంజ్ఞలు) సంఖ్యాప్రయుక్తములును, ద్రవ్యప్రయుక్తములును నధికములు. ఈ రెంటిలో సంఖ్యగూడ గుణమగుటచే గుణప్రయుక్తములలో నేకాదిశబ్దములు చేరిపోవుననియు, ద్రవ్యప్రయుక్తవిశేషణము జాతివాచకములలోఁ జేరిపోవుననియు వారియభిప్రాయము

సూ. సంఖ్యాప్రయుక్తవిశేషణ మేకాంతంబయి యమహద్విశేష్యక మయ్యుఁ, దదంశాంతంబయి మహదమహద్విశేష్యకమయ్యు సమస్తంబు వ్యస్తంబు నగుచో విశేష్యంబు క్రమంబుగ నుత్తరపదంబు నేకవచనాంతంబును, పూర్వపదంబు బహువచనాంతంబునగు. ౪

తదంశము=ఆ యొకటియొక్క భాగము. అనఁగాఁ బాతికలోనగునది.

ఉ. డెబ్బదియొక్కరథము. రథములు డెబ్బదియొక్కటి; రెండున్నర మానిసి. మానిసులు రెండున్నర; రెండున్నరరూపాయ. రూపాయలు రెండున్నర మొ॥

వ్యా॥ సంఖ్యాప్రయుక్తవిశేషణము=సంఖ్యావాచకము అగు విశేషణము ఒకటి, రెండు మున్నగునవి. ఏకాంతంబు=ఒక అను సంఖ్య అంతమునఁగలదైయుండునది. అమహద్విశేష్యకము=అమహదర్థకశబ్దము విశేష్యముగా గలది

తదంశాంతంబయి=ఏకశబ్దార్థముయొక్క భాగమును బోధించు అర, పాతిక మున్నగుశబ్దములంతమునఁ గలదయి (రెండున్నర మున్నగురీతిని) మహదమహద్విశేష్యకము=మహద్వాచకముగాని యమహద్వాచకముగాని విశేష్యముగాగలది.

సమస్తంబు=సమాసమునఁ జేరియున్నది వ్యస్తము=విడిగానున్నది. అనగా సమాసమునం జేరనిది.

ఈ సూత్రమును నాలుగువాక్యములుగా నీ క్రిందిరీతిని విడఁదీయనగును.

(1) సంఖ్యాప్రయుక్తవిశేషణము ఏకాంతమయి యమహద్విశేష్యకమయి సమస్తంబగుచో విశేష్యంబు ఉత్తరపదంబును నేకవచనాంతంబునగు.

ఉ. డెబ్బదియొక్కరథము.

ఇందు డెబ్బదియొక్క అను సంఖ్యావిశేషణము ఏకశబ్దము అంతమునఁ గలదియు, "రథము" అను నమహద్వాచకము విశేష్యముగాఁ గలదియు సమాసమునఁ (డెబ్బదియొక్కరథము అనునది సమాసపదము) జేరినదియు నగుచున్నది. ఆకారణముచే విశేష్యమగు రథశబ్దము సమాసమున నుత్తరపదముగను (రథము అని) ఏకవచనాంతముగను బ్రయోగింపఁబడెను.

(2) సంఖ్యా పయుక్తవిశేషణము ఏకాంతంబయి యమహద్విశేష్యకమయ్యు వ్యస్తంబగుచో విశేష్యంబు పూర్వపదంబును బహువచనాంతంబునగు.

ఉ. రథములు డెబ్బదియొక్కటి.

ఇందు సంఖ్యాప్రయుక్తవిశేషణమగు "డెబ్బదియొక్కటి" అనునది ఏకశబ్ద మంతమునఁ గలదియు, రథములు అను నమహద్వాచకము విశేష్యముగాఁ గలదియు, వ్యస్తమును నయియున్నది. కనుక దాని విశేష్యమగు 'రథములు' అను పదము పూర్వపదముగను బహువచనాంతముగను నున్నది.

(3) సంఖ్యాప్రయుక్తవిశేషణము తదంశాంతంబయి మహదమహద్విశేష్యకమయ్యు, సమస్తంబగుచో విశేష్యం బుత్తరపదంబు నేకవచనాంతంబు నగు.

ఉ. "రెండున్నరమానిసి", "రెండున్నరరూపాయ."

వీనిలో "రెండున్నర" అను పదము లంశార్థకమగు "అర" అనునది యంతమునంగలవి ఈ సంఖ్యావిశేషణము "రెండున్నర మానిసి" అనుచోట మహద్విశేష్యకము. "రెండున్నర రూపాయ" అనుచోట నమహద్విశేష్యకము. ఇయ్యవి సమాసమునం జేరియుండుటచే విశేష్యములగు మానిసి, రూపాయ అను పదములు సమాసమున నుత్తరపదములుగను "మానిసి, రూపాయ" అని యేకవచనాంతములుగనుఁ బ్రయోగింపఁబడెను.

(4) సంఖ్యా ప్రయుక్తవిశేషణము తదంశాంతంబయి మహద మహద్విశేష్యకమయ్యు వ్యస్తంబగుచో విశేష్యంబు పూర్వపదంబును బహువచనాంతంబు నగు.

ఉదా. మానుసులు రెండున్నర, రూపాయలు రెండున్నర, వీనిలో "రెండున్నర" అను సంఖ్యాప్రయుక్తవిశేషణము అంశార్థకమగు "అర" యనుపద మంతమునఁ గలది ఇఁదు "మానుసులు రెండున్నర" అనునది మహద్విశేష్యకము రూపాయలు రెండున్నర అనునది యమహద్విశేష్యకము. ఇచ్చట వ్యస్తముగా నున్నందున విశేష్యములగు మానుసులు, రూపాయలు అనునవి పూర్వపదంబులుగను బహువచనాంతంబులుగను నున్నవి.

"విశేషణ విశేష్యములు లింగవచనవిభక్తులందు సామ్యముగలవయి యుండవలయును" (చూ॥ బాల.వ్యా కా 19 సూ) అను నియమమును తప్పిన స్థలముల నీ సూత్రముచే సవరించెను

"ఏకవాక్యంబునం దొకానొకండుతక్క సర్వపదమ్ములును క్రమనిరపేక్షంబుగాఁ బ్రయోగింపఁజను"నను (బాల. వ్యా. కార. ౩౭ సూ) సూత్రముచే రథములు డెబ్బదియొక్కటి అనుచోట "డెబ్బదియొక్కటి రథములు" అను పదముల పౌర్వాపర్యములు మారుచుండఁగా నట్టిదానిని నివారించుటకు నీ సూత్రము రచింపఁబడెను.

ఈ సూత్రముచే విధింపఁబడిన కార్యములు నిత్యములు. సూత్రమున వైకల్పికములని చెప్పఁబడలేదు. అకారణముచే "డెబ్బదియొక్కరథములు, రెండున్నర మానుసులు, రెండున్నర రూపాయలు" అను రీతిని విశేష్యములకు బహువచనము రారాదు కాని వ్యవహారమున నిట్టి బహువచనముగూడ సుప్రసిద్ధము. కావున సూత్రమున వికల్పశబ్దము చేర్చకపోవుట లోపమని గ్రహింపనగును.

సూత్రము చివరియంశమున "ఉత్తరపదంబును ఏకవచనాంతంబును" అనునట్లే "పూర్వపదంబును బహువచనాంతంబును" అని పూర్వపదంబును అనుచోట సముచ్చయార్థక నువర్ణము లోపింపకయుండుట సమంజసము. అట్లు నువర్ణమిచ్చట వినఁబడుచుండెనేని రెండువాక్యములును సమానరీతి నర్థస్ఫూర్తి గల్గించుచు సరళముగానుండును. కాదేని పూర్వపదంబు అనునది

ఉద్దేశ్యకోటిలోఁజేరి బహువచనాంతమగుట మాత్రమే విధింపఁబడుచున్నట్లు భాసించును. అయ్యది గ్రంథకర్త యాశయము కాదుగదా! అనఁగా సంఖ్యా ప్రయుక్తవిశేషణము ఏకాంతంబయి యమహద్విశేష్యకమయి వ్యస్తంబగుచో (విశేష్యంబు పూర్వపదంబు) పూర్వపదమగు విశేష్యము బహువచనాంతంబగు నను నర్థము వచ్చును అనఁగా "విశేష్యము పూర్వపదమైనచో బహువచ నాంతమగును. పూర్వపదముకానిచో బహువచనాంతము కావలయుననను నియ మములేదు." అను నర్థము వచ్చును అట్టి యర్థము వ్యాకర్తయభిప్రాయమున కనుగుణము కాదుగదా! అనఁగా "విశేష్యము పూర్వపదము కావలయును." అను నియమ మీఁదు విధింపబడునట్లు భాసింపదు. కావున "పూర్వపదంబు" అనుచోట "ను" అను సముచ్చయముచేరి వినవచ్చునట్లు సూత్రము రచియిం పఁదగును.

డెబ్బదియొక్కరథములు, రెండున్నర మానుసులు, రెండున్నర రూపా యలు మున్నగు బహువచనాంత విశేష్యములు ఉత్తరపదములుగానుండు సమాసములును సమ్మతములగునేని సూత్రమునఁగల "ను" వర్ణమున కనుక్త సముచ్చాయకత్వ మర్థముచేయవలయును. కాని యిది క్లిష్టకల్పనము.

**సూ. అయ్యది యేకాంతంబు మహద్విశేష్యకంబు సమస్తంబుకాదు; వ్యస్తంబగుచో బహువచనాంతంబ యగు.** ౩౫

ఉ. పదునొక్కండ్రు రుద్రులు. మొ॥ (చూ. సమాస. ౨౫సూ.)

వ్యా॥ అయ్యది = సంఖ్యాప్రయుక్తవిశేషణము. "ఒక" శబ్దము అంత మునఁ గలదియు విశేష్యము మహద్వాచకముగా నున్నదియునగు సంఖ్యా ప్రయుక్తవిశేషణము సమాసమును జెందదు, అనఁగా వ్యస్తముగనే యుండును. అట్లు వ్యస్తముగానుండునపుడు సంఖ్యాప్రయుక్తవిశేషణమున నంతముననున్న "ఒక" శబ్దము బహువచనముతోడనే యుండును.

ఉదాహరణమున పదునొక్కండ్రు అను సంఖ్యాప్రయుక్తవిశేషణము పదునొక్కరుద్రులు అను సమాసముగా నుండదనియు వ్యస్తముగనే యుండును గావున నప్పుడు "పదునొక్కడు రుద్రులు" అని విశేషణ మేకవచనాంతముగా నుండదనియుఁ దాత్పర్యము.

పదునొక్కరుద్రులు అనురీతి సమాస ముండదనుటకు ప్రయోగములు పరిశీలింపఁదగును. "వ్యస్తంబగుచో బహువచనాంతంబ యగు". అను విధి యనావశ్యకము. విశేష్యమునను సరించియే విశేషణములెల్ల నుండును. వేరొక వచనమున నుండుటకు అవకాశమే లేదు వేరొక వచనమున నుండుచో విధానము ఆవశ్యకమగునుకాని విశేష్యముతో సమానవచనముతో నుండునపుడు బా.వ్యా. కార. ౧౯. సూ. చేతనే వచనము సిద్ధించును.

ఏకాంతమగు సంఖ్యావిశేషణమనఁగా బహుత్వసంఖ్యయే జెప్పును గావున దాని విశేష్యమును (రుద్రులు మొ॥) నయ్యదియుఁ (పదునొకండ్రు)గూడ బహువచనాంతములుకాక తప్పదు అందులకు పునర్విధాన మనవసరము. బహుత్వసంఖ్యను జెప్పునది యెట్లును బహువచనాంతంబ యగును. ఈ విషయము బాల వ్యాకరణమున స్పష్టముగా "అన్ని మొదలగు శబ్దంబులారును ద్విప్రభృతి సంఖ్యావాచకములును మహదర్థంబులు బహువచనాంతంబులగు."అని చెప్పఁబడియే యున్నది. ఏకాంత సంఖ్యావిశేషణము ద్విప్రభృతి సంఖ్యావాచకమేగదా!

సమాసపరిచ్ఛేదము ౨౬ సూ॥చే పదియునొక్కండ్రు రుద్రులు అనియు రూపాంతర ముండునని సూచించెను.

**సూ॥ విశేష్యంబు ప్రధానం బితరం బప్రధానంబు ౬**

వ్యా॥ ఈ సూత్ర మిం దనావశ్యకము. పదశాస్త్రమున విశేషణ విశేష్యములలోఁగల ప్రధానాప్రధానభావముఁజెప్పుటకవసరము గానరాదు. ఏది ప్రధానమయినను, ఏది యప్రధానమయినను నిందు దానినిబట్టివచ్చుకార్యము లెవ్వియును లేవు. అనంతర సూత్రమున మాత్రము ప్రధానశబ్దమును ప్రయోగించి పశ్చాద్వాచ్యంబగుటను విధించెను. ఈ యొక్కచోటను "విశేష్యంబు పశ్చాద్వాచ్యంబగు"నని సూత్రించి యీ సూత్రమును త్యజించిన నెంతయో లాఘవము గల్గును. ఇంకెక్కడను బ్రధానశబ్దముతో విధులు గన్పట్టవు.

పాణినీయమున "ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనం"అను సూత్రముచే నుపసర్జన సంజ్ఞను విధించి "ఉపసర్జనం పూర్వమ్"అను సూత్రముచే నుపసర్జనమునకుఁ బూర్వనిపాతమును విధించెను. అచ్చట లాఘవము నపేక్షించి సంజ్ఞ చేయఁబడెను. ఇచ్చట ప్రధాన విశేష్యశబ్దములలో లాఘవ గౌరవములందు భేదమేలేదు. ప్రధాన సంజ్ఞకు ఏతదనంతర సూత్రమున నీపాటి వినియోగ

మయినం గలదుగాని యప్రధానశబ్దమునకు వినియోగమే కానరాదు. ఈ కారణముచేతనే వాక్యమున విశేషణవిశేష్యములకుఁ బ్రధానాప్రధాన భావమును తెలియఁజేయుటకే యీ సూత్ర ముద్దేశింపఁబడెనుగాని వేరొక ప్రయోజనము గాదని కొందరు తలంచుచున్నారు కాని యట్టి విశేష మిచ్చట సూచింపఁ బ్రసంగము కానరాదు.

**సూ॥** ప్రధానంబు పశ్చాద్వాచ్యం బగు. ౭

అన్వయక్రమమునందు విశేషణములను ముందుచెప్పి కడపట విశేష్యమును జెప్పవలెననుట.

ప్రధానంబు = విశేష్యంబు.

వ్యా॥ ఈ సూత్రము వాక్యమునందు ప్రయోగింపఁబడు విశేష్యవిశేషణముల విన్యాసమునఁగల క్రమమును జెప్పుచున్నట్లు భావింపరాదు కనుకనే వ్యాకర్త దీని వివరణమున ''అన్వయక్రమమునందు''అని వివరించెను.

గద్యపద్యములందు పదము లెట్టిక్రమములోనున్నను ఏయే పదము లేయే పదములతో నన్వయించునో యీ వరుసను ఆ పదములు భాసించినపిమ్మటనే వాక్యార్థము స్ఫురించును అనఁగా వాక్యము ముందుగాఁ జెవినిబడి అన్వయక్రమానుసారముగాపదక్రమముస్ఫురించి తరువాత వాక్యార్థము తెలియఁబడును. ఎట్లన ''రాము సుగుణాభిరాముఁ దలంతునెపుడు''అను వాక్యమును ముందుగా విని ''సుగుణాభిరాముడగు రాముని నెప్పుడుఁ దలంతు''అని యన్వయక్రమానుసారముగా పదములు శ్రుతములై వాక్యార్థమును భాసింపఁజేయును. ఇం దన్వయక్రమమున విశేషణముల ముందుగాఁ జెప్పి విశేష్యమును బిమ్మటఁ జెప్పవలయునని తాత్పర్యము.

ఒక వాక్యమున నర్థబోధమగుటకు మూడవస్థలు కలుగును. ఒకటి వాక్య శ్రవణము, రెండు అన్వయక్రమానుసారి పదోపస్థితి, మూడు వాక్యార్థజ్ఞానము

ఇందు రెండవ యవస్థలోని పదక్రమము నీసూత్రము బోధించుచున్నదని తెలియనగును. అంతియకాని గద్యపద్యములందు వాక్యమున విశేష్యవిశేషణముల విన్యాసక్రమము విధింపఁబడెనని తలంచుట తగదు. వాక్యములందు పదముల విన్యాసము బాలవ్యాకరణముననే (కార ౩౭ సూ.) చెప్పఁబడియెను. కావున బాలవ్యాకరణము (కార ౩౭ సూ.)న కివి యపవాదముగా విశేష్యవిశేషణములు క్రమసాపేక్షములని చెప్పుచున్నట్లు తలంపరాదు. బాలవ్యాకరణాను

సారముగా నప్రమేయుఁడు హరి, హరి యప్రమేయుఁడు, అని రెండు విధము లగు క్రమమును నిర్బాధమే యని తెలియఁదగును.

ఈ సూత్రమును ''విశేష్యంబు పశ్చాద్వాచ్యంబగు''నని మార్చినచో నాలవ సూత్రమును ద్యజింపవచ్చునని మీఁద వ్రాయఁబడెను.

**సూ॥ ఒక్కచో విశేషణంబులును విశేష్యంబు లగు.** ౭

నారదుం డిట్లనియె మె॥

వ్యా॥ ఒకొక్కచోట విశేషణములే విశేష్యములుగాఁ బ్రయోగింపఁ బడునని భావము. నారదుండు అను సంజ్ఞాప్రయుక్త విశేషణము ఇచ్చట విశేష్యముగాఁ బ్రయోగింపఁబడి అనియె నను క్రియలోనికి కర్త యగుచున్నది. కుమారదేవపండితీయమును నీ యభిప్రాయమునే జూపెను. అది సమంజసమే.

ఇచ్చట నారదుఁ డనునది విశేషణమనియు, ఇట్లు అనునది దానికి విశేష్యమనియు చెప్పి యీ రెండు పదములకును విశేష్యవిశేషణభావము గలదనియు భావించుట సరికాదు నారదుఁడనుపదము ఇట్లు అను పదమునకు విశేషణమెట్లగును? వీనికి రెండింటికిని అన్యోన్యాన్వయము లేనేలేదు. ఇవి రెండును అనియె నను క్రియలోనికి ఒకటి కర్తగను, వేరొక్కటి విశేషణముగను నన్వయించును. ''ఇట్లు''అను పదము నెట్లు విశేష్యముగా భావించిరో తెలియదు. నారదుఁడను పదము ''ఇట్లు''అను విశేష్యమునందలి యే విశేషమును దెలుపుచు విశేషణ మయ్యెనో దుర్గ్రహముగా నున్నది. నారదుఁడనునది సంజ్ఞాప్రయుక్తవిశేషణమే అయినను వేరొక విశేష్యములేక యియ్యదియే విశేష్యముగా నిచ్చటఁ బ్రయుక్తము. ''ఇట్లు నారదుఁడు''అను పదములకు విశేష్యవిశేషణభావమే లేకుండుటచే పూర్వపశ్చాత్ప్రయోగములను గూర్చిన శంకయేకన్పట్టదు. అట్టియెడ ''నారదుఁడనునది విశేష్యమే యయినచో ౯వ సూత్రమున కియ్యది యుదాహరణము కావలెను''అనునాపత్తి యిచ్చట తగులదు.

**సూ॥ ఒకొక్కచో విశేష్యవిశేషణంబులు వ్యత్యస్తంబులు నగు.** ౯

ఉ. క. నీ మాఁఱుదల్లి త్రిభువనభామారత్నంబు గంధవతిపై.
హరి. పూ. ౨౯. ౧౭౦ప.

వ్యా॥ ౮వ సూత్రమున విశేషణము మాత్రము విశేష్యముగాఁ బ్రయోగింపఁబడుటను విధించి యీ సూత్రమున విశేష్యముగూడ విశేషణముగా

ప్రయుక్తమగుటచే నొక్కస్థలముననే విశేష్యము విశేషణముగాను, విశేషణము విశేష్యముగాను బ్రయోగింపఁబడుసని చెప్పఁబడెను. అంతియకాని విశేష్యమునకుఁ బూర్వప్రయోగము, విశేషణమునకుఁ బశ్చాత్ప్రయోగమును నిందు విధింపఁబడుచున్నట్లు తలంపరాదు.

ఇచట విశేష్యము మొదటను విశేషణము దాని పిదపనుఁ బ్రయోగింపఁబడుట యనుమతింపఁబడుచున్నట్లు వ్రాయుట సరిగాదు

వ్యత్యస్తంబులు = విశేష్యము విశేషణముగను విశేషణము విశేష్యముగను మారునవి. పూర్వపశ్చాత్ప్రయోగవైపరీత్యమే యిచ్చటఁ జెప్పదలంచెనేని విశేష్యవిశేషణములు అను పదమునకు బదులుగా ప్రధానాప్రధానములు అనునది యుపయుక్తమయి యుండును. అప్పుడు "ప్రధాన మప్రదానమును, అప్రధానము ప్రధానమును నగు"నను నర్థమువచ్చి యప్రధానము ప్రధానమయినందున పశ్చాద్వాచ్యమును, ప్రధానము అప్రధానమయినందున పూర్వవాచ్యమును అగును. ప్రధానంబు పశ్చాద్వాచ్యంబగునను విధానము వాక్యవిషయము కాదనియు, నన్వయవిషయ మనియు నేను వ్రాసిన యభిప్రాయము ఇచట ననుసంధింపఁదగును.

మాఱుదల్లి అనునది "అమ్మ" "అక్క"వలె విశేష్యము. గంధవతి అనునది సంజ్ఞాప్రయుక్తవిశేషణము. ఈ రెండును నిచట వ్యత్యస్తములయ్యెనని తెలియఁదగును. మాఱుదల్లియగు గంధవతిపై అని విశేషణవిశేష్యభావముతో నన్వయము ప్రౌఢవ్యాకర్త కభిప్రేతము. ఈ విషయమును సరిగా గుర్తింపక భామారత్నంబు అను విశేషణమును మాఱుదల్లి అను విశేష్యమును పూర్వపశ్చాత్ప్రయోగవైపరీత్యమును జెందెనని వ్రాయుట సూత్రాభిప్రాయము కాఁజాలదు. మారుదల్లి అనునది యిచ్చట విశేష్యమే కాఁజాలదు అట్టిదానికి పశ్చాద్వాచ్యత సంభవింపదు గదా! మాఱుదల్లి అను పదము విశేషణత్వమును జెందియదియు భామారత్నంబు అను విశేషణమును గూడ "గంధవతి"యను విశేష్యముతో నన్వయింపవలయును. "పై"అను పదము చేరియుండుటచే గంధవతి యనునది విశేష్యమగుట తెలియుచునే యున్నది. గంధవతిపై యను సమాసమున నొక భాగముగానున్న గంధవతి యను పదము వేరొకపదములోనికి విశేషణ మగుటకు వలనుగాదు. వ్యస్త పదములు సమాసైకదేశముతో నన్వయించుట కలదుగాని సమాసైకదేశము వ్యస్తపదమున విశేషణముగా నన్వయించుట

యదృష్టచరము. కావున గంధవతిపై అనుచోట పూర్వపదమే విశేష్యమని తెలియఁదగును.

సూ॥ తెనుఁగునఁ గొన్ని శబ్దములు విశేష్య విశేషణంబు లుభయం బును నగు. ౧౦

కొన్నియనఁగాఁ గీడుప్రభృతులును నల్లాదులును.

వ్యా॥ ఆచ్ఛిక పదములు కొన్ని, కొన్నిచోట్ల విశేష్యములుగను కొన్ని చోట్ల విశేషణములుగను గూడఁ బ్రయోగింపఁబడుచుండునని భావము. కీడు అను పదము అనర్థము (లేదా దోషము)అనునర్థమున విశేష్యముగను అనర్థకారి యనునర్థమున విశేషణముగను వాడఁబడుచుండును అట్లే "నల్ల" అను పదము నలుపు అను రంగును జెప్పునపుడు విశేష్యముగను నలుపురంగుగలది యని చెప్పు నపుడు విశేషణముగను వాడఁబడుచుండును.

ఉదాహరణములను గ్రంధకర్త చూపలేదు. కాని సుబోధినీ వ్యాఖ్యాత యీక్రింది తీరున నుదాహరించెను.

కీడు విశేష్యమగుటకు - కృష్ణ! కృష్ణ! యనంత యేకీడులేదు. లక్ష్మి 4అ. 118ప.

తామ్రమహాదిగఁగల యట్టి ధాతుచయము, కొలిమినిడి యూఁదఁ గీడెల్లఁ బొలియునట్లు. ఈ రెండుచోట్లను "కీడు" అను శబ్దము దేనికిని విశేషణము కాలేదు,కీడులేదు,కీడుపొలియును, అని క్రియలోనికిఁ గర్తగనే యన్వయించును.

విశేషణమగుటకు - వారల తలంపులు కీడు - భార, ఉద్యో, ౩అ॥ ౨౩౯ ప॥ నీవేమిటు నిమ్మహాధ్వరంబు కీడంటి. భార అశ్వ. ౪అ. ౨౧౭ప॥ వీనియందు "కీడు" అను పదము తలంపులు, అధ్వరము అను విశేష్యములలోనికి అన్వయించు చుండుటంజేసి విశేషణమని తెలియవలయును "నల్ల" విశేష్యమగుటకు - అమ్మ హాశ్వంబు ధవళదేహంబునందు, నల్లగలిగిన నీవిప్డు నాకు దాసివగుము. భార. ఆది ౨అ. ౩౧ప॥ ఇందు నల్ల అనుదానికి నలుపు అని గుణమే యర్థముకావున విశేష్యముగా నున్నది.

ఈ నల్ల తిరునామ మెచటదొరకె జైమిని ౩అ ౭౪ప॥ ఇందుఁ దిరునామ మునకు నల్ల అనునది విశేషణ మగుచున్నది. నలుపుగల అని యర్థము. ఇచ్చట గుణివాచకమగుటచే విశేషణ మయ్యెను.

సూ॥ విశేషణంబులు కొన్ని వ్యవహితంబులు నగు. ౧౧

ఉ. క. ఈ లోకంబున వెదకితి మే లెల్లెడఁ గాన వరుని. నిర్వ. ౩ఆ. ౪౨.

వ్యవహితంబులు = దూరముగా నుండునవి.

వ్యా॥ విశేషణములు సామాన్యముగా విశేష్యమునకుఁ బూర్వమున నవ్యవధానముగానుండును. (విధేయవిశేషణములు మాత్రము విశేష్యమునకుఁ దరువాత నుండును) ఉదా॥ సుగుణాభిరాముఁడగు రాముఁడేతెంచెన్. మఱి కొన్నిచోట్ల విశేష్యమునకుఁ దరువాతిభాగమున నుండును రాముఁడు సుగుణాభిరాముఁ డేతెంచెన్ ఎట్లయినను విశేషణములు విశేష్యమున కవ్యవహితముగ నుండుటయే తఱచుగాఁ గానవచ్చుచున్నది కాని కొన్నిచోట్ల నిందులకు భిన్నముగా వ్యవహితముగాఁ గానవచ్చుచుండుటచేత నీసూత్రమును రచించెను.

ఈ ఉదాహరణమున విశేషణమగు "మేలు"అను పదమునకు విశేష్యమగు ''వరుని''అను పదమునకుమధ్య ''ఎల్లెడఁగాన''నను పదము లడ్డముగానున్నవి. సుబోధినియందు ''మేలిల్లెడు''అను పాఠము కలదనియు, మేలిల్లెడు అనునది ధాతుజ విశేషణమనియుఁ జెప్పఁబడెను అప్పుడు విశేషణమగు ''మేలిల్లెడు'' అనుదానికిని విశేష్యమగు వరుని అనుదానికిని మధ్య ''కానన్''అను పద మడ్డముగా నున్నది కావున నుదాహరణమగుటకు విరోధము లేదు.

బాగుగా విమర్శించినచో నీసూత్ర మనావశ్యకము. బాలవ్యాకరణమున (కార. ౩౭సూ.)గ్రమ నిరపేక్షముగా పదముల ప్రయోగమంగీకరింపఁబడెను. ఆ సూత్రమున ముందువెనుకలలో నిరపేక్షత మాత్రమే చెప్పఁబడెను కాని వ్యవధానావ్యవధానములను గుఱించి చెప్పఁబడలేదని తలంచినను విశేషణవిశేష్యములకవ్యవధానము బాలవ్యాకరణమునఁగాని, ప్రౌఢవ్యాకరణమున స్థలాంతరమునఁగాని విధింపఁబడియుండకపోవుటచే నిచ్చట వ్యవధానమును విధింపవలసినపనిలేదు. అంతియగాక విశేష్యవిశేషణములు వ్యవహితములుగానుండుట యరుదగు విషయము కాఁజాలదు. ప్రతిగ్రంథమునందును వ్యవధానము పలుచోట్లఁ గానవచ్చును ''దమయంతిం గనియె నలుండు దిత బాష్పకణకలిత ముఖిన్''. భార. అర ౨ఆ॥ ౨౦౪ప. పద్మపత్రాయతనేత్ర యపుడు దమయంతి గరంబు ముదంబునొంది – భార. అర. ౨ఆ ౨౧౯ప॥ ఇట్లతిప్రసిద్ధముగానున్న వ్యవధానమును విధింపనక్కఱలేదు. కాని క్రియాజన్య విశేష

ణమునకును విశేష్యమునకును మాత్రము వ్యవదానము కానరాదు విశేష ణాంతర వ్యవదానము మాత్రము ధాతుజ విశేషణములకును బ్రచురమె.

సుబోధినియందుఁ జెప్పినతీరున "మేలిల్లెడు"అనునది ధాతుజ విశేషణమే యయినచో విశేష్యమగు ''వరుని''అనుదానితో వ్యవహితమగుట యుదాహరిం పఁదగినదే యగును. ఇట్టివి యరుదైనవి.

**సూ॥ విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షకంబు లగు. ౧౨**

ఉ. క. దేవతల కప్రియంబులు గావించి మనుష్యు లధమగతు లగుదు రిలన్ గావున వారికి నిష్టముగావింపుము నన్నుఁ బ్రీతిఁ గావుము తరుణీ.(అప్రియంబులు=అప్రియవాక్యములను. ఇష్టము=ఇష్టకార్యము) భార అర. ౨ఆ. ౫౦. చ. పరమపతివ్రతన్ సభఁ దపస్వినిఁ బాండవ ధర్మపత్ని ధర్మరత నయోనిజన్ బ్రకృతి మానవభామినిగాఁదలంచి దెప్పరములు పల్కఁగాఁ దగునె? (దెప్పరములు=దెప్పరపు మాటలను) భార. సభా. ౨ఆ. ౨౫౫. వ. బెట్టిదంబులంగాని చక్కంబడఁడు. (బెట్టి దంబులన్=బెట్టిదపు మాటలచేత) భార. అర. ౬ఆ. ౧౭౩. మొ.

వ్యా॥ విశేషణములు మాత్రమే కొన్నియెడలఁ బ్రయోగింపఁబడు చున్నవి. అట్టియెడల విశేషణములే విశేష్యములనుగూడ లక్షణావృత్తిచే బోధించును అని సూత్రమునకు భావము

"అప్రియంబులు"అనునది విశేషణము. ఇయ్యది వేఱొక విశేష్యముతో నన్వయింపవలసియున్నది. కాని యిచ్చట నట్టివిశేష్యము ప్రయోగింపఁబడ లేదు. అందుచే ''గంగాయాంఘోషః''అనుచోట గంగాపదమునకు గంగయను నర్థము మాత్రమేకాక గంగాతీరము అనునర్థము వచ్చునట్లే యప్రియంబు లనుశబ్దమే యప్రియకార్యము లనునర్థమును లక్షణావ్యాపారముచే బోధించు నని తాత్పర్యము.

ఇట్లే ఇష్టము = ఇష్టకార్యము, దెప్పరములు = దెప్పరపు మాటలు, బెట్టిదంబులు = బెట్టిదపు మాటలు - అని విశేష్యములనుగూడ బోధించును.

**సూ॥ ఓశబ్దం బొక్కచో సంబోధ్యవాచకంబునకు ముం దితరశబ్ద వ్యవహితంబయి కానంబడియెడి. ౧౩**

ఒక్కచో ననఁగా సంబోధ్యవాచకంబు క్రియాజన్యవిశేషణ పూర్వకంబగునపుడనియు, ఇతరశబ్దంబనఁగా ఆ క్రియాజన్యవిశేషణము నకు సంబంధించిన పదమనియు నర్థము. ఉ. ఓ వినువీథినున్న ఖచరో త్తములార! పీర. ౨౩. ౧౨౮. ఓ తోయజనేత్రుఁగాంచిన వధూమణి. విజ. 3ఆ. ౧౨౫.

వ్యా॥ రామా! కృష్ణా! ఇత్యాదిశబ్దములచే మనము ఏ వ్యక్తులను బిలుతుమో వారు సంబోధ్యులనఁబడుదురు ఆ వ్యక్తులను బోధించెడిశబ్దము అనఁగా రామా! కృష్ణా! మున్నగునవి సంబోధ్యవాచకము లనఁబడును. అట్టి శబ్దమునకు ముందు "ఓ"అనునది యొక్కొక్కచోఁ జేరి "ఓ రామా! ఓ కృష్ణా!" ఇత్యాదివిధముగా ప్రయోగింపఁబడుటయుఁ గలదు అట్లు చేరెడు "ఓ"అను దానికిని సంబోధ్యవాచకంబగు కృష్ణా! రామా! మున్నగువానికిని మధ్యభాగమున మఱికొన్నిశబ్దము లడ్డముగానుండినను నుండవచ్చునని సూత్రార్థము (ఈ సూత్రము బాలవ్యాకరణమునకు వివరణము).

బాలవ్యాకరణమున (తత్సమ 14సూ॥ వృత్తి) "ఇది సంబోధ్యవాచకంబునకు ముందే ప్రయోగింపఁబడును"అని చెప్పి "ఓ రాముఁడ"అని ఉదాహరించెను. ముందే ప్రయోగింపఁబడుననగా ఓకారము పూర్వభాగమున నవ్యవహితముగానుండవలయునో లేక వ్యవహితముగాఁగూడ నుండవచ్చునో బాలవ్యాకరణమున స్పష్టముగా వివరింపఁబడలేదు. ఆ కారణముచే నామంత్రణార్థకమగు "ఓ"యను శబ్దము సంబోధ్యవాచకమునకుఁ బూర్వభాగమున వ్యవహితముగానైనను నుండవచ్చుననియు నావ్యవధాన మీతీరున నుండవలయుననియు వివరించుచున్నాఁడు.

సంబోధ్యవాచకమునకుఁ గ్రియాజన్యవిశేషణము పూర్వభాగమునఁ జేరియుండినచో నా విశేషణమునకు సంబంధించిన వేఱొకపదముగూడ దానికి ముందవ్యవహితముగా నుండును అట్టి యితరశబ్దమునకు పూర్వభాగమున "ఓ"శబ్దము చేరియుండును. అపుడు ఓ శబ్దమునకును క్రియాజన్యవిశేషణ పూర్వకమగు సంబోధ్యవాచకమునకును మధ్యభాగమున ఇతరపదములు చేరియుండవచ్చునని తాత్పర్యము.

సంబంధించిన పదమనఁగా విశేషణముచేఁ జెప్పఁబడుక్రియకు సంబంధించిన కారకము అని గ్రహింపవలయును.

ఖచరోత్తములార !
వధూమణి !

సంబోధ్యవాచకములు.

ఉన్న = ఉండు ధాతుజన్యవిశేషణము కాంచిన = కాంచు ధాతుజన్య విశేషణము వీనిలోనికి నన్వయింపఁదగిన కారకములు. వినువీథిన్ (అధికరణము) తోయజనేత్రున్ (కర్మము) అనునవి.

''ఓ – ఉన్న ఖచరోత్తములార !' అనువానికి మధ్యభాగమున "వినువీథి" ననునదియును, "ఓ – కాంచిన వధూమణి" అను వానికి మధ్యభాగమున "తోయజ నేత్రు'' ననియు నితరపదములు వ్యవధానముం గల్పించెను.

క్రియాజన్యవిశేషణ మెప్పుడును విశేష్యముతోఁగూడియే యుండును. కావున సంబోధ్యవాచకమునకుఁ బూర్వభాగమున క్రియాజన్యవిశేషణ ముండి నచో విశేషణ విశేష్యములు రెండును గలసి సమాసమగుటచే ఆ మొత్తమే సంబోధ్యవాచక మగును సమాసమధ్యభాగమున ''ఓ'' యను పదాంతరము చేరదు. కనుక నయ్యది యెల్లును నా సమాసమునకుఁ బూర్వభాగముననే యుండును. ఇక్కడ విశేషణ మడ్డముగానుండుటను సూత్రము నూతనముగా నంగీకరించుచున్నదని తలంపరాదు విశేషణమిక్కడ సంబోధ్యవాచకములోని యవయవమేకాని భిన్నపదముకాదు అందుచే దానియడ్డమునుగూర్చి యిచ్చట చెప్పలేదు ఆ క్రియాజన్యవిశేషణములోని కన్వయింపవలసిన కారకమగు (ఉత్థితాకాంక్షానివర్తకమగు) వేఱొకపదము సమాసములోఁ జేరనిదియుండి యట్టిపదము ''ఓ'' శబ్దమునకు వ్యవధానము కల్పించినను దోషములేదని యిందు చెప్పఁబడుచున్నది. అనగా నిచ్చటియుదాహరణములలో ''వినువీథిన్, తోయజ నేత్రున్,'' అనుపదము లడ్డముగానుండుటమాత్రమే యంగీకరింపఁబడుచున్నది. ఉన్న, కాంచిన, అనుపదముల వ్యవధానముగూడ నిచట సమ్మతించుచున్నట్లు తలంపనక్కఱలేదు.

సూ॥ రోశబ్దం బొండు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁ బరంబుగ నగు; అయ్యది హ్రస్వాంతంబును నయ్యెడి. ౧౪

ఉ. 'చ. కమలదళాక్షిరో ! వినవుగాఁగల యొక్కటిగంటి వేకువన్.' ప్ర.భా.౧ ఆ.౧౨౨. 'చ. రమణిరో భృత్యులందు నపరాధము

గల్గిన నాయకులే స్వపక్షముఁ దలపోసి యుగ్రతరశాసనముం దెగి చేయరు.' భాగ.౮ స్కం. ౨౮౮ మొ॥ (ఒకానొక యాధునిక గ్రంథము నందు 'అన్నరో, ఏనుంగురో' అని ప్రయోగములు కానంబడుచున్నవి. వానికిఁ బ్రామాణికప్రయోగములు కానంబడవు)

ఒండు = ఇంకొకటి. పూర్వము ఓ శబ్దము చెప్పఁబడియె. ఇప్పుడదికాక "రో" యను వేరొకశబ్దము సంబోధనమున ననఁగా నామంత్రణార్థమున స్త్రీ వాచకశబ్దమునకుఁ జివరఁజేరుననియు "రొ" యని హ్రస్వాంతముగఁగూడ నయ్యది బ్రయోగింపఁబడవచ్చుననియు భావము

బాలవ్యాకరణమున నీవిషయము చెప్పఁబడలేదు అందుచేఁ గ్రొత్తగా నిచ్చట నీ విషయము నీతడు సూత్రింపవలసెను కమలదళాక్షిరో, రమణిరో, అనునవి యుదాహరణములు. ఏకవచనాంతములకు మాత్రమే వచ్చునని సంబోధినియందు వ్రాయఁబడుట యుచితమే.

అన్నరో, ఏనుంగురో ఇత్యాద్య స్త్రీవాచకశబ్దము లప్రామాణికములనియు గ్రంథకర్తయాశయము తిమ్మకవి ప్రయోగములు కొన్నిటిని నీత డంగీకరించి యుండియు నీ శబ్దములుమాత్రము అప్రామాణికములనుట వింతగనున్నదని భావింపనక్కఱలేదు. "ప్రమాదో ధీమతామపి" యన్నట్లు ప్రామాణికులయిన వారు నొక్కొకయప్పుడు ప్రామాదికప్రయోగములనుజేయుట గలదు. ప్రామాణికుఁడుగా గ్రహింపబడిన (జహిహి జహీహి, జహాహి రామభార్యామ్" ఇత్యాద్యుదాహరణములందు) భట్టి "హేసుభ్రు" అను ప్రయోగవిషయమునఁ బ్రామాదికుడగుట సంస్కృతవ్యాకరణగ్రంథములందుఁ గన్పట్టుచునేయున్నది. కావున "అన్నరో!" ఇత్యాదులు ప్రాచీనుల గ్రంథములందు కానంబడనందున ప్రౌఢవ్యాకర్తకు సమ్మతములు కాలేదు.

**సూ॥ దేశ్యంబులఁ గొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబులకు సంబోధ్యవాచక శబ్దంబులమీఁద నేకవచనంబునఁ గాన శబ్దంబొండును, అలయును నవ్యయంబొండును గానంబడియెడి. అల దీర్ఘాంతంబునగు.** ౧౫

ఉ. 'ఎ, గీ భవ్యరతి దేవతాచార పరమపుణ్య, ధర్మ మేమఱకుండు మీా తల్లికాన! నై. ౨ అ.౯ 'మాసామికాన!' సా.౧ ఆ. ౨౩.

(ఈ కవి 'పాపజాతికాన' అని ప్రయోగించినాఁడు; అది విచార్యము. 'ఉ. అక్కలల కన్యకాత్వ మిటు లాఅడిపోవ నకారణంబ నీ, కెక్కడి చూలువచ్చె ?' నిర్వ.౨ ఆ.౨౪. 'చ తోడఁబడ నమ్మలక్కలని తూలుచు దీనత దోయిలొగ్గుచున్.' ఆము.౨ ఆ.౫౯. 'క. వ్రేలెడు వెండ్రుక లిరుగడఁ, దూలఁగఁ దలయూఁచుఁ దొప్ప దొప్పన నోరిం, గేలనడచికొను సెలవుల, లాలలు దొరఁగంగ నన్నలాయని యొరలున్.' ఉ. హరి.౪ ఆ.౩౦౨.

వ్యా॥ దేశ్యశబ్దంబులందు కొన్నిచోట్లమాత్రము స్త్రీవాచకములును, స్త్రీసమములునునగు సంబోధన ప్రథమైకవచనాంతరూపంబులకు కాన, అల, అలా అను పదములు చేరుచుండునని తాత్పర్యము.

తల్లి అనుపదము ఓ తల్లీ అనునర్థమున సంబోధన ప్రథమైకవచనాంతము. తల్లిని బోధించుటచే స్త్రీవాచకము సంబోధన ప్రథమైకవచనప్రత్యయము లోపించుటచే స్త్రీ సమము. దేశ్యశబ్దము. ఆకారణముచే "కాన" అనునదిచేరి "తల్లికాన" అని యయినది

"అక్క, అమ్మ, అనునవియు స్త్రీ సమములు, దేశ్యములు. కావున "అల" యనునది చేరి "అమ్మల, అక్కల," అని యయ్యెను.

అన్న అనునది స్త్రీవాచకము కాకున్నను స్త్రీ సమము కావున "అలా" చేరి, "అన్నలా" అని యయ్యెను.

"పాపజాతి" అనునది దేశ్యముకాక (తత్సమముగదా) పోవుటచే దానికి "కాన" చేరుట యీతనికి సమ్మతముకానందున నయ్యది విచార్యమని వ్రాసి వేసెను. బాలవ్యాకర్త దేశ్యములకంటె భిన్నములుగాఁ దద్భవముల నొక జాతిగా విభజించెను. ఇచ్చట దేశ్యములకని చెప్పుచుఁ దద్భవమగుసామి శబ్దమునకు "కాన"తోఁ బ్రయోగమును చూపినందున నీ సూత్రమునందలి దేశ్యంబులన్ అను పదమునకు అచ్ఛికంబులందు అని యర్థము చేయవలయును. "స్త్రీ వాచక స్త్రీ సమంబులగు" అను పదమునకు స్త్రీవాచకములుగాని స్త్రీసమంబులు గాని అగు శబ్దములకని యర్థము చెప్పవలయును ఒకేశబ్దము స్త్రీవాచకమును, స్త్రీ సమమునుగూడ నయియుండవలయునన్నచో "అన్నల" "సామికాన" అనునవి కుదురవుగదా ! ఈ సూత్రమున "స్త్రీ సమంబుల"ను పదమును తీసిచేసినను బాధలేదు. స్త్రీవాచకములగు దేశ్యశబ్దములన్నియు స్త్రీ సమముల యగును.

“అల” యనునది అవ్యయమని చెప్పుటచే వేఱొకపదమగుచున్నది. కనుక “అమ్మ + అల” అనునప్పుడు అపదాంతస్వరసంధి యగుటకు వీలుకాదు. భిన్నపదములకువచ్చు సంధిలో నద్రుతకు బహుళసంధిని విధించుచు బహుళ గ్రహణముచేత సంబోధనాంతములకును స్త్రీవాచకములకును సంధిరాదని బాలవ్యాకర్త చెప్పియున్నాఁడు. అమ్మ, అక్క మున్నగునవి స్త్రీవాచకము లగుటచేతను స్త్రీవాచకములగుటచేతనుగూడ అల యనునదిపరమగునపుడు సంధి వచ్చుటకు వీలుకాదు. “అన్న” మున్నగునవి సంబోధనాంతములగుటమాత్రము చేతనే యత్వసంధిని పొందఁజాలవు. అయినను నీ సూత్రోదాహరణములనుబట్టి యిచ్చట నిత్యసంధి వచ్చునని గ్రహించుచున్నది.

అమ్మల + అక్కల + అని = అమ్మలక్కలని = అని వచ్చిన యత్వసంధి అత్వసంధి విధాయకసూత్రములోని బహుళగ్రహణముచేతనే సాధువగును. అల యను నవ్యయము సంబోధన విభక్త్యర్థకముకాదు. కావున నందలి యత్వమునకు సంధినిషేధము తగులదు. అమ్మల, అక్కల, అన్నల అనునవి సంబోధనాంతములు కాఁజాలవు. సంబోధనార్థకములు మాత్రమగును. సంబోధనాంతములకు సంధి నిషేధింపఁబడెను గాని సంబోధనార్థకములకుఁ గాదు.

ఒక్కకవియే ప్రయోగించిన రెండుపదములలో పావికాన అనుదాని గ్రహించి “పాపజాతి కాన” అనుదానిని నిరసించుట అవిరుద్ధము. 14 సూ॥ వ్యాఖ్యలో దీనియౌచిత్యము నిరూపింపఁబడెను. చూడఁదగును.

**సూ॥ హలవసానంబులు పరంబులగునపుడు లు, రు వర్ణకంబుల యుకారంబునకు లోపంబు వైకల్పికంబుగ నగు ౧౬.**

ఉ॥ వితతోల్కాశనిపుంజ మొక్కొ యనఁగా విస్ఫోధి నిక్షిప్త ప,
క్షతి వాతాహతిఁ దూలి తూలశకలాకారంబులై వారిద, ప్ర
తతుల్ సాల్పడి నల్గడం జెదరఁగాఁ బాఱె న్మనోవేగుఁడై, ప
తగేంద్రుండమృతాంశికంబునకుఁ దత్పాలుర్ భయంబందగన్.

భార. ఆది. ౨ ఆ ౯౧. ఇట్లు భూసురోత్తముల్, భూపాలుర్ మొ॥

వ్యా॥ “లు, రు” అను ప్రథమా బహువచన ప్రత్యయములందలి యుకారము హల్లుగాని యవసానముగాని పరమగుచో వికల్పముగా లోపించును. ప్రతతుల్, తత్పాలుర్, అనుచోట్ల హలు పరమగుటవలన నుత్వలోపమువచ్చెను.

అవసానము పరముగానున్నపుడు లోపమువచ్చుటకు భూసురోత్తముల్, భూపాలుర్ అనునవి యుదాహరణములు.

బాలవ్యాకరణమున "పదాంతములయి యసంయుక్తంబులయిన ను, లు, రు, ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు." ననుసూత్రముచేతనే యీ కార్యములు సిద్ధించుచున్నవి. రు వర్ణమునకు హల్లు పరమగునప్పుడే యుత్వలోపము బాలవ్యాకర్త యుదాహరించినను నవసానమునందు రాదని నిషేధింపలేదు తఱచుగా హల్లు పరమగునపుడు లోపము గానవచ్చునని యాతడు సూచించుటచే నప్పుడప్పుడు హల్లు పరముగాలేని (యవసానమునందును) యపుడును ఉత్వలోపము రావచ్చునని గ్రహింపఁదగును భూపాలుర్ అని యీతడిచ్చిన యుదాహరణమువంటి రూపములు విరళములేయనుట యథార్థము. కావున నీ సూత్ర మనావశ్యకము (చూ బా. వ్యా ప్ర. పరి 16 సూ.)

సూ॥ మహత్సమూహార్థకశబ్దం బమహత్కార్యయుక్తంబయ్యుఁదద్విశేషణక్రియలు మహత్కార్యయోగ్యంబులు పక్షాంతరమున నగు. ౧౭

ఉ. 'ఎ.గీ మునినికాయమెల్ల, వివిధపుణ్యకథలు విను వేడ్కనతనిఁ బూజించిరి.' భార ఆది ౧ ఆ.౨౭. 'క. గీర్వాణ ప్రభుఁడాదిగ. గీర్వాణ గణంబు కాలకేయులతోడన్, గర్వించి రణముచేసి రఖర్వపరాక్రములు కడిమిఁ గడునుద్ధతులై.' భార.అర.3ఆ.౪౧. 'అయ్యిరుదెగలు పగఱ గారే తమలోన్.' నిర్వ.3 ఆ.౯౯. పడనడుతురు గన్న నిన్నుఁ బ్రమథగణంబుల్.' నిర్వ ౪ ఆ.౮౪ మొ॥ విభావ ననుటచే 'క. విమథర కుక్షి నసంఖ్యము, నిషాదగణముండి ధారుణీప్రజకుఁ గడున్, విషమమును జేయు; వారిని మిషమున భక్షించి చనుము మిత్ర విఘాతీ!' భార. ఆది.౨ ఆ.౫౮. 'సీ. నెత్తమ్ములేకొండ నెత్తమ్ములందాడు విద్యాధరీ కోటి విటులతోడ.' స్వా.౪ ఆ.౭౮ ఇత్యాదు లూహ్యంబులు.

వ్యా॥ మహత్సమూహార్థకశబ్దంబు = మహత్తులయొక్క సమూహమును బోధించెడి శబ్దము. ఉదా.—మునినికాయము. మహత్తులగు మునులయొక్క సమూహమును ఇది బోధించును

అమహత్కార్యయుక్తంబయ్యు = అమహద్వాచకములకు రావలసిన ముపర్ణకము, మున్నగుకార్యములు గలదైనను. మునినికాయము అనుచోట

మునులు మహత్తులయినను నికాయశబ్దము వారిసమూహమును బోధించుచు మువర్ణకమును బొందినది. అట్లయినను తద్విశేషణ క్రియలు = అట్టి మహత్సమూహార్థక శబ్దములయొక్క విశేషణములును, క్రియాపదములును మహత్కార్య యోగ్యంబులు = మహద్వాచకములకు రావలసిన కార్యములను బొందుటకుఁ దగినవి. అనగా డుజ్ వర్ణకాదులం బొందుట [illegible] వగు = వికల్పముగా నగును.

సమూహార్థకశబ్దమున కమహత్కార్యములగు మువర్ణకాదులు వచ్చుచుండును. ఆ కారణముచేత వాని విశేషణంబులకును "విశేష్యంబునందుంబోలె విశేషణంబునకు లింగవిభక్తివచనంబు లగు" అను బాలవ్యాకరణసూత్రముచే నమహత్కార్యములగు మువర్ణకాదులు ప్రాప్తములయ్యెను. అట్లే వాని క్రియాపదములకును నమహత్కార్యములగు డి, ని, ప్రథమైకవచనములు రావలసియున్నవి. కాని యా సమూహములోని వ్యక్తులు మహత్తులయినచో విశేషణములకును క్రియలకును మహత్కార్యములును, నమహత్కార్యములునుగూడ రావచ్చునని సూత్ర తాత్పర్యము.

| అమహత్కార్యయుక్త మహత్సమూహార్థక శబ్దము | మహత్కార్యము నొందిన తద్విశేషణము | మహత్కార్యము నొందిన తత్క్రియ | మహత్కార్యము రానిచో నిట్లుండును. |
|---|---|---|---|
| మునినికాయము | ——— | పూజించిరి. | పూజించెను. |
| గీర్వాణగణంబు | అఖర్వపరాక్రములు ఉద్ధతులు. | చేసిరి. | చేసెన్. |
| ఇరుదెగలు | పగఱు. | కారు. | కావు. |
| ప్రమథగణంబులు | ——— | అడుతురు. | అడుచున్. |

(మహత్కార్యమును బొందని స్థలములకు నుదాహరణములు.)

| | | | |
|---|---|---|---|
| నిషాదగణము | ——— | అసంఖ్యను | చేయున్. |
| విద్యాధరీకోటి | | ——— | ఆడున్. |

ఇరుదెగలు అను శబ్దమున కమహత్కార్యమేమియులేదు. అయినను మహదర్థక మగుటచే విశేషణమున కమహద్రూపము రావలసియుండఁగా మహత్సమూహార్థకమగుటచే మహద్రూపము వచ్చినది. ఆ కారణముచే నమహత్కార్యయుక్తమయినను, గాకపోయినను నీకార్యము వచ్చునని గ్రహించునది. "అమహ

త్కార్యయుక్తంబయ్యె" అనుచోటి సముచ్చయమువలన నమహత్కార్య యుక్తము కాకపోయినను నీకార్యము వచ్చునను నర్థము స్ఫుటమగుచున్నది.

ఈ సూత్రమున "మహత్సమూహ" అనుచోట మహత్యశ్చ మహాంతశ్చ, మహాంతః తేషాం సమూహః అని ఏకశేషము చెప్పవలయును అప్పుడు "మహత్తుల సమూహమునుగాని మహతిసమూహమునుగాని బోధించుశబ్దములకు" అను నర్థమువచ్చును 'విద్యాధరీకోటి' అనుపదము మహతిసమూహార్థకశబ్దమయినను గ్రియయగు "ఆడున్" అనుచోట నీసూత్రముచే "ఆడుదురు" అని మహత్కార్యము రావలసియుండఁగా సూత్రమునందు విభాషనను టచే నయ్యది రాలేదు. కోటిశబ్దమునందలి యమహత్త్వమునుబట్టి "ఆడున్" అని ఏకవచన రూపమే వచ్చెను, అని తెలియనగును.

"మహత్కార్యయోగ్యంబులు" అనుచోటఁగూడ నేకశేషఘటితముగా నెఱింగి మహత్కార్యయోగ్యంబులును, మహతీకార్యయోగ్యంబులును గ్రమంబుగా నగునను నర్థము చెప్పవలయును "ఆడు" అను క్రియ తద్ధర్మప్రథమపురుష బహువచనాంతమగునప్పుడు మహదర్థకమయినను మహత్యర్థకమయినను రూప భేదములేక "ఆడుదురు" అనియే యుండును కాని విశేషణమునకుమాత్రము మహత్కార్యము వచ్చుటకు వీలుకాదుగదా. "మోహనరూపులగు విద్యాధరీ కోటి" అని యనిష్టరూప మేర్పడవలసివచ్చును. కావున "మహత్కార్యయోగ్యంబు" అనుచోటఁగూడఁ బైవ్రాసినతీరున నేకశేషము నాశ్రయింపవలయును.

ఇట్టి కల్పనమంతయు "నెత్తమ్ములేకొండ" నిత్యాదికము నుదాహరించి "విభాషనను టచే సూత్రోక్తకార్యమిచ్చట రాలేద"ని చెప్పుటవలనఁ దటస్థించెను. దీనినీతఁ డుదాహరింపక యిట్టిమహతీసమూహార్థకస్థలములందీ కార్యములు రావనియే తలంచిన నుచితముగానుండును. కోటి శబ్ద మమహదర్థ కైకవచనాంతమే కావున "ఆడున్" అను క్రియాపద మనుగుణముగనే యున్నది.

సూ॥ జడపదంబులమీఁది తోడకు మెయి మైలు వికల్పంబుగనగు. ౧౮

ఉ. అందఱుఁగూడి మోసలకునర్థి మెయింజనుదెంచి. నిర్వ. ౩ఆ. ౫

చ. ముక్తి కునుమ్మఖతవహింపఁగావలయు మోహముఁ బాయఁ

గఁ ద్రోచి భక్తిమైన్. లక్ష్మీశ ర ఆ. ౧౫౮ పొ॥

వ్యా॥ జడవాచకశబ్దములపైవచ్చెడి తృతీయాప్రత్యయమగుతోడ విభక్తికి "మెయి" అనికాని "మై" అనికాని యాదేశము వికల్పముగా వచ్చునని

తాత్పర్యము బాలవ్యాకర్త వీనినెచ్చటను విధింపలేదు. "మెయి మైలు" ప్రత్యేక పదములేయనియు "నర్గిమెయిన్" మున్నగునవి తృతీయార్థక ద్వితీయాంతము లయిన సమస్తపదములనియు నాతని యాశయమని యూహింపనగును

"అర్థిమెయిన్ = అర్థితోడన్, భక్తిమైన్ = భక్తితోడన్. తోడను తృతీయా ప్రత్యయమునకుమాత్రమే యీ యాదేశములు వచ్చుటచేఁ దృతీయాదులకు నుగాగమంబగునను సూత్రముచే నంతమున ద్రుతముచేరెనని తెలియవలయును

సూ॥ కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబులం దక్కఁ దక్కినమహాకవిప్రయోగంబులందునుం గొన్ని యెడల నగామమంబు చూపట్టును. ౧౯

ఉ. సీ. సంగరమునకు నుత్సవముకేఁగెడుక్రియ సొలవక చని యెడు శూరులార! ఉ. హరి.౬ ఆ.౧౪౦. ఉ. లాలనఁ గొత్తబెబ్బులి కళాసముపెట్టిరి యాసనంబుగాఁ గోలయు సాధునైన యొకకోమటికిన్ నిషధేంద్రుఁ డిచ్చుకున్. నైష.౬ ఆ.౧౧౫. ఆ. వెలఁదిసోయగంబు వీక్షింప వినుతింప వేయికన్ను లమరవిభునికిచ్చి రెండువేలజిహ్వ లండ జాధీశ్వరు కొసఁగఁబోలుఁ బంకజోద్భవుండు. విక్ర.౪ ఆ.౧౬. ఉ. బలవంతపుఁ బాపము దెచ్చుకొంటి వేలా నగుఁబాటు కోర్చె. భోజ.౫ ఆ.౯౫ మొ॥

(ఇట్టి ప్రయోగములంబట్టి యాగమశాస్త్ర మనిత్యమగుటవలనఁ దక్కినచోట్ల నకారాగమము రాకుండినను దోషంబులేదనియు, గుత్వార్థ దోష విస్ఫురణంబు కలుగక పువర్ణాంతశబ్దములమీఁద నకారాగమము వచ్చుటకే తత్సూత్రారంభప్రవృత్తియై యుండునుగాన నచ్చోమాత్ర మయ్యది యత్యావశ్యకమనియుఁ దోచుచున్నయది.)

వ్యా॥ బాలవ్యాకరణమున షష్ఠీ కువర్ణకంబు పరంబగునపుడు నగాగమంబు నిత్యముగా విధింపఁబడెను. (తత్సమ. ౨౮ సూ.) కాని యయ్యది కవిత్రయ ప్రయోగంబు లందుఁ దప్ప శ్రీనాథాది మహాకవుల ప్రయోగంబు లందును నిత్యముగాఁ గానరాకుండుటచే నీ సూత్రము రచింపఁబడెను.

ఉదా॥ ఉత్సవముకు..! నగాగమమువచ్చెనేని "ఉత్సవమునకు" అని యుండును ఇట్టే "బచ్చుకున్" అంకజాదిప్వయకున్, నగుఁబాటుకు, అను చోట్లను నగాగమమురాలేదు అకారణమునైతి నగాగమము నిత్యమనియు నశ్లీలార్థము వచ్చునప్పుడు మాత్ర మట్టిదోషముగానుండ నగాగమము నిత్యముగాఁజేయవలయుననియు వ్యాకర్త వివరించెను ఆగమశాస్త్ర మనిత్యమని సంస్కృతవైయాకరణులు చెప్పుదురు ఆ న్యాయమునుబట్టి తెనుఁగునను నిది యనిత్యమని తలంపవలయును అశ్లీలార్థము స్ఫురించుచోటఁగూడ నగాగమమురాని ప్రయోగములు కలవని ఏ.సీ. శాస్త్రిగారు నీ రూపుకోర్వక నిటలాక్షుఁడును. (కవికర్ణ. ౩ఆ.౧౧౯ ప.) సొంపుకుఁ బసజూపు. (శ్రీరంగ. ౧ఆ ౨౫౭ ప.) అను వాని నుదాహరించిరి.

సూ॥ కంటె వర్ణకంబు పరంబగునపుడును గొన్నియెడల నగాగమంబు చూపట్టెడి ౨౨

ఉ॥ తత్ర్కతుశతంబునకంటె సుతుండుమేలు. భార. ఆది. ౪ఆ. ౯౩.

క॥ మనయింటి చేటుచూచితె
మనుకులసత్తముఁడు తొఱఁగె మైథిలినిన్
భూజనవాదంబు మహాత్ముల
యనఘచరిత్రమునకంటె నధికంబగుటన్. నిర్వ. ౯ ఆ. ౫౨ మొ॥

వ్యా॥ కంటె నను పంచమీవిభక్తిప్రత్యయము పరంబగునపుడుకూడఁ గొన్నిచోట్ల "న" అను నాగమము వచ్చుననిభావము. సూత్రమునందలి "పరంబగునపుడును" ననుసముచ్చయమువలన నీ క్రిందియభిప్రాయము వచ్చును.

బాలవ్యాకరణమున నుకార ఋకారములకుఁ గువర్ణకము పరంబగునపుడు మాత్రమే నగాగమము విధింపఁబడియుండఁగా నంతియకాక కంటె వర్ణకంబు పరంబగునపుడును నగాగమము వచ్చుననియు నుకార ఋకారములకే వచ్చుననియు నభిప్రాయము.

క్రతుశతంబు + కంటె. నగాగమమురాఁగా – క్రతుశతంబునకంటె నని యయినది. చరిత్రము + కంటె – నగాగమమురాఁగా చరిత్రమునకంటె నని యయ్యెను. ఈ యాగమము కొన్నియెడల ననుటచే రాకుండుటయు సమ్మతమే.

**సూ॥ ఉదంతములగు నమహత్తుల కందు వర్ణకము పరంబగునప్పుడును నగాగమంబు కొన్నియెడలం గానంబడియెడి. ౨౧**

ఉ॥ చ. దేవ నీవనిమిషనాయకత్వమున యందభిషిక్తుఁడవై ముదంబుతో ననుఁ బనిగొమ్ము. భార. అర ౫ ఆ ౨౨౩ క. విను పిండదాన సమయంబున యందును భక్తిపూర్వముగ దీనిఁ బతించిన నయ్యన్నం బమృతము నెనయుఁ దురగమేధఫలంబు నిచ్చుఁ గృతాత్మా! హరి. పూ.భా.౨ ఆ.౧౮౭. సీ. సంతరించితి నిందుజవ్వనంబునయందు హర్ష నైషధకావ్య మాంధ్రభాష. కాశీ ౧ ఆ.౭. క. జననాథ నన్ను నను గఁగఁ జనుదెంచినకార్య మేమి సర్వంబు మనంబునయందు మున్న యెఱుఁగుదు విను చెప్పెద నీకుఁదగునె విసువఁగ భార్యన్. మార్క.౫ ఆ.౧౮౩. ఉ డక్కఁగ ప్రవాసితిన్ మును పటమ్మునయందు సుశర్మపాపముల్. పాండు.౫ ఆ ౮౦ మొ॥

వ్యా॥ హ్రస్వోకారాంతములగు నమహచ్ఛబ్దములకు "అందు" అను సప్తమీవిభక్తి ప్రత్యయము పరంబగునపుడుకూడఁ గొన్నిచోట్ల నగాగమము వచ్చునని తాత్పర్యము.

ఈ విషయము బాలవ్యాకరణమునఁ జెప్పఁబడలేదు. అందు ''కు'' వర్ణకము పరంబగునపుడుమాత్రమే నగాగమము విధింపఁబడెను

నాయకత్వము + అందు. నగాగమము నాయకత్వమునయందు. ఇట్లే సమయంబునయందు, జవ్వనంబునయందు, మనంబునయందు, పటమ్మునయందు, అనుచోట్ల నగాగమమువచ్చెను. అందువర్ణకము పరంబగునపుడు వచ్చెడి నగాగమము ''అమహచ్ఛబ్దంబులకే'' యని చెప్పఁబడెను. కాని కంటె వర్ణకము పరంబగునపుడు వచ్చెడి నగాగమముగూడ నమహచ్ఛబ్దములకే వచ్చుచున్నది. అదియు నుదాహరణములనుబట్టి యుదంతములకే వచ్చుచున్నట్లు తెలియఁబడుచున్నది.

**సూ॥ తెనుఁగునం గొన్ని తత్సమదేశ్యశబ్దములకంటెం బరంబుగ నేకవచనంబున నీచత్వద్యోతకంబయి యిగా యను నొక్క శబ్దంబును దానిపై డువర్ణకాదులునుం జూపట్టెడి. సంబోధ**

నంబున డువర్ణకంబు చూపట్టదు. తుదిదీర్ఘంబునకు హ్రస్వం బు
వైకల్పికంబు. ౨౨

ఉ॥ ప్ర. బాలిగాఁడు; చిట్టిగాఁడు; సం.ప్ర. బాలిగా! బాలిగ!
చిట్టిగా! చిట్టిగ! బాలిగానిన్, బాలిగానిచేతన్, అని తక్కిన విభక్తు
లూహ్యంబులు. ఇట్లు గోపాలిగాఁడు. మొ॥

వ్యా॥ తెనుఁగుభాషయందుఁ గొన్ని తత్సమశబ్దములకుఁ గొన్ని దేశ్య శబ్దములకును బరమందేకత్వమును బోధించునపుడు "ఇగా" యనునొక్క శబ్దముచేరి నీచత్వమునుబోధించును. అట్లు చేరిన "ఇగా" అనుదానిమీఁద డువర్ణకాదులు అనగా విభక్తిప్రత్యయములు చేరును. సంబోధనార్థమున "డు" అను ప్రథమావిభక్తి ప్రత్యయము చూపట్టదు అనఁగా లోపించును సంబోధ నమున డుప్రత్యయము లోపించుటయేకాక "ఇగా" లోని తుదిదీర్ఘము వికల్ప ముగా హ్రస్వమగును అని సూత్రతాత్పర్యము

బాల — తత్సమశబ్దము. చిట్టి — దేశ్యశబ్దము వీనికి "ఇగా" యనునది చేరి డువర్ణకమురాఁగా "బాలిగాఁడు" అయ్యెను. బాల + ఇగా. అపదాంత స్వరసంధి నిత్యముగా వచ్చుటచే "బాలిగాఁడు" అని యయ్యెనని తెలియ నగును "చిట్టిగాఁడు" అనునదియు నిట్లే సంబోధనార్థంబున దీర్ఘమునకుబదులు హ్రస్వము వికల్పముగా వచ్చుటచే "బాలిగ!" బాలిగా! చిట్టిగ! చిట్టిగా! అని యగును.

బాలిగాఁడు అనునట్లే ద్వితీయావిభక్తి చేరఁగా బాలిగానిన్ అనియు తృతీయచేరఁగా బాలిగానిచేత ననియు నగును. ఇట్లే బాలిగానికొఱకు మున్నగు నవియు నగును. "బాలిగాడు" అనుదానివలె గోపాలిగాఁడు మున్నగు తత్సమ రూపములును గల్గునని యుదాహరణములవలనఁ దెలియుచున్నది. "బాలుఁడా! గోపాలుఁడా! బాలుఁడు" మున్నగుపదముల ప్రయోగమునఁ గానరాని నీచ త్వము బాలిగా, గోపాలిగా! బాలిగాఁడు. ఇత్యాదులయందు స్ఫురించుట విదితమే.

"ఏకవచనము" "ద్వివచనము" అనుపదము లా యా ప్రత్యయములనే బోధించుట వ్యవహారము. ఏకవచనమనఁగా నేకవచనప్రత్యయమని యర్థము. కాని యీ సూత్రమున "నేకవచనంబున" ననుపదమున నేకత్వసంఖ్యను బోధించునపుడని యర్థముచేయవలయును. కానిచో సూత్రార్థము సరిగా

నుండదు. ఏకవచనప్రత్యయమున "ఇగా" యనునది చూపట్టదుగదా! ప్రకృతికి పరంబుగనే "ఇగా" చేరుచున్నదిగదా!

ఇగా యనునది యొకశబ్దమని యిందుఁ జెప్పఁబడెను శబ్దమనఁగా రామ, హరి, మున్నగువానివంటి ప్రాతిపదికమని తలంపరాదు. ఇచ్చట శబ్దమనఁగా వర్ణరూపమయిన ధ్వనియని భావింపవలయును. "ఇగా" యనునది యాగమమని చెప్పియుండిన బాగుగానుండెడిది.

"డువర్ణకంబు చూపట్టదు" అనుచోట "చూపట్టదు" అనఁగా లోపించునని యర్థముచెప్పవలయునుగాని "రాదు" అని చెప్పరాదు. ప్రత్యయమురానిచోఁ బదముకాకపోవుటచేఁ బ్రయోగార్హము కాకపోవును. కనుకఁ బ్రథమా ప్రత్యయము లోపించునని తెలియవలయును. చూపట్టకపోవుట యనఁగాఁ గానరాకుండుట. అనఁగా లోపించుటయే యగును. "అదర్శనం లోపః" అని వైయాకరణుల వాక్యము.

"దీర్ఘమునకు హ్రస్వంబు" అనుచోట. దీర్ఘమునకుబదులుగా హ్రస్వమని యర్థము. కాదేని "దీర్ఘమునకు హ్రస్వత్వము వైకల్పికంబు" అని సూత్రింపవలసియుండును. దీర్ఘము, హ్రస్వము, అన్నశబ్దములు దీర్ఘాక్షరము, హ్రస్వాక్షరము అనునర్థముగలవి. ఇవి ధర్మివాచకములుగాని ధర్మవాచకములు కావు. కావున "దీర్ఘంబు హ్రస్వంబగు" నని కాని "దీర్ఘమునకు హ్రస్వత్వము వచ్చు"నని కాని "దీర్ఘమునకుబదులు అనఁగా దీర్ఘాక్షరస్థానమున హ్రస్వము వచ్చు"నని కాని యుండవలయును. ఇచ్చట "బదులుగా" అనుదాని నధ్యాహారముచేసికొని దీర్ఘమునకుబదులుగా హ్రస్వమువచ్చునని యర్థముచేయవలసియున్నది "దీర్ఘాణాం హ్రస్వః" ఇత్యాదులందు దీర్ఘాక్షరముల స్థానమున హ్రస్వమువచ్చునని యర్థము.

సూ॥ ద్విత్వయుక్తలాంతంబుమీఁది లుల లకును ధ ర లాదేశంబు
లగు. ౨౩

ఉ॥ మ. అరవీటిల్లియ రామరాజు పెదతిమ్మానీకపు శాహో
భయం, కరకౌక్షేయకధారఁ జోరునఁ గడంకం బ్రేళ్ళు వీరారిమల్లురకున్
మట్టియగుం దదీయబలభూళుల్ సంగడాశ్రేనియు, చ్ఛరకాంతాస్తన
పాళి విన్గరిడి నాశ్చర్యంబు చర్చింపఁగన్. రామా. ౧ ఆ ౫౫ పొ॥

వ్యా॥ ద్విత్వయుక్త లకారమనఁగా రెండు పొల్లు లకారములు. అట్టిని యంతమునఁగలశబ్దము అనఁగా "మల్ల" మున్నగు శబ్దములు. వానికిఁ బరముగా నున్న "లు" అను ప్రథమాబహువచనప్రత్యయమునకు "రు" అనునదియు "ల" అను ద్వితీయాది విభక్తులకువచ్చు లాగమమునకు "ర" అనునదియు నాదేశము లగునని సూత్రార్థము

సూత్రమున "ద్విత్వయుక్తలాంతంబు" అనియున్నను ద్విత్వయుక్త లకారముతోఁగూడిన "అకారము" అంతమునఁగల శబ్దమని యర్థము చెప్పవలయును. ఉదాహరించిన మల్లశబ్ద మట్టిదేకదా! అట్లుగాక "అ"కారాంతముకాని ద్విత్వయుక్త లకార మంతమునఁగలశబ్దము కానేరదు. కావునఁ బైరీతిని సరిచేసి కొనవలయును.

"లకారము" అనఁగా నకారముతోఁ గూడినదానినే గ్రహించినచో ద్విత్వయుక్త లకారమనఁగా "లల" అనురీతి నుండవలసియుండును. కావున నట్లును జెప్పరాదు.

బాలవ్యాకరణంబున "నదంతంబయి దీర్ఘపూర్వలోపధంబయిన మహత్తు మీఁది విభక్తి లకారంబునకు రేఫంబగు" ననుసూత్రముచే "బాలురు" మున్నగు రూపములు సాధింపఁబడుచున్నవి. కాని మల్లశబ్దమున నుపధయగు లకారమునకుఁ బూర్వమున దీర్ఘము లేదు లకారమే యున్నది. అందుచే నిచ్చట నా సూత్రముచే లకారమునకు రేఫమురాకయుండఁగా నీ సూత్రము రచియింప వలసివచ్చెను.

"మల్లురకున్" అనునది యుదాహరణము. ద్విత్వయుక్తలాంతమనఁగా "మల్ల" అనుదానిని గ్రహింపవలయును. దీనిమీఁది "ల" అనుదానికి "ర" అనునది రాఁగా "మల్లురకున్" అని యయ్యెను. రేఫము ప్రాసస్థలమున నుండుటచే మార్చుటకు శక్యముకాదు

ఈ సూత్రము బాలవ్యాకరణసూత్రమునకు బదులుగాదే. కావున నీ విధానము కూడ మహత్తులమీఁదివానికే యనియుఁ దత్సమములకే యనియును దెలియవలయును. కాదేని "కల్లలు" "మగపిల్లలు" మున్నగుచోట్లను "రు" రావలసివచ్చును.

ఈ సూత్రంబున "లుల" లకును రుర లాదేశంబులగు ననుటకు బదులు విభక్తి లకారంబునకు రేఫంబగునని యున్నచో నాసూత్రములోని యంశము లిందుఁ జేరుననువిషయము సుగమముగా స్ఫురించును.

ద్విత్వయుక్త లకారపూర్వకాదంతంబయిన తత్సమ మహత్తుమీఁది విభక్తి లకారంబునకు రేఫంబగునని సూత్రించుట శ్రేయము.

సూ॥ విధాశబ్దంబు సంస్కృతంబునం బుంలింగంబు నగు. ౨౪

ఉ. విధో విధానే హస్త్యన్నే ప్రకారే వేతసేపి చ. అని పులింగంబునందు అజయుఁడు. దీనికిఁ దత్సమంబునం బుంలింగరూపముతోనే ప్రయోగముగాని స్త్రీలింగరూపముతో లేదు. దంష్ట్రాశబ్దంబును బుంలింగముగాను గానంబడియెడి.

వ్యా॥ బాలవ్యాకరణమున నాకారాంత స్త్రీలింగశబ్దములకుఁ దత్సమ. ౨౪, ౨౭, సూత్రములచే దీర్ఘమునకు హ్రస్వమువచ్చి విభక్తిప్రత్యయము లోపింపఁగా "రమ" అని యయినట్లే "విధా" అను నాకారాంత స్త్రీలింగశబ్దముకూడ "విధ" అను రూపమును బొందవలసియుండఁగా దానిని నివారించుటకుఁ "గంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగానగు" నని సూత్రించి, కంధరాదులలో విధాశబ్దమును జేర్చి "విధ" మను రూపమును సాధించుచు విధాశబ్దమునకుఁ గ్లీబతుల్యత్వము నిత్యమనియు "విధము" అనియే యగుననియుఁ జెప్పఁబడెను.

బాలవ్యాకర్త విధాశబ్దమాకారాంత స్త్రీలింగమే యని భావించి "విధము" అను రూపము సిద్ధించుటకై క్లీబతుల్యత్వమును విధించుకొనెను. కాని యీ శబ్దము పులింగంబునను నుండుటచే "వృక్షము" అనునట్లు "విధము" అను రూపమును బొందును గావునఁ గ్లీబతుల్యత్వము చెప్పుట యనావశ్యకమని ప్రౌఢవ్యాకర్త యాశయము. క్లీబతుల్యత్వమును నిత్యముగా విధింపనిచో స్త్రీలింగశబ్దమునుండి యనిష్టరూపముకూడ సిద్ధింపవలసియుండఁగాఁ దత్సమరూపములలో స్త్రీలింగ విధాశబ్దమునకుఁ బ్రయోగములేదని తెలియవలయును ఇయ్యది పుంలింగమనుట కజయుని నిఘంటువును బ్రమాణీకరించెను.

కంధరాదులలోని దంష్ట్రాశబ్దముకూడఁ బుంలింగముగాఁగూడ నున్నదనియు నాకారణమున దంష్ట్ర, దంష్ట్రము అను రెండురూపములును సిద్ధించుటచే దీనిని గంధరాదిగణమునఁ బఠించుట యనావశ్యకమని యభిప్రాయము (సీ. శా. గారు దంష్ట్రాశబ్దమునకుఁ బుంలింగము అప్రామాణికమనుచున్నారు.)

సూ॥ అర్థాదులకడ యిచ్చున కుత్వంబును, మీఁద వువర్ణకంబును వైకల్పికంబుగా నగు. ౨౫

ఉ అర్ఘువు, అర్ఘము, ధర్మువు, ధర్మము, వర్గువు, వర్గము.

చ. అవని యరాజకంబయినయప్పుడు ఘూర్ణప్రజలందు సర్వథ, ర్మువులు దొలంగు దేశముసుముఖ్యులు వాయుచు రోలి వృష్టిలే, దవు మఱియర్ఘువుల్ దఱుఁగునంపున కావునఁ గాలయాపనం, బవితథవాక్య! చేయక రయంబున రాజ్యమునిల్పు మిత్తఱిన్. భార ఆది.౭ ఆ ౨౭౮.

వర్గువునందలి వువర్ణకంబొండె లోపించు. ఉ వర్గ.

వ్యా॥ అర్ఘశబ్దమునందు మహత్తగుటచే "ప్రక్షము" అనునట్లే "అర్ఘము" అను రూపమును బాలవ్యాకరణప్రకారముగాఁ బొందుచున్నది కాని ప్రయోగములందు "అర్ఘువు" అనురీతినిగూడ రూపము కానవచ్చుటచే నీ సూత్రము రచింపఁబడెను. "అర్ఘువు" అనునట్లే "ధర్మువు" "వర్గువు" అను రూపములును గలవు. కావున "వర్గాదు"లని యొకగణమేర్పఱుపఁబడెను.

"అర్ఘ" అను ప్రాతిపదికమునకుఁ బ్రథమైకవచనప్రత్యయము వివక్షించునపుడు కడయుచ్చున కుత్వమువచ్చి వువర్ణకము చేరఁగా "అర్ఘువు" అని యగును. ఇది వైకల్పికము కావున నర్ఘమనియు రూపాంతరము కల్గును.

ఉదాహరణపద్యమున ధర్మువులు, అర్ఘువులు అని రెండును గలవు. వీనిలో వువర్ణకము లేదు వుగాగమము గలదు అందుచే సూత్రమున వర్ణకముమాత్రమే కాక యాగమముగూడ విధింపఁబడినట్లు తలంపవలయును. సూత్రమునందు "వర్ణక" అనుచోట "వర్ణ" అని యుండిన రెండువిధములగు "వు" లకు గ్రహణము లభించును సూత్రమున వర్గాది ప్రాతిపదికములకే వికల్పముగా వుకారమంతాదేశముగా విధించిన సరసముగానుండును.

వర్గువులోని వువర్ణకము మాత్రము వికల్పముగా లోపించి "వర్గు" అని వేఱొకరూప ముండునని వివరణమునఁ జెప్పెను.

సూ॥ రాహు బాహు శబ్దముల కంతట వువర్ణకలోపంబు వైకల్పికంబు ౨౬

ఉ. రాహువు, రాహు; రాహువులు, రాహులు; బాహువు, బాహు; బాహువులు, బాహులు; ఇత్యాదులు. సీ. అపమేఘమై యున్న యంబరమున, విద్యుత్సహస్రముల్ విలసిల్లె మఱి రాహు, పర్వంబుగాకయ భానుఁ గప్పె. భార. సభా.౨ ఆ.౨౯౯, తే. అగ్గలించి

నాయెదుర బాహాప్పళించి కడంగిలిన మల్లుం గాననెందు. భార. విరా. ౨ ఆ. ౭ పొ॥

వ్యా॥ ఉకారాంత శబ్దములు ... సమహత్తులయినచో నిత్యముగను వుగాగమము ... అమహత్తులయినచో ... గ్రహించెను. మహత్తులయినచో వుపర్ణకము ... కావున బాలవ్యాకరణముచేత రాహు ... "రాహువు" అని యగును. ప్రయోగములున్నచో ... అని చెప్పవచ్చును. కాని "రాహు" అను రూపము బాలవ్యాకరణమునచే సిద్ధింపదు. అట్లే బాహుశబ్దము మహత్తు కావున నిత్యముగా వుపర్ణకమునచ్చి "బాహువు" అనియే యగును "బాహు" అను రూపము బాలవ్యాకరణమునచే సాధ్యముకాదు. కనుక నీ సూత్రము రచింపఁబడెను

రాహు బాహు శబ్దములకు వచ్చెడి ప్రథమైకవచన ప్రత్యయము, ఇతర విభక్తులు పరమగునపుడు వచ్చెడి "వు"గాగమమును వికల్పముగాం లోపించు నని సూత్రార్థము "అంతటన్" అనఁగా సన్నిహితవిభక్తులు పవర్తించునపుడును నని భావము.

వర్ణకమనఁగాఁ బ్రత్యయము "రాహువు" అనుచోట "వు" అనునది ప్రత్యయమే. "రాహువులు" అనుచోట "వు" అనునది వుగాగమము కాని ప్రత్యయము కాదు. ఈ సూత్రముచే నీ రెండువిధములగువానికిని లోపము రావలసియున్నది అందుచే సూత్రమున "వర్ణ" అను పదమునకుబదులు "వర్ణ" అని కకారరహితముగను ... పూర్వసూత్రమునందును నీ విషయము వివరింపఁబడెను. వుపర్ణమనినచోఁ బ్రత్యయమని యర్థము కాదు కావున నాగమము ప్రత్యయముకూడ గ్రహింపఁబడును.

రాహువు – వుపర్ణకలోపములేనిరూపము. రాహు – లోపమువచ్చిన రూపము రాహువులు – వుగాగమము వచ్చినరూపము. రాహులు – అగమ రహితరూపము. బాహుశబ్దరూపములును నిట్లే తెలియనగును. "రాహుపర్వంబు గాకయు భానుఁగప్పె" ఇది రాహు అనుటకుఁ బ్రయోగము. "నా యెదుర బాహాప్పళించి" ఇది "బాహు" అనుటకుఁ బ్రయోగము.

బాహాశబ్ద మాకారాంతమును గలదు. దానికిఁ బ్రథమైకవచనాంత తత్సమ రూపము "బాహా" అని యుండును. బాహా + అప్పళించి = బాహాప్పళించి, అని

యత్వసంధిఁ జేసినను ఇట్టిప్రయోగము కుదురును కాని బాలవ్యాకర్త స్త్రీవాచక తత్సమసంబోధనాంతములకు సంధిలేదని నిషేధించి సంస్కృతీయమున కధర్వణాచార్యులు సంధిని సమ్మతించినను బూర్వకావ్యంబులయందుఁ బ్రయోగంబు మృగ్యంబు అని వచించుటచే నిచట "బాహ" అను శబ్దము కాదనియు "బాహు" అను ఉకారాంతశబ్దమే యనియుఁ దెలియవలయును

సూ॥ విశ్వకర్ముఁడనియు రూపంబు. ౨౩

ఉ. నీ విశ్వకర్మునికూఁతు విశదలావణ్యసముజ్జ్వలఁ జేకొని మూఁడిఁబోయి. హరి. ఉ.౨ ఆ.౨౫.

బాలవ్యాకరణమునందలి "హలంతంబు ప్రథమైకవచనాంతతుల్యంబిందు నామంబగు" ననుసూత్రముచే "విశ్వకర్మా" అనునది ప్రాతిపదికమగుచుండ దీర్ఘమునకు హ్రస్వమువచ్చి "విశ్వకర్మాదులకు స్త్రీత్వంబగు"నను సూత్రముచే స్త్రీత్వమువచ్చి ఉత్వడుజ్జులు నిషిద్ధములయి ప్రథమైకవచనమునకు లోపము రాఁగా "విశ్వకర్మ"యను రూపము బాలవ్యాకరణముచే సిద్ధించుచున్నది. కాని యుత్వడుజ్జులతో విశ్వకర్ముఁడనురూపముకూడ నుండునని సూత్ర తాత్పర్యము. అందుకుఁబ్రయోగమును "విశ్వకర్ముని కూఁతు" అనుచోటఁ జూపుచున్నాఁడు.

ఇచ్చట విశ్వకర్మునియొక్క అనురూపమున నిగాగమము డుమంతంబు కావుననే వచ్చెను. "డుమంతంబునకు ద్వితీయాద్యేకవచనంబు పరంబగునపుడు సర్వత్ర విభాషనగు"నను సూత్రము నిగాగమమును విధించుచున్నదికదా! కావున నీ శబ్దము విశ్వకర్ముఁడను ప్రథమైకవచనాంతరూపమును బొందునని తెలియనగును. బాలవ్యాకరణముచే "విశ్వకర్మ"అనియేకాని విశ్వకర్ముఁడను రూపము సిద్ధింపకుండఁగా నీ సూత్ర మట్టిరూపమును విధించెను.

సూ॥ దేశ్యమునం దక్కడాదులు నిత్యైకవచనాంతములు. ౨౪

ఉ. అక్కడ, ఇక్కడ, ఎక్కడ, అచ్చట, ఇచ్చట, ఎచ్చట.

మొ॥ ఆదిశబ్దముచేత ఇరులు, కేలు మొ॥ కొందఱు ఇరులు కేలు శబ్దములు బహువచనాంతము లందురు అట్లుకాదు "ఇరులున నొంటిఁబోఁ బరసతినొట్టుట. విజ్ఞా. ప్రా. ౧౦౫. "కలభాషిణివేనలియొక కేలఁబట్టి వేఱొక్క కేలనొయ్యఁగ త్తి పెటికి". కళా. ౩ఆ. ౧౧౯, సి "ఉపధానవిస

మయం బొండొండ చూపుటఁ బెఱకేలు లణకువఁ బ్రదిలి బిగియ”
కవికర్ణ. ౪౮. ౧౮౦

వ్యా॥ దేశ్యశబ్దములలో నక్కడ మున్నగునవి నిత్యమునుగా నేకవచనాంతములే యగునుగాని బహువచనాంతములుగా నుండవని తాత్పర్యము.

“దేశ్యమునం”దనునది జాత్యేకవచనాంతమని తలంచి దేశ్యపదములలో నను నర్థమును స్వీకరింపవలయును. కాదేని దేశ్యములందని యుండదగును. ఇరులు, కేలు, అను పదములందు ‘లు”అను వర్ణము వినవచ్చుటచేఁ గాబోలును గొందఱు బహువచనాంతములఁ దలంచిరి కాని యవి యేకవచనాంతములే స్త్రీసమములగుటచేఁ బ్రథమైకవచనము లోపించును “ఇరులున నొంటిఁబో” ననుచోట “ఇరులు”అను శబ్దమున నేకవచన ప్రత్యయమగు “న” అనునదిచేరి వినవచ్చుటయె యిందులకుఁ దార్కాణము “డు ము వు న లేకవచనంబులు”అను సూత్రముచె “న”అనునది యేకవచనమే యగుటు నిర్వివాదము.

“కలభాషిణి వెనుక యొక కేలఁ బట్టి వేఱొక్క కేల నొఱఁగత్తిఁ బెఱికి”అను చోటఁ “గేలు”అను పదమున “కొక”యను విశేషణముండుటచే నయ్యది యేకవచనాంతమే యని తెలియఁ గూడును, కాని “పెఱకేలు లణకువన్” అనుచోట బహువచన [illegible] “కేలు”అనునది యేకవచనాంతమే యని తెలియఁ జాలకున్నను నీ వ్యాకర్త యభిప్రాయము.

ఒక కేల ననఁగా నొకచేతితో నని యర్థము. ఇచ్చటఁ దృతీయావిభక్తి రావలసియుండఁగా గాని స్థానమున “జడంబు తృతీయా సప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు”ను సూత్రముచే ద్వితీయ వచ్చెనని చెప్పవలయును. కాని “కేలు” అనునది యుకారాంతమయినచో నేకత్వంబునం దృతీయార్థంబున ద్వితీయ రారాదు “బహుళకంబుచే నిక్కార్యం బుదంతంబునకు బహుత్వమందే యగు”నని బాలవ్యాకర్త వచించెను. ఔపవిభక్తికము కాకుండుటచే “నౌప విభక్తికముల తృతీయా సప్తముల కత్వంబు బహుళంబుగా నగు” (బాల. అచ్ఛి. ౩౦. సూ.)నను సూత్రముచే నత్వమును రాదు. (కేలు అనునది బహువచనాంతమే యనినచోఁ దృతీయ వచ్చును). ఆ కారణముచే నొక కేల ననునది యేకవచనాంతమనుటకు ద్వితీయ బాధకముగా నున్నది. అయినను నేకశబ్దము విశేషణముగా నున్నంతమాత్రముననే యిది యేకవచనాంత మనవలయును. విభక్తి

నెట్లో క్లిష్టమార్గమున సాధువుగా చెప్పవలయును ఇయ్యది యేకవచనాంతంబనుటకు "బెఱకేలులఁ గువ" త్యాగా చేయొక యుదాహరణమునిచ్చెను. కేలు అననది యేకవచనాంతముకాక బహువచనాంతమయినచో ''లు''అను బహువచన ప్రత్యయము మరలఁజేయుట సంభవింపదు. కావునఁ గేలు అనునది యేకవచనాంతమే యని గ్రంథకర్త్రాశయము

పరిశీలింపఁగా నీ ప్రయోగము ''కేలు'' అను పదము నిత్యైకవచనాంతమనుటకు సమర్థము కాఁజాలదు. మీఁదుమిక్కిలి నిత్యైకవచనాంతము కాదనియు బోధించును కేలు అనునది నిత్యైకవచనాంతమని చెప్పునుఁ ''బెఱకేలులు''అను బహువచనాంతరూప ప్రయోగమును జూపుట చిత్రముగానున్నది ఇయ్యది కేలు శబ్దము నిత్యైకవచనాంతము కాదనియు బహువచనాంతముగాఁ గూడ నుండుననియు బోధించుచున్నది

పరిశీలింపఁగాఁ ''గేలు''అను శబ్దము ఏకవచనాంతమే యయినను నిత్యైకవచనాంతము మాత్రము కాఁజాలదు ప్రౌఢవ్యాకర్త చూపిన యుదాహరణముననే ''పెఱకేలులు''అని బహువచనాంతరూపము కానవచ్చుచున్నదికదా! ''కేళ్ళింతికిన్ ''అని యాముక్తమాల్యదయందును బహువచనాంత ప్రయోగము చూపట్టుచున్నది. కాన ''కేలు''శబ్దము నిత్యైకవచనాంతము కాదు. ఉభయ వచనములును గల యుకారాంత శబ్దము ''ఇరు గేలుల కనుపట్టు''అను విష్ణుపురాణ ప్రయోగమును దీని బహువచన రూపమునకుఁ బ్రమాణ మగుచున్నది. ''కేలు''అనునది యేకవచనాంతరూపము కనుకనే ''పైటకొంగు కేలున నులిపెట్టుచు''నని శుకసప్తతియందు నవర్ణకాంతముగాఁ బ్రయోగింపఁబడెను. కేలునను నవర్ణకాంతమున ''కేషాంచి దుదంతానాం నేతి విభక్తావునోలుక్స్యాత్'' అను సూత్రముచే ఉన్లోపమువచ్చి కేలన్ అని రూపము నగును. ''ఒక కేల'' నిత్యాదిక మిట్టిదే. ఇది యాపవిభక్తిపరమైనచో ''నాప విభక్తికంబుల తృతీయా సప్తముల కత్వంబాదేశంబు బహుళంబుగా నగు''బాల. సూ. చేతను గేల నని సిద్ధించును.

బాలవ్యాకరణమున నీ శబ్దములు నిత్యైకవచనాంతములు ; ఈ శబ్దములు నిత్య బహువచనాంతములు నని వివరింపఁబడలేదు. ప్రసంగవశమున నప్పుడిప్పు డను శబ్దములు నిత్యైకవచనాంతములని చెప్పెనేకాని యితరశబ్దముల విషయమున నేమియుఁ జెప్పియుండలేదు. ఆ కారణముచేఁ బ్రౌఢవ్యాకర్త యూ

విషయము నీ సూత్రము మొదలు ౩౨. వ సూత్రము వఱకును వివరించు చున్నాఁడు.

పాణినీయమున నిత్యైకవచనాంతములు నిత్యబహువచనాంతములు నను విభాగము చెప్పఁబడలేదు. ఇట్టివానిని ప్రయోగమునుబట్టియే తెలిసికొనవలయు నని వారి యాశయము. నిఘంటువు లీ విషయమును బోధించుట యాచారము. అట్టి తలంపుతోడనే బాలవ్యాకర్త యీ విషయమును జెప్పలేదు కాని వచనముల విషయము, విభక్తుల విషయము వ్యాకరణము చెప్పుటయే సమంజసముగా నున్నది. ఇట్టి విషయము చెప్పుట కొక యనుగమము సులభముగాఁ గానరానందున గణములుగా నేర్పాటు చేసికొని "అజాద్యతష్టాప్" ఇత్యాదిగాఁ గొన్ని విధానములను జేసినట్లే "యక్కడాదులు" ఇత్యాదికముగా గణముల నేర్పఱచుకొనియుఁ గొన్నిచోట్ల సస్యవాచకత్వము మున్నగు ననుగత ధర్మములను బట్టియు వచన నిర్ణయము చేయుటకుఁ బ్రౌఢవ్యాకర్త పూనుకొనుట యుచితముగనే యున్నది.

సూ॥ సస్యవాచక శబ్దములును. ౨౯

ఉ॥ ఆరుగ, చోడి, వరి, కంది, పెసర, మినుము మొ॥

"నిత్యైకవచనాంతములు" అను పూర్వ సూత్రములోని పదము 33 సూత్రము వరకును అనువృత్తమగును. సస్యములనగా చేలు అని యిచ్చట తెలియఁదగును. ఇట్టివి సంస్కృతమున జోషధులని చెప్పఁబడును. సస్యశబ్దమునకు "పంట" అనగా ధాన్యాదులనియు నర్థము గలదు. "వృక్షాదీనాం ఫలం సస్యమ్"అని యమరుఁడు చెప్పెను. కాని చేను అను నర్థముకూడ వ్యవహారమున నున్నది.

వరి, కంది, మున్నగు చేలను చెప్పెడిశబ్దములు నిత్యైకవచనాంతములుగా నుండునని భావము.

ఈ శబ్దములకే వాని పంట యను నర్థముకూడఁ గలదు. అప్పు డీ నియమము వర్తింపదు. అందుచే సస్యవాచకములని చెప్పఁబడెను.

అరుగ – ఇత్యాదు లుదాహరణములు అరుగచేను, చోడిచేను అను రీతి నర్థము గలుగును. పంట యర్థమయినచో అరుగలు, చోళ్ళు, కందులు, అనురీతి నుండును.

సూ॥ కతిపయ సంభారవాచక శబ్దములును ౩౦

ఉ. ఆముదము, ఇంగువ, ఉప్పు, చింతపండు, చమురు, పసుపు మొ॥

సంభారమనగా సామగ్రి. నిత్యవ్యవహారమున గృహోపకరణములుగా నుండెడి సామానులని భావము. అట్టివానిలోఁ గొన్ని నిత్యైకవచనాంతములని భావము. ఆముదము – ఇత్యాదు లుదాహరణములు.

సూ॥ లోహవాచక శబ్దములును. ౩౧

ఉ ఇత్తడి, ఇనుము, కంచు, బంగారు, వెండి మొ॥

లోహ వాచకశబ్దములన్నియు నిత్యైకవచనాంతములే యని యర్థము. ఇత్తడి మున్నగునవి యుదాహరణములు

ఈ రెండు సూత్రములకును నుదాహరణములగు పదార్థములు ఏకీకృతములయి యేకపదార్థముగా భాసించునవి ఆ కారణముచే నయ్యవి యేకవచనాంతముల యగుచున్నవి లోహములన్నియు నేకీకృతములయి చూపట్టును. సంభారవాచకములలో మాత్రము ఏకీకృతములయి యేకపదార్థముగా భాసించునవి యేకవచనాంతము లగుచున్నవి వీనియందు బహుత్వముకూడ నొక్కొకచో వివక్షితమయి బహువచనాంతములుగను నా శబ్దములు కన్పట్టును. నేతులు, నూనెలు, బంగారాలు (చూ. వెండి బంగారాలు) మున్నగునవి వాడుకలోఁ జూపట్టుచున్నవి. వచనముకూడ చాలచోట్ల వైవక్షికముగనే యున్నది.

సూ॥ సమానార్థకములయిన యీ, డెన, సరి, సాటి, లోనగు దేశ్య విశేషణ శబ్దములును ౩౨

ఉ॥ క. స్వరములు నురములు శిరములుఁ గరములు బెందొడలు మెడలు గన్నులు వెన్నుల్, సురుచిరపదములు రదములు నిరువురకును జూడ నొక్కయీడై యునికిన్. రామా. కిష్కిం. ౧౯౨. క. పతిఁ బడసి సుతులఁబడయగ నతివలు గోరుదురు కోరినట్టుల తనకున్ । బతిఁబడసి సుతులఁబడసెను, సతులీభార్గవికి భాగ్యసంపద నెనయే. భార, ఆది. 3 ఆ. ౧౩౧ క. సురపతి యమ వరుణ ధనేశ్వర కమలాసనుల దివ్యసభలెల్ల నరేశ్వర చూచితి నవి దీనికి సరిగా వత్యంతవిభవసౌందర్యములన్. భార, సభా. ౧ఆ. ౫౯. ఉ॥ హేమధరాధరేంద్రమున

కెంతయుఁ బెద్ద ధృతిన్ భుజంగమస్వామికి మేలుచేయు పటువాగ్విభవం
బున బుద్ధిసంపదం దామరచూలికిన్ సరి ప్రధానులు దక్కినవారు
సాటియే మామిడి వీరభద్రమన కమాత్యశిఖామణి కివ్వసుంధరన్. నై. ౧౪. ౨౮. మొ. సరులులేని దృక్షంజనశాబకములు అని యొకచోఁ ప్రయోగము కానంబడుచున్నది. అది శబ్దాలంకారతత్పరత్వమునఁ బ్రౌఢముగాఁ జెప్పబడినదని గ్రహింపవలయును.

"సమాన"అను శబ్దముయొక్క యర్థముగల ఈడు, ఎన, సరి, సాటి, మొదలగు విశేషణములయిన దేశ్యశబ్దములును నిత్యైకవచనాంతము లగును.

స్వరములు. .. ఒక్కయీడై యునికిన్ – ఇచ్చట "ఈడు"అనుశబ్దము "స్వరములు" 'ఉరములు'మున్నగు విశేష్యములు బహువచనాంతములయి యున్నను నేకవచనముతోడనే ప్రయోగింపఁబడెను.

"సతులీ భార్గవికి భాగ్యసంపద నెనయే". ఇట విశేష్యమగు "సతులు" అను శబ్దము బహువచనాంతమయినను 'ఎన'అను సమానార్థక విశేషణము ఏకవచనాంతముగా నున్నది.

"సురపతి... .. అవి దీనికి సరిగావు... .. " ఇచ్చట అవి అను విశేష్యము బహువచనాంతము. సరి అనునది ఏకవచనాంతముగా నున్నది.

"... ...తక్కినవారు సాటియే... .." ఇచట "తక్కినవారు" విశేష్యము. ఇది బహువచనాంతమే అయినను "సాటి"అనున దేకవచనాంతముగా నున్నది.

"సరి"యను శబ్దము బహువచనాంతముగా "సరులులేని దృక్షంజన శాబకములు"అని శ్రీనాథుఁడు ప్రయోగించెను. కాని యయ్యది యుచితము కాదనియు శబ్దాలంకారమునందలి యాసక్తిచే నాతఁడట్లు ప్రయోగించినను గ్రాహ్యముకాదనియు గ్రంథకర్త యాశయము. (నిరంకుశాః కవయః అన్నట్లు స్వాతంత్ర్య మవలంబించెనని భావము).

"విశేష్యములకుంబోలె విశేషణంబులకు లింగ విభక్తి వచనంబు లగు" నను సూత్రముచే బహువచనము ప్రాప్తించుచుండగా నేకవచనమునందే యీ శబ్దములు కానవచ్చుట యీ సూత్రముచే నగు నిత్యైకవచన విధానముచేతనే యని తెలిసికొనవలయును,

ఇందు మొదటి యుదాహరణమున 'ఈడు'అను శబ్దము సమానార్థకము కాదు. ''సతులు సమానలా! అవి దీనికి సమానములుకావు తక్కిన ప్రధానులు సమానులా?'' అనురీతిని మిగిలిన యుదాహరణములలో ఎన, సరి, సాటి, అను మాటలు సమానము అను నర్థము నిచ్చుచున్నట్లు ''స్వరములు ఒక్క సమానములయి''అని యర్థము నిచ్చువో నన్వయింపదు ఇచ్చట 'ఈడు' అను పదము తీరు (రీతి)అను నర్థము నిచ్చును ఒక్కయీడై యనగా నొక్క తీరుగలవై యని యర్థము అనగా నిచ్చట 'ఈడు'శబ్దము ధర్మవాచకముగాని సమానార్థకము (ధర్మివాచకము) కాదు సమానార్థకమే యయినచో దానికి విశేషణముగా 'నొక్క''శబ్దము కుదురదు. ఒక్క సమానము అనురీతిని ప్రయోగ యోగ్యత లేదుగదా! ఒక్కతీరు అని యర్థముచేసినచోఁ జక్కగా నన్వయించును కనుక నీ యుదాహరణము సరికాదు.

సూ॥ గుణరసవాచకములయిన దేశ్య విశేషణ శబ్దములను. 33

ఉ॥ ఈ కాళ్ళు తెలుపు, ఆ కాళ్ళు నలుపు, ఈ పండ్లు తీపు, ఆ పండ్లు పులుపు మొ॥

తెలుపు, నలుపు, మున్నగు రంగులను బోధించు శబ్దములును పులుపు తీపు మున్నగు రసములనుజెప్పు శబ్దములును నేకవచనాంతములే యగునని యర్థము. కాళ్ళు పండ్లు అను విశేష్యములు బహువచనాంతములుగా నున్నను తెలుపు, నలుపు, పులుపు, తీపు అను విశేషణము లేకవచనాంతములుగనే యుండుటచే నుదాహరణము లగుచున్నవి.

తెలుపు, నలుపు, తీపు, పులుపు, అను శబ్దములు తెలుపురంగు గలవి, నలుపురంగు గలవి, తీపు గలవి, పులుపు గలవి, అని యర్థము నిచ్చుచున్నవి. కేవలము రంగును రసమును మాత్రము బోధించినచో విశేష్యములతో నన్వయింపవు. ఆ కారణముచే నీ శబ్దము లాయా రంగులను, రసములను బోధించుచున్నట్లే యవి గలవానినిగూడ బోధించును. సంస్కృతమునను నీల పీతాది శబ్దము గుణవాచకములుగను గుణివాచకములుగను గూడ నంగీకరింపఁబడెను, ''ఆ కాళ్ళు నలుపు''అనుచోట ''నలుపు''అను శబ్దము గుణివాచకమయి విశేషణ మగుచున్నది. ''దాని నలుపు''అనుచోట గుణవాచకమయి విశేష్యమగుచున్నది.

రూపరసగంధస్పర్శాదులు గుణములనియే శాస్త్రజ్ఞుల యాశయము

కావున "గుణవాచకములు" అనుటచేతనే రసవాచకములును గ్రహింపఁబడును. కావున "రస" శబ్దమును సూత్రమున వేఱుగా గ్రహింపనక్కఱలేదు. ఇందలి గుణశబ్ద మొక్క రంగులనుమాత్రమే యుద్దేశించి చెప్పఁబడినదనినచో రస శబ్దమును బ్రయోగింపవచ్చును కాని, ఎత్తు, పొడవు, బరువు, తేలిక, మున్నగు గుణవాచకములకుఁగూడ నీ విధానము తొలఁగఁబోవును. ఈ కాళ్ళు నలుపు అనునట్లే ఆ కాళ్ళు పొడవు మున్నగునవియు నంగీకరింపఁదగినవిగాఁ దోఁచుచున్నది

సాధారణముగా తెలుపు, పులుపు మున్నగునవి విశేష్యములుగనే వాడఁబడుచున్నవి. విశేషణములుగాఁ బ్రయోగింపవలసినచో నల్లనిది, తెల్లనిది, పుల్లనిది మున్నగు రూపములతో నుండును లేదా అగు ధాతురూపముతోఁగూడి నలుపగు, తెలుపగు, పొడవగు మున్నగురీతి నుండును. ఇంపు, సొంపు మున్నగునవియునగు ధాతురూపయుక్తములగుచునే విశేషణములుగా వాడబడుచున్నవి.

**సూ॥ కొన్ని యవ్యయంబులు బహువచనాంతతుల్యంబులు నగు. ౩౪.**

**ఉ॥ అట్టు, అట్లు, ఇట్టు, ఇట్లు, ఎట్టు, ఎట్లు, నిచ్చ, నిచ్చలు. మొ.**

కొన్ని యవ్యయములంతమున "లు"అను వర్ణము చేరియుఁ బలుకఁబడుచుండునని తాత్పర్యము. ప్రథమా బహువచన ప్రత్యయమగు "లు"అను వర్ణము చేరియున్నట్టులును వేరొక రూపమును బొందియుండునని భావము. అట్టు, అట్టులు, అనురీతిని రెండేసి రూపములుండునని భావము ఇవి యవ్యయములు కావున విభక్తిప్రత్యయములు చేరరాదు. అందుచే వీని యంతమునఁ జేరిన "లు"అను వర్ణము బహువచన ప్రత్యయమనుటకు వలనుపడదు. కావున బహువచనాంతమనక బహువచనాంతతుల్యమని చెప్పఁబడెను. అట్టు, ఇట్టు, ఎట్టు అనువానికి "లు"చేరి ఉకార ద్విత్వములు లోపింపగా నిలిచిన రూపముల నుదాహరించెనని తెలియఁదగును. అట్టులు, ఇట్టులు, ఎట్టులు, అనియు రూపంబులు సమ్మతములే.

**సూ॥ అందఱాదులు నిత్యబహువచనాంతములు. ౩౫**

**ఉ॥ అందఱు, ఇందఱు, ఎందఱు, కొందఱు, పెక్కండ్రు పలుగుండ్రు.**

అందఱు మున్నగు శబ్దములెల్లప్పుడును బహువచనాంతముల యగును గాని యేకవచనాంతములుగా నుండవని యర్థము. బాలవ్యాకరణమున "అన్ని మొదలగు శబ్దములాఱును ద్విప్రభృతి సంఖ్యావాచకంబులును మహదర్థంబులు బహువచనాంతంబు లగు" (అచ్చ ౨౮. సూత్రవివరణము)నని చెప్పఁబడియెను. కనుక ఇయ్యది నూతనవిషయముకాదు ఈ సూత్ర మనావశ్యకమే యనఁదగును. నిత్యబహువచనాంతశబ్దములను సూచించుటావున వీనింగూడ స్పష్టార్థమై యనువదించెనని మాత్రము తెలియఁదగును.

సూ॥ అదరులు లోనగు శబ్దములును. ౩౬

ఉ. అదరులు, అఱువుళ్ళు, ఎంషువులు, మిఱుఁగుఱులు. మొ॥ ఇవి వృత్తియం దేకవచనాంతంబుల యగు. ఉ. అదరుటగ్గి. మొ॥

"అదరులు" మొదలగు శబ్దములు నిత్యబహువచనాంతములని యర్థము, సమాసాదివృత్తులందు మాత్రము బహువచనాంతములుకాక యేకవచనాంతములే యగునని వివరణమున కభిప్రాయము

ఆలోచింపగా సమాసాదివృత్తులం దేవచనమును నుండదు. "సమాస విభక్తికి లోపంబగు" నను సూత్రముచే విభక్తిప్రత్యయములకు సాధారణముగా లోపమువచ్చును. అయినను బహువచనాంతముల కుత్తరపదముతో సమాసము వివక్షించునవుడు లడాగమమునకు లోపమురాకుండును గావున "సీతారాముల దయ" ఇత్యాదులందు లకారము వినవచ్చుచుండును అయ్యదిమాత్రము విభక్తి ప్రత్యయమగు "లు"అని భ్రమింపరాదు. అది యాగమము. చింతామణియందు మాత్రము "ల" అను విభక్తిప్రత్యయము చెప్పఁబడెను. (అయ్యది ద్వితీయా బహువచన ప్రత్యయము.) కాని తృతీయాది బహువచములందు కానవచ్చెడి లకారము మాత్రము ప్రకృతికి వచ్చెడి యాగమమేకాని ప్రత్యయము కాజాలదు. "మహతో౽పిలా విభక్తౌ టాదౌవచనద్వయేక్రమేణ స్తః" అని చింతామణి సూత్రము. లకారము వృత్తియందు కానవచ్చుచున్నను నేకవచనప్రత్యయము మాత్ర మెచ్చటను గానరాదు "వనముయొక్క రమ్యత" అనుచోట "వనము రమ్యత" అనునది సమాసము. ఇందు వినవచ్చుచున్న ముకారము ప్రథమా ప్రత్యయమని యనుకొనరాదు. అయ్యది ప్రకృతికిఁజేరిన ముగాగమము. కాన వృత్తియం దేకవచనాంతంబుల యగుననుమాటకు సమాసమును వివక్షించు

నపుడు మాత్రము ఈ పదములు పూర్వపదములుగా నున్నప్పు డేకవచనాంతములుగ నుండవచ్చుననియు సమాసమగునపుడు విభక్తి యెట్లును లోపించుననియు సూత్రకర్త యాశయముగా గ్రహింపనగును.

వృత్తియందు = వృత్తిని వివక్షించునపుడు, అని తాత్పర్యము అనఁగా విగ్రహావస్థయం దేకవచనమే యుండునని యాశయము. కాని యదరులయగ్గి, మిడుఁగుఱులగుంపు మున్నగు సమాసముల నెందులకు నిషేధించెనో తెలియదు. ఏకవచనాంతంబుల అనుచోటి అవధారణార్థకము ఇట్టిరూపములను నిషేధించుచున్నది. ఇది విమర్శనీయము వృత్తియం దేకవచనాంతంబులును నగునని వివరించుట యుచితము. అపు డదరుటగ్గి, మిడుగురులగుంపు మొదలగు రెండు విధములగు రూపములును సాధువు లగును.

సూ॥ తఱుచుగ ధాన్యవాచకశబ్దములును ౩౨

ఉ. ఆళ్ళు, చోళ్ళు, వడ్లు, కందులు, పెసలు, మినుములు. మొ॥ తఱుచుగ ననుటచే బియ్యము, జీలకఱ్ఱ – ఇవి ధాన్యవాచకములయ్యును నిత్యైకవచనాంతములేయని గ్రహింపవలయును.

ధాన్యవాచకములగు ఆళ్ళు చోళ్ళు మున్నగు చాలశబ్దములు నిత్య బహువచనాంతములుగ నుండును. బియ్యము జీలకఱ్ఱ మున్నగు కొన్నిశబ్దములకు ధాన్యవాచకములయినను నిత్యబహువచనాంతత్వమురాక (సంభారవాచకములగుటచే) నిత్యైకవచనమవచ్చునని భావము. తఱచుగా ననుపదమునకు ధాన్యవాచకశబ్దములలోఁ జాలశబ్దముల కీవిధి వర్తించుననియుఁ గొన్నిశబ్దములకు మాత్రము వర్తింపదనియు భావము. అంతియకాని యొకేశబ్దమునకుఁ దఱచుగా బహువచనము వచ్చుచు నక్కడక్కడ ననగా విరళముగా నేకవచనమును వచ్చుననియు నర్థముసేయరాదు.

సూ॥ క్రీడావిశేషవాచకశబ్దములును. ౩౩

అచ్చనగాయలు, ఓమనగుంటలు, కనుమూసిగంతలు, గుజ్జెనగూళ్ళు, బొమ్మపెండ్లిండ్లు, ఉప్పనబట్టెలు, కుప్పిగంతులు, గొబ్బిళ్ళు, దాఁగిలిమ్రుచ్చులు, పుట్టచెండ్లు, బిల్లగోళ్ళు, సరిబేసులు మొ॥ ఒకానొక కవి యిందుఁ గొన్నిటి నేకవచనాంతములుగాఁ బఠించియున్నాఁడు. అది విచార్యము.

ఆటలలోని రకములనుజెప్పెడి "అచ్చనగాయలు" మొదలగు శబ్దము లును నిత్యబహువచనాంతములేయని తాత్పర్యము. కవులలో నొక్కరు వీనిలోఁ గొన్నిటి నేకవచనాంతములుగాఁ బ్రయోగించిరనియు నయ్యది యసమ్మత మనియు వివరణాశయము.

"క్రీడావాచకశబ్దములు" అని సూత్రించినచో "ఆట" మున్నగుశబ్దముల కును నిత్యబహువచనము రావలసివచ్చును. అందుచేఁ గ్రీడాసామాన్యవాచక ములను దప్పించి తద్విశేషవాచకములకుమాత్రమే గ్రహణమువచ్చునట్లు సూత్రించెనని తెలియఁదగును.

సూ॥ తఱచుగా స్త్రీసమంబులగు దేశ్యశబ్దంబులకుఁ గడపలఁ గొన్నిం టి కేకవచనంబునం బూజ్యతయందు గారుశబ్దం బగు. ౩౯

ఉ. అయ్యగారు, అమ్మగారు, తల్లిగారు, తండ్రిగారు, రాజు గారు, రాణిగారు, సెట్టిగారు, నాయఁడుగారు, దేవిగారు. మొ॥ చ.మామగారనుటయకాని మా దశరథావనిభర్తకు మీకు భేదమే. ఉ.-రా.౫ ఆ.౨౫౨ మొ॥ (నాయఁడుగారు, దేవిగారు. వీనికిఁ దఱచు శబ్దంబు శరణంబు.)

స్త్రీసమములగు శబ్దములనగా ప్రథమైకవచనలోపము మొదలగు స్త్రీ లింగశబ్దములకు వచ్చెడి కార్యములను బొందునట్టి శబ్దములు. అట్టి దేశ్యశబ్దము లకు అంతమున నేకవచనాంతములగునపుడు గౌరవార్థమున గారు శబ్దముచేరును. ఇయ్యది వైకల్పికము.

అయ్య, అమ్మ మొదలగు శబ్దముల కేకవచనప్రత్యయములు చేర్పదలచు నపుడు గారు అనునది చేరి అయ్యగారు అమ్మగారు ఇత్యాదికముగా నగును. సూత్రమునందలి దేశ్యశబ్దమునకు అచ్ఛికములని యర్థముగాఁ దెలియవలయును. కానిచోఁ దద్భవములగు రాణి అమ్మ మున్నగువానికిని ఈ విధి వర్తింపక పోవును. సూత్రోక్తకార్యము నాయడు, దేవి అను వానికి మాత్రము వర్తింప దని భావించి తఱచు శబ్దబలముచే వానికి వర్తింపఁజేయవలయునని గ్రంథకర్త వివరించుటవలన నుదాహృతములగు మిగిలినశబ్దముల కన్నింటికిని నీ విధి సహా జముగనే వర్తించునని యాశయముగాఁ దోఁచుచున్నది. అన్నిశబ్దములకును వర్తించుటకై దేశ్యము లనగా సంస్కృతసమేతరశబ్దము లని భావింపవలసి

యున్నది. అట్లనుటచే రాణిగారు మున్నగుశబ్దములు సాధ్యము లగును. రాజు శబ్దముకూడ కొందఱిమతమున వైకృతమనుటచే నీ కార్యమును బొందునని యూహింపఁదగును.

ప్రాతిపదికములమీదనే యీ గారు శబ్దముచేరి విభక్తిప్రత్యయము లీ గారుశబ్దము చివరనే చేరును. అంతియగాని అయ్యాదులు విభక్తిప్రత్యయాంతము లయినపిమ్మట గారుశబ్దము చేరెనన్నచో ద్వితీయాదివిభక్తులును జేరి (గారు శబ్దమునకుఁ బూర్వము) "అయ్యచే గారిచే" మున్నగు ననిష్టరూపములు కావలసివచ్చును. కావునఁ బ్రాతిపదికముమీదనే 'గారు' చేరునని చెప్పవలయును. లేదా ప్రథమైకవచనాంతతుల్యరూపమునకు గారు చేరుననియైనను జెప్పవచ్చును. ఇట్లుచెప్పినచో నాయఁడుగారు అనుచో "డు" అను వర్ణకము గారునకుఁ బూర్వము వినఁబడుటయు విరుద్ధముకాకపోవును కాని యీ యర్థము సూత్రమునుబట్టి వచ్చుట కష్టము. ఏకవచనంబునన్ అనుచోట ప్రథమైకవచనమున నని చెప్పియుండినచో నెట్లో యీ యర్థమును సంపాదింతుము. అట్లు చెప్పలేదు.

ఏకవచనం బనగా నేకవచనప్రత్యయమని యర్థము. ఏకవచనంబునన్ అనగా ఏకవచనప్రత్యయమునందు అను నర్థమువచ్చును. అట్టియర్థము అన్వితము కాదు. (సరిపడదు) అందుచే అయ్యాది ప్రాతిపదికములకు ఏకవచనంబున నేకత్వము వివక్షించునపుడు గారు శబ్దము చేరునని చెప్పవలయును. అనగా గారు శబ్దాంతమున కేకవచనముతోడనే ప్రయోగముండునని తాత్పర్యము అయ్య అను శబ్దముచే బోధింపఁబడువ్యక్తి ఒక్కడే అయియుండవలయునని భావము. తల్లిగారు, తండ్రిగారు, మున్నగు శబ్దములు చాలమంది తల్లులను చాలమంది తండ్రులను బోధింపవు ఆ కారణముచే "నేకవచనంబునన్" అను పదమునకు "ఏకత్వార్థము వివక్షితమగునవుడు" అని యర్థముచేయవలయును ప్రాతిపదికము గారు శబ్దముతో నాగమముతోవలెఁగూడి యభీష్టములగు విభక్తులతోఁ బ్రయోగింపఁబడుచుండును. "నాయఁడుగారు" అనుచోట మాత్రము 'డు' అనుదానిని బహుళార్థక తఱచుశబ్దబలమువలననే సిద్ధింపఁజేయవలయును. ఈ గారు శబ్దాంతమునకుఁ బ్రథమావిభక్తి లోపించును. ద్వితీయాది విభక్తులు పరమగునపుడు రు, రి, యగునని యనంతరసూత్రము చెప్పును.

సూ॥ ద్వితీయాదులందు రు, రి, యగు. ౪౦

ద్వితీయాది విభక్తులయందు గారు శబ్దమునందలి రువర్ణము

రివర్ణం బగునని యర్థము. అయ్యగారిన్, అయ్యగారితోన్, అయ్య గారికిన్, మొ॥

పూర్వసూత్రోక్తమగు "గారు" లోని "రు" అనునది ద్వితీయాదివిభక్తి ప్రత్యయములు పరంబులగునపుడు "రి" అని మారునని యర్థము. అయ్యగారిన్ ఇత్యాదిక ముదాహరణము. ఈ గారు శబ్దము సర్వనామముకాదు. ఇందలి రు వర్ణము బహువచనప్రత్యయమునుగాదు ఇచ్చటి రువర్ణము శబ్దగతము. కావున నీ పరిచ్ఛేదమునందలి 90 సూత్రముచే "రు" వర్ణము "రి" అగుటకు వీలు కానందున నీ సూత్రముచే విధించుకొనెను.

సూ॥ డుమంతంబు లగు తత్సమాది శబ్దంబులకుం గొన్నింటికి ద్వితీయా బహువచనంబుమీదఁ బూజ్యతయందు గారునకు మాఱుగ వారగు. ౪౧

ఉ. శ్రీరాములవారు, వశిష్ఠులవారు, వ్యాసులవారు, స్వాముల వారు, రాయలవారు, మొ॥ శ్రీరాములవారిన్, శ్రీరాములవారితోన్ ఇత్యాదు లూహ్యంబులు.

ప్రథమైకవచన డుప్రత్యయము రాదగినశబ్దములు డుమంతంబులగును. డుక్ వర్ణకంబునకుం బ్రకృతియయి నది డుమంతం బనంబడునని బాలవ్యాకరణ మున నీ సంజ్ఞ చేయఁబడెను.

అట్టి తత్సమతద్భవాది శబ్దములకుఁ గొన్నిటికి ద్వితీయా బహువచ నాంతముమీఁదఁ బూజ్యతార్థముననే గారు అనునది వచ్చినట్లు వారు అనునది చేరునని భావము. "శ్రీరామ" అనునది డుమంత తత్సమము. శ్రీరాములన్ అనునది దీని ద్వితీయా బహువచనాంతము దీనికిఁ బిమ్మట వారు అనునదిచేరి శ్రీరాములవారు అని యయినది. "రాయలవారు" అనునది తత్సమేతరమునకు నుదాహరణము.

డుమంతంబులు కానివానికిని నీ కార్యము కొన్నిచోట్ల రావచ్చునని స్వాములవారు అను నుదాహరణముచే సూచించెను. స్వామిశబ్దము డుమంతము కాదుగదా !

ద్వితీయాదులు పరంబులగునపుడు ౪౦ సూ.చే వారులోని "రు" వర్ణము "రి" వర్ణమగుటయుఁ గల్గును.

తత్సమాదిశబ్దములనుటచే నన్నిశబ్దములకును నీ కార్యము రావచ్చును. కొన్నింటి కని చెప్పుటవలననే యనిష్టరూపములు వారింపఁబడును. కాన "తత్సమాది" అనుపద మిందు నిరర్థకము.

డుమంతములుకాని శబ్దములకును వచ్చుట సమ్మతము కావున నిచ్చట గూడ నాది శబ్దము చేర్చుట యుచితము. గారు వచ్చు శబ్దములకును వీనికినిగల వైషమ్యమునుజూపుట కిందలిపదములు నిరిష్టములగుచున్నట్లున్నవి స్త్రీసమంబులగు శబ్దంబులకు గారు, డుమంతంబులగు శబ్దములకు వారు, దేశ్యశబ్దములకు గారు, తత్సమాదిశబ్దములకు వారు, ఏకవచనాంతమునకు గారు, బహువచనాంతమునకు వారు, పూజ్యతార్థముమాత్రము సమానము. ఇట్టిసామ్యమును జూపి గారునకు బదులు వారు అనునది వచ్చెనని విధించెను.

గారునకు మాఱుగా అను మాటవలనఁ బ్రయోజనమేమియుఁ గానరాదు. గారునకుఁ బ్రాప్తియుండెడి శబ్దములయినచో దానిస్థానమున వారు అనుదానిని విధించుట యుచితము. అట్లు విధించుటవలనఁ బూర్వప్రాప్తమగు "గారు" నివృత్తమయి "వారు" అనునది వచ్చుట ప్రయోజనమగును. ఇచ్చట "వారు" వచ్చుటకు యోగ్యతగల శబ్దములకు "గారు" ఎట్లును బ్రాప్తింపదు. ఈ రెండిటికిని నిమిత్తములును స్థానములునుగూడ వేఱువేఱగునవియే. అందుచే నీ "గారునకు మాఱుగా" అనుట నిరర్థకము. ద్వితీయాదులందు గారు లోని రు, రి, యగునట్లే వారు లోని "రు" "రి" యగుట కిట్లుచెప్పబడెనని తలంచుటకును నవకాశములేదు. వారుశబ్దము తచ్ఛబ్దమగుటచే సర్వనామములలోనిది కావున ౯౦ సూ. చేతనే యీ రూపములు సిద్ధించును. ఈ "వారు" నకు ౮౦ సూత్రకార్యము రావలసియున్నచో "వారు"ను విధించినపిమ్మటనే యా సూత్రమును జెప్పుట యుచితముగనుండును. లేదా వివరణమున గౌరవభయములేదు గావున గారు శబ్దమునందలి రువర్ణము రివర్ణమగు ననుటకుబదులు "గారు, వారు" శబ్దములందలి రువర్ణము రివర్ణమగుననియే వివరించియుండును.

అయినను ఇందలి వారు శబ్దమునకుఁ దచ్ఛబ్దార్థము లేదు కావున నియ్యది సర్వనామముకాదనియు నాకారణమున ౯౦ సూ చే "రు" "రి" యగుటకు వీలుకాదనియు భావించి యీ వారు గారునకు బదులుగా వచ్చినదనుటచే దానికివచ్చెడి కార్యము (స్థానివద్భావముచే నని తాత్పర్యము) రు రి యగుట సంభవించుననియే ప్రౌఢవ్యాకర్త యాశయమని యీ సందర్భమునఁ దలంపవలయును,

"వారు" వచ్చెడి శబ్దము లేయే విభక్త్యంతములుగా నుండవలసి యున్నను నాఁ గా విభక్తు లనుప్రయుక్తమగు "వారు" నకే చేరునుగాని మూలశబ్దమునకుఁ జేరవు. 'శ్రీరాములవారు' అనుచోట "శ్రీరాముల" అను భాగమునకు ద్వితీయావిభక్త్యర్థమును లేదు. కావున నియ్యది ద్వితీయా బహు వచన ప్రత్యయమని యనరాదు ద్వితీయాబహువచనాంత తుల్యరూపమని చెప్పవలయును. అట్లుచెప్పనందున ద్వితీయాబహువచనము చేరిన శబ్దములకు మాత్రమే యీ "వారు" అనుప్రయుక్త మగుననియు శ్రీరామ + లు మున్నగు రీతిని ప్రథమాదివిభక్తులు వివక్షించునప్పుడు "వారు" రాదనియు నర్థమువచ్చును. వాస్తవముగా "శ్రీరామ" అను ప్రాతిపదికమునకు కర్త్రాద్యర్థములను వివ క్షించి తృతీయావిభక్తి చేయదలంచినపుడు శ్రీరామ + చేత అనియుండగా "శ్రీరామ" అను ప్రకృతి ద్వితీయాబహువచనాంత రూపతుల్యతను జెంది అనగా "శ్రీరాముల + చేత" అనియు "వారు" చేరఁగా శ్రీరాముల + వారు + చేత అనియుండి విభక్తికార్యములువచ్చి శ్రీరాములవారిచేత నని యగును కావునఁ బ్రకృతికే విభక్తి వివక్షించినను ద్వితీయాబహువచనాంతతుల్యరూపత వచ్చు నని సూత్రకారాశయమును గ్రహింపవలయును ఇందును నేకవ్యక్తిని బోధించు నపుడే యీ 'వారు' చేరుచున్నది గాని బహువ్యక్తులను బోధించునపుడుకాదు. శ్రీరాములవారు అనగా శ్రీరాముఁడొక్కఁడేగాని పలువురుగారు. గౌరవరూపా ర్థము మాత్రమే యిట విశేషము

ఇచ్చట ద్వితీయా బహువచనాంతముమీఁద వారు చేరుననగా శ్రీరాము లను అను ద్వితీయాబహువచనాంతరూపమును గ్రహించి "శ్రీరాములనువారు" అని ప్రయోగింపరాదు ఇచ్చట ద్వితీయానువర్ణకమునకు నిత్యముగా లోప మునుజేసి శ్రీరాములవారు అనియే ప్రయోగింపవలయును. సరళస్థిరంబులు పరంబులగునపుడు లోపసంశ్లేషంబులు విభాషనగు నను సూత్రమునంగల విభా షకు వ్యవస్థనాశ్రయించినచో నీ దుత్వనిత్యలోపరూపము సిద్ధించును.

**సూ॥ అర్థవిశేషంబునం దేకత్వంబునను గొన్నిశబ్దములకు మీఁద వారు చూపట్టెడు. ४२**

**ఉ.** అయ్యవారు. (ఉపాధ్యాయుఁడు, పూజ్యుఁడగు బ్రాహ్మ ణుఁడు, అట్టివేలుపు.) అమ్మవారు. (స్త్రీదేవత, పూజ్యయగు బ్రాహ్మణ

స్త్రీ) ఎ గీ. చిత్రమిది యయ్యవారి సంసేవవేళ, నమ్మవా రుగ్గడించిరో యనుచు నడిగె. కళా.౫ ఆ.౧౭౩. దేవరవారు (పూజ్యులగుమీరు).

పూజ్యత్వార్థమునందేకాక మఱికొన్ని యర్థములందును నేకత్వము బోధించునపుడు కొన్నిశబ్దములమీఁద "వారు" వచ్చుచున్నదని యర్థము. ఏకవచనాంతమునకే "వారు" చేరునని వ్యాకర్తయాశయముగాఁ గన్పట్టు చున్నది కాని ప్రాతిపదికమునకే యేకత్వమును బోధించునేని యంతమున "వారు" వచ్చునని తలంపవలయును కానిచో 'ఏకత్వమున' సని సామాన్య ముగాఁ జెప్పుటచే ద్వితీయాద్యేకవచనాంతములమీఁదను వారు చూపట్టవలసి వచ్చును.

కావునఁ బ్రాతిపదికమునకే యేకత్వము వివక్షించునప్పుడు విభక్తి ప్రత్య యము పరముగానుండగా 'వారు' అనునది చేరునని చెప్పవలయును. అట్లయి నచో అయ్య + చేత అని యున్నపుడుగూడ 'వారు' చేరి అయ్యవారిచేత అని సాధురూపమేర్పడును. కానిచో 'అయ్య' శబ్దమునకు "చేత" చేరి వినఁబడ వలసివచ్చును కానిచో గారు, వారు, అనువానికిఁ దరువాత వినఁబడు విభక్తి ప్రత్యయమును విధింపవలసివచ్చును. గారు వారు అనునవి యంతమునఁగల శబ్దములను సమానములనియు వ్యాకర్త తలంచినట్లు కానరాదు. కావునఁ బై రీతిని సూత్రార్థమును గ్రహింపవలసియున్నది.

అయ్యవారు అమ్మవారు, అనుచోట్ల నర్థవిశేషములు వివరణమునఁ బ్రయోగముతోఁగూడఁ జూపఁబడెను.

**సూ.॥ పూజ్యతయం దొక్కచో నామ తద్దేశ ద్యుష్మదస్మచ్ఛబ్దంబుల యేకవచనంబునకు బహువచనంబగు. అగుచో సంబోధ్య వాచకంబు బహువచనాంతంబు కాదు.** ౪౩

ఉ. మద్గురువుల... నడిగిన వారలు నన్ను నీ వంశ మికను క్షత్ర వంశంబుగాఁగల దనిరి కళా.౫ ఆ.౧౮౮. క. వీరెవ్వరయ్య ద్రుపద మహారాజులె (ఇక్కడ నిందయందుఁ బూజ్యత) భార. ఆది.౭ ఆ.౮౭ క. మీరలు వీరల విద్యాపారము చను టెఱుఁగవలయు. భార. ఆది.౫ ఆ.౩ శా. మాచిత్తంబున వేడ్కయుండునది నీ మాధుర్యధుర్యోర్వరు

వాగ్వైచిత్రిన్ సఫలంబుసేయుము. కళా.౧ ఆ ౧౩. సంబోధ్యవాచకంబు బహువచనాంతంబుగామికి. క. అతఁడు మీకుం బ్రియశిష్యుఁడట యమిథ్యావచనా. భార. ఆది.౫ ఆ.౨౮౦. మహితాత్మమీరలిమ్మహినుండ. కళా ౧ ఆ.౮౬. ఒక్కచో ననుటచే ఆచార్యుఁడు ద్రోణునకున్ శిష్యుఁడ. భార. ఆది ౫ ఆ.౨౩౭ మొ॥

నామములకును సర్వనామములలో ఆ, ఈ, నీ, నా, శబ్దములకును బూజ్యతయందు ఏకవచనంబునకుబదులు బహువచనంబువచ్చును. ఆ శబ్దములకు బహువచనంబు వచ్చినను ఆ శబ్దములచే బోధింపఁబడు వ్యక్తులను బోధించెడి సంబోధనార్థకశబ్దములు మాత్రము ఏకవచనాంతములేయగును. "మద్గురువులన్ ... అడిగిన" ఇట 'గురువు' అను నామమునకుఁ బూజ్యతయందు బహువచనమువచ్చి 'గురువులన్' అని యయ్యెను.

"వారలు నన్ను ... అనిరి " ఇట ఆతఁ డనుఁకుబదులు వారలు అని బహువచనముచేరెను. ఇది తచ్ఛబ్దమున కుదాహరణము

"వీరెవ్వరయ్య ... రాజులె" ఇచ్చట వీరు అను ఏతచ్ఛబ్ద బహువచనాంత రూపము వీఁడను నేకవచనాంతమునకు బదులుగా వచ్చెను. ఇచట యథార్థమయిన పూజ్యతలేదు. పర్యవసానమున నిందయే భాసించును. అయినను బూజ్యత ఆభాసమాత్రముగానున్నను నేకవచనమునకు బహువచనమువచ్చెను. "మీరలు . వలయు" ఇట నీవనుటకుబదులు మీర లని యయ్యెను ఇది యుష్మచ్ఛబ్దము అనగా నీ శబ్దము.

"మాచిత్తంబున ... సేయుము." మాచిత్తంబున ననుస్థలమున నాయొక్క చిత్తబున నను నేకవచనాంతంబునకు బదులుగా మాయొక్క చిత్తంబున నను బహువచనాంతరూపముతో సమాసమువచ్చెను. ఇది స్మచ్ఛబ్దము బహువచనాంతమగుట కుదాహరణము వీరెవ్వరయ్య యనుచోట "నెవ్వరు" అనుపదము వీరు అను విశేష్యమునుబట్టి బహువచనాంతమయ్యెను. అంతియకాని యయ్యది యీ సూత్రమున కుదాహరణముకాదు. ౪౭ సూత్రముచే దీనికి బహువచనము వచ్చెనని చెప్పనక్కరలేదు.

పై యుదాహరణములలో సంబోధనాంతశబ్దములు లేవు. కనుక సూత్రే ద్వితీయవాక్యమున కుదాహరణము వానిలో లేదు. అంతియకాక సంబోధ్య

వాచకమున్నప్పుడు దానికిసంబంధించినది ఒక్క "సి" శబ్దమేకావున మిగిలిన నామ తదేం ఉస్మచ్ఛబ్దములకుఁ బ్రయోగముగలచోట సంబోధనశబ్దమే యుండదు. అందుచే సూత్రమునందలి రెండవ వాక్యమొక్క "నీ" శబ్దమునకు సంబంధించిన విధానమే చేయుచున్నదని తెలియఁదగును

నీ శబ్దము బహువచనాంతముగా నున్నను సంబోధ్యవాచకము బహువచనాంతముగా నుండకపోవుటకు "అమిధ్యావచనా! మహాత్మా!" అనునవి యుదాహరణములు "మీకు, మీరలు" అని బహువచనాంతముగా నీ శబ్దము ప్రయోగింపబడినను దానికి సంబంధించిన సంబోధనార్థకశబ్దము లగు "అమిధ్యావచనా! మహాత్మా!" అనుపదము లేకవచనాంతములుగనే యున్నవి. అమిధ్యావచనులారా! మహాత్ములారా! యని బహువచనాంతములుగా లేవు. అట్లుండరాదు.

ఒక్కచో ననుటచే నీ కార్యము నిత్యముకాదని తెలియవలయును. కనుక నే "అచార్యుఁడు ద్రోణునకున్ శిష్యుఁడ" అనుచోటఁ బూజ్యత ద్రోణుని యందు భాసించుచున్నను ద్రోణా, చార్య శబ్దములకు బహువచనము రాలేదు. అనగా "నాచార్యులు ద్రోణులకున్" అని ప్రయోగింపఁబడలేదు.

పై యుదాహరణములలో వారలు, మీరలు, అనుపదములు బాల కార. ౩౩ సూత్రముచే సిద్ధించినవని తలంపరాదు. "వారు' అను పదమునకు వారలు అనియు మీ రను పదమునకు మీరలనియు రూపాంతరములని బాలవ్యాకర్త యాచ్ఛికపరిచ్ఛేదమున "అన్ని ప్రభృతులు సర్వనామంబులు" అను సూత్రము వివరణమున నిర్దేశించుటవలననే తెలియఁబడును.

"సంబోధ్యవాచకంబునకు బహువచనాంతంబు కాదు" అను పాఠము సరికాదు. "సంబోధ్యవాచకంబు బహువచనాంతంబు కాదు" అనియే యుండవలయును.

**సూ॥ సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యుఁ గ్రియలమీఁది యమ్మాదు లేకవచనాంతంబుల యగు. ౪౪**

ఆ. మనయశోద చిన్న మగవానిఁ గనెనట చూచివత్తమమ్మ సుదతులార. భాగ.౧౦ స్క-౦. పూ.౧౮౪. మొ॥

క్రియాపదములమీద "అమ్మ, అయ్య," మున్నగునవి కొన్నిచోట్ల నను ప్రయుక్తములగుచుండును. అట్టి యమ్మాదులు సంబోధనార్థక శబ్దము బహు

వచనాంతముగ నున్నను వానినిబట్టి బహువచనప్రత్యయములను బొందక యేక వచనాంతములుగనే యుండునని సూత్రార్థము

"వత్తమమ్మ సుదతులార" ఇందు "సుదతులార" అను సంబోధ్యవాచకము బహువచనాంతముగ నున్నది. దానినిబట్టి "వత్తము" అను క్రియాపదము మీదనున్న "అమ్మ" అనునది బహువచనాంతముకాక యేకవచనాంతముగనే యున్నది.

ఇచ్చట "అమ్మ" అనున దెట్టిపదమో విమర్శింపవలసియున్నది. సంప్రార్థనమున ముజ్జునకదాదులు విభాష నను ప్రయుక్తంబగునను బాలవ్యాకరణసూత్రమున (౩౩ క్రియ) చేరినదనుటకు వలనుపడదు "వత్తము" అనునది మధ్యమపురుషముకాదు కావున దానిచే నిట "అమ్మ"చేరుటకు వలనుపడదు. "వత్తము" అనునది లూడంతముకాదు కావున సంప్రార్థన మర్థమనుటకును వలనుకాదు. ఇయ్యది లాడంతము. లాట్టున కనేకార్థములు కలవు కావునఁ బ్రశ్నముగాని సంప్రార్థనముగాని యిచ్చట నర్థమనవచ్చును కాని "వందుదము" అనునది యుభయప్రార్థనార్థకమని బాలవ్యాకర్త తలంచుటచేత నియ్యదియు నట్లే ప్రార్థనార్థకమని భావింపవలయును కాని ప్రార్థనమున మాత్రమే బాలవ్యాకర్త దుగాగమమున కత్వము విధించుట యుచితముగాఁ గానరాదు. "మనము రేపు వత్తము" ఇత్యాది భావ్యర్థములందును దుగాగమమున కత్వము కానవచ్చుచున్నదికదా. మనము రేపు వత్తమా! అను ప్రశ్నార్థమునందును అత్వముగలదు. కావున నచ్చట నుభయకర్తృకత్వమున ననియుండవలయును. ఎదాదుల యను ప్రయోగముగూడ సంప్రార్థనముననేకాక సంప్రశ్నాద్యర్థమునను గానవచ్చుచున్నది. ఉందునా! పోదునా! అనుచోటి "ఆ"కార మెదాదులలోనిదేగదా! కావున నను ప్రయుక్తములగు నమ్మాదులకు సంప్రార్థన సంప్రశ్నాద్యర్థములు నుండవచ్చుననియే తోచుచున్నది. ఇక నా సందర్భమునుబట్టి యే యర్థము గలదో నిశ్చయింపవలయును.

సూ॥ పూజ్యతాతిశయంబున యుష్మదర్థ బహువచనంబునకుమాఱుగా
నాత్మార్థబహువచనంబు ప్రయుక్తంబగు. ౪౫

ఉ. స్వామీ! తాము దయచేయవలయును. మొ॥

పూజ్యతాతిశయంబునన్ = పూజ్యతయొక్క ఆధిక్యముచెప్పఁబడునప్పుడు. యుష్మదర్థ బహువచనమునకు = మీరు, మీరలు, మున్నగువానికి. మాఱుగా =

బదులుగా. అత్మార్థ బహువచనంబు = తాశబ్దబహువచనరూపము, అనగా తాము తమరు మున్నగునవి.

పూజ్యతయందు కొన్నిశబ్దముల కేకత్వంబున బహువచనప్రత్యయము లను విధించియున్నాడు. (చూ ౪౩ సూ.) ఆపూజ్యత యింకను నధికమని వివక్షించునపుడు "నీ" శబ్దమునకుబదులు "తా" శబ్దబహువచనరూపములు వచ్చునని తాత్పర్యము.

ఉ॥ తాము దయచేయవలయును. ఇందు "నీవు" అనుదానికి బదులు పూజ్యతాతిశయము వివక్షితమగుటచే "తాము" అని ప్రయోగింపఁబడెను. అతిశయము వివక్షితముగాక పూజ్యతా సామాన్యమును వివక్షించునపుడు బహువచనము మాత్రమువచ్చి "మీరు" అని యగును. అన్ని విభక్తులకును నిట్లే "తా" శబ్ద బహువచనాంతరూపములు వచ్చునని తెలియఁదగును. తమదయ మాయందుండవలయు నిత్యాదికము నెఱుంగునది. ఇచ్చట "స్వామీ" అను నేకవచనరూపము ౪౩ సూ చే సాధు వగుచున్నది.

సూ॥ సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దంబులకుం గొన్నియెడల బహుత్వం బగు. ౪౮

ఉ మీయిల్లు, మాయిల్లు. మొ॥ మాయత్త పృథ్వీసమాన పృథాదేవి. భార. అర.౫ ఆ.౩౦౮.

నీ, నా, శబ్దములకు సంబంధార్థమున నేకవచనమునకుబదులు బహువచనము కొన్నిచోట్ల వచ్చునని యర్థము. ఇచ్చట సంబంధమనగా షష్ఠీవిభక్త్యర్థమగు స్వస్వామిభావాదికమని తెలియవలయును.

మీయిల్లు; మీయొక్కయిల్లు మాయిల్లు, మాయొక్కయిల్లు అని యర్థము. ఇచట "నీయిల్లు" "నాయిల్లు" అనుటకుబదులుగా "మీయిల్లు" "మాయిల్లు" అని వాడెను.

"మాయత్త... దేవి" మాయత్త యనగా నాయొక్క యత్తయను నర్థమున బహువచనము ప్రయుక్తము.

ఈ బహువచనము సమాసమునందే వచ్చునని సూత్రమున విధింపక పోయినను ఫలిత మట్లేయగును. ఏమనగా సంబంధమనగా శేషషష్ఠ్యర్థకమగు యొక్క విభక్తియర్థము. కావున సంబంధార్థమున "యొక్క" విభక్తియే వచ్చును.

ఆయొక్కకు లోపమువచ్చుచుండుటయే భాషకు సహజము యొక్క లోపించు నపు డుత్తరపదము సమాసముచెందినట్లే యుండును. కాన దానిని సమాస మనియే వ్యవహరింతురు. అందుచే నీ సూత్రమునకు సమాసము విషయమని చెప్పవచ్చును. అనగా శేషషష్ఠికిఁ దెనుగున వ్యస్తప్రయోగము లేదనిభావము.

"మాయిల్లు" అనుచోట గౌరవార్థ మేమియు లేనందున నియ్యది యీ సూత్రమునకే విషయమగుచున్నది.

**సూ॥ కిమేకార్థకశబ్దంబులు క్రమంబున నజ్ఞాతవస్తూద్దేశ్య ప్రశ్నము నందును, నిర్దిష్ట స్త్రీపురుషాన్యతర ప్రశ్నమునందును, నిర్దిష్ట స్త్రీపురుషాన్యతర గ్రహణమునందును, అనిర్దిష్ట స్త్రీపురుషోద్దేశ్య వ్యాహారమునందును దఱచుగ బహువచనాంతంబు లగు. ౪౨**

ఉ. ఎవరక్కడ ? సీతారాములిద్దఱిలో నెవరు మిక్కిలి కరుణ గలవారు ? ఈ స్త్రీపురుషు లిద్దఱిలో దీని నొకరి కిమ్ము; ఒకరుపోయిన త్రోవ నొకరుపోరు; వారొక్కరేవచ్చిరి. ఇత్యాదులు గ్రాహ్యములు. తఱచుగ ననుటచే సీతారాములిద్దఱిలో సీత మిక్కిలి కరుణగలదా ! రాముఁడు మిక్కిలి కరుణగలవాఁడా ! ఇత్యాదిరూపముగా వాక్యమును వ్యాసముచేసియుఁ జెప్పనగునని తెలియవలయును.

నీవెవ్వ రిత్యాది విశేషప్రయోగంబులుం గలవు. క. నీవెవ్వ రేమిపనికై యేవలనికిఁ బోవుచునికియిది. భార. విరా. ౧ ఆ. ౨౯౭. చ. నీవు మునిసత్తమ యెవ్వఁడ వెట్టు లేను నీ తనయుఁడనైతి మజ్జనని తానదియెవ్వరు. మార్క. ౫ ఆ ౨౫౩ ఉ. వారలఁజూచి పల్కు రఘు వర్యుఁడు మీకిట జాతకర్మసంస్కారము లెవ్వ రుక్తవిధిఁ జల్పిరొగిన్ ధనురాదిశాస్త్రవిద్యారతులైతి రెవ్వరికతంబున నేగతి యుద్ధచాతు రిన్ నేరుచుకొంటి రెవ్వరవనిం దలిదండ్రులపేరు నావుడున్. జైమి. ౬ ౩ఆ. ౨౨౨. ఆ బ్రహ్మచారింజూచి మాయయ్య నీపేరెవ్వరనియడిగి. పర. ౩ఆ. నామము మేఘవర్ణుఁడన్. జై. ౨ ఆ. ౨౬. కొన్నియెడల నెవ్వరది పూర్వకంబయి కానంబడియెడి. సీ. అదియెవ్వరని ప్రతీహారు లెవ్వరి

నన్నుఁ దన్నుఁగాఁదలఁచి చిత్తమున నలుకు. నై. 3ఆ. ౧౮. అదియెవ్వారే పిలిచెదరు న న్నదియేమొ యరసివచ్చెదనంచు సురిగెనొకతె. కళా. ౭ ఆ. ౧౮౮. మొ॥

కిమేకార్థకశబ్దంబులు = కిమ్, ఏక అను శబ్దముల యర్థముగల తెలుగు శబ్దములు. అనగా "ఏ" "ఒక", అను శబ్దములు. క్రమంబునన్ = వరుసగా. అజ్ఞాతవస్తూద్దేశ్య ప్రశ్నమునందు = ఎరుగని వస్తువునుగూర్చిన ప్రశ్నముచేయు నపుడును. నిర్దిష్ట స్త్రీపురుషాన్యతరప్రశ్నమునందును = స్త్రీపురుషుల నిద్దఱను నిర్దేశించి వారిలో నొకరినిగూర్చిన ప్రశ్నముచేయునపుడు. నిర్దిష్ట స్త్రీపురుషాన్యతర గ్రహణమునందును = స్త్రీపురుషుల నిద్దఱను నిర్దేశించి వారిలో నొకరిని గ్రహించు నపుడును. అనిర్దిష్ట స్త్రీపురుషోద్దేశ్య వ్యాహారమునందును = నిర్దేశింపబడని స్త్రీ పురుషుల నుద్దేశించినమాటయందును, అనగా స్త్రీయనిగాని పురుషుడనిగాని నిర్దేశింపక సామాన్యముగా పలుకునపుడని భావము. బహువచనాంతంబు లగు = బహువచనప్రత్యయమును బొందును.

ఈ సూత్రము నీ క్రిందివిధములుగా రెండుభాగములఁ జేయవచ్చును.

I కిమర్థకశబ్దము (1) అజ్ఞాతవస్తూద్దేశ్య ప్రశ్నమునందును (2) నిర్దిష్ట స్త్రీ పురుషాన్యతరప్రశ్నమునందును దఱచుగ బహువచనాంతమగును.

## ఉదాహరణములు.

(1) ఎవరక్కడ ? ఆ స్థలమున నెవరున్నారో తెలియనియప్పుడు తెలి యని వస్తువునుగూర్చిన ప్రశ్నముకనుక "ఏ" శబ్దము బహువచనాంతమయి "ఎవరు" అని ప్రయోగింపఁబడెను. తఱచుగననుటచే "ఎవఁడక్కడ" అనియైన నుండును.

(2) సీతారాము లిద్దఱిలో నెవరు మిక్కిలి కరుణగలవారు ? – "సీతా రాములు" అను స్త్రీపురుషుల నుద్దేశించి వారిలో నొకవ్యక్తినిగూర్చియే ప్రశ్నించు టచే "ఏ" శబ్దమునకు "ఎవరు" అని బహువచనము వచ్చెను.

II. ఏకార్థకశబ్దము (1) నిర్దిష్ట స్త్రీపురుషాన్యతర గ్రహణమునందును (2) అని ర్దిష్ట స్త్రీపురుషోద్దేశ్య వ్యాహారమునందును దఱచుగ బహువచనాంతంబగు.

## ఉదాహరణములు.

(1) ఈ స్త్రీపురుషు లిద్దఱిలో దీని నొకరికిమ్ము—స్త్రీపురుషుల నిర్దేశించి వారిలో నొకరినిగ్రహించుటవలన నిందలి "ఒక" అను నేకార్థకశబ్దము నేకవచ నమునకు బహువచనమువచ్చి "ఒకరికి" అని యాయెను.

(2) ఒకరుపోయినత్రోవ నొకరుపోరు—ఇందు స్త్రీపురుషులను నిర్దేశింప లేదు. కావున ననిర్దిష్టులగు స్త్రీపురుషుల నుద్దేశించినవాక్కు అగుటవలన "ఒకరు" అని యేకార్థకశబ్దము బహువచనాంతమయ్యెను. ''వారొక్కరేవచ్చిరి'' అనునది కూడ దీనికే యుదాహరణము. ఇందును స్త్రీపురుష నిర్దేశముచేయక యొక వ్యక్తినిగూర్చిన వాక్కయియుండుటచే ''ఒక్కరు'' అనుపదము బహువచనాంత ముగా నున్నది.

(సూత్రమునఁ దఱచుగా ననుటచే వేఱొకరీతి నీ వాక్యమును పెంచియుఁ జెప్పవచ్చునని వివరించుచున్నాడు. తఱచుగా ననుమాట క్రియావిశేషణమగు టచే ''నగు'' నను పదముతో నన్వయించి తఱచుగా బహువచనాంతములగునని యర్థమునిచ్చును. కావునఁ దఱచుగా బహువచనాంతములగును. ఒక్కొక యప్పుడేకవచనాంతంబులును నగును అను నర్థమువచ్చును. కాని తఱచుగా నను పదమునకు వేఱొకరీతి నర్థమును గ్రంథకర్త వివక్షించి యిట్లువ్రాసెను.)

సీతారాము లిద్దఱిలో ..ఇత్యాద్యుదాహరణమునను మాత్రము "ఎవరు" అను శబ్దమున్నచో నేకవచనాంతముగా నెప్పుడును నుండదు. బహువచనము నిత్యమే. ''ఈ స్త్రీపురుషు లిద్దఱిలో...'' అను వాక్యమునందును బహువచ నము నిత్యమే. అందుచే నిర్దిష్ట స్త్రీపురుషాన్యతరవిషయమునఁ బ్రశ్నమయినను గ్రహణమయినను బహువచనమే పైశబ్దములకు సంభవించును. మిగిలిన రెండు స్థలములందును, అజ్ఞాత వస్తువిషయకమగుటచే మహత్తుగాఁ గాని మహతిగా గాని ప్రయోగించుటకు వీలుకాని స్థలమున ''ఎవరు'' అని బహువచనమే యుండును. అజ్ఞాత వస్త్వాదేశమయినను ఆ స్థలమునందుఁ బురుషులే యుందు రని నిశ్చయముండ యేపురుషుఁడో తెలియక ప్రశ్నించుచో ''నెవఁడక్కడ ?'' అనియునుండును. ఆ స్థలమున స్త్రీలే యుందురను నిశ్చయమున్నచో నా స్త్రీ యెవతెయో తెలియక చేయు ప్రశ్నమయినచో ''ఎవతెయక్కడ ?'' అనియు నుండునని తెలియవలయును. అనగా ప్రశ్నము వ్యక్తినిదెలియకయు వ్యక్తిగత మగు మహత్త్వ మహతీత్వా మహత్త్వములను దెలికయుఁ గూడ జరుగుచుం డును. వ్యక్తితోఁబాటు మహత్త్వామహత్త్వాదులును దెలియనిచో ''నెవర''ని బహువచమేయుండును. మహత్త్వ మహతీత్వములు తెలిసియనగా నిశ్చితము లయియుండి ప్రశ్నవిషయములు కానిచో వ్యక్తినిమాత్రమే ప్రశ్నించునపుడు మహత్త్వ నిశ్చయమున్నపుడు ''ఎవఁడక్కడ'' ననియు, మహతీత్వ నిశ్చయ

మున్నచో "నెవతెయక్కడ" ననియుఁ బ్రశ్నముండవచ్చును. ప్రశ్నమునందలి యజ్ఞాతాంశమునుబట్టి శబ్దము ప్రయోగింపఁబడుచుండును.

ఇట్లే అనిర్దిష్ట స్త్రీపురుషోద్దేశ్య వ్యాహారస్థలమునను మహత్త్వ మహతీత్వములు వివక్షించినచోఁ దదనుసారముగా "నొకఁడుపోయినత్రోవ నొకఁడు పోఁడు" "ఒకతెపోయినత్రోవ నొకతెపోదు" ఇత్యాదిరీతి నేకవచనాంతములుగ నుండవచ్చును. స్త్రీపురుష సామాన్యమును వివక్షించినపుడు ఉదాహరించిన రీతిని బహువచనమేయుండును. ఇట్లీశబ్దము లరూపములు బహువిధనులుగా నున్నవి.

("నీవెవ్వ రిత్యాది విశేషప్రయోగంబులుం గలవు" ఇత్యాదులవ్యాఖ్య) మీఁద చెప్పిన నియమములులేని స్థలములందును, బహువచనము వచ్చుటయు, విశేష్య మేకవచనాంతముగనున్నను నీ శబ్దములు బహువచనాంతములుగ నుండుటయు విశేష్య మమహత్తయినను నీ శబ్దములు మహద్బహువచనాంత ములుగ నుండుటయు, మున్నగు విశేషములు గలవని తాత్పర్యము.

"నీవెవ్వరేమిపనికై ..." ఇచ్చటవ్యక్తి యజ్ఞాతముకాదు. వ్యక్తిగత విశేషము మాత్రమే యజ్ఞాతము. "నీవు" అను విశేష్య మేకవచనాంతముగనే యున్నది. "మజ్జనని తా నది యెవ్వరు ?" అను భాగము మాత్రమే యుదాహరణము. ఇందు వ్యక్తిగత స్త్రీత్వము జ్ఞాతమే. వ్యక్తివిశేషము మాత్రమే యజ్ఞాతము. ఇచ్చట విశేష్యము "జనని" అనునది యేకవచనాంతమే యయినను "ఎవ్వరు ?" అనునది బహువచనాంతమయ్యెను. "తలిదండ్రుల పేరెవ్వరు ?" అనునది యుదాహరణము. "పేరు" అనునది యమహదేకవచనాంతముగనున్నను "ఎవ్వరు" అని మహద్బహువచనాంతముగా విశేషణముండుట విశేషము. ఇందు "జాతకర్మ ... ఎవ్వరు క్రవిధిఁ జల్పిరి ?" అనునది విశేషప్రయోగము కాదు. కావున నీ పద్యమున నయ్యది యుదాహరణముకాదు "తలిదండ్రుల పేరెవ్వరు ?" అనునదియే యుదాహరణము. అట్లే "ఎవ్వరికతంబున శాస్త్ర విద్యారతులైతి"రనునదియు నుదాహరణముకాదు. అవి సామాన్యోదాహరణము లే.

"మాయయ్య నీపేరెవ్వరు" అనుచోట విశేష్యము (పేరు) అమహదేక వచనాంతమే యయినను "ఎవ్వరు" అనునది మహద్బహువచనాంతముగ నున్నది. "అయ్యో నీపే రెవ్వరని యడిగిన" అను పాఠాంతరమునను భేద మేమియు లేదు.

"నామము మేఘవర్ణుఁడన్" అనుచోట కిమేకార్థకశబ్దంబులు లేనందున నుదాహరణముకాదని తోఁచును కాని యీ సందర్భమునఁ బ్రౌఢవ్యాకరణమున ముద్రణ దోషమునఁ గొంతభాగము పోయినది నీవెవ్వ రేమిచేసెద .. నామము మేఘవర్ణుఁడన్ "అని యుదాహరింపఁబడియుండును. నీవెవ్వరు అనునది యుదాహరణాంశము. ప్రత్యుత్తరమునుబట్టియు నీవనునది యేకవ్యక్తిబోధకమని సూచించుటకై "నామము మేఘవర్ణుడన్" అనువఱకు నుదాహరించియుండును. కానిచోఁ బ్రత్యేకముగ "నామము మేఘవర్ణుఁడన్" అనునదిమాత్ర ముదాహరించుట కుద్దేశింపఁబడియుండదు కిమేకార్థకశబ్దములులేని యీ భాగమును మాత్రమే యాతఁ డుదాహరించియుండఁడు. కావునఁ బైవాక్య ముదాహరణమున కుద్దేశింపఁబడెనని తెలియనగును. "నామము" అనుచోట "పేరున" అను పాఠము కానవచ్చుచున్నది.

కొన్నిచోట్ల "ఎవ్వరు" అనుపదమునకుఁ బూర్వము "అది" యనుపద ముండుటయుఁ గానవచ్చునని గ్రంథకర్త సూచించెను. దీనికుదాహరణముగా "నదియెవ్వరని .. అదియెవ్వరే పిలిచెదరు..." అనునవి చూపఁబడెను. ఇచ్చట నుద్దేశ్య మమహదేకవచనాంతముగను విధేయము మహద్బహువచనాంతముగను నుండుట విశేషము.

సూ॥ దేశ్యంబునం గొన్నియెడల మహన్మహత్త్వార్థక బహువచనాంత నామంబులపై మరల బహువచనప్రత్యయములు చూపట్టెడు. అచ్చో వారు, వీరు, మీరుశబ్దంబుల యంత్యోకారంబున కకారం బగు ౪౮

ఉ॥ వేడుకకాండ్రురు, కోడండ్రురు, వెలయాండ్రురు, పెక్కండ్రురు, చూపఱులు, ఒకరులు. మొ॥ వారలు, వీరలు, మీరలు. క. ఆడెడువారలకిచ్చును బాడెడువారలకునిచ్చు బట్లకునిచ్చున్ బాడబవరులకు నిచ్చును వేడుకకాండ్రురకునిచ్చు వివిధార్థంబుల్. వి.క్ర.౨ ఆ.౧౫౮ సుందరి నాకోడండ్రుర యం దభ్యర్హితవునీవ భార. సభా.౨ ఆ.౨౪౭. వెలయాండ్రురను గొంటీయల బరిచారికాశ్రేణు నొండొండ చెరలువట్టు. హరి. ఉ.౬ ఆ.౧౩౮. క. పెక్కండ్రుఁబాగికి

బెక్కండ్రురతోఁడ నొకఁడు పెనఁగఁగ గార్యంబొక్కటి యగునేనియుఁ దాబెక్కండ్రురతోఁడనైనఁ బెనఁగఁగఁ జెల్లున్. విజ్ఞా. వ్యా.౬౦. ఎ.గీ. చూపఱులచూడ్కి కొంక వింతసాబ గొనర్చె కళా. ౭ ఆ. ౭౮. మొ॥

దేశ్య శబ్దములలో మహద్వాచకములుగాని మహతీవాచకములుగాని యయిన బహువచనాంతశబ్దములకు మఱల బహువచనప్రత్యయములు కాన వచ్చుచున్నవి. అట్లు మఱల బహువచనప్రత్యయములు చేరునప్పుడు వారు, వీరు, మీరు, శబ్దములలోఁ జివరి యుకారము "అకారము"గా మాఱునని యర్థము.

ఇచ్చట నామములనగా సర్వనామములకును గ్రహణముగలదని తెలియ వలయును. అవియును నామవిశేషములే యగుటచే నిది యుచితము. "దేశ్యంబు నన్" అనునది జాత్యేకవచనము కావున దేశ్యపదములయందని యర్థము లభించును.

ఒకప్రత్యయము రెండుసార్లుచేరుట శాస్త్రవిరుద్ధము. అందుచే విధించు కొనవలసివచ్చెను. బాలవ్యాకరణమునఁ గొడవళ్లులు మున్నగు చోట్ల మఱల బహు వచనము వచ్చుటకు "ఒకానొకచో నామంబు సంశ్లిష్టబహువచనాంత తుల్యం బయి బహువచనంబు నెనయు" నని సూత్రింపఁబడెను కాని బహువచనప్రత్య యముతో సంశ్లేషమునుజెందిన కొడవండ్లు మున్నగుచోట్లనేకాని యసంశ్లిష్ట బహువచనాంతంబులగు "చూపఱు" మున్నగువానికి దానిచే మఱలఁ బ్రత్య యము రానందున నీ విధాన మావశ్యకమయ్యెను. బాలవ్యాకరణమున నొక్క "కొడవండ్లులు" అనుపదము మాత్ర ముదాహరించి ప్రయోగదృష్టంబులు గ్రహించునది యనుటచే "కోడండ్రురు" మున్నగునవి సాధ్యములే. అమహ దర్థములకే యాకార్య ముద్దేశింపఁబడెనని తలంపనక్కఱలేదు. అయినను "చూప ఱులు" మున్నగువానికొఱకీ సూత్ర మావశ్యకమే. "వారలు, వీరలు, మీరలు" అనునవియు బాలవ్యాకర్తచే నిపతింపఁబడినవియే యయినను సర్వనామముల కన్నింటికిని బ్రక్రియను వివరింపఁదలంచిన ప్రౌఢవ్యాకర్త యీ శబ్దములకును బ్రత్యయప్రాప్తిని జూపవలసివచ్చెను.

ఉ॥ వేడుకకాండ్రు – బాల అచ్ఛి. ౭ సూ. చే. వేడుకకాండ్రు అనిరూపము దీనిపై బహువచన లువర్ణక మీసూత్రముచే వచ్చును. అందలి లకారమునకు రేఫమువచ్చినఁగాని రూపసిద్ధికాదు. ఈ సూత్రమున "మఱల" అనుటచే మొదటిబహువచనప్రత్యయముతో సమానరూపముగల ప్రత్యయముచేరునని

యర్థముచేసి యిచ్చటి "లు" "రు" యగునని తలంపవలయును. అప్పుడు "వేడుకకాండ్రురు" అని యగును "కోడలు, వెలయాలు" అనుపదములు బహుత్వమున "నాల్వాదుల బహువచన లకారంబునకు... బాల. అచ్చి.౧౧ సూ.చే కోడండ్రు వెలయాండ్రు అనియయి యీ సూత్రముచే మఱల "లు" ప్రత్యయముచేరి "మఱల" నను సూత్రస్థపదబలమువలన "రు" అని కాఁగా "కోడండ్రురు, వెలయాండ్రురు" అని యగును. పెక్కుశబ్ద ప్రథమాబహువచనాంత రూపము బాలవ్యాకరణమునఁ బెక్కండ్రు అని నిపతింపఁబడెను. పిమ్మట నీ సూత్రముచే లువర్ణముచేరి "సర్వనామంబులకు మహదర్థంబునం దఱచుగ లు ల లకు రు ర లగు" నను సూత్రముచే (ప్రౌ. శబ్ద ౮౬ సూ.) "రు" అయి "పెక్కండ్రురు" అని యగును చూపఱు అనుచో నీ సూత్రముచే "లు" చేరి రుత్వము విహితముకానందున "చూపఱులు" అని యయ్యెను "ఒక" శబ్దమునకు "లు" పరముగానుండగా శబ్ద ౮౬ సూత్రముచే "రు" కాఁగా "ఒకరు" అనియయి మఱలఁ బ్రస్తుతసూత్రముచే "లు" చేరి "ఒకరులు" అయ్యెను. శబ్ద. ప.౮౬ సూత్రమునఁ "దఱచుగ" ననుటచే నిచట "లు" "రు" కాలేదని తలంపవలయును.

సూత్రమున "బహువచనప్రత్యయములు"అనగా నొక్క లువర్ణకమేకాక లడాగమసంబంధియగు లకారమునుగూడ గ్రహింపవలయును. (ఈ లకారము చింతామణియందు బహువచనప్రత్యయమని చెప్పఁబడెను) ఈలవర్ణమును బాలవ్యాకర్తయు విభక్తికివచ్చిన యాగమమగుటచే బహువచనమనియే తలంచెను. వారు, వీరు, మీరు – శబ్దపరి ౮౬ సూ చే మఱల "లు" చేరగా. వారు + లు అనియుండ రేఫముమీది యుకార మీ సూత్రమునందలి రెండవవాక్యముచే "అ"కారమయి "వారలు" అని యగును ౮౬ సూత్రమునందుగల తఱచు శబ్దముబలమున మఱల "లు" "రు" కాలేదు.

వీనికిఁ బ్రయోగములను జూపుచున్నాడు. సుగమములు.

సూ॥ ముత్తియ శబ్దేతరంబులయందును దఱచుగ నిత్యలోపంబు గానంబడియెడి ౪౯

ఉ. కన్నియ, కన్య, దివ్వియ, దివ్య, కళ్ళియము, కళ్యము, పళ్ళియము, పళ్యము, వీడియము, వీడ్యము. నెయ్యంపుఁగన్యకల నన వాలుమూపుల జయించి "రాఘ.౧ ఆ.౭. (చూ. శబ్దరత్నాకరము).

తే. గువ్వ గ్రద్ద దివ్యాఱుపు ప్రబువ్వు గూబ యిల్లుసొచ్చిన శాంతి సేయింపవలయు భార. అను ౪ ఆ ౧౧౯. సీ. కళ్యాలఁ బదిలంబుగాని గుఱ్ఱంబులఁ గ్రొత్తముట్టున కియ్యకొలుపువెరవు. భార.విరా.౧ ఆ ౬౫. ఉ. అంబుజబాంధవాన్వయ నృపాగ్రణి! బోనము నేడు సూర్యపాకంబున సాయితంబయిన కజ్జము భోజనశాలలోనఁ బళ్యంబిడినారు పంకజదళాక్షులు రెండవజాముగంట ప్రేయంబడె నారగింప సమయంబని చెచ్చెఱ విన్నవించినన్. కాశీ ౫ ఆ.౩౦౭. ఎ.గీ. తరుణధావన ధగధగద్దశనమణుల హత్తుకొల్పిరి లేతవీడ్యములడాలు పర్వదినములఁ బామరప్రమద లుదిత నియమసంభావనారంభ నిభృత బుద్ధి. పాండు. ౩ ఆ.౭౪. మొ॥

బాలవ్యాకరణమున అచ్ఛిక.౨౩, సూత్రవివరణమున "ముత్తియశబ్దంబునందుమాత్ర మిత్వలోపంబు గానంబడియెడి" అని వ్రాయంబడెను. అట్లనుటచే "ముత్యము" అనురూపము సిద్ధించెను. కాని ముత్తియశబ్దమునందుమాత్రమే కాక ఇయాంతములగు మఱికొన్నిశబ్దములయందుఁ గూడ నిత్యములోపించుట తఱచుగానున్నదని సూత్రతాత్పర్యము.

కన్నియ – ఇకారలోపమువచ్చి నకారయకారములు సంయుక్తములయి "కన్య" యయ్యెను. ఇందు రెండునకారములలో నొకనకారము" అక్కటాదుల జడ్డకు లోపంబు బహుళంబుగానగు" నను సూత్రముచే (బాల. ప్రకీ.౮ సూ.) నిత్యముగా లోపించెను

తెనుఁగున మూఁడుహల్లుల సంయోగముండదు. మూడవహల్లుతో సంయోగము పైతీరున విప్రాప్తమయినచో సజాతీయహల్లులలో నొకదానికి లోపము వచ్చుట సహజము. అందుచే సిట్టిచోట, నక్కటాదిసూత్రమునఁగల విభాషకు వ్యవస్థితత్వము నేర్పఱచుకొని నిత్యముగా జడ్డకు లోపముచేయవలయును. అట్టితలంపుతోడనే బాలవ్యాకర్త యబ్బురాదుల కుత్వలోపముమాత్రముచెప్పి (చూ. బాల. ప్ర ౧౯ సూ.) ద్విత్వరహితముగా "అబ్రము" "నెత్రు" ఇత్యాదుల నుదాహరించెను.

"కన్య" – ఈ శబ్దము తత్సమముగూడ నిల్లేయుండును. అయినను దద్భవము నొకదానిని వేరుగానున్నట్లు తలంపవలసియున్నది. ఏమనగా రాఘవ

పాండవీయమున ''నెయ్యపుకన్యకల ననవాలు దూపులజయించి'' అని యున్నది. అందు రామాయణపక్షమున కన్యకలనన్ + అ = కన్యకలనన అని విభాగము. ''ప్రౌఢమగు యుద్ధముననే'' అని యర్థము. ఇచ్చట ''కలను'' అనునది యాచ్ఛికము గావున దానితో సమసించెడి ''కన్య'' శబ్దమును నాచ్ఛికమే యగును. కావునఁ ''గన్య'' యని యొకయాచ్ఛికశబ్దముకలదనియు నయ్యది మీఁదఁ జెప్పినతీరున నిత్యలోపమువచ్చినరూపమనియుఁ బ్రౌఢవ్యాకర్త యాశయము. (ఇయ్యది వైకృతశబ్దముకానిచో సంస్కృతమున స్త్రీవిశేష పరమగుశబ్దమునకు ''అప్రౌఢమ''ను నర్థమురాదనియు వైకృతమయినచో నర్థభేదమురావచ్చును గనుక నట్లనుటయే యుచితమనియుఁ బ్రౌఢవ్యాకర్త తలంచెను.

మఱికొంద ఱియ్యది మిశ్రసమాసమనియు ''కన్య'' అను తత్సమశబ్దమునకు లక్షణావృత్తిచే నప్రౌఢమని యర్థమనియుఁ గావున వేఱొకయాచ్ఛికశబ్దమున్నదనుట కీ యుదాహరణము చాలదనియుఁ జెప్పుదురు. వికృతియందే యర్థభేదము రావలయునను నియమములేదు తత్సమశబ్దములకును దెనుగున లాక్షణికార్థము వచ్చుటగలదు. "అనుమానము" మున్నగు తత్సమశబ్దములు సంస్కృతమునఁ బ్రమాణవిశేషవాచకములయ్యును దెనుఁగున సందేహార్థకములుగా వాడఁబడుట ప్రచురముగానున్నది. అందుచే ''నప్రౌఢమ''ను నర్థమువచ్చుటకుఁ దత్సమమన్నను బాధలేదు. ఇక ''కర్మధారయంబు త్రిక స్త్రీసమ ముగంత ధాతుజ విశేషణపూర్వపదంబయి యుండు''నని బాలవ్యాకర్త సూత్రించుటచే స్త్రీసమములకును గర్మధారయమునఁ బూర్వపదముగాఁ బ్రవేశము శాస్త్రీయమేయని తలంచుచుండుటచేఁ గన్యఅను తత్సమమునకు "కలను" అను పదముతో సమాసమగుట దుష్టముకాదని తలంచియుందురు. కాని ఆకారాంత స్త్రీలింగశబ్దములు తత్సమములగుచు నాచ్ఛికశబ్దములతోఁ గర్మధారయసమాసమగుట యెచ్చటను లేదు. బాలవ్యాకర్తయు నట్టిసమాసముల నేసందర్భమునను నుదాహరింపలేదు. అట్టివంగీకార్యములగుచో ''ఉత్తమకూతు''రిత్యాది సమాసములును సాధువులే యనవలసివచ్చును. కావునఁ బ్రౌఢవ్యాకర్త తలంచినరీతి నియ్యది వైకృతమే యని చెప్పుట యుచితము.

''దివ్వియ, కళ్ళియము, పళ్ళియము, వీడియము,'' అను ప్రాతిపదికముల యంతముననున్న ''ఇయ'' లోని యికారమునకును జడ్డకును లోపంబురాగా దివ్వ, కళ్యము, పళ్యము, వీడ్యము అని యగును. వీనికిఁ బ్రయోగములను జూపుచున్నాడు.

కన్య శబ్దమునకు — నెయ్యపుఁ గన్యకలనన...... దివ్యకు — గువ్వగ్రద్ద దివ్యాఉపుబ్రువ్వ... ...దివ్యాఉపుబ్రువ్వనగా దీపమునార్పు పురుగనియర్థము. (ఇచ్చట "దివ్వియనార్పు బ్రువ్వ"నియున్నను బాధలేదు. యతిప్రాసాదిస్థలము కాదు) కళ్యమనుటకు — కళ్యాలఁ బదిలంబుగాని... ...ఇచ్చట "కళ్ళియములఁ బదిలంబుగాని" అనియున్నను నుండవచ్చును. ఇదియును యతిప్రాసాది స్థలముకాదు. పళ్యంబు అనుటకు—అంబుజబాంధవాన్వయ... బళ్యంబిడినారు ...ఇది యతిస్థలముననుండుటచే మార్పరానిది. కావున నిదిదృఢమగు నుదాహరణము. పళ్ళెంబిడినారు పంకజదళేక్షలు అనిమార్చి యఖండయతి శ్రీనాథుడిచటవాడెననుట యత్యధికమగుమార్పు గావున నుదాహృతమగు పాఠమే కవిసమ్మతమని తెలియుట యుచితము. వీద్యము అనుటకు — తరుణధావన...హత్తుకొల్పిరి లేతవీద్యములడాలు. ఇదియును యతిస్థలమున నుండుటచే దృఢమగు నుదాహరణము.

కన్య అను శబ్దమునుగూర్చి శబ్దరత్నాకరమున వ్రాయఁబడిన యంశము చూడుమని సూచింపఁబడెను. అందు "కన్య. ఉభ. వై. విణ. క్రొత్త" అని వ్రాసి ప్రకృతరాఘవపాండవీయమునే యుదాహరించి క్రొత్త యను నర్థము వైకృతమగునపుడే వచ్చుట యుచితమని వ్రాయఁబడెను. కాని యీ పదమునకుఁ గ్రొత్తయను నర్థముకంటె "నప్రౌఢమ"ను నర్థమే సందర్భానుగుణము. యుద్ధమును తీవ్రముగాఁ జేయనక్కఱలేక సామాన్యమగు నల్పయుద్ధముననే దశరథుఁడు రాజులను జయింపఁగల్గెనని భావము. లీలామాత్రముననఁ జయించెనన్న ట్లియ్యది దశరథుని పరాక్రమాతిశయమును సూచించును. క్రొత్తయుద్ధముననే జయించెననుట యంతగా సరిపడదు. అహోబలపండితుఁడును నట్టి యభిప్రాయమునే తెలియఁజేసెను. "అప్రౌఢయుద్ధ ఏవే త్యర్థః. కన్యకలనన" అని వ్రాసెను.

**సూ॥ ఎద్దు దేవర శబ్దములకు లు ల లు పరంబులగునపుడు దకారంబునకు డకారంబును, డకారంబునుత్వంబునకు లోపంబును వికల్పముగాను, రేఫమునకు శకారమును శకారంబు నత్వంబునకు లోపంబును నిత్యముగాను గ్రమంబుగ నగు ౫౧**

ఉ. ఎద్దులు, ఎడ్డులు, ఎడ్లు; ఎద్దులన్, ఎడ్డులన్, ఎడ్లన్; దేవళ్ళు, దేవళ్ళన్; మొ॥

I ఎద్దుశబ్దమునకు లు ల లు పరంబులగునపుడు వికల్పముగా దకారంబునకు డకారంబు నుత్వంబునకు వికల్పముగా లోపంబును నగు.

II దేవరశబ్దమునకు లు ల లు పరంబులగునపుడు రేఫమునకు ళకారంబును ళకారంబు నత్వంబునకు లోపమును నిత్యముగా నగును.

అని రెండుభాగములుగా సూత్రార్థమును విభజింపవచ్చును.

ఎద్దు + లు—దకారమునకు డకారాదేశమురాఁగా "ఎడ్డులు." ఇది వైకల్పికము కావున రానిపక్షమున "ఎద్దులు" అనియుండును. డకారంబు నుత్వములోపింప "ఎడ్డ్ + లు = ఎడ్లు" అని యగును. లకారముతో సంయుక్తమగునపు డొక డకారము నిత్యముగా లోపించును. (చూ. ౪౯ సూ. వ్యాఖ్య) ఈ లోపము వైకల్పికము కావున రానిపక్షమున "ఎడ్డులు" అని యగును. ఇచ్చట నుత్వలోపము వైకల్పికమయినందున "ఎడ్డులు, ఎడ్లు", అని యయ్యెను. కాని డకారాదేశముకూడ వైకల్పికమయినఁగాని "యెద్దులు" అనురూపము సిద్ధింపదు. అందుచే నీ సూత్రమునందలి "వికల్పముగాను" అనుపదమును రెండు చోట్లకు నన్వయించి రూపత్రియమును సిద్ధింపఁజేయవలయును. ఎద్దుశబ్దమునకు లు ల లు పరంబులగునపుడు వికల్పముగా దకారంబున డకారంబును డకారంబు నుత్వంబునకు వైకల్పికలోపంబును నగును. (అనురీతి నర్థమువచ్చును).

దేవర + లు— రేపమునకు ళకారమురాగా దేవళ + లు, ళకారంబు నత్వంబునకు లోపమురాగా "దేవళ్ + లు" = దేవళ్లు అని యగును. ఇది నిత్యము. కావున దేవళ్లు, అని యొక్కటేరూపము. ఇట్లే దేవళ్లన్ అనునదియు నగును.

ఈ పదములకుఁ బ్రయోగములను జూపలేదు. "దేవళ్లు, దేవళ్లన్" అనువానికిఁ బ్రయోగములనుజూపుట యావశ్యకము. అవి యప్రసిద్ధములు.

## సర్వనామ ప్రకరణము

**సూ॥ ఈ, ఏ, ఒక, శబ్దములకంటెం బరంబయిన యంతశబ్దము నకారంబునకు లోపంబగు. అగుచో "నీ, యే"ల దీర్ఘమునకు హ్రస్వమును "ఒకకు" వర్ణవ్యత్యయ సంహితలు నగు. ౫౧**

ఉ. ఇంత, ఎంత, కొంత, (చూ. డెబ్బది) శబ్దశాసనుఁడు "తచ్ఛబ్దాత్ః" అని సూత్రించిన సూత్రమునందలి తచ్ఛబ్దమంత ప్రభృతులకు నుపలక్షణమని తెలియునది.

ఈ, ఏ, ఒక, అను సర్వనామశబ్దములపై నంతశబ్దమున్నచో దాని "అ" కారమునకు లోపమువచ్చును. అప్పుడు ఈ, ఏ, శబ్దములు ఇ, ఎ, అని హ్రస్వములగును. "ఇ + ంత = ఇంత." "ఎ + ంత = ఎంత" అగును. ఒక + ంత అనుచోట వర్ణవ్యత్యయమనఁగా నక్షరములు తలక్రిందుకాఁగా "కఒ + ంత" అనియుండి సంహితసనగా సంధికార్యములంజెంది యవ్యవహితముగా నుచ్చారణముం బొందిన "క + ఒ = కొ, కొ + ంత = కొంత" అని యగును. డెబ్బది అన్నచోట "ఏడు" అనుపదమున, వర్ణవ్యత్యయ సంహితలువచ్చి "డె" అయినది. అట్లే యిదియును వర్ణవ్యత్యయమును బొందునని సామ్యార్థమయి డెబ్బదిని జూడుమనెను

అంత శబ్దమునందలి యకారలోపమునకుఁ జింతామణి సమ్మతిని జూపుచున్నాఁడు. చింతామణిలో నొక శబ్దమునకుఁ బరముగానున్న తచ్ఛబ్దము నకారమునకు లోపమువచ్చునను నర్థముగల "శబ్దాత్తచ్ఛబ్దాత్ః", నుదాహరించెను. కాని యాసూత్రమునఁ దచ్ఛబ్దాకారమునకు లోపముచెప్పగా నిచ్చట "అంత" శబ్దాకారమునకు లోప మెట్లువచ్చునని శంకించుకొని యాసూత్రమునంగల తచ్ఛబ్దము "అంత" మున్నగుశబ్దములనుగూడ సూచించుననిభావము. (ఉపలక్షణమనఁగా సూచకమనిభావము.) అనగా నొక్కతచ్ఛబ్దమునకేగాక "అంతా"ది శబ్దములందును "అ"కారమునకు లోపమువచ్చునని భావము వచ్చును.

ఇంత, ఎంత, అను శబ్దము లెట్లు ఈ, ఏ, శబ్దములనుండి యుత్పన్నములయ్యెనో "అంత" శబ్దముగూడ నట్లే "యా" శబ్దమునుండి యుత్పన్నమయ్యెననుట యుచితము "అంత, ఇంత, ఎంత, కొంత," అనుశబ్దము లొక్కరీతిపైయుండగా వానిలో నొక్కటియగు "అంత" శబ్దమును మిగిలినశబ్దముల కాధారముగాఁ దీసికొని "అంత" శబ్దముమాత్రమ వ్యుత్పన్నమనుట యుచితముగా లేదు. తదాదిశబ్దములకు పరిమాణార్థమున "వతుప్" ప్రత్యయమునువిధించి తావత్, ఇయత్, కియత్, మున్నగుశబ్దములను బాణినీయులు సాధించినట్లే అ, ఈ, ఏ శబ్దములకుఁ బరిమాణార్థమున బిందుపూర్వకతవర్ణమును, అ, ఈ, ఏలకు

హ్రస్వమునువిధించుట యుచితము. అట్లయినచో నంతశబ్దముకూడ వ్యుత్పన్న మగును. శబ్దతత్త్వముననుసరించుటయు నగును. ఈ శబ్దములును యథార్థముగ తావత్, ఇయత్, కియత్, అనుశబ్దముల యర్థముగలవియేకదా! కాని తావదాదిశబ్దములవలె నియ్యవి యీ రూపముతో మహదమహదర్థములలో వాడఁబడవు. అందుచే వీనిని అమహాదేకవచనాంతములనియుఁ జెప్పుట యుచితము.

సూ॥ అమహదర్థంబున భిన్నవస్తుసముదాయం బర్థమగుచో బహువచనంబున నంతాదుల తకారంబునకు ద్విరుక్తనివర్ణంబగు ౫౨

ఉ. అన్ని, ఇన్ని, ఎన్ని, కొన్ని.

అమహత్తులను బోధించునపుడు భిన్నవస్తువులసమూహమర్థమగునపు డేకవచనమును జేర్పదలంచునపుడు, "అంతా"ది శబ్దముల తకారమునకుబదులుగా ద్విరుక్త నివర్ణము (ఆదేశముగా) వచ్చుననియర్థము.

భిన్నవస్తుసముదాయమనగా సముదాయములోనివస్తువులు విడివిడిగానున్న సముదాయము. ఏకరూపముగానున్నసముదాయము ద్రవాదిపదార్థములసముదాయము అట్టిచోట నీశబ్దములను వాడరు. అంతనేయి, అంతనూనె, అంత బంగారము, అని యట్టిచోట వాడుదురు. అన్నిబియ్యము, అన్నిధాన్యము, అన్ని వస్త్రములు అన్నియిండ్లు మున్నగుచోట్ల వస్తువులు వేర్వేరుగా గోచరించుచుండును. ఇట్టిచోట్లనె అన్ని మొదలగునవి ప్రయోగింపఁబడునని తాత్పర్యము.

బాలవ్యాకరణమున "అన్నిమొదలగు శబ్దంబు లారును ద్విప్రభృతి సంఖ్యావాచకంబులును మహదర్థంబులును బహువచనాంతంబులగును. అమహదర్థంబు లేకవచనాంతంబులగు" అని వీని నేకవచనాంతములుగఁ జెప్పెను. కనుకనే వీని కౌపవిభక్తికప్రత్యయములు చేరుటయు సమాసమున నన్నిగుఱ్ఱములకు మున్నగురీతిని "అన్ని" అన్ని ప్రాతిపదికము వినవచ్చుటయు బాలవ్యాకరణరీతిని సరిపడుచున్నది. ఇట్టికార్యముల నుద్దేశించియే బాలవ్యాకర్త వీని నేకవచనాంతములనియెను. అన్నివస్త్రములు, అన్నియిండ్లు మున్నగుచోట్ల నిత్యైకవచనాంతములగుటచేఁగాని సమాసమనిభావించుటచేఁగాని విశేష్యము బహువచనాంతమగుట యవిరుద్ధము.

ఇట్టిబాలవ్యాకర్త్రాశయము ననుసరించి యివి యేకవచనాంతములని ప్రౌఢవ్యాకర్తయు నంగీకరించెను. కావున సూత్రమునందలి "ఏకవచనంబున" అనుపదమును "బహువచనంబున" అని దిద్దనక్కఱలేదు. అట్లుదిద్దుట సరికాదు.

అ, ఈ, ఏ, కొ, శబ్దములనే ప్రకృతులుగా గ్రహించి "న్ని" అనుదానిని వానికివిధించుట యుచితము. అభిన్నవస్తుసముదాయము అర్ధమగునపుడు "అ" మున్నగువానికి "ంత" అనియు భిన్నవస్తుసముదాయ మర్థమగునపుడు "న్ని" అనియుఁ జెరుట యుచితము. రెండును నమహదర్థకములే. రెండును నేకవచనాంతములే.

"దిరుక్తనివర్ణము" అనుటకంటె నివర్ణాంత దిరుక్తనకారమనుట సమీచీనము. ద్విరుక్తనివర్ణమనగా "ని" అనువర్ణము దిరుక్తముకావలసియున్నది. అప్పుడు "ని ని" అను "నాదేశము" అనునర్థము వచ్చునుగదా! "అంతాదుల తకారము" అనగా బిందుపూర్వక తకారమని భావింపవలయును. లేదా, బిందువు గూడ శేషించి "అం న్ని" అనియుండగా స్థిరపూర్వబిందు వుండదు కాన లోపము వచ్చునని ప్రక్రియనయినను గల్పించుకొనవలయును.

సూ॥ ఆ ఈ శబ్దములకును ఏ శబ్దమునకును మహదర్థంబున నన్ని విభక్తులయందును వకారంబు నిత్యముగాను (వైకల్పికము) గాను, అమహదర్థంబునం బ్రథమేతరవిభక్తులయందు వచన ద్వయంబునం గ్రమంబునం దకార వకారంబులు నిత్యము గాను బూర్వాగమంబులగు. ౫౩

ఉ. వాఁడు, వారు; వీఁడు, వీరు; వానిన్, వారిన్; వీనిన్, వీరిన్; వానిచేతన్, వారిచేతన్; వీనిచేతన్, వీరిచేతన్, వేఁడు, ఏఁడు; వేరు, ఏరు; వేనిన్, ఏనిన్; వేరిన్, ఏరిన్; వేనిచేతన్ ఏనిచేతన్; మొ

తే. పిలిచి చారులరావించి యిలయు దివియు ముంచు కపివీర సేనల మించుగాంచి వీరిలో ముఖ్యులెవ్వారు వేఁడు రాముఁ డతని యనుజన్ముఁ డెట్టివాఁ డనుచుఁ బలుక. రామా౭ ఆ.౧౯౨ మొ॥ దానిన్, వానిన్; దీనిన్, వీనిన్; దేనిన్, వేనిన్; దానిచేతన్, వానిచేతన్; దానియందున్, వానియందున్; మొ॥ అనుప్రయుక్తంబులగునపుడు వీనికి రూపంబు లిట్లయుగు. (ఉ. చూ. మీఁదు.)

ఈ సూత్ర మీ క్రిందిరీతిని మూఁడువాక్యములుగా విభజింపవచ్చును.

I అ, ఈ, శబ్దములకు మహదర్థమున నన్నివిభక్తులయందును వకారము నిత్య ముగాఁ బూర్వాగమంబగు. (వాఁడు మొదలు వీరిచేతన్ వఱకును ఉదాహరణములు.

II ఏ శబ్దమునకు మహదర్థమున నన్నివిభక్తులయందును వకారము వికల్ప ముగాఁ బూర్వాగమంబగు, వేఁడు ఏఁడు, మొదలు వేనిచేతన్ వఱకును ఉదాహరణములు.

III అ, ఈ, ఏ, శబ్దముల కమహదర్థమునఁ బ్రథమేతర (ద్వితీయాది) విభక్తుల యం దేకవచనంబునం దకారమును బహువచనంబున వకారంబును నిత్య ముగాఁ బూర్వాగమంబులగు. దానిన్ మొదలు వానియందున్ వఱకు నుదాహరణములు.

మహదర్థమును బోధించునపుడు "అ, ఈ," శబ్దములకు విభక్తిపరముగా నున్నపుడు వకారము పూర్వమునందుఁ జేరును. అ + ఁడు. అనియుండగా "వ్" అని పూర్వమునఁజేరి వ్ + అ + ఁడు = వాఁడు అనియగును. ఇట్లే "అ + లు" అనియుండ దీనిచే వకారము పూర్వమునఁజేరి వ్ + అ + లు. అయి శబ్ద.౨౬ సూత్రముచే లు, రు, కాఁగా వ్ + అ + రు = వారు అనియగును. ఇట్లే యితర విభక్తులయందును ఈ శబ్దమునకును రూపంబులు తెలియనగును.

ఏ శబ్దమునకు మాత్రము ఈ వకారాగమము వైకల్పికము. అందుచే "ఏ + ఁడు" అనియుండగా "వ్" చేరి, వ్ + ఏ + ఁడు = వేఁడు అని యగును. వకారము రానిపక్షమున "ఏఁడు" అని యగును మిగిలినవిభక్తులయందు నిట్లే రూపద్వయము నూహింపఁదగును. ఇవన్నియు మహదర్థకములు.

ఈ మూఁడుశబ్దములు నమహదర్థకములయినచో నేకత్వమున ద్వితీయా విభక్తి పరమగునపుడు "అ + ను" అనియుండగా ద్వితీయైకవచన బహువచ నంబుల రెంటను నివర్ణకంబగు నను (౬౦ సూ) సూత్రముచే నువర్ణకము "ని" వర్ణకముగా మాఱి అ + ని. అనియయి యేకవచనమగుటచే "ద్" ముందుగాఁ జేరి ద్ + అ + ని = దాని అనియుండగా అంతమున "ను" (ద్రుతము) జేరి పూర్వమునందలి యికారమునుబట్టి దీనియందు నుకార మికారముగా మాఱి "దానిని" అనియగును. ద్రుతస్వరమునకు లోపమువచ్చి "దానిన్" అనియు నగును.

ఇచ్చట "దానిని" అనురూపమగుటకై యంతమున ద్రుతముచేరుటకు బాలప్రౌఢవ్యాకరణములలో నాధారము లేదు. ప్రథమాకై పట్టి యొక్కేతరము

లయిన విభక్తులన్నియు ద్రుతాంతములగుటచేతనే యిచ్చట ద్రుతమును జేర్చుకొనవలయును. [లేదా ద్వితీయావిభక్తి నువర్ణకము పరముగానుండగా ౬౦ సూత్రముచే నివర్ణకము చేర్చుటకుఁ బ్రత్యయముపైఁ బ్రత్యయముచేరుట విరుద్ధము. "నివర్ణకము" అని ౬౦ సూత్రమున నిర్దేశించుటచే నిది యాగమమనుటకును వలనుగాదుగదా! అయినను విధానబలమువలన ద్వితీయా నువర్ణకము పరముగానుండగా నివర్ణకము వచ్చునని చెప్పి దాని + ను. అనుచోట "ఇకారంబుమీఁది" యిత్యాది సూత్రముచే (బాల. తత్స. ౨౬ సూ.) 'ను' లోని యుకారమికారమయి 'దానిని' అని యగునని కల్పించుకొనవలయును. ౬౦ సూత్రమున "రెంటను" అనుపదమునకు రెండును పరంబగునపుడని యర్థము చేయవలయును. రూపమును సిద్ధింపఁజేయుటకై యీ క్లిష్టమార్గము నాశ్రయింపవలసియున్నది. కాని ప్రౌఢవ్యాకర్త కిది యుద్దేశ్యమయినట్లు గానరాదు. అట్లేయయినచో ౬౧ సూత్రమునఁజెప్పిన ట్లాగమముగనే చెప్పియుండును. అందుచే మొదటిమార్గమే వరము.] "పిలిచిచారుల" ననుపద్యమున వీనిలోఁ గొన్నింటికిఁ బ్రయోగములం జూపుచున్నాడు. అనంతరసూత్రమున విధించునట్లు ఈ శబ్దము లనుప్రయుక్తములగునపుడు నిట్టి రూపము లుండునని భావము. ఉదాహరణపద్యమున "ఎవ్వాఁడు ఎట్టివాఁడు" అనునవి యనుప్రయుక్తస్థలములే. చూ. మీఁదు అనఁగాఁ దరువాతిసూత్రమున నను ప్రయోగము విధింపఁబడెననియు నచ్చటఁ జూచినం దెలియుననియు భావము.

ఈ సూత్రమునఁ "గ్రమంబునం దకార" అని దవర్ణమునకుఁ బూర్వమునఁ బూర్ణబిందువును ముద్రించిరి. సరళమగు దకారము|పరమగునపుడు లోపముగాని సంశ్లేషముగాని తఱచువచ్చును. సరళము పరమగునపుడు పూర్ణబిందువు వచ్చుట (బా. వ్యా. సంధి.౬౯ సూ. చేత) క్వాచిత్కము. కనుక సుప్రసిద్ధమగు లోపరూపముతోఁ "గ్రమమున దకారవకారములు" అని చూపుటయే యుక్తము. కుమారదేవపండితీయమున "దకార" అనుటకుబదులు "తకార" అనిపడుట ముద్రణదోషము. అయ్యది వ్యాఖ్యాత యజ్ఞానముకాఁజాలదు.

సూ॥ కొన్నియెడల మహాదర్థంబున నే శబ్దంబునకు వాఁడువారును,
అమహాదర్థంబునం ద్రికంబునకది యవులును స్వార్థంబున
నేక బహువచనంబులం గ్రమంబుగ ననుప్రయుక్తంబులగు.౭౪

ఉ. ఏవాఁడు, ఎవ్వాఁడు; ఏవ్వారు, ఎవ్వారు; ఆయది. అయ్యది;

ఆయవి, అయ్యవి; ఈయది, ఇయ్యది; ఈయవి, ఇయ్యవి; ఏయది, ఎయ్యది; ఏయవి, ఎయ్యవి.

మహదర్థమున నే శబ్దమున కేకత్వము వివక్షించునపుడు వాఁడను ప్రథమాంత తచ్ఛబ్దమును, బహుత్వము వివక్షితమగునపుడు 'వారు' అను ప్రథమా బహువచనాంత తచ్ఛబ్దమును ననుప్రయుక్తములయి "ఏవాఁడు, ఏవారు," అనియగును.

అమహదర్థమున "ఆ, ఈ, ఏ," శబ్దముల కేకత్వవివక్షయందు "అది" యనియుఁ దచ్ఛబ్దామహత్ప్రథమైకవచనే బహువచనాంతరూపము లనుప్రయుక్తములగును. అనఁగా వెనువెంటఁ జేరియుండుననిభావము.

"ఏవాఁడు, ఏవారు" అనునవి "ఏ" శబ్దమునకు "వాఁడు" "వారు," అనుప్రయుక్తములగు రూపములు. "ఎవ్వాఁడు, ఎవ్వారు," అనునవి బాల వ్యాక. సమా. ౧౩, ౧౪ సూత్రములచే ద్విత్వహ్రస్వములు వచ్చినరూపములు. ఆయది, ఈయది, ఏయది, యనునవి యమహదర్థమున నదియవు లనుప్రయుక్తములయిన రూపములు. అయ్యది, అయ్యవి, ఇయ్యది, ఇయ్యవి, ఎయ్యది, ఎయ్యవి, అనునవి ద్విత్వహ్రస్వములు వచ్చినరూపములు.

ఈ సూత్రమున "వాఁడు వారు" అనునవి యనుప్రయుక్తములగునని చెప్పుటచే మిగిలినవిభక్త్యర్థములను వివక్షించునపుడు తత్తద్విభక్త్యంతములగు తచ్ఛబ్దరూపము లనుప్రయుక్తములగుననియుఁ దెలియనగును. ఎవ్వాఁడు, ఎవ్వారు, అనునట్లే ఎవ్వానిని, ఎవ్వానిచేత, ఎవ్వారిని, ఎవ్వారిచేత, మున్నగు రూపములు నుండును. అట్లే త్రికంబునకు (ఆ, ఈ, ఏ, శబ్దములకు) అదియవులు చేరుననుటచే మిగిలిన విభక్త్యర్థములందును దత్తద్విభక్త్యంతములగు నమహత్తచ్ఛబ్దరూపములును జేరునని తెలియఁదగును. అప్పుడు అద్దానిన్, అవ్వానిన్, అద్దానిచేతన్, అవ్వానిచేతన్, మున్నగురీతిని రూపములుండును.

సూత్రమున "వాఁడు, వారు, అది, అవి," అనునవి యనుప్రయుక్తము లగుననుటకు బదులు మహద్వాచకతచ్ఛబ్దమును నమహద్వాచకతచ్ఛబ్దమును ననుప్రయుక్తంబగు నని యుండఁదగును. "మహదర్థంబున నే శబ్దంబునకు నమహదర్థంబునఁ ద్రికంబునకును దచ్ఛబ్దం బనుప్రయుక్తంబగు" నని సూత్రించినం జాలును.

అనుప్రయోగమువచ్చినను నర్థమునకేమియు మార్పులేదని తెల్పుటకై "స్వార్థంబునన్" అని సూత్రమునం జెప్పఁబడెను.

సూ॥ ఇటనే హ్రస్వంబగు అగుచో వాదీర్ఘంబునకు హ్రస్వంబును ద్విత్వంబునకు లోపంబును విభాషనగు. ౨౨

ఉ. ఎవ్వాండు, ఎవఁడు; ఎవ్వారు, ఎవరు.

ఇటన్ = తచ్ఛబ్ద మనుప్రయుక్తమగునపుడు. హ్రస్వంబగుచోన్ = బాలవ్యా. సమా.౧౪ సూ.చే ద్విత్వమువచ్చినపిమ్మట ౧౩ సూ.చే హ్రస్వమువచ్చునపుడు (అనఁగా నెవ్వాఁడు, ఎవ్వారు, మున్నగుచోట్లన్). వాదీర్ఘంబునకు హ్రస్వంబును = ఎవ్వాఁడు మున్నగుస్థలములందలి వకారముమీఁదనుండు దీర్ఘమునకు హ్రస్వమును. (వచ్చినచో నెవ్వఁడు మున్నగురీతినగును) ద్విత్వంబున లోపంబును = వకారద్వయములో నొకదానికిలోపమును. విభాషనగు = వికల్పముగా నగును.

ఎవ్వాఁడు – హ్రస్వమురాఁగా – ఎవ్వఁడు. ద్విత్వలోపమురాగా "ఎవఁడు" అనియగును. ఇట్లే ''ఎవరు'' అనియునగును. మిగిలిన విభక్త్యంతములందును నిట్లే హ్రస్వద్విత్వములురాఁగా ''ఎవనిని, ఎవరిని'' మొదలగునవి సిద్ధించును. ద్విత్వలోపము హ్రస్వమువచ్చినరూపమునకే వచ్చును. హ్రస్వము వైకల్పికమగుటచే రానిపక్షమున ద్విత్వముకూడ రాదు. ఈ విషయము విభాషాపదబలమువలన సంపాదింపవలయునేమో ?

ఈ సూత్రమున రెండువిధములగు ప్రమాదములుగలవు. ''ఇటనే హ్రస్వంబగు.'' అని ప్రత్యేకవాక్యముగనున్నది ఇట్లు భిన్నవాక్యమున నున్నందున విభాషాపద మీ హ్రస్వవిధాయకవాక్యమున కన్వయింపదు. అందుచే నీహ్రస్వము నిత్యముగావచ్చును. అట్లయినచో నెవ్వాఁడు మున్నగురూపములు సిద్ధింపవు. ఇట్లే వాదీర్ఘమునకు హ్రస్వంబును ద్విత్వమునకు లోపంబును విభాషనగు ననుటచే దీర్ఘహ్రస్వములు సన్నియోగశిష్టములయి వచ్చుటగాని రాకపోవుటగాని రెండిటికిని నొక్కసారియే జరుగును. రెండును బ్రాప్తించినచో ''ఎవఁడు'' అనియు రానిచో ''నెవ్వాఁడ''నియు రూపములం జెందును. ఎవ్వఁడనురూపము సిద్ధింపదు. ఏకారమునకు హ్రస్వవిధానమును నిరర్థకము. సిద్ధసాధనదోషయుక్తము. బాల. సమా.౧౩ సూ. చేతనే దీనికి హ్రస్వమువచ్చును. కనుకనే పూర్వసూత్రముననే ఎవ్వాఁడు, అయ్యది ఇత్యాదుల నుదాహరించియున్నాఁడు. ఇట్టిలోపములన్నియు ముద్రణప్రమాదసంభూతము లయియుండును.

సూత్రము ''ఇటనే హ్రస్వంబగుచో వాదీర్ఘంబునకు హ్రస్వంబునగు. అగుచో ద్విత్వంబునకు లోపంబు విభాషనగు.'' అనియుండుటకుబదులు అగు

వను పద మొకచోటనుండవలసినది వేరొకచోటc బడుటయు "అగుచో" ననుపదము రెండుస్థలముల నుండవలసియుండగా నొకచోటనేయుండుటయుc బ్రమాదముజరగియుండును. కావున సూత్రమును బైరీతి మార్పcదగును.

సూ॥ ఆ, ఈ, ఏ, శబ్దములకుc బూజ్యతయందు మహదేకవచనంబునc దవర్ణాగమంబును, వానిదీర్ఘcబునకు వికల్పముగా హ్రస్వంబును; మహత్యేకవచనంబున వానికంటెc బరంబయిన అక, అప, అమ, శబ్దcబుల తొలియకారమునకు లోపంబును, తుదియకారంబున కెకారాదేశంబు నగు. ౫౬

ఉ. అతcడు, ఆతcడు; ఇతడు, ఈతcడు; ఎతcడు, ఏతcడు; ఆపె (ఆ+అప+ఎ), ఆమె (ఆ+అమ+ఎ), ఈకె (ఈ+అక+ఏ), ఈపె (ఈ+అప+ఎ), ఈమె (ఈ+అమ+ఎ), ఏకె (ఎ+అక+ఎ), ఏపె (ఏ+అప+ఎ), ఏమె (ఏ+అమ+ఎ).

ఆ, ఈ, ఏ, శబ్దములకు గౌరవార్థము వివక్షించునపుడు మహదర్థకములగుచో నేకవచనము పరమగునపుడు తవర్ణాగమము వచ్చును. ఆ + cడు–అని యుండగా "త" చేరి ఆ + త + cడు అనియగును. తరువాత ఆ, ఈ, ఏ, శబ్దముల దీర్ఘములకు వికల్పముగా హ్రస్వమువచ్చును. (ఆ + త + cడు అని యుండగా అకారమునకు హ్రస్వమువచ్చినచో "అతcడు" అనియు హ్రస్వము కానిచో "నాతcడ"నియు నగును. ఇతcడు, ఈతcడు, ఎతcడు, ఏతcడు అను నవియు నిట్లేయని తెలియనగును.

ఆ, ఈ, ఏ, శబ్దములు మహతీవాచకములగునపుడు ఏకవచనమున ఏక, అప్ప, అమ, అనుశబ్దములు నిత్యముగా వానిపైcజేరి ఆయమ, ఈయమ, ఏయమ, అవియగుట తెనుగుభాషయందు సహజము. అట్టి అకాదులుచేరునపుడు వచ్చెడి కార్యములను విధించుచున్నాడు.

మహత్యర్థకములగు "ఆ, ఈ, ఏ" అనుశబ్దములకుc బరముగానున్న "అక, అప, అమ" అనుశబ్దముల కేకవచనప్రత్యయము వివక్షించునపుడు వానిమొదట నున్న "అ"కారము లోపించి యంతముననున్న "అ"కారమున కెకారాదేశము కాగా "అకె, అపె, అమె" అనియగును. ఈ శబ్దములు స్త్రీసమములగుటచేc బ్రథమైకవచనము లోపించెనని తెలియcదగును.

ఉదాహరణములు స్పష్టములు. అకారాదులకుఁ బరమందు "+" గుర్తు పెట్టి ఏకారమునుజూపుట సరికాదనియు నియ్యది కూడికగుఱుతు గావున నాదేశమునకు ముందుంచరాదనియు సుబోధినిలోఁ దెలుపఁబడెను.

సూ॥ ఆ, ఈ, శబ్దములును, ఏ శబ్దమును నమహదర్థంబునం బ్రథమా విభక్తి పరంబగునపుడు నిత్యముగాను వైకల్పికముగాను గ్రమంబున హ్రస్వంబు లగు. ౫౪

ఉ. (చూ. మీఁది సూత్రము.)

అమహదర్థమునుబోధించు "ఆ, ఈ," శబ్దములు ప్రథమావిభక్తి పరంబగునపుడు నిత్యముగా హ్రస్వములగును. ఆ + ది, ఈ + ది. హ్రస్వమురాగా అది, ఇది యయ్యెను. "ఏ" శబ్ద మమహదర్థమును బోధించునపుడు ప్రథమావిభక్తి పరమగుచో వికల్పముగా హ్రస్వమగును. ఏ + ది హ్రస్వమువచ్చెనేని "ఎది" యనియు రానిచో "ఏది" యనియు నగును. "చూ. మీఁది సూత్రము"— అనగా నుదాహరణము లనంతరసూత్రమునఁ జూడఁదగుననిభావము.

సూ॥ త్రికంబునకమహదర్థంబునం బ్రథమైకవచన బహువచనంబు లం గ్రమంబుగ ది వి వర్ణకంబులగు. ౫౫

ఉ. అది, అవి; ఇది, ఇవి; ఏది, ఏవి;

త్రికంబున కనగా నా, యీ, యే, శబ్దములకుఁ బ్రథమైకత్వము వివక్షించునపుడు "ది" అను ప్రత్యయమును ప్రథమాబహుత్వము వివక్షించునపుడు "వి" అను ప్రత్యయమును నగునని సూత్రార్థము

ఏకవచన బహువచనములందు = ఏకత్వ బహుత్వ వివక్షయందు.

"ఆ" శబ్దమున కీ సూత్రముచే "ది" అనునది పరమగుచో ౫౪ సూ.చే హ్రస్వమువచ్చి "అది" యగును. ఇట్లే "ఆ + వి. హ్రస్వము—అవి. "ఇది" మున్నగునవియు నిట్లే తెలియఁదగును.

ఆ, ఈ, ఏ, శబ్దములకుఁ బ్రథమైకత్వమున మహద్వాచకము కానందున డుజ్జును, అకారాంతము కానందున మువర్ణకమును, ఉకారాంతముకానందున వువర్ణకమునుగూడఁ బ్రాప్తింపకయుండగా "ది" అనుదానిని, బహుత్వమున "లు" అననది ప్రాప్తించుచుండగా దాని కపవాదముగా "వి" అనుదాని నీ సూత్రము విధించెనని తెలియుఁదగును.

**సూ॥ హ్రస్వవ్యస్త త్రికంబుమీఁది దివులకు ద్విత్వంబు నగు. ౫౯**

ఉ. అద్ది, అవ్వి, ఇద్ది, ఇవ్వి, ఎద్ది ఎవ్వి, ఇట్లనుటచే నయ్యా దీత్యాదులయందు ద్విత్వంబు కలుగదని యూహింపవలయును.

హ్రస్వ = ౫౭ సూత్రముచే హ్రస్వములయిన, వ్యస్త = బా వ్యా సమా. ౭ సూ.చే సమాసమునుగాని శబ్ద.౫౪ సూ చె నను ప్రయోగమునుగాని చెందక వ్యస్తములుగానున్నట్టి. త్రికంబుమీఁది = "అ, ఈ, ఏ," అనువానికి పరమం దున్న దివులకు = ౫౮ సూత్రముచే వచ్చిన ప్రథమాప్రత్యయములకు ద్విత్వం బును = ద్విత్వంబును ద్విత్వాభావంబునుగూడ అగును

దివులకు ద్విత్వమనగా దివులలోని దకారవకారములకు ద్విత్వమని యర్థముచేయవలయును. కానిచో దిది, విని, అను ననిష్టరూపములు రావలసి వచ్చును.

హ్రస్వములనుటవలన నేది ఏవి అనువానియందును వ్యస్తములనుటవలన రామునిది, ఆయది, ఇత్యాదులందును ద్విత్వము నివారింపఁబడెను

**సూ॥ ద్వితీయైకవచన బహువచనముల రెంటను నివర్ణకంబగు. ౬౦**

ఉ. దానిన్, వానిన్; దీనిన్, వీనిన్; దేనిన్, వేనిన్;

"అమహదర్థక త్రికమునకు" అనునది ప్రకరణవశమున వచ్చును. అట్టివానికి ద్వితీయైకత్వ బహుత్వములు వివక్షితములయినచో "నువర్ణంబు ద్వితీయ" అను బాలవ్యాకరణసూత్రముచే "ను" ప్రాప్తించుచుండగా దాని కపవాదముగా "ని" అనుప్రత్యయము రెండువిభక్తులయందును విధింపఁబడి యెను. "దానిన్" ఇత్యాదు లుదాహరణములు.

అ + ని. ౫౬ సూ.చే దకారము. "దాని" అనియగును ద్వితీయావిభక్తి ద్రుతప్రకృతికములోనిది కాన "ను" అనునది యంతమునఁజేరి "కునువు క్రియావిభక్తుల..." బాల. తత్స.౭౬ సూ.చే నిత్యము వచ్చి దానిని అని యగును. పిమ్మట ద్రుతస్వరలోపమురాగా దానిన్ అనియగునని యూహింప వలయును. ద్వితీయాబహువచనంబున లడాగమంబుగూడ రాదని తెలియఁ దగును. లడాగమసహితమగు నువర్ణకమునకే ఈ యాదేశమని తలంపవలయును.

**సూ॥ అయ్యది తృతీయాదివిభక్తులు పరంబులగుచో నాగమంబుగా నగు. ౬౧**

ఉ. దానిచేతన్, వానిచేతన్, మొ॥

అయ్యది = "ని" అనునది తృతీయాది విభక్తులు = చేత ఎన్నగు తరు వాతి విభక్తిప్రత్యయములన్నియును

"అమహదర్థత్రికమునకు" అనునది యిప్పటిను ప్రకరణలబ్ధము అమహ దర్థకములగు అ, ఈ, ఏ, శబ్దములకు చేత మున్నగువిభక్తులు పరమగునపుడు "ని" అనునది (ఆ శబ్దములకు) అంతమున నాగమముగాఁ జేయును అ + చేత (౫౩ సూ.చే దకారాగమము) దా + చేతన్ ఈ సూత్రముచే "ని" ఆగమము. "దాని + చేతన్ = దానిచేతన్" అగుచుండు బహుత్వమున "వానిచేతన్" అని యుదాహరణము "మొదలగు" అనుటచే దీనిచేతన్, వీనిచేతన్, దేనిచేతన్, వేనిచేతన్, మున్నగునవి గ్రాహ్యములు ఇందు "ని" ఆగమము ప్రకృతికేయని చెప్పవలయును. ప్రత్యయమున కాగమమన్నచో సమాసమున లోపింపవలసి వచ్చును దానిగుణములు, దానిభయము, మున్నగుచోట్లను సమాసమునందు నివ ర్ణము వినవచ్చుచున్నదిగదా! దుమంతములు కానందున నప్రాప్తమగుచుండగా విధింపఁబడెను. బహువచనమున లఘాగమమున కిది యపవాదము.

సూ॥ అది యిది యెది యను వానికిఁ దృతీయా సప్తమ్యేకవచనంబుల యందు దాన దీన దేన నసియు వాసి బహువచన ములయందు వాన వీన వేన ననియు రూపంబులగు ౬౨

ఉ. క. చనునెడ శ్రీరాముఁడు పావన నవ నిజరూప వైభవ శ్రీ నల్లంబున నిడి దాన విచిత్రాతనురాగ ప్రౌఢి వచ్చి తనుఁ బైకొనఁ గన్. రాఘు.౨ ఆ ౮౩. క. నలుఁగ న మిన్వానంబునఁ గల వెప్పుడుఁ గాంతు ముగ్రకరులను సింహంబుల ఋక్షంబుల నిది మర్త్యులకవిషయ మాతపంబు దూరదు దీనన్. భార. అర.౨ ఆ. ౧౦౬ .క. కాననము గిరులు నదులును నానాతీర్థములు భూజనంబులకెల్లన్, భూనుత సాధా రణములు వానను ధర్మములుసేయవచ్చు నిజేచ్ఛన్. భార. అను.౨ ఆ ౩౯౫. ఎ.గీ. అనిన నలుగాలివాన గోవును నశేషశబ్దముల మంత్ర మును లోహజాతికాంచనమును మనుజుల విప్రుండు సమధికత్వభాజ నములండ్రు వేదప్రపంచవిదులు. భార. శాంతి.౧ ఆ.౭౧. తే. కలవు

నూఱులువేలు లక్షలును గోటు లప్రమేయముల్ ఘనమాయ లధిప
నాకు వానఁ దగులకపోరాదు వనజభవునకైన నభవునకైనను నన్యు
లెంత. లక్ష్మి.౪ ఆ.౧౩౭. క. ధ్యానం బింద్రియవృత్తులు మానిం
చుటహింప గురుసమర్చనవిధి నిత్యానుష్ఠానము తపమును వీనం బర
సేవ్యమెద్ది వినగా వలతున్. భార. ఆను ౪ ఆ.౨౭౭. సీ. ఒక్కఁ
డొక్కటిచేత నెక్కుచుఁ దఱుఁగుచుఁ ద్రిగుణంబులును బ్రవర్తించు
వీనజనితంబులగుఁ బ్రీతిసంతాపమోహాదులు. భార. ఆను.౫ ఆ.౨౫౦.
ఎ గీ. అనిమెఱింగించి మఱియు నిట్లను నజుండు స్వేదముద్భేద మండ
మన్ వీనఁబుట్టు...జరాయుజములు. భార. అశ్వ.౨ ఆ ౧౪౫ మొ॥
దేనన్, వేనన్, అనువానికిఁ బ్రయోగంబులు మృగ్యంబులు.

అది యిది యెది యనువానికిన్ = అమహదర్థకములగు ఆ ఈ ఏ శబ్దము లకు. తృతీయాసప్తమ్యేకవచనంబులయందు = చేత నను తృతీయావిభక్త్యేక వచన మంతమునఁ గలవగునపుడును, అందునను సప్తమ్యేకవచనప్రత్యయ మంత మునఁ గలవగునపుడును దాన దీన దేన ననియు = ఆ శబ్దమునకు దాన ననియు ఈ శబ్దమునకు దీన ననియు ఏ శబ్దమునకు దేన ననియు (ఆదేశములగును.) వాని బహువచనంబులయందు = చేతనను తృతీయాబహువచనమును నందునను సప్తమీ బహువచనంబును నంతమునఁగల ఆ, ఈ, ఏ, శబ్దములకు (వరుసగా) "వానన్, వీనన్, వేనన్" అనియు రూపంబులగు = ఆదేశములగును.

అమహద్వాచకములయి తృతీయా సప్తమ్యేకవచనాంతంబులగు "ఆ ఈ ఏ" శబ్దములకు ననగా "దానిచేతన్, దీనిచేతన్, దేనిచేతన్, దానియందున్, దీనియందున్, దేనియందున్" అనురూపముల స్థానమున "దానన్, దీనన్, దేనన్" అనియు రూపాంతరములగును అట్లే వీని బహువచనాంతములగు "వానిచేతన్, వీనిచేతన్, వేనిచేతన్, వానియందున్, వీనియందున్, వేనియం దున్" అనువాని స్థానమున "వానన్, వీనన్, వేన" ననియు రూపాంతరము లుండునని సూత్రతాత్పర్యము. (ఈ రూపములు బాలవ్యాకరణమున సూచింపఁ బడలేదు.) ఈ రూపములు విభక్త్యంతములకు అనఁగాఁ బ్రకృతిప్రత్యయసము దాయమున కాదేశములుగా నిపతింపఁబడెను,

త్రికమునకు సప్తమ్యేకవచన బహువచనముల స్థానమున 'న' అను సప్తమీప్రత్యయమును నయ్యాదిపరమగునపుడు ౬౧. సూ. చేత వచ్చెడి 'ని' అనునాగమము రాకుండుటను నిక్కడ విధించెనని తెలియనగును.

అ + అందు. దకారాగమము రాఁగా. దా + అందు ఈ సూత్రముచే నందుకు బదులు 'న' రాగా దా + న = దాన ద్రుతముతోఁగూడి "దాన" నని యగును ఇట్లే "దీనన్, వేస" ననియు నగును అట్లే తృతీఁయాస్థానమునను నుదంతముకానందున నప్రాప్తమగుచుండగా నవర్ణకము న్యాగమాభావమును విహితములు. బహువచనములు పరంబులగునపుడును నప్రాప్తమగు నవర్ణకమును న్యాగమాభావమును లడాగమాభావమును విధింపఁబడెనని తెలియనగును.

ప్రయోగములను జూపుచున్నాడు

చనునెడ.. శ్రీనల్లంబుననిడి.. దానన్ ... బైకొనగన్. ఇచ్చటదాన ననగా దాని చేత = అ వైభవశ్రీచేత నని యర్థము. తృతీయైకవచనాంతార్థకము.

"నలు గాన మివ్వనంబున... దీనన్" దీనన్ = దీనియందు = ఈవన మందు. సప్తమ్యేకవచనాంతార్థకము.

"కానసము గిరులు ... వానను .." వానను = వానిచేత = అకాననాదుల చేత. తృతీయా బహువచనాంతార్థకము. (అశబ్దము)

అనిన నలుగాలివాన..." వానన్ = వానియందు. నాల్గుకాళ్ళు గలవాని యందు. సప్తమీ బహువచనార్థకము.

"కలవు నూఱులు ... వ్వాన దగులక" వానన్ = వానియందు = అ మాయ లయందు. సప్తమీ బహువచనాంతార్థకము.

ధ్యానం బింద్రియ . వీనం బర ." వీనన్ = వీనియందు = ఈధ్యానాదు లందు. సప్తమీ బహువచనాంతార్థకము.

"... త్రిగుణంబులను బ్రవర్తించు. వీనజనితంబులగు" వీనన్ = వీనిచేత ఈ త్రిగుణములచేత. తృతీయా బహువచనాంతార్థకము.

"స్వేద ... వీనఁ బుట్టు" వీనన్ = వీనియందు = స్వేదాదులయందు. సప్తమీ బహువచనాంతార్థకము. ఈ ప్రయోగము ముద్రణదోష జుష్టమగుటచే సరియగుపాఠము నిచ్చితిని. సుబోధినీపాఠమును సరియయినందున గ్రహించితిని.

"దేనన్, చేనన్" అనువానికిఁ బ్రయోగములు సీతారామాచార్యులవారికి లభింపలేదు. అందుచే నివి మృగ్యములనగా దుర్లభములని వ్రాసిరి.

తృతీయావిభక్తియందును,సహార్థతుల్యార్థాదియోగమున వచ్చెడి తృతీయ యంతమునఁగలవానికిని, మాత్రము ఈ యాదేశమురాదని తెలియఁదగును.

సూ॥ పదాద్యంతగతం బా శబ్దంబమహదర్థకంబు సమస్తంబు వ్యస్తంబు నయి కొన్నియెడల నర్థశూన్యం బగు. ౬౩

ఉ. చ. తత్పుర వప్రపాద పీఠికాశిరముల కొప్ప నర్చనలు చేసిన పువ్వుల యవ్విధంబునన్. భార. ఆది ౮ ఆ. ౭౬. పాడుగావు నాగతి. కళా. ౩ ఆ. మఱిబావులు నూఱిటికంటె నొక్కసత్క్రతువది మేలు. భార. ఆది. ౪ ఆ. ౯౩.

పదాద్యంతగతంబు = పదాదిగతంబును, పదాంతగతంబును. పదాదిని జెందియున్న "నా" శబ్దము అమహదర్థకమును సమాసగతమును నయి కొన్ని చోట్ల నిరర్థకముగానుండును అట్లే పదాంతమునను్న "యా" శబ్దము అమహ దర్థకమును వ్యస్తమును నయి కొన్నిచోట్ల నిరర్థకమగును.

("పదాదిగతమ"ను పదమునకు "సమస్తంబ"ను పదముతోడను "పదాం తగతంబ"ను పదమునకు "వ్యస్తంబ"ను పదముతోడను యథాసంఖ్యాన్వయ మభిమతము)

అనగా "ఆ" శబ్దము అమహత్తును బోధించుచు సమాసమునందొక పదమునకుఁ బూర్వముచేరియున్నపు డొకొ్కకచో నర్థమేమియు లేకయుండును. "పువ్వుల యవ్విధంబునన్" అనుచో విధము అనుపదమునకుఁ బూర్వమున సమాసగతముగా 'నా' శబ్దముచేరి "అవ్విధంబునన్" అనియున్నది. ఇచ్చట నా శబ్దము నిరర్థకము. పువ్వులవిధమునన్ అనిన నేయర్థమో "పువ్వుల యవ్వి ధమ్మునన్" అనినను నదియే యర్థము. ఇట్లే "పాడుగావు నాగతి" అనుచోట పాడుగావు యొక్కరీతిని అనియర్థము. ఇందు గతి అనుపదమునకుఁ బూర్వము 'ఆ' శబ్దము సమాసగతమయి యర్థశూన్యమయి యున్నది. ఈ రెండుస్థలము లును పదాదిగతమగు 'ఆ' శబ్దమున కుదాహరణములు. ఆ శబ్ద మమహత్తును బోధించుచు వ్యస్తముగానుండి యొకపదమున కంతమునఁజేరియున్నను నట్లే యొకొ్కకచో నిరర్థకముగానుండును. 'సత్క్రతువది మేలు' అనుచోట సత్క్రతు వనుపదమున కంతమున 'అది' యను నమహచ్ఛబ్దముచేరి వ్యస్తముగానున్నది.

ఇది నిరర్థకము. "సత్క్రతువుమేలు" అనినకంటె "సత్క్రతువదిమేలు" అను నపు డధికమగు నర్థమేమియునులేదు.

విధము, గతి, అను తరువాతిపదములతో నన్వయించుటంజేసి యచ్చటి యా శబ్దము పదాదిగతమనియు 'క్రతువు' అను పూర్వపదముతో నన్వయించు టంజేసి "యది" యను నా శబ్దము పదాంతగతమనియు భావింపఁబడెను. పదాదిగతమనగా విశేష్యమున కాది నుండునది యనియుఁ బదాంతగతమనఁగా విశేష్యమున కనంతరమున నుండునది యనియుఁ దెలియనగును.

**సూ॥ తవర్ణకంబు స్త్ర్యర్థకం బగు.** ౬౪

"త" అను ప్రత్యయము "స్త్రీ" అను నర్థముగలది. అనగా నియ్యది శబ్దములచివరఁజేరి స్త్రీత్వమును బోధించునని భావము. ఇచ్చటఁ బ్రత్యయ మున కర్థము మాత్రము విదింపఁబడుచున్నది అనంతరసూత్రముచే "ఏ, ఒక" శబ్దముల కీ ప్రత్యయము విధింపఁబడును.

**సూ॥ అయ్యది యేకత్వంబున సమాసగత షష్ఠ్యంత యత్కిమర్థకా న్యైకార్థక శబ్దంబుల పయినగు.** ౬౫

ఉ. ఎవ్వరిత, ఎవరిత; ఒక్కరిత, ఒకరిత; ఒక్కొరిత, ఒకొరిత; (దీనికి "ఎవరియొక్క-యాఁడుది యనియు, ఒకరియొక్క- యాఁడుది యనియు, ఒక్క-యాఁడు దనియు" నర్థములు.)

యచ్ఛబ్దార్థమునను "కిం" శబ్దార్థమునునుగూడఁ దెనుఁగున "ఏ" శబ్దము వాడఁబడును. అట్లే "అన్య"శబ్దార్థమునందును "ఏక"శబ్దార్థమునందును,"ఒక" శబ్దము తెనుఁగున వాడఁబడును. అందుచే "ఏ" శబ్దము యత్కిమర్థకమనియు 'నొక' శబ్ద మన్యైకార్థమనియు నిందు వ్యవహరింపఁబడుచున్నవి. బాలవ్యాకర్త యు యత్కిమర్థకమని వ్యవహరించెను. 'ఒక' యనుదానిని బాలవ్యాకర్త యన్యా ర్థకమనక యేకార్థకమనియే వ్యవహరించెను. ప్రౌఢవ్యాకర్తమాత్రము దీని నన్యై కార్థకమని వ్యవహరించుచున్నాడు.

అయ్యది యనగాఁ బూర్వసూత్రవిహిత తవర్ణకము, సమాసమునందు షష్ఠ్యంతములుగానున్న 'ఏ, ఒక' శబ్దముల కేకత్వమునఁ బరముగా ననఁగా నంత్యావయవమయి వచ్చును. అనగా పరపదమగు స్త్రీవాచకశబ్దము స్థానమున "త" వర్ణకము వచ్చునని భావము. "ఎవరియొక్క + ఆడుది" అను విగ్రహావస్థ

యుంవలి "యాఁడుది" యనుపదమునకుబదులు తవర్ణకమురాగా ఎవరి యొక్క + త అనియయి సమాసవిభక్తిలోపమురాగా "నెవ్వరిత"యని యగును. ఇట్లే యొకరియొక్క + అడుది = ఒకరితియని యగును.

ఈ తవర్ణక మేకత్వముననే వచ్చుననుటచే దీనికి బహువచనరూప ముండదు. అనఁగా "నెవ్వరితలు"ఇత్యాదిరూపము లుండవని భావము. సమాస గత షష్ఠ్యంతమనఁగా సమాసగత షష్ఠీబహువచనాంతమవి భావింపవలయును. కానిచో సమాసగత షష్ఠ్యేకవచనాంతముపైఁగూడఁ దవర్ణకమువచ్చి యెవ్వనిత, యొక్కనిత, అను నసాధురూపములుగూడ నిష్పన్నములు కావలసివచ్చును.

ఈ విధివైకల్పికమనియుఁ దలంపవలయును. కానిచో నెవ్వరియాఁడుది మున్నగురూపములు లేకపోవలసివచ్చును అడుది యను నర్థమున నిత్యముగాఁ దవర్ణకము వచ్చునపుఁ డీ రూపముండుట కవకాశము లేదుకదా!

పరిశీలింపగా షష్ఠ్యంతమునకు స్త్రీయనునర్థమున 'త' అను ప్రత్యయము చేరుచుండగా నియ్యది తద్ధితాంతమనవలయునుగాని సమాసమనుట తగియుం డదు. సమాసమనుట విభక్తిలోపముకొఱకే యయినచోఁ దద్ధితవృత్తియనినను బాధలేదు వృత్తియందు విభక్తిలోప మెట్లును వచ్చును. కావున సూత్రమున కీ క్రిందిరీతి నర్థముచెప్పుట యుచితము. సమాసగత షష్ఠ్యంతముతో సమానాకా రముగల "ఏ, ఒక" శబ్దములపై స్త్ర్యర్థమునఁ దవర్ణకముచేరి ఎవ్వరి + త = ఎవ్వరిత, ఒక్కరి + త = ఒక్కరిత. అనియగును. ఇప్పుడు వీనిని సమాసము లన నక్కఱలేదు. సమాసగత షష్ఠ్యంతము లనగా సమాసగత షష్ఠ్యంతములతో సమానరూపముగలవని భావము షష్ఠీసమాసమునం దీ శబ్దములు ఎవ్వరి, ఒక్కరి, అనియే వినవచ్చుచుండును.

**సూ॥ దాని యత్వంబున కిత్వైత్వంబులు పర్యాయంబుగ నగు. ఆదే శౌత్వంబుమీఁది దాని కెత్వంబు రాదు. ౬౬**

ఉ. ఎవ్వారితి, ఎవరితి, ఎవ్వారితె, ఎవరితె, ఒక్కారితి, ఒకరితి, ఒక్కారితె, ఒకరితె, ఒక్కొరితి, ఒకొరితి, ఒక్కొరితె, ఒకొరితె.

ఆదేశ + ఓత్వ = ఆదేశౌత్వ. వృద్ధిసంధి (ఆదేశాత్వ అనుపాఠమును ద్వైవిధముగా దిద్దినట్లు సుబోధినిలో వ్రాయఁబడెను. అదిసరియు.)

వెనుకఁజెప్పఁబడిన ఏ, ఒక, శబ్దములమీఁద వచ్చెడి తవర్ణకమునందలి "అ"కారమునకు "ఇ"కారముగాని "ఎ"కారముగాని యగును. పర్యాయమున

ననఁగా నొక్కటి యొకసారియు, వేఱొక్కటి మఱియొకసారియు వచ్చునని తాత్పర్యము ౬౯ సూ.చే నొక్కాదుల కోత్వ మాదేశముగా వచ్చునపుడు తకారముమీఁద నికారము మాత్రమే వచ్చునుకాని యెకారము రాదనియు సూత్రార్థము. అనగా "ఓర్తి" అనుచోట 'ఓర్తి' అని యగునుగాని "ఓర్తె" అని (ఎవ్వరితె మున్నగువానివలె) కాదనుట. తవర్ణకముమీఁద "అకారము ఇకారము, ఎకారము"ను బర్యాయముగా వచ్చునని భావము ఉదాహరణములు స్పష్టములు

సూ॥ రేఫసంయుక్తంబగుచో నొక్కొకశబ్దంబులమీఁది తకారంబున కుత్వంబు నగు. ౭౭

ఉ. చూ. మీఁదు.

ఒక్కొకశబ్దంబులమీఁది = ఒక్క, ఒక, శబ్దంబులమీఁదనున్న. తకారంబునకు = త్ర్యర్థంబున వచ్చిన తవర్ణకమునందలి యకారమునకు రేఫసంయుక్తంబగుచోన్ = పూర్వముననున్న రవర్ణముతో సంయోగముఁ జెందినపుడు. ఉత్వంబునగును = ఉత్వము వికల్పకముగా నగును.

ఒక్క, ఒకొ్క, ఒక, ఒకొ, శబ్దంబులమీఁద తవర్ణముచేరి ఒక్కరిత, ఒకొ్కరిత, ఒకరిత, ఒకొరిత, అనియగును. ఇట్టిశబ్దములందు ౬౮ సూ చే రేఫముమీఁది యికారము వికల్పముగా లోపించును. అట్లులోపించునపుడు రేఫతకారములు సంయుక్తములగును అట్లు సంయుక్తములగునపుడు తకారము నందలి యకారమున కుకారము వికల్పముగావచ్చును.

తరువాతిసూత్రమున నుదాహరణములుగలవని 'చూ. మీఁదు' అను దానిచే సూచించెను ఒక్కరి + త. ఇకారలోపము. ఒక్కర్త. ఈ సూత్రముచేఁ దకారముమీఁది యకార ముకారముకాగా "నొక్కర్తు". ఇట్లే మిగిలినవియుఁ దెలియనగును. ఉదా. ఒక్కర్తు, ఒకొ్కర్తు, ఒకర్తు, ఒకొర్తు.

సూత్రమున నొక్కొకశబ్దములనుటచే దానిరూపాంతములగు "నొక్కొ" "ఒకొ", అను నొకారాంత శబ్దములును గ్రాహ్యములు.

సూ॥ తవర్ణకంబు పరంబగుచో రేఫంబుమీఁది యిత్తునకు లోపంబు విభాష నగు. ౭౮

ఉ. ఎవ్వార్త, ఎవర్త, ఎవ్వార్తి, ఎవర్తి, ఎవ్వార్తె, ఎవర్తె, ఒక్కార్త, ఒకర్త. ఒక్కార్తి, ఒకర్తి, ఒక్కార్తు, ఒకర్తు, ఒక్కార్తె, ఒకర్తె, ఒక్కొార్త, ఒకొర్త, ఒక్కొార్తి, ఒకొర్తి, ఒక్కొర్తు, ఒకొర్తు, ఒక్కొార్తె, ఒకొర్తె.

వెనుకవిధింపఁబడిన తవర్ణకము పరమగునపుడు "ఏ, ఒక" శబ్దంబులందలి రేఫనుమీఁదనున్న హ్రస్వమగు నికారమునకు లోపము వికల్పముగా నగును.

ఇకారలోపమువచ్చిన వివిధరూపముల నుదాహరించెను ఎవర్త మున్నగు 'నే"శబ్దరూపములు ఆ, ఈ, ఏ, లు అంతమునఁగల్గి ముత్త్రివిధములగును. ఆమూఁడును వకారమునకు ద్విత్వాద్విత్వములవలన నాఱురూపములగును. మొదటి రెండును, నివియు, ఒక్క, ఒక, అను రెండుశబ్దములు తవర్ణకమున "అ, ఇ, ఉ, ఏ" అను వర్ణములు పర్యాయముగా నుండుటంబట్టి నాల్గేసివిధములయి మొత్తమెనిమిదిరూపములం జెందును. అట్లే "ఒక్కొ, ఒకొ" అను రెండుశబ్దములును నెన్మిదిరూపములం జెందును. వీనిని గ్రమముగా నుదాహరించెను.

ఎవ్వరిత మున్నగువానిలోని 'ర్య'ంతభాగ మౌపవిభక్తికమనుకొన నక్కరలేదు. ౨౪ సూ.చే 'ఆ, శబ్ద మనుప్రయుక్తముగానున్న "ఏ"శబ్ద ప్రాతిపదికమునకు షష్ఠీబహువచనప్రత్యయము పరమగునపుడు "ఏవా + యొక్క" అని యుండ లడాగమమురాఁగా ఏవాల + యొక్క. ౮౬ సూ.చే రాదేశమురాఁగా ఏవార + యొక్క. ౯౦ సూ.చే "ఇకారము." ఏవారియొక్క ఏ, వా, లకు హ్రస్వములు, వకారమునకు ద్విత్వమురాఁగా 'ఎవ్వరియొక్క' అని యయ్యెను. తవర్ణకముచేరఁగా విభక్తిలోపమురాఁగా 'ఎవ్వరిత' అని యగును. ఇందలి యికారము ప్రత్యయమునకు వచ్చునది కావునను బహువచనాంతములలోఁ జూపట్టుటచేతను నౌపవిభక్తికమని తలంపరాదు.

సూ॥ కొన్నియెడల రేఫసంయుక్త తవర్ణకంబు ముందటియొక్కాదుల కోత్వం బాదేశం బగు. ౬౯

ఉ. ఓర్త, ఓర్తి, ఓర్తు.

కొన్నియెడల ౬౪ సూ.చే నికారము లోపించినందునఁ దవర్ణకము రేఫముతో సంయుక్తమగును. అట్టి సంయుక్త తకారమునకుఁ బూర్వముననున్న "ఒక్క,

ఒక, ఒక్కొ, ఒకో'' అను నాల్గుశబ్దములకును 'ఓ' అనునర్థ మాదేశము గావచ్చును.

ఒక్కర్త. ''ఒక్క'' అనుభాగమునకు 'ఓ' ఆదేశము ఓర్తయయ్యెను ఇట్లే ఒకర్త ఒక్కొర్త, ఒకొర్త అనునవియు 'ఓర్త' అనుయు యగును. ఇచ్చటి తకారమునకు ౬౫ సూ చే అ, ఇ, అనువర్ణములును, ౬౭ సూ చే ''ఉ''కారమును సంత్యావయవములగుచుండ వరుసగా ''ఓర్త, ఓర్తి, ఓర్తు,'' అను రూపములగును ౬౬ సూ.చే నిషేధింపఁబడుటచే నెకారముగానందున ''ఓర్తె'' అనియుండదు. ఈ మూఁడును నుదాహరణములుగాఁ జూపఁబడెను.

సూ॥ ఎవ్వరితాదులందలి రివర్ణంబునకు లోపంబు విభాష నగు. ౭౦

ఉ. ఎవ్వత, ఎవత, ఎవ్వతి, ఎవతి, ఎవ్వతె, ఎవతె, ఒక్కత, ఒకత; ఒక్కతి, ఒకతి; ఒక్కతె, ఒకతె, ఒక్కొత, ఒకొత; ఒక్కొతి, ఒకొతి; ఒక్కొతె, ఒకొతె; [స్వార్థంబునంగప్రత్యయంబురా – ఎవ్వతుక, ఎవతుక, ఎవ్వర్తుక, ఎవర్తుక, ఒక్కతుక, ఒకతుక, ఒక్కొతుక, ఒకొతుక, ఒక్కర్తుక, ఒకర్తుక, ఒక్కొర్తుక, ఒకొర్తుక, ఓర్తుక. అని రూపంబులు.]

''ఎవ్వరిత'' మొదలయిన యికారలోపములేని తవర్ణకాంతశబ్దములలోని రివర్ణమునకులోపము వైభాషికముగావచ్చును

ఎవ్వరిత–రివర్ణలోపము–ఎవ్వత ఇట్లే యుదాహరణాంతరములు నూహ్యములు. స్వార్థమున నీ యెవ్వతాదిశబ్దములకుఁ 'గ' ప్రత్యయముచేరును. అది చేరినపుడు పూర్వముననున్న యచ్చునకుత్వముగూడవచ్చును. అప్పు డెవ్వతుకేత్యాదిరీతినిరూపంబులుండును. అవియునెవ్వతుకేత్యాదిగా నుదాహరింపఁబడెను. ఇవి స్వార్థంబునఁ గప్రత్యయమునచ్చినరూపములని వివరణమున వ్రాయఁబడెను. కప్రత్యయముతోఁబాటు ''ఉత్వము'' గూడ వచ్చునని సుస్పష్టమగుటచే వ్రాయలేదు. ఈ ''క''ప్రత్యయము చింతామణియందుఁ జెప్పఁబడినదియే యిచ్చట స్మరింపఁబడెను. అందు ''నామ్నః క వర్ణకః స్యాత్స్వార్థే స్యాదుత్వమపి పరేతస్మిన్'' అనిసూత్రము కావున ౬౭ వ. సూ.చే వచ్చెడి యుత్వము రేఫసంయుక్తముకాకపోయినను నెవ్వతుకాదులందు వచ్చెనని యనుకొనరాదు అట్లనుకొనుట కవకాశముకూడలేదు ఉత్వమొక్కొకాదులకుఁ జెప్పఁబడెనుగాని యెవరితాదులగు నే శబ్దరూపములకుఁ జెప్పఁబడనేలేదు.

ఒక్కొకాదులకైనను రేఫసంయోగముండునపుడేయని విధింపఁబడుచుండఁగా నట్టి రేఫసంయోగనిమిత్తములేనపు డుత్వము రాఁజాలదు

సూ॥ నీ మీ నే మే హల్లులకు లోపంబు విభాష నగు. ౭౧

ఉ. ఈవు, నీవు, ఈరు, మీరు, ఏను, నేను, ఏము, మేము.

యుష్మదస్మచ్ఛబ్ద ప్రథమావిభక్త్యంతరూపములగు నీవు, మీరు, నేను, మేము, అనుపదములలోని మొదటిహల్లులగు నకార మకారములు వికల్పముగా లోపించుచుండును

నకార మకారములు లోపించినరూపములు – ఈవు, ఈరు, ఏను, ఏము. యుష్మదస్మచ్ఛబ్దములలో నన్నివిభక్తులయందును నకార మకారములు లోపింపవు. నీచేత, మీచేత, నాచేత, మాచేత, మున్నగుస్థలములందు హల్లోపము కానరాదు. కావున ''నీమీ నేమే అనువానిలోని హల్లులు'' అని సామాన్యముగా నిర్దేశించి లోపముచెప్పుట సరికాదు.

సూ॥ బహుత్వంబున మేకు నే విభాష నగు ౭౨

ఉ. నేము, మేము.

ప్రథమా బహువచనాంతా స్మచ్ఛబ్దార్థకమగు ''మేము'' అనుపదములోని "మే" అనుదానికిబదులు ''నే'' అని యగును

మేము – ''మే'' అనుదానికి ''నే'' రాఁగా ''నేము'' అని యయ్యెను. ''మకారమునకు'' అన్నచో రెండు మకారము లీ పదమునందున్నందున భ్రాంతి కల్గునని ''మేకు'' అని చెప్పఁబడెను. (నీ నా శబ్దముల ప్రథమారూపముల ప్రక్రియను జూపలేదు. వానికై చింతామణి చూచుకొనవలయును

సూ॥ నిన్ను నన్నుఁదన్ను - వీనియందలి ద్విత్వమునకేనియు, ద్విత్వయుక్త నువర్ణమునకేనియు, మిమ్ము మమ్ముఁ దమ్ము వీనియందలి ద్విత్వంబునకును లోపంబు వైకల్పికంబు. ౭౩

ఉ. నినున్, నిన్, ననున్, నన్, తనున్, తన్, మిమున్, మమున్, తమున్, ఉ. నిన్, నమ్మినవారి కెన్నడును నాశములేదు గదమ్మ యీశ్వరీ! భాగ.౧౦ స్క-౦.౧౩౫౨. నన్ నిలువంబెట్టితి. భాగ.౧౦ స్కం. పూ.భా ౧౭౩౬. సీ. పనియేమి పంచినఁ బదపడిచేసెద ననక తన్ బంచిన యూషణంబచేయుడు. భార. ఆది.౩ ఆ ౧౧౦ మొ॥

"నిన్నున్ నన్నున్ తన్నున్" అనునవి నీ, నా, తా, శబ్దముల ద్వితీయైక వచనాంతరూపములు. వీనియందలి నకారద్వయములో నొక నకారమునకుఁ గాని "న్ను" అను నుత్వయుక్త నకారద్వయమునకునుగాని లోపమువచ్చును.

ద్విత్వమునకు లోపమువచ్చినచో "నినున్, ననున్, తనున్" అని యగును. "న్ను" అనుదానికి లోపమువచ్చినచో "నిన్, నన్, తన్" అని యగును. "మిమ్మున్, మమ్మున్ తమ్మున్" అనునవి నీ, నా, తా, శబ్దముల ద్వితీయాబహువచనాంతములు. వీనిలో ద్విత్వమునకును లోపమువచ్చును. వచ్చినచో "మిమున్, మమున్, తమున్" అని యగును. ఈ లోపములన్నియు వైకల్పికములు. అందుచే సూత్రోక్తరూపములు నుండును.

ఈ సూత్రమున "ద్విత్వయుక్త నువర్ణము" అనుమాట సరికాదు. నువర్ణమునకు ద్విత్వములేదు. నకారమునకు మాత్రమే ద్విత్వముగలదు. ద్విత్వయుక్త నకారోకారములకు లోపమువచ్చునని భావము ఉదాహరణములు స్పష్టములు.

"నిన్నమ్మిన..." నిన్ అనుదానికిఁ బ్రయోగము. "నన్ నిలువం బెట్టితి..." నన్ అనుదానికిఁ బ్రయోగము. "పనియేమి... తన్ బంచిన .."తన్ అనుటకుఁ బ్రయోగము. అతిప్రసిద్ధములగువానికిఁగాక విరళములగువానికి మాత్రము ప్రయోగము చూపఁబడెను.

**సూ॥ తాము తమరు తారు నగు.** ౭౪

ఉ స్పష్టము.

"తాము" అనునది తాశబ్ద ప్రథమాబహువచనాంతరూపము. "తాము"ను పదము తమరు, తారు, అనియు నగును. ప్రక్రియఁజూపక రూపముల నిపతించెను.

**సూ॥ నామపునర్గ్రహణంబున భిన్నంబు నభిన్నంబునయి తచ్ఛబ్దార్థంబు తత్పర్యాయం బగు** ౭౫

ఉ. వాఁడె సురాసురులెల్ల నడ్డమైవచ్చిననైన రాక్షసవివాహమునం గొనిపోవు నిన్ను. భాగ. ౧౦ పూ. ౧౭౩౪. (వాఁడె భిన్నరూపము. ఆ సుదర్శనాయుధుఁడనుట యభిన్నరూపము; సుదర్శనాయుధుఁడు నామపదము.) ఎ.గీ. వివిధ పుణ్యకథలు విను వేడ్కనతనిఁ బూజించిరి. భార. ఆది. ౧ ఆ. ౨౭. (అతనిన్ – భిన్నరూపము. అక్కధకు

ననుట యభిన్నరూపము. కథకుఁడు నామపదము) సీ. కలహంస పలికిన పలుకుల గణియించువడిదాని పోయిననలన చూచు. భార. అర.౨ ఆ.౨౬. (దాని-భిన్నరూపము. ఆ కలహంసయనుట యభిన్నరూపము. కలహంస – నామపదము.) మొ॥

నామపదము నొకసారి గ్రహించినతర్వాత మఱల గ్రహింపవలసియున్నపుడు ఆ నామపదముతోఁ గలసియుండిగాని యా నామపదములేక "ఆ" శబ్ద మొక్కటియ వేరుగానుండిగాని యీ నామపదముయొక్క యర్థమునే బోధించెడి దగును.

నామపునర్గ్రహణంబునన్ = నామవాచకంబును మఱలగ్రహించునపుడు. భిన్నంబు = నామవాచకముతోఁ గూడియుండక వేఱుగా నొక్కటియ ప్రయోగింపఁబడినది. అభిన్నము = నామవాచకముతోఁ గూడియున్నది. తచ్ఛబ్దార్థంబు = ఆ శబ్దము. తత్పర్యాయంబు = నామవాచకము నర్థమునవే ప్రయోగింపఁబడునది.

"వాఁడె సురాసురులెల్ల... ...నిన్ను" ఈ వాక్యమునకుఁబూర్వ మొకసారి సుదర్శనాయుధపదమును వాడియున్నాడు. మఱల నీ వాక్యమునుగూడ సుదర్శనాయుధుని పనులనే చెప్పుచున్నందున సుదర్శనాయుధపదము వాడవలసియున్నది. అయినను సుదర్శనాయుధపదమును మఱల వాడక "వాఁడె" అని తచ్ఛబ్దమును బ్రయోగించెను. ఈ "వాఁడె" అనుపదము భిన్నరూపము. అనఁగా సుదర్శనాయుధుఁడనుపదముతోఁ గలసియుండక (ఆ సుదర్శనాయుధుఁడె అని కలసియుండక) భిన్నముగా ననగా వేఱుగానున్నది. దీనికా నామపదముయొక్క యర్థమేయనఁగా సుదర్శనాయుధుఁడె యని యర్థమని తాత్పర్యము.

ఇచ్చట "వాఁడె" యనుటకుబదులు "ఆ సుదర్శనాయుధుఁడె యని తచ్ఛాబ్దార్థకమును నామపదముతోఁ గూర్చియుఁ బ్రయోగింపవచ్చును. అప్పుడది యభిన్నరూపమని చెప్పఁబడును. ఇట్లే "వివిధ పుణ్యకథలు... అతనిన్" అనుచోటఁ గథకుఁడనుపదము మొదటగ్రహింపఁబడి దానిస్థానమున నతనినను తచ్ఛబ్దము భిన్నముగనే ప్రయోగింపఁబడెను. కథక పదముతోఁగూర్చి యీ తచ్ఛబ్దమును "నక్కథకున్" అని ప్రయోగించిన నభిన్నరూపమగును. "అతనిన్" అనినను నక్కథకు ననినను నొకటేయర్థమని తాత్పర్యము,

ఇట్లే "కలహంస ... దానిపోయినవలన. ." ఇందు దానిపోయినవలను అనఁగా నా కలహంస పోయినవలనని యర్థము ఇచ్చుటఁ గలహంసపదముతోఁ గూడక వేరుగా "దాని" అని తచ్ఛబ్దము భిన్నరూపముగాఁ బ్రయోగింపఁ బడెను. ఇందిచ్చిన మూఁడుపద్యములందును భిన్న తచ్ఛబ్దార్థముననే ప్రయోగముగలదు. అభిన్నములకు వ్యాకర్త స్వీయపదములనే చూపెఁగాని ప్రయోగములను జూపలేదు.

ఈ సూత్రము తచ్ఛబ్దముయొక్క రూపము (ఆకారము)నుగూర్చి యేమియు విధింపలేదు. వేర్వేరుస్థలములందుఁగల యర్థములెట్లుండునో మాత్రము బోధించుచున్నది. న్యాయముగా నీ విషయము వ్యాకరణమునఁ జెప్పవలసినదిగాదు. అయినను నీతఁ డర్థములకు సంబంధించిన విధులనుగూడ నచ్చటచ్చట చెప్పుచుండును. అట్లే యియ్యదియుఁ జెప్పఁబడెనని తెలియవలయును. ఈ ప్రకరణమునందలి ౧౨ సూత్రముకూడ శబ్దమునకు సంబంధించిన విధికాకున్నను విశేష్య విశేషణముల ప్రసంగము వచ్చి వానికి సహప్రయోగము నియతమన్నట్లు తోఁచుచుండఁగా నట్టిసందేహమును నివారించుట కాసూత్రము నిర్మింపఁ బడెను. ఇచ్చట నట్టియావశ్యకతలేకున్నను సర్వనామ విషయకప్రకరణమగుటచే వానియర్థవిశేషములనుఁ గొన్నిసూత్రములలోఁ జెప్పును. అర్థముకూడ శబ్దసంబంధియే కావున వ్యాకరణమున దానికినిఁ బ్రసక్తియున్నదని భావించి యుండును

సూ॥ ఒక్కొకచో నామంబె యగు ౨౬

ఉ. సీ. సురవరులర్థులై చూచుచునుండంగ నలువరియించిన నాటి యెగ్గుదలఁచి యిట్టియాపదలుచేసిరో వేల్పులమరకోపమునన యయ్యో నాకు నీ వియోగదుఃఖము. భార. అర.౨ ఆ ౧౧౩ మొ॥

నామంబె=నామపదమొక్కటియే.

నామపునర్గ్రహణ యోగ్యస్థలమున భిన్నముగాని యభిన్నముగాని యగు తచ్ఛబ్దార్థకము మాత్రమే వచ్చునని వెనుకటిసూత్రమున విధింపఁబడుటచే కేవల నామవాచకమున కట్టియెడఁ బ్రయోగము నిషిద్ధమగుచున్నది కావున నీ సూత్రము మఱల నామపదప్రయోగమును విధింపవలసివచ్చెను. వెనుకటి సూత్రమునసే "వికల్పముగానగు"నని విధించియుండిన నామపదమునకునుఁ బ్రయో

గము సిద్ధించుచునే యుండును అట్లయిన నీ సూత్రమును రచింపనక్కఱలేక యుండును. ఇందలి యుదాహరణమున "సురవరులు" అను నామపదమును మఱల గ్రహింపవలసియుండఁగా దానిస్థానమున "వేల్పు" లను వేరొక నామ పదమునే ప్రయోగించెను "ఆపదలుచేసిరో వారు" అని భిన్నరూపముగాని యాపదలుచేసిరో యా "సురవరులు" అను నభిన్నరూపముగాని ప్రయోగింపఁ బడలేదు. ఇట్లే యింకొకసారి సురవరులను గ్రహింపవలసియుండఁగా నచ్చట "నమరకోపముునన యయ్యె" నని "అమర" అను నామపదమును బ్రయో గించెను ఇచ్చట సురవరులకోపమునన యనిగాని "యా సురవరుల కోపము నన" యనిగాని ప్రయోగింపఁబడక నామపదము ప్రయోగింపఁబడినందున నిదియు నుదాహరణము. "వేల్పు"లను నామపదమునకు నియ్యది పునర్గ్రహణ మన్నను నుదాహరణమగుట కాటంకములేదు

నామమును మఱల గ్రహింపవలసినస్థలమున నామమే గ్రహింపఁబడుట గూడ సమ్మతమని యీ సూత్రమునఁ జెప్పఁబడెను కాని యుదాహరణములను బట్టి పునర్గృహీతమగు నామపదము మొదట గ్రహింపఁబడినదికాక దాని యర్థముగల వేఱొక నామపదమును గ్రహింపవచ్చునని తెలియఁబడుచున్నది. మొదటిపదమే మఱల గ్రహింపఁబడలేదు. మొదటిపదమునే మఱల గ్రహిం చుట సామాన్యముగానుండదు ప్రయోగములను బరిశీలింపవలయును. వ్యంగ్య విశేషమును వివక్షించునపు డేకరూపమగు నామపదమును బ్రయోగించుటయుఁ గలదు. "విషరాశిన్ జనియింపవో. . విషభృన్మార్గమునంటవో" "కమలాక్షు నర్చించు కరములు కరములు" ఇత్యాదికములు.

సూ॥ నామతదేత ద్వ్యత్యర్థములకుం బునర్గ్రహణంబునఁ బ్రథ మాద్యంతమయి పూర్వపరంబులుగ నాత్మార్థం బభిహితం బగు. ౨౭

ఉ. తాౘచ్చె సుదర్శనాయుధుఁడు. భాగ.౧౦ స్క-౦. పూ. ౧౭౩౮. క. విదురుఁడురు విషాగ్నులవలనన్ మానుగ నేమఱకుండని తాను బ్రబోధించె. భార. ఆది.౫ ఆ.౧౫౧. (ఇటఁ దాశబ్దము పాద పూరణార్థకము. వచ్చె సుదర్శనాయుధుఁడు – విదురుఁడు బోధించె. అని యాత్మార్థ విరహితంబుగను జెప్పనగు.)

"ఆ. అడవిఁ దన్ను బాసి యరిగిన నలిగి గాకున్నె యిట్లుసేయను విదకడఁగె" భార. అర.౨ ఆ.౧౬౮. వ. అదియును దనక మ్మనుజేశ్వరుం డపాయంబుసేయునకాఁ దలఁచి. భార. అర.౨ ఆ.౧౮. క. కర్మములు మేలునిచ్చును గర్మంబులు కీడునిచ్చుఁ గర్తలు దనకున్ గర్మములు బ్రహ్మకైనను గర్మగుఁడై పరులఁ దడవఁగా నేమిటికిన్. భాగ.౧౦ స్క-౦. పూ.౩౨. మొ॥

నామమునకును, తత్, ఏతత్, యత్కిమ్, శబ్దముల యర్థముగలవానికి ననగా "ఆ, ఈ, ఏ" శబ్దములకుఁ బునర్గ్రహణచేయవలసినపుడు వానికివెనుకఁ గాని ముందుగాని "తా" అను నాత్మార్థకశబ్దము సందర్భమునకుఁదగిన ప్రథమాది విభక్తిప్రత్యయము లంతమునంగలదై ప్రయోగింపఁబడును.

(1) "తావచ్చె సుదర్శనాయుధుఁడు" ఇట సుదర్శనాయుధుఁ డనుపదమునకుఁ బునర్గ్రహణంబునఁ బూర్వముగ "తా" అను నాత్మార్థకము ప్రథమాంతమై ప్రయోగింపఁబడెను.

(2) "విదురుఁడు... తానుబ్రబోధించె" ఇందు విదురుఁడను నామపదమునకుఁ బరముగాఁ బ్రథమాంత 'తా'శబ్దము ప్రయోగింపఁబడెను. ఈ రెండు స్థలములయందును "తా"శబ్దము కేవలము పాదపూరణముగానున్నది. అర్థవిశేషమేమియు లేదు.

(3) "అడవిఁదన్ను... ఉవిదకడఁగె" ఇందు "ఉవిద" యను నామమునకుఁ దన్ను అను ద్వితీయైకవచనాంత "తా" శబ్దము పూర్వమునఁ బ్రయోగింపఁబడెను.

(4) "అదియును... ...దలఁచి" ఇందది యను తచ్ఛబ్దమునకుఁ బునర్గ్రహణంబునఁ "దనకు" అను షష్ఠ్యంత "తా" శబ్దము పరంబుగాఁ బ్రయోగింపఁబడెను.

(5) "కర్మములు... బ్రహ్మకైనను." ఇందు "బ్రహ్మక"ను నామమునకు బదులుగాఁ "దనక"ను నాత్మార్థకము పూర్వమున గ్రహింపఁబడెను. "బ్రహ్మకైనను దనకుఁ గర్మములు కర్తలు" అను నన్వయమునఁ దనకను నదిపాదపూరణార్థకమని చెప్పనగును. విశేషార్థమిట నేమియుఁ గానరాదు. విదురుఁడు తాను బ్రబోధించెనన్నట్లే "బ్రహ్మకైనను దనకు" అని యన్వయముగదా! ఇదియును నామమునకే యుదాహరింపఁబడుట క్రమభంగముగా నున్నది.

ఈ, ఏ, శబ్దములకు స్వీయోదాహరణములనుగాని ప్రయోగములనుగాని చూపలేదు. వానిని నూహింపఁదగును.

ఈ శబ్దమునకు – రాముఁడు రావణుం జంపఁదలచెను. ఇతఁడుమాత్రము తనకేమియు ననర్థములేదని తలంచుచుండెను.

యచ్ఛబ్దార్థకమగు ''ఏ'' శబ్దమునకు – ఎవ్వఁడు తనకు శ్రేయము కావలయునని కోరికొనునో వాఁడు శ్రీహరి నాశ్రయించును.

కిం శబ్దార్థకమగు 'ఏ'శబ్దమునకు–ఎవ్వఁడు తనకట్టి శ్రేయముం గోరఁడు? (తప్పకకోరునని యర్థము)

తెనుఁగున ''య''దర్థమునను ''కి''మర్థమునునుగూడ ''ఏ'' శబ్దమే వాడఁబడును అందుచే యదర్థకమునకును కిమర్థకమునకునుగూడ నీవిధి వర్తించును. ''ఏ'' శబ్దము రూపమున నొక్కటే యయినను అర్థము నొక్కొకచో నొక్కొకదానిం బోధించును. అందుచే నీ శబ్దము సందర్భమునుంబట్టి యదర్థకమో కిమర్థకమో తెలియుచుండవలయును. సామాన్యముగాఁ గార్యములన్నియు నుభయములందును సమానములగుటచే ''యత్కిమర్థకము'' అని ''ఏ'' శబ్దమును వాడుచుందురు. ఎల్లచోట్లను నుభయార్థకముగానుండదు. ఒక్కొకయర్థమునే బోధించుచుండును.

ఇందుఁ జివరియుదాహరణమునఁ గర్మగుఁడై పరులననుచోటఁ గర్మరుఁడై యనుపాఠముకంటె ''కర్మగుఁడై'' యనుపాఠము సరసము.

పూర్వపరంబులుగా ననుచోట బహువచనంబు సరికాదు. పూర్వపరంబుగానని యేకవచనాంతముగా నుండవలయును. ఈ శబ్ద మాత్మార్థంబనుదానికి విశేషణము కావున దానిననుసరించి యేకవచనాంతము కావలయును. స్త్రీసమంబులగు విశేషణంబులకును మువర్ణకాంతవిశేషణములకును బహువచనస్థానమున నేకవచనము విధింపఁబడెనుగాని యెచ్చటను నేకవచనస్థానమున బహువచనమువచ్చుట యుండదుగదా!

సూ॥ ఆత్మార్థం బొకానొకచో నామూస్మదర్థాభిధాయియు నగు. ౭౮

ఉ. తే. తనకు మఱి తానెచుట్టంబు తానె తనకు గతియుఁ దన్నిచ్చుచో దానకర్తయనఁగ వనజనేత్ర! గాంధర్వవివాహ మతిరహస్యమగును నమంత్రకమును నగుచు నొప్పు. (తనకున్=స్త్రీకనుట)

భార. ఆది.౪ ఆ.౫౨. క. తనతొంటి కర్మరాశికి ననుచరమై బహు వికారమై మనము వడిన్ జను నింద్రియముల తెరువులఁ దనువులు-వైక్యొనఁ జెడవు తనకర్మంబుల్. భాగ.౧౦ స్కం. పూ.౩౦. (తన=ప్రాణియొక్క) మో॥ తనకిష్టుఁడున్ సహాధ్యాయుఁడు నైనవాఁడు (తన-కున్=నాకు.) భార. ఆది.౧ ఆ ౨౪. తన తనుచ్ఛాయ మస్తకహీనమై-తోఁచె. (తన తనుచ్ఛాయ=నా తనుచ్ఛాయ.) జై.౭ ఆ.౧౩. నీవు చెప్ప నొడికంబునఁ బూనిన యీ ప్రబంధముం దనకిప్డుఁ డంకితంబు ప్రమదంబుగఁ జేయుము. (తనకున్=నాకు.) రుక్మాం.౧ ఆ.౩౩ సీ. తమసొమ్ము తమకిచ్చె ధర్మరాజని మహీసురులు దానము సేయఁజూచి-నగరె! (తమసొమ్ము=మాసొమ్మె; తమకున్=మాకు.) జై.౧ఆ.౬౮ మొ॥

ఆత్మార్థము=ఆత్మార్థకము. అనఁగా "తా" శబ్దము. నామాస్మదర్థాభిధాయి=నామపదముయొక్కయు, "నా" శబ్దముయొక్కయు నర్థమును జెప్పెడిది.

తాశబ్దము కొన్నియెడల నామపదములయొక్క యర్థమునందును "నా" శబ్దముయొక్క యర్థమునందును బ్రయోగింపఁబడుచుండునని భావము.

(1) "తనకుతానె. . ...." ఇచ్చట తాశబ్ద మాఱుసారులు ప్రయోగింపఁబడెను. తనకు=స్త్రీకి. తానె=స్త్రీయె. తన్ను=స్త్రీని. తాన=స్త్రీయే. అనురీతిని స్త్రీయను నామవాచకముయొక్క యర్థమునఁ "దా" శబ్దమిచ్చట వాడఁబడెను.

(2) "తన తొంటి కర్మరాశికి..." ఇట తన తొంటి కర్మరాశికి=ప్రాణియొక్క పూర్వకర్మరాశికి. తనకర్మంబుల్=ప్రాణియొక్క కర్మంబులు. ఇచ్చట ప్రాణియను నామవాచకము నర్థకమునఁ "దా" శబ్దము వాడఁబడెను.

(3) "తనకిష్టు... ..." ఇందు "తనక"నఁగా నాకనియర్థము. అందుచే నియ్యది-యస్మదర్థమున వాడఁబడెనని తెలియఁబడుచున్నది.

(4) "తన తనుచ్ఛాయ... ..." ఇదియును నస్మదర్థముననే వాడఁబడెను.

(5) "నీవుచెప్ప... .." ఇందును దనకనునది నాకను నర్థమున నున్నది.

(6) అట్లే "తమసొమ్ము" అనుచోట "తమసొమ్ము, తమకు" అనుశబ్దములు-"మాసొమ్ము, మాకు" అనునర్థము నిచ్చుచున్నవి.

ఇందుఁ "దనకిష్టుఁడున్" అన్నచోట నన్నయ్య కిష్టుఁడనియే యర్థము కాని నాకిష్టుఁడని యర్థముకాఁజాలదు. ఆసందర్భమంతయుఁ బ్రథమపురుష క్రియలతో "నన్నయ్య" అని పరోక్షపద్ధతినే ప్రసంగముకలదు గాని నేనని యస్మదర్థమునుగ్రహించి యుత్తమపురుషక్రియలతో వాక్యములే లేవు. అందుచే నియ్యది సరియగు నుదాహరణము కాఁజాలదు.

వెనుకటిసూత్రమే యీ యుదాహరణములను సరిపెట్టుచున్నది. స్త్రీ, ప్రాణి, నన్నయ్య, మహీసురులు, మున్నగు నామవాచకములకే పునర్గ్రహణమునఁ దాశబ్దప్రయోగముకల్గెను. నాశబ్దమునకుఁ బునర్గ్రహణమునఁ దాశబ్ద మెప్పుడును బ్రయోగింపఁజనదు. ఈ యుదాహరణమునఁ దాశబ్ద మెప్పుడును బ్రయోగింపఁజనదు. ఈ యుదాహరణములును సరియగునవికావు రుక్మాంగద చరిత్రోదాహరణమున మాత్రము నస్మదర్థమునఁ దాశబ్దము కానఁబడుచున్నది. కాని యట్టి వెచ్చటను గానరావు.

సూత్రమునఁ జెప్పఁబడినవి రెండువిషయములు. ఒకటి నామార్థకత్వవిధానము — అది పూర్వసూత్రముచే గతార్థము. రెండవది యస్మదర్థాభిధానము. ఇయ్యది యప్రమాణము. కావున నీసూత్రము పరిత్యజింపఁదగును.

**సూ॥ కర్తృబహుత్వంబునఁ దనతనకుఁ దమతమయు నగు. ౭౯**

ఉ. క. తమతమ పుత్రుఁడుగాఁ జిత్తములం జేకొని దయను బృథగ్భావములేక ముదంబునఁ బెంచిరి. భార. అర. ౩ ఆ. ౨౦౯ మొ॥

కర్తలు అనేకములయినపుడు ఆకర్త్రర్థమునఁ బ్రయోగింపఁబడిన "తనతన" యనుశబ్దము "తమతమ" యనియు నుండును. ఉదాహరణమునఁ గర్తలు చాలమంది యగుటచేఁ "దనతన" యనుటకుబదులు "తమతమ" యని వాడఁబడెను. ఇందుఁ "దమతమ పుత్రుఁడు" అనునది సమాసము. ఇచ్చటఁ "దమయొక్క తమయొక్క పుత్రుఁడు" అని విగ్రహావస్థయందుండును. సమాసవిభక్తికి లోపము రాఁగాఁ దమతమ పుత్రుఁడని యగును. "వారియొక్క వారియొక్క పుత్రుఁడ"ను నర్థమున వారివారిపుత్రుఁడనుటకు వేరుగా విధానము చేయనక్కఱలేనట్లే యిచ్చటను "దమతమ" ను విధింపనక్కరలేదు. బహుత్వము వివక్షితమగునపుడు బహువచనరూపములు వచ్చుటకుఁ బునర్విధాన మావశ్యకము కాదుకదా! ఇట్టి ద్విరుక్తి లేకున్నను. బహుత్వవివక్షయందుఁ "దమ" యనురూపము సమాసమునను దృతీయాది విభక్తి పరమగునపుడును వచ్చును. ఈ విధాన

మేలకో తెలియదు. తన తన యనునది యొకపదముకాదు. తన తన యను పదైకదేశస్థానమునఁ "దమ తమ" యను పదైకదేశమే విధింపఁబడెను. సూత్రమునఁ "గర్తృబహుత్వంబున" ననుపదమునకు "ఈ తాశబ్దమునకు సంబంధించిన మూలపదము బహువచనాంతమగునపుడ"నియర్థముచేయవలయును. వాక్యమున నేదియో కర్త బహుత్వముననుండిన యంతమాత్రమున దానితో సంబంధింపని తాశబ్దమునకుఁ "దమ తమ" యనురూపము రాదుగదా! "చెడవు తనకర్మంబుల్" అనుచోట కర్త బహువచనాంతముగానున్నను "దన" యని యేకవచనాంతముగనే యున్నదిగదా! ప్రాణియను మూలపదము బహువచనాంతముగా వివక్షితమయ్యెనేని "ప్రాణులకుఁ దమకర్మంబుల్ చెడవు" అనియుండవచ్చును. "ప్రాణులకుఁ దమ తమ యిష్టదైవమే మేలుకలిగించును." అనుచోటఁ గర్త యేకవచనాంతముగనున్నను "దమ తమ" అను బహువచన రూపము వచ్చెనుగదా! కావున మీఁదిరీతి నర్థముచేయవలయును.

ఈ కార్యము వైకల్పికమని సూత్రము చెప్పుచున్నది. "వారు తమ తమ పుత్రుఁడుగాఁ బెంచిరి" అనుచోట వారు, పెంచిరి, అనుకర్తృ క్రియారూపదములు బహువచనాంతములుగా నున్నపుడు "తన తన" యని యుండుట తఱచుగాఁ గానరాదు. వ్యవహారముననను నిట్టిచోట బహువచనమే కాన్పించుచున్నది.

సూ॥ ఒక్కొకశబ్దంబుల యత్వంబున కొత్వంబు విభాష నగు. ౨౦.

ఉ. ఒక్కఁడు, ఒక్కొఁడు, ఒకఁడు, ఒకొఁడు.

ఒక్క, ఒక, అను ప్రాతిపదికముల యంతముననున్న యకారమునకు "ఒకారము" వికల్పముగా నాదేశమగును.

అనఁగా "నొక్కొ, ఒక్క, ఒకొ, ఒక" అని "ఒకారాంతము"గా గాని "అకారాంతముగ" గాని యీ ప్రాతిపదికములుండునని తాత్పర్యము. డువర్ణకాంతములగు నుదాహరణములు చూపఁబడినవి. మహతీవాచకము లగునపుడు "ఒక్కత, ఒక్కొత, ఒకత, ఒకొత" మున్నగురీతినుండును. ౦౨ సూ వివరణమున నమహ దుదాహరణములును గలవు. చూడనగును.

సూ॥ ఒక్కొకొ్కాదులకు డువర్ణకంబు పరంబగునపుడు మహదర్థంబున రు రువుఁగాగమంబులును, అవి పరంబగుచోఁ గకారమునకు లోపంబును, కకారాదులకు లోపంబురా డువర్ణకము.

నకు ద్విత్వయుక్త డువర్ణంబును, అమహదర్థంబునం గకా
రాదులకు లోపబిందువులును విభాష నగు. బం॥ లా॥

ఉ. ఒక్కరుఁడు, ఒక్కొరుఁడు, ఒకరుఁడు, ఒకొరుఁడు, ఒక్కరు
వుఁడు, ఒక్కొరువుఁడు, ఒకరువుఁడు, ఒకొరువుఁడు, ఒరుఁడు, ఒరు
వుఁడు, ఒడ్డు, ఒండు.

ఒక్కొకాదులకు = ఒక్క, ఒక, ఒక్కొ, ఒకొ, అనుశబ్దములకు.

ఈ సూత్రమును నాల్గువాక్యములుగా విభజింపవచ్చును.

(1) ఒక్కాదులకు మహత్తు అర్థమగునపుడు డువర్ణకము పరమగునపుడు రు, రువు, అనునాగమములు అంతమున విభాషంజేరును. ఇవిపర్యాయముగా వచ్చుననియు భావము.

ఉ॥ ఒక్క + ఁడు – "రు" ఆగమము. ఒక్కరు + ఁడు = ఒక్కరుఁడు. "రు" ఆగమముకాక "రు వు" ఆగమమువచ్చునపుడు ఒక్క + రువు + ఁడు = ఒక్కరువుఁడు అగును. ఇట్లే యూహ్యములు. మొదటినాల్గును ఒక్క, ఒక్కొ, ఒక, ఒకొ, అనువానికి "రు" ఆగమముచేరిన యుదాహరణములు. తరువాతి నాల్గును వానికే రువుగాగమము వచ్చినరూపములు. పక్షమున – ఒక్కండు, ఒకండు మున్నగునవి.

(2) ఒకాదులకు రు రువుగాగమంబులు వచ్చునప్పుడు కకారమునకు లోపంబును విభాషనగు.

ఒక + రు + ఁడు, కకారలోపము, ఒరుఁడు. ఇట్లే ఒక + రువు + ఁడు = ఒరువుఁడు. పక్షమున – ఒకరుఁడు, ఒకరువుఁడు, మున్నగునవి.

(3) రెండవభాగమున విధింపఁబడిన కకారలోపమువచ్చి రు రువుగాగమములు రానియపుడు డు ప్రత్యయములోని డకారమునకు వికల్పముగా ద్విత్వము వచ్చును. ఉదా॥ ఒక + ఁడు – కకారలోప ద్విత్వములు – ఒడ్డు.

సూత్రమునఁ "గకారాదులకు లోపంబురాన్" అనియున్నది. కాని మహదర్థమునఁ గకారమొక్కటికే లోపము చెప్పఁబడెను. ఆది పదముచే గ్రహింపవలసిన వర్ణంబులు లోపించునవెవ్వియును లేవు. అయినను విభాషగా విధింపఁబడిన రు రువుగాగమములు రానిపక్షమున నవియుఁ గానరావు కనుక ఆదిపదముచే వానిని గ్రహించి యవి కానరానవు డని యర్థముచెప్పవలయును.

(పరిశీలింపఁగా ''గకారలోపంబు రా''ననియే యుండుట సమంజసము. కకారాదులనుట నిరర్థకము. ప్రత్యుత యసంబద్ధముకూడ నగుచున్నది.) లేదా రు రువుగాగమములు వచ్చినపక్షమున వానికి లోపమువచ్చినపుడని యర్థముచేయు దమన్నను గకారమున నొక్కదానికే లోపము విధింపఁబడెనుగాని రు రువుగాగములకు లోపము విధింపఁబడనేలేదు. ఈ సూత్రముననే యంతభాగమున విధింపఁబడెడి కకారాదిలోపమును గ్రహింతమన్నను నది యమహదర్థమున విధింపఁబడుటచే నీ ''ఒడ్డు'' అనుచోట నట్టిలోపము వచ్చుట కవకాశము లేదు. ఇదియు ననగా నీ ద్విత్వ డువర్ణకమును నమహదర్థముననే విధింపఁబడె ననుటకును వీలుకాదు. ఇది యమహదర్థకమే యయినచో రు రువుగాగమములు రానేరావు. అవి మహదర్థముననేగదా! విధింపఁబడినవి. అందుచేఁ గకారాదులక''సి యాదిపదమును గ్రహించుట యత్యంతానుచితము. ''కకారాదులకు లోపబిందువులునగు'' అనుభాగమునను నాదిపదమయుక్తము. ఈలోప మ మహదర్థముననే విధింపఁబడుచున్నదిగదా! అమహదర్థమున రు రువుగాగమములు రానేరావుగదా! ఇట్టిచిక్కులుండుటచే సూత్రమునఁ గకారాదులనఁగా ''క, కొ, క్క, క్కొ, అను నొకాదిశబ్దభాగములు'' అనియర్థము చేయనగును. కాని, యపుడు సూత్రమునఁ ''గకారమునకు లోపంబును'' అనుచోటఁ ''గకారాదులకు లోపంబును'' ననియుండవలసియుండును. ''కకారాదులకు లోపంబు రాన్'' అను తరువాతి యనువాదమును సరిపడును. కాని ఒరుఁడు ఒరువుఁడు, అను రూపద్వయము సిద్ధించుటకు ''ఒక'' అనుశబ్దమునుమాత్రమే గ్రహించి కకారమునకు లోపమువిధించినంజాలును. ఒక్క, ఒక్కొ, ఒకొ, అనువానిని గూడ గ్రహించుట నిరర్థకము. వేనిమీఁదఁ గకారాదిలోపముచేసినను ఒరుఁడు, ఒరువుఁడు, అను రెండురూపములేగదాసిద్ధించును! అందుచే నన్నిశబ్దములను గ్రహించి లోపవిధానముచేయుట నిరర్థకమే.

ఒక, ఒక్క, ఒకొ, ఒక్కొ, అనుశబ్దములకు డువర్ణకము పరమగునపుడు సూత్రమునందలి రెండవవాక్యముచే ''క'' మున్నగువానికి లోపమురాఁగా ''ఒ + ఁడు'' అనియుండఁగా డకారద్విత్వమురాఁగా ''ఒడ్డు'' అనియగును. పక్షమున ''ఒకఁడు'' అగును. నాల్గుశబ్దములలో దేనిని మూలముగా గ్రహించినను నిట్టిరూపమేయగును గాన కకారమొక్కదానికే లోపమును విధించి డకార ద్విత్వముచేయుట యుచితము. లాఘవముగూడ నగును.

(4) ఒకాదుల కమహాదర్థమున డువర్ణకము పరమగునపుఁడు వికల్పముగాఁ గకారాదులకు (క, క్క, కొ, క్కొ) లోపమువచ్చి బిందువగును. ఒక + ఁడు – కకారలోపము – ఒ + ఁడు పూర్ణబిందువు. ఒ + ండు = ఒండు అని యగును. ఇవిరానిపక్షమున "నొకఁడ"నియుండును.

ఇచ్చట నాదిపద మనావశ్యకమని చెప్పఁబడియెను. క్క, కొ, క్కొ, అను నవి లోపించినను "ఒండు" అనియేగదా సిద్ధించును ! ఇచ్చట బిందువిధానము నిరర్థకము. లోపమును విధించినచో బిందువెట్లును "జిత్తు బిందుపూర్వంబగు" నను సూత్రముచేతనే సిద్ధించును. నుడి తొలిహ్రస్వము కావున నర్ధబిందు వుండదని యెట్లయినను జెప్పవలయును. ఇంతియకాక యీ బిందువిధానము వలన మఱియొకయనర్థముగూడ నేర్పడుచున్నది "జిత్తు బిందుపూర్వంబగు" ననుసూత్రముచే నెట్లును డువర్ణకము, పరంబగునపుడే బిందుపూర్వముగానున్నది. ఇపుడుమఱల గకారమునకు బిందువు విధించుటచే రెండుబిందువులు వరుసగాఁ బ్రాప్తించును.

ఇచ్చట బిందువును విధింపలేదనియు సిద్ధించియున్న బిందువును అనువదించుట మాత్రమే జరిగెననియుఁ దలంపవలయునుగాబోలు.

సూత్రమునందలి "ద్విత్వయుక్త డువర్ణ" మనుటయు బాగుగాలేదు. "డువర్ణకమునందలి డకారమునకు ద్విత్వమువచ్చున"ని యుండుట మంచిది కానిచో "ఁడుఁడు" అనునది ద్విత్వయుక్త డువర్ణ మగును.

సూ॥ టివర్ణం బమహాదర్థంబున నొక్కఁడాదుల డువర్ణకంబునకు విభాష నగు. ౮–౨

ఉ. ఒక్కటి, ఒక్కొటి, ఒకటి, ఒకొటి.

ఒక్కఁడాదుల డువర్ణకంబునకు = ఒక్కఁడు, ఒక్కొఁడు, ఒకఁడు, ఒకొఁడు, మున్నగువాని యంతమునునుండు ప్రథమా డువర్ణకస్థానమున ననిభావము. ఒక్కఁడు మున్నగు నమహదర్థకశబ్దములందలి "డు" అనుదాని స్థానమున "టి" అను నాదేశము విభాషగా వచ్చుననిభావము. ఒక్క + డు– టిఆదేశము– ఒక్కటి. ఇట్లే మిగిలినయుదాహరణములును.

సూ॥ ఎక్కటి యొక్కటి. ౮–౩

స్పష్టము.

"ఒక్కటి" యను పూర్వసూత్రోక్తరూపము "ఎక్కటి" అనియు నగునని యర్థము.

ఇందుల కుదాహరణముగా శబ్దరత్నాకరమున "ఎక్కటియై" యొకఁ లొత్తెనఁగ. (లక్ష్మి.౨ ఆ.౩ ప.) అనునది యీయఁబడెననియు దానికిఁ బాఠాంతరముగా "నొక్కటియై యొకలొత్తెనఁగ"నని యుండుటచే భీము డా నెక్కటిదాఁకె దిక్కరిసహింపక సింహముదాఁకునట్లు. (భార. అర.౪ ఆ ౧౨) అనుపద్యము నుదాహరించుట మేలని సుబోధినియందుఁ జెప్పఁబడెను. అది యుచితమేయగును.

ఉద్దేశ్య విధేయభావము ననుసరించి "యొక్కటి యెక్కటి" అని సూత్ర మున నుండుట యుక్తము.

ఈ రూపాంతరవిధానము నిత్యమయినచో నొక్క యనురూపము లేక పోవలసివచ్చును. కనుక నిది వైకల్పికమని సూచించుటకై సముచ్చయమును గూర్చుటయు నావశ్యకము. (ఒక్కటి యెక్కటియు – నని సూత్రింపఁదగు)

సూ॥ ఒకశబ్దం బొక్కచో నల్పార్థకం బగు. ౮౪

ఒకమున్నూరు గదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షు చాపంబు. భాగ.౯ స్క-౦.౨౬౨. ఒక నూఱేఁడుల్. మార్క-౦.౫ ఆ.౮౦. ఏమొక కొందఱము. విక్ర.౫ ఆ.౨౦౧. మొ॥

ఒకశబ్దము కొన్నిసందర్భములలో కేవలము సంఖ్యనే చెప్పక "అల్పమ"ను నర్థమునిచ్చుటయుఁ గలదని తాత్పర్యము.

ఈశబ్ద మల్పార్థమును వ్యంగ్యముగాఁ జెప్పునేకాని వాచ్యముగాఁ జెప్పదు. సందర్భానుసారముగ ననేకార్థములు వ్యంగ్యములగుచుండును. సందర్భానుసారముగ నీ శబ్దమే యాధిక్యమునుగూడ బోధించును. ఈ "యొక మున్నూఱ"నుచోటనే అంతమంది కలసి తెచ్చిన ధనుస్సు నొక్కరాముఁడు తేలికగా నెత్తెనని చెప్పఁదలంచినచో మూఁడువందలమంది" యని సంఖ్యయు దాధిక్యముగూడ వ్యంగ్యమగుచుండును. అనఁగా మూఁడువందలమంది (అనే కులు) యెత్తితెచ్చిన ధనుస్సు నొక్కరాముఁడు తేలికగానెత్తెనని తాత్పర్యమగు నపుడు మూఁడువందలమందియనఁగా "ననేకుల"ని యాధిక్యము గమ్యమగును. కావున వక్త్రాదివైశిష్ట్యమునుబట్టి వచ్చెడి యీ యర్థమును సూత్రముచే

విధింపనక్కఱలేదు విధించుటకు శక్యమునుగాదు. ఈ యర్థములు వాచ్యములునుగావు. ఇవి వివక్షితాన్యపరవాచ్యము లనఁబడు వ్యంగ్యజాతిలోఁ జేరును. కనుకనే రెండు, మూఁడు, మున్నగు సంఖ్యావాచకములును నొకశబ్దమువలెనే యల్పార్థకములగుట వ్యంజనాబలముననే యగుచున్నది. "బైటిపల్లియలు దున్నినవాఁడట యొండురెండు భర్గుండిది నిండుపౌరుషమొకొ." వసు ౪ ఆ. ఇచట నొండు, రెండు, అను శబ్దము లల్పత్వమును వ్యంగ్యముగాఁ దెల్పుచున్నవి. కొన్నియెడల నిట్టి యర్థములను లక్షణావృత్తిచేత నయినను బోధించుచుండును

కావున నీసూత్ర మనావశ్యకమని తలంపవలయును.

సూ ఒకానొకచో ననిర్దిష్టార్థమం దొకశబ్దమునకుం బూర్వాగమం బగు. ౭౫

ఉ. ఒకానొకఁడు, ఒకానొకతె, ఒకానొకటి. ఒకచో ననుటచే ఒకఁడు, ఒకతె, ఒకటి. ఒక శబ్ద మొక్కాఁడులకు నుపలక్షణము.

వస్తువేదియో స్పష్టముగా నిర్దేశింపనిచో నయ్యది యనిర్దిష్టమగును. అట్టి యర్థమున "నొక" శబ్దము ప్రయోగింపఁబడుచుండును. అప్పుడు "ఒక" అను శబ్దమునకు "ఒకాన్" అనునది పూర్వమున నాగమముగాఁ జేరును.

ఒకాన్ + ఒకఁడు = ఒకానొకఁడు. ఒకాన్ + ఒకతె = ఒకానొకతె. మున్నగునవి యుదాహరణములు

ఒకచో ననుటచే నొక్కొకచో నీయాగమము రాకుండుటయుం గలుగును. అపుడు ఒకఁడు ఒకతె, ఒకటి;

"ఒక శబ్దమున"కను చోట "నొక్క" మున్నగువానినిఁగూడ గ్రహింపవలయుననియు నందుచే నొకానొక్కండు, ఒకానొక్కతె మున్నగురీతి నగుననియుఁ దెలియవలయును.

సూ. సర్వనామంబులకు మహదర్థంబునఁ దఱచుగ ఉ ల లకు రు ర లగు. ౭౬

ఉ. ఎల్లరు, ఎల్లరన్, వారు, వీరు, వేరు, మొ. తఱచుగ ననుటచే తాము, మేము, తమ్ములన్, మమ్ములన్, మిమ్ము నిత్యాదిరూపంబు లగునని యెఱుంగునది.

అన్ని ప్రభృతి సర్వనామశబ్దముల బహువచన ''లు'' వర్ణమునకు ''రు'' అనియు వాని ద్వితీయాదులందు వచ్చెడి లకారాగమమునకు 'ర' అనియు నాదేశము లగును.

ఎల్ల + లు — రు ఆదేశము — ఎల్లరు. ఎల్ల + లన్ — రాదేశము — ఎల్లరన్. మొ ఇవి యన్నిశబ్దములకును రావు సర్వనామములలోఁ జాల శబ్దములకు వచ్చుటయుఁ గొద్దిశబ్దములకుమాత్రమే రాకుండుటయుఁ గలదు. కావునఁ ''దఱచుగా'' నని సూత్రమునఁ జెప్పెను.

ఇచట ''లు'' అనునంతకును ''రు'' అనుదానిని ''ల'' ,అంతకును ''ర'' అనుదానిని విధించుట యనావశ్యకము. బహువచన లకారము రేఫంబగు ననుట యుచితము.

ఒకరువులు, వారలు, మున్నగుచోట్ల మాత్రమే లత్వము రాదుగాని మిగిలిన సర్వనామముల కన్నిటికిని లకారము వచ్చును. కావునఁ ''దఱచుగా'' ననియెను.

ఎల్ల శబ్దమును బాలవ్యాకర్త సర్వనామములలోఁ జేర్పలేదు. దాని నతఁ డవ్యయమని తలంచెను. ఇచ్చట ''నెల్లర'' నియుదాహరించుటచే దీని నీతఁడు సర్వనామమని భావించియుండును. ఎల్ల + వారు = ఎల్లవారు అని పదద్వయముగాఁ దలంచినట్లయిన నిందు ''వార''ను దానితోఁ బాటు మఱల నీ పదము నుదాహరింపనక్కఱలేదు. అందువలన ''నెల్ల'' యను శబ్దమునకే బహువచన ''లు'' వర్ణకము'' ''రు''గా మాఱె నని యీతఁడు తలంచిన ట్లూహింపవలయును. కాని యిటు బహువచనాంతముల నుదాహరించిన యీతఁడు సంధి.౨. సూత్రమునఁ [illegible] కనఁబడుచున్న దనుటలో నాశయమేమియో తెలియరాదు. ఎల్లరు మున్నగునవి తచ్ఛబ్దాంతములే యని తలఁచి, సమస్త వ్యస్త తచ్ఛబ్ద రూపద్వయమునకు నియ్యవి యుదాహరణములని తలంచుట బాగుగానుండును.

**సూ. ఏఁ దే రే దే వి శబ్దంబు లర్థవిశేషంబునం దీకారాంతంబు లగు. ౭౩**

ఉ. ఏఁడీ నా బలుమానికంబుల కోటారు. అచ్చ. రా.అయో. కాం. ౮౮. వా రేరీ సిరి మూటకట్టుకొని పోవంజాలిరే. భాగ.౭స్కం. ౫౦౧ప. ఎది యేదీ యిది చాలఁ గ్రొత్త. కళా. ౧. ఆ. ౯౨. మొ.

ప్రశ్నార్థంబులు నగు. ఉ. వాఁడేడి? వా రేరి? మొ. (అర్థవిశేషము. ఎక్కడ, ఎక్కడ నున్నాఁడు. ఇత్యాది.)

ఏఁడు, ఏరు, ఏది, ఏవి, అను నే శబ్దరూపములకుఁ గొన్ని యర్థవిశేషము లందు "ఈ"కార మంతమునఁ జేరును అప్పుడు ఏఁడీ, ఏరీ, ఏదీ, ఏవీ, అని యగును. "ఈ" కారముతోఁ బూర్వాచ్చులకు నిత్యసంధి వచ్చునని తలంప వలయును.

ఏఁడు, ఏరు, ఏది, ఏవి, అను మాటలకు "ఎవఁ డి"త్యాదిరీతిగాఁ బ్రశ్న మర్థమగుచుండగా నట్టి యర్థముకాక యెచ్చటనున్నాఁడు ? మున్నగు తీరున నర్థము కల్గును. బలుమానికములకొటారు ఎవఁడు ? అనురీతి నెవరో తెలియఁ గోరి వేసిన ప్రశ్నము కాదు. ఆ వ్యక్తి యెవరో తెలియును. కాని యెక్కడ నున్నాఁడు? మున్నగుతీరుగల యర్థముననే యీ పదములు వాడబడుచున్నవని తెలియవలయును.

ఇట్లే "వా రేరీ సిరి... .." అనుచోట "వారేరు" అనగా వా రెవ్వ రని యర్థముకాదు. వారిప్పు డెక్కడను లేరుగదా ! అను నర్థము వచ్చును. ఇట్లే "ఎది యేదీ, యిది చాలక్రొత్త . ..."అనుచోట "మరియొకసారియిమ్ము" అని యర్థము. ఇట్లే విశేషార్థముల నిచ్చును.

బాలవ్యాకరణమున "అ, ఆ, ఇ, ఈ" మున్నగునవి తిజంతములపయినను ప్రయోగించుట విధింపఁబడెను. కాని సుబంతములపై నదాదులందు విధింపఁ బడలేదు అందుచే నిచ్చట నీ విషయము చెప్పఁబడెను. కాని ప్రశ్నాద్యర్థవిశే షములతో నదాదులను ప్రయోగింపఁబడుట యీ భాషయందు సహజము. అనుప్రయుక్తములగుచున్న యదాదుల కనేకార్థములు శబ్దశక్తివలననే సిద్ధిం చును. అవి సందర్భానుగుణముగ వాక్యములందుఁ జేరుచుండును. వీనికి విధాన మనావశ్యకము.

ఈ "ఈ" కారము హ్రస్వముగను నుండవచ్చునని చెప్పి "యేడి, యేరి" యని యుదాహరించెను.

సూ. ఔంతామిలకు వారు పరంబగుచో వాక్షు లోపంబును రు ర లకు ఋ ఌ లాదేశంబు నగు. ౧౧౧

ఉ. అందఋ, అందఌన్, మొ.

అంతాదులకు = అంత, ఇంత, ఎంత, కొంత, అను శబ్దములకు, వారు
పరంబగుచో = తచ్ఛబ్ద మనుప్రయుక్త మగుచుండును. వా కు = ఆ తచ్ఛబ్దంబు
నందలి "వా" అను భాగమునకు.

అంత + వారు – మున్నగు శబ్దముల సమ్మేళనమువలన "నందఱు"
మున్నగు శబ్దము లేర్పడునని ప్రౌఢవ్యాకర్త లుపదేశించెను. అంత + వారు అని
యుండగా "వా" అను భాగమునకు లోపమువచ్చి దాని బహువచనప్రత్యయ
మగు "రు" అనుదానికి "ఱు" అని యాదేశమురాఁగా అంత + ఱు అనికాఁగా
౮౯ సూ. చే అంత లోని తకారము దకారమయి "అందఱు" అగును. అంత
శబ్దమునకుఁ బరమగు "వా" శబ్దమునకు ద్వితీయాబహువచన ప్రత్యయము
లడాగమసహితముగాఁ బరమందుండగా వకారము పూర్వాగమమయియుండ
అంత + వాలన్ అని యయి ౮౬ సూ. చే "ర" అను నాదేశము రాఁగా
అంత + వారన్ అని యయి యీ సూత్రముచే వాలోప ఱాదేశములు వచ్చి
అంత + ఱన్ అని కాఁగా ౮౯ సూ. చే "దకారము" వచ్చి "అందఱన్" అని
యగును. ఈ సూత్రముచే ముందుగా ఱాదేశము వచ్చుటచే "ర" అను వర్ణము
లేనందున ౯౦ సూ. చే నిత్వము రాదు.

ఇట్లే ఇందఱు, ఎందఱు, కొందఱు అనియు నగును.

**సూ. వా లోపంబు తఱి వా ని తకారంబునకు దకారంబగు.** ౮౯

ఉ. అందఱు, ఇందఱు, ఎందఱు, కొందఱు.

౮౮ సూ. చే వా లోపము వచ్చునప్పుడు వాని తకారమునకనఁగా నంతా
దుల తకారమునకు దకారం బాదేశంబగు. అంత + ఱు – అని యుండ, తకా
రము దకారము కాఁగా "అందఱు" అని యగును. ఇట్లే మిగిలినవి యూహ్య
ములు.

**సూ. ద్వితీయాదులందసంయుక్త ర వర్ణకంబు నత్వంబున కిత్వంబు
తఱచుగ నగు.** ౯౦

ఉ. వారిన్, వీరిన్, వేరిన్, ఒకరిన్, వాండ్రన్, వీండ్రన్,
వేండ్రన్, ఒకండ్రన్, మొ. తఱచుగ ననుటచే నిరువుర నిత్యాదులయం
దిత్వంబు కలుగదు.

సర్వనామముల ద్వితీయాదివిభక్తి ప్రత్యయములయందున్న యసంయుక్త
(ఇతర హల్లులతో సంయోగముచెందని) ర వర్ణమునందలి "అకారమునకు"
ఇకార మాదేశముగాఁ దఱచుగా వచ్చుచుండును.

"ఆ" శబ్దమునకు ద్వితీయాబహువచనప్రత్యయము లఙాగమ సహిత మయి పరమున నుండగా ఆ + లన్ అని యయి ౨౩సూ.చే వకారము రాఁగా వా + లన్ అని యయి, ౭౬ సూ.చే ర వర్ణము వచ్చి "వారన్" అని కాఁగా నీ సూత్రముచే రవర్ణకమునందలి "అకార, మికారము" కాఁగా "వారిన్"అని యగును. ఇట్లే "వీరిన్, వేరిన్, ఒకరిన్" అనియు నగును.

"వాంఁద్రన్" మున్నగుచోట్ల రేఫము దకారముతో సంయుక్తమయినం దున నిత్వము రాలేదు ఇట్లే వీంఁద్రన్, వేంఁద్రన్, ఒకంఁద్రన్ అను చోట్లను దెలియనగును. ఈ ఇత్వ మన్నిచోట్లను రాదు. తఱచుగ ననుటచేఁ జాలచోట్ల వచ్చుచుఁ గొన్నిచోట్లమాత్రము రాదని తాత్పర్యము అందుచే నిరువురన్ అను చోట నిత్వము రాలేదు.

సూ. రు ర వర్ణకంబులు పరంబులగునపుడు సాధారణంబుగ సంఖ్యా వాచకంబులకు గు వర్ణకంబు పూర్వాగమం బగు. ౭౭

ఉ. ఇ........, మూగురు, నలుగురు, అయిదుగురు, ఏగురు, ఆఱుగురు, ఏడుగురు, వేగురు, పదుగురు, మొ. సాధారణంబుగ ననుటచే ఎనమంఁద్రు, తొమ్మంఁద్రు, ఇరువంఁద్రు, ముప్పంఁద్రు, ఇత్యాదు లందు రాదని యెఱుంగునది.

సంఖ్యావాచకశబ్దములకు రు, ర, వర్ణకములు పరము లగునపు డా "రు, ర" వర్ణకములకు "గు" అనునది పూర్వమున నాగమముగాఁ జేరును. ఇదియు "సాధారణముగా నగు" ననుటచే నొక్కొకచో రాదని తెలియవలయును.

ఇరు + లు – ౭౬ సూ. "రు" వచ్చి ఇరు + రు అని కాఁగా నీ సూత్ర ముచే "గు" రాఁగా ఇరు + గురు = ఇరుగురు అని యగును. ఇట్లే "మూగురు" మున్నగునవియు సిద్ధించును. సాధారణముగా ననుటచే "ఎనమంఁద్రు"మున్నగు చోట్ల నీ యాగమము రాలేదనియుఁ దెలియనగును.

ఈ సూత్రపు రచన ప్రమాదముగానున్నది. గు వర్ణకము పూర్వాగమ ముగా దేనికి వచ్చునను శంకను షష్ఠ్యంతమగు "సంఖ్యావాచకంబులక"ను పదము సమీపమున నుండుటచేతను వేఱొక షష్ఠ్యంతపద మీ సూత్రమున లేనందునను సంఖ్యావాచకంబునకుఁ బూర్వాగమం బగునను నర్థము వచ్చును. అట్లయినచో ననిష్టరూపములు సిద్ధింపవలసి వచ్చును. ఇట్టి రచన సాధారణ

ముగా నుండదు. "సంఖ్యావాచకంబులకుఁ బరంబులగు రు ర వర్ణకములకు గు వర్ణకంబు సాధారణముగాఁ బూర్వాగమంబగు" నని సూత్ర ముండవలయును.

వర్ణ మనఁగా నిచ్చట "నచ్చుతోఁగూడిన హల్లు" అనియే యభిప్రాయము. కనుకనే "గు" వర్ణమని నిర్దేశించెను. ఇట్టి యచ్చుతోఁ గూడిన హల్లునకు "అక్షర" మనియు వ్యవహారము గలదు. వర్ణమనగా నచ్చుగాని హల్లుగాని యొక్కటియే చెప్పఁబడుట యుచితము. కాని యిచ్చట వర్ణద్వయమును (గ్, ఉ, అను రెండిఁటిని) గు వర్ణ మనుటచే నిట్లు సరిచేసికొనవలయును. బాలవ్యాకర్తయు "ఇ, టి, తి, వర్ణములు" మన్నగురీతిని వాడుటచె నిది యుచితమే యని తలంపవలయును.

**సూ. సంఖ్యావాచకంబులకు విభక్తి పరంబగునపుడు కొన్నింటి యంత్యాక్షరంబులకు లోపం బగు.** ౯౨

ఉ. మూగురు, నలుగురు, ఎనమండ్రు, తొమ్మండ్రు, ఇరువండ్రు, ముప్పండ్రు మొ అక్షరంబుల కనుటచే "నెనుబండ్రు"లో నగువానియందుపాంత్యవర్ణంబునకును లోపంబు. కొన్నింటి యనుటచే అయిదుగురు, ఆఱుగురు ఇత్యాదులందు లోపము లేదు.

కొన్ని సంఖ్యావాచకములకు విభక్తి పరముగానున్నప్పుడా సంఖ్యావాచక శబ్దముల యంత్యాక్షరములకు లోపము వచ్చును.

ఉదా. మూఁడు + గురు — డు లోపము మూగురు. నాలుగు + గురు = నాలు + గురు ౯౯సూ. చే హ్రస్వమురాగా నలుగురు; ఎనిమిది + రు. అంత్యవర్ణలోపము. ఎనిమి + రు. ౯౩ చే 'ండ్' రాగా ఎనిమి + ండ్రు ౯౪ చే ఎనిమ + ండ్రు. ౧౦౧చే అత్వము. ఎనమండ్రు తొమ్మిది + రు. ది లోపము. తొమ్మి + రు. ౯౩చే 'ండ్' వచ్చిన తొమ్మి + ండ్రు. ౯౪చే అత్వము. తొమ్మండ్రు. ఇరువది + ండ్రు. ది లోపము. ఇరువండ్రు. ముప్పది + ండ్రు ది లోపము. ముప్పండ్రు ఇట్లే గ్రహించునది.

సూత్రమున "అంత్యాక్షరంబులకు" అని బహువచన ముండుటవలనఁ గొన్నిచోట్ల నంత్యాక్షరమున కొక్కదానికేకాక యంత్యాక్షరమునకు పూర్వముననున్న వర్ణమునకును లోపము వచ్చునని తలంపవలయును. "ఎనుబండ్రు" అనుచోటనుపాంత్యవర్ణ మెద్దిలోపించెనో విచార్యము. ఎనిమిది + పది + రు అని యుండగా పూర్వపదమునందలి "మి, ది" అను రెండువర్ణములును లోపించి

"ఎనుబండ్రు" అగును (చూ. సమా. ౨౪ సూ. వ్యాఖ్య) ఇట్టివే యిందుకుదాహరణములు అంతియకాని ఎనుబది + ండ్రు అనుచోట విభక్తియగు రు వర్ణకంబునకు దూరముగా నున్నను "ది" లోపించుట దీని కుదాహరణ మనుకొనరాదు. రు వర్ణకమునకు నాగమమయిన "ండ్" అనునదియు దానివంటిదే యగును. యదాగమపరిభాషచే నియ్యదియు, విభక్తియే యగును విభక్తి పరము కానిచో అంత్యవర్ణమునకైనను లోపమురాదు అంత్యవర్ణమనగా ప్రకృతియందలి వర్ణములలో నంత్యవర్ణమని యర్థము గాని ప్రత్యయముతో గూడిన మొత్తములోని యంత్యవర్ణమని యర్థము కాజాలదు కావున నేను సూచించినరీతినే, యుదాహరణ మగునుగాని మఱియొకతీరునఁ గాదు

ఈ యంత్యాక్షరలోపము కొన్నిటికేగాని యన్నింటికినిరాదు. అందుచే "నయిదుగురు" "ఆఱుగురు" ఇత్యాదులం దీ లోపము రాలేదు. ఇచట విభక్తి యనగా మహదర్థక విభక్తి పరమగునపుడే యీ లోపము కానవచ్చుచున్నదని గుర్తింపనగును.

**సూ. రు ర వర్ణకంబులు పరంబులగునపుడు కొన్నింటికి నిత్యముగాను, గొన్నిటికి వైకల్పికముగాను, బిందుపూర్వక డకారంబు పూర్వాగమంబగు.** ౬౩

ఉ. ఎనమండ్రు, ఎనమండ్రన్; తొమ్మండ్రు, తొమ్మండ్రన్; ఇరువండ్రు, ఇరువండ్రన్; ముప్పండ్రు, ముప్పండ్రన్; నలువండ్రు, నలువండ్రన్; ఏఁబండ్రు, ఏఁబండ్రన్; అఱువండ్రు, అఱువండ్రన్; డెబ్బండ్రు, డెబ్బండ్రన్; ఎనుబండ్రు, ఎనుబండ్రన్; తొంబండ్రు, తొంబండ్రన్; మొ. పెక్కండ్రు, పెక్కండ్రన్; పెక్కురు, పెక్కురన్; పదుండ్రు, పదుండ్రన్; పదురు, పదురన్; పదుగుండ్రు, పదుగుండ్రన్; పదుగురు, పదుగురన్, వాండ్రు, వాండ్రన్, వారు, వారిన్ మొ.

"సర్వనామములకు" అనునది యీ సూత్రమునకును సంబంధించును. సర్వనామప్రకరణ మగుటచే నట్టి యర్థము లభించును.

సర్వనామములకు మహదర్థమున వచ్చెడి రు, ర, అను విభక్తిప్రత్యయములు పరముగా నున్నప్పుఁడు కొన్నిచోట్ల నిత్యముగాను, కొన్నిచోట్ల వికల్పముగాను బిందుపూర్వక డకారంబు అనగా 'ండ్' అనునది రు ర ల కుఁ బూర్వమున నాగమముగా వచ్చును.

ఎనిమిది మున్నగు శబ్దములలో నిత్యముగాను "పెక్కు, పది" మున్నగు చోట్ల వికల్పముగాను నీయాగమము వచ్చుచున్న ట్లుదాహరణములవలనఁ దెలియుచున్నది.

ఈ సూత్రముగూడ నిర్మాణమున లోపభూయిష్ఠముగా నున్నది. సర్వనామములగు "కొన్నింటికి" అను పదముతో "బిందుపూర్వక డకారంబు" అను పద మన్వయించునట్లున్నది. అట్లన్వయించెనేని యీ యాగమము ప్రకృతికిఁ బూర్వమున రావలసియుండును. అది యత్యంతవిరుద్ధము. అందుచే "రు ర వర్ణకంబులకు" అని షష్ఠ్యంతముగా సూత్రమునఁ బదముండుట యుక్తము

"సర్వనామంబులకుఁ బరంబులగు రు ర వర్ణకంబులకుఁ గొన్నింటికి నిత్యముగాను, గొన్నింటికి వికల్పముగాను బిందుపూర్వక డకారంబు పూర్వాగమంబగు" అను రీతిని సూత్రముండిన బాగు.

సూత్రనిర్మాణమున బాలవ్యాకర్త యిట్టి ప్రమాదమును బొందఁడు. అతని సూత్రనిర్మాణము సంస్కృతవ్యాకరణసూత్రములవలెనియమబద్ధముగానుండును.

**సూ. బిందుపూర్వక డకారంబు పరంబగుచోఁ ఉదియిత్తోత్త్వముల కత్వంబగు.** ౯౪

**ఉ. ఉక్తము.**

"సర్వనామములకు" అనునది యీ సూత్రమునను సంబంధించును. ౯౩ సూ.చే వచ్చెడి బిందుపూర్వక డకారంబు పరంబగునేని సర్వనామముల యంతమున నున్న" ఇ, ఉ, లకు "అకారము" ఆదేశమగును.

వెనుకటి సూత్రమున కిచ్చిన యుదాహరణములలో "ఎనిమిది" మున్నగు నుదాహరణములలో "ఇకారమున" కత్వంబు వచ్చెను. ఎనిమిది + ంఢ్రు. ౯౨ సూ. ది లోపము. ఎనిమి + ంఢ్రు ఈ సూత్రముచే "అత్వము" ఎనిమ + ంఢ్రు ౧౦౧సూ. అత్వము, ఎనమండ్రు. మిగిలిన వూహ్యంబులు. పెక్కు + ంఢ్రు. ఈ సూత్రముచే "పెక్కు" అనుచోటి "ఉ"కారమున కకారము వచ్చి "పెక్కండ్రు" అగును. పది + ంఢ్రు. అని యుండగా ౯౨చే నంత్యాక్షర లోపము రాదు. ఈ సూత్రముచే నికారమునకు "అత్వము" ప్రాప్తించుచుండగా విశేష విహితమగుటచే ౧౦౨ సూత్రముచే "ఉత్వము" వచ్చి "పదుండ్రు" అగును. పదుగుండ్రు అనుచోట గువర్ణముకూడ వచ్చును. వాండ్రు అనుచోట ఇకారోకారములు లేవు.

సూ. కొండొకయెడ ఱు ఱ వర్ణకములు పరంబగునపుడును నత్వం బగు. ౯౫

ఉ. చూపఱు. చూపఱున్. మొ.

కొన్నిచోట్ల ''ండ్'' పరంబగునపుడేకాక ఱు ఱ వర్ణకములు పరంబగు నపుడును దుది యిత్వోత్వములకు ''అత్వము'' వచ్చునని యర్థము. సందర్భమును బట్టి యిత్వోత్వములకు రెంటికిని ''అత్వము'' వచ్చునని యర్థము వచ్చినను ''ఉ''కారమునకు మాత్రమే ''అ''కారము వచ్చుట కాననగును.

''చూపు''అను కృదంత శబ్దమునకు తచ్ఛబ్ద మనుప్రయుక్తమై 'చూచెడివారు' అను నర్థమునిచ్చును. అప్పుడు ''చూపఱు'' మున్నగురీతిని రూపములగును.

చూపు + వారు (''చూచుట కలవారు'' అని యర్థము) ౭౭ సూ॥చే చూపు + ఱు అయి యీ సూత్రముచే ''అ''త్వము రాగా ''చూపఱు'' అని యయ్యెను.

సూ పలు శబ్దంబునకు రు ర లు పరంబగునపుడు గువర్ణంబును, వలయుచో మీఁద బిందుపూర్వక డకారంబును విభాషనగు. ౯౬

ఉ పలుగురు ; పలుగురన్ ; పలుగుండ్రు ; పలుగుండ్రన్ మొ॥

''పలు'' అను సర్వనామ శబ్దమునకు బహువచన రు ర లు పరంబగునపుడు ''గు''వర్ణము చేరును. కొన్నిచోట్ల నా గువర్ణమునకు మీద బిందుపూర్వక డకారంబును జేరును.

పలు + రు. గువర్ణము మాత్రమే వచ్చినచో పలు + గు + రు = పలుగురు అగును. బిందుపూర్వక డకారంబు గూడ వచ్చినచో పలు + గు + ండ్ + రు = పలుగుండ్రు అని యగును.

ఈ సూత్రమునందలి వాక్యమునుబట్టి యీ యాగమములు ప్రకృతికే యంతమునఁజేరుచున్న ట్లర్థమగుచున్నది. ప్రకృతికంతాగమములయినను బ్రత్యయమునకుఁ బూర్వాగమములయినను నిచట రూపభేదములేదు. కాని వెనుక ౯౧, ౯౩ సూ॥లచే నీ యాగమములు ప్రత్యయమునకే పూర్వాగమములని స్పష్టపడియుండుటచేతను బ్రత్యయమునకే వచ్చునని యనుకొన్నను దోషమేమియు లేనందునను ౧౦౨ సూ॥చే వచ్చెడి యుత్వమునకట్టిమార్గమే యను

కూలమగుటచేతను నిచ్చటఁగూడ బ్రత్యయమునకే యీ యాగమములు పూర్వమునఁ జేరునని తలంచుట మంచిది

అప్పుడు సూత్రమున ''పలు'' శబ్దమునకు రు లు పరంబులగునపుడు వానికి గువర్ణంబును వలయుచో మీఁద బిందుపూర్వక డకారంబును విభాష నగు. అనురీతి నర్థము గ్రహింపవలయును మీఁద ననగా గువర్ణంబునకుఁ దరువాతనని యర్థము. కాని ''పదుగురు, పదుగుండ్రు'' అని రెండు రూపములును సిద్ధించినట్లే పలుగురు, పలుగుండ్రు అను రూపములును సిద్ధించు చుండగా మరల నీ యాగమద్వయ విధాన మావశ్యకముగాదు. పలు శబ్దము బహ్వర్థకమగుటచే నిర్దిష్ట సంఖ్యావిశేషబోధకము కానందున సంఖ్యావాచకములలోఁ జేరదనియు నందుచే ౯౧ సూ॥ గువర్ణంబు రాకయుండ నీ పునర్విధానము చేయవలసెనని చెప్పుట కవకాశము గలదు. బాలవ్యాకర్తయు సంఖ్యావాచకములలో దీనిఁ జేర్పలేదు. (చూ. బాల అచ్ఛి ౨౪) బాల. అచ్ఛి. ౧౫ సూ॥చే నిచ్చట డకారంబు పూర్ణబిందుపూర్వకమే యగును. కనుకనే సూత్రమున ''పూర్ణ''విశేషణమును జేర్పలేదు.

**సూ. ఇరు రెండున కాదేశం బగు** ౯౭

**ఉ. ఉక్తము.**

రెండు శబ్దమునకు రు రలు పరంబగునపుఁడు ''ఇరు'' అను నాదేశమగును. రెండు + రు. ౯౧ సూ॥చే గువర్ణకము. రెండు + గురు ఈ సూ॥చే ''ఇరు'' ఆదేశము. ఇరుగురు. అనంతర సూత్రముచే ''ఇద్దఱు''అనియు నగును. ఆపదాద్యంబ యూత్వాది బాలవ్యాకరణ సూత్రముచే వకారమువచ్చెనేని "ఇరువురు" నగు. [ఉక్తము . ఆదేశము వచ్చిన రూపమువెనుక ౯౧ సూ॥న నుదాహృత మయ్యెనని భావము.]

**సూ. ఒకానొకచో నెరుగురున కిద్ద ఱాదేశం బగు.** ౯౮

''ఇరుగురు'' అను మొత్తమునకు ''ఇద్దఱు'' అను నాదేశము వచ్చునని భావము. అనగాఁ బ్రకృతికి ''ఇద్ద'' అనియు ''రు''వర్ణకమునకు ''ఱు''అనియు నాదేశములు నిపతింపఁబడెను. ఇట ద్వితీయాదులందలి 'ర' వర్ణకమునకును 'ఱ' అను వర్ణ మాదేశమగుననియు దానికియ్యది యుపలక్షణమనియుఁ దెలియవలయును.

సూ. విభక్తి పరంబగుచో మూఁడు నాలుగుల దీర్ఘంబునకు హ్రస్వంబు బహుళంబుగా నగు. ౯౯

ఉ. ముగురు (శేష ముక్తము].

విభక్తి (రు, ర, లు) పరంబగుచో మూఁడు, నాలుగు అను శబ్దములలో మొదటి హల్లుపైనున్న దీర్ఘము బహుళముగా హ్రస్వమగును.

మూఁడు + రు. గువర్ణము, మూఁడు + గురు. అంత్యవర్ణలోపము, మూ + గురు. ఈ సూత్రముచే "మూ" హ్రస్వముకాగా "ముగురు" అయ్యెను. బహుళమగుటచే హ్రస్వము రానియపుడు "మూగురు" అగును.

శేషము అనగా "నాలుగు" శబ్దరూపము మున్నగునవి వెనుక (౯౧ సూ॥) చెప్పబడెనని యర్థము నాలుగు + రు. ౯౧ సూ॥చే గువర్ణము. నాలుగు + గురు ౯౩ సూ॥చే అంత్యాక్షరలోపము. నాలు + గురు ఈ సూత్రముచే హ్రస్వము నలుగురు

ఈ సూత్రమునందు 'విభక్తి' అనుటకు 'రు ర' లు అనియే యర్థము చెప్పవలయును కానిచో మూఁడు మూటికి, నాలుగు నాలుగింటికి మున్నగుచోట్లను హ్రస్వము రావలసియుండును మహదర్థకముల ప్రకరణమగుటచేత నట్టి యర్థమువచ్చెను కాని సూత్రమున విభక్తియనుటకుబదులు "రు ర" లు అనుట మంచిది. ౯౩ వ. సూత్రమునను నిట్లే "రు రలు" అనక విభక్తియని నిర్దేశించినను నావిధానము కొన్నిటికే యగుటచే నతివ్యాప్తిదోషము లేకపోయెను. ఇచట నట్లుగాక సర్వత్ర వచ్చునవియగుటచే గుదురదు. లేదా సూత్రమునగల బహుళపదబలముచే నమహద్రూపములలో నీ హ్రస్వమురాదని చెప్పవలయును.

సూ. ప్రాప్తహ్రస్వంబులగు మూఁడేలమీఁది వర్ణంబులకు ద్విత్వంబు బహుళంబుగ నగు ౧౦౦

ఉ. ఉక్తము.

మూఁడు శబ్దములోని "మూ' అనునదియు, ఏడుశబ్దము వర్ణవ్యత్యయమును బొంది 'డే' అను రూపమును బొందినదియు, హ్రస్వములయినపుడు వానిమీఁదనున్న వర్ణములకు ద్విత్వము బహుళముగానగును.

మూఁడు + గురు = ౯౩ సూ.చే అంత్యవర్ణలోపము. మూ + గురు. ౯౯ సూ.చే హ్రస్వము. ము + గురు. ఈ సూత్రముచే మీఁది గకారమునకు ద్విత్వము ముగ్గురు. బహుళమగుటచే "ముగురు". ఏడు + పది (౨౫౧ సూత్ర

మున డెబ్బది అని వర్ణ వ్యత్యయమునకు ఉదాహరణముగా నిచ్చెను.) సమాసము ౨౮ సూ చే వర్ణవ్యత్యయ సరళాదేశములు. డే + బది. సమాసము ౨౫ సూ.చే హ్రస్వము. డె + బది. ఇట్లుండగా నీసూత్రముచే ద్విత్వము. డెబ్బది. బహుళ మనుటచే డెబ్బదిలో నిత్యము, ముగ్గురు అనుచోఁ వైకల్పికము అని తెలియ వలెను.

ఈ సందర్భమున "మూఁడు, ఏ," అను శబ్దముల కీ కార్యము విధింప బడుచున్నట్లు కొందరు వ్యాఖ్యానముచేయుట ప్రామాదికమని తెలిసికొనవలెను. "ముగ్గురు" అనునది ౯౯ సూత్రమునను "డెబ్బది" అనునది ౫౧ సూత్రము నను నుదాహరింపఁబడుటచే "నుక్తము" అని వ్రాయఁబడెను

**సూ. ఎనిమిది నివర్ణకంబున కత్వం బగు.** ౧౦౧

ఉ. ఉక్తము.

"ఎనిమిది"అను శబ్దమునకు రు ర లు పరంబగునపుఁడు ఎనిమిది శబ్దము లోని నివర్ణమునందలి "ఇ" కారమునకు "అత్వము" వచ్చును.

అత్వమునకు నిమిత్తమును సూత్రమునఁ జెప్పలేదు. కాని సందర్భమును బట్టి "రు ర లు పరమగునపుఁ" డనిగ్రహింపవలెను. నిమిత్తమును దేనిని సూత్ర మునఁ జెప్పనందున నిర్నిమిత్తముగనే "అత్వము" వచ్చునన్నచో సర్వత్ర "అత్వము" నిత్యముగావచ్చి "ఎనిమది" అను నమహద్రూపముగూడ లేకపో వలసి వచ్చును. కావున రు ర లు పరంబగునపుఁడని నిమిత్తము నూహింప వలయును. నివర్ణంబున కత్వము విధించుటయు సరికాదు. నివర్ణములోని యికారమునకుమాత్రమే "అకారాదేశము" వచ్చును. 'ని' అను నంతకును నత్వమువచ్చునని తలంచినచో ననిష్టరూపము రావలసివచ్చును. కాన సూత్ర మున "నివర్ణంబునకు" అనుటకుబదులు "నివర్ణంబు నికారమునకు" అని యుండవలయును.

ఉదాహరణము వెనుక (౯౨ సూ.) జెప్పఁబడెనని యర్థము.

**సూ. పది యిత్వంబున కుత్వం బగు.** ౧౦౨

ఉ. ఉక్తము.

పది శబ్దములోని యికారమునకు "ఉకారము"ఆదేశమగును. ఇదియును "రు ర లు" పరంబగునపుడేయని తెలియవలెను

ఉదాహరణము "పదుగురు" మున్నగునవి ౯౮ సూత్రమునఁ జూపబడె నని వివరణమున "ఉక్తము"నుటచే సూచితము.

పది + రు. ౯౩ చే "ంణ్" ఆగమము. - పది + ంఁడ్రు. ఈ సూత్రముచే (౧౦౨) ఉత్వము. పదుంఁడ్రు. ఇట్లే మిగిలినరూపము లూహ్యములు.

సూ. కొన్నియెడల నవకగు కానంబడియెడి. ౧౦౩

ఉ. 'క. వినవేడగు పర్వము మే, లనఁగా ద్రోణాభిషేక మాదిగా గల యయ్యెనిమిది పర్వములను న, త్యనుపమమై ద్రోణపర్వ మమరున్ సభలన్.' భార. ఆది ౧ ఆ.౪౭. 'క. అనుపమ బలులగు కర్ణార్జున వీరుల శౌర్యమహిమ శోభిల్లంగా, నెనిమిదియగు పర్వం బిది, యనఁ బరఁగుం గర్ణపర్వ మతిహృద్యంబై.' భార. ఆది.౧ ఆ.౪౯. 'చ. పది యగు వేయి నిండుటయుఁ బంక్తిముఖుండు మనంబునన్ ముదం,బొద వఁగ నిర్వికారమున నున్న శిరంబును గోయజూచినన్.' నిర్వ.3 ఆ.౬౭. (ఇట్టియెడల "అవ" యనియే యుండవచ్చును. అయినను గ్రంథముల యందుఁ బాఠ మిట్లగపడుచున్నది

"సంఖ్యకుం బూరణార్థంబునం దవగాగమం బగు" నను బా॥వ్యా॥ సూత్ర ముచే వచ్చిన 'అవ' అనుదానికి "అగు" అని ఆదేశమగును. ఏడు + అవ + పర్వము = ఏడవపర్వము. ఇటు "ఏడగుపర్వము" అనియుఁ గొన్నిచోట్ల నుండు నని యీ సూత్రముచేఁ జెప్పబడుచున్నది.

"ఏడగుపర్వము, ఎనిమిదియగుపర్వము. పదియగు వేయి" అనునవి పద్య ములం దుదాహరణభాగములు ఈ పద్యములం దుదాహరణాంశములు యతిప్రా సాది స్థలములు కానందున "అవ, అగు" అను వానిలో నెట్టిరూపముతోనున్నను నుండవచ్చును. అయినను "అగు" అను ఆకారముతో ననేక గ్రంథములందుఁ బాఠము కానవచ్చుటచే నిట్లు వ్రాయంబడెనని వివరణమునఁ దెలుపఁబడెను.

పరిశీలింప నీ సూత్ర మనావశ్యకము. "అగు" అనునది తద్ధర్మార్థక క్రియాజన్య విశేషణమనియు నద్దానికి "పర్వము" అను నుత్తరపదము విశేష్య మనియుఁ దలంచుట యుచితము. "ఏడుసంఖ్యగలది యగునట్టి పర్వము" అను నర్థ మిచ్చుట వివక్షితము. అట్టియుద్దేశ్యముతోడనే బాలవ్యాకర్త యీ విషయ మును విధింపలేదు.

సూ. మహద్విశేషణ సంఖ్యావాచకంబులకుం గొన్నియెడల నమహ త్కార్యంబు చూపట్టెడి. ౧౦౪

ఉ. "వ. ఇందుఁ బౌలోమ కాలకేయులను నసురు లఱువది వేలుందురు." భార. అర.౪ ఆ.౧౧. 'సీ జనవంద్యుఁడగు ధర్మ తనయుని బంతి నిత్యంబు పసిఁడి, పళ్లెరంబులఁ గుడ్చు బ్రాహ్మణు లతిపుణ్యు లెనిమిదివేలు సమిద్ధమతులు; యతులు పదివేలు వారల కనుదినంబు, నన్నపానంబులందు సహాయుఁ డగుదు.' భార. అర.౫ ఆ౩౦౬. 'వ. కనకభూషణాలంకృతులయిన పరిచారకులు నూఱు వేలు.' భార. అర.౫ ఆ.౩౦౭. 'సీ. వారాకరంబులో వటపత్ర శయనులౌ నబ్జనాభులు నూఱునైగుపదులు.' కాశీ.౬ ఆ ౧౩౧. 'సీ. మూఁడర్బుదములు సముద్యద్భుజాటోప విజయధౌరేయులు వీర భటులు.' జై.౫ ఆ.౧౭౪. 'ఉ. వేడి వెలుంగులోలిఁ బదివేల సహస్రములున్న భంగి, నెవ్వాఁడు వెలుంగు నట్టిబుధవత్సలు డేగె నదృశ్య మూర్తియై.' భోజ ౪ ఆ.౩౫౧. (కొన్నియెడల నసుటచే పదివేవురు, నూఱునేఁబండ్రు (లేక) నూటయేబండ్రు అని యిట్లు మహత్ప్రయుక్త రూపంబులుం గలవని యెఱుంగవలయును. కడపటి యుదాహరణముల యందలి సంఖ్యావాచకములు తత్సమములు గాన వాని కట్టిరూపములు మూడర్బుదముల సంఖ్యలవారు, పదివేల సహస్రముల సంఖ్యల వారు అని యేర్పడుచున్నవి.)

మహత్తులను బోధించెడి శబ్దములకు విశేషణములయిన సంఖ్యావాచకములకు మహత్కార్యములే రావలసియున్నను రాక యమహత్కార్యములు కొన్నిచోట్ల కలుగుచుండునని సూత్రార్థము.

"అసురు లఱువదివే లుందురు." అనుచోట "అసురులు "అను విశేష్యము మహద్వాచకమయినను విశేషణమగు సంఖ్యావాచకమయిన "పదివేలు" అను పదము పదివేగురు అను మహద్రూపముగా నుండక అమహద్రూపముగా నున్నది. జనవంద్యుడు ... బ్రాహ్మణు లతిపుణ్యు లెనిమిదివేలు ... యతులు పదివేలు... అగుదు... ఇందు "బ్రాహ్మణులు" "యతులు" అను విశేష్యములు మహత్కార్యములతో నున్నను విశేషణ సంఖ్యావాచకమగు "పదివేలు" అనుపద మమహద్రూపముగనే యున్నది. "కనకభూష ... పరిచారకులు నూఱు వేలు". ఇట "పరిచారకులు" అను విశేష్యము మహత్తయినను "వేలు" అను

విశేషణ మమహత్కార్యముతో నున్నది (పదివేగురు-మహద్రూపము) "వారాకరంబులో.....అబ్జనాభుల నూఱునైదుపదులు" ఇట "అబ్జనాభులు" అను విశేష్యము మహద్వాచకమయినను విశేషణ సంఖ్యావాచకము "నూఱునైదు పదులు" అని యమహత్తుగా నున్నది "నూఱునేబండ్రు" అనిగాని "నూటి యేఁబండ్రు" అనిగాని యుండనగును "అయిదు పదులు" అనుచోట నమహత్కార్యము వచ్చుటయేగాక సమాసముగా నుండక వ్యస్తముగా గూడ నీ పదములున్నవి సామాన్యముగా 'అయిదు + పది = ఏఁబది" అని సమాసముగా నుండును "మూఁడిచిప్పమొలు. . . . ఎరవులు" ఇచ్చటి వీరభటులు అను విశేష్యము మహద్వాచకమయినను అర్బుదములు" అను విశేషణ మమహత్కార్యమును బొందియున్నది (ఇచ్చట నమహత్కార్యము మువర్ణకము) మీది యుదాహరణములలో గల "వేలు, పదులు" అనుపదము లాచ్ఛికములు. కనుక వానికి మహదర్థములయందు వేర్వేరు రూపములుండును. ఇందలి యర్బుదశబ్ద మాచ్ఛికశబ్దముకాదు. ఇది తత్సమశబ్దము. దీని కమహదర్థమున "అర్బుద" మని యుండును మహదర్థమునఁ దచ్ఛబ్ద మనుప్రయుక్తమయి "అర్బుదముల సంఖ్యలవారు." (అనగా అర్బుదములు అను సంఖ్యగలవారు అని యర్థము.) అనియుండును. వేఁడి వెలుంగులలోఁ బదివేల సహస్రములు...! ఇందు వేఁడి వెలుంగులు (సూర్యులు) అనుపదము విశేష్యము. మహద్వాచకము. "పదివేల సహస్రములు" అనునది సంఖ్యావాచకవిశేషణము అమహత్కార్యముతో నున్నది ఇదియును "పదివేల సహస్రముల సంఖ్యలవారు" అని మహద్రూపమున నుండును.

బాలవ్యాకరణమున "స్త్రీతిర్యగ్జడ భిన్నంబులును వాని విశేషణంబులును మహత్తులనంబడును." అని చెప్పుటచే నీ యుదాహరణ సంఖ్యావాచకములును మహత్సంజ్ఞ గలవగును. చింతామణియందును, "తద్విశేషణంచాపి" అని మహద్విశేషణములకును మహత్సంజ్ఞ చెప్పఁబడెను. అందుచే నీ సంఖ్యావాచక విశేషణములకును మహత్కార్యములు ప్రాప్తించుచుండగా నమహత్కార్యములు ప్రయోగములలో కానవచ్చుటచే నీ సూత్రమున విధింపబడెను.

ఈ సూత్రమున నమహత్కార్యములు విధింపఁబడుటచే నాచ్ఛిక సంఖ్యావాచకముల కమహద్రూపములు ప్రామాణికములగుచున్నవి. తత్సమశబ్దములయిన "సహస్ర, అర్బుద" శబ్దములు మాత్రము మహద్వాచకములయినను బుంలింగములు కానందున డుజ్జు ప్రాప్తింపలేదు. వీనికి చేరిన మువర్ణక

మమహత్కార్యముకాదు. అయ్యది యదంతనపుంసక శబ్దమగుటచే వచ్చినదిగాని అమహత్తయినందున రాలేదు. వీనికి మహత్కార్యము రానందున నివి సూత్రమున కుదాహరణములు కాఁజాలవు. అందుచే సూత్రమున "అమహత్కార్యము చూపట్టెడి" అనుటకు బదులు "మహత్కార్యంబు చూపట్టగు" అనుట బాగు "సహస్ర, అర్బుద" శబ్దములకు మహత్కార్యమగు డుజ్జు రాకుండుటచే నుదాహరణము సరిపడును. తత్సమ సంఖ్యావాచక శబ్దములు తెనుగున మహద్బోధకములయి ప్రయోగింపఁబడవు. ఇయ్యవి భవచ్ఛత్రాదులవంటివి. ఇవి సమాసగతములగుచునే "శత సంఖ్యాకులు" మున్నగురీతిని బ్రయోగింపఁబడును అమహత్తులయినచో గోవులు సహస్రములు మున్నగురీతిని కొన్నిపదములు మాత్రము ప్రయోగింపఁబడును. అమహత్తులయినను నన్నియుఁ బ్రయోగింపఁబడవు. "ఆవులు పంచదశ" ఇత్యాదిరీతిని వాడఁబడవుగదా! కావున సహస్రాది శబ్దములకు మహద్రూపము చూపట్టుడు అన్నచో మహద్రూపము కానరానందున దోషములేదు. డుజ్జు రాలేదుగనుక మహద్రూపము చూపట్టకుండుట కుదాహరణమునగును.

ప్రౌఢవ్యాకర్త "అర్బుదము, సహస్రము" అను శబ్దములు మహద్వాచకములయినచో "అర్బుదముల సంఖ్యలవారు, సహస్రముల సంఖ్యలవారు" అనురీతినే యుండునని చెప్పెను. అనగా మహదర్థమున వీనికి ప్రత్యేక ప్రయోగము లేదనియే యాశయము.

లేదా

ముపర్ణకమును నమహదదంతములకు వచ్చు వర్ణకము కావున నమహత్కార్యమని తలంపవలయును. అట్లయినచో నుదాహరణములు సరిపడును.

ఈ కార్యమనిత్యమగుటచే మహద్రూపములు నుండును. తత్సమ శబ్దములకు మాత్రము మహద్రూపముండదు. కావున సంఖ్యాపదముతోసమసించి మహద్బోధకమగును — ఆ విషయము వివరణ రూపమున చివర చెప్పబడెను.

**సూ. ఔపవిభక్తికాంతంబులగు చేయి నేయి లోనగు శబ్దంబుల యాద్యచ్చునకు హ్రస్వంబును, మీఁది హల్లునకు ద్విత్వంబును ప్రథమైకవచనంబునందు వైకల్పికంబుగ నగు. ౧౦౫**

ఉ. చేయి, చెయి, చెయ్యి, నేయి, నెయి, నెయ్యి మొ.

ఇతర స్థలంబులయందు — ఉ, చేతితోన్, చేతికిన్, నేతితోన్, నేతికిన్ మొ.

"ఇ, టి, తి" అను వర్ణములు ఔపవిభక్తికములు. ఇవి అంతమునఁ గల శబ్దములు ఔపవిభక్తికాంతములు. "చేయి, నేయి" అనువానికి చేతికి నేతికి మున్నగుచోట్ల తివర్ణకము కానవచ్చుటచే నిట్టివి ఔప విభక్తికాంతములు. ఈ శబ్దములు ప్రథమైకవచన ప్రత్యయముతోఁ గూడునపుఁడు వీని మొదటియచ్చు (అనగా అచ్చులలో మొదటిది కావలయును. పదమునకు మొదట హల్లున్నను దానిమీఁదనుండు అచ్చు మొదటి అచ్చే యగును.) హ్రస్వము వికల్పముగా నగును. ఈ హ్రస్వము వచ్చినప్పుఁడు తరువాతి హల్లునకు వికల్పముగా ద్విత్వము ను వచ్చును.

"చేయి" ఇది ప్రథమైకవచనాంతము హ్రస్వమురాగా "చెయి"అగును. ఇట్టి హ్రస్వరూపమునందు ద్విత్వము వచ్చినచో "చెయ్యి" అగును. హ్రస్వద్విత్వములు రెండును రానిచో "చేయి" అనియే యుండును ఇట్లే "నెయ్యి, నెయి, నేయి" అనునవి యగును ఈ కార్యంబులు ప్రథమైకవచనాంతములగు నపుఁడే వచ్చునుగాని యితర విభక్తిప్రత్యయము లంతమున నున్న స్థలములలో రావు. "నేతులు, చేతులు". ఇత్యాదులు చూడఁదగును.

ఈ సూత్రమున ద్విత్వమును మాత్రము విధించుట యుచితము హ్రస్వము "ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుఁడు. . హ్రస్వంబగు" నను సూత్రముచేతనే రావచ్చును ఇవిరెండును నొక్కసారి వచ్చునవియును గావు అందుచే ద్విత్వమును మాత్రము విధించినఁ జాలును కాని ద్విత్వము వచ్చినపిమ్మట నిత్యముగా మొదటి దీర్ఘమునకు హ్రస్వమువచ్చి "చెయ్యి" అగును. ద్విత్వము రానిచో "చేయి" అని యుండును. "చెయి" అను రూపము సిద్ధింపదు. అయినను "ఓయారాదులందలి దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు" (బాల. ప్రకి, 12సూ) నను సూత్రముచే నోయారాదులలో "చేయి" అను పదమును జేర్చుకొని హ్రస్వమును జేసిన "చెయి" అనునదియు సిద్ధించును. లేదా "చెయ్యి"అను పదమునక్కటాదులలోఁ జేర్చుకొనినను "చెయి"అను రూపము సిద్ధించును. ఓయారాదులలో చేర్చుటయయుచితము. కావున నీ సూత్రము విడువవచ్చును.

కుమారదేవపండితీయమున బాలవ్యాకరణమునందలి "ద్విరుక్తంబగు... హ్రస్వంబగు"నను సూత్రముచేతనే హ్రస్వము వచ్చునని వ్రాయుట సరియే [కాని ఆ హ్రస్వము నిత్యమగుటచే చెయ్యి, చేయి అని మాత్రమగును. "చెయి" అగుటకు ఇందలి హ్రస్వవిధాన మావశ్యకమే]. ఆ హ్రస్వవిధానము సమస్తపద

విషయిక మగుటచే నిట్టిచోట్ల దానికిఁ బ్రవృత్తి యుండరాదని తలంపరాదు. ఆ సూత్రము సమాసమాత్రవిషయికము కాదు త్రికంబునకు హ్రస్వదూపంబులు చూపుటకై ప్రసంగవశమున సమాస ప్రకరణమున వ్రాయబడెనేకాని వేరుకాదు. కనుకనే బాలవ్యాకరణమున "నూయేలా"ది శబ్దములందు ద్విత్వమును మాత్రము విధించెను. ఉయ్యేల అనుచోట హ్రస్వము పైసూత్రముచేతనే రావలయును—అప్పకవి చెప్పినరీతి నిదియు సమస్తపదమే యన్నను నాగణమునందలి కోపు, తేను, పూవు మున్నగునవి సమాసములు కావనుట సర్వసమ్మతమే గదా! అందుచే హ్రస్వవిధానము సమాసమాత్రవిషయకమని తలంపరాదు

తృతీయాంతాదుల కీ కార్యములు వర్తింపవనుటకు "చేతితోన్, చేతికిన్" ఇత్యాదు లుదాహరించెను

సూ. ఊరు చోటు మేన్వామిలు న్గ్లిష్షయంబులు ౧౦౬

ఊరులోనగువానికిఁ దృతీయయం దత్వము సంప్రాప్తింపగు గాన 'ఔప విభక్తిక నామ్నామత్వం స్యాత్సప్తమీ తృతీయార్థే'. అను సూత్రమున కవి విషయములు గాక 'కేషాంచిదుదంతానాం నేతివిభక్తావునోలుక్స్యాత్'. అను సూత్రమునకు విషయంబులగుచున్నవని యెఱుంగవలయును.

"ఊరు, చోటు, మేను" మున్నగు శబ్దములు "ఉన్" లోపమువచ్చు శబ్దములు అనగా "న"అను సప్తమీ ప్రత్యయము పరమేగునపుఁడు "ఊరునన్" అని యుండగా "ఉన్" (రేఫమీది యుకారము నకారముతోగూడి లోపించి "ఊరన్"అని యగును.

చింతామణియందు "ఔపవిభక్తికనామ్నా" మిత్యాది సూత్రముచే "గొడ్డలి" మున్నగు "ఇవర్ణాంత" శబ్దములకు సప్తమీ తృతీయావిభక్తుల స్థానమున "అత్వము" విధింపఁబడెను. కాగా గొడ్డలి + అన్—టి వర్ణము—గొడ్డటి + అన్ = గొడ్డటన్ అని యగును. ఊరు మున్నగు "ఉకారాంత"శబ్దములకు "న"అను విభక్తి పరమగునప్పుడు "ఉన్" అనుదానికి లోపము వచ్చునని "కేషాంచిదుదంతానా మిత్యాది సూత్రముసంజెప్పెను. గోరు నన్—ఉన్ లోపము—"గోరన్"అని యగును. ఇట్లు చింతామణిలో రెండు సూత్రములచే విధింపఁబడిన కార్యములను బాలవ్యాకర్త "ఔపవిభక్తికముల... బహుళంబుగా

నగు''నను నొక్క సూత్రముచే సంగ్రహించెను. ''గొడ్డటన్'' అన్నట్లే "ఊరన్" అనునదియు నత్వముచేతనే సిద్ధింపఁజేసెను.

అట్లు రెండును "అ"త్వమునకే విషయములన్నచో రెండింటికిని (ద్వివిధ శబ్దములకును) తృతీయా సప్తమీ విభక్తుల రెండిటి యర్థమును నుండవలసి వచ్చును. కాని ప్రయోగములందు ఊరన్, చోటన్, మేనన్ ఇత్యాదులకు తృతీయార్థము కానరాదు. అందుచే దీని నత్వమువచ్చు శబ్దములలోఁ జేర్పరాదనియు వీనికి ''ఉ''ల్లోపము వచ్చుటయే యుచితమనియు ''ఉల్లోప''స్థలము సప్తమ్యర్థమును మాత్రమే బోధించుననియుఁ బ్రౌఢవ్యాకర్త వివరించెను.

''ఊరన్, చోటన్'' మున్నగు పదములకుఁ దృతీయార్థము లేదనుట ప్రయోగములవలననే నిర్ణయింపవలయును అట్లు తృతీయార్థము లేకున్నను బహుళపదగ్రహణ సామర్థ్యముచే నిట్టి విశేషములు సిద్ధించునని కుమారదేవ పండితీయము'తలఁచుట బాగుగనే యున్నది బహుళపదము వలన సిద్ధించు విశేషార్థముల నా సందర్భమున బాలవ్యాకర్త వివరింపకుండుటచే సందర్భానుసారముగఁ బాఠకులు తెలిసికొనవలయుననియే తాత్పర్యము. ''తృతీయా సప్తములకు'' అను సూత్ర నిర్దేశప్రకారము తృతీయకు ''గోరన్, గొడ్డటన్'' అనియు, సప్తమికి ''ఊరన్, ఇంటన్' అనియు భిన్నపదముల నుదాహరించెను. ప్రతి శబ్దమునకును రెండు విభక్తుల యర్థమును సుప్రసిద్ధముగా నున్నచో నొక్కొక పదమునకు రెండేసి యర్థములను ''గోరను గీఱెను'' ''గోరన్ ఎఱుపు గలదు'' అనురీతి నుదాహరణముల నిచ్చియుండును. అట్లీయక తఱచుగ వాడబడు నర్థమును బట్టియే తృతీయాద్యంతములుగా నాయా పదముల నుదాహరించెను. బహుళ పదమును నిరర్థకముగా సూత్రకారుఁడు వికల్పమగునర్థమునఁ బ్రయోగించియుండడుగదా! బహుళ పదార్థము సంగ్రహించి ''యా స్థలము నందు మాత్రయే యా యర్థము సిద్ధించుట ప్రయోజనమ''ని యాతడు వివరింపలేదు అంతియగాని యెల్లచోట్ల రెండు విభక్తుల యర్థము నుండునని యాతడు తలంచె ననరాదు. ఈ సందర్భమున ఊరన్, ఇంటన్ అనునవి తృతీయకు మాత్రమే యుదాహరించుట గమనింపఁదగినది.

మఱియొక విషయము. ఊర నిత్యాదులుల్లుగ్విషయములేయయినను ''న''అను విభక్తి పరముగానున్నప్పుడుగదా ''యున్''లోపింపవలయును. "న" అనునది తృతీయార్థమునను వచ్చెడి విభక్తియే. కావున ''ఉ''ల్లుగ్విషయములయినను తృతీయార్థమేల రాదని ప్రౌఢవ్యాకర్త తలంచెనో తెలియరాకున్నది.

ణానే కారక ౧౭ సూ॥చే నవర్ణకము 'తృతీయార్థమున నుండునని తలంచెను గదా! తృతీయార్థము రాదనుటకు "ఉన్లుగ్విషయంబు"లనినం జాలదు. మఱియు నవర్ణక పరత్వముననే గాని "ఉన్" లోపము రాదు. నవర్ణక మేకవచన ప్రత్యయము గదా! అట్లయిన "పెక్కుచోటులన్" మున్నగు బహువచనాంతప్రయోగము లసాధువులని ప్రౌఢవ్యాకర్త యాశయముగానోపును. లేదా సప్తమ్యర్థక ద్వితీయ యనవలసియుండును

అత్వ ముభయ వచనములయందును వచ్చును. ఉన్లోపము మాత్ర మేక వచనంబుననే విధింపఁబడెను. అందుచే బహువచనంబు పరంబగునపుడును వచ్చునేని యత్వమునకు విషయము లనుట సరిపడదు.

సూ॥ సద్రుతంబంతశబ్దంబు తన తమ పూర్వకంబు స్వాయ మర్థ కంబు. ౧౦౭

ఉ. తనయంత, తనంత, తమయంత, తమంత 'చ. వనిత దనంతఁ దా వలచి వచ్చినఁ జుల్కనగాదె యేరికిన్!' స్వా ౨౬ ౬౬ మొ.

సద్రుతంబు = ద్రుతముతోఁ గూడినది. తన తమ పూర్వకంబు = "తన, తమ" అను శబ్దరూపములు పూర్వమున గల. "అంతన్" అను శబ్దము తన తమ శబ్దములతోఁగూడి స్వయముగా ననునర్థము నిచ్చును. ఈ పద మన్వయించు క్రియయొక్క కర్త యేకవచనాంతమైనచో "తన పూర్వకముగను" బహువచనాంతమయినచో "తమ పూర్వకముగను" నీ యంతశబ్ద ముండు ననియు నెఱుంగవలయును

ఉదాహరణములకు చివర ద్రుతముచేర్చి ప్రయోగము చేయవలయునని గ్రహింపవలయును. ఈ యంత శబ్దము పరమగునపుడు సంధియు వైకల్పిక మగును. ఇవి ప్రత్యేకపదములేయగుటఁజేసి యపదాంత స్వరసంధి రావలసినపని లేదు.

తమయంతన్, తమంతన్, తమ పూర్వకాంతశబ్దములు. సంధ్యభావ, సంధి స్థలములు. తనయంతన్, తనంతన్ తన పూర్వకాంతశబ్దములు. సంధ్య భావ, సంధి స్థలములు.

వనిత దనంతఁదా... యేరికిన్। తనంతన్ అనుటకుఁ బ్రయోగముచూపఁ బడెను. "పురుషుఁడు కోరకయే స్వయముగా వచ్చిన వనిత" యని యిచ్చటి నర్థము.

సూ. షష్ఠ్యంత తద్దేత ద్యుష్మ దస్మ దాత్మ శబ్ద పూర్వకంబులగు ప్రథమాంత తదాది శబ్దంబు లవధారణార్థకాంతంబులు తఱచుగ స్వయమర్థకంబులగు ౧౦౮

ఉ. వానికి వాఁడె, వీనికి వీఁడె, నీకు నీవె, నాకు నేనె, తనకుఁ దానె, వారికి వారె మొ. తఱచుగ ననుటచే తనుదాన, తారుదారె ఇత్యాదులు గ్రాహ్యములు 'సీ. పొరలెత్తి ఘనసార తరువులఁ దనుదాన తొరఁగిన పచ్చకప్పురపురజము'. స్వా. ౨౮. ౫౫ 'తనుదానా పూర్ణ ప్రభల వెలయు. పం. ౧౪ మొ.

షష్ఠీవిభక్తి యంతమునఁ జేరిన "ఆ, యీ, నీ, నా, తా" శబ్దంబులు. అనగా "వానికి, వీనికి, నీకు, నాకు, తనకు" మున్నగునవి. ఈ శబ్దములు పూర్వమునఁగల ప్రథమాంతములుగా నుండెడి ఆ, యీ, నీ, నా, తా శబ్దంబులు అవధారణార్థకములయిన "ఎ" మున్నగు శబ్దము లంతముల గలవి యగుచు "స్వయముగా" అను నర్థమును ఒఱచుగా నిచ్చుచుండును

అనగాఁ దదాది శబ్దములు విడిగా మొదటి షష్ఠ్యంతము, రెండవది ప్రథమాంతము, మూడవది అవధారణార్థకము, అను వరుస నున్నచో స్వయముగా అను నర్థము నిచ్చును. వానికి + వాఁడు + ఎ = వానికివాఁడె ఇచ్చట "స్వయముగా"నను నర్థము వచ్చుచున్నది మిగిలిన విశ్లే యూహ్యంబులు.

తఱచుగా నీ మూఁడుపదముల వరుసము నిట్లుండవలయుననుటచే నొక్కొకచోట నింకొకరీతి నీ శబ్దము లున్నను నిట్టియర్థము వచ్చుట విరుద్ధము కాదని తెలియవలయును "తనుదాన, తారుదారె" మున్నగుచోటులందు పూర్వపదములు షష్ఠ్యంతములుగా లేకున్నను స్వయమర్థము నిచ్చుచున్నవి.

పొరలెత్తి ..తనుదాన...రజము। తనుదాన వెలయు। ఇవి షష్ఠ్యంత పూర్వకములు కానందుకుఁ గవి ప్రయోగములు తనుదానాపూర్ణ...। అనుచోట నంతమున నవధారణార్థకమును లేదు

సూ. కొన్నియెడల షష్ఠ్యంత తదాది శబ్దపూర్వకంబులుగాకయు నవి స్వయమర్థకంబులగు. ౧౦౯

ఉ. వాఁడే వచ్చెను – వాఁడు తనంత వచ్చె ననుట. ఇత్యాదు లెఱుంగునది.

అవధారణార్థకాంతంబులగు తదాది శబ్దములు అనగా "వాడే, నీవే మున్నగునవి షష్ఠ్యంత తదాది పదములు పూర్వమున లేకున్నను అనగా వానికి, నీకు, మున్నగునవి లేకున్నను స్వయముగా ననునర్థము నిచ్చును ఉ॥ వాఁడే వచ్చెను.

సూ. షష్ఠ్యంత తదేత ద్యుష్మ దస్మ దాత్మ శబ్దపూర్వకం బంతట శబ్దంబు పృథగర్థకం బగు. ౧౧౦

ఉ, వానియంతట వాఁ డున్నాఁడు.- మొ.

షష్ఠ్యంతములగు "ఆ, ఈ, నీ, నా, తా" శబ్దములు పూర్వమునఁగల "అంతట" శబ్దము "వేరుగా"అను నర్థమునిచ్చును ఉదా॥ వానియంతట, వీనియంతట, నీయంతట, నాయంతట, తనయంతట మున్నగునవి ౧౦౮సూ॥న జెప్పబడిన షష్ఠ్యంతములు వ్యస్తముగానుండును. ఇందు షష్ఠ్యంతములు అంతట శబ్దముతో సమాసమును జెందియుండును ఉ॥ వానియంతట వాఁ డున్నాడు అనగా వాఁడు వేరుగా నున్నాడని యర్థము.

సూ. ఆదరార్థంబున ద్విరుక్తి యగు. ౧౧౧

ఉ. కృష్ణ కృష్ణ, హరి హరి. మొ.

శబ్దములు కొన్నిచోట్ల రెండేసిసార్లు పలుకఁబడుచుండును. అట్లు రెండుసార్లు పలుకుట యేయే సందర్భములలో సంభవించునో నాలుగు సూత్రములలో జెప్పుచున్నాఁడు.

ఆదరము—అనగా ప్రీతి గమ్యమానమగునపుఁడు శబ్దములకు ద్విరుక్తి వచ్చును. ఉ॥ కృష్ణ కృష్ణ, హరి హరి, ఇచ్చట ఆదరముతో తలంచు ప్రీత్యతిశయమును సూచించునట్లు ద్విరుక్తి వచ్చెను.

సూ. అత్యంతార్థంబునందు నగు. ౧౧౨

ఉ. ఔరౌర, కటకటా మొ. కనికని, వినివిని మొ. "తద్గుణౌఘముల్, వినివిని" కళా. ౬.౨౮. ౨౦౯ మొ.

"అత్యంతము" అనునర్థము తోఁచునపుఁడును ద్విరుక్తివచ్చును. "ఔర" అను పదము ద్విరుక్తమయి "ఔరౌర"అని యయ్యెను. ఈ పదము ఆశ్చర్యమును సూచించును. రెండుసార్లు పలుకబడినందున మిక్కిలి యాశ్చర్యమును సూచించును. కట కటాయనున దత్యంతదుఃఖమును దెలుపును. ఇట్లే కనికని = అధికముగా జూచి.

"తద్గుణౌఘముల్ వినివిని" చాలసార్లువిని యని యిచ్చటను నత్యంతార్థమే తోచును

సూ. కొన్నియెడలం ద్వరితానాదరార్థంబుల రెంటను నగు. ౧౧౩

ఉ. లేలెమ్మ్మ, పోపొమ్మ్మ. మొ.

కొన్నిచోట్లఁ దొందర సూచితమగునపుడును, కొన్నిచోట్ల ననాదరమును సూచించునపుడును ద్విరుక్తి యగును.

ఈ రెండర్థములలో నే యర్థమునకైనను ద్విరుక్తి వచ్చును రెండర్థములును సూచితములగునపుడు ద్విరుక్తి వచ్చునని వేరుగా విధింపనక్కరలేదుగదా! లెమ్ము అనుదానికి ద్విరుక్తివచ్చి 'లేలెమ్ము" అయినది. ఇట తొందర గమ్యమానమగును. పొమ్ము అనుదానికి ద్విరుక్తివచ్చి "పోపొమ్ము"అని యయినది. ఇచట ననాదరము తోచుచున్నది. సందర్భానుగుణముగా రెండర్థములును గూడ రావచ్చును. సంధి ౨౩ సూ. చూడఁదగును.

సూ. కొన్ని శబ్దంబు లర్థవిశేషంబున ద్విరుక్తంబులయి యదంతంబులు నగు. ౧౧౪

ఉ. ఒండొండ, తరతరమ. (ఇట నర్థవిశేషము క్రమముగా ననుట.)

వెనుకఁజెప్పిన యర్థములందేకాక మఱికొన్ని యర్థములందును ద్విరుక్తి వచ్చును. అట్టిచో నంతమున "అ"కారము చేరును. "ఒండు" అను శబ్దము ద్విరుక్తిచెంది "ఒండొండు"అని కావలసియున్నది. కాని యంతమున "న" కారముచేరి "ఒండొండ"అని యయ్యెను. ఇట్లె "తర"అను శబ్దము ద్విరుక్తిం జెంది "తరతర"అని యయి మువర్ణకముచేరి "తరతరము"అని కాఁగా నీ సూత్రముచే "న"కారము వచ్చి "తరతరమ" అని యయ్యెను ఏకశబ్దార్థకమగు "నొండు"శబ్దము ద్విరుక్తమగునపుడు "క్రమముగా"నను విశేషార్థము నిచ్చుచున్నది. ఇట్లే తరము అనుశబ్దము వంశమునందలి యొక పురుషుని స్థితిని బోధించును. అట్టిది ద్విరుక్తమయి క్రమముగా నను నర్థము నిచ్చుచున్నది.

సంస్కృతమున "ప్రతి"అను నవ్యయముయొక్క యర్థ మిచ్చుటవచ్చును. ప్రతి పురుషునియందు, ప్రతి గ్రామమునందు మున్నగురీతి నిచ్చుట నర్థమునిచ్చుచున్నది.

సంధి లేని సూత్రముకూడ వ్యుత్పత్తి విధాయకమే కావున దానినిగూడ నిచ్చుటనే కూర్చుట బాగుగా నుండును

**సూ. నామపదంబు లాద్యాద్యర్థపరకంబులయి వ్యతిరేక వ్యంజక ప్రశ్నార్థకంబు లగు. ౧౧౫**

ఉ. ఆ. నన్ను నేకార్థ సమవేతుఁ బాడియయ్య యిట్టిపనికిఁ బనుప. భార. ఆది ౨౫. ౩౬. అర్హమయ్య. ఉ. హరి. ౬౭ ౧౮౦ మొ.

ఆద్యాద్యర్థపరకంబులు = అయ్య మున్నగు శబ్దములు పరమందుగలవి. వ్యతిరేక = ప్రతికూలమగునర్థమును వ్యంజక = తోఁచునట్లుచేసెడి ప్రశ్నార్థకంబులు = ప్రశ్నమర్థముగాఁగలవి

నామపదము లంతమున "నయ్య" మున్నగుశబ్దములతోఁగూడి ప్రశ్నార్థము నిచ్చుచుండును. అట్టి ప్రశ్నమున వ్యతిరేకార్థము వ్యంగ్యమగుచుండును.

ఉ॥ "నన్ను ... పాడియయ్య .. "ఇటఁ "బాడి"యను నామపదము 'అయ్య' యను నాద్యార్థక శబ్దముతోఁగూడి ధర్మమా! అను ప్రశ్నమును బోధించుచున్నది. "నన్నిట్టిపనికిఁ బంపుట ధర్మముకాదు" అను వ్యతిరేకార్థము వ్యంగ్యమగుచున్నది ఇట్లే "అర్హమయ్య" యనుచోట "నర్హముకాదు" అను నర్థము వచ్చుచున్నది. ఇట నాదిపదముచే అమ్మ, ఆ, ఏ, మున్నగువానిని గ్రహింపవలయును పాడియమ్మ! పాడియా! పాడియే! యిత్యాదులు నిట్టి యర్థము నిచ్చును.

శబ్దసామర్థ్యమునుబట్టి యాయా యర్థములు వచ్చుచుండును. ఇట్టియర్థ విశేషములను జెప్పుటకారంభించినచో నంతముండదు. అట్టి విశేషము లర్థసంబంధులగుటచే శబ్దశాస్త్రసూత్రములలోఁ జెప్పనక్కఱలేదు ఇట్లే సంస్కృతమునను గాకుధ్వనిస్థలములయందును వ్యతిరేకార్థము వ్యంగ్యమగుచుండును. కాని పాణినీయులు ఈ యర్థమును విధింపలేదు. అట్లే యిచ్చటను నీ విషయమును జెప్పనక్కఱలేదు.

ఈ యయ్యాదులు ప్రత్యేకపదములు. ఇవి యనేకవిధములగు నర్థముల నాయా సందర్భములనుబట్టి యిచ్చుచుండును. ఈ యయ్యాదులు నామ పదములమీఁదను క్రియాపదములమీఁదనుగూడఁ జేరుచుండును. బాలవ్యాకర్త మధ్యమపురుష "ము, దు"లమీఁద వీని ప్రయోగముఁ జెప్పెను. (చూ.

బాల క్రియ. ౩౩ సూ.) ప్రౌఢవ్యాకరణమునందు శబ్ద. ౪౪. సూత్రమునం దది తర క్రియలమీఁది ప్రయోగములం జూపెను శ్రేష్ఠతాపాదకములగునవి నను ప్రయుక్తములగుటయు సంధి ౧ సూత్రమునఁ జూడఁదగును. ఇట వ్యతిరేకార్థము గలదు. ఇట్టి యర్థవిశేషములు శబ్దములకు సహజములు. అవి సందర్భానుగుణములుగా నుండును.

సూ. నామ సర్వనామంబులకును గళలగు నవ్యయంబులకును గళపల సముచ్చయార్థవిశేష పాదపూరణంబులయందు "ను" శబ్దంబు తఱచుగనగు. కళలగు నను వంతశబ్దము మీఁద నయ్యాది యువర్ణపూర్వకంబు విభాష నగు. మఱియు నది శేషషష్ఠియందు యొక్క లోపించునపుడు లాగమాంత బహువచనంబు మీఁదను సముచ్చయమునం జూపట్టెడి ౧౧౬

(లాగమాంతమనుట మీ మాది పర్యుదాసార్థమని గ్రహించునది.)

ఉ. (౧) సముచ్చయమునందు నామపదములకు—అన్నయుం దమ్ముండును, సతియుం బతియును, వాఁడును వీఁడును, చిన్నయును పెన్నయును, నన్నును నిన్నును, తనచేతను మనచేతను. భూరిదక్షిణ మహాక్రతువులయు. మొ. అవ్యయములకు—చెప్పకయుఁ జూపకయు, ఏసియు వ్రేసియు, మొ.

(౨) అర్థవిశేషమందు నామపదములకు—చ. పెంపున జమదగ్ని సూనుఁడును బోలఁడు నిన్నని వింధు వింటినేర్పున భార. ఆది. ౫ ఆ. ౨౨౨. శా. బాణసమునం దిచ్చోటనేకాదు నన్నేపీటన్ మిగులంగ నెవ్వఁడును లేఁడే భంగులం జూచినన్. భార. విరా. ౧ ఆ. ౨౧౮. క. తన పూర్వతపఃస్థానంబని యనురాగమున బదరినంతయుఁ జూడన్ మనమునఁ దలపోసి యొకంమును మర్త్యోయాత్రమునఁ గనుంగొతుకమునన్. వ. అచ్చోట వసియింపంజని. హరి. ఉ ౫ఆ. ౧౫౮. క. ధీరమతు లిట్లు చేసినవా రెవ్వరుఁ గలరె. భార. ఆది. ౭ఆ ౨౪౭.

చ. ఎంతయుం దనదు చక్షుర్యమున్మనుచు. భార. ఆది ౧ ఆ ౫౯ ప. అపుడయుఁ బిన్నవన్నె పగి. భార. ఉద్యో ౩ ఆ. ౫౨. క. మొయి గల విలాస విభ్రమలక్ష్మిల్ పెన్కుటయుచు నొక యొజ్జపై నెక్కొనన. స్వా. ౪ ఆ. ౬౯. మొ.

అవ్యయములకు—సీ. అమృతాశనంబు సేయకయుచు దేవనాక జరామరత్వంబు నందుటయును. భార. ఆది. ౨ ఆ. ౧౦౭. క... పంక్తికంధరు నెల్లం జంపగఁజాలక రోషము పెంపునఁ గారాగృహమునఁ బెట్టఁగఁ బంచెన్. నిర్వ. ౭ ఆ ౬౨. క. వాటువడి మూర్ఛ వోయిం బోటుఁదైత్యుండు దెలిసి ఉ. హరి. ౪ ఆ. ౨౩౫. మొ.

(౩) పాదపూరణములగు నామపదములకు— అందఱున్ వివశులై. భార. ఆది. ౫ ఆ ౨౫౮. రేయి పగలు నిద్రయు నెప్పుఁడెఱుగక. భార. అర. ౧ ఆ. ౨౬. ఇద్వ్వేపుల కగు నభీష్ట మిదియు మొదలుగాన్. భార. ఆది ౮ ఆ. ౫౯. చ. భాసిలుఁ దత్పురికోట మిక్కిలిన్ మహిమను. కళా. ౧ ఆ. ౮ ఎ. గీ. ముమ్మ ముచ్చిచ్చును విరాళి గొన్నచోటు. స్వా. ౨ ఆ ౯ విపంచి నిన్నమొదలున్ నీ వంటమిఁ జేసి. స్వా ౩ ఆ. ౫౭. ఇమ్మహికాహార్యమువం జరింతు మెపుడున్. స్వా ౨ ఆ. ౪౫. ఇట్లు అంతయు, పెద్దయు. తద్దయు, మొ.

అవ్యయములకు— ఆధారము లేకను (లేకను — లేకయును) భార. ఆది. ౨ ఆ ౧౪౨. ఊఱడకం దిగిచి. (ఊఱడకన్=ఊఱడకయును) భార. ఆది. ౪. ఆ. ౧౯. ఎ. గీ. అనిలుఁడను దూత వోయి తోడ్కొనియుఁ దెచ్చె భార. ఆది. ౩ ఆ. ౧౫౬. సీ. కమలాప్తుఁ డుదయింపకయుమున్న ఒ ఱుకున మునుఁగు సంగమతీర్థమునకు నేగి. పాండు. ౫ ఆ. ౨౮౬. క. ఏనొక్కటి విన్నవించెద దానవకులమథన పెద్దతడవున నుండిం బూని వివిపింపఁగలవని. ఉ. హరి. ౫ ఆ. ౨౯౩. మొ.

తఱచుగ ననుటచే ను శబ్దము కొన్నిటి కొకప్పుడు వచ్చును. ఒకప్పుడు రా దని యర్థము గ్రహింపవలెను. దీని కుదాహరణములు

పాదపూరణమునందలివి. విభాష యనుటచే నను శబ్దము కొన్నియెడల యువర్ణపూర్వకముగానే వచ్చుననియు, కొన్నియెడల యువర్ణపూర్వకమయ్యును, గాకయు వచ్చుననియు నర్థము పరిగ్రహింపవలయును. యువర్ణపూర్వకముగనే వచ్చుటకు—ఉ. అనుటయు మొ.

యువర్ణపూర్వక మయ్యును గాకయు వచ్చుటకు. ఉ. సీ. ఎంతయు సంయమవంతుఁడు సహదేవుఁ డధ్యాత్మవిద్యా నాధ్యుఁ డెంత నన ఘుండు ధౌమ్యుండు. భార. సభా. ౨ ఆ. ౨౮౨. ఎ. గీ. తమ్మి కొలను బ్రవేశించు తలిరుఁబోండ్ల విలసనము లెంతనెంతయు వింత లయ్యె. కళా ౬ ఆ ౨౨౮. రగడ. చేటునకెయగు జూలుచే గలుగు మేలెంత. స్వా. 3 ఆ ౮౪. క ఒకగృధ్ర మెంతఁ బ్రియమున నొక చర్మము గఱచికొనుచు నురుపణమున రా. భోజ ౪ ఆ. ౨3. తే. అమరులెల్లను జల్లిరి సుమము లెంత. అధ్యా బాల కాం. ౧౪౨. సీ. నిడుపునఁ దూర్పును బడమరనై రెండుకడల నంభోనిధిఁ గదిసి యుండు. భార. భీష్మ. ౧ ఆ ౨౧. లేఁజిగురుఁ గొమ్మం జేవగాకుం డునే. (కొమ్మన్=కొమ్మయును) వసు. 3 ఆ. ౧౭3. పురారిం జేర లేడు. (పురారిన్=పురారియును) ఉ. హరి. ౬ ఆ. ౬౯. తప మిట్టిదిం గలదె? (ఇట్టిదిన్=ఇట్టిదియును) నిర్వ. ౯ ఆ. ౨౨. నీ వేమిని వేగిర పడక. (ఏమిని=ఏమియును) హరి. పూ. ౮ ఆ. ౧౧౦. అలభీమనాథు నకు నప్పటియుం బ్రణమిల్లి రుక్మాం. ౧ ఆ. 33. చ. వెఱ్ఱిదీఱె రోకలిఁ దలఁజుట్టుమన్న క్రియగా నొకకొండఱు దాల్తు రప్పటిన్ గలుపపధప్రవర్తనమే. కళా. ౨ ఆ. ౧౦౧. ఉ. ఓటయొకింతయే నియు సుయోధను చిత్తమునందు లేదు. భార. ఉద్యో. 3 ఆ. ౧౦౪. క. అమగఁగ జూదంబు నీకు నభిమతమేనిన్. భార. అర. ౨ ఆ. ౨౨౧. మఱిం దెనుగుం గబ్బము లెన్నియేనియును (మొదటిరూపము మఱి యును) ప్రభా. ౧ ఆ. ౬. ముక్తుండు వెండిన్ విపులఁ బొడమనీ. (మొ. రూ. వెండియును) పాండు. 3 ఆ ౧౨౮. మొ.

"ను" అనుశబ్దము నామములకును సర్వనామములకును, అవ్యయములకును గలిసి చేరుచుండును. అట్లుచేరునపుడు సముచ్చయార్థముగాని, యితరములగు నర్థవిశేషములుగాని, బోధింపఁబడుచుండును. కొన్నిచోట్ల నేయర్థములును లేక పాదపూరణమాత్రమున నుండును

ఇట్లీ నుశబ్దము చేరెడిశబ్దములు కళలగుచు నుకారాంతములు కానిచో నీ "న" శబ్దము "యు" అను వర్ణము పూర్వమునఁ గలదై "యును" అను రూపమునుండును. ఒక్కొక్కచో యువర్ణపూర్వకము కాకయునుండును. అనఁగా "ను" అనియే యుండును ఈ "యును" అనునది "రాములయొక్క" మున్నగు శేషషష్ఠ్యంతపదములయందు యొక్క లోపింపగా లాగమముతోఁ గూడి యున్న "రాముల" మున్నగు బహువచనాంతశబ్దములమీఁదను సముచ్చయార్థమునం జూపట్టును.

"శేషషష్ఠియందు యొక్క లోపించినపుడు" అనుటచే "రామునియొక్క" మున్నగుచోట్ల యొక్క లోపింపగా మిగిలినది "రాముల" అనియే యగును. అయినను మీయొక్క, మాయొక్క, తమయొక్క మున్నగు కొన్నిశబ్దములలో యొక్క లోపించినపుడు అవి శేషషష్ఠ్యంతములయినను లాగమ మంతమున లేనివగుటచే వానిని దప్పించుటకై "లాగమాంత" అను పదము సూత్రమునం జేర్పఁబడెను. ఇట్లనుటచే మీయొక్కయు, మాయొక్కయు నను నర్థమున మీయు, మాయు, అను ననిష్టరూపములు పుట్టవు.

మీ మాది పర్యుదాసార్థము = మీ, మా, మున్నగు శబ్దములను దప్పించుటకని యర్థము. "అన్న, సతి, పతి, చిన్నె, వన్నె," ఇవి యనుదంతకళలగుటచే యువర్ణపూర్వక నువర్ణమువచ్చి అన్నయును, సతియును, పతియును, చిన్నెయును, వన్నెయును నని యయ్యెను తమ్ముఁడు, వాఁడు, వీఁడు, అనునవి యుదంతము లగుటచేతను నన్ను, నిన్ను, తనచేత, మనచేత, అనునవి కళలు కానందునను కేవల నువర్ణకముచేరి తమ్ముఁడును, నన్నును మున్నగురీతి నయ్యెను. ఇట నంతట సముచ్చయార్థముననే నువర్ణము వచ్చెను. అన్నయుం దమ్ముఁడును ననఁగా నన్నయుం దమ్ముఁడు ను గూడ నని యర్థము అంతట నిట్లే.

సర్వనామములుకూడ నామవిశేషములే యగుటచే "నామ పదములకు" అని మీఁద సూచించినను సర్వనామములకుఁగూడ నుదాహరణముల నిందుఁ జూపెను. ఇట్లే ముందును సర్వనామములను నామపదముల యుదాహరణముల లోనే చేర్చును.

"భూరిదక్షిణమహాక్రతుఁడయు" అనునది సాగమాంశమున కుదాహరణము.

"చెప్పక. చూపక", ఇవి వ్యతిరేకక్త్వార్థకములు పెసి, వ్రేసి, ఇవి క్త్వార్థకములు. ఇవి నాల్గును నవ్యయములు ఇది సముచ్చయార్థము. ఉదంతములు కానందున యువర్ణపూర్వకమయి "ను" చేరెను.

(చెప్పకయును + జూపకయును అని యుండగా ద్రుతమర్ధబిందువుగా మాఱుటచేఁ జెప్పకయుఁ జూపకయు నని యయ్యెనని తెలియవలయును.)

ఇక నర్థవిశేషములందు నామపదముల కుదాహరణము లియ్యబడుచున్నది.

"పెంపున . . సూనుఁడును . ." సూనుఁడు, అనుట, దక్కుట, అనునవి నామపదములు. ఎవ్వఁడు ఒకఁడు, ఎవ్వరు, ఎంత, అనునవి సర్వనామములు. అనుట, దక్కుట, ఎంత, అనునవి "ఉదంతములు" కానందున "యును" చేరెను. మిగిలినచోట "ను" చేరెను జమదగ్ని సూనుఁడైనను, అంతటి గొప్ప వీరుఁడైనను నిన్నుఁ బోలఁడని యర్థము. ఇట్టి యర్థవిశేషము నిచ్చుట "ను" శబ్దము బోధించును. "ఎంతయును" అనుచోట నత్యధికముగా ననునది యర్థ విశేషము. అనుటయును — ఇట నానంతర్య స్వవిశేషము (చూ. క్రియ. ౧౨ సూ.) దక్కుటయును — దక్కుటచేతనని హేత్వర్థము విశేషము.

అర్థవిశేషములం దవ్యయముల కుదాహరణములు.

చేయక, ఎట్లు, పోయి, ఇవి యవ్యయములు "ఎట్లు" అనునది శబ్ద. ౩౮. సూ, చే ఉవర్ణముచేరిన యవ్యయము పోయి, చేయక, అనునవి క్త్వార్థక వ్యతిరేకక్త్వార్థకములగు నవ్యయములు. "చేయక" అనునది "ఉదంతము" కానందున "యును" చేరెను. "పోయి" అనునది యుదంతము కానందున "యును" చేరి పోయియును అని యుండవచ్చును కాని యువర్ణపూర్వకత్వము వైభాషికము కనుక నయ్యది చేరక కేవల నువర్ణకముచేరి "పోయిన్" అని యయ్యెను. చేయకయును — చేయకపోయినను అని యర్థము. ఎట్లును — ఎట్లయినను అని యర్థము. పోయిన్ — మూర్ఛపోయినను దెలిసి అని విరోధ మిచట విశేషార్థము.

పాదపూరణార్థమున నామ సర్వనామముల కుదాహరణములు.

నిద్ర, మిక్కిలి, ముచ్చిమ్చ్చు, మొదలు, అను నాల్గును నామ పదములు. అందఱు, ఇది, ఎప్పుడు, అనునవి సర్వనామములు నిద్ర — ఉదంతము కానందున "యును" చేరెను. మిక్కిలి — ఇదియు నుదంతము కానందున "యును" చేరఁ

డాయున్నను వైభాషికముగుటచే, "యు" పూర్వమునఁ జేరలేదు. ఇది — ఉకారాంతము కానందున యును చేరెను. ఈ యుదాహరణములందు ను వర్ణము నిరర్థకములయి యుండుటచేఁ గేవల పాదపూరణార్థక మనియుఁ బ్రౌఢవ్యాకర్త యాశయము

"అందఱు" అని నువర్ణరహితముగ నున్నను సరిపడుచుండ "అందఱును" అని ప్రయోగించుటచే "ను" అనునది పాదపూరకమని భావము. ఇట్లే "నిద్ర యెఱుఁగక" ఇది మొదలుగా, "మిక్కిలి సిరాళి గొన్నచోటు" "నిన్న మొదలు నీ వంటు పెండ్జేసి", "వరియించు మెప్పుడు" అని "ను" వర్ణరహితమయినను గావలసిన యర్థము వచ్చునని ప్రౌఢవ్యాకర్త యాశయము. కాని ఆలోచింపగా నీ "ను" వర్ణములన్నియు నర్థవిశేషబోధకములేగాని నిరర్థకములు కావు. అందఱున్ అనుచోట వివక్షా సామర్థ్యాతిశయమును సూచించును. సంస్కృతమునను నిట్టిచోట "సర్వేఽపి" అని యుండును. సాధారణముగా నిది అప్యర్థము నిచ్చుచుండును. పాదపూరణమనఁగా నియ్యది వాక్యపూరణమున కుపలక్షణ మనుకొనవలయును. పద్యము కానిచోటను అనగా గద్యమునందును నిట్టివి యుండునుగదా!

అంత, పెద్ద, తద్ద, అనువానికి "యును" చేరెను. ఇవి మూఁడును సాధారణముగా "ను" రహితములుగా నుండుట యరుదు.

### పాదపూరణమున నవ్యయముల కుదాహరణములు.

లేక, ఊరడక, తోడ్కొని, ఉదయింపక, ఉండి, ఇవి యవ్యయములు. ఉండి, తోడ్కొని, క్త్వార్థకములు. మిగిలినవి వ్యతిరేక క్త్వార్థకములు. ఈ యన్ని దుదాహరణములును "యును" రాదగినవే. అయినను గొన్నిఁటికి మాత్రమే "యును" చేరెను. వీనిలో నువర్ణమునకు విశేషార్థము లేకుండుటచే నయ్యది పాదపూరణార్థక మని యాశయము. ("కమలాప్తుఁ డుదయింపక మున్న" అను పాఠమున నీ యుదాహరణము సరిపడదు.)

ఈ నువర్ణము తఱచుగా వచ్చుననుటచేఁ గొన్నిచోట్ల రాకపోవచ్చును. కాని యేదేని యర్థమును బోధించుటకుఁ బ్రయోగింపఁబడునది యైనచో నయ్యది లేకున్న నా యర్థమునకు హాని కలుగును గావున నట్టిచోట నయ్యది యావశ్యకమే యనియుఁ బాదపూరణస్థలమున నయ్యది లేకున్నను నర్థమునకు భంగము లేదుగావున నచ్చట "ను" వర్ణరహితముగ నైన నుండవచ్చుననియు వివరణమున కాశయము

''యువర్ణపూర్వకంబు విభాష నవ్వు''నను చోటఁ గల విభాషకు వ్యవస్థను వివరించుచున్నాడు

కొన్ని యెడల నిత్యముగా యువర్ణపూర్వకమగుటయుఁ గొన్ని యెడల యువర్ణపూర్వకమగుటయుఁ గాకపోవుటయుఁ గూడ నకోర్నా వికల్పముగా యువర్ణపూర్వకమగుననియు వ్యవస్థఁ జేసెను.

అనుటయు—ఇటు నిత్యముగా యువర్ణపూర్వకమగును వికల్పమునకు—ఎంతయు ఎంత ననఘుండు. మున్నగునవి యుదాహరణములు ఇట ''ఎంత'' అనుపదమునకు ''యును'' అనియు ''ను'' అనియుఁగూడ చేరుట ప్రయోగము నందుఁ జూపఁబడెను.

ఇట్లే ''తమ్మి ... ఎంతసెంతయును''—ఇందు మొదటిది నువర్ణము. రెండవది ''యును'' వర్ణము చేటు ... ఎంత ఒక గృధ్ర మెంతప్రియమున .. । అమరు . . ఎంత । ఈ మూఁడు స్థలములందును యువర్ణరహిత నువర్ణముగలదని యభిప్రాయము. వీనిలో మొదటి యుదాహరణమున నెంత యనునది ప్రశ్నార్థక మనవచ్చుననియు రెండవ యుదాహరణమునఁ బాఠాంతరమున నెంత పదము లేనేలేదనియు సుబోధినియందు వ్రాయఁబడెను.

''తూర్పును పడమరనై . .'' ఇటఁ ''బడమరను'' అనుచో యువర్ణము లేకయే ''ను'' గలదు. ''లేఁజిగురుఁ గొమ్మం జేవ ...'' పురారిన్ ... । తప మిట్టిదిన్ ... । నీ వేమిని వేగిరపడక । అను నాల్గు స్థలములందును ''యు'' లేదు. ''ను'' మాత్రమే గలదు. ''యును'' జేరినచో నెట్లుండునో గ్రంథకర్తయె ''కొమ్మయును'' ఇత్యాదిగాఁ దెలిపెను.

''అల ... అప్పటియుం బ్రజమిల్లి'' ఇట ''యును'' జేరెను. అప్పటియుం బ్రజమిల్లి యనఁగా (మరలన్) మిక్కిలియుఁ బ్రజమిల్లి యనియర్థము. ' వెట్టి ... అప్పటికిన్.'' ఇది యువర్ణముగాక కేవల నువర్ణముచేరిన ''అప్పటి'' పదమునకుఁ బ్రయోగము. ఈ పదము రెండువిధములుగను ''ను'' వర్ణము చేరుటకు ఉదాహరణముగా నున్నది. ఓట యొకింతయేనియు ... । అమరఁగ ... వినన్ । ఈ రెండును ఏనిపదము యును, ను, అని రెండువిధములుగ నుండుటకు ఉదాహరణములు. ''మఱిం దెనుఁగుం ...'' ఇట ''యు'' చేరలేదు. చేరినచో ... ఱియు ననియుండును ముక్కుండు వెండిన్ ...! ఇట ''యు'' చేరలేదు. చేరినచో వెండియు ననియుండును

[illegible] గు [illegible] యున్నను విక ల్పముగా "[illegible]" [illegible] యున్నది.

ఈ పరిచ్ఛేదము నామప్రకరణము, సర్వనామప్రకరణము అని రెండు భాగములుగఁ జేయఁబడె పూర్వభాగమున నామములకు సంబంధించిన యంశ ములను జెప్పెను రెండవభాగము సర్వనామప్రకరణము. ఇందు ౧౦౫, ౧౦౬, సూత్రములుచేర్చుట యుచితముగాదు ఇవి నామప్రకరణమునఁ జేర్పఁదగును. ౧౧౧, ౧౧౨, ౧౧౩, ౧౧౪, ౧౧౫, ౧౧౬, సూత్రములు సర్వనామవిషయ కములు కావు. సర్వనామప్రకరణము నారంభింపకముందే ౧౦౫, ౧౦౬, ౧౧౧ నుండి ౧౧౬ వఱకునుగల సూత్రములనుగూర్చుట ప్రకరణోచితముగా నుండును.

ఇందు బాలవ్యాకర్త [illegible] ప్రక్రియఁ గనుపఱుపక సర్వనామములకుఁ బ్రక్రియ నేర్పఱచెను కాని యది యసమగ్రముగానున్నది. కారణమేమియో తెలియదు. ఆ, ఈ, ఏ, ఒక [illegible] రూపములనుమాత్రము [illegible] విభక్తులయందును సాధించి మహన్మహతీవాచక [illegible] త్యంతములను సాధింపలేదు కాని యన్ని [illegible] బములందును ప్రాతిపదికము [illegible] వచ్చెడి కార్యములను మాత్రము విధించెను. [illegible] త్యయము [illegible] సమానములే కావున నయ్యవి విధింపనక్కఱ లేదని తలంచెం గాబోలును. అట్లయినచో నేను, మేము, నీవు, తాను, తాము, మనము, మున్నగు [illegible] రూపములు [illegible] చేరిన సిద్ధింపవుగదా! వీని [illegible] సాధింపక విడిచెనో [illegible] చింతామణిలో సాధింపఁబడినవని విడచె నన్నచో అది, అవి, మున్నగు రూపములు [illegible] సాధితములగుటచే నిందు మఱల సాధించుట యనావశ్యకము కావలయును. ఇట్లితని సర్వనామ ప్రక్రియ యసమగ్రమై [illegible] యున్నది బాలవ్యాకరణమున నిపాతములుగా నిరూపించు టచే నిట్టి యసమగ్ర [illegible] [illegible] లేదు.

౧౨౬ సూత్రమున [illegible] విధింపఁబడిన "చు" అనునది ప్రత్యేకార్థ [illegible]. అవియు [illegible] యుద్దేశ్య [illegible] సమానముగ నేయున్నవి. వానిని [illegible] ప్రక్కను జేరుటకుఁ గాని [illegible] లేదు ఇది [illegible] యందున సుప్రసిద్ధమయియుండి కొన్ని సన్నివేశములందు మాత్రము విశేషార్థము నిచ్చుచో నట్టి విశేషార్థము [illegible] "[illegible]" అను [illegible] పదము

నిశ్చయార్థమునముండునని వ్యాఖ్య ౨౨. సూత్రమునఁ జెప్పఁబడెనుగదా! అందుచే పైవిధాన మనావశ్యకము.

ఈ సముచ్చయార్థక ునువర్ణకము "కొన్నిచోట్ల యువర్ణపూర్వకమగుటయుఁ" "గొన్నిచోట్లఁ గాకుండుటయు" అను విధానముగూడ సరియగు పద్ధతికాదు. ఈ యవ్యయము "ఉను" అను రీతి నజాదిపదము. సోదరభాష యగు తమిళమున నియ్యది "ఉమ్" అని యజాదిగనే యున్నది. ఉకారాంత శబ్దముల చివర సంధి యగుటచే నా యుకారము వేఱుగాఁ గానవచ్చుటలేదు. (రాముఁడు + ఉను = రాముఁడును) అకారాంతాది శబ్దములకుఁ బరమగునపుడు సంధి లేనందున యడాగమము వచ్చుటచే సీత + ఉను = సీతయును అనురీతిని యకారముతో వినవచ్చుచున్నదనియుఁ దెలియవలయును. కాని యనుచిత విభాగమువలనఁ గాబోలును దెనుఁగున నియ్యది "ను"అను రూపమున నున్నదనవలసి వచ్చుచున్నది. కానిచో ఎంతన్, పడమరన్, ఏమిన్, పోయిన్, మున్నగు ప్రయోగములకు మార్గాంతరముల గతి కల్పింపవలయును గదా! కాని యీ విధముగా "ను" స్వరూపముగా దీనిని విభజించినను "అయ్యున్" అను ప్రయోగము కుదురదు. ఇది "అయి" అను క్త్వార్థకమునకు సముచ్చయార్థక పదము చేరిన స్థలము. ఇచ్చట నేటికిని "ఉను" అనునదియే వినవచ్చుచున్నది. అయి + ఉను — సంధిలో యకార ద్విత్వము (అన్నిష్టసఖివలె) అయ్య్ + ఉను = అయ్యును ఇచ్చట అయి + యును అని యున్నచో "అయియును" అనియే కావలసియున్నది అయ్యున్ అని కాఁజాలదు. ఇట్టి చిక్కు లుభయపక్షములందు నుండుటచే "ను" అని గ్రహించుట సంభవించెను.

లాగమాంత షష్ఠీబహువచనాంతంబుమీఁద వచ్చెడి "యును" కు "వారివధమ్మిల్లభారావకలిత దివ్యామోదవనపుష్పదామములయు" అనునది సుబోధినిలో నుదాహరింపఁబడుట యుక్తమే. అహోబల పండితుఁ డీ భాగము నిట్టి సందర్భముననే యుదాహరించెను. దామములయొక్క + యున్ – యొక్కకు లోపము. "దామములయు"నయ్యెను. కుమారదేవ పండితీయోదాహరణమగు "రెండు కడల నంభోనిధిఁ గదిసియుండు" ననుచోట శేషషష్ఠ్యంత పదము కానరాదు. అందుచే నయ్యది యుదాహరణము కాఁజాలదని సుబోధిని వ్రాయుట సరియ. "కడల" ననుచోట కడలయొక్క అను షష్ఠ్యంతపదశేష మేయని భావించినచో "రెండు కడలయు నంభోనిధి" అని యుండవలయును. అట్లుదాహరిం

పఁబడలేదు. కుమారదేవ పండితీయోదాహరణము సరియగుపాఠము కాదనియు "కడలు నంభోనిధి" యను పాఠమే సరియైనదనియు సుబోధినిలో వ్రాయఁబడెను. కాని ప్రౌఢవ్యాకర్త శబ్దరత్నాకరమున నెట్లుచూపినను నిందుమాత్రము పడమరనై "రెండు కడల నంభోనిధి"అను పాఠమే చూపఁబడెను. "నిడుపునఁ దూరుపు పడమటయై రెండు కడలు నంభోనిధిఁ గదిసియుండు"నను పాఠము ప్రౌఢవ్యాకరణ సమ్మతముకాదు. ఇట్టి పాఠము గ్రహింపఁబడినచో యువర్ణ పూర్వకముగాక నువర్ణము చేరుటకును నుదాహరణముగా నిందుఁ జూపఁబడుట యనుచితము గావలసివచ్చును. ఈ పాఠమున నట్టి నువర్ణమెచ్చటను గానరాదు.

ఈ ప్రకరణమున "నాద్యంతౌటకితౌ" అను పరిభాష నుపయోగించి టకారకకారముల నాగమములకుఁజేర్చి విధింపలేదు. అట్లు చేయుటవలన సూత్రములందు లాఘవ ముండును అయినను సుఖముగా నర్థము బోధపడుటకై "పూర్వాగమంబగు"నను రీతిని స్పష్టశబ్దములచేతనే విషయమును దెల్పెను. సంధి పరిచ్ఛేదమున మాత్రము పుగాగమము, నుగాగమము, ఇత్యాదులను వాడెను. కాని యవి బాలవ్యాకరణమునఁ దఱచుగా వాడబడినవే యగుటచే నా యాగమములనే స్మరింపఁజేయుటకై యా శబ్దమునే వాడెనని తెలియ వలయును.

# కారక పరిచ్ఛేదము

**సూ. కారకంబులారు గర్మాదులు.** ౧

అవి యాఱు—కర్మకారకము, కర్తృకారకము, కరణకారకము, సంప్రదానకారకము, అపాదానకారకము, అధికరణకారకము. క్రియాన్వయమును గలిగించునది – అనఁగాఁ గ్రియాన్వయము కలది యని కారక శబ్దార్థము.

కర్మ, కర్త, మున్నగు నాఱును గారకము లనఁబడును. కారకమను పదమున కీ యాఱు మాత్రమే యర్థమని తెలియుటకై పరిగణనముఁ జేసెను.

కర్మ, కర్త మున్నగువానిని బోధించు శబ్దముల కే యే విభక్తి ప్రత్యయములు చేరునో యీ ప్రకరణమునఁ జెప్పును. కర్మాదులలోఁ జేరని యర్థమును బోధించుటచే షష్ఠీవిభక్తి కారకవిభక్తి కాఁజాలదు. అయినను షష్ఠీవిభక్తికూడ

నెచ్చటు వచ్చునో యీ ప్రకరణముననే చెప్పును. వచనములు గూడ విభక్తులకు సంబంధించినవే యగుటచే వాని విషయమును బాలవ్యాకర్త కారకపరిచ్ఛేదముననే చెప్పెను.

ఆ కారకముల నాఱింటిని వరుసగా నిర్దేశించెను.

కర్మకారకము:—ధాతువునకు అనఁగాఁ గ్రియకు రెండర్థములు సాధారణముగా నుండును, ౧. వ్యాపారము, ౨ ఫలము. "వండు" అను ధాతువును ఉదాహరణముగాఁ గైకొందము వండు అను దాతువునకు వంట యర్థము. అనగా నిప్పుచేయుట, కట్టెలెగఁదోయుట, బియ్యమన్నమగుట, మున్నగు పని యంతయు వంట యనఁబడును. ఇందులో బియ్యము అన్నముగా మెత్తబడియుబ్బుట అనునది వంటచేయుటలో ఫలము. అనఁగా ధాత్వర్థవిశేషణము ఫలమనఁబడును. అట్లన్నమగుటకు పొయ్యిపైని గిన్నెఁబెట్టుట, నిప్పుచేసిమండించుట, మున్నగునది వ్యాపారమనఁబడును. ఇట్లే ఛేదించు — అనుచోట దండాదులు రెండు ముక్కలుగా విడఁబడుటయు నందుకుఁ దగినరీతిని గత్తిఁజేతితో నెత్తి కఱ్ఱపైవేయుటయు నర్థమగును. ముక్కలగుట కత్తిని వేయుటవలననే సంభవించెను గాన ఫల మందురు. కత్తినిఁ బ్రయోగించుట వ్యాపారము. ఇట్లే ధాత్వర్థమునకు రెండంశములుండును అందు ఆ వ్యాపారమెవనియందుండునో యతఁడు కర్త యనఁబడును. ఆ ఫలము దేనియందుండునో యయ్యది కర్మ యనంబడును. వండు — అనుచోట బియ్యము విరివియగుట యన్నమునందుండును గావున నది (అన్నము) కర్మ యయ్యెను. దానికిఁ గావలసిన పని యంతయు వంటఁజేయు దేవదత్తాదులయందుండును గావున వాఁడు కర్త యనఁబడును. ఇట్లే కత్తిని ఎత్తివ్రేయుట వ్యాపారము. అది గలవాఁడు కర్త. కత్తిని ఎత్తివ్రేసినందున తెగి ముక్కలగుట యనునది కఱ్ఱయందుండును గనుక నయ్యది కర్మ యనఁబడును. కావునఁ గర్మకారకమనఁగా ధాత్వర్థఫలాశ్రయ మని భావము.

కారకములను గర్త్రాదులనక కర్మాదులని కర్మను మొదలుచేసి చెప్పుటకుఁ గారణము గలదు. విభక్తులలో ద్వితీయావిభక్తి నియతముగాఁ గర్మను బోధించును. తృతీయావిభక్తి కర్తను కరణమును గూడ బోధించును. విభక్తుల వరుసలో నియతకర్మబోధకవిభక్తి ముందుగా వచ్చుటచే దానికి సంబంధించిన కారకము నారంభించెను. ప్రథమావిభక్తికి ఒక్క కర్త గాని, ఒక్క కర్మ గాని

నియతముగా నర్థము కానందున దానినిబట్టి యారంభింపలేదు. ఆఖ్యాతము కర్మార్థకమగుచోఁ గర్మకును గర్త్రర్థకమగుచోఁ గర్తకును ప్రథమావిభక్తి వచ్చును. అందుచే నది నియతము కాదు.

కర్తృకారకము:—ధాత్వర్థవ్యాపారమున కాశ్రయమగునది కర్త యనఁబడును.

కరణకారకము:—క్రియాసిద్ధిలో మిగుల నుపకరించునది కరణము. ముఖ్యసాధనమనగా వ్యాపారవంతమగు సాధనమని తాత్పర్యము. "ఖడ్గంబుచేత ఖండింపఁబడెను." అనుచోట ఖండనమునకు ముఖ్యసాధనము ఖడ్గమగుటచే నయ్యది కరణమనఁబడును. ఖడ్గము వ్యాపారయుక్తమయిననే ఖండన సాధనమగును గావున నిది వ్యాపారవంతమగు సాధన మయ్యెను.

సంప్రదానకారకము:—ఏదో నొకవస్తువు నిచ్చునపుడు ఎవ్వనికీయఁబడునో వాఁడు సంప్రదాన మనంబడును. సంప్రదీయతే అస్మై సంప్రదానమ్ — అని వ్యుత్పత్తి. త్యాగోద్దేశ్యంబు సంప్రదానంబని బాలవ్యాకర్త వివరణము. త్యాగమనగా నిచ్చుట. దానికి నుద్దేశ్యము త్యాగోద్దేశ్యము. "రామునికొఱకుం గన్య నిచ్చెను" అనుచోట రాముఁడు త్యాగోద్దేశ్యము కావున "రామునికొఱ" కను నది సంప్రదానకారక మయ్యెను

అపాదాన కారకము:—ఒక వస్తువు విడఁబాటు చెందునపుడు దేనినుండి యా విడఁబాటు కలిగెనోయయ్యది యపాదాన మనఁబడును. రాజ్యము వలన భ్రష్టుఁడయ్యె ననుచోట రాజ్యమునుండి విడఁబాటు కల్గెను గనుక రాజ్యమనునది యపాదాన మయ్యెను. చెట్టునుండి ఆకు పడుచున్నది. అనుచోట చెట్టుతోఁ గలసియున్న ఆకు చెట్టునుండి విడువడి పడుచుండుటం జేసి చెట్టు అపాదానమయ్యెను.

బాలవ్యాకర్త యపాదానశబ్దము నుపయోగింపకయే "వలన" మున్నగు విభక్తులు విధించుటంజేసి యపాదానశబ్దార్థము నతఁడు వివరింపలేదు. బాల ప్రౌఢవ్యాకరణముల రెండిటను గూడఁ బంచమీవిభక్తి విధానమునకు అపాదాన శబ్దము నుపయోగింపనందున దాని యర్థము వివరింపనక్కఱలేదు గాని కారకములలో నపాదానకారకమని యొకదానిని ప్రౌఢవ్యాకర్త పేర్కొనుటచే దానిని వివరింపవలసివచ్చెను.

అధికరణ కారకము;—ఆధారము (ఉనికిపట్టు) అధికరణ మనఁబడును.

అట్టి యాధారము ముువ్విధములుగానుండును. ఒక వస్తువునకాధారము నంతటను వ్యాపించియుండక కొంతభాగమునసే వ్యాపించియుండెనేని యాయది యౌపశ్లేషికాధార మనఁబడును. అనఁగా నొక వస్తువుతో నేకదేశముచేఁగలయికను మాత్రము పొందియున్నదని భావము. "ఘటంబున జలం బున్నది" అను చోట ఘటమునకు లోపలిభాగమునసే జలముండును గాని పైభాగమునఁ గాని కుండపెంకుల లోపలిభాగమునఁ గాని జలము లేదు. అందుచే ఘట మౌపశ్లేషికాధార మనఁబడును. ఆసనమునం గూరుచుండెను ఆసనమునఁ గొంతభాగమే యాక్రమింపఁబడును గాని దాని ప్రతి యంశమునందును నాక్రమణ ముండదు. అందుచే నిదియు నౌపశ్లేషికాధారమే అట్లు కాక ప్రతి పరమాణువునందును బూర్ణముగా నిండియుండినచో నయ్యది—యభివ్యాపకాధార మనఁబడును. "అన్నింటియందు నీశ్వరుండు గలఁడు" అన్ని పదార్థములయందును నీశ్వరుఁడుండుట యొక్కభాగమునసే కాక లోపల, బయటఁ, బ్రతి పరమాణువునందును గలదు. 'అన్తర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణః స్థితః' అని శ్రుతి. అందుచే "అన్ని" అనునది యభివ్యాపకాధారము. కోరిక, అసూయ, కోపము, మున్నగునవి జ్ఞానవిశేషములు. అనగా నివి మనోధర్మములు. ఇవి వేనియందుఁ బ్రవర్తించునో యవి వైషయికాధారము లనఁబడును మోక్షమునందుఁ గోరిక గలదు. అనుచోట మోక్షము వైషయికాధార మనఁబడును. మోక్షము విషయమునఁ గోరిక గలదని గదా భావము.

ఇట్లు ముువ్విధములగు నాధారమును బోధించునదియు నధికరణకారక మనఁబడును.

కారకములను వివరించుట కొఱకా యా కారకార్థములందు విభక్తులను విధించుటకని తెలియవలయును. కాని బాలవ్యాకరణమునఁ గాని ప్రౌఢవ్యాకరణమునఁ గాని యొక్క కారకార్థములందే విభక్తులు విధింపఁబడలేదు. అనేకములగు నితరార్థములందును విభక్తులు విధింపఁబడెను. ప్రాతిపదిక, హేతు, భయాద్యనేకార్థములను సంబంధించి విభక్తులు విధింపఁబడెను. ప్రౌఢవ్యాకరణమునఁ గర్మ కర్త్రాది శబ్దములతో విభక్తులను విధింపనేలేదు ఉద్దేశార్థమునందు, హేతువునందు, ఇత్యాదిరీతిగా నా యా నిమిత్తములను జెప్పి విభక్తులను విధించెను. మఱికొన్నిటిని బాలవ్యాకర్త చెప్పిన ప్రత్యయముల స్థానమున విధించెను. ఇట్లు కారకములకు మాత్రమే విభక్తులను విధింపక హేత్వాదులకును విభక్తులకుమ విధించుటచే నీ ప్రకరణమునకుఁ "కారక పరిచ్ఛేదము" అను

నామము ఛత్రిన్యాయమున బాలవ్యాకర్త యుపయోగింపగా దాని ననుసరించి ప్రౌఢవ్యాకర్తయు నుపయోగించెను అనఁగా గొంతమంది గొడుగులువేసి-ని వెళ్ళుచుండగా వారిలోఁ గొంతమంది గొడుగులు లేనివారు కూడ నున్నను ఆ జనుల సంఘము నంతను ''ఛత్రిణో గచ్ఛన్తి'' గొడుగులవారు వెళ్ళుచున్నారు. అని యందఱను ఛత్రములు గలవారని వ్యవహరించినట్లు ఇందు కారక విభక్తులను గూర్చియు నితర విభక్తులను గూర్చియుఁ గూడ విధానముచేయుచున్నను గారక పరిచ్ఛేదమని వ్యవహరింపఁబడెనని తెలియవలయును. సంస్కృతమున నీ ప్రకరణమునకు విభక్త్యర్థప్రకరణమని వాడుక గలదు. అయ్యదియ యుచితముగాఁ గన్పట్టుచున్నది.

సూ ఉద్దేశార్థమునందు ద్వితీయకు గుఱించియు నను ప్రయుక్తం బగు. ౨

ఉ. క. 'మముగుఱిచినామగోత్రక్రమమున మీారర్చసేయఁగా' హరి. పూ. ౨౮. ౬౧. సముచ్చయగ్రహణము కూర్చి జ్ఞాపనార్థము.

ఉద్దేశార్థమునందు అనగా ''ఉద్దేశించి'' అను నర్థమునందు ద్వితీయా విభక్తి యగు నువర్ణకమునకు వెనువెంటనే ''గుఱిచి'' యను పదము ప్రయోగింపఁబడునని భావము. బాలవ్యాకరణమున వివరింపఁబడిన ద్వితీయాప్రత్యయము నువర్ణకమే కావున ఆ నువర్ణకమునకు మాత్రమే ఇది యనుప్రయుక్తంబగును. చింతామణిలో ''కూర్చి'' ద్వితీయాప్రత్యయమే యని చెప్పఁబడెను. ''మము గుఱిచి...'' ఇందు ''గుఱిచి'' అనునది ''మమున్'' అను ద్వితీయాంతమున కను ప్రయుక్త మయ్యెను.

ఆలోచింపగా నీయది కూర్చు ధాతుక్త్వార్థక రూపమగు ''కూర్చి'' అను దాని రూపాంతరమే యనియు నట్లయినచో నీ ద్వితీయార్థము కూర్చు ధాత్వర్థముననే కర్మయగుననియు విధానాంతర మావశ్యకము కాదనియు భావింప వచ్చును. కనుకనే కర్మ ప్రవచనీయార్థమున నీ ప్రత్యయమును జింతామణి విధించెను. కర్మ ప్రవచనీయ యోగస్థలమునఁ గర్మ ప్రవచనీయ సంజ్ఞకము వేరొక ధాత్వర్థమునే సూచించును. ''జప మనుప్రావర్షత్'' అనుచోట ''అను'' అను కర్మప్రవచనీయమునకు ''అనుసృత్య'' యని యర్థ ముపలబ్ధ మగును. అనగా నయ్యదియు నొక క్త్వాంతార్థకమే యని తేలినది. ఇట్టిచోట్ల నహోబలపతి ''జపముంగూర్చి – వర్షను'' అని యుదాహరించుట సరికాదు అట్టి ప్రయోగ

మాంధ్రభాషకు సహజముకాదు. ఎచ్చటను నట్టి ప్రయోగము లుండఁజాలవు. ''వర్షముంగూర్చి జపము'' అని యుండవచ్చును. ''వర్ష ముద్దిశ్య జపః'' అని యుండును. ఇట్లు దీని నుద్దేశార్థక క్త్వార్థకక్రియ యనుకొనుటయే యుచితము. ఇట్టియుద్దేశముననే బాలవ్యాకర్త దీని నొకప్రత్యయముగా గ్రహింపలేదు. ఈ ''గుఱించి'' యనునది కకారాది యనియు సరళాదేశమున గకారాది యయ్యె ననియుఁ దలంపవలసియుండగాఁ బ్రౌఢవ్యాకర్త సహజ సరళాదిపదమనితలంచి వెనుకనున్న ద్వితీయా నువర్ణకమునకు లోపముచేయుట సరికాదు. కనుకనే యిందలి ''ఇకారము'' లోపించి కూర్చి అను రూపముః జెందెను. కూర్చి అను దానిని మాత్రము పరుషముతోడనే యుదాహరించెను. కూర్చి యనునది పరు షాదియని భావించి ''గుఱించి'' అనునది మాత్రము సరళాది యనుట యనుచి తము. అలఘురేఫము లుప్తాచ్కమగుటచే (చూ. ము క్త 2సూ) లఘురేఫముగా మారుటయు దీని యైక్యమును సూచించుచున్నది ఇయ్యది శబ్దరత్నాకరమునను ''గుఱించి''అనియే యున్నది. సంస్కృతమున ''గ్రామం జగామ''అనియుండగాఁ దెనుఁగున ''గ్రామమును వెళ్లెను''అని యుండనందునను నిట్టిచోట్ల గ్రామముం గూర్చి వెడలెను అని యుండుటచేతను ద్వితీయాప్రత్యయార్థమునే గూర్చి సహితమయి తెనుఁగున ''ను'' ప్రత్యయము సూచించుచున్నదని మనవారు తలం చిరి. కాని సంస్కృతమునఁగల గమనార్థక ధాతువులన్నియుఁ బ్రాప్త్యర్థకములు. తెనుఁగున గమనార్థకములు వేరు. ప్రాప్త్యర్థకములు వేరు. సంస్కృతమునఁ బ్రాప్త్యర్థకమగుటచే "గ్రామంజగామ" అనుచోట ''గ్రామము'' కర్మయయ్యెను. తెనుఁగున ''వెడలెను'' అనునది ప్రాప్త్యర్థకము కాదు ప్రాప్త్యర్థకమేయయినచో ''కూర్చి'' అక్కరలేకయే కేవల నువర్ణకముతోడనే ప్రయోగముండును. గ్రామ ముం బొందెను, గ్రామముంజేరెను మున్నగునవి కానవచ్చుచునేయున్నవి కదా! ఇట్టిచోట్ల ''గుఱిచి'' ప్రయోగింపనక్కరలేదుగదా! ప్రయోగించినచో నసన్వితమై వాక్యము దుష్టము కూడ కావలసివచ్చును. సంస్కృతమునఁగూడ గమనార్థకములయినచో ''నుద్దిశ్య'' అనునది ప్రయోగించినను వాక్యము సరిప డును. ''గ్రామ ముద్దిశ్య జగామ''అని యుండును — కాని కేవలము ప్రాప్త్యర్థక ధాతువును ప్రయోగించినచో గ్రామమును బొందెను అన్నట్లే "గ్రామం ప్రాప" అనియే యుండునుగాని గ్రామ ముద్దిశ్య ప్రాప యని యుండదుగదా! ఇట్టి యర్థభేదమును గమనించినచో గుఱించి యను పదప్రయోగమునకుఁ బ్రత్యేక విధాన మక్కరలేదనియే తెలియును.

ఈయది ద్వితీయకు అవ్యవహితముగానే యుండునన్న నియమము కూడ లేదు. అవదారణాద్యర్థకమగు శబ్దములు నుప్రత్యయమునకును, దీనికిని మధ్యనుండుటయుఁ గలదు. సుబోధినిలో "నిన్నకూర్చి..."అని చూపిన భారతోదాహరణ మట్టిదియే. ఇందలి మూడవ సూత్రము ఈ విషయమునే బోధించుచున్నది.

సూ. అయ్యది వ్యవహితంబు నగు. 3

ఉ. సీ. అజ్ఞాసనుఁడు తన్ను నర్థితో గుఱిచి యజించుట గోరి సృజించె సురల. హరి. పూ. ౨ ఆ. ౯౮.

ఆ "గుఱిచి"యను పదము ద్వితీయాంత పదమునకు వెను వెంటనే యుండక వేరొక పదము మధ్యనుండుటచే దూరముగా నుండుటయుఁ గలదని భావము. వ్యవహితంబు = వ్యవధానము గలది.

ఉదాహరణమున "తన్నున్"అను ద్వితీయాంతమునకును "గుఱిచి" యనుదానికిని "అర్థితో" అనుమాట యడ్డముగా నుండుటచే వ్యవధానము గల్గెను.

సూ. కొన్నియెడలఁ జేత విభక్త్యర్థకవర్ణకంబులకును వలన వర్ణకంబునకును దఱచుగఁ జేసి యనుప్రయుక్తం బగు. ౪

ఉ. ఏకవిప్ర సంబోధనఁజేసి ; భా. ఆది ౧ ఆ. ౧౨౪. అభీష్టవరంబులిచ్చుటంజేసి ౨౪; . ౨ఆ. అసహ్యవిషోగ్ర ధూమకేతనహతిఁజేసి ; ఆది. ౧ఆ. ౧౨౩. బహువేదఘోషములఁజేసి. భార. అర. ౧ఆ. ౧౧. సంప్రయోగమునఁజేసి. 'దీననుజేసి'. భార. సభా. ౧ఆ. ౫౪. 'తే. ఇందఱును నిన్నిభంగుల నిడుమపడువ, వలసె ధర్మతనూభవు వలనఁజేసి.' భార. విరా. ౨ఆ. ౨౨౫ 'తఱచుగ ననుటచే నొకానొకచో నేకవచనంబున నుకారంబుమీఁది ద్వితీయయుఁ దృతీయా విభక్త్యర్థక మయ్యెడునని తెలియవలయు. ఈ యర్థమునకు "ఇతరత్రచ ద్వితీయా" అను స్థానినియమశూన్యవిధియు నవకాశమిచ్చుచున్నది. ఉ॥ ఎ-గీ. తండ్రి, పనుపుఁజేసి ముదిమిగొని జవ్వనంబిచ్చెఁ బూరుడను

సుతుండు భూరియశుఁడు". భార. ఆది. 3ఆ. ౬౫. సీ. వెలిఁబెట్టిరే బాడబులు పరాశరుఁబట్టి దాసకన్యాకేళి తప్పుఁజేసి. స్వా. ౨ఆ. ౭3. మొ. ఇట్లనుటచే 'నివ్విధము నానవముల్ గలవార'. (నిర్వ.౮.ఆ.౧౭.) అను నిట్టి ప్రయోగములును నిర్దోషము లగుచున్నవి.

చేత విభక్త్యర్థక వర్ణకంబులకును = "చేత"అను విభక్తియొక్క యర్థమున విధింపబడిన ప్రత్యయములకును, "అపాయభయే"త్యాద్యవ్యాకరణ సూత్రములచే విధింపబడిన వలన వర్ణకమునకును "చేసి"అను పదము తఱచుగా నను ప్రయుక్తమగుచుండును.

"ఏకవిప్ర. . జేసి" — "జడంబుతృతీయా..."బాల. కార. ౨౨. సూత్రముచే "చేత" స్థానమున ద్వితీయవచ్చి చేసి యనుప్రయుక్తమయ్యెను. ఇచ్చుటంజేసి, హతిఁజేసి, ఘోషములంజేసి... అనునవియు నిట్టివే. సంప్రయోగమునఁజేసి, ఇచట "నుదంతజడంబు తృతీయకు..."అను బాల. కార ౨౩ సూ॥చే చేతకు బదులుగా వచ్చిన నవర్ణకము. దీనికినిఁ జేసి యనుప్రయుక్తమయ్యెను.

దీననుజేసి — ఇచట శబ్ద-౬౨ సూ॥చే చేత విభక్త్యర్థమున దీనను అని రూపము సిద్ధింపగాఁ జేసి యనుప్రయుక్తమయ్యెను.

తనూభవు వలనఁజేసి. ఇది "వలన"అను పంచమీ ప్రత్యయమునకుఁ జేసి యనుప్రయుక్తమగుట కుదాహరణము.

"జడంబు తృతీయాసప్తముల"అను సూత్రముచే విధింపబడిన తృతీయ ఉకారాంతములకు బహుత్వముననే వచ్చును గాని యేకత్వమున రాదని బాలవ్యాకర్త "బాహుళకంబుచే నిక్కార్యం బుదంతంబునకు బహుత్వమునం దేయగు" నని చెప్పెను. అట్లు చెప్పినను ఉకారాంతముల ద్వితీయైక వచనముకూడఁ జేత విభక్త్యర్థకమే యనియు నందుచే దానికినిఁ జేసి యనుప్రయుక్తమగుననియు నీ యర్థము సూత్రములోని తఱచుగా అను బహుళార్థక శబ్దమువలన సిద్ధించునని యు వివరింపబడెను. ఈద్వితీయ తృతీయా స్థానముననే వచ్చెననుటకు చింతామణి సూత్రము కూడ సహాయపడుచున్నదట.

చింతామణిలో "ఇతరత్ర చ ద్వితీయా"అని యేదియో యొక విభక్తి నిర్దేశించి దాని స్థానమున వచ్చునని స్థానమును నియమింపకయే అన్ని విభక్తుల స్థానమునను ద్వితీయను విధించుటచేతను తృతీయైకవచన స్థానమునం గూడ

ద్వితీయ రావచ్చునని యూహించుటకవకాశము గలదు. అనగా బాలవ్యాకరణముచే రాకున్నను నిందలి ''తఱచుగా''అను పదమువలనను చింతామణిలోని ''ఇతరత్రచద్వితీయా'' అను సూత్రముచేతను ''ఉ''కారాంత ద్వితీయైకవచనములు గూడ చేత విభక్త్యర్థకములే యగుననియు నందుచే వానికినిఁజేసి యను ప్రయుక్తమగుననియుఁ దాత్పర్యము

తండ్రి పనుపుఁజేసి... ఇట ''పనుపు'' అనునది ఉకారాంతమయినను నేకత్వముననే ద్వితీయ తృతీయార్థకమగుటచేతఁ ''జేసి'' అనునది చేరెను. వెలిబెట్టిరే . తప్పుఁజేసి... ఇదియు నట్లే చేత విభక్త్యర్థక ద్వితీయాంతము. ఈ రెండును ''తఱచుగా''ననుటచే సాధువులగుచున్నవని తాత్పర్యము. ఇట్లు ఉకారాంత ద్వితీయైకవచనము గూడ చేత విభక్త్యర్థకమనుటచే నివ్విధము నాననముల్... అనుచోట ''ఇవ్విధమును'' అనునదియుఁ జేత విభక్త్యర్థక ద్వితీయాంతమే యని గ్రహింపవలయునని భావము. ఇవ్విధమును = ఇవ్విధమునన్. ఇవ్విధమున నాననముల్ గలవారు అని యర్థము.

''ఇవ్విధము'' అనునది ఆననములు అనుదానికి విశేషణమనియు, ఇవ్విధము + ఆననములు. అనుచోట నకారము వచ్చుట అశాస్త్రీయమనియుఁ గొందరు తలంతురు. ఉదంతమగు తద్ధర్మార్థక విశేషణమునకు మాత్రమే అచ్చు పరమగునపుడు నుగాగమము వచ్చును. ఇది తద్ధర్మార్థక విశేషణము కానందున నుగామము రాదు విశేషణ మువర్ణకమగుటచే పుంపులును రావలసియున్నది. అపుడు బాల. సంధి. ౨౮ సూ॥ టుగాగమము వచ్చి ''ఇవ్విధపుటాననములు'' అని కావలసియున్నది. అందుచే నియ్యది అసాధువని కొందరు తలంపవచ్చును. అట్లు తలంపరాదనియు ''ఇవ్విధమున్'' అనునది ఇవ్విధమునన్ అనురీతిని దృతీయార్థక ద్వితీయాంతమగుటచే సాధువే యనియుఁ దలంపవలయునని ప్రౌఢవ్యాకర్త యాశయము.

సూ. అయ్యది యొక్కచోఁ బెక్కుచోట్ల కొక్కటియ చాలెడి. ౫౫

ఉ. సీ. నలరాజు సచివుల వసువ్రన బెడఁగగు కర్కశ స్తనములఁ గరము వాఁడి, చూడ్కుల నతిరాగ సురుచిరాధరముల మదవిలాసాల సమందగతుల, వస్త్రాల కంబుల పలుఁదపిఱుందుల దర్పగద్గద భాషితములఁజేసి; భార ఆది. ౮ఆ. ౭౮. (ఇటఁ జేత విభక్త్యర్థక 'ఉ'వర్ణకము పై నెల్లెడల నుండవలసిన చేసి యొక్క చోటనే యున్నది.)

ఆ "చేసి" శబ్దము వెనుకటి సూత్రముచేఁ బలుచోట్ల రాదగియున్నను నొక్కచోటనే ప్రయోగించినఁ జాలును. కావున కొన్ని స్థలములం దొక్క చోటనే "చేసి" యనునది ప్రయోగింపఁబడునని భావము.

వలరాజు సచివుల...। ఇందు స్తనములన్, చూడ్కులన్, మున్నగు ద్వితీయాంతములు చేత విభక్త్యర్థముననే ప్రయోగింపఁబడెను. వీనిలో "భాషితములన్" అను ద్వితీయాంతమునకే "చేసి"అనుప్రయుక్తమయ్యెను. మిగిలినచోట్ల "చేసి" ప్రయోగింపఁబడలేదు

పూర్వ సూత్రము ఎల్లచోట్లను "చేసి" నిత్యముగావచ్చునని విధింపలేదు. కొన్నియెడల మాత్రమే వచ్చునని చెప్పెను. అందుచేఁ గొన్నిచోట్ల వచ్చుటయుఁ గొన్నిచోట్ల రాకుండుటయు వెనుకటి సూత్రముచేతనే సిద్ధించును. అయినను స్పష్టముగా తెలియుటకు మాత్రమే మరల నీ సూత్రము చెప్పఁబడెను. "చేసి" అను పద మనుప్రయుక్తమయినను గాకున్నను అర్థము ఒక్కటేగదా! తృతీయార్థము వచ్చుటలో మార్పేమియు నుండదుగదా! అట్లయినను చేసి యను పదము లేని స్థలములందు కూడ దానిని చేర్చుకొని యర్థమును సంపాదింపవలసిన పనియేమున్నది? అందుచే చేసి అనునది మిగిలినచోట్లఁ గూడ నుండవలసిన యావశ్యకత లేదు. ఉన్నచో నుండవచ్చును. అర్థమున కేమియు భేదమురాదు. అన్నిచోట్లను నొక్కతీరున విభక్తి యున్నచోఁ బద్యమున "సమత"యను కావ్యగుణము ఉండును. అట్టి గుణ లాభమునకై ఎల్లయెడల "చేసి" యున్నదని భావించుట సరసముగాఁ గన్పట్టుచు.

## సూ. ఒకానొకచోఁ దోడకుఁ బ్రత్యేకప్రయోగఁబునుం జూపట్టెడి

ఉ. తే. 'స్తంభగత రత్నపుత్రిక తనదుబోఁటి, యని విలోకించి తోడ మాటాడకునికి, నలుగడలు చూచి తెలిసి యచ్చెలువ బెదరి, వెడల నుంకింపఁ జేదమ్మిరయొడిసిపట్టె; (తోడన్=తనతోడ.) రామా. ౪. ఆ. ౧౫౮.

"తోడ" అనునది బాలవ్యాకరణమున తృతీయావిభక్తి ప్రత్యయము గదా! అట్లయినచోఁ బ్రకృతితో కూడియే యుండును గాని వేరుగా నుండుట కవకాశములేదు. అయినను నీ "తోడ" అనునది ప్రత్యేకముగా అనగా స్వతంత్రముగనే ప్రయోగింపఁ బడుటయు కానవచ్చుచున్నదని తెలుపుచున్నాడు.

స్తంభగత...। ఇట తోడ అనునది ప్రత్యేకముగనే యున్నదిగాని యొక ప్రాతిపదికమునకుఁ జేరియుండలేదు. ఇచ్చట "తోడ"అనగా తనతోడనని యర్థమని సందర్భమునుబట్టి తెలిసికొనవలయునని (తోడన్ = తనతోడఅని) వివరణమున సూచించెను. అందు ఉనునది ప్రత్యయముగను వేరుగాను కూడ ప్రయోగింపఁబడును. అట్లే ఇదియు వేరుగా కూడ ప్రయోగింపఁబడుచున్నది. అయినను దానికిని దీనికినిఁ జాల భేదము గలదు. "అందు" అనుదానికి విభక్తులు గూడ చేరి అందులకు, అందువలన, అనియుఁ బ్రయోగములు గలవు. తోడకు మాత్ర మట్లు విభక్తులు చేరవు. అందు అనునది వేరొక ప్రాతిపదికమగుటయు "తోడ" అనునది ధాతురూపమగుటయు అట్టి భేదమునకుఁ గారణము కానోపును. తోటి యల్లుఁడు, తోటికోడలు మున్నగుచోట్ల నియ్యది యాపవిభక్తికముగాఁ గానవచ్చుచున్నది. తెనుగునఁ జాల ప్రత్యయములు ఇట్లు ప్రత్యేక ప్రయోగములందు కానవచ్చుచుండును.

సూ. కొన్నియెడల ను శబ్దప్రయోగంబునం దోడకు లోపంబును వ్యవహితత్వంబును బహుత్వంబునం గాన-బడియెడి. ౭

ఉ. ఏ-గీ. అతనికిఁ బరలోక, విధుల శాస్త్రదృష్టి వెలయఁజేసె, నాపగాతనూజుఁ డఖిల బాంధవులయు బ్రాహ్మణులయుఁ దోడ భానునిభుఁడు. భార. ఆది. ౮౫. ౨౧౪. 'క. నెమ్మని ధర్మజు నలువురు, దమ్ములు, దమ వస్త్రములయుఁ దమశస్త్రవరూ, ధమ్ములతోడను సకలహీ, తమ్మగఁ బాయంగవలయు దాస్యమువలనన్.' భార. సభా. ౨౫. ౨౯౧ మొ.

కొన్ని శబ్దములకు సముచ్చయార్థమున ను శబ్దము చేరుచుండును. (చూ. శబ్ద. ౧౧౬ సూ॥) అట్లు ను శబ్దము చేరునపుడు ఆ శబ్దము బహుత్వమును బోధించుచుండునేని "తోడ"అను ప్రత్యయము వికల్పముగా లోపించును. అట్లు "తోడ"కు లోపము రానిపక్షమున సముచ్చయార్థక ను శబ్దము ప్రకృతికిని తోడకును మధ్యగా చేరియుండి వ్యవధానము కలుగుచుండును. అట్లు వ్యవధానము వచ్చుటయు బహుత్వమునందే యగును. "కొన్నియెడల"నని చెప్పుటచే "నీ కార్యములు వైకల్పికములు"అను నర్థము లభించుచున్నది.

ఇందు వికల్పమని చెప్పకపోయినచో సూత్రపూర్వవాక్యము విధించుచున్న తోడ లోపము నిత్యము కావలసివచ్చును. అట్లయినచో బ్రాహ్మణులయుఁ దోడ ననునది యసాధు వనవలసివచ్చును అట్లే వ్యవధానము గూడ వైకల్పికమే. కాదేని "శస్త్రవరూథమ్ములతోడను" అనునది సిద్ధింపదు.

అతనికి ...। ఇచ్చట "బాంధవుల = తోడనున్"అని యుండవలసి యుండగాఁ దోడ లోపించి "బాంధవులయు"నని యున్నది. బ్రాహ్మణులయుఁదోడ అనుచోట "తోడ"అను ప్రత్యయమునకు మధ్యభాగమున "ను" శబ్దము చేరుటచే వ్యవధానము సంభవించెను ఈ రెండు స్థలములును బహుత్వమునే బోధించును. వీనియందు గల "ను"శబ్దమునకు యువర్ణము పూర్వభాగమునఁ జేరెను. (చూ. శబ్ద. ౧౧౬ సూ॥)

"నెమ్మిని ధర్మజు ..।" ఇచ్చటను "తమ వస్త్రములతోడనున్" అని యుండగా తోడ లోపించి "తమ వస్త్రములయు"అని యయ్యెను. "తమ శస్త్రవరూథమ్ములతోడను" అనుచోట వ్యవధానము గాని తోడకు లోపము గాని రాలేదు. ఇట "ను"శబ్దము పదమునకంతముననే చేరెను. శస్త్రవరూథమ్ముల తోడన్ + ను. స్థిరము పరమగుటచే ద్రుతమునకు లోపము శస్త్రవరూథమ్ముల తోడ + ను = శస్త్రవరూథమ్ములతోడను. సందర్భమునుబట్టి యిదియు సముచ్చయ యుక్తమేయని తలంచుట యుచితము.

తోడ అను శబ్దమునకు లోపము "ను"శబ్ద ప్రయోగములేని తావులందును గలదని చెప్పి అధికుల హీనులతోడనైనఁ గొంగా దధిపా. యని యుదాహరణమును కుమారదేవ పండితీయము చూపెను.

ను శబ్ద ప్రయోగమునఁ దోడకు లోపమువచ్చు సందర్భమునఁ బ్రక్రియ గమనింపదగియున్నది. బాంధవులతోఁడన్ + ను అని గదా మొదట యుండవలయును. అప్పుడు తోడకు లోపమువచ్చి "ను"శబ్దము యువర్ణపూర్వకముకాగా "బాంధవులయును"అని యగును ఇట్లు గాక బాంధవుల + ను + తోడ అని యుండగా నీతోడకు లోపము వచ్చెనన్నను బాంధవులయును అని యగును. కాని ఇట్లు ను శబ్దమును తోడకు పూర్వమునఁజేర్చి తరువాత తోడకు లోపము చేయవలయునన్నచో సూత్రోత్తరార్ధ విహితమగు వ్యవహితత్వమును ముందుగా వినియోగించుకొనవలయును. కానిచో నట్టి మధ్యస్థితి "ను"శబ్దమునకు రాజాలదు. కాని యీ ప్రక్రియ సరియయినదికాదు. ఇందు సూత్రోత్తరార్ధ విహిత కార్యము పూర్వార్ధకార్యముకంటె ముందుగా వచ్చుటయుఁ బిమ్మట పూర్వార్ధ

కార్యము వచ్చుటయు ననునది బాగుగా లేదు. అంతియగాక యెట్లును రూప మొకేరీతిని సిద్ధించుచుండగా వ్యవహితత్వమును వినియోగించుకొనుట ప్రక్రియా గౌరవ మగును. అందుచే ను శబ్దము పరముగా నుండునపుడు తోడకు లోప మ్మును చెప్పుటయే యుచితమగు ప్రక్రియగాఁ దెలిసికొనఁదగినది.

సూ. ఒకానొకచోఁ దోడకుఁ దోడుత నని రూపాంతరంబునుగలదు. అయినను దానికివలె దీని కితర కార్యంబు గలుగదు. ౭

ఉ. 'చ. పగతురచేతిలోఁబడక ప్రాణముతోడుత నున్నవాఁడవే?' భాగ. ౧౦. స్కం. పూ. ౧౭౫౬ మొ.

ఒక్కొకచోట "తోడ"అను తృతీయాప్రత్యయమునకు బదులు "తోడుత" అను శబ్దము వాడబడుచున్నదనియు నయినను "తోడ" అనుదానికి వెనుకటి ౬, ౭ సూత్రములచే విధింపబడిన ప్రత్యేక ప్రయోగము గాని, లోపము గాని, ను శబ్ద వ్యవధానము గాని "తోడుత" అనుదానికి రావని తాత్పర్యము.

ఉదా॥ పగతుర...। "ప్రాణముతోడన్" అనుటకు మారుగా "ప్రాణముతోడుతన్"అని ప్రయోగింపఁబడెను.

సూ. చతుర్థికిఁ బొంటె వర్ణకంబు నగు. ౮

ఉ. 'క. అనఘుల శాస్త్రవిధిజ్ఞుల, ననురక్తులఁ బితృపితామహ క్రమమున వచ్చిన విప్రుల మంత్రులఁగా, నొనరించితె కార్య సంప్రయోగము పొంటెన్?' భార. సభా.౧ ఆ.౨౬. పక్షమునఁ గార్య సంప్రయోగము కొఱకు మొ.

చతుర్థీప్రత్యయమగు కొఱకు, అనుదాని స్థానమున "పొం"టె అనునది వికల్పముగా వచ్చునని భావము. అనగా చతుర్థీవిభక్తి ప్రత్యయముల యర్థ మునే యియ్యది బోధించుననియుఁ దాత్పర్యము. "అనఘుల...।"కార్యసంప్రయోగముకొఱకు అనుటకు బదులుగా "కార్యసంప్రయోగము పొంటెన్" అని ప్రయోగింపఁబడెను. పొంటె వర్ణకము గూడ ద్రుతాంతముగనే విధింపఁబడెనని తెలియనగును. ఇది వైకల్పికమగుటచే "కార్యసంప్రయోగముకొఱకు" ననియు నుండునని వివరించెను.

౨వ. సూత్రము మొదలుకొని యింతవరకును బాలవ్యాకరణమునఁ జెప్పఁబడని నూతన విషయములను జెప్పెను.

సూ. ఉండిపదంబు పరంబగుచో వలన కుండు నవర్ణకమట్లు నవర్ణకంబు నగు. ౧౦

ఉ. 'క...సనత్కుమారుఁడు మహీశ్వరుఁ, జనుదెంచె బ్రహ్మలోకంబున నుండి.' భాగ. ఆది 3 ఆ.౯౧ పొ.

బాలవ్యాకరణమున "ఉండి" పదము వలన కనుప్రయుక్తమగునని చెప్పి (చూ. బాల. కార. ౧౦సూ) ఉండి శబ్దము పరమగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగా నగునని (కార ౧౧సూ) విధించి వనమునుండి, వనమునందుండి మున్నగు నుదాహరణము లీయఁబడెను. సప్తమీవిభక్తిని సామాన్యముగా విధించినను "వనమున నుండి" అనురీతిని "న"అను సప్తమీ ప్రత్యయముతోనున్న రూపమును అందుదాహరింపలేదు. అందుచే నవర్ణకము "వలన" కాదేశముగా రాదేమో యను సందేహము తీర్చుటకయి యీ సూత్రము నవర్ణకము కూడ వలనకు బదులుగా వచ్చునని తెలియఁజేయుచున్నది.

ఉ॥ "సనత్కుమారుఁడు..." బ్రహ్మలోకంబు వలన నుండి అనియుండగా వలనకు నవర్ణకమురాగా బ్రహ్మలోకంబుననుండి అని యయ్యెనని భావము ఈయాదేశము వికల్పము గనుక రూపాంతరములు నుండును. (లోకంబందుండి, లోకంబందునుండి, లోకంబువలన నుండి, లోకంబు నుండి.)

ఈ సూత్రము బాలవ్యాకరణ సూత్రార్థమునే వివరించుటంజేసి స్పష్టార్థమగును.

**సూ. వలన కాదేశం బగు ద్వితీయాసప్తములమీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు. ౧౧**

ఉ. ద్వితీయమీఁది యుండికి—'క. విచ్చేయు మదితిగర్భమ్మున, జెచ్చెర వెలువడు మహాత్మ!' భాగ.౮ స్కం.౫౦౮. పొ. సప్తమి మీఁది యుండికి—'ఆ. రక్తంబు, వదనగహ్వరమున వెలువడి వాలి.' భాగ.౧౦ స్కం. పూ.౧౩౬౩. 'సీ. ఉడుపథంబునఁజాలు నుడుప ప్రతతిభాతి మెడహారముల పెనపుడమిఁ దాఁక.' పాండు.౫ ఆ.౨౬౭. 'నూతిలో, వెలువడఁ గోమలిం దిగిచె.' భార. ఆది.3 ఆ.౧౭౭. 'క. నలుఁ దొల్లి యాక్రమించిన, కలి కర్కోటక విషంబు గ్రక్కుచు

నొడలన్, వెలువడి' భార. అర.౨ ఆ.౧౭౮. 'ఉ. హెచ్చిన సంభ్రమంబున ననేకులు బ్రద్దల వార లెక్కడన్, వచ్చిరొ యోఁది రా కొలువువారి.' కళా.౨ ఆ.౭౦ మొ. (గర్భమున్=గర్భమునుండి, ఎక్కడన్=ఎక్కడనుండి. ఇట్లింతట నూహ్యములు.) బహుళగ్రహణముచే నందుమీఁది యుండికి లోపంబు కలుగదని యెఱుంగునది. ఈ సూత్రము నిట్లు చెప్పుటకు నంద్వితర సప్తమ్యర్థక వర్ణకంబుల మీఁది యుండికి లోపంబువచ్చుట ప్రయోజనంబు.

ఉండి పదము పరమగునపుడు వలనకు ద్వితీయా సప్తమీ ప్రత్యయములాదేశముగా (బాల. కార ౧౧ సూ) చెప్పఁబడినవి. అట్టి యాదేశములు వచ్చినప్పుడు పరముగా నున్న "ఉండి" పదము లోపించుటయుఁ గలదని చెప్పుచున్నాఁడు.

ఈ లోపము బహుళమనుటచేఁ బ్రయోగానుసరణ మపేక్షితము. ఉ॥ "విచ్చేయు..." గర్భమునుండి యని ద్వితీయమీఁద "నుండి" లోపించెను. "రక్తంబు..." గహ్వరమున నుండి యని నవర్ణకముపైనున్న యుండికి లోపము వచ్చెను (నవర్ణకము పూర్వ సూత్రముచే వచ్చెను) "ఉడుపథంబున .." ఇందును నవర్ణకమునకుఁ బరమగు "ఉండి"శబ్దము లోపించెను. ఉడుపథంబున నుండి యని యర్థము.

"నూతిలో వెలువడ..." ఇందు "నూతిలో" ననుచోట "లో నుండి" అని యుండఁగా "నుండి"కి లోపమువచ్చెనని యభిప్రాయము. కాని తెనుఁగు వ్యాకరణములలో "లోన్"అనునది సప్తమీ ప్రత్యయము కాదు. షష్ఠీ ప్రత్యయము. అందుచే దీనిమీఁద నుండికిఁ బ్రాప్తియుఁ గానరాదు. కావున నియ్యది యుదాహరణ యోగ్యము కాదు. కాని "లోపల"ననునది సప్తమీ ప్రత్యయముగాఁ గూడఁ బ్రయోగములందుఁ గానవచ్చుచున్నది. కాని యిది సప్తమీ ప్రత్యయమగుట నీతఁడు విధింపకపోవుట లోపమనవలసియున్నది.

సంస్కృతమున "గవాంగోషువా కృష్ణా బహుక్షీరా" మున్నగు రీతిని నిర్ధారణమున షష్ఠీ సప్తమీ విభక్తులు రెండును వచ్చును. తెనుఁగున నిర్ధారణమున సప్తమీవిభక్తి మాత్రమే న్యాయముగా వచ్చుచున్నది. లోపల అనునది షష్ఠీప్రత్యయమనియు నయ్యది నిర్ధారణముననే వచ్చుననియుఁ జింతామణి "లోపల నిర్ధారణోద్భవా షష్ఠీ"అనుసూత్రముచేతఁ జెప్పియున్నది. ఆసూత్రము

ననుసరించుచుఁ దరువాతి యాంధ్రవైయాకరణులు గూడ "లోపల" ననునది షష్ఠి యని వచించిరి ఆలోచింపఁగాఁ దెనుఁగున నిర్ధారణావధికి సప్తమీవిభక్తి యొక్కటియె వచ్చుననియు "లోపల"ననునది కూడ సప్తమీ ప్రత్యయమే యనియుఁ జెప్పుట యుచితము. "లోపల"నను విభక్తి నిర్ధారణమునఁ దప్ప వేఱొక షష్ఠ్యర్థమున లేనేలేదు అట్టిచో దీనిని షష్ఠి యనుటకంటె సప్తమి యనుటయె తగియున్నది నిర్ధారణమున సంస్కృతభాషయందు షష్ఠీ సప్తములు రెండును వాడఁబడుచున్నను దెనుఁగున మాత్రము సప్తమియొక్కటియె వాడఁబడుననియు నొక్క "లోపల"నను ప్రత్యయము మాత్రమే కాక అందున్, నన్, అను సప్తమీ ప్రత్యయములు కూడ నిర్ధారణార్థమునఁ బ్రయోగింపఁబడుచున్నవనియుఁ దెలియఁదగును. కనుకనే ప్రౌఢవ్యాకర్త "లోపల"నను దానిని సప్తమి యని భ్రాంతిపడి "నూతిలో వెలువడఁ గోమలిం దిగిచె" ననుదాని నుదాహరించెను. జ్యోతిస్సులందు వర్యుఁడు రవి, భూతంబులందగ్నివరుఁడు, విద్యలఁ బ్రధాన సావిత్రి... ...అనిలచయమ్మునఁ బ్రాణము, పక్షులందు శ్యేన మధికంబు. భార అశ్వ ౨౫. ౧౬౧ ప. ఇవ్విధముగా నిర్ధారణమున "అందున్, నన్, అన్" అనునవి కూడ వాడఁబడుచున్నవి ఇంతియకాక సప్తమ్యర్థమున వచ్చిన తృతీయ కూడ నిర్ధారణార్థకమగును. ఉదా మనుజుల విప్రుండు. భార. శాంతి. ౧౫. ౭౧ప. "మనుజుల" అనుదానిని సప్తమ్యర్థమున వచ్చిన ద్వితీయ యని (చూ. కార. ౧౮ సూ.) ప్రౌఢవ్యాకర్త చెప్పుటచేత సప్తమీవిభక్తి యువచ్చుటఁ బ్రాప్తించునని యాతని యాశయమగుటచే నిర్ధారణస్థలమగు నిట్టిచోట్ల సప్తమి వచ్చునని యాతఁడు తలంచెననుటకు సందియము లేదు. కావున సప్తమీ సాదృశ్యమువలన "లోపల"ననునదియు సప్తమీ ప్రత్యయమే యని తలంచి ప్రౌఢవ్యాకర్త "నూతిలోన్ ..."అనుదాని నుదాహరించెను.

"నలుదొల్లి ...। నొడలన్" ఒడలు — అను శబ్దమౌపవిభక్తిక మగుటచే దీని సప్తమికి బాల. అచ్చికఁ ౩౮సూ॥చే "న"త్వము, వచ్చి "ఒడలన్ + ఉండి" అని కాఁగా నీసూత్రముచే "నుండి" లోపించి "ఒడలన్ వెలువడి" అని యయ్యెను. ఒడలనుండి వెలువడియె ననీ భావము. బహుళగ్రహణము వలన "ఒడలినుండి"అను ద్వితీయ మీఁది "యుండి"కి లోపము రాదని తెలియవలయును. ఇట్లే ప్రయోగములనుబట్టి యూహించుకొనవలయును.

"హెచ్చిన. . ఎక్కడన్", 'ఎక్కడనుండి''యని యర్థము. ఎక్కడ అను నది నిత్యైకవచనాంతమని శబ్ద. అది సూ॥నఁ జెప్పెను "ఎక్కడ + అందు + ఉండి". ఔపవిభక్తికమగుటచే అత్వము వచ్చి "ఎక్కడన్"అని యగును దీని మీఁద నున్న "ఉండి"కి లోపమురాగా "ఎక్కడన్"అని యయ్యెను. "ఎక్కడ నుండి వచ్చియో"అని యర్థము

సూత్రమున నెల్ల సప్తములమీఁది యుండికిని లోపము చెప్పుచున్నట్లు తోఁచుచున్నది. అయినను బహుళ గ్రహణము వలన "అందు"అను సప్తమి మీఁది యుండికి సూత్రము లోపము రాదని వ్యాకర్త వివరించెను ఇట్లనుటచే "గహ్వరమునందుండి వెడలెదవారు"అని యుండవచ్చును గాని వనన గహ్వరము నందు వచిదవార అనురీతి నుండరాదని భావము బహుళపదమును సూత్రమున జేర్చుటంజేసి "అందు"అనునది తప్ప మిగిలిన సప్తమీ ప్రత్యయములమీఁదనే అనగా "అన్" "నన్" అను ప్రత్యయములమీఁదనే యుండికి లోపము వచ్చును. "అందు"మీఁది యుండికి లోపమురాదు. ఈ సూత్రము బాలవ్యాకరణమున ననుక్తమగు విషయమును జెప్పి న్యూనతను బోఁగొట్టెను.

**సూ. కొన్నియెడల హేతువున నన్నంత క్రియలమీఁదను బట్టి వర్ణకంబు విభాష నగు. ౧౨**

**ఉ. 'తే. బ్రహ్మ పుట్టించుమనుచు నారాయణుండు, హరుఁడు హరియించు భువనంబు లవసరమున, నెట్టు సమకూరు వీరికి నీ ప్రభావ; మీవు గలుగగంఁ బట్టిగా కిందువదన !' కాశీ. 3 ఆ. ౭౭. పక్షంబునఁ గలుగటంబట్టి యెం.**

కొన్ని స్థలములందు హేత్వర్థము బోధింపఁబడునపుఁడు చదువన్, రాన్, మున్నగు నన్నంతక్రియలమీఁద "బట్టి" అను పంచమీ ప్రత్యయము వికల్పముగా వచ్చునని భావము. అన్నంతక్రియ యనగా భావలక్షణాదులలో వచ్చి నుజి ప్రత్యయమంతమునఁ గలది. అంతియకాని "అన్" అనుదానిని ఎట్టి క్రియకును విధించియుండలేదు. "నుజి" ఔత్తు గావున వెనుకను ఉకారమున్నచో నయ్యది "అ"కార మగును. చివరనున్న "ఉ"కారము లోపింపఁగా "అన్"అని యగును. ఇట్టిదానినే యిచ్చట గ్రహింపవలయును. కజి ప్రత్యయాంతక్రియను ఇట్లే వెనుకనున్న అకారముతో గూర్చి "అక ప్రత్యయాంతావ్యయంబు కళయ" యనుచోట నక ప్రత్యయమని గ్రహించెను గదా! ఇచట అన్నంత మని యున్నను

"రాన్" "పోన్" "కాన్" మున్నగునవియు గ్రహింపఁబడును. అక అను ఆకారము లేకున్నను "లేక" అనునది అక ప్రత్యయాంతములలోఁ జేర్పబడినది గదా!

ఉ. త్రిష్టా... గలుగంగఁబట్టిగా కిందుపడన. "పచట" "కన్" అనునదియు "కలుగన్" అనునదియు అన్నంతక్రియలు కన్ అను నన్నంతము సాధారణముగా నన్నంతాదులపై నను ప్రయుక్తమగుచుండును. కావున నిట "కలుగు" ధాతువునే ముఖ్యధాతువుగా గ్రహించినట్లు తోచుచున్నది కన్ అనుదానికి "పట్టి" "చేరి" "కలుగంగఁబట్టి" అని యయ్యెను ఇట కలిగియుండుటచేత అని హేత్వర్థము భాసించును. గుణక్రియలు ప్రవృత్తి నిమిత్తములుగా గల నామములకు మాత్రమే బాలవ్యాకర్త పట్టివర్ణకమును హేత్వర్థమున విధించెను (జ్ఞానముంబట్టి ముక్తుండగు, నీవు వచ్చుటంబట్టి ధన్యుండనయితిని). అన్నంతక్రియ విభక్తి ప్రత్యయములు చేరదగిన కృదంతశబ్దము కాదు ఇది యొక తుమున్నర్థకమువంటి యవ్యయము. ఇట్టిదానిపై ఏ విభక్తి ప్రత్యయములును వచ్చుట కవకాశము లేదు. అందుచే నన్నంతక్రియ మీఁద మాత్రము హేత్వర్థమునఁ బట్టి వర్ణకము చేరునని ప్రౌఢవ్యాకర్త విధింపవలసివచ్చెను.

సూత్రమునందలి "యన్నంతక్రియలమీఁదను" అనగా "అన్నంతక్రియల మీఁదఁ గూడ" అని సముచ్చయమును బోధించుచున్నది. ఇట్లనుటచే అన్నంత క్రియలకే కాక కృదంత క్రియలకును "బట్టి" వర్ణకము వచ్చునని తాత్పర్యము.

ఇయ్యది వైకల్పికము కావున "బట్టి" వర్ణక మన్నంతక్రియకు రానిపక్షమున కృదంతమునకు వచ్చును. కలుగుట అనునది కృదంతము. దీనికి "పట్టి" అనునది చేరి "కలుగుటంబట్టి" అని యుండును. అని వివరణమున—"పక్షంబునఁ గలుగుటంబట్టి యౌ." అనునది సూచించుచున్నది.

"పట్టి వర్ణకంబు హేతువులగు గుణక్రియలకగు" అని బాలవ్యాకరణకర్త సూత్రించెను. ఇందుఁ గ్రియలనగా ధాతువులని యర్థముకాదు. అసమాపక క్రియలనియుఁ దలంపరాదు. వచ్చుట, పోవుట, రాక, పోక, మున్నగు విభక్తి ప్రత్యయములు రాదగిన కృదంతములని తలంపవలయును. అందుచేఁ "గలుగంగన్" అను నన్నంతక్రియకు "పట్టి" అను విభక్తిప్రత్యయ మాసూత్రముచేఁ జేరుట కవకాశమే లేదు కావునఁ బ్రౌఢవ్యాకర్త విధింపవలసి వచ్చెను.

**సూ. షష్ఠీస్థానికంబగు కువర్ణకం బొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి. ౧౩**

ఉ. ద్వితీయకు — వేఁటకుఁ బోయిరి, పొలమున కేగెను. పక్షంబున వేఁటఁ 'బోయిరి.' భార. అర. ౬ ఆ.౧౫౮. అవ్విభుండు 'పొలమేగెను.' వి.పు.౭ ఆ.౨౬౧ మొ. ఇట నొకానొకచోఁ గొఱకు కయి వర్ణకంబులు నయ్యెడి. ఉ. 'చ అత డొకనాఁడు వేఁటకొఱకై తనునేలినవాఁడు వేడ్కతోఁ బొతముగ బైనమాటఁ గని.' భల్లా. ౩ ఆ. 'అడవికి వేఁటకై యరిగి.' పాండు ౫ ఆ.౧౪. చ. 'చిరముగ బ్రహ్మకుం దపముచేసి.' భార. ఆది.౨ ఆ.౧౩౮, 'పక్షంబున బ్రహ్మను గూర్చి తపముచేసి' మొ తృతీయకు — క. లోకోత్తర చరితుండగు, నా కావ్యతనూజ నీకు నారాధ్యను.' భార. ఆది.౩ ఆ ౧౩౫ 'అసురులకును బూజనీయులు.' హరి. పూ.౨ ఆ.౬౦ మొ. పక్షమున నీచే నారాధ్యను. మొ. 'చ. అరిమదభేది నీకు విషమాజి ముఖంబుల మార్కొనంగనో, పరుపరులెవ్వరున్ హరికిభంబులు మార్కొనునయ్య!' భార. అర.౪ ఆ.౮౮. 'అంగపతి కెదిరించెన్.' కళా.౮ ఆ ౬౫. మొ. పక్షమున నీతో మార్కొన నోపరు, హరితో మార్కొనునయ్య, అంగపతితో నెదిరించెన్. (ఇట అర్థభేదము విశేషము). పంచమికి 'క. విలువిద్యనీకు నొరు ల, గ్గలముగ లేకుండ.' భార. ఆది.౫ ఆ.౨౫. పక్షమున నీకంటె నగ్గలముగ (అగ్గలము — ఇది అన్యార్థాది గణగణ్యం బని యెఱుంగవలయును.) సప్తమికి 'కోమలి నీ కనురక్త.' భార. అర.౨ ఆ.౨౧౬. పక్షమున నీయం దనురక్త. 'శా. ఈ పాండిత్యము నీకుఁ దక్క మఱి యొందేఁ గంటిమే!' స్వా. ౨ ఆ.౬౪. పక్షమున నీయందుఁ దక్క. 'ఆ. అహివిషంబుచేత ననయంబు దగ్ధుండ, నైతినింక నాకు ననఘ! సైపు' భార. అర.౨ ఆ.౧౭౯ మొ. పక్షమున 'నా విషయమున సైపు.' చతుర్థికి నుదాహరణంబులు పూర్వ వ్యాకర్ణణంబులం జూచునది.

షష్ఠీ స్థానికంబగు = షష్ఠీవిభక్తి ప్రత్యయమయిన. కువర్ణకంబు = కు అను ప్రత్యయము.

కొన్నిచోట్ల ద్వితీయాదులగు నయిదు విభక్తులకును బదులుగా "కు" అను షష్ఠీవిభక్తిప్రత్యయము వచ్చును. అట్లు వచ్చిన కువర్ణక మేవిభక్తికిమాఱుగా వచ్చెనో యా విభక్తి బోధించు నర్థమును బోధించుచుండును.

ఉదాహరణములు : ద్వితీయకు = ద్వితీయార్థమున వచ్చిన కువర్ణమునకు. ''వేఁటను గూర్చి''అను ద్వితీయకు బదులుగా ''కు''వచ్చి వేటకుఁబోయిరి అని యయ్యెను.

''పొలమును''అను ద్వితీయకు బదులు పొలమునకేఁగెను అని షష్ఠి వచ్చెను. ఈ షష్ఠీ కువర్ణకము రానిపక్షమున ''వేటఁబోయిరి''అని ద్వితీయతో నుండును. ''పొలమునకేగెను'' అనుచోట ''కు'' రానియపుఁడు ద్వితీయాస్థానమునఁ బ్రథమవచ్చి ''పొలమేగెను''అని యయ్యెనని విష్ణుపురాణోదాహరణము తెలుపుచున్నది.

''కొన్నియెడల నుద్దేశ్యమాత్రంబున కగు''నని బాలవ్యాకరణకర్త చెప్పుటచే (చూ॥ బాలవ్యా॥ కార ౮. సూ॥వృత్తి) చతుర్థీప్రత్యయములును ఇట రావచ్చును. అప్పుడు వేటకొఱకు, వేటకై అని యుండును దీనికి ''అతడొక నాఁడు...।'' ''అడవికి వేటకై'' అనునవి వరుసగా నుదాహరణములు. (పొలము కొఱకేగెను అని యుండుట కానరాదు).

చిరముగ...। బ్రహ్మను గూర్చి అను ద్వితీయకు బదులుగా "బ్రహ్మకు" అని షష్ఠ్యంత మయ్యెను

''వేటంబోయిరి''అనుచోట ద్వితీయ వచ్చుటకు విధానము కానరాదు. ఇట ''వేట''అనునది కర్మ కాదు కనుక ''కర్మంబున ద్వితీయ యగున''ను సూత్రముచే రాదు. ద్వితీయయే రానిచో ప్రౌఢవ్యాకర్త విధించిన ''గుఱించి'' యను ప్రయుక్తమెట్లగును ? గుఱిచి యనుప్రయుక్త మగుననియే యాతడు చెప్పెనుగాని ద్వితీయను విధింపలేదు గదా! ద్వితీయఁగూడ నీతడే విధించెననుకొనినను ''గుఱి చి''యనున దిచ్చట ననుప్రయుక్తము కాలేదుగదా — అయిన ప్రౌఢవ్యాకర్త కారకము ౨సూ॥చే ఉద్దేశార్థమునఁ ద్వితీయను విధించి దానికి గుఱించి అనుప్రయుక్తమగుటను వికల్పముగా విధించెనని యూహించుకొని వేటఁబోయిరి అనుచోట ద్వితీయ వచ్చెనని తలంపవలయును.

తృతీయకు:— ''లోకో...। నీచేత''అను తృతీయాస్థానమున కువర్ణకము వచ్చెను. పక్షమున నీచే నారాధ్యము అని తృతీయ యుండును. అసురులకును...।

అసురులచేత అను తృతీయకు మాఱుగా కువర్ణకము వచ్చెను. అసురులచే నని తృతీయయు నుండును. "అరిమద భేద..."—నీతో, హరితో అను తృతీయకు బదులుగా "కు"వచ్చి నీకు, హరికి అని యయ్యెను. హరికి అనుచోట "ఇకారంబుమీఁది కునువు"అను సూత్రముచే కు–కి అని మారెను. ఇట్లే అంగపతితో అనుటకు బదులు "అంగపతికి"అని మారెను. ఇచ్చటనర్థభేద మూహింపవలయును. పంచమికి — "విలువిద్య...।"నీకంటె అని "కంటె వర్ణ"కంబన్యార్థాది యోగజంబగు పంచమికగు" బాల. కార ౧౨ సూ॥చే కంటె వర్ణకంబురాఁగా దానికి మాఱుగా నీ సూత్రముచే "కు"వర్ణకము వచ్చెను. "అగ్గలము" అను పదము అధికము అను నర్థము గలది. అధికము, అల్పము మున్నగు సాపేక్షశబ్దములు అన్యార్థాది గణమున గణింపఁదగినవి. కువర్ణకము రాని పక్షమున "కంటె" వచ్చి నీకంటె అనియు నగును.

సప్తమికి—కోమలి...। ఇటు వైషయిక 'ధారంబగుటంజేసి "నీయందు" అని సప్తమి వచ్చును. ఈ సూ॥చే దానికి మాఱుగా కువర్ణకమువచ్చి నీకనురక్త అని యయ్యెను "ఈ పాండిత్య...।" ఇటు పాండిత్యమునకు "నీవు" అనునది యధికరణమగుటచే "నీయందు" అని సప్తమ్యంతముగా నుండును. ఈ సూత్రముచే "కు"వర్ణకమువచ్చి "నీకు"అని యయ్యెను. "అహి విషఁబు...।"నావిషయమునన్ అను సప్తమికి మారుగా "నాకు"అని యయ్యెను.

ఇటు నా శబ్దమునకు విషయ శబ్దము చేరి దానిపై "నన్"అను సప్తమి యుండును. కువర్ణకము వచ్చునప్పుడు విషయ శబ్దము లోపించి "నాకు"అని యయ్యెను. అందు అనుదానికి మాఱుగా గాని "నన్' అనుదానికి మాఱుగాఁ గాని కువర్ణకము వచ్చెననుటకు వలను పడదు "నాయందు సైపుము" అని ప్రయోగములు కానరావు. వైషయికాధారమునకు సప్తమ్యంత విషయ శబ్దము చేరునని బాలవ్యాకర్త బోధింపలేదు అయినను "విషయ నిమిత్తాది జాతథై వాన్యా" అను చింతామణి సూత్రసూచిత పద్ధతి ననుసరించి సప్తమ్యంతమగు శబ్దమునకు కువర్ణకము వచ్చునని యర్థ మీ సందర్భమునఁ జేయవలయును.

వైషయిక సప్తమీ స్థలమున సాధారణముగాఁ దెనుగున విషయశబ్దము ఆధారమున కనుప్రయుక్తమయి దానికి సప్తమీ ప్రత్యయములు చేరుచుండును. కువర్ణకము వచ్చెనేని విషయశబ్దానుప్రయోగము లోపించుచుండును. చతుర్థికి బాలవ్యాకరణముననే యుదాహరణము గలదు — జనకుండు రామునికిం గన్య

నిచ్చెను. ఇట సంప్రదానంబునకుం జతుర్థి యగు నను (బాల. కార. ౨సూ॥) సూత్రముచే పక్షాంతరమున "రామునికొఱకు"ననియు నుండును.

ద్వితీయాది విభక్తులకు షష్ఠి వచ్చునని సూత్రమునఁ జెప్పబడినది. ద్వితీయాదులనగా ద్వితీయ మొదలు అన్ని విభక్తులును నందుఁజేరును గావున చతుర్థికిని కువర్ణకము వచ్చిన యుదాహరణములు చూపవలసియుండగా చూపఁబడ లేదను శంక గలుగుచున్నది అందుచే వెనుకటి వ్యాకరణములందే చతుర్థ్యుదాహరణములు సుప్రసిద్ధములగుటంజేసి మఱల నిట నుదాహరింపలేదనియు వానియందఁ జూచునది యని వివరించెను.

ఈ కువర్ణకము షష్ఠీ ప్రత్యయమే కావున షష్ఠీ విభక్తిం గూర్చి వేఱుగా జెప్పనక్కఱలేకపోయెను.

బాలవ్యాకరణమునసే కువర్ణకము తృతీయా, చతుర్థీ, పంచమీ, విభక్తుల స్థానమున వచ్చుచుండునని చెప్పి యుదాహరణములు చూపఁబడెను. (చైత్రునకు మైత్రుండు తుల్యుండు, రామునికిం గన్య నిచ్చెను. చోరునకు వెఱచె) సంబంధ సామాన్య వివక్షయం దన్ని యర్థములందును షష్ఠి వచ్చుట సంస్కృతమునను సాంప్రదాయికమే. తెనుఁగునను సంబంధ సామాన్య వివక్షచేతనే యితర విభక్తుల స్థానమున షష్ఠి వచ్చుచున్నదని తెలియఁదగును. అట్టి విశేషమును దెల్పుటకే ప్రౌఢవ్యాకర్త యీ సూత్రమును రచించెనని భావింపఁదగును.

సూ. వీప్సయందును గాలపరిమితియందును నామంబులకుఁ గువర్ణకం బగు. ౧౪

ఉ. వీప్సయందు—'గ్రామాని గ్రామానికిని నరిగి యరిగి, యడుగు.' భార. అర. ౨ ఆ. ౧౭౪. 'ఇంట్లింట్లకు.' కళా. ౭ ఆ. ౫౧ మొ. కాలపరిమితియందు. — 'క. కొండొక సేపునకుఁ దెలిసి.' హరి. ఉ. ౧ ఆ. ౧౩౨. 'క నెట్టన వర్షావధికిం, బెట్టంగల యప్పనములు పెట్టియు.' వి. పు. ౭ ఆ. ౨౦౪. 'ప-గీ. అలిగి పార్థునిశిర మాఱు నెలల కుర్విఁ, ద్రెళ్ళ శపియించి దేవి యదృశ్యయయ్యె.' జై. ౪ ఆ. ౭౪ మొ.

పరుసగా ననేకవస్తువులను వ్యాపించుట కిచ్ఛించుట వీప్స యనఁబడును. 'విఃచ్య అప్తుమిచ్ఛావీప్సా'అని విగ్రహము. అట్టి వీప్సార్థమున ద్విరుక్తి శబ్ద ౧౧౪ సూ॥చే వచ్చును. అట్టి ద్విరుక్త శబ్దములకును. కాలపరిమాణమును బోధించు

నపుడును నామములకు "కు" అను షష్ఠీవిభక్తి వచ్చును ఇందు పూర్వపదము నందలి విభక్తికి బాల సంధి ౪౧ సూ॥చే లోపము వచ్చెను.

వీప్సార్థ ద్విత్వము పదములకే గాని ప్రాతిపదికలకు గాదు. మ్రానిమ్రానికిని, ఇండ్లిండ్లకు — అనుచోట వీప్సార్థక ద్విరుక్త శబ్దములకు షష్ఠీవిభక్తియగు "కు" చేరెను. కొండొకసేపునకుం ..। "సేపునకు, వర్షావధికి, ఆఱునెలలకు" అను మూడు పదములందును కాలపరిమితి బోధింపఁబడుటచే "కు"వర్ణకము వచ్చెను. "కొండొకసేపునకుం దెలిసి" అనగా తెలియుటకు అవసరమగు కాల పరిమితిని "కొండొకసేపు" అను పదము సూచించుచున్నది.

కాలపరిమితియందుఁ గువర్ణక విధానము ఆవశ్యకమే. లేనిచో కొండొక సేపు అను శబ్దమునకు కొండొకసేపునందు అనియా, కొండొకసేపునన్, అనియా! కొండొకసేపుచేత అనియా! అని సందేహముగా నుండును. దానిని బోగొట్టుటకై కువర్ణక విధాన మావశ్యకమే. కాని వీప్స యందుఁ గువర్ణకవిధాన మనావశ్యకము. అంతియకాక విరుద్ధము కూడను. మ్రానిమ్రానికిని అనుచోట షష్ఠీవిభక్తి కర్మార్థమున వచ్చును. ఇచ్చటి షష్ఠీవిభక్తి "అరిగి" అను క్రియతో నన్వయించుచున్నది. ఇచట వీప్స లేకపోయినను షష్ఠి వచ్చుచునేయున్నది. ఘాలమునకేఁగెను అని యున్నదిగదా! మ్రానుదగ్గరకు అను నర్థమున మ్రానికి అనునది ప్రయోగింపఁబడెను. "అడుగు"అను క్రియలో నియ్యది కర్మగా వివక్షించినచో "మ్రానిమ్రానిని నరిగి యరిగి యడుగు" అనియే యుండునుగదా! "ఇంటింట బిచ్చమెత్తెను" ఇత్యాదిగా సప్తమ్యంతముండుటకు వీలుగాకపోవలసి వచ్చును. ఈ కువర్ణకము నిత్యముగా వచ్చునుగదా! సప్తమికి ప్రాప్తియెట్టు?

**సూ. ధాతుజ విశేషణ భావార్థకపూర్వ వ్యవహితావ్యవహిత కర్తృ పద ప్రథమకుఁ దఱచుగ యొక్క షష్ఠి యగు. ౧౫**

ఉ. (౧ లో ౧.) ధాతుజవిశేషణ పూర్వావ్యవహిత కర్తృపద ప్రథమకు — 'వ. బాహుకు రథంబుగడపు నేర్పున కచ్చెరువడి.' భార. ఆర.౨ ఆ.౧౭౦. 'తనమునుపడ్డ బన్నములు.' ఉద్యో.౩ ఆ.౧౦౨. 'చ. కని తన మున్నుగన్నటులు గామికి విస్మయ వారి రాశిలో, మునుఁగుచు.' హరి. ఉ.౯ ఆ.౧౧౨. 'నా యొనర్పంబూనిన కళాపూర్ణోదయుంబు.' కళా.౧ ఆ.౧౦౯. (౧ లో ౨.) ధాతుజ విశేషణ

పూర్వావ్యవహిత కర్తృపద ప్రథమకు — 'అన్నల భూపాలకు పోయిన వలను.' భార. అర.౨ ఆ.౧౮౯. 'వ. వానిపన్నిన వృషభగోమయ భక్షణంబు చేసి.' భార. ఆది.౧ ఆ.౯౩. 'తే. ఎఱుకఁ గలఁడేని మఱి శక్తుఁడేని నన్య, లన్యులకు హింసగావించునప్పుడు దానిఁ, బూని వారింపకున్న నప్పురుషుఁడేఁగు, హింసచేసినవారల యేఁగుగతికి.' భార. ఆది ౭ఆ.౧౪౫. 'వ. అపార పారావార పర్యంత మహీతలంబునందు నా చూడనిరాజు లెవ్వరును లేరు.' భార. అర ౨ ఆ.౧౯. 'తే. ఆ జరత్కారుఁగని చెప్పుమయ్య వాని, నెఱుఁగుదేని మా పడియెడు నీయవస్థ.' భార. ఆది.౨ ఆ ౧౪౪. 'వ. నీ చేయు వేదన నన్నుం దాఁకనోపదు.' భార. ఆది.౨ ఆ.౧౦౮. 'సీ. హంసచేఁ దనవినినంత కంటెను రూప విభవాతిశయముల వెలుఁగుదాని. భార. అర.౨ ఆ.౩౯. (౨ లో ౧) భావార్థక పూర్వావ్యవహిత కర్తృపద ప్రథమకు 'వ. మన పుట్టిబుద్ధి యెఱుఁగుట మొదలు.' హరి. పూ.౫ ఆ. (౨ లో ౨.) భావార్థక పూర్వావ్యవహిత కర్తృపద ప్రథమకు — 'క. పరీక్షిజ్జనపాలు చనుటఁ గృశుఁడను, మునివలన నెఱింగి.' భార. ఆది ౨ ఆ.౧౬౯ మొ. తఱచుగ ననుటచే 'బాహుకుండు రథంబుగడపు నేర్పునకు' ఇత్యాదు లెఱుంగునది. 'క. మేము పఠింపని శాస్త్రములె మా పఠింపని శ్రుతులే? ఆము.౬ ఆ.౩౨ మొ.

బాలవ్యాకరణ క్రియాపరిచ్ఛేదమున ౪౪, ౪౫, ౪౬, ౪౭. సూత్రములలోఁ జెప్పఁబడిన యేడువిధములగు విశేషణములును ధాతుజవిశేషణము లనఁబడును. ఎడు, ఎడి, తల్లోపము, ఉన్న కల, న, ని, అనునవి యంతమందుఁగల క్రియలు. (వండెడు, వండెడి, వండు, వండుచున్న, వండఁగల, వండిన, వండని అనువానిం బోలినవి) క్రియాజన్య విశేషణము లనంబడును భావార్థకములనగా అలుక, అలుగుటు మున్నగు కృదంతములు, (భావార్థకములనగా నొక్క టువర్ణకాంతములు మాత్రమేయని తలంపరాదు అట్టి వింకను గలవు)

ధాతుజవిశేషణములకును, భావార్థకములకును బూర్వమునున్న కర్తృవాచకమగు పదమునకు ప్రథమావిభక్తికిబదులు షష్ఠీవిభక్తి వచ్చును. ఇట్టు

వచ్చుట తఱచుగా భాషయందుగలదు వానికి పూర్వమున నుండెడి కర్తృపద మొకప్పుడు వ్యవహితముగను వేరొకప్పు డవ్యహితముగనుఁగూడ నుండవచ్చు నని భావము. ధాతుజవిశేషణములును, భావార్థకములునుగూడ క్రియావిశేష ములను బోధించుచుండును. ఆ క్రియలకు కర్తలగువానిని బోధించుపదము లకు యొక్క షష్ఠివచ్చునని భావము(1)ధాతుజవిశేషణ పూర్వవ్యవహిత కర్తృ పద ప్రథమకును (2) ధాతుజవిశేషణ పూర్వావ్యవహిత కర్తృపద ప్రథమకును (3) భావార్థక పూర్వవ్యవహిత కర్తృపద ప్రథమకును, (4) భావార్థక పూర్వా వ్యవహిత కర్తృపద ప్రథమకును దఱచుగా యొక్క అను షష్ఠీ ప్రత్యయము వచ్చునని తాత్పర్యము సిద్ధించును. వానికి వరుసగా నుదాహరణము లీయఁ బడును.

(1) బాహుకు... ఇందు "కడపు" అను ధాతుజవిశేషణమునకుఁ బూర్వ మున "బాహుకు" అను కర్తృపదము గలదు. (కడపుట అను క్రియకు కర్త బాహుకుడుగదా) బాహుకు అనుపదమునకు కడపు అనుపదమునకును నడుమను "రథంబు" అను వేరొకపదము అడ్డముగానుండుటచే వ్యవహితమయ్యెను ఇట్టి "బాహుకు" అనుపదము ప్రథమాంతముగా నుండక బాహుకునియొక్క అని షష్ఠ్యంతమయ్యెను. బాహుకునియొక్క అనుచోట ౧౬ సూత్రముచే యొక్క లోపించి "బాహుకు రథంబు గడపు నేర్పునకు" అనురీతి నుండెను. "బాహు కుండు రథంబు గడపు నేర్పునకు" అనియుండుటకు బదులుగా "బాహుకు రథంబు గడపు నేర్పునకు" అని యయ్యెనని భావము.

పడ్డ అను ధాతుజవిశేషణమునకుఁ బూర్వమునఁ కర్తృపదమగు తా శబ్దము "మును" అను వేరొకపదముచే వ్యవహితమయి యున్నది. ఇచట "తా" అను శబ్దము తాను అని ప్రథమాంతముగా నుండుటకుబదులు తన యొక్క అని షష్ఠ్యంతమయి ౧౬ సూ॥చే యొక్క లోపింపగా "తన మునుపడ్డ బన్నములు" అని యయ్యెను. తాను మునుపడ్డ బన్నములు అనుటకు మారుగా "తన మునుపడ్డ బన్నములు" అని యయ్యెను.

కనితన ..! ఇట "కన్న" అనుదాని కర్తయగు "తా" శబ్దమునకు యొక్క షష్ఠివచ్చి "తాను మున్ను గన్న" అనుటకుబదులు "తన మున్ను గన్న" అనియయ్యెను, తన, కన్న అనువానికి "మున్ను" అనుదానితో వ్యవధానము గలదు

నా యొనర్పంబూనిన...। పూనిన అను విశేషణమునకుఁ గర్తయగు "నా" శబ్దము నేను అనియుండుటకు మాఱుగా నాయొక్క అని యయి యొక్క లోపించి "నాయొనర్పంబూనిన" అని యయ్యెను. ఇచట "ఒనర్పన్" అనునది అడ్డముగా నున్నది.

(2) అ న్నల భూపాలకు...। పోయిన అనుదానికి కర్తయగు నలభూపాలకశబ్ద మవ్యవహితముగాఁ బూర్వమున నున్నది. అందుచే "నలభూపాలకుఁడు పోయిన" అనుటకు మాఱుగా "నలభూపాలకునియొక్క పోయిన" అని షష్ఠ్యంతమయి యొక్క లోపించినది.

"పన్నిన" అను విశేషణమునకుఁ బూర్వమున నవ్యవహితముగానున్న "ఆ" శబ్దము "వాడు" అని ప్రథమాంతముగా నుండక "వానియొక్క" అని షష్ఠ్యంతము "యొక్క" లోపించి "వానిపన్నిన" అని యయ్యెను.

ఎఱుక...। "ఏఁగు" అను క్రియాజన్యవిశేషణమునకుఁ గర్తయగు "హింసచేసిన వారలు" అను ప్రథమాంతపదము అవ్యవహిత పూర్వముగా నుండుటచే షష్ఠ్యంతమయి "హింసచేసిన వారలయొక్క" అని యయి "యొక్క" లోపించి "... వారల యేఁగుగతికి" అని కన్పట్టుచున్నది.

నేను చూడని = నాయొక్క చూడని = నాచూడని అని యయ్యెను. చూడని అను విశేషణమునకు కర్త "నేను" అనునది. మేము పడియెడు = మాయొక్క పడియెడు = మాపడియెడు ఇట "పడియెడు" అను విశేషణమునకు "మేము" అనునది పూర్వస్థిత కర్తృవాచకము.

నీవుచేయు = నీయొక్కచేయు, = నీచేయు. చేయుటలో కర్త నీవనునది. ఇది అవ్యవహిత పూర్వమున నున్నది. చేయు అనునది క్రియాజన్య విశేషణము.

తాను వినిన = తనయొక్క వినిన = తనవినిన. వినుటలో. తాను అనునది కర్త. ఇది యవ్యవహిత పూర్వమున నున్నది. తన వినినంతకంటెను. అనగా "తాను వినినంతకంటెను" అని యర్థము. నామవాచకము, ఏకవచనాంతమగు "ఆ" శబ్దము, బహువచనాంతమగు ఆ శబ్దము, ఏకవచనాంత నా శబ్దము, బహువచనాంత నా శబ్దము, నీ శబ్దము, తా శబ్దమును వరుసగాఁ గర్తృవాచకమున కుదాహరణములగుచున్నవి.

(3) మన...! ఎఱుగుట భావార్థకము. కర్తృవాచకమగు మనశబ్దము దీనికిఁ బూర్వమున, వ్యవహితముగా నున్నది. మనము అనుటకు బదులు "మన యొక్క" అని యయి యొక్క లోపించి "మన" అని యయ్యెను.

(4) పరీక్షిజ్జన...! ఇట "చనుట" అనునది భావార్థకము. అవ్యవహిత పూర్వముననున్న కర్తృపదము జనపాలశబ్దము. దీనికి యొక్క షష్ఠివచ్చి జనపాలు యొక్క చనుట అనియుండగా యొక్క లోపించి "జనపాలు చనుట" అని యయ్యెను.

తఱచుగా ననుటచే నీ షష్ఠి యొకప్పుడు రాకపోవచ్చును అపుడు ప్రథమాంతముగా కర్తృపదములుండి బాహుకుండు రథంబుగడపు నేర్పునకు, తాను మునుపడ్డ బన్నములు మున్నగుతీరున నుండును. అట్లు ప్రథమాంతములుగను కూడ నుండుటకు ఆముక్తమాల్యదలోని యుదాహరణమును జూపుచున్నాడు.

మేము పఠింపని... ఇట కర్త ప్రథమాంతము మా పఠింపని – ఇటఁ గర్త షష్ఠ్యంతము. ఇచటఁ బ్రథమకు షష్ఠి విధించుకొన నక్కరలేదు. ఈ కర్తృవాచకములకు క్రియాజన్య విశేషణములతోఁగాక వాని విశేష్యములతో నన్వయము వివక్షించినచో సంబంధ సామాన్య బోధక యొక్క షష్ఠి యెట్లును వచ్చును. ఈ కర్తృపదమునకు విశేష్యముతో సమాసమయినందున యొక్క విభక్తి లోపించెనని, తెలియవచ్చును తనయొక్క + బన్నములు = తన బన్నములు అని యగునుగదా! "మునుపడ్డ" అనుపదములు అడ్డముగా నున్నందున సమాసము అనుటకు వీలుకాదని తలంచరాదు సమాసములందును సందర్భయోగ్యపదములతో వ్యవధానముండుట ప్రయోగములందు తఱచుగాఁ గానవచ్చుచున్నది. (చూ॥ సమాసము ౧౮ సూ॥) ఈ కన్నులు తెరువని శిశువు – "ఈ" అనునది "శిశువు" అను పదముతో నన్వయింపవలసియుండగా వీని మధ్యమున "కన్నులు తెరువని" అను పదములతో వ్యవధానము కలదుగదా! అట్లే యిచ్చటను సందర్భయోగ్యపదములతో వ్యవధానము నంగీకరింపవచ్చును. సమాసము ౧౮ సూత్రమును తత్పురుష కర్మధారయములకు రెండిటికిని వర్తించునట్లు సవరించుట యుచితము ఈ సూత్రమును రచించియుండుటచే నా సూత్రమునఁ గర్మధారయములకు మాత్రము విధానము సంకోచపఱుపవలసి వచ్చెను. ఈ యుదాహరణములలో నవ్యవహితములగువానిని గూర్చి

శంకయేలేదు. అవి క్రియావిశేష్యములతో నన్వయించిన షష్ఠ్యంతములనియే చెప్పవచ్చును. వ్యవహితంబులలో నయినను సమాసవిరోధములేదు. "రథంబు గడపునేర్పు" అను సమాసము సిద్ధించినపిమ్మట ''బాహుకునియొక్క'' అను దానికి షష్ఠీతత్పురుషము చెప్పవచ్చును. వ్యవహితములయినచోటం గూడ ''మన వృత్తిబుద్ధి'' అనుచోట మాత్రమే వృత్తి అను నవ్యయ మడ్డముగా నున్నది. మిగిలినపదములు సమాసయోగ్యములే – అవ్యయములుగూడ సమాసములలోఁ జేరుట సంస్కృతమునఁ గలదు. ఆపద్ధతి ననుసరించినచో వృత్తి అనుపద ముండుట విరుద్ధముకాదు.

ఇక నీ షష్ఠ్యంతపదములు వ్యస్తములేయనియు వీనికి విశేష్యముల తోడనే వ్యపేక్షారూప సామర్థ్యముగలదనియుఁ దలఁచినచో నెట్టి విరోధమును గానరాదు. కావున నీ సూత్ర మనావశ్యకమని తెలియఁదగును.

సూ॥ యొక్కకు లోపంబు బహుళంబు. ౧౬

ఉ. 'ఉ. ఇమ్మెగ సర్వలోకజను లెవ్వనియేని ముఖామృతాంశుబిం, బమ్మెన సుద్భవంబయిన భారతవాగమృతంబు కర్ణరం, ధ్రమ్మను నంజలిం దవిలి త్రావుదురు'. భార. ఆది. ౧అ. ౭౭. 'ధరజు నలువురు దమ్ములు'. భార. సభా ౨అ. ౨౬౧. 'తే ఇరులు గెలిచిన యంతఃపురేందుముఖులు, కురులు మసఁడను వేఁటకాఁడురులు వేసి, మరులు గొలుపంగ లేఁడయ్యె మనుజ విభుని, సరులు లేని దృక్షింజనశాబకముల. నై. ౩అ ౯౦. సీ. వారివ ధమ్మిల్ల భారావకలిత దివ్యామోద నవపుష్పదామములయు'. భార. ఆది. ౩అ. ౧౫౬. (వారివ=వారివేనైన. ఇక్కడ నిది షష్ఠ్యంతమునకు విశేషణము గనుక ప్రథమ.) 'ఏ–గీ. అపుడు సమ్మెటకోలల యంకుశముల, చేఱుకోలల వ్రేటుల'. (సమ్మెటకోలల యొక్కయు, అంకుశముల యొక్కయు, చేఱుకోలల యొక్కయు వ్రేటులచేతనని యర్థము. ఇట అంకుశముల వ్రేటుల ననఁగా లక్షణచేఁ బోటులని యెఱుంగునది.) ద్రోణ. ౩అ. ౭౮. 'క. నరగో మృగసింహంబుల, కరుణములగు రోగ వేగ కలితాక్రోశ, స్వరములు పెక్కయ్యె.' హరి. పూ. ౬అ. ౭౫. 'క. తాళల

తండ్రుల తరమున, నేతెంచిన వృత్తి దక్క-.' విజ్ఞా. వ్యా. ౫౦. బహుళ గ్రహణముచే ధాతుజ విశేషణ భావార్థకముల ముందటి కర్తృపదంబుల యొక్క-కు నిత్యంబుగ లోపంబగునని యెఱుంగ వలయును.

యొక్క అను షష్ఠీప్రత్యయము బహుళంబుగా లోపించునని భావము. సమాసమునం దెట్లును లోపించును. ఆలోపము బాలవ్యాకరణ విహితమే. ఇది వ్యస్తస్థలమునందును లోపమును విధించుచున్నది. ఉదా॥ ఇమ్మొగ ...! ఎవ్వని యొక్క + ఏని. యొక్కకు లోపము ఎవ్వనియేని. ఏని అను నవ్యయము పరముగా నున్నది కాన సమాసముకాదని భావము. ధర్మజునియొక్క – యొక్కకు లోపము. నలువురు అనునది బహువచన ప్రత్యయముతోఁ గూడియున్నది కావున సమాసము కాదు. మనుజవిభునియొక్క – యొక్కకు లోపము. దామములయొక్క + యును = దామములయు. యొక్క లోపము. "ను" అను అవ్యయము పరమగుటచే సమాసముకాదు. 'వారివి + అ = వారివ' ఉదాహరణాంశము కాకున్నను పద్యములోని క్లిష్టాంశమును దెలుపుటకై 'వారివ = వారివేయైన' అని వ్యాఖ్యానము చేసెను.

కోలలయొక్క, అంకుశములయొక్క, చెరుకోలలయొక్క అను యొక్కకు లోపమువచ్చెను వ్రేటుల అనుపదము వేర్వేరుగా షష్ఠ్యంతముల మూడింటితో నన్వయించుటంజేసి యిదియు సమాసముకాదు అంకుశములతోఁ బొడుతురు కాని కత్తితో వ్రేసినట్లు వేయరు. అందుచే నంకుశములవ్రేటు అనుట సరికాదని శంకించుకొని వ్రేటులు అనుమాటకు లక్షణావృత్తిచే పోటులని యర్థము చెప్పుకొనవలయునని వివరించెను. "నర ..." సింహములయొక్క అనుచోట యొక్కకు లోపము. కరుణములు అను విభక్త్యంతపదము పరముగా నుండుటచే సమాసమనుటకు వలనుకాదు తాతలయొక్క, తండ్రులయొక్క – అనుచోట యొక్కకు లోపము. తరమున అనుపదము ఉభయముతోడను అన్వయించుటచే సమాసముకాదని తెలియుచున్నది.

ఈ సూత్రమున బహుళపదమును జేర్చుటచేఁ బూర్వ సూత్రోక్తమగు కర్తృపదమునకు వచ్చిన ప్రథమాస్థానిక షష్ఠికిమాత్రము లోపము నిత్యమని వివరించెను. (ఇట్లు చెప్పుటచేఁగూడ పూర్వసూత్రోదాహరణములు సమాసములే యని సూచితమగుచున్నది). బహుళమనుటవలన యొక్కకు లోపము లేక 'ఎవ్వని

య్యొక్కయేని, ధర్మజునియొక్క, మనుజవిభునియొక్క'' అనురీతినిగూడ నుండవచ్చు నని తాత్పర్యము.

తెనుఁగునఁ బ్రబంధములయం దెచ్చటను య్యొక్క ప్రత్యయము కానరా కుండుటచే నిట్లు లోపమును విధించుట యుచితమే యనఁదగును. కాని యివి యన్నియు సమాసములే యనియు ననవచ్చును. తెనుఁగున సమాసమధ్యమున సందర్భయోగ్య వ్యస్తపదములుచేరి వ్యవధానము గల్పించుట గలదుగదా. షష్ఠ్యంతపదమునకు సంబంధించి అన్వయింపవలసిన పదముగూడ ననంతరము నఁ బ్రయోగింపఁబడును గాని యట్టిపదము పూర్వముననున్న ప్రయోగము లెచ్చ టను గానరావు వచ్చె న్రాముఁడు, చంపెన్ వాలిని, ఇత్యాదిరీతిని మిగిలిన విభక్తు లన్వయింపవలసిన పదములతో వ్యత్యస్తములుగా నుండుటయుఁ గలదు. యొక్క షష్ఠిమాత్రము ఎచ్చటను వ్యత్యస్తము కారాదు. రామునియొక్క తమ్ముడు అనియే యుండవలయును గాని తమ్ముడు రామునియొక్క అని యెచ్చట నుండరాదు. ఇదియే దీని సమాసత్వమునకుఁ బ్రబలసాక్షి యనఁ దగును. ఇట్లు య్యొక్క అనునది యలౌకిక విభక్తియే యని చెప్పఁదగియున్నది. కాని వాడుకలోఁ గ్రమముగాఁ గానవచ్చుటచే దీని నొక విభక్తిగా నంగీకరింప వలసి వచ్చెను. అయినను సాధారణముగా నట్టిస్థలములు సమాసములే యనఁ దగియుండుటచే య్యొక్కకు లోపమువచ్చుచునే యున్నది. ఇక నాధునికముగా నచ్చటచ్చటఁ బ్రయోగింపఁబడుచుండుటఁజేసి యీలోపమును బహుళముగా విధించియుండును.

**సూ॥ ఒక్కచో నుదంతంబగు నజడంబు తృతీయకును నవర్ణకంబు గానంబడియెడి. ౧౭**

ఉ. 'ఉ. ఏపునఁ గిట్టి మేనుఁగున నేనుఁగు వైచుచు వాజి వాజిచే, రూపడఁగంగ మోదుచును'. రా. యు. కా. ౯౭౭. (దీనికిఁ బ్రయోగాంతరంబు మృగ్యంబు.

బాలవ్యాకరణమున ''ఉదంతజడంబు తృతీయకు నవర్ణకంబగు'' నని జడవాచకములగు ఉకారాంతములకు మాత్రము తృతీయావిభక్తికి బదులుగా ''నన్'' అను సప్తమి విధింపఁబడెను. కాని జడవాచకము కానట్టి ''ఉ''కా రాంతమునకును తృతీయాస్థానమున నవర్ణకము కొన్నిచోట్ల కానవచ్చుచున్న దని ప్రౌఢవ్యాకర్త యభిప్రాయము.

ఉదా॥ ఏపున...! ఏనుఁగుచేన్ అనుటకుమారుగా ఏనుఁగునన్ అనియయ్యెనని భావము. వాజిచే వాజిని మోదుచును అనునట్లే ఏనుఁగుచే నేనుఁగును వైచుచును అని యర్థమనియు, నిచ్చట ఏనుఁగు ప్రాణియును జంగమమును అయినను అనగా జడము కాకున్నను తృతీయాస్థానమున నవర్ణకము వచ్చెననియుఁ దెలియవలయును బాలవ్యాకరణసూత్రమున కిదియొక్కటి మాత్రమే విరుద్ధప్రయోగము గానవచ్చుచున్నదనియు వేరొకప్రయోగ మిట్టి దెచ్చటను గానరాదనియు భావము ఈ సూత్రము బాలవ్యాకరణ, కారక, ౨౩ సూత్రమునకు సవరణమేకాని ౧౮ వ సూత్రమునకు సవరణముగాదు సముచ్చయ నువర్ణము "తృతీయకు"అను పదమునకుఁ జేరుటచేఁ దృతీయావిభక్తి కార్యమును సవరించుటయే దీని యుద్దేశ్యముగా స్పష్టపడుచున్నది. ఉదంతజడ తృతీయకు నవర్ణకముబా॥వ్యా॥ నందు చెప్పియుండగా నుదంతజడ తృతీయకేకాక అజడ తృతీయకును వచ్చునని సవరింపఁబడియెను. "ఉకారాంత జడంబునకు నవర్ణకంబగు"నను సూత్రమునకు సవరణము ఉద్దిష్టమయినచో తృతీయకు అనుమాట యీ సూత్రమునఁ జెప్పఁబడియుండదు. "ఉకారాంతమగు నజడంబునకును నవర్ణకం బగు" ననిసూత్రించియుండును. కనుక నియ్యది బా॥వ్యా॥ ౨౩ సూ॥కే సవరణమని తెలియఁదగును.

ఈ సూత్రము ఆవశ్యకమే "ఏనుఁగునన్" అనుచోట "తృతీయార్థమున నవర్ణకముకాదు. సప్తమ్యర్థముననే నవర్ణకము ప్రయోగింపఁబడె" ననియుఁ జెప్పుట కవకాశము కానరాదు. ఒక యేనుఁగునందు మఱియొక యేనుఁగును వైచుచు అని సప్తమ్యర్థము చెప్పుట కవకాశమున్నను నవర్ణకము మాత్రము రాఁజాలదు – సప్తమ్యర్థక నవర్ణకముగూడ ఉదంత జడంబునకే విధింపఁబడెనుగదా!

**సూ॥ కొన్నియెడల నజడంబు తృతీయా సప్తములకును బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి.** ౧౮

ఉ. తృతీయకు...'ఏ–గీ. అతని దోర్మధ్య సరసి నోలాడుచున్న, ఘనతర స్తనచక్రవాకముల నలరు, నంబన సురేంద్రుకూఁతురిం పారఁగనియె'. హరి. ఉ. ౭౯. ౭౦. సప్తమికి— 'బలిమిఁగొనిన ధనము పదివేల యొంటెలఁ, బెఱిగి రాఁగ వైరి శేకరుండు, వచ్చె నకులుఁడు.'

భార. సభా. ౧ఆ. ౨౬౧. 'మనుజుల విప్రుండు.' (చూ. శబ్ద. ౬౨ సూ. ఉ.) భార. శాంతి. ౧ ఆ. ౭౧ మొ.

బాలవ్యాకరణమున "జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగానగు" నని జడవాచకశబ్దములకుమాత్రమే తృతీయా సప్తమిస్థానమున ద్వితీయ విధింపఁబడెను. అదియు నుదంతముల కయ్యేనేని బహుత్వంబుననే వచ్చునని నియమింపఁబడియె. ఇట్టి బాలవ్యాకర్తవిధానమును సవరించుటకీసూత్రము రచింపఁబడెను.

జడవాచక తృతీయాసప్తములకేగాక అజడవాచక తృతీయాసప్తములకును ద్వితీయ ఎచ్చుననియు నయ్యది బహుత్వంబుననే వచ్చుననియు భావము.

ఉదా॥ అతని...। చక్రవాకములన్ అనగా చక్రవాకములతోననియర్థము. చక్రవాకములన్ అనునది ద్వితీయా బహువచనాంతము. ఇయ్యది తృతీయార్థమును బోధించుచుండుటచేఁ దృతీయాస్థానమునవచ్చిన ద్వితీయయని తెలియవలయును. చక్రవాకములు జడపదార్థములు గాకున్నను తృతీయకు ద్వితీయ వచ్చెను గాన నుదాహరణ మగుచున్నది.

ఇచట నంబను వర్ణించుచున్నాడు. కావున నంబ కన్వయించుతీరున స్తనములకుఁ బ్రాధాన్యము కలుగునట్లు ఉపమిత సమాసమునేచెప్పి "చక్రవాకములవంటి స్తనములతో నలరుచున్న" అని యన్వయించుటయే యుచితము, అప్పుడు స్తనశబ్దార్థమునకే ప్రాధాన్యము గల్గును. కావున నయ్యవి జడములే కనుక తృతీయాస్థానమున ద్వితీయవచ్చుట బాలవ్యాకరణముచేతనే సిద్ధించును. కావున నీ యుదాహరణము సరియగునదికాదు. "మనుజుల విప్రుండు" అనునది మాత్రము అంగీకరింపకతప్పదు. కావున సప్తమికి ద్వితీయను విధించుట యావశ్యకమేయని గ్రాహ్యము.

సప్తమికి— బలిమి...। ఒంటెలన్ అనునది ద్వితీయాంతము. 'ఒంటెలచేత' అను తృతీయార్థమున నియ్యది వచ్చెను. ఒంటె ప్రాణియు జంగమమును. అందుచే నుదాహరణమగుచున్నది.

ఈ సూత్రముచే విధింపఁబడిన తృతీయ ఉదంతములకేకాక యనుదంతములకైనను నేకత్వమున రాదు. బహుత్వముననే వచ్చును. అందుచే సూత్ర

మున బహుత్వంబునన్ అని చెప్పంబడెను. జడంబులకు విధింపఁబడిన ద్వితీయ ఉదంతములుకానిచో నేకత్వముననైనను రావచ్చును. (కోలం గూలనేసె). కాని అజడములకు వచ్చెడి ద్వితీయమాత్రము అనుదంతములకు సయితము బహుత్వముననే వచ్చునుగాని ఏకత్వమున రాదు "ఒంటె" అను పదము ఉదంతముకాదు. అయినను నీ పదమునకుఁగూడ బహుత్వముననేకాని ఏకత్వమున ద్వితీయ రాదు. అనగా ఒంటెన్ అను ఏకవచనరూపము తృతీయా సప్తమ్యర్థమున నుండరాదని తెలియఁదగును.

మనుజులన్ – ఇదియు సప్తమ్యర్థక ద్వితీయాంతము. "మనుజులయందు" అని యర్థము. ఇది నిర్ధారణార్థకము. "మనుజులు" అను నజడవాచకమునకు ద్వితీయవచ్చుటచే నుదాహరణమయ్యెను. దీని పూర్తిపద్యము శబ్దపరి. ౬౨ సూ॥న నుదాహరింపఁబడెను. ఇది సప్తమ్యర్థక ద్వితీయయనుటకు పద్యమంతయు దెలియుట యావశ్యకమని యిట్లు సూత్రించెను.

**సూ. కొన్నియెడల నజడంబు ద్వితీయకును ప్రథమ కానంబడి యెడి. ౧౯**

ఉ. 'చ. అనిల జవంబునం బఱచు న మ్మదనాగ మెదిర్చి క్రమ్మఱిం, చినపరికాఁడువోలెఁ గురు సింహవరూథము నిట్లు క్రమ్మఱించునె?' భార. ఆది. ౮ ఆ. ౨౦౫. 'తన వారణేంద్రమ మ్మకురుకులవీరుమీఁద నెసకొల్పిన' భార. అర. ౬ ఆ. ౨౨౮. 'తత్త్కటుహయోత్తమ మొక్కెడఁ గట్టఁ బంపుచున్. జై. ౫ ఆ. ౧౭౩ మొ.

బాలవ్యాకరణంబున "జడంబు ద్వితీయకుం బ్రథమబహుళంబుగా నగు" నని చెప్పఁబడియెను. కాని జడవాచకముకాని శబ్దములకును ద్వితీయార్థమునఁ బ్రథమ కాన్పించుటచే నీ సూత్రము రచింపఁబడియె.

జడవాచకముకాని శబ్దముయొక్క ద్వితీయా విభక్తికి బదులు ప్రథమా విభక్తి వచ్చునని భావము. ఇదియు నిత్యముకాదు. కొన్నిచోట్లమాత్రమే వచ్చును.

అనిలజవంబునం...! "మదనాగమును ఎదిర్చి" అని కర్మ ద్వితీయ రావలసియుండగా ప్రథమ వచ్చెను. మదనాగము జంగమము. జడము కాదు. అయినను ప్రథమ వచ్చెను. తన వారణేంద్ర..." వారణేంద్రమును అని కర్మ

ద్వితీయ రావలసియుండగాఁ బ్రథమ నచ్చెను. వారణేంద్రము జడము కాదు. తత్కృతు... హయోత్తమమును అను కర్మ ద్వితీయకు బదులుగాఁ బ్రథమ వచ్చెను. హయోత్తమము జడము కాదు.

ఈ ప్రథమ తృతీయా సప్తమ్యర్థములందు వచ్చిన ద్వితీయకు రాదు. కర్మంబున ద్వితీయయగునను సూత్రముచే విధింపబడిన ద్వితీయాస్థానముననే వచ్చును. ఈ విషయముమాత్రము బాలవ్యాకర్త బహుళగ్రహణఫలముగా చెప్పియున్నాడు. ఆ సూత్రముననే యీ విధియు శేషభూతమగుటచే నిచ్చటను అదియు వర్తించును.

మదనాగునెదుర్పన్, అనియు, అశ్వోత్తమున్ దవ్వులన్ అనురీతిని వారణేంద్రున్ హయోత్తమున్ అనియు పాఠములుండుట కవకాశముకలదు గావున నీ లక్ష్యములు సరియయినవి కావని సీ॥ శా॥ గారి యభిప్రాయము.

సూ. ఒక్కొకచో జడంబు సప్తమికిం బ్రథమయు నగు. ౨౦

ఉ. 'వాహికము నాఁగఁ బరఁగు తీర్థమాడి మేధాసమన్వితులగుదురు.' భార. అర. ౨ ఆ. ౨౭౮.' చ. వ్రతములులేనివారు నుపవాసపరాఙ్ముఖులైనవారు దుర్మతులు విహీనశౌచులుఁ గ్రమంబునఁ దీర్థము లాడ నోపరు' భార. అర. ౨ ఆ. ౨౮౩. 'ఉర్వింగల్గు తీర్థంబు లెల్లను నేనాడుచు.' హరి. పూ. ౫ ఆ॥ ౮౨. 'ఆ. ఎఱుకు నన్ను నుఱక యేసిన శరములు, నెఱఁకులాడి.' భార. అర. ౧ ఆ. ౩౧౪. 'చ. పొరిఁ బొరి మోము బాష్పజలపూరము గ్రమ్మఁగ నూర్ధ్వబాహుఁడై.' భార. శల్య, ౧ ఆ. ౬. 'ఆవమిడినఁ బగిలిపోవుటయు.' భార. స్త్రీ. ౧ఆ. ౩౪ 'ఎ- గీ. ముట్టికందముల్ వడిఁ గత్తి పెట్టి పెట్టి.' హరి. పూ. ౬ ఆ. ౧౬౫. 'శా. భావంబుల్ భయ ముజ్జగించి చొరుఁడీ భవ్యాద్రి చా టందఱున్.' హరి. పూ. ౮ఆ. ౧౬౫. 'మ. కనుగొంటిం బరమేష్ఠిఁ దొట్టి సురసంఘుం జేకతం బుండఁగన్.' హరి. పూ. ౫ ఆ. ౮౨. 'ఏ- గీ. లీలఁ జేరోలగంబున్న నీలవర్ణు.' ఉ. హరి. ౪ ఆ. ౧౪౧. 'శార్ఙ్గగుణగాఢరవంబు నభంబునిండగాన్.' నిర్వ ౩ ఆ. ౨. 'అదియున్ మేనుచ్చి' రా. అర. కాం. ౨ ఆ.౫౯. 'జనయిత్రి చిచ్చు ఱికిన.' జై. ౮ ఆ. ౩౬. 'తే. పంకము గొరిజ దిగఁబడఁ బఱవలేక్కు,

మున్న లివ్వేళ రేగటిమన్నులందు.' స్వా. ౧ ఆ. ౨౦. పద్య. పత్రాంతరమునఁ దీర్థమందాడి పద్య. ఇట్టి ప్రయోగములచేత 'అన్యస్యాః క్వచి ద్భవేచ్చాన్యా'అను శబ్దశాసనుల సూత్రము సార్థకమగుచున్నది.

జడవాచకములకు సప్తమికి బదులుగాఁ బ్రథమావిభక్తిగూడ నొక్కొకచో వచ్చునని భావము. బాలవ్యాకరణమున నీ విషయము చెప్పఁబడలేదు. ఇందే ఈ విషయము నూతనముగా వ్రాయఁబడెను.

ఉ॥ వాహికమునాగ...! తీర్దమునందు ఆడి అనుటకుమారుగా "తీర్ద మాడి" యని ప్రథమాంతముగా నున్నది "తీర్థములు ఆడనోపరు." "తీర్థములందు ఆడనోపరు." అని యర్థము. తీర్థంబులెల్లను = తీర్థంబులందెల్ల" అని భావము. ఇట్లే నెఱఁకులందు, మోమునందు, అవమునందు, కందములందు, భావములందు, ఏకతంబునన్, ఓలగమందు, నభంబునందు, మేనునందు, చిచ్చునందు, పంకమునందు, అని సప్తమి యుండవలసినచోట, ప్రథమాంతములుగా నున్నవి. ఈ ప్రథమ వైకల్పికము గావున సప్తమియువచ్చి తీర్థమందాడి మున్నగు రీతి నుండవచ్చును.

ఈ ప్రథమా విభక్తి ఉదంతములగు వానికిమాత్రమే కానవచ్చుచున్నదని శ్రీ॥ సీ॥ రా॥ శాస్త్రిగారు చెప్పిరి.

ఇట్టి ప్రథమావిధానమునకు చింతామణి సూత్ర మాధారముగా నున్నదనియు నిట్టివి "అన్యస్యాః" ఇత్యాది సూత్రమున కుదాహరణములనియు వివరణమునఁగలదు. ఇట్టి సూత్రము బాలవ్యాకరణమునను గలదు. (ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు బాల॥ కార. ౨౧ సూ.) కాని యుదాహరణముల నిట్టి వానిని దానికి లక్ష్యములుగా నాతఁడు చూపలేదు. అందుచే నీ సూత్రమును రచించెను

సూ. ఒక్కచో సమాసాంతర్గత విశేష్యంబుల కగు| విశేషణంబుల షష్ఠికిని బ్రథమ చూపట్టెడి. ౨౧

ఉ. 'పార్థివ, ప్రాగ్రసరుండు ధర్మసుతు పన్పిది నీకు నలంఘ్యము.' భా. ౧౦, ౮౦. ౭ అ. ౧౧౬. 'లసదగణ్యగుణౌఘు విచిత్రుఁడమ్మహాత్ము చరితంబులు.' పారి. ఉ. ౫ ఆ. ౧౯. 'ఉత్ఫుల్లలోచను

డావిష్ణుని మూర్తితో.' హరి. ఉ. ౪ ఆ. ౧౭౬.' విస్ఫురన్మహో, విక్రముఁడైన దేవుఁడు త్రివిక్రము సొమ్ములు.' హరి. ఉ. ౬ ఆ. ౧౨౪ మొ.

సమాసాంతర్గత విశేష్యంబులకగు = సమాస మధ్యభాగముననున్న విశేష్యమునకు సంబంధించిన విశేషణంబుల షష్ఠికిని = విశేషణములకు రావలసిన షష్ఠీవిభక్తి స్థానమునం గూడ (అసమాసముననున్న విశేష్యములకు సంబంధించిన విశేషణముల షష్ఠికి బాలవ్యాకరణము కారకము ౨౭ సూ॥చే ప్రథమ వచ్చుచుండగా సమాసగతవిశేష్యముల విశేషణములకుఁగూడ షష్ఠికి బదులు ప్రథమ వచ్చునని యీ సూత్రము విధించుచున్నది. అందుచే నీసూత్రమున "షష్ఠికిని" అని సముచ్చయము గూర్పఁబడెను.

విశేష్యము సమాసమధ్యముననుండి విశేషణముమాత్రము వేరుగానున్నప్పుడు విశేషణమునకు విశేష్యము ననుసరించి షష్ఠీవిభక్తి రావలసియున్నను దాని స్థానమునఁ బ్రథమావిభక్తి యొక్కొక్కచోటఁ గానవచ్చునని భావము.

ఉదా॥ పార్థి...। ధర్మసుతునియొక్క పనుపు = ధర్మసుతు పన్పు ఇది షష్ఠీతత్పురుషము. (సమాసవిభక్తికి లోపము వచ్చెను) పార్థివప్రాగ్రసరుండు అనునది ధర్మసుతునియొక్క అనుదానికి విశేషణము–దీనికి విశేష్యము ననుసరించి షష్ఠి రావలసియున్నది. (చూ. బాల. కార. ౧౯ సూ॥) ఈ సూత్రముచే దానికి బదులు ప్రథమవచ్చి "ప్రాగ్రసరుఁడు" అని యయ్యెను. ఇట్లే అమ్మహాత్మునియొక్క చరితంబులు = మహాత్మ చరితంబులు "లస...విచిత్రుడు" అనునది మహాత్మునియొక్క అనుదానికి విశేషణమయినను ప్రథమాంతమయ్యెను. విష్ణునియొక్క మూర్తి = విష్ణునిమూర్తి. విష్ణునికి విశేషణము ఉత్ఫుల్లలోచనుఁడు. ఇది ప్రథమాంతముగానున్నది. త్రివిక్రమునియొక్క సొమ్ములు = త్రివిక్రము సొమ్ములు. త్రివిక్రమునియొక్క అనుదానికి విశేషణము అగు దేవుఁడు అనునది ప్రథమాంతమయ్యెను. "విస్ఫుర...విక్రముఁడు" అను విశేషణమునకు ఐన అనునది చేరుటచే బాల. కార. ౨౮ సూ॥ ప్రథమ వచ్చెను. ఈ సూత్రమునకు లక్ష్యముగాదు.

ప్రథమ రానిపక్షమునఁ బార్థివప్రాగ్రసరునియొక్క అనియుండగా "యొక్కకు లోపంబు బహుళంబు" అను సూత్రముచే యొక్క లోపించి పార్థివప్రాగ్రసరు ధర్మసుతుపన్పు అని యుండును. ఇట్లే "లసదగణ్య...విచిత్రు

నమ్మహాత్మ్య చరితంబులు'' అనియు నుండును. ఇట్లున్నిచోట్లను షష్ఠియు నుండును. కాని షష్ఠికి లోపముమాత్రము నిత్యమేయని తెలియవలయును.

సమాసము ఏకార్థీ భావప్రధానమగుటచే సమాసావయవములగు పదములు వేరువేరుగా నర్థమును బోధింపవు. సమాసము మొత్తముగా మొత్తపు టర్థమునే బోధించును. ఆ కారణముచే సమాసమునందలి పదములకు వేరుగా విశేషణములున్నచో నన్వయింపవు. రాజ్ఞః మాతంగః = రాజమాతంగః-ఇట రాజశబ్దమున కన్వయించెడి ''ఋద్ధస్య'' ఇత్యాది విశేషణములుండుట వైయాకరణ సమ్మతముకాదు. కావునఁ దెనుగునను సమాసమునఁగల పదమునకు విశేషణమును వేరుగా ప్రయోగించుటయే యుచితముగాదు. అందుచే వేరుగా విశేషణములే ప్రయోగింపఁబడనపుడు వానికి షష్ఠియుండుటయు, దాని స్థానమునఁ బ్రథమ విధించుటయు వంధ్యాసుతనామకరణమువలె నుండును. అందుచే నీ సూత్రమే జ్ఞాపకమని తలంచి సమాసగతపదములకు భిన్నపదము లన్వయింపవచ్చుననియు నయ్యది యాంధ్రభాషయందు నిర్దోషమనియు నిశ్చయించుకొనవలయును. ఇట్లు సాధ్యసమాసములందు భిన్నపదముల యన్వయము ప్రాప్తమగుచుండ సిద్ధసమాస మధ్యపదములకుఁగూడ కొన్నిచోట్ల భిన్నపదములతో సంబంధము సమ్మతమని సమాస ౩౨ సూ॥ చే॥ విధించుకొనుచున్నాడు.

ఈ సూత్రమున ''సమాసాంతర్గత'' అను చోటఁగల సమాసము సిద్ధము అని గాని సాధ్యము అని గాని చెప్పకపోవుటచే నియ్యది యుభయసమాసములకును సంబంధించిన విధివలెఁ గన్పట్టుచున్నది. అయినను ఉదాహరణము లన్నియు సాధ్యసమాసములేయగుటచే నియ్యది సాధ్యసమాసములకు సంబంధించిన విధియేయని తెలిసికొనవలయును. సిద్ధసమాసవిశేషణములు ప్రథమాంతములుగానుండుట ప్రయోగములందును గానరాదు. అయ్యది యాంధ్రభాషా సంప్రదాయ విరుద్ధము.

భవత్యర్థక ప్రయోగము ఉన్నను గమ్యమానమయిననుగూడ విశేషణమునకుఁ బ్రథమ వచ్చునని సూత్రించినచో దీని యనంతరసూత్రముగూడ సంగ్రహింపఁబడును. కనుకనే ఒక్క షష్ఠికేకాక ద్వితీయా తృతీయలకును బ్రథమ వచ్చుచున్నది.

సూ. కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకును బ్రథమ చూపట్టెడి. ౨౨

ఉ. 'అహీన బాహుబలసారఘనుల్ మధుకైటభాది దైత్య పతులనెల్లఁ ద్రుళ్ళడఁచె.' నిర్వ. ౫ ఆ. ౧౨. క. తండ్రీ 'ఘటోత్కచుఁడు మీఁ, తండ్రి గలుగఁ గాదె తల్లి ద్రౌపదితోడన్, దండ్రుల హరిదీశ్వరు లెన, మండ్రుడు వొగడఁ డెచ్చె గంధమాదనమునకున్.' జై. ౧ ఆ. ౯౭ మొ. 'షష్ఠీవిశేషణానామ్' అను బహువచన సారస్య మిట్టి ప్రయోగముల కుత్పాదకముగా నున్నయది. మఱియు నేతద్వి శేషంబు లనేకవిధంబులు గలవుగాని ప్రామాణికప్రయోగములు దొరకమింజేసి యవి యనాదృతంబులయ్యె.

విశేషణముల షష్ఠికిఁ బూర్వసూత్రమునఁ బ్రథమ విధింపఁబడెను. ఒక్క షష్ఠికేకాక విశేషణంబుల ద్వితీయాదులకును ప్రథమ కానవచ్చుటచే నీ సూత్రము రచింపఁబడెను. బాలవ్యాకరణమున "అగు" ధాతువ్యవధానమున మాత్రమే విశేషణములకు ప్రథమ విధింపఁబడెను. అగు ధాతువ్యవధానము లేకున్నను బ్రథమ వచ్చుట కీసూత్రమారబ్ధము.

కొన్ని స్థలములందు విశేషణములకు విశేష్యముల ననుసరించి ద్వితీయాది విభక్తులు రావలసియుండగా వానికి బదులు ప్రథమా విభక్తి వచ్చునని భావము.

ఉ॥ "మధుకైటభాదిదైత్యపతులను" అని విశేష్యము ద్వితీయాంతముగా నుండుటచే దాని విశేషణమగు "అహీన... ఘనులు" అను పదముగూడ ద్వితీయాంతముగా నుండవలసియున్నను ప్రథమాంతముగా నున్నది.

తండ్రీ + ...। తల్లి అనునది ద్రౌపదికి విశేషణము. విశేష్యమునుబట్టి దీనికిఁ దృతీయ రావలసియుండగా ప్రథమాంతముగనే యున్నది. ఇచట తల్లి యగు ద్రౌపది అను నర్థమున కర్మధారయ సమాసము అనియు నను కొనవచ్చును. అప్పుడు సమాసమగుటచేతనే విభక్తికి లోపము వచ్చును. కర్మధారయమునఁ బూర్వపదము స్త్రీ సమముగా నుండవచ్చునుగదా! (చూ॥ బా॥ సమా॥ ౨ సూ॥) (కనుక నీ యుదాహరణము సరికాదు.)

ఇట్లు ద్వితీయాదులకును షష్ఠి వచ్చుటకు చింతామణి సూత్రము సూచకముగా నున్నదని వ్యాకర్త యభిప్రాయము. చింతామణిలో "షష్ఠీవిశేషణానాం ప్రథమాస్యాత్" అను సూత్రముచే షష్ఠీవిశేషణములకుమాత్రమే

ప్రథమ విధింపఁబడుచున్నది. అయినను అందు "షష్ఠీవిశేషణస్య" అన్నను సరిపడుచుండగా "షష్ఠీవిశేషణానామ్"అని బహువచనాంతముగా నా పద ముండుటవలన ఒక్క షష్ఠీవిశేషణమునకేకాక ఇతరవిశేషణమునకుఁగూడ ప్రథమ వచ్చునను తాత్పర్యము ఊహింపఁబడుచున్నది. అట్లు బహువచన సారస్యమును బట్టి యూహించుటవలన ఇట్టి ద్వితీయాదులకు ప్రథమవచ్చుట శబ్దశాసనాభిప్రేతమేయని భావము.

ఇట్లు ద్వితీయాదులకుఁ బ్రథమ వచ్చుటయేకాక యింకను వివిధములయిన ప్రయోగములు సామాన్యకవుల గ్రంథములందుఁ గలవు కాని అట్టివి ప్రామాణికులగు కవులు వాడనందునఁ బరిగ్రహింపఁదగదని భావము.

సామాన్యముగా విశేషణములకు భవత్యర్థక వ్యవధానమే తెనుగునఁ దఱచుగా నుండును. విశేషణములకు ద్వితీయాదివిభక్తులు వచ్చుట వాడుకలో నరుదు. ద్వితీయ వచ్చుచున్నను తృతీయాదులు వ్యవహారమున మిక్కిలి యరుదుగా నున్నవి. స్వామిచే నిగమాతిభూమిచే సురపురోగామిచే నిత్యాదులు వర్ణనములందు గానవచ్చుచున్నను, తల్లితోడ ద్రౌపదితోడన్ అన్నట్లు ప్రయోగములుండుట అరుదేకాక వెగటుగాఁగూడ నుండును. ఇటివి అధునికములే. భాషలో సహజములుకావు.

**సూ. క్రియాన్వయంబున రెండు పదంబులకు స్వస్వామి సంబంధము గలచో సంబంధిపదంబు షష్ఠికి ద్వితీయ యగు. ౨౩**

ఉ. 'క. కొన్ని వెడమాటలాడుచు, నన్ను నతఁడు చెట్టవట్టినన్.' భార. విరా. ౨ ఆ. ౨౭౮. 'ఉ. కట్టియవైచె నెన్నుదురుగాఁ డభవత్తనయుండు మాద్రిదిలేఁ, బట్టిని.' భార. శల్య ౧ ఆ. ౩౭౭. 'రాము తమ్ముని లవుం, డిరుమూఁ డమ్ములఁ జాపముం దునుమ.' జై. ౬ ఆ. ౨౧౮. 'క. నరసూను నపుడు కర్ణుఁడు, డిరుమూఁడు శిలీముఖంబు లెదసించిన.' జై. ౭ ఆ. ౧౯ మొ.

రెండు పదములకును క్రియతో నన్వయము కలిగియుండి ఆ రెండుపదములకును స్వస్వామి భావసంబంధమున్నచో స్వామి (సంబంధి) వాచకశబ్దమునకు షష్ఠికి బదులుగా ద్వితీయ వచ్చునని యర్థము.

క్రియాన్వయంబునన్ = క్రియాపదముతో నన్వయము కలుగునపుడు స్వ = సొత్తు = ధనము. స్వామి = సొత్తుగలవాడు = అధిపతి. ఆ రెండిటికినిగల పరస్పర సంబంధము స్వస్వామి సంబంధము. (అట్టి సంబంధము ఏ రెండుపదములకేని యున్నచోన్) సంబంధిపదంబుషష్ఠికి = స్వామివాచక శబ్దముయొక్క షష్ఠికి.

రాజభటుఁడు అనుచోట రాజునకును భటునకును గల సంబంధము స్వస్వామిభావసంబంధము. ఇట్లే ధనవంతుఁడు అనుచోట ధనమునకును అదిగలవానికిని గల సంబంధము స్వస్వామిభావము. ఇట్టి సంబంధ మే రెండుశబ్దములకు గలిగియుండునో (శబ్దములచే బోధింపఁబడు నర్థములకు గల సంబంధమని భావము) ఆశబ్దములలో స్వామివాచకశబ్దమునకు శేషషష్ఠి – అనగా "యొక్క" అను షష్ఠీప్రత్యయము రావలసియున్నది. ఆ రెండు శబ్దములలో స్వామిని బోధించు శబ్దమునకుఁ గ్రియతో నన్వయము కలిగియున్నప్పుడు స్వామివాచక శబ్దముయొక్క షష్ఠికి బదులుగా ద్వితీయ వచ్చునని సూత్రతాత్పర్యము.

ఉదా॥ కొన్ని వెడమాట...। ఇటు నన్ను చెట్టవట్టినన్ అనగా నాయొక్క చెట్టవట్టినన్ అని యర్థము "నా" శబ్దార్థమునకు "చెట్ట" అను శబ్దము నర్థమునకు స్వస్వామి సంబంధము గలదు. చెట్టఅనగా చేయి. అదిగలవాడు స్వామి. అట్టి స్వామివాచకమగు "నా" శబ్దమునకు షష్ఠికిబదులుగా ద్వితీయ వచ్చి "నన్ను" అని యయ్యెను. ఇందు "నన్ను" అను పదము "పట్టినన్" అను క్రియతో నన్వయించుచున్నది.

కట్టియ...। లేఁబట్టియొక్క నెన్నుదురు. అని ఆ రెండిటికిని సంబంధము. ఇందు "లేఁబట్టిని" అని ద్వితీయవచ్చెను. దీనికి "వైచెన్" అను క్రియతో నన్వయము గలదు.

రాముతమ్మునిన్...। తమ్మునికిని చాపమునకును స్వస్వామి సంబంధము. తునుమన్ అను క్రియతో "తమ్ముని" అనుపదమున కన్వయముండుటచే ద్వితీయవచ్చెను. నరసూను...। నరసూనునకును ఎదకును స్వస్వామి సంబంధము నరసూనునకు చించుట అను క్రియతో నన్వయముండుటచే "నరసూనున్" అని ద్వితీయవచ్చెను.

ఈ సూత్రమునఁ గ్రియాన్వయమనగా క్రియలోనికి అన్వయించుట యని యర్థము. క్రియలోనికి అన్వయము దేనికి ఉండవలయును? స్వస్వామి సంబం

ధముగల రెండుపదములకునా! స్వామివాచకపదమునకా? స్వమ్మునకు (సొత్తునకు) ఎట్లును క్రియాసంబంధముండును. స్వామికి మాత్రమే స్వమ్ముతో నన్వయము మాత్రమేకాక క్రియతో నన్వయయోగ్యతకూడ నున్నచో ద్వితీయ వచ్చునని భావము చెప్పవలయును. ఉదాహరణములందు పట్టుట అను క్రియకు నన్నుపట్టినన్ అనియు, చెట్టఁబట్టినన్ అనియు రెండిటికిని క్రియాన్వయము గలదు. అట్లే అన్ని యుదాహరణములందును స్వస్వామి వాచకములకు రెండిటికిని క్రియతో నన్వయము వచ్చుచున్నది. ఇట్లు రెండిటికిని క్రియలోనికిఁ గర్మగా నన్వయము సంభవించునపుఁడు స్వామివాచకమునకును షష్ఠికి బదులు ద్వితీయ వచ్చునని తెలియవలయును. స్వామివాచక శబ్దమునకు స్వమ్ముతో నన్వయము వివక్షింపక క్రియతోడనే యన్వయము వివక్షింపవలయుననియు నప్పుడుమాత్రమే ద్వితీయవచ్చుననియు గ్రహింపఁదగును.

ఈ సందర్భమున స్వస్వామి సంబంధమనునపుడు అవయవావయవి భావ సంబంధము మున్నగునవియు గ్రహింపవలయును.

మరియొక విశేషము :— స్వామిపదమునకుఁ గ్రియతో నన్వయము కొన్నిచోట్ల సరిగానుండును. మరికొన్నిచోట్ల లాక్షణికముగా నుండును. నన్ను నతడు చెట్టవట్టినన్ అనుచోట "పట్టినన్" అనుక్రియ నన్ను అనుపదముతో సరిగనే యన్వయించును. పట్టుకొనుట తన్నే కావునఁ గ్రియలోని కన్వయము సరిగనేయున్నది. ఇచ్చటఁ దనకును జేతికిని స్వస్వామిభావసంబంధము కలదు. అవయవమునకు సంబంధించిన క్రియ అవయివికిని అవయవము ద్వారముగనే సంబంధించినదగును. రాము తమ్ముని యొక్క చాపమును దునుముటలోఁ దునుముట అనుక్రియతో చాపను అన్వయించినట్లు "రాము తమ్ముడు" అను పదము సరిగా నన్వయింపఁజాలదు. లవుఁడు రాము తమ్ముని చాపమునే తుని మెను గాని రాము తమ్మునిఁ దునుమలేదు. అందుచే నిట క్రియలోనికిఁ "దమ్ముని" అనుపద మన్వయింపదు. అయినను చాపమును తునుముట చాప ధరుని తునుముటవంటిదేయని భావించి లాక్షణికముగా తునుముటలోనికి రాముతమ్ము ననుపద మన్వయింపవలయును. ఇచ్చట చాపమునకును రాము తమ్మునికిని స్వస్వామిభావము కలదు.

స్వామి (సంబంధి) పదంబున కీ విధముగా క్రియాన్వయము గలుగు నపుఁడే ద్వితీయవచ్చునుగాని యన్వయములేనియపుడు స్వస్వామి సంబంధ మున్నను ద్వితీయ రారాదు. రాము తమ్ముఁన్ అనుచోటనే రామపదమునకు

షష్ఠికిబదులు ద్వితీయ రాదుగదా! రామపదమునకు "తునుమన్" అను క్రియతో నన్వయము సంభవింపదు. రామునికిని దమ్మునికిని స్వస్వామి భావ సంబంధమున్నను రామునికిఁ దునుముట యను క్రియతో నన్వయము లేనందు ననే రామపదమునకు ద్వితీయరాదు. రామునికిని దమ్మునికిని స్వస్వామిభావము లేదనుకొనినచో "రాముభృత్యున్ లవుం డిరుమూడమ్ముల చాపముం దును మ"నని మార్చినను రామపదమునకు ద్వితీయ రాదుగదా! కావునఁ గ్రియా న్వయము షష్ఠ్యంతమునకుఁగూడ నున్నపుఁడే ద్వితీయవచ్చుననియు నట్టి యాశయముతోడనే సూత్రమునం "గ్రియాన్వయంబున" అనుపదము గూర్పఁ బడెననియు తెలియవలయును.

స్వ స్వామి భావసంబంధముగల రెండు పదములకు (పరస్పర) అన్వ యము కలుగునెడ (సంబంధి) స్వామి పదముయొక్క షష్ఠికి ద్వితీయ రాదు. షష్ఠియే యుండును. నన్ను నతఁడు చెట్టవట్టినన్ అనుచోట నాయొక్కచేయిఅని పరస్పరాన్వయము వివక్షితమయ్యెనేని నాచెట్టనట్టినన్ అనియే యుండునుగదా!

తమ్మునియొక్క చాపము. రామునియొక్క బంటు. మున్నగుచోట్ల స్వ స్వామి భావసంబంధము తమ్మునికిని చాపమునకును, అట్లే రామునికిని బంటు నకును గలదు. సంబంధము రెండు వస్తువులయందును ఉండును. తమ్మునికిని చాపమునకును గల సంబంధము తమ్మునియందును చాపమునందును గూడ నుండును. ఇట్లే సంబంధమెప్పుడును ఉభయ నిష్ఠము. ఆ రెండును సంబంధులే యగును. అనగా తమ్ముఁడును సంబంధియే. చాపమును సంబంధియే. ఈ సూత్రమునందలి "సంబంధి పదంబు"అను పదమునకు స్వామిత్వము గల సం బంధి యనియే యర్థము చేయవలయును. చాపము మున్నగు స్వామిత్వములేని (సొత్తు) స్వవాచక పదములను గ్రహింపరాదు. వానికి షష్ఠియే యుండదు. అందుచే సంబంధి పద మనగా "స్వామి" పదమని యర్థము చేసికొనవలయును.

ఆలోచింపగా నీ సూత్ర మనావశ్యకము. (సంబంధి) స్వామి వాచక శబ్దము క్రియతో నన్వయించునపుడు అయ్యది కర్మ యగును. కర్మకు ద్వితీయ యెట్లయినను వచ్చునుగదా! క్రియతో నన్వయించునపుడు కర్మత్వ కర్తృత్వా దులు వివక్షితములుకాక తప్పదుగదా! ఎట్టి సంబంధము క్రియతో వివక్షిత మగునో దాని కనుగుణమగు విభక్తి రానేవచ్చును. మరల ద్వితీయగా విభక్తి విధానము అనావశ్యకము,

కొన్ని ...। అనునది సరియగు నుదాహరణము కాఁజాలదు. ఇందు 'నన్ను'' అనునది వెడమాటలాడుచు నను పదముతో నన్వయించి ''పట్టినన్'' అను క్రియలోనికి ''చెట్టు''అను పదమును గర్మగా నన్వయించినను సరిపోవును. నన్ను అనునదియుఁ జెట్టు అనునదియుఁ గూడ ''పట్టినన్'' అను క్రియతోడనే అన్వయింపనక్కరలేదు. ఈ సంబంధి పదములకు రెండిటికిని రెండు క్రియలు సరళముగా నన్వయించుచునే యున్నవి.

ఇట్లే కట్టియ ... అనునదియు సరియగు నుదాహరణము కాఁజాలదు. ఇందు సంబంధి వాచకములగు లేఁబట్టి, నుదురు అను రెండు శబ్దములకును వేర్వేరుగాఁ గ్రియలు గలవు. నెన్నుదురు గాడునట్లు మాద్రిలేఁబట్టిని కట్టియన్ (బాణముతో) వైచెన్ (కొట్టెన్)అని అన్వయము. "లేఁబట్టిని"అనునది ''వైచెన్'' అను క్రియలోనికిఁ గర్మగా నన్వయించునే కాని షష్ఠ్యంతము కాఁజాలదు. కాని ప్రౌఢవ్యాకర్త మాత్రము అట్లు అన్వయింపక మాద్రిలేఁబట్టి యొక్క, నెన్నుదురుగాడు నట్లు కట్టియను (బాణమును) వైచెన్ (ప్రయోగించెను) అని సమన్వయము కావించెను. మీద చెప్పినరీతిని కట్టియ అను పదమును తృతీయాంతముగా సమన్వయించినచో ''వైచెన్''అను క్రియలోనికి కర్మగా ''లేఁబట్టిని'' అనునది యన్వయించును. అందుచే నియ్యదియు సరియగు నుదాహరణము కాజాలదు. ఇక జైమిని భారతోదాహరణములు మాత్ర మొకే క్రియలోనికి రెండు పదములును నన్వయించుచుండుటచేత క్రియలు (తునుమ — చించిన) షష్ఠ్యంతములతో సాక్షాత్తుగా నన్వయింపక స్వ(సొత్తు) వాచకములతోడనే సరళముగా నన్వయించుటచెత నుదాహరణములు కావచ్చును.

**సూ. ఒక్కచో ద్వితీయాంత విధేయ విశేషణంబునకుం బ్రథమయు నగు.** ౨౩

ఉదా॥ "ఉ. ఎవ్వనిం, బ్రాకట ధర్మతత్త్వవిదు బ్రాహ్మణముఖ్యుఁ బురోహితుండుగాఁ, జేకొనువారము''. భార. ఆది. ౭ఆ. ౧౫౨. ''క. రయమున మ్రింగుడుగాలము, క్రియ నెవ్వఁడు కంఠబిలము క్రిందికిఁ జనక, గ్నియుఁబోలె లో దహించును భయరహితా! వాని నెఱుఁగు బ్రాహ్మణ కులుఁగాన్''. భార. ఆది. ౨ఆ. ౬౦మొ

విశేషణములు ఉద్దేశ్యములు, విధేయములు, అని రెండు విధములుగా నుండును. వాక్యమున నుద్దేశ్యాంశమునం జేరిన యుద్దేశ్య విశేషణ మనియు

విధేయాంశమునంజేరిన విధేయ విశేషణమనియుఁ దెలియఁదగును. (చూ. వాక్యపరి. ౬వ. సూ॥) అట్టివానిలో విధేయ విశేషణము విశేష్యమునను సరించి ద్వితీయాంతముగా నుండవలసి యుండగా ప్రథమాంతముగాఁ గూడ నుండు నని యీ సూత్రము విధించుచున్నది.

ద్వితీయాంత విధేయ విశేషణమునకు = ద్వితీయావిభక్తి యంతమునఁ జేరవలసిన విధేయ విశేషణమునకు ప్రథమయును = ప్రథమావిభక్తి కూడ అగును = వచ్చును. అనగా ద్వితీయకు బదులు ప్రథమ వికల్పముగావచ్చును. ప్రథమ రానిపక్షమున ద్వితీయ యుండునని భావము.

ఉదా॥ ఎవ్వనిం ...। పురోహిత శబ్దము విశేష్యమగు "బ్రాహ్మణముఖ్యున్" అనుదాని ననుసరించి ద్వితీయాంతము కావలసియుండగా "పురోహితుండు" అని ప్రథమాంత మయ్యెను. ప్రథమావిభక్తి రాక ద్వితీయ వచ్చుటకుదాహరణము "రయమున. .।" వానిని అను విశేష్యము ననుసరించి "బ్రాహ్మణకులున్"అని విధేయ విశేషణము ద్వితీయాంతముగా నే యుండిపోయెను.

విధేయ విశేషణము విశేష్యము ద్వారమునంగాక స్వతంత్రముగనే క్రియతో నన్వయించును. విశేష్యమును విధేయ విశేషణమును ఒకే క్రియతో నన్వయించినచో విశేష్యము ననుసరించి విశేషణము గూడ ద్వితీయాంతముగా నుండును. వేరొక క్రియతో నన్వయించెనేని క్రియాన్వయయోగ్యముగాఁ బ్రథమాంతమే యగుచుండును. ఎవ్వనిన్ .। అను నుదాహరణమున "చేకొనుట" అను క్రియలోనికి విశేష్యమగు బ్రాహ్మణముఖ్యున్ అనునది అన్వయించును. కావున దానికి ద్వితీయ వచ్చెను. "పురోహితుండు"అను విశేషణము చేకొనుటలోని కన్వయింపక "కాన్"అను అగు ధాత్వర్థములోని కన్వయించుచున్నది. అగు ధాతువు అకర్మకము. అందుచే దానికిఁ గర్మ యుండదు. "పురోహితుండు" అను పదము అగు ధాతువులోఁ గర్తగా నన్వయించుటచేఁ బ్రథమాంత మయ్యెను. కారక స్వభావమును బట్టి గదా విభక్తి ప్రత్యయములు చేరుచుండును. వాని నెఱుఁగు...। అనుచోట బ్రాహ్మణకులున్ అనునది "ఎఱుఁగు" అను క్రియలోనికే యన్వయించుట వివక్షితము. అందుచే దానికి ద్వితీయ వచ్చెను. ఇట్లు అన్వయ వివక్ష ననుసరించి విభక్తులు వచ్చుచుండును. అయినను నిట్టి శబ్దాన్వయ రహస్యము క్లిష్టముగా నుండుటచే స్పష్ట ప్రతిపత్తికై విభక్తివిధానము నిట్లు గావించెనని తెలియఁదగును.

సూత్రమున "విధేయ విశేషణంబు ద్వితీయకు ప్రథమయు నగు"నవక "ద్వితీయాంత విధేయ విశేషణమునకు" అనుటచే ద్వితీయావిభక్తితోఁ గూడిన విధేయ విశేషణమునకు ద్వితీయా విభక్తి యుండగనే ప్రథమ చేరునని భ్రాంతి కలుగును. ఈ సూత్రరచన నిస్సందేహముగా నుండవలయునన్నచో ద్వితీయకుఁ బ్రథమ నాదేశింపవలయును.

సూత్రమునఁ "గొన్నియెడల"అను పదముచేతనే వికల్ప మను నర్థము సిద్ధించుచుండగా మఱల సముచ్చయార్థక శబ్దమును గూడ సూత్రమునం జేర్చుట యనావశ్యకము. ఇట్లీతడు చాల చోట్ల ప్రయోగించి యున్నాడు. అయ్యది విచార్యము.

**సూ॥ కొన్ని యెడల విధేయ విశేషణమొండ బహువచనాంతంబయి విశేష్యంబులు పెక్కిటి కన్వయ యోగ్యంబగు. ౨౨**

ఉ. "క. ఇది దక్షిణా పథంబున, కిదియు విదర్భాపురమునకిది కోసలకిం, దిది యుజ్జయినికిఁ దెరువులు, మది నిన్నిటిలోన నరుగ మన కెద్దియగున్?" భార. ఆర. ౨ఆ. ౬౯. బహువచనాంతము కాక యేక వచనాంతమైనచోఁ దెరువులై దుండవలెను.

ఒండు + అ = ఒండ = ఒక్కటియే.

కొన్నిచోట్ల విశేష్యములు అనేకము లుండగా విధేయ విశేషణము మాత్రము ఒక్కటియే ప్రయోగింపఁబడును. అట్టిచో నా విశేషణము బహువచ నాంతముగా నుండవలయును. అట్లు విశేషణము బహువచనాంతముగా నున్నచో విశేష్యములన్నిటితోడను నన్వయించును. అని భావము.

ఉదా॥ ఇది...। ఇది దక్షిణాపథమునకుఁ దెరువు. ఇది విదర్భాపురము నకుఁ దెరువు ఇది కోసలకుఁదెరువు. ఇది యుజ్జయినికిఁ దెరువు. ఇన్నిటిలోనన్ మనకు ఏ తెరువు అరుగ నగును. అని యీ పద్యమునకు భావము. ఈ చెప్పిన రీతిని "తెరువు" అను పదములు అయిదుచోట్ల నుండవలసి యున్నది. కాని "తెరువులు" అను విధేయ విశేషణము బహువచనాంతముగా నుండుటచే ఈ యొక్క పదమే "ఇది"అను నాల్గు పదములకును "అది"అను నొక పదము నకును గూడ మొత్త మయిదు విశేష్యములకును నన్వయించుచున్నది. ఏకవచ నాంతముగా నున్నచో మీఁదఁజెప్పినరీతి నయిదుసారులు "తెరువు" పద

ముండవలసివచ్చును. ఈ విషయమునే "బహువచనాంతము కాక" మున్నగు వాక్యముచే వివరించెను.

సూ॥ కొన్నియెడల విభక్తి పరిణామంబు గ్రాహ్యంబు. ౨౬

ఉ॥ "ఈ, తనితో సాటియనంగ మేలన". (మేలన=ఈతని కంటె మేలన. ఇక్కడఁ దృతీయకుఁ బంచమిగా మార్పు గలిగెనని తెలియవలయు). నిర్వ. 3ఆ. ౬౧. పె.

కొన్ని స్థలములలో నొక పదము పలుచోటుల కన్వయింపవలసినచో నన్వయించుచునే యుండును. "ఒక్కొక కన్నును జెవియును" ఇందు ఒక్కొక అను పదము కన్నుతోడను, జెవితోడను గూడ నన్వయించును గదా! ఇట్లు ఒక పదము పలుపదములతో నన్వయించునప్పుడు కొన్నిచోట్ల విభక్తులను మార్చి యన్వయింపవలసియు నుండునని సూత్ర తాత్పర్యము. "ఈతనితో సాటియనంగ....।" ఇందు "ఈతనితోన్" అను శబ్దము తృతీయాంతముగా గాక కంటె అను పంచమీ విభక్తిం గూడి మేలు అను పదముతో నన్వయించును. ఈతనితో సాటియనంగను, ఈతనికంటె మేలనంగను — అని యర్థము వచ్చునట్లు విభక్తి మాఱవలయును అని భావము. ఈతనితోన్ అను తృతీయాంతము మేలు అను పదముతో నన్వయించుటకు యోగ్యము కాదుగదా.

సూ॥ తచ్ఛబ్దాంతములగు ధాతుజ విశేషణంబులమీఁద నరు చూపట్టదు. ౨౭

ఉ॥ "శా. ఏయే దేశములం జరించితిరి మీ రేయే గిరుల్ చూచినా, రేయే తీర్థములందుఁ గ్రుంకిడితి రేయే ద్వీపముల్ మెట్టినారు". స్వా. ఆ. ౬౮ పె.

బాలవ్యాకరణమున "యుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున" కార. ౩౩ అను సూత్రము యుష్మద్విశేషణములకు "వురు" అస్మద్విశేషణములకు "ను ము" లును సంజ్ఞాగమములుగా వచ్చుననియు నవి పరంబులగునపుడు పూర్వమున నుత్వమున్ను, కార. ౩౪సూ. విధించెను. వానిలో "రు" అనుదాని పూర్వమున నాదిష్టమగు "అ"కారముతోఁ గూర్చి "అరు" అని ఇందు నిర్దేశించెను. అట్టి "అరు" తచ్ఛబ్దాంతములయిన ధాతుజ విశేషణములకు మాత్రము రాదని భావము.

తచ్ఛబ్దాంతములు = వాడు మున్నగునవి అంతమునఁ గలవి. ధాతుజ విశేషణములమీఁద = ఉన్న, కల, న, మున్నగు ప్రత్యయములు అంతమునఁ గల ధాతుజ విశేషణములు. అనగా చూచిన + వారు = చూచినారు. మెట్టిన + వారు = మెట్టినారు మున్నగువానిమీద అరు = బాలవ్యా॥ కార. ౩౩సూ. చే విధింపబడిన "రు"వర్ణము. చూఁపట్టదు = రాదు.

ఉదా॥ మీరే...। చూచినారు, మెట్టినారు అనునవి తచ్ఛబ్దాంత ధాతుజ విశేషణములు. వీనిమీద "మీరు ధన్యులరు" అనునట్లు అరు చేరవలసియుండగా చేరలేదు. ఇట్టివానిమీద "అరు" ఎచ్చటను రారాదని చెప్పుటకే యీ సూత్రము రచింపఁబడెను. చూచినారరు, మెట్టినారరు అను రూపము లసాధువులని తాత్పర్యము.

ఇది కారక పరిచ్ఛేదము.

---

# సమాస పరిచ్ఛేదము

**సూ. సమాసమనఁగా సంయోగ దశయందుఁ గలిగెడు విభక్తి లోపాత్మకపద స్వరూప సంగ్రహము. (ఇది లుక్సమాస విషయము).**

సమాసమనగా సంగ్రహమనియు వ్యాసమనగా విస్తరమనియు నర్థము. కనుకనే పదములు విడిగా నున్నచో వ్యస్తములనియు నొకపదము వేఱొక పదముతోఁ గూడి యేకత్వమును జెందినచో సమస్తములనియు వ్యవహరింపఁబడును.

రెండు పదముల నేకపదముగాఁ జేయునపుడు ప్రాతిపదికములు రెండును గలసి సమాస సంజ్ఞంబొంది యేకప్రాతిపదికముగా నేర్పడి వాని విభక్తులు లోపించి పిమ్మటనంతమున సందర్భయోగ్యమగు విభక్తితోఁ జేరి పదత్వమును జెందును.

రాముని + యొక్క + భటు + ఁడు. ఇట్లు రెండు పదములు విడిగా నుండునపుడు సమాస సంజ్ఞయుఁ బ్రాతిపదిక సంజ్ఞయుఁ గలిగి విభక్తులు లోపించి రాముని + భటు — అని యయి సందర్భానుగుణముగా మఱలఁ

ప్రథమాది విభక్తులంతమునఁ జేరగా "రాముని భటుఁడు" మున్నగురీతిని పదము లేర్పడును. వీనినే సమాసములందురు. రామునియొక్క భటుఁ డనుదానికంటె రాముని భటుఁ డనునది సంగ్రహరూపమగుటచే సమాసమనఁబడుచున్నది.

సంయోగదశయందనగా రెండుపదము లేకపదముగాఁ గలియునపుడు కలిగెడి విభక్తిలోపమును బొందియుండిన పదముల సంగ్రహ స్వరూపము సమాసమనఁబడునని వ్యాకర్త యాశయము. లుప్తవిభక్తికపద సంగ్రహస్వరూపమని తాత్పర్యము. (విభక్తేర్లోపోయత్ర = విభక్తిలోపః)

సమాసములలోఁ గూడఁ గొన్నిచోట్లఁ బూర్వవిభక్తులు లోపింపవు. అట్టి సమాసముల కీ లక్షణము వర్తింపదు. విభక్తిలోపము గల సమాసములకే యీ లక్షణము వర్తించునని భావము. లుక్ = లోపము. లోపముగల సమాసము లుక్సమాస మనంబడును. లోపములేని సమాసము నలుక్సమాసమని వ్యవహరింతురు.

**సూ. షష్ఠీ తత్పురుషంబులందు నగాగమంబు విభాష నగు. ౧**

ఉ॥ ఎలజవ్వనంబున విలసనంబు. భార. ఆది.౩ ఆ.౨౭ యోగ క్షేమంబున తెఱఁగు. భార. ఉద్యో.౧ ఆ.౨౭౮. అరదంబున యుర వడికిన్. నిర్వ.౬ ఆ.౧౨౯. మొ॥

షష్ఠీ తత్పురుష సమాసములలో షష్ఠ్యంతమగు పదమునకు నగాగమము వికల్పముగా వచ్చును.

ఇందు "క్" అనునది ఇత్సంజ్ఞకము. కనుక లోపించును. "న" అనియే యాగమము. కిత్తగుటచే నంతమున కీ యాగమము చేరును. అంతమున కన్నగా సమాసమునందలి పూర్వపదమునకు (షష్ఠ్యంతపదమునకు) అంతమునఁజేరును. షష్ఠీతత్పురుషంబులందుఁ బూర్వపదంబునకు నగాగమంబగునని సూత్రించియుండిన సుస్పష్టముగ నుండును.

ఉదా॥ ఎలజవ్వనంబుయొక్క + విలసనంబు — విభక్తిలోపము. ఎల జవ్వనంబు + విలసనంబు — నగాగమము. ఎలజవ్వనంబున + విలసనంబు = ఎలజవ్వనంబున విలసనంబు. ఈ యాగమంబు వైభాషికము కావున రానిచో "నెల జవ్వనంబు విలసనంబు" అనియుండును. ఇట్లే యోగక్షేమంబున తెఱఁగు, అరదంబున యురవడికిన్, అనునవి యూహ్యములు.

''జవ్వనంబునందలి విలసనంబు'' అని యధికరణత్వము వివక్షించి జవ్వనంబున నని సప్తమ్యంతముగా దీనిని భావించి యిది వ్యస్తప్రయోగమని తలంచుట కవకాశములేదు ''న'' అను విభక్తి ద్రుతాంతమగుటచే ద్రుత కార్యములు రావలసియుండును. అట్లయిన యోగక్షేమంబున తెఱఁగను ప్రయోగము కుదురదు. యోగక్షేమంబునఁ దెఱఁగు అని యుండవలయును ఇట్లే యరదంబున నురవడికిన్ అని యేకాని యరదంబున యురవడికి ననియుండదు కనుకనే కువలయంబున వారు మున్నగు సమాసములందు నవర్ణకము వేరుగా విధించుకొనవలసివచ్చెను. (చూ. ౩౨ సూ. వ్యాఖ్య)

పరిశీలింపఁగా నీ ప్రయోగములందు ద్రుతకార్యములు గలవనినను విరోధమేమియును లేదు. ఉదాహృతప్రయోగములు యతిప్రాసాది స్థలములు కావుగదా!

ఈ నగాగమము సామాన్యముగా నన్నిశబ్దములకును విధింపఁబడినట్లు సూత్రమునుబట్టి కానవచ్చుచున్నను ఉకారాంత జడములకేకాని యన్యములకు రాజాలదు ఏనుఁగు, లత, మున్నగు శబ్దములకు నగాగమములను సమ్మతింపముగదా! కావున సూత్రమునందలి విభాషాపదము బలముచే నిట్టిచోట్ల రాదనియు నుకారాంత జడవాచకములకే వచ్చుననియు నూహింపవలయును. (ఈవిషయముగూడ దీని సప్తమీవిభక్తి ప్రత్యయరూపత్వమును జాటుచున్నది.

**సూ** కర్మధారయంబు బిరుదాఖ్యోత్తరపదం బయ్యేనేని ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచకంబగు పూర్వపదంబు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగా నగు.

అంతట ననగా సాంస్కృతికాదులు మూఁట నని యర్థము.

ఉ॥ రామాశాస్త్రి, సుబ్బాశాస్త్రి, రామానాయఁడు, సుబ్బానాయఁడు, రామారెడ్డి, సుబ్బారెడ్డి, ఎల్లాశెట్టి, వీరాశెట్టి, కుప్పాసామి, వీరాసామి, రామారాయఁడు, సుబ్బారాయఁడు, రామారావు, సుబ్బారావు, ఎఱ్ఱాప్రెగ్గడ, చిన్నాదేవి. బొ.॥ బహుళంబుగా ననుటచే రామరాయఁడు, సుబ్బరావు, ఎఱ్ఱప్రెగ్గడ, యిత్యాదులందు దీర్ఘంబు వైకల్పికంబు. కృష్ణశాస్త్రీత్యాదులందు దీర్ఘంబు కలుగదు.

తత్పురుష విషయమును బ్రథమసూత్రముచె వచియించి తద్విశేషమగు కర్మధారయము విశేషములను జెప్పుచున్నాఁడు.

బిరుదాద్యుత్తరపదంబు = బిరుదములు జాతిసూచకములు మున్నగు శబ్దములు రెండవపదముగా నున్నయట్టిది ద్వ్యక్షర = రెండక్షరములుగలదియు, అదంత = హ్రస్వాకారమంతమునఁ గలదియు, స్త్రీ పుం సంజ్ఞావాచకంబును = స్త్రీ పురుషులలో నొకరిసంజ్ఞను చెప్పుచున్నదియు, పూర్వపదంబు నంత్యాక్షరమునకు = పూర్వపదముయొక్క చివఱియక్షరమునకు, అంతటుమ = సాంస్కృతి కాచ్ఛిక మిశ్రమము లనఁబడు మూఁడు సమాసములందును.

కర్మధారయ సమాసమున రెండవపదము శాస్త్రి, నాయఁడు, మున్నగు బిరుదశబ్దముగాని రెడ్డి, సెట్టి, మున్నగు జాతివాచకాదికముగాని అయినచోఁ బూర్వపదము చివరనున్న అకారమునకు దీర్ఘమువచ్చును. ఆ పూర్వపదము రెండక్షరములుగలది కావలయును అట్లే స్త్రీ సంజ్ఞకాని పురుష సంజ్ఞకాని కావలయును. ఇట్టి దీర్ఘము బహుళము ఇయ్యది ముత్రివిధములగు సమాసములకును రావచ్చును అని తాత్పర్యము.

రామ + శాస్త్రి. ఇట రెండుపదములును సమానాధికరణములగుటచే కర్మధారయ సమాసము. ఇందు రెండవపదము పాండిత్యసూచక బిరుదము. పూర్వపదము (రామ అనునది) అదంతము. రెండక్షరములుగలది. పురుషునికి సంజ్ఞయును. అందుచే చివఱి అకారము దీర్ఘమయి రామాశాస్త్రి అయ్యెను. ఇట్లే అన్నియు నూహ్యంబులు. చిన్నాదేవి అనునది మాత్రము స్త్రీ సంజ్ఞకుదాహరణము.

బహుళమనుటచే నీవిధి కొన్నిచోట్ల వికల్పమనియుఁ గొన్నిచోట్ల నిత్యమనియు వ్యాకర్తయె వివరించెను. అందు రామరాయఁడు, రామారాయఁడు, సుబ్బరావు, సుబ్బారావు, ఎఱ్ఱప్రెగ్గడ, ఎఱ్ఱాప్రెగ్గడ, అని ద్వివిధముగా వాడుకచూపట్టుటచే నిచ్చట వైకల్పికమనియు, కృష్ణశాస్త్రి అనునది కృష్ణాశాస్త్రి యని యెచ్చటను వినరాకుండుటచే నిట దీర్ఘము రానేరాదనియు వివరించెను.

ఇతఁడిట్లు వివరించుటచే మిగిలిన యుదాహరణములందు దీర్ఘము నిత్యమని తలంపరాదు. రామాశాస్త్రి రామశాస్త్రి అని రెండువిధములుగా వినవచ్చుచున్నవి. నిత్యత్వ వైకల్పికత్వములు ప్రయోగములనుబట్టి నిశ్చయింపవలయును.

ఇవన్నియు సంజ్ఞావాచకములు గాన ననుశాసనయోగ్యములుకావు. అయినను ప్రయోగములలోఁగల వైవిధ్యమును మాత్రము తెల్పుట కీ సూత్రముపయోగించును. ఈ సమాసములు సిద్ధసమాసములనుటకు వలనుపడదుగదా! సాధ్య సమాసము లగునపుడు కర్మధారయమునఁ బూర్వపదము డుమంతము

కారాదు. అందుచే రామ, వీర, కృష్ణ, మున్నగు శబ్దములు కర్మధారయ పూర్వ పదము లగుటకే వలనుపడదు. అట్టియోగ్యతకూడ నీవిధానముచేతనే సంపాదింప వలయుననియు బహుళపద మిందుకు సాధకమనియుఁ దలంపవలయును. లేదా ఆరవసూత్రము జ్ఞాపకమనియైనను దలంపవలయును.

సూ. ఇటఁ బూర్వపదంబు నత్వంబున కిత్వంబు బహుళంబుగా నగు. 3

ఉ॥ సుబ్బినాయఁడు. ఎల్లిసెట్టి. మొ॥ రామిసెట్టి, సుబ్బిసెట్టి యిత్యాదులం దిత్వంబు నిత్యంబు.

ఇట యనగాఁ బూర్వసూత్రోక్తమగు దీర్ఘమువచ్చు స్థలమున (ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచక పూర్వపద, బిరుదాద్యుత్తరపద, కర్మధారయము నందనిభావము) పూర్వపదంబు నంతమునంగల హ్రస్వాకారమునకు ఇత్వము బహుళముగా వచ్చునని తాత్పర్యము.

సుబ్బ + నాయఁడు = సుబ్బినాయఁడు. ఎల్ల + సెట్టి = ఎల్లిసెట్టి. పూర్వ సూత్రముచే దీర్ఘమయినను రావచ్చును. సుబ్బానాయఁడు, ఎల్లాసెట్టి, అని వెనుక నుదాహరింపఁబడెనుగదా! ఈ సూత్రమునఁగల బహుళపద బలముచే రామిసెట్టి, సుబ్బిసెట్టి, ఇత్యాదులం దికారము నిత్యముగావచ్చునని తాత్పర్యము.

సూ. కొన్నియెడల నిచ్చో ననాపామా యాగమంబు లగు. 4

ఉ॥ తిక్కనసోమయాజి, నన్నపార్యుఁడు, కృష్ణమనాయఁడు, నన్నయభట్టు. మొ॥

ఇచ్చో ననగా ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచక పూర్వపద బిరుదాద్యుత్తరపద కర్మధారయమునందలి పూర్వపదంబు నకారమునకు అన, అప, అమ, అయ, అనునాగమములు అంతావయవములుగా వచ్చుననిభావము.

ఉ॥ తిక్క + సోమయాజి. "అన" ఆగమము. తిక్క + అన + సోమయాజి = తిక్కనసోమయాజి. ఇట్లే మిగిలినవియు. ఇవియును గొన్నియెడలనే వచ్చును. "అప, అన, అయ," ఇవి పుంవాచకములకును "అమ" ఉభయములకును జేరును.

సూ. షైయాగమంబులు కొన్నియెడల ద్విత్వయుక్తంబు లగు. 5

ఉ॥ రామన్నసెట్టి, తిమ్మప్పనాయఁడు, కృష్ణమ్మపంతులు, మల్లయ్యశాస్త్రి. మొ॥ కృష్ణమ్మయనుచో అమ్మ ప్రేమసూచకంబని యెఱుంగునది. ఉ॥ ఆనరసింగభూపతి ప్రియంబెసగం బినకొండ మాంబ యం, దానమితాఖిలాహిత సమాజుఁ దనూజునిఁ గాంచె బంధు సంతాన సురావనీజు సముదంచిత భోగబిడౌజు సూరి మైత్రీనవభోజు భానునిభ తేజుని గృష్ణమరాజు నున్నతిన్. కళా.౧ ఆ.౭౪. మొ॥

పైయాగమంబులు = అన, అప, అమ, అయ, అనునాగమములు. ద్విత్వ యుక్తంబులు = అన్న, అప్ప, అమ్మ, అయ్య, అను తీరున ద్విరుక్తిగలవి.

కొన్నియెడల మీఁదఁజెప్పిన యాగమంబులు ద్విరుక్తహల్లు గలవియు నగును. అనగా అన్న, అప్ప, అమ్మ, అయ్య అనువిధముగను నుండునని తాత్పర్యము. "రామన్నసెట్టి" ఇట నకారము ద్విరుక్తముగా నున్నది. ఇట్లే మిగిలినవియు.

ఈ యాగమములో అన, అప, అయ అనునాగమములు పుం సంజ్ఞా శబ్దములకును అమ స్త్రీ సంజ్ఞాశబ్దములకును సాధారణముగా వచ్చుచుండును' కాని వ్యాకర్త వీనిని దేనికేదివచ్చునో విభజించిచెప్పలేదు. అయినను ఇవి ప్రయోగముల ననుసరించి స్త్రీ పుం సంజ్ఞాబోధకము లనకతీరదు. అందుచే అమ్మ అనునది స్త్రీ బోధకమే యయినను కొన్నిచోట్ల మఱికొన్ని అర్థములను బోధించుచుఁ బురుషసంజ్ఞల కాగమముగా నుండునని వ్యాకర్త యాశయము. కనుకనే కృష్ణమ్మపంతులు అనుచోట "అమ్మ" ప్రేమసూచకమగుచు పుం సంజ్ఞాశబ్దమున కాగమమగుట విరుద్ధముకాదని యభిప్రాయమును సూచించెను.

"అమ్మ"కు, రూపాంతరమగు "అమ" పురుషసంజ్ఞ కాగమమగుటకుఁ బ్రయోగమును జూపుచున్నాఁడు. "ఆనరసింగ... ..." ఇందుఁ గృష్ణమరాజు అనుపదమునకు పుం సంజ్ఞ యయినను "అమ" చేరెను. ఇచట "అమ" రాజు నందుఁగల ప్రేమను సూచించును.

ఈ అనాదుల నాగమములనుట యుచితముగాలేదు. ఆర్యాంబాద్యర్థకము లయి పృథక్ప్రయోగయోగ్యములగుచున్న యీ శబ్దములను ఆగమములని విధించుకొనవలసిన యావశ్యకత యేమియులేదు ఆర్యాద్యర్థకములు శ్లేష్మతా వాచకములగుచు నామంబులకుఁ జేర్చునని సంధి ౧ సూత్రమునఁ భాషుషు

అంగీకరించియే యున్నాడు. సంధి ప్రథమసూత్రమునఁ జెప్పినరీతిని అంగాదు లార్యాద్యర్థకములేయనియు వీనికి కర్మధారయ సమాసముగా సంజ్ఞావాచకము లతో కూడిక సంభవించెననియుఁ దలంచిన నీ యాగమవిధాన మనావశ్యకము.

మఱియు అయ్యాదు లక్కటాదులలోనివనియు వానిజడ్డకు లోపంబు బహుళముగా వచ్చుననియు బాల. ప్రకీ.౮ సూత్రమువలనఁ దెలియఁబడుచునే యున్నది. వీనిని మొదట నద్విత్వములుగా విధించుకొనుటయు మఱల ద్విత్వము వికల్పముగాఁ జెప్పికొనుటయుఁగూడ నిరర్థక ప్రయాసములే. ఈ సందర్భమున నయ్యాదులలోని ద్విత్వము లోపించుటకై "అన్నాదులలోని ద్విత్వము బహుళముగా లోపించున"ని సూత్రించి పై రెండు సూత్రములను దీసివేయవచ్చుననుటయు సరికాదు. ద్విత్వలోపమునకు నూతనసూత్రనిర్మాణ మక్కఱలేకయే పై రెండు సూత్రములను దీసివేయవచ్చును.

**సూ. కర్మధారయం బియ్యాది మిశ్రంబు సిద్ధసమాసం బట్లయగు. ౬**

**ఇట్లనుటచేఁ బూర్వపదంబు లుప్తవిభక్తికంబయి యవికృతాంతంబగునని యెఱుంగవలయును. ఉ॥ కృష్ణరాయఁడు, రామరావు. మొ॥**

కర్మధారయం బియ్యాది = ఈ కర్మధారయము (అనగా బిరుదాద్యుత్తర పద స్త్రీ పురుష సంజ్ఞావాచక పూర్వపద కర్మధారయమని భావము)

వెనుకచెప్పఁబడిన సమాసములలో మిశ్రకర్మధారయము సిద్ధసమాసము వలె నగును. అనగా "రామ" మున్నగుశబ్దములు విభక్తిలోపించుటయేకాక ఉకారము మున్నగు తత్సమత్వమువలన సంభవించెడి వికారమునుబొందక సిద్ధసమాసమునందువలెనే సంస్కృత ప్రాతిపదికరూపముతోడనే యుండును. (చూ. సూత్రవివరణాంతమునందలి రామరావు.)

రామకృష్ణాది శబ్దములు మిశ్రసమాసములందుఁ బూర్వపదములుగా నుండుటకుఁ దెనుగున వలనుపడదు. సాధ్యకర్మధారయమున డుమంతములు పూర్వపదములుగా నుండరాదనియుఁ ద్రికస్త్రీసమముగంత ధాతుజవిశేషణ పూర్వపదముగనే కర్మధారయ ముండుననియు బాలవ్యాకర్త యాశయము (చూ. బాల సమా. ౨ సూ.). అందుచేఁ గృష్ణరాయఁడు రామరావు మున్నగు సమాసములు సిద్ధింపవు. సమాసవిధాయకమే లేనియపుడు ఆత్వేత్వాదుల విధానము నిరర్థకము అందుచే దీనికి (డుమంతములకు) సమాసవిధానము గూడ నీ సూత్రముచేతనే జ్ఞాపితమని తలంపవలయును.

ఈ సూత్రముచే విధింపఁబడిన సిద్ధసమాసవద్భావము ద్వ్యక్షరాదంతములకేకాక బహ్వక్ష రేకారాంతాదులకును వచ్చునని తలంపవలయును. రామరావు అనునట్లు నారాయణరావు, దాశరథినాయఁడు మున్నగుపదములును గానవచ్చుచున్నవిగదా! ౨, ౩, సూత్రములచే విధింపఁబడిన అత్వేత్వములు మాత్రము ద్వ్యక్షరాదంతములకే వచ్చునుగాని అనాపామాదులును రాయాదులును అన్నిటికిని ఉత్తరపదములుగా నుండవచ్చును. అందుచేతనే 'కర్మదారయం బియ్యది' అనుపదములకు "బిరుదాద్యుత్తరపద స్త్రీ పుం సంజ్ఞావాచక పూర్వపద కర్మధారయము" అని యర్థముచెప్పవలయును. ద్వ్యక్షరా దంతత్వమును మాత్రము వివక్షింపరాదు. సమాసవిధానముగూడ నీ సూత్రముచేతనే జ్ఞాపితమని యూహించి జ్ఞాపితసమాసవిధానముకూడ నిట్టిశబ్దములకేయని భావింపవలయును. ద్వ్యక్షరాదంతములకని నియమింపరాదు. అట్లయినచో నారాయణరావు, దాశరథినాయఁడు, శంకరయ్య, సంజీవయ్య మున్నగు సమాసములు అశాస్త్రీయములు కావలసివచ్చును. వీనిని అవ్యుత్పన్నములని తలంపలేదు కావున సమాసవిధానముకూడ నిట్లే సంపాదింపవలయును.

కృష్ణ + డు + రాయ + డు. ఇట సామాసిక విభక్తిలోపమేకాక కృష్ణశబ్దము నకారమునకు ఉకారాదేశముకూడ రాక సంస్కృత ప్రాతిపదికమే యట్లెయుండి సమసించుననిభావము. కృష్ణ + రాయ = కృష్ణరాయ అని సమసించి సమాసమునకుఁ బ్రాతిపదికసంజ్ఞ కలదు కాన డుప్రత్యయముచేరి కృష్ణరాయఁడు అని యగును. ఇట్లే రామరావు రామశాస్త్రి మున్నగునవి సిద్ధసమాసములే కాన వాని ప్రక్రియ యీ వ్యాకరణమున శాసింపనక్కఱలేదు.

౧౭ సూ. క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబులతోడం బలెఁ దత్సమంబులతోడం గొన్నియెడలఁ గర్మధారయం బగు. ౭

ఉ॥ క్రొంబులకలు. క్రొంబులకల్ జనించె సభకున్. ఉ. రా. ౬. ౧౩౬. క్రొన్నారాచములు. క్రొన్నారాచములు మూఁడుగొనిను పరేయన్. రా. ౮౭. ౧ ఆ. ౨౩౦. నెమ్మనము. చ. అనుపమయోగశీల నమృతాంబుధియం దుదయించుదేవు నెమ్మనమున నావహించి. లక్ష్మి. ౩ ఆ. ౧౩౭. పెన్నగము. పడుపెన్నగములు సంచరించె. రా. అర. ౨ ఆ. ౩౩౬. ముంగోపము. ఆ. మొగము బొదువలేని ముంగోప

మికనెప్పుడు, ఉరా. 3 ఆ. ౭. వింజామరము. ఎ.గీ. రమణ శ్రీదేవి వింజామరంబువీవ. శేష. ౫ ఆ. సగరాజ్యము. నాసగరాజ్యము. రా. కిష్కిం. ౫౫౦. మొ॥

క్రొత్తాదులు = క్రొత్త, నెఱ మున్నగుశబ్దములు. (బాల సంధి. ౩౮ సూ. చూచునది) లుప్తశేషంబులు = ప్రాతాదిసూత్రముచే లోపింపగా మిగిలి యున్న భాగములు.

బాలవ్యాకరణమునఁ “క్రొత్త” మున్నగు శబ్దములకుఁ దత్సమేతర శబ్దములు పరముగానున్నపుడే తొలియచ్చుమీఁది వర్ణములకు లోపమును నుగాగమాదులును నుదాహరింపఁబడినవి. తత్సమశబ్దములు పరముగానున్నచో నుగాగమాదులు రావేమో యను సంశయముకలుగుచున్నది. సూత్రమునందు తత్సమము పరముగానున్నపుడే యీ కార్యము వచ్చునని చెప్పకపోయినను ఉదాహరణములనుబట్టి సందేహముకలుగుటకవకాశముండుటచే నట్టి సందేహమును బోఁగొట్టుటకీ సూత్రమారంభింపఁబడెను.

“సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు” ననుసూత్రముచే “క్రొ” అని మిగులునట్టి క్రొత్తాదిశబ్దములకు దేశ్యములవలెఁ దత్సమశబ్దములును జేరి కర్మధారయ సమాసమగునని తాత్పర్యము. క్రొత్త + పులకలు. పులకశబ్దము తత్సమమయినను నీ సూత్రముచే విధింపఁబడినందునఁ బూర్వపదమగు క్రొత్తశబ్దము అద్యక్షరశేషమగును. నుగాగమము, సరళాదేశము, బింద్వాదేశము, రాఁగా క్రొంబులకలు అని యయ్యెను.

క్రొత్త + నారాచములు = క్రొన్నారాచములు. నెఱ + మనము = నెమ్మనము. పెను + నగము = పెన్నగము. ఇటుఁ బరుషేతరములు పరములగుటచే నుగాగమము ప్రాప్తింపక పరపదాద్యక్షర ద్విత్వనువచ్చెను. మును + కోపము = ముంగోపము. వెల్ల + చామరము = వింజామరము. వీనియందు లోప నుగాగమ బింద్వాదేశములు వచ్చెను. వెల్లశబ్దమునం దొలియచ్చుమీఁది వర్ణములకు లోపమురాఁగా “వె” అనియుండును. ఇపుడు ప్రాతాది సూత్రగత బహుళపదబలముచే ఎకారమునకు ఇకారమువచ్చి “వె” అనునది “వి” అయ్యెను. ఇవన్నియుఁ బ్రాతాదిసూత్రముచే వచ్చు లోపమున కుదాహరణములు.

సగము + రాజ్యము = సగరాజ్యము. ఇట బహుళగ్రహణముచేతనే తొలియచ్చుమీఁది వర్ణములకుబదులు రెండవయచ్చుమీఁది వర్ణమునకు లోపమువచ్చెను. ప్రాతాది సూత్రవిహిత లోపస్థలమున రేఫము పరమయినయపుడు ఆరేఫమునకు ద్విత్వమురాదు. ఈ విషయమును బహుళశబ్దమువలననే సిద్ధించును. కావున సగరాజ్యము అని యయ్యెనని తలంపవలయును.

ఈ సమాసమును (సగరాజ్యము) ప్రాతాది సమాసములలోఁ జేర్పకపోయినను "సగము + రాజ్యము" అనుపదములు మిశ్రసమాసమగుట కాటంకము లేదు. కాని సమాసమునందు మువర్ణకమునకుఁ బుంపులు రావలసియుండును. అట్లు పుంపులురాక మువర్ణకమునకు లోపమువచ్చుటకే యీ "సగము" శబ్దముకూడఁ గ్రొత్తాదులలోఁ జేర్చెనని తెలియవలయును. వృత్తియందు హల్లుపరమగుచో దీని కంత్యవర్ణలోపమువచ్చునని శబ్దరత్నాకరమున వ్రాయుటకిదియే తాత్పర్యమని తెలియవలయును. క్రొత్తాదులలో దీనినిఁ జేర్పకున్నను "సమాసవిభక్తికి లోపంబగు" నను సూత్రముచే నిందలి మువర్ణకము లోపించి "సగరాజ్యము" అను సమాసము సిద్ధించునని తలంపరాదు. కర్మధారయసమాసమున మువర్ణకలోపమున కపవాదముగాఁ బుంపులు విధింపఁబడుటచే మువర్ణకము లోపింపదు. సగము + రాజ్యము అనుచోట మువర్ణకమేకాని ముగాగమమునుగాదు. కావున నీ సూత్రముచే సగము అను శబ్దమునకుఁ గ్రొత్తాదులలోఁ బరిగణనము తత్సమపదము పరమగునపుడును (సమాసమునందు) లోపమువచ్చుటకే విధింపఁబడుచున్నది. తత్సమముతోఁ గర్మధారయమగుటకు మాత్రమే యీ యుదాహరణమనియు లోపమున కిటఁ బ్రసక్తిలేదనియుఁ దలంపరాదు. ఈ సూత్రముచే సమాసము మాత్రమే విధించుట యైనచో నయ్యది యనావశ్యకము. "కర్మధారయంబు త్రిక స్త్రీసమ ముగంత ధాతుజ విశేషణపూర్వపదంబై యుండును"ను బాలవ్యాకరణసూత్రముచేతనే సమాసము ప్రాప్తించును. సరసపుపలుకు ఇత్యాది మిశ్రసమాసములు సుప్రసిద్ధములేగదా. ప్రాఁగెంపు, క్రొంజాయ మున్నగు సమాసములయినను బ్రాతాదిసూత్రముచే నయినవి కావు. లోపముగాగమాదుల వీనిచే విధింపఁబడును. ఈ సూత్రముచే నయినను గ్రొత్తాదిశబ్దములకుఁ దత్సమశబ్దములు పరమగునపుడును సమాసమునందీ కార్యములు వచ్చుటయే విధింపఁబడునుగాని సమాసము నీ సూత్రము క్రొత్తగా విధింపనక్కఱలేదు.

పరిశీలింపగా నీ సూత్రము చాల ససందర్భముగానున్నది. ఇందు లుప్త శేషంబులగు క్రొత్తాదులు అని క్రొత్తాదుల నుద్దేశించి తత్సమములతోఁ గర్మ ధారయమగునని కర్మధారయమగుట విధింపఁబడుచున్నది. అనగా లోపము సిద్ధమయినట్లును నూతనముగా సమాసము విధింపవలసినట్లును భావింపఁబడు చున్నది. ఇది యనుచితము. క్రొత్తశబ్దమునకు పులకాదిశబ్దములు పరమగు నపుడు సమాసమురాక పోదు "కర్మధారయంబు..." (బాల. సమా. ౫ సూ.) అనుసూత్రముచేతనే వచ్చును. కాని సమాసమున తత్సమశబ్దము పరమగుటచేఁ దొలియచ్చుమీఁది వర్ణములకు లోపము బాలవ్యాకరణముచే (రాదనుకొను చుండగా) రాకయుండగాఁ దత్సమశబ్దము పరమయినను లోపమువచ్చునని మాత్రమే విధింపవలయును. పిమ్మట నుగాగమ ద్విత్వాదులును బాలవ్యాకరణ సూత్రములచేతనే ప్రాప్తించును. ఇట్టి స్థితిలో విధింపవలసిన లోపమును అను వాదభాగమునఁ జేర్చి సిద్ధించియున్న సమాసమును విధించునట్లు సూత్రరచనము కనుపట్టుట బాగుగాలేదు అందుచే నీ సూత్రమునకు సందేహనిర్ణయముననే తాత్పర్యముగాని నూతనవిధాన మేవిషయమునను గాదనియే గ్రహింపవల యును." అక్రసత్యాయాంతావ్యయంబు కళయ" అను సూత్ర మిట్లే సందేహ నిర్ణయమునే కావించుచున్నదిగదా!

సమాసమునే యీ సూత్రము విధించుచున్నదనుకొనుటలో నింకొక విరోధముగలదు. లుప్తశేషములయిన క్రొత్తాదులకుగదా తత్సమములతో సమాసము విధింపఁబడుచున్నది. అనగా "క్రొ" మున్నగువానికి పులక మున్నగువానితో సమాసమువచ్చుననుట. క్రొత్తాదులకు పులకాదులతో సమా సము వివక్షితముకానిదే ఆద్యక్షరానంతరవర్ణములకు లోపమెట్లువచ్చును? సమాసమునంగదా ప్రాతాదిసూత్రము లోపమును విధించుచున్నది. సమాస మును విధించుటకుఁ బూర్వము లోపమురానియపుడు లుప్తశేషములగు "క్రొ" మున్నగునవి యెట్లులభించును. అందుచే నీ సూత్రమున లోపముగాని సమా సముగాని నూతనముగా విధింపఁబడలేదనియుఁ దత్సమపదములు పరములుగా నున్నను లోపాదికార్యములు రావచ్చునను సంశయమును దృఢపఱచుటకే యీ సూత్రము రచితమయ్యెననియు గ్రహింపవలయును.

**సూ॥** ధాతుజ విశేషణంబులు తదర్థకావ్యయంబులతోడఁ గర్మధార యంబగు.

ఉ॥ భూసురోత్తముల్ వేదముల్ సదువునట్లు. భార. ఆది. ౫ఆ. ౧౮౫. కడుం బెద్దదవ్వుపోయినయట్లు. భార. ఆది. ౧ఆ. ౧౧౬. మొ. ధాతుజవిశేషణములు = ఎడి ప్రకృతివర్ణకాంతములగునవి. తథార్థకావ్యయం బనగా తథా అను సంస్కృతపదముయొక్క అర్థముగల అవ్యయము "అట్లు" అనునది. ఉదా॥ చదువు అను తద్ధర్మార్థక ధాతుజవిశేషణము. అట్లు అను నవ్యయముతో సమసించి చదువునట్లు అనియయ్యెను.

చదువు + అట్లు. బాల. సంధి ౩౩ సూత్రముచే నుగాగమమువచ్చి "చదువునట్లు" అగును. పోయిన. ఇది భూతార్థక నవర్ణకాంత ధాతుజవిశేషణము. (చూ. బాల. క్రియ. ౪౬ సూ.) పోయిన + అట్లు. బాహుళకము కాన అత్వసంధి రాలేదు. యడాగమము. పోయినయట్లు. సంధివచ్చెనేని పోయినట్లు అనియుం గావచ్చును.

అవ్యయోత్తరపదక సమాసములు శాస్త్రవిరుద్ధములుకావు. సంస్కృతమునను "తదుపరి" మున్నగునవి గలవు. "వాగర్థావివ" మున్నగుచోట్ల అట్లు వంటి సాదృశ్యార్థకావ్యయము (ఇవ) తోడను సమాసమేగదా! తెనుగునను అవ్యయోత్తరపదక సమాసములకు నిషేధము కానరాదు అయినను వచ్చి మున్నగు కొన్ని యవ్యయము లుత్తరపదములుగానుండు సమాసములు తెనుగున లేనందునను తథా అను నవ్యయ ముత్తరపదముగా నుండెడి సమాసము సంస్కృతమునంగూడ లేనందునను విశద ప్రతిపత్తికై యీ సూత్రము రచింపంబడెనని తెలియందగును.

**సూ॥ అట్టి యిట్టి యెట్టి అను విశేషణంబులమీంది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాష నగు.**

ఉ॥ క॥ విమలతపోవిభవంబునం గమలజు నట్టిండు. భార. ఆది. ౨ఆ ౨౧౯. అ. ఇట్లు గాన నెఱుఁగమే మేవురము నతం డిట్టిండగుట. భార. శాంతి. ౧ఆ. ౧౦. ఎట్టిండు నా నిజేశుండు. (ఎట్టిండు నా హృదీశుండనుట యుక్తము). రా. సుం. ౨౮౫. మొ. పక్షమున అట్టివాండు. మొ. తెనుఁగున సాధారణంబుగ విశేషణంబు లవిభక్తికంబులు.

అట్టి ఇట్టి ఎట్టి అను విశేషణములమీందనున్న "ఆ" శబ్దముయొక్క వకారమునకు అనగా ఆ శబ్దమునకుం బూర్వాగమముగా వచ్చెడి వకారమునకు

వికల్పముగా లోపమువచ్చునని యర్థము. వకారమునకు మాత్రమే లోపము విధించినను దానిమీదనున్న యచ్చుగూడ లోపించును. అనగా "వా" అను భాగమునకు లోపమనిభావము. ఇట తచ్ఛబ్దమనగా ప్రాతిపదికమునే గ్రహింప వలయును. ప్రాతిపదికావయవమగు వకారమునకే లోపమువచ్చును. మఱియుఁ దచ్ఛబ్దమనగా "వాఁడు" మున్నగుపదమును గ్రహింపరాదు. అట్లయినచో "వానివలన" మున్నగుపదములలోఁగల పంచమీవిభక్తి ప్రత్యయసంబంధియగు వకారమునకును లోపమురావలసివచ్చును. కావున ప్రాతిపదికవకారమునకే యీ సూత్రము లోపము విధించెనని భావింపఁదగును. ఇట "తచ్ఛబ్ద వాకా రంబునకు" అని వ్యాకర్త్రభీష్టపాఠమయి యుండనోపు. ఆపాఠమున నెట్టి యనౌచిత్యములును లేవు.

ఉదా॥ "విమలతపో... నట్టిండు" అట్టి + వాఁడు వాకారలోపమురాఁగా "అట్టిఁడు" అగును. పిదప హ్రస్వమునకుఁ బరమగుటచే నర్ధబిందువు పూర్ణము గూడనయి "అట్టిండు" అనియునగును. ఇట్లే ఇట్టిఁడు, ఇట్టిండు, ఎట్టిఁడు, ఎట్టిండు, అని యగును. ఈ వాలోపము వైకల్పికము కావున అట్టివాఁడు, ఇట్టి వాఁడు, ఎట్టివాఁడు అనియు నగును.

"ఎట్టిఁడు నానిజేశుఁడు" అను రామాయణవాక్యమున నిజేశుఁడనగాఁ దనభర్త అనియే అర్థమువచ్చుచుండగా మఱల "నా" అనుపదము చేరుటలో అర్థముపొందిక లేదనియు, కావున నా హృదీశుఁడు అని మార్చినచో సరిపడు ననియు గ్రంథకర్త యభిప్రాయము. కాని, నిజేశుఁడనుపదమునకు భర్తయని మాత్రమే యర్థమును వివక్షింపవలయును. ఆత్మజశబ్దమునకుఁ బుత్త్రుఁడను నర్థము వివక్షితమగుటచే నాయాత్మజుఁడు అని ప్రయోగించుచున్నట్లే నా నిజేశుఁడు అనియు నుండవచ్చును. శివభాగవతాది సమాసపదములును సంస్కృతమునఁ గలవు. కావున నీ పాఠమును మార్పకుండినను దోషములేదు.

అట్టి అను పదమునకు వాఁడు మున్నగు తచ్ఛబ్దరూపములు పరముగా నున్నపుడు వాకారము లోపించినందున అట్టిఁడు అని యయ్యెనను నభిప్రాయ ముతో నీ సూత్రము నిర్మింపఁబడెను. కాని అట్టి అను ~~ప్రాతిపదిక~~మునకు వాఁడు శబ్దము పరముగానున్నపుడు అట్టివాఁడు అనియే యగును. వాఁడు శబ్దము పరముకానప్పుడు అట్టి అను ప్రాతిపదికమునకు విభక్తి వివక్షించి "డు" అను ప్రథమైకవచన ప్రత్యయము చేర్చినచో అట్టిఁడు అనియగును. ఇట్లు

ప్రథమావిభక్తిప్రత్యయము చేరిన రూపమేకాని తచ్ఛబ్దముచేరిన రూపము ఇయ్యదికాదు. ఇట్లే ఇట్టిఁడు, ఎట్టిఁడు, అను శబ్దములును సిద్ధించును. ఇట్టి సులభమార్గముండగా తచ్ఛబ్దము పరమగుట, వాలోపము, మున్నగుతీరున ప్రక్రియాగౌరవము నిరర్థకము. అని శంకించుటకు స్థూలదృష్టి నవకాశము కానుపించుచుండగా "తెనుగున సాధారణంబుగ" అను వాక్యముచే వ్యాకర్త సమాధానమును జెప్పుచున్నాడు.

అట్టి ఇట్టి ఎట్టి అనునవి విశేషణములు. విశేషణములకుఁ దెనుగున సాధారణముగా విభక్తిప్రత్యయములు కానరావు. అందుచే అట్టిఁడు మున్నగునవి ప్రథమావిభక్తి ప్రత్యయాంతము లనుటకు వలనుపడదని యాశయము.

ఈ వాకారలోపము ధాతుజవిశేషణములమీఁదనున్న తచ్ఛబ్దంబునను గానవచ్చుచున్నదని చెప్పి "ఎఱుకగలరె మగువరెందు" (భార. ఆది. ౨ ఆ. ౩౩ ప.) అని యుదాహరణము సుబోధినియందుఁ జూపఁబడెను. (కల + వారె = కలవారె.)

**సూ॥ ముయ్యేడ్వాదులందు హ్రస్వ ద్విత్వంబులు నిత్యంబులు. ౧౦**

ఉ॥ రాముఁ డలుకన్ ముయ్యేడుమాఱుల్ రణప్రీతిన్ వైరిధరాతలేశ్వరుల జంపెం బల్వురన్. భార. ఆది. ౧ఆ. ౭౮. ముయ్యార్వు మార్గణముల. రా. యు. ౧౦౭౫. దీని ముమ్మడుగగు గణము. భార. ఆది. ౧ఆ. ౮౦. మొ. ఆంధ్రశబ్దచింతామణియందు గల "ఇద మద సి"త్యాది సూత్రమందలి యదః ప్రభృతులు వ్యర్థములగుచు స్వేతరంబులకును నకార్యంబని తెలుపుచున్నది.

ముయ్యేడు మున్నగుశబ్దములలోని మూఁడు శబ్దవిశేషమగు "మూ" వర్ణమున హ్రస్వమును పైనున్న యకారమునకు ద్విత్వమును నిత్యముగా వచ్చునని యర్థము.

ఉదా॥ మూఁడు + ఏడు — బాల. సమా. ౧౨. సూత్రముచే డువర్ణలోపము — యడాగమము. యకారద్విత్వమును రాఁగా, మూ + య్యేడు. బాల. సమా. ౧౩ సూ॥చే హ్రస్వము. ముయ్యేడు అని యగును. ఈ సూత్రమున హ్రస్వద్విత్వములు నిత్యములనుటచే ముయ్యేడులు అనియేయుండును. మూఁ డేడులు మున్నగురూపము లుండవనిభావము.

బాలవ్యాకరణమున హ్రస్వద్విత్వములు విధింపఁబడినను (చూ. బాల.సమా. ౧౨,౧౩ సూ. లు) అందు మూఁడు జగములు — ముజ్జగములు అని ద్వివిధ రూపములుదాహరింపఁబడుటచే డు లోపద్విత్వములు వైకల్పికములుగా విధింపఁబడెనని తలంపవలసియున్నది. కాని ముయ్యేడ్వాదులందుమాత్రము రూపద్వయము కానరాక హ్రస్వద్విత్వములు వచ్చిన ముయ్యేడు మున్నగురూపములు మాత్రమే ప్రయోగములందు కానవచ్చుటచే నీ సూత్రముచే నాకార్యములు నిత్యములని విధింపఁబడుచున్నది.

''ముయ్యాఱు మార్గణముల'' మూఁడు + ఆఱు = మూ + య్యాఱు = ముయ్యాఱు. ''దీని ముమ్మడుగగు గణము'' — మూఁడు + మడుగు. మూ + మ్మడుగు = ము + మ్మడుగు = ముమ్మడుగు.

ఇట మూఁడుశబ్దములోని యర్ధబిందువుగూడ లోపించును. అర్ధబిందు పూర్వక డువర్ణమునే గ్రహించి బాలవ్యాకర్త లోపమును విధించెనని తలంపవలయును. లేదా డువర్ణము లోపించిన యనంతరమున మూఁ + యేడు అని యుండగా స్థిరము పరమగుటచే బిందువులోపించె ననఁదగును. ముజ్జగము లిత్యాదులలో స్థిరపరకత్వము లేకున్నను ద్విరుక్తము పరమగునపుడు బిందువు ఉండుట భాషకు సహజముకానందున లోపించెనని తలంపవలయును.

ఈ ముయ్యేడ్వాదు లాకృతిగణము. అజాద్యుత్తరపదము లగునపుడు మాత్రమే యీ కార్యములు నిత్యములనుటకు వలనుపడదు. ''ముమ్మడుగు'' అనుచోట హలాదిపదమే ఉత్తరపదముగదా!

చింతామణియందు ఇదమదసేత దిత్యాదిసూత్రముచే ఆ, ఈ, ఏ, శబ్దములకు మాత్రమే శబ్దాంతరము పరమగునపుడు హ్రస్వద్విత్వములు విధింపఁబడుచుండగా మూఁడు శబ్దమునకును శబ్దాంతరము పరమగునపుడు ఈ కార్యములు వచ్చుట విరుద్ధముకాదు. అనువిషయమును ''ఆంధ్రశబ్ద చింతామణి యందు...'' ''ఇత్యాదిగా వివరించుచున్నాడు.

అదఃప్రభృతులు = అదస్, ఏతద్, అనుశబ్దములు. స్వేతరంబులకును = ఆ, ఈ, ఏ, శబ్దములకంటె నితరశబ్దములకును.

చింతామణి సూత్రమున ఇదమ్, అదస్, ఏతద్, అని మూఁడుశబ్దములను గ్రహించి వీనియర్థముగల శబ్దమునకు అనగా ''ఈ'' శబ్దమునకు హ్రస్వమును విధించెను. పై మూఁడుశబ్దముల యర్థమునను తెనుగున "ఈ" శబ్దమే

వాడఁబడును. కావున నిచట "ఇదమ్" అని ఒక్కశబ్దమును గ్రహించినను "ఈ" అనుశబ్దము లభించును అట్టిచో అదస్, ఏతద్ అను రెండుశబ్దములను గ్రహించుట వ్యర్థము. ఇట్లు వ్యర్థమగుటవలన నొకవిషయము బోధింపఁబడు చున్నది

అ, ఈ, ఏ, అను మూఁడుశబ్దములకేగాక మఱికొన్ని యితరశబ్దము లకును ఈ హ్రస్వాదికార్యములు వచ్చునని దీనివలన బోధింపఁబడును. ఇట్లు తెలియఁబడుటచే మూఁడుశబ్దమునకును ఇకార్యమువచ్చుట విరుద్ధముకాదని తాత్పర్యము.

[ఏదేనియంశము జ్ఞాపితమగునపుడు నాలుగువిషయము లావశ్యక ములు. 1. వైయర్థ్యము. 2. జ్ఞాపనము. 3 స్వాంశచారితార్థ్యము. 4. అన్యత్ర ఫలము. వీనిలో నాల్గవదిలేకున్నను కొన్నిచోట్ల జ్ఞాపనమంగీకరించినను మొదటి మూఁడంశములును అత్యావశ్యకములు. ఇక్కడ వైయర్థ్యము జ్ఞాపనము అను నంశములున్నను స్వాంశచారితార్థ్యము కానరాదు. ఇట్లే యీ వ్యాకర్త మఱి కొన్ని స్థలములందును జ్ఞాపనములనుజూపుట వైయాకరణపద్ధతి విరుద్ధముగా నున్నది.]

సూ॥ సమాసఘటితంబీ శబ్దం బొక్కచో సూచనార్థకం బగు. ౧౧

ఉ॥ ఈ యున్న పౌష్యపాలికింబోయి (ఈయున్న = ఇదిగో నున్న యని యర్థము) భార. ఆది. ౧ఆ. ౧౧౬. మొ.

సమాసమునందు ఘటింపఁబడియున్న "ఈ" శబ్దము కొన్నిచోట్ల హస్తనిర్దేశాదులచే సూచించుటను బోధించుచుండునని భావము.

ఉదా. "ఈ యున్నపౌష్య..." ఇట సమాసమున "ఈ" శబ్దము ఘటితమయి యున్నది. ఈ "ఈ" శబ్దమునకు ఇదిగో నని యర్థమును వివ రించెను. ఇదిగో ననగా సూచనచేయుటయే కావున నిందలి "ఈ" శబ్దము సూచనార్థక మయ్యెనని భావము.

ఈ సూత్రము శబ్దశాస్త్రమునకు సంబంధించినదికాదు. అర్థమునుబట్టి యేమేని శబ్దమునకు విధింపఁబడినచో నీ వ్యాకరణమునకు సంబంధించునుగాని కేవల మర్థమును జెప్పెడి యీ సూత్రము శబ్దశాస్త్రమునకు సంబంధింపదు. వాక్యము అర్థమునకు సంబంధించినందుననే వేఱొకవిషయముగాఁ బరిశీలకపరి

చ్ఛేదమునఁ గూర్పఁబడెను. ఈ సూత్రముకూడ నా వాక్యప్రకరణమున నుంచి నను గొంత యుచితముగా నుండును.

ఉన్న అను పదములోనికి '' ఈ '' అనునది అన్వయింపవలసియున్నది. కానిచో ఉన్న అనుపదమునకు సాకాంక్షత తీరదు. ఎట్లు ఉన్నవాఁడు అను నాకాంక్ష ఉద్భూతమయి నిలచియుండును. అట్టి యాకాంక్షను దీర్చుటకు కేవలము ఏతదర్థకశబ్దము సమర్థము కాఁజాలదుగదా! అందుచే ఈ శబ్దమునకు ఇదిగో అని సూచనార్థకత్వమును జెప్పినను జాలదు. ఇదిగో చూడుము. ''ఇట్లున్న పౌష్యపాలికి'' అనురీతిగా ''ఉన్న'' అను పదములోనికి అన్వయించుటకు తగిన క్రియావిశేషణమును గూర్పక తప్పదు. ఈ అను పదమునకు ''ఈ విధముగాన్''అని యర్థము వచ్చుచున్నది. అదియే ఇచ్చట సందర్భానుగుణము.

**సూ॥ ధ్వన్యనుకరణశబ్దంబులు కొన్నింటి కిందు నిగాగమంబగు. ౧౨**

ఉ॥ ఇందున్ =కర్మధారయమునందని యర్థము. ఉ॥ గనగనని నిప్పులు. స్వా. ౪. ఆ. ౬౦. క. తళతళని తరణి మెఱుఁగుల. స్వా. ౫ఆ. ౧౦౦. నిగనిగని కుందనంపుఁదగడు. స్వా. ౪ఆ. ౧౧౭. మొ.

ధ్వన్యనుకరణశబ్దములకుఁ గొన్నింటికి ఈ కర్మధారయసమాసమునందు ''ని'' అనునది అంతమున నాగమముగా వచ్చును. (ఈ శబ్దములు విశేషణములయి కర్మధారయసమాసమునఁ బూర్వపదములుగా నున్నప్పుడని గ్రహింపవలయును.)

గనగనని నిప్పులు – అనగా ఒకవిధమయిన కాంతిగల నిప్పులని యర్థము. ఇందు గనగనని అనునది నిప్పులకు విశేషణమగుచున్నది. కనుకనే ''గనగన'' అను ననుకరణశబ్దమునకు '' ని '' అనునది అంతాగమ మయ్యెను. ఇట్లే ''తళతళని'' ''నిగనిగని'' అనుచోటను నిగాగమము చేరెను. నిక్ అనుదానిలో ''క్'' అనునది ఇత్తగుటచే లోపించును. 'ని' అనునది కిత్వమువలన నంతావయవముగావచ్చును.

**సూ॥ గుణవాచకంబులు కొన్నింటి నిగాగమంబునకుఁ బరుషంబులు పరంబులగునపుడు బిందు వగు. ౧౩**

ఉ॥ కమ్మఁదేనె, కమ్మందేనె. మొ. మరువాలారు శరంబులం బొరగు కమ్మందేనె. నై. ౨ఆ. ౯౯.

బాల. సమా ౧౨. సూ. చేత వచ్చిన కొన్ని గుణవాచకశబ్దముల నిగాగమమునకు పరుషములు పరంబులగునపుడు బిందువు ఆదేశమగును.

ఇచట బింద్వాదేశములను మాత్రమే విధించెను. సరళాదేశము నీతఁడు విధింపలేదు. అయినను ఉదాహరణమునుబట్టి సరళాదేశముకూడ వచ్చునని యూహించుకొనవలయును.

కమ్మని + తేనె — సరళాదేశబిందువులురాఁగా — కమ్మందేనె అయ్యెను. బిందుశబ్దము ఉభయబిందు సాధారణముకాన అర్ధబిందువు వచ్చెనేని కమ్మఁదేనె యగును. ఇందుకు నైషధప్రయోగమును బ్రమాణముగాఁ జూపెను.

బాలవ్యాకర్త "ని" అని ఇత్వవిశిష్ట నకారమును ఆగమముగా విధించుటంజేసి యుత్వవిశిష్టమగు నకారమును ద్రుతముగా నంగీకరించెడి యీ వ్యాకర్త మతమున నయ్యది ద్రుతసంజ్ఞకము కాఁజాలదు. ద్రుతము కానందున బిందువు ప్రాప్తింపదు. అందుచే నీ నిగాగమమునకు ద్రుతత్వమును శాసింపకయే బింద్వాదేశమును మాత్రము ప్రయోగానుగుణమగుటకు విధించుకొనెను. కాని ద్రుతత్వమును విధింపనందునఁ బరుషము సరళమగుటకు మార్గము కానరాదు. సరళాదేశమునుగూడ విధించియుండినచోఁ దగియుండెడిది. ప్రౌఢవ్యాకర్త సరళాదేశమును విధించుట మఱచుట ప్రమాదము. బిందువు నిగాగను స్థానమున వచ్చినదగుటచేఁ బరముగానున్న పరుషములకు సరళాదేశము .. న్నగు కార్యములు జరుగునని కొందఱభిప్రాయపడుట సరికాదు. నిగాగమము ..తముకాకపోవుటచేతనే బిందువును విధించుకొననలసి వచ్చెను. అట్టిచో .. నిస్థానమున వచ్చిన బిందువుమాత్రము ద్రుతధర్మము నెట్లుపొందును. .. గాగమము ద్రుతమే అయినచో నీ సూత్ర మనావశ్యకమేయగును. ద్రుత ..టచేతనే సరళాదేశము, బిందువుకూడ సిద్ధించును. నిగాగమ విధాన .. మర్థ్యముచేతనే సామాసికద్రుతలోపమును రాదు. బింద్వాదేశములు వచ్చుట ..టంకము లేదు.

**సూ॥ గుణవాచకంబు క్రియావిశేషణంబగుచో నొక్కెడ నవర్ణకంబునకు బిందువు గానంబడియెడి.** ౧౪

ఉ॥ సస్ని చక్రుఁ గోఁ ద్రియుండు వర్ధిలుటకై. కాశీ. ౨ఆ. ౭౩.

గుణవాచకములలోఁ గొన్ని నవర్ణకాంతములు గలవు (చూ. నవర్ణకంబు గుణవాచకంబులగు నల్లాదుల కగు. బాల. తద్ధి. ౬ సూ.) అట్టి పదములు

క్రియావిశేషణములయినచో వాని నకారమునకుఁ గొన్నియెడల బిందు వాదేశమగును.

ఉ॥ "ససిచక్కంగ..." చక్కన అనుపదము కన్ అను క్రియలోని కన్వయించుచు వర్ధిలుటకై అను క్రియలోనికిని విశేషణమగుటచే నంతమునఁ గల నకారము బిందువయి "చక్కంగన్" అని యయ్యెను. అర్ధబిందువు వచ్చునేని చక్కఁగనని యగును.

తెనుఁగునఁ గ్రియావిశేషణముగా నన్వయింపవలయు నన్నచో కన్, కాన్, అను క్రియారూపముల ద్వారముననే యన్వయింపవలయును. ప్రతిపదమును ముందుగా కన్, కాన్, అనువానిలోని కన్వయించి వానిద్వారమునఁ బ్రధానక్రియలోని కన్వయించును, వేగముగా నడచెను. వేగము అనునది కాన్ అను క్రియలోని కన్వయింపగా నయ్యది నడచెను అనుదానిలోని కన్వయించును. కావున సుబంతములెల్లఁ గ్రియావిశేషణములగునపుడు కాన్, కన్, అనువానిలోనికే యన్వయించునని తెలియవలయును. వేగమువచ్చెన్ అను తీరున నగు ధాతుద్వారమునఁగాక సాక్షాత్తుగను నన్వయించుట కలదు. అట్లయినచో చక్కనయ్యె, చక్కంబోయె మున్నగుతీరుల నీ చక్కనపదము ప్రయోగింపఁబడును.

ఈ నవర్ణక ముత్వవిశిష్టముకానందున ద్రుతముకాకుండుటచే బిందువును విధించుకొనవలసివచ్చెను. ఇచటంగూడ సరళాదేశము (ప్రయోగములందుఁ గానవచ్చుటచే)ఁ జేయవలసియున్నది ఈతని యుదాహరణమునుబట్టియే యిది సమ్మతమని జ్ఞాపితమగుచున్నది.

ఈ సూత్రము సమాసవిషయకము కానందునఁ బ్రాసంగికముగా గుణవాచకముల సందర్భము వచ్చుటచేఁ జెప్పబడెనని తెలియవలయును.

**సూ. ఒకానొకచో గుణవాచక ధాతుజవిశేషణంబు లవయవ విశేష్య పూర్వకంబులయి యవయవితో సమసించెడి. ౧౫**

ఉ॥ ఒడలు తెల్లని తురగోత్తము వాలంబు. (ఒడలు తెల్లని= తెల్లని యొడలుగల యని యర్థము) భార. ఆది. ౨ ఆ. ౩౮. తనువుమీనొప్పలవల్చు జాలరిదాన. (తనువు మీనొప్పలవల్చు=మీనొప్పలవల్చు తనువుగల యని యర్థము. భార. ఆది. ౩ ఆ. ౮౧.

గుణవాచక ధాతుజవిశేషణంబులు — తెల్లని మున్నగు గుణవాచక విశేషణములును ధాతుజవిశేషణములును అవయవ వాచకమగు విశేష్యము పూర్వభాగమునఁ గలవై అవయవి వాచకమగు శబ్దముతో సమసించును.

అవయవమునకును అవయవికిని మధ్యభాగమున నవయవముతో నన్వయింపవలసిన విశేషణశబ్దములుచేరి మొత్తము సమాస మగునని తాత్పర్యము.

ఉదా॥ "ఒడలు..." ఒడలు అవయవము. తురగోత్తమము అవయవి. తెల్లని అనునది ఒడలునకు విశేషణమగు గుణవాచకము. ఇయ్యది ఒడలు అను విశేష్యము ముందుగలదై (ఒడలు తెల్లని అనియయి) తురగోత్తము అను విశేష్యముతో సమాసముచెందెను. తెల్లని యొడలుగల తురగోత్తమము అని యన్వయమును వ్రాయుటచే తెల్లని అనునది విశేష్యముతో (పూర్వమున నున్నను) నన్వయించును. అపుడా రెండు పదములకును అవయవితో నన్వయించునపుడు తెల్లని యొడలుగల అను నర్థమువచ్చును. "ఒడలు తెల్లని" — తెల్లని యొడలు గల అను నర్థముగల దగుటచే విశేష్యమగు తురగోత్తము అనుపదముతో సమసించెను. అని భావము.

"తనువు..." ఇట తనువు — అవయవము. జాలరిది—అవయవి. వల్చు—ధాతుజవిశేషణము. ఇయ్యది తనువు అను విశేష్యము పూర్వమునఁగలదై అవయవి వాచకమగు 'జాలరిది' అనుపదముతో సమసించెను. ఇచ్చట 'వల్చు' అనుదానికి విశేష్యమగు తనువు అనుపదము పూర్వభాగమున నవ్యవహితముగా లేదు మీనొప్పల అనుదానిచే వ్యవహితమయియున్నది. ఈ యుదాహరణమును బట్టి పూర్వమునఁగల విశేష్యము వ్యవహితముగా గాని యవ్యవహితముగా గాని యుండవచ్చునని తెలియఁబడుచున్నది.

విశేషణములగు నీ పదములకును నవయవివాచకములకును బరస్పరాన్వయము లేనందున సామర్థ్యములేదు అందుచే వీనికి సమాసము ప్రాప్తింపనందున విధింపఁబడెనని యూహింపవలయును. ఈ సందర్భమున నవయవ వాచకపదమునకును దాని విశేషణమునకును సమాసములేక వ్యస్తముగానే ముందువెనుకల నుండుటయూ యని సందేహింపవలసి యున్నది. ఒడలు, తెల్లని, అనుపదములు వ్యస్తములే యన్నచో విశేషణమగు తెల్లని అనుపదము పూర్వమున నుండక ఉత్తరపదముగా నుండుట కుదురదు. ఒక్కొకచో విశేషణ విశేష్యంబులు వ్యత్యస్తంబులునగు (శబ్ద. ౯ సూ.) ననుసూత్రముచే వ్యత్యాసము వచ్చెననుటకును వలనుపడదు. ఆ సూత్రముచే వచ్చెడి వ్యత్యాసము

నివర్ణకాంత విశేషణములకును ధాతుజవిశేషణములకును సంభవింపదు. ఒడలు అనుపదము తురగోత్తము అను విశేష్యముతో నన్వయింపవలయునన్నచో యథాస్థితముగా నన్వయింపదు. ఒడలు అనుపదమునకు ఒడలుగల అని యర్థము రావలయును. అట్టి యర్థము వచ్చుట సమాసముననే సంభవించుటంజేసి సమాసమే యనవలయును. ఒడలు తెల్లని అనునది విశేష్య పూర్వపద కర్మధారయమన్నచో (మయూర వ్యంసకమువంటిది) తెల్లని యనుపదము సమాసగతమేయగుటచే నిదియంతయు సమాసమే యనవలయును. "ఒడలు తెల్లని" అనునది విశేష్యపూర్వపద కర్మధారయ మన్నచో ననవచ్చునుగాని రెండవ యుదాహరణమున తనువు అను విశేష్యమునకును వల్చు అను విశేషణమునకును అవ్యవహిత పూర్వాపరీభావములేదు మీనొప్పాల అనుపదము లడ్డముగా నున్నవి. సమాసము ౧౮ సూ.చే సందర్భయోగ్యపద వ్యవధానము సమ్మతమే యనుటకును ఇయ్యది విశేషణోభయపద కర్మధారయము కానందున నవకాశము లేదు. అందుచే మీనుయొక్క + పొల = మీనొప్పాల అను షష్ఠీతత్పురుషమునకు మీనొప్పాలను + వల్చు = మీనొప్పాలవల్చు అని ద్వితీయాతత్పురుషముగాఁ జేసి మీనొప్పాల వల్చు అను మొత్తమునే విశేషణముగాఁ గూర్చి తనువు అను విశేష్యముతో విశేష్య పూర్వపద కర్మధారయమును గావింపవలయును. ఇట్లంతయు సమాసమేయని తలంపనిచో నొడలు అనుపదము వ్యస్తముగానున్నను ఒడలుగల అను నర్థమును లక్షణచే బోధించుచు తెల్లని తురగోత్తము అను సమాసములోని కన్వయింపవలయును. అప్పుడు ఒడలు అనుపదమునకు విశేష్యము ననుసరించి షష్ఠీవిభక్తియే రావలసియున్నను ప్రథమ వచ్చెనని భావింపవలయును. విశేష్య మేవిభక్తిలోనున్నను ఇయ్యదిమాత్రము ప్రథమాంతముగనే యుండుననియుఁ దలంపవలయును. రెండవ యుదాహరణమున విశేష్యము సంబోధనాంతముగ నున్నను తనువు ప్రథమాంతముగనే యున్నదిగదా!

త్రిపదబహువ్రీహ్యాదులవలె నిచ్చటను అవయవ, విశేషణ, అవయవి వాచకములకు మూఁడింటికిని కర్మధారయ సమాసమని ప్రౌఢవ్యాకర్త తలంచి యట్టి సమాసమునే యిటు విధించెనని యూహింపఁదగును. అదియ ఁసూతః యాశయము. ఈ సమాసమునందు పూర్వాపరీభావముకూడ విధింపఁబడెను.

పరిశీలింపగా నిచ్చటఁ దురగోత్తమమునకును ఒడలుకును అవయవావయవి భావము సంబంధము కాదు. శరీర శరీరిభావమన్నచో సరిపడును. కరచరణాదులు అవయవములు. కరచరణాదులతోఁ గూడిన మొత్తము అవయవి

యనంబడును. అనగా ఒడలు అవయవియు నొడలునం దేకదేశములగు చేయి కాలు మున్నగునవి అవయవములును అగును. ఇట నట్టి సంబంధము గాదు.

ఆలోచింపఁగా నిట తెల్లని అను విశేషణము తురగోత్తమము తోడనే యన్వయించును. ఒడలునందు + తెల్లని = ఒడలు తెల్లని అను సప్తమీ తత్పురుష సమాసము విశేష్యమగు తురగోత్తముతోఁ గర్మధారయమగును. ఒడలు నందుఁ దెలుపుగల తురగోత్తమము. అని సమాసమున కర్థము. ఇట్లు సరళముగా సమాసము సిద్ధించుచుండగా నీ నూతనమార్గమున సమాసవిధాన మనావశ్యకమును, అనుచితమునుగూడ నగుచున్నది. ఇట్లే మీనొప్పులవల్చు అను విశేషణము జాలరిదానికే యన్వయించును. తనువునందు (చేత) మీనొప్పులవల్చు = తనువు మీనొప్పులవల్చు అను తత్పురుషము జాలరిది అనుదానిలోనికి విశేషణమగుచుఁ గర్మధారయమగుచున్నది. ఇట్టిసూత్ర మనావశ్యకమని గ్రహింపవలెను.

సూ. తమ్ముఁగుఱ్ఱలు చిలుకమొకరి 'యిత్యాదులు విశేష్య పూర్వపద కర్మధారయంబులు. ౧౬

ఉ॥ తమ్ముఁగుఱ్ఱలు నీవుఁ దగ విపినంబున కరిగితిరి. భార. అర. ౭ ఆ. ౪౧౩. క. ప్రభావతి, మోదము వెలిఁ జిలుకఁ జిలుక మొకరింబలికెన్. శుక. ౨ ఆ. ౮౯. మొ॥

ఒడలు తెల్లని అను సమాసమున విశేష్యము పూర్వపదముగా నుండెను. ఆ సందర్భమున విశేష్య పూర్వపద సమాసములలోఁ జేరఁదగిన మఱికొన్నిఁటి నీ సూత్రమునం జూపుచున్నాడు.

సంస్కృతమున "మయూరవ్యంసకము" మున్నగు విశేష్యపూర్వపద కర్మధారయములు గలవు. అట్టివి తెనుగునను గలవనియుఁ దమ్ముఁగుఱ్ఱలు, చిలుక మొకరి మున్నగునవి వానిలోఁ జేరుననియు భావము.

తమ్ములు + కుఱ్ఱలు = తమ్ముఁగుఱ్ఱలు. కుఱ్ఱలగు తమ్ములని యర్థము. విశేష్యమగు "తమ్ములు" పూర్వపదముగా నున్నది. చిలుకమొకరి అనుచోట మొకరియగు చిలుక అని యర్థము. ఇచటను బూర్వపదము విశేష్యమే.

బాలవ్యాకరణమున నిట్టి సమాసములు తెనుఁగునఁ గలవని యెచ్చటను నుదాహరింపనందున నీ సూత్రము చెప్పవలసివచ్చెను. "తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబ యగు" నని చెప్పుటచే మయూర

వ్యంసకాదులవంటి విందును నుండుటకు విరోధములేదు. అట్టి సమాసము నుదాహరించుటకే యీ సూత్రము వ్రాయఁబడెను.

తమ్ముఁగుఱ్ఱలు అనుచోట పూర్వపదమునకు ద్రుతము చేరుటయు నీ యుదాహరణమునుబట్టియే యూహించుకొనవలయును. ద్రుతమును విధించు సూత్రమేదియునులేదు. ఉదాహరణములు స్పష్టములు. (మొకరి = మాటకారి)

**సూ. ఆ యీ త్యాది ఘటితంబులు విశేషణోభయపద కర్మధారయంబులు.** ౧౭

ఉ॥ ఆ యీ నేరములు. ఈ యాదేశంబననేల! స్వా.౧ ఆ.౬౮. ఎత్తిపెంచినవారి. విక్ర.౬ ఆ.౧౧౦. కలిగిన యొప్పని దోషములు. విజ్ఞా. ఆచా.౧౦౭. కొట్టిన తిట్టిన యాతఁడు. భోజ.౬ ఆ.౧౫. చలి తెలిమంచు తుంపరలు. భాను.3. ఆ. వడ చల్లని చల్లనిగాడ్పు. రామా.౧ ఆ.౧౪౧ తియ్య బెల్లిమాటలు. క్షేత్రయ. తొంగలి తఱచు ఱెప్పల. భార. విరా.౨ ఆ 3౭. తొలిప్రాత కుప్పసంబు. జై.౬ ఆ.౮౨. నిడువాలిక కన్నులు (వాలిక = వాడి) భోజ.౫ ఆ.3౧. పెనునిట్టి తాడు. జై .౨. ఆ.౮౧. మొక్కపోయిన వెలిగొమ్ముదోయి. హరి.ఉ.౭ ఆ.౯౨. విన్నకన్న యర్థము. కళా.౮ ఆ.౨౦౦. క్రొమ్మించు లేఁ జెక్కుటద్దంబు. నై. ౨. ఆ. ౧౧3. తెలినును పోగవెన్నెలల. రామా.౨ ఆ.౯౯. మొ॥

ఆ, ఈ, మున్నగు విశేషణములు ఒక్కటికంటె నధికముగా నున్నప్పుడు అయ్యవి విశేషణోభయపద కర్మధారయములగునని యర్థము కర్మధారయ సమాసమున నొక్కటి విశేషణము వేఱొక్కటి విశేష్యము అయియుండుట సాధారణము. అయినను "స్నాతానులిప్తః" మున్నగునవి సంస్కృతమున నుభయపదములును విశేషణములుగాగల కర్మధారయములు గలవు అట్లే తెనుగునను గలవని తాత్పర్యము.

ఆ, ఈ, అనునవి రెండును "నేరములు" అనుపదమునకు విశేషణములు. రెండు విశేషణము లుండుటచే విశేషణోభయపద కర్మధారయము. ఇట్లే కలిగిన యొప్పని, కొట్టిన తిట్టిన, చలి తెలి, వడ చల్లని చల్లని, తియ్యబెల్లి,

తొంగలి తఱచు, తొలి ప్రాత, నిడువాలిక, పెనునిట్టు, మొక్కపోయిన వెలి, విన్నకన్న, క్రొమ్మించు మలే, తెలినునుసోగ, అనుజతలు ఉభయ విశేషణములని తెలియఁదగును.

ఈ యుదాహరణములలో మొదటి రెండు పదములకును విశేషణోభయపద కర్మధారయము కావున ముందుగా రెండిఁటికిని గర్మధారయము చేసి పిమ్మట విశేష్యముతోఁ గర్మధారయము గావింపవలయునని భావము తోఁచుచున్నది.

(అవియును + ఇవియును, = అయివి. అయివి + నేరములు = అయీ నేరములు.) ఈ యుదాహరణము లన్నింటను విశేష్యములుకూడ నుండుటచే వీనిని విశేషణోభయపద కర్మధారయము లననక్కఱలేదు. విశేషణ విశేష్య కర్మధారయములే యనవచ్చును. సమీప విశేషణము ముందుగా విశేష్యముతోఁ గర్మధారయమగును. పిమ్మట రెండవ విశేషణము విశేష్యమునైన కర్మధారయముతో సమసించును. అపుడు రెండును విశేషణ విశేష్యములతోఁ గూడిన కర్మధారయములే యగును. (ఇవి + నేరములు = ఈ నేరములు. అవి + ఈ నేరములు = ఆయీ నేరములు.) ఈ నీలోత్పలము అనుచోట ఎట్లు రెండు కర్మధారయములగునో ఆయీ నేరములు మున్నగునవియు నట్లే కర్మధారయ ద్వయ మనినఁ జాలును ఈ నీలోత్పలము అనుచోట నొకటి సిద్ధము వేఱొకటి సాధ్యమును అగును. ఆయీ నేరములు అనుచో రెండును సాధ్య కర్మధారయములే యగును. ఇంతియ భేదము.

మఱియొక విశేషముగలదు. విశేషణోభయపదములనగా నిట్టివిగావు. విశేషణములుమాత్రమే సమసించి విశేష్యము వేఱుగా నున్నచోటనే యీ సమాసమును విశేషణోభయపద మనవలయును. సంస్కృతమున స్నాతానులిప్తః నిశ్చప్రపచమ్, మున్నగునవి యిట్టి సమాసములుగా నుదాహరింపఁబడును. అచ్చట విశేష్యము సమాసమునఁ గూడియుండదు. విశేష్యము లేకపోవుట చేతనె విశేషణములకు రెండిటికిని వచ్చెడి సమాసమును విశేషణోభయపద మనవలసివచ్చెను.

కావున నీ సూత్రమున కివ్వి యుదాహరణములు కాజాలవు. **రెండును విశేషణములే అయి విశేష్య మా సమాసమున లేనియట్టిదియ యుదాహార్యము**

ఇయ్యది, ఎయ్యది, కుఱ్ఱతగవరి, విన్నది, కన్నది, మున్నగువాని నిచట నుదాహరింపఁదగును. కొట్టిన తిట్టిన యాతఁడు, ఎత్తిన పెంచినవారిన్ అనునవి మాత్రము పై వానిలో నుదాహరణములు కావచ్చును. వీనిలో ధాతుజవిశేషణములకు రెండిటికినిఁ గర్మధారయమనియు సమాసమునకు విభక్తి వివక్షించుటచేఁ దచ్ఛబ్ద మనుప్రయుక్తమయినదనియుఁ దలంపవచ్చును. (చూ. బాల. సమా. ౯ సూ.) ఇచ్చట తచ్ఛబ్దము ప్రత్యేకార్థముగలది కాదు. ధాతుజ విశేషణమున కనుప్రయుక్తము మాత్రమే. ఈ విధముగా వీనిని సరిపెట్టుకొనినను శేషించినవి మాత్ర ముదాహార్యములు కాఁజాలవు.

విశేషణోభయపద స్థలమునఁగూడ నుత్తరపదమును విశేష్యముగా వివక్షించియే సమాసశాస్త్రమును వర్తింపఁజేయుదురు.

శీతోష్ణము అనునది సమాహార ద్వంద్వము. ఇయ్యది కర్మధారయముగా వివక్షితమయినను సిద్ధసమాసమగుటచే నీ సూత్రమునకు విషయము కాఁజాలదు.

రెండు విశేషణములేకాక అంతకుమించిన సంఖ్యగల విశేషణములున్నను విశేషణోభయపద కర్మధారయములేయని వ్యాకర్త యాశయము. అనంతర సూత్రోదాహరణము లట్టియభిప్రాయమునే స్పష్టపఱచుచున్నవి.

౬ సూ. కొన్నియెడల విశేషణోభయపదంబులు త్రిక క్రియాజన్య విశేషణఘటితంబులు సందర్భయోగ్యపదవ్యవహితంబు లగు. ౧౮

త్రిక క్రియాజన్య విశేషణఘటితంబులు త్రికక్రియాజన్య విశేషణోభయ ఘటితంబులు, కేవల క్రియాజన్య విశేషణ ఘటితంబులు నని ద్వివిధములు.

ఉ॥ క. ఈ కన్నులు తెఱవని శిశువే కీడొనరించె నీకు. భోజ.౬ ఆ.౩౪౬. నెఱులుగల మరునిలంపు టురుల సిరుల నరులు గొనజాలి నరులను మరులుగొలుపు నిరులుగెలిచిన తుమ్మెదగరులఁ దెగడు కురుల నులిదీర్చి విరులిడి కొప్పువెట్టె. భాగ.౧౦ స్కం. ఉ.౨౮౨. ఎ.గీ. గగనమును రుద్రభూమి నేకతమ తిరుగు నదరు లుమిసెడు కొఱవి దయ్యంబు వీఁడె. నై.౨ ఆ.౧౨౨. చ. నే బలిమిఁ గుబేరునిం గెలిచి

భాగుగఁ గొన్న రవిప్రకాశమై యలరుచునున్న పుష్పకమునందు ఓమింపుము కోర్కులారగన్. రా. అర.౨ ఆ.౧౮౮. ఎత్తైనట్టి యెట్టి గాఁ గాగిన మజ్జుచందము. ప్రభా. ౫ ఆ ౬౦. సీ. అనకి దుందుభి ననరాని వినరాని దుర్వాక్యసూచులఁ దూలఫుచ్చె. వి.పు. ౭ ఆ.౩౧౨. చిక్కని చక్కని నున్నని గ్రుక్కని తోలూడ్వఁబడని ఛుల్లి సెగలచే నొక్కఁబడని దండంబులు తక్కక యుపనయనవేళఁ దాల్పఁగవల యున్. విజ్ఞా. ఆచా ౨౨. మొ॥ (ఇట్టి ప్రయోజనములు కవిత్రయము వారి గ్రంథములందు దొరకినవి కావు.)

త్రికముతోడను క్రియాజన్యవిశేషణములతోడను గూడియున్న విశేషణో భయపద కర్మధారయ సమాసములలో నా సందర్భమునకుఁ దగిన యితర పదములు అడ్డముగానుండుటయుఁ గొన్నియెడలఁ గలదని భావము. అనగా సమాసమునఁ గూడియున్న విశేషణపదములకు రెండిటికిని మధ్యభాగమున వ్యస్తముగానున్న వేఱొకపదము అడ్డముగా నుండుననుట.

ఈ త్రిక క్రియాజన్య విశేషణములతోఁ గూడిన సమాసములు రెండు విధములుగా గ్రహింపవలయును.

సమాసమునఁగల విశేషణములు రెండిటిలో నొకటి త్రికములోనిదియు వేఱొకటి క్రియాజన్య విశేషణమును అగుటగాని, రెండును క్రియాజన్య విశేషణములే యగుటగాని సంభవించినచో నీ వ్యవధానము సమ్మతమగును. రెండు విశేషణములును త్రికములోనివే యయినచో వ్యవధానము సమ్మతము కాదు.

ఉ॥ "ఈ కన్నులు... ..." ఇందు ఈ, తెలుపని, అను విశేషణములకు కన్నులు అనుపద మడ్డముగానున్నది. ఇందొకటి (ఈ) త్రికములోనిదియు వేఱొకటి (తెలుపని) క్రియాజన్య విశేషణమును. కన్నులు అనుపదము విభక్తి ప్రత్యయముతోఁ గూడియుండుటచే సమాసమునఁ జేరినపద మనుటకు వలను కాదు. కన్నులు అనుపదము తెలుపని అను క్రియాజన్య విశేషణమునకు కర్మాకాంక్షా నివర్తక మగుచున్నది.

"నెలులుగల... ..." ఇటుకురులు విశేష్యము. కొలుపు, గెలిచిన, తెగడు, విశేషణములు. ఈ విశేషణములకు మధ్యభాగమున ఇరులు, తుమ్మెదగములను,

అనుపదము లడ్డముగానున్నవి. ఇచట మూఁడును క్రియాజన్యవిశేషణములే (ఇది బహువిశేషణ సమాసము.)

"గగనమను..." తిరుగు, ఉమిసెడు అనునవి విశేషణములు. కొఱవి దయ్యము విశేష్యము. అదరులు అను ప్రథమాంత మడ్డముగా నున్నది.

"నే బలిమిఁ గుబేరునిన్ ..." కొన్న, ఉన్న, విశేషణములు పుష్పకము విశేష్యము. రవిప్రకాశము, అయి అలరుచు అనుపదములు రెండు విశేషణములకును మధ్యభాగమున నున్నవి.

"ఎత్తెడునట్టి. ." ఎత్తెడునట్టి, కాచిన, అనునవి విశేషణములు. మద్దు విశేష్యము. ఎట్టి, గాన్, అనుపదములు అడ్డముగా నున్నవి.

"ఆనక దుందుభిన్ ..." రాని, రాని, అనునవి వచ్చు అను ధాతువు మూలముగా గల విశేషణములు దుర్వాక్యసూచులు విశేష్యము. విచన్ అనునది విశేషణములకు మధ్యభాగమున నడ్డముగా నున్నది. ఇచట అనరాని అనునది అంతయు నేకపదమనిగాని సమాసమనికాని అనుటకు వీలుకాదు. అనన్ అను నది నుజ్యంతక్రియ. కనుకనే యిది యిచట నుదాహరింపఁబడెను

"చిక్కని చక్కని..." ఇందు చిక్కని, చక్కని, నున్నని, స్రుక్కని, పడని, పడని, అను నాఱును విశేషణములు. దండములు — విశేష్యము. వీనిలో ఊడ్వఁబడని, నొక్కఁబడని, అను రెండుపదములకును మధ్యభాగమున ఘుల్లి సెగలచే ననుపద మడ్డముగానున్నది. ఇందును రెండవ యుదాహరణమునను విశేష్యమున కనేక విశేషణములుగలవు. మిగిలిన యుదాహరణములలో రెండేసి విశేషణములు మాత్రము గలవు. మొదటి యుదాహరణము త్రిక క్రియాజన్య విశేషణోభయ ఘటితము. తరువాతి యుదాహరణములన్నియుఁ గేవల క్రియాజన్య విశేషణ ఘటితములు.

పూర్వసూత్రమున విశేషణోభయపదములనగా రెండేసి విశేషణములతోఁ గూడిన సమాసములను మాత్రమే యుదాహరించెను. ఈ సూత్రమున మాత్రము రెండు విశేషణములు గలవానిని మాత్రమేకాక బహువిశేషణములు గల సమాసములనుగూడ నుదాహరించెను. దీనింబట్టి వ్యాకర్తకు విశేషణోభయపదములనగా బహువిశేషణములు గలవానిని కూడ గ్రహించుట యభీష్టమని తెలియఁబడుచున్నది. బహువిశేషణ స్థలమునసైనను రెండేసి పదములకే సమాసముచేయుదురు కావున నవియు నిందు గ్రాహ్యంబులని తలంచెంగాబో

లును. ఈ యుదాహరణము లన్నింటియందును విశేష్యములుకూడ సమాస ఘటితములయి యుండుటచే నివి విశేషణోభయపద కర్మధారయములనుట యుచితముకాదు. అది వైయాకరణపద్ధతివిరుద్ధము. (చూ. పూర్వసూత్రవ్యాఖ్య)

పైయుదాహరణములలో ధాతుజవిశేషణములతో నన్వయించెడి కన్నులు, నెఱులు, మున్నగుపదములు విభక్త్యంతములగుటచే వ్యస్తములని యంగీకరింప వలసియున్నది. తెనుఁగున సమాసములనఁబడువాని స్వభావమునుగూర్చి ముందు వ్రాయఁబడును.

ఇట్టి వ్యవధానయుక్త సమాసములు కవిత్రయము వారి గ్రంథముల యందు లేవనియుఁ దదితరుల గ్రంథములయందు మాత్రమే లభించుచున్న వనియు వ్రాయుటచే నిట్టివి యాధునికములనియుఁ బ్రాచీనసుకవి సమ్మత ములుకావనియు నూహింపఁదగునని గ్రంథకర్త సూచించెను.

సూత్రమున సందర్భయోగ్యపదముల వ్యవధానము మాత్రమే యంగీక రింపఁబడెను. అనగా మధ్యముననున్న పదములు విశేషణాన్వయమునకు బయట నున్న పదములతో నన్వయింపవలసినవి కారాదు. క్రియాజన్య విశేషణముల లోనికే కర్తృ కర్మాద్యాకాంక్షా నివర్తకములుగా నన్వయింపవలయుననుట. "ఈ కన్నులు తెఱవని శిశువు" అనుచోట తెఱవని అను విశేషణమునకుఁ గర్మా కాంక్షను నివర్తింపఁజేయుట కర్మమయిన కన్నులు అనుపదము వ్యవధాయక మగుట విరోధము కాలేదు. ఇందు విశేషణములలోనికే సాక్షాత్తుగాఁ "గన్నులు" అనుపద మన్వయించుచున్నది. ఇరులు గెలిచిన, తుమ్మెద గములన్ అను పదములును సందర్భయోగ్యములే. ఇందుఁ దుమ్మెద గములన్ అనునది తెగడు అను విశేషణములోనికిఁ గర్మయగుచున్నది. ఇరులు అనునది గెలిచిన అను విశేషణములోనికిఁ గర్మయగుచున్నది. సాధారణముగా విశేషణీభూతక్రియ లోనికి విశేషణముగా గాని కర్మాదికారకముగా గాని యన్వయించు పదములు మాత్రమే వాని నడుమ వ్యవధానమును గల్పించును.

"నెఱులుగల ..." అనుచోట అరులుగొనఁ జాలి యని క్త్వార్థక క్రియ యుండుట సరసముగాలేదు సమతాగుణమున కయ్యది భంజకము. "అరులు గొనఁజాలు" అను రీతిని క్రియాజన్య విశేషణమే యుచితము నుండఁదగును. కానిచో నెరులుగల అను విశేషణము కురులకు విశేషణము కాఁజాలక మరు నీలంపుటురుల కన్వయింపవలసి వచ్చును. చాలి అను క్త్వార్థకముగా నుండుట

కంటె చాలు అని విశేషణముగా నుండుట సమతాగుణానుగుణముగదా! కం. చాలు, కొలువు, గెలిచిన, తెగడు, అను విశేషణములన్నియు నేకజాతీయములయి కావ్యశోభాకరములగును.

**సూ. అలరుఁబోఁడీత్యాదు లుపమాన పూర్వపద కర్మధారయంబులు.** ౧౯

ఇటఁ బోఁడి పరంబగుచో నెల్లెడల నుమ్మగు. ఆదిపదంబుచే తియ్యఁబోఁడి, ననఁబోఁడి, విరిఁబోఁడి, ఇగురుఁబోఁడి, చిగురుఁబోఁడి, తలిరుఁబోఁడి, పువ్వుఁబోఁడి, పూవుఁబోఁడి, పూఁబోఁడి యిత్యాదులు గ్రాహ్యంబులు. (అలరు+పోఁడి) దీనికిఁ బువ్వువలె మనోజ్ఞురాలైనదని యర్థము. ఇట్లంతట నెఱుంగవలయును.

**మ.** చిగురుంబోఁడి యెఱుంగుదే యదుపతి స్త్రీ లెవ్వారే నిందు లేరుగదా! కళా 3 ఆ.౧౩౧. శా. ద్రోవదిన్ దీయఁబోఁడి వరింపగా వసుధకే తేఁజూచు నాదిత్యులో. పాంచా.3 ఆ. వేల్పుం బువుం బోండ్లు. య. ౧ ఆ.౭౮. క. యౌవనము కలిగినప్పుడ పూవుం బోఁడులకుఁ బతులభోగంబులుగాక. కళా.౪ ఆ.౭౧. మొ॥

అలరుఁబోఁడి మున్నగు సమాసము లుపమానము పూర్వపదముగానున్న కర్మధారయ సమాసములని యర్థము.

బాలవ్యాకరణమున అలరుబోఁడి అనునది బహువ్రీహి సమాసమనియు అలరువంటి మేనుగలదను నర్థమున మేనునకు బోడి యాదేశమగుననియు జెప్పఁబడెను. (చూ. బాల. సమా. ౩౩ సూ) కాని పోడియను నాదేశము విధించి ప్రక్రియాగౌరవమును సహింపనక్కఱలేకయే యీ సమాసము సిద్ధించుననియు లతాతన్వి, రతిసుందరి, మున్నగు సమాసములవలె నుపమానోత్తరపద కర్మధారయమన్నఁ గుదురుననియుఁ బ్రౌఢవ్యాకర్త యభిప్రాయము. మేనునకు బోఁడియను నాదేశము విధించుట యనావశ్యకమని తాత్పర్యము. ఈ పక్షమున "పోఁడి" అనుదాని కర్థమును గుదురునని వివరించెను. పోఁడి యనగా మనోజ్ఞము అను నర్థము భాషయందు సుప్రసిద్ధమగుటచే నర్థవిశేషమును గల్పించుకొన నక్కరలేదు. పూవువలె మనోజ్ఞురాలని యర్థము. ఈ సమాసము

నఁ బూర్వపదము ఉపమానమును, ఉత్తరపదము సాధారణ ధర్మమును బోధించును. రతివంటి సుందరురాలు అను నర్థముగల రతిసుందరి మున్నగు సిద్ధసమాసము లీ తీరునఁ గలవు బాలవ్యాకర్త చెప్పినపద్ధతిని అనుసరించినచోఁ బూర్వపద ముపమానమును ఉత్తరపద ముపమేయమును బోధించును. ఇది లతాంగి, పద్మముఖి, అను సమాసములవంటిది. (ఈ పక్షమున బహువ్రీహియే కావలయును. ఉపమేయ ముత్తరపదముగా నున్నచో నుపమానము పూర్వపదముగా నుండెడి సిద్ధకర్మధారయ సమాసము అప్రసిద్ధము. కనుకనే బాలవ్యాకర్త ముఖపద్మము, చరణకమలములు, ఇట్టి యుపమానోత్తరపదంబులు గలవుగాని విపరీతంబులు సిద్ధంబులు లేవని యెఱుంగునది అని చెప్పెను) (చూ. బాల. సమా. ౩. సూత్ర వివరణము)

బాలవ్యాకర్త చేసిన కల్పన మనావశ్యకమును ప్రక్రియాగౌరవము గలదియు నగుటయేకాక సంస్కృతాంధ్ర వ్యాకరణములం దప్రసిద్ధముగూడ నయియున్నది. ఎచ్చటను సమాసోత్తరపదమున కాదేశమువచ్చుట కానరాదు. సమాసములలోఁగూడ నంతరంగమగుటచేఁ గర్మధారయము బహువ్రీహికంటెఁ బ్రథమోపస్థితము. పోఁడి అనుపదము మేను అను నర్థమునఁ బ్రసిద్ధముకాక పోవుటచే బాలవ్యాకర్త దీని నాదేశముగా విధించికొనెను. పోఁడి అనుపదమునకు రమ్యత అను నర్థము సుప్రసిద్ధముగా నుండుటచేతను అట్టి యర్థము సందర్భమునకు కుదురుచుండగను గర్మధారయమనుట యుచితముగానుండ పోఁడి అనుదానికి మేను అను నర్థ మెచ్చటను బ్రసిద్ధముగా లేకయుండగా నూతనముగా నాదేశమును గల్పించి బహువ్రీహి యనుట యనుచితమగుటయే గాక ప్రక్రియాగౌరవహేతువగుచున్నది. కావున బాలవ్యాకర్త మార్గము సరికాదనియు నిట్టివి కర్మధారయములేయనియుఁ బ్రౌఢవ్యాకర్త యాశయము

బాలవ్యాకర్త పోఁడి పరమగునపుడు నుమాగమమునుగాని నుగాగమమునుగాని విధించియుండలేదు అందుచే అలరుఁబోఁడీత్యాదులు సాధువులయినను ననఁబోఁడీత్యాదులు సిద్ధింపవు. అలరుఁబోఁడి యనుచోఁ బూర్వపదము దంతము కావున (బాల. సంధి. ౨౫ సూ.) నుగాగమము వచ్చును. నన, తీయ, మున్నగు పదములకు నుగాగమము రానందున నిచట "ఇటుఁబోఁడి పరంబగు,..." ఇత్యాదిగా నుమాగమమును విధించెను.

అలరు + పోఁడి – నుమాగమము. అలరును + పోఁడి. ద్రుతకార్యము – అలరుఁబోఁడి. పూర్ణబిందు వయ్యెనేని "అలరుంబోఁడి" యగును. ఇట్లే తీయఁ

బోఁడి మున్నగునవి గ్రహింపవలయును. చిగురుంబోఁడి, తీయంబోఁడి, పువ్వుం బోఁడి, పూవుఁబోఁడి, అనుపదములకుఁ బ్రయోగములను వరుసగాఁ జూపెను.

పూర్ణబిందు సహిత ప్రయోగములనే చూపుటవలన బాలవ్యాకరణమున నువర్ణము విధింపఁబడనందున నర్ధబిందురూపము లెట్లో కుదుర్పఁదగియున్నను గవిప్రయుక్తములయియున్న పూర్ణబిందురూపములను సాధించుటకు మాత్రము నువ్విధానముకూడ నావశ్యకమేయనియు సూచింపఁబడుచున్నది.

ఇటు "నుమ్" అని మిత్త్వముఁ గూర్చుటకంటె "నుక్" అని కిత్తుం గావించిన బాలవ్యాకరణోక్త నుగాగమమును (బాల. సంధి. ౫౨ సూ.) వర్తింపఁజేసినట్లగును. హలంతశబ్దములకువచ్చు నాగమమయినచో మిత్త్వము వలనఁ జివఱియచ్చున కాగమము చేరుట ప్రయోజనమగును. అజంతశబ్దముల లోఁ జివఱియచ్చును బదాంతమును ఒకటియే యగును గావున సరిపడును.

## ద్విగుసమాసము.

**సూ. ఒక్కచో ద్విగువు మిశ్రం బేకవచనాంతంబు నగు. ౨౦**

ఉ॥ క. తక్కిన సైన్యముల నిలోఁ జిక్కి పరాఙ్ముఖతఁ దొలఁగె శివుఁడును భీతిన్ బొక్కుచు నలసతనొయి నల్దిక్కు దిరిగి యావులిం చుచు నుండెన్. ఉ. హరి. ౬ ఆ. ౧౬౮. ఉ అస్తోక నిజప్రభావములు సూపెడు గద్దియమీఁద నెక్కి ముల్లోకము దాన యేలుగతి లోలవిలో చన! యేమిచెప్పుదున్. హరి. ౧ ఆ ౭౯. ముమ్మహూర్తమునకు. జై. ౭ ఆ. ౨౩. మొ॥

ఒక్కొకచోట మిశ్రద్విగు సమాసము బహువచనాంతమగుటయేకాక ఏకవచనాంతముగను నుండునని భావము.

సంస్కృతమున ద్విగుసమాస మేకవచనాంతముగనే యుండును ఆ తీరునఁ దెనుగునను ఏకవచనమే ప్రాప్తించుచుండగా బాలవ్యాకరణమున "ద్విగువున నేకవచనంబు ప్రాయికంబుగా నగు"నని విధించి, "మిశ్రంబునకుఁ గాదు" అని మిశ్రద్విగు సమాసమునకు మాత్రము నిషేధించెను. (చూ॰ బాల. సమా॰ ౧౮ సూ.) కాని మిశ్రద్విగువునకుఁగూడ నేకవచనము కొన్నిచోట్లఁ జూపట్టుటచే నీ సూత్రము రచింపవలసివచ్చెను.

"తక్కిన...నుండెన్" నల్దిక్కు, ముల్లోకము, మున్ముహూర్తము అను సమాసములు ఏకవచనాంతములుగా నున్నవి. వీనిలో దిక్కు, లోకము, ముహూర్తము, అనుపదములు సంస్కృత (సమ) ములు. పూర్వపదము లాచ్ఛిక సంఖ్యావాచకములు. అందుచే నివి మిశ్రద్విగువు లగుచున్నవి.

ద్విగుసమాస విషయమునఁ జాలమంది వ్యాకర్తలు ప్రమాదమును బొందిరాయని సందేహింపఁదగియున్నది సంస్కృత (పాణినీయ) మున "తద్ధితార్థోత్తరపద సమాహారేచ" అను పాణిని సూత్రముచే వచ్చెడి సంఖ్యావాచక శబ్దముల సమాసములు మాత్రమే ద్విగుసమాసము లనఁబడును. అనగా సంఖ్యావాచక శబ్దములు పూర్వమునఁగల సమాసములలోఁ గొన్ని మాత్రమే ద్విగుసంజ్ఞగలవి యగును. అవియెల్ల ద్విగుసమాసములని తలంపరాదు. కనుకనే సప్తర్షులు అనునది ద్విగుసమాసము కాలేదు. సమాహారము వాచ్యముకానియపుడు బహువచనమే యుండును.

అందుచేఁ దెనుగున సంఖ్యాపూర్వక సమాసములు ఏకవచనాంతములుగా నున్నచో ద్విగుసమాసములనియు బహువచనాంతములుగా నున్నచోఁ గేవల కర్మధారయసమాసములనియుఁ దలంపఁబడవలసియున్నది. మిశ్రమయినను అచ్ఛికమయినను భేదమేమియులేదు. సంఖ్యాపూర్వకమయి సమాహారము వాచ్యమయినచో ద్విగుసమాసమనఁబడును. దాని కేకవచనమే వచ్చును. సంఖ్యాపూర్వకమయినను సమాహారము వాచ్యముకానిచో ద్విగువుకాదు. ఏకవచనమురాదు. ఉదా॥ సప్తర్షులు. కర్మధారయసమాస మనియే దానికి వ్యవహారము.

ఇట్లే తెనుగున నల్దిక్కు ముచ్చిచ్చు మున్నగునవి సమాహారమును బోధించును గావున ద్విగుసమాసము లనఁబడును. మువ్విధములు మున్నగుచోట్ల సమాహారము వాచ్యముకాదు కావున ద్విగుసమాస మేకాదు. అయ్యది కేవల కర్మధారయ సమాసమే అని చెప్పఁదగియుండగా సంఖ్యాపూర్వక సమాసాధికరణముల నన్నిటిని ద్విగుసమాసములని తలంచుట యుచితిమిము. ఇట్టియభిప్రాయము కలిగియుండుటచేతనే బాలవ్యాకర్త మువ్విధములు అనునది ద్విగుసమాసముగా నుదాహరించెను. ప్రౌఢవ్యాకర్తయు నట్టియభిప్రాయమునే కలిగి యుండును. అధర్వణకారికావళి యందు "ద్విగోరమిశ్రరాయాంతు ప్రాయ ఏకత్వ మిష్యతే" అని చెప్పుటయు నిట్టియభిప్రాయముచేతనే కలిగెను.

సూ. వారార్థకశబ్దంబుల ద్విరుక్తంబులు తఱచుగ సంఖ్యాపూర్వకంబు లగు. ౨౧

ఉ॥ ఒకతడవ, ఒకతూరి, ఒకతేప, ఒకమాటు, ఒకసారి, రెండు తడవులు, ఒకతడవకు, రెండు తడవలకు, మొ॥ అద్విరుక్తంబనుటచే తేపతేపకు; తఱచుగననుటచే తడవకు ఇత్యాదు లెఱుంగునది.

వారార్థకశబ్దంబులు = వారము అనుపదముయొక్క అర్థముగల శబ్దములు అనగా తడవ, తూరి, తేప, మాటు, సారి, మున్నగుపదములు. అద్విరుక్తములు = ద్విరుక్తిఁజెందనివి తేప, తడవ, తూరి మున్నగుశబ్దములు తేపతేప, మున్నగురీతిని ద్విరుక్తములుకానిచో సాధారణముగా సంఖ్యావాచకశబ్దములు పూర్వమునఁ గలవి యగును అని భావము.

ఒకతడవ, ఒకతూరి యిత్యాదు లుదాహరణములు. ద్విరుక్తములయినచో సంఖ్యావాచక పూర్వకములు కాఁజాలవు. తేపతేపకు. ఇట సంఖ్యావాచకము పూర్వమున లేదు.

తఱచుగా ననుటచే సంఖ్యాపూర్వకములుకాక "తడవకు" అనియు నుండును.

ఈ సూత్ర మనావశ్యకము. శబ్దములకు రెండిటికిని విశేషణ విశేష్య భావము వివక్షితమయినచో ఏకవారమ్, ద్వివారమ్, అనురీతిని సమాసము ప్రాప్తించుచునే యున్నది. "తడవకు" అనుచోట విభక్తియే ఏకత్వమును జెప్పుటచే సమాసమును వివక్షింపలేదు గావున సమాసముగాలేదు. ద్విరుక్తములగునపుడు సామర్థ్యములేనందున సంఖ్యావాచకములకు సమాసపూర్వభాగమునఁ గూడికయుండదు. కావున నీ సూత్రము స్పష్టార్థము.

సూ. ఒకండ్వాదులు పరంబులగుచోఁ దఱచుగ నున్ బది కగు. ౨౨

ఉ॥ పదునొకండు, పదునొకండ్రు; పదుమూఁడు, పదుమూఁగురు; పదునాలుగు, పదునలుగురు; పదునేను, పదునేవురు; పదునాఱు, పదునాఱుగురు; పదునేడు, పదునేడుగురు; పదునెనిమిది, పదునెనమండ్రు. తఱచుగ ననుటంజేసి పదియాఱు పదాఱిత్యాది రూపంబులును గ్రాహ్యంబులు. క. పోరులఁ గర్ణుండు పదాఱవకళకు సమానుండు గాఁడు కవ్వడితోడన్. భార. అర. ౨ ఆ. ౨౫౩. మొ॥

ఒకండు మున్నగు సంఖ్యాశబ్దంబులు పరములగునపుడు పూర్వముననున్న పదియను శబ్దమునకు ఉను అనునది అంతమున నాగమముగా చేరుననిభావము.

పది + ఉను + ఒకండు = పదునొకండు. ఇది అమహద్వాచకము. పదునొకండ్రు — ఇది మహద్వాచకము. పది + ఉను + మూఁడు = పది + ఉన్ + మూఁడు. ద్రుతలోపము రాన్, పదుమూఁడు, అమహత్తు. పదుమూగురు — మహద్వాచకము. అన్నియు నిట్లే యూహ్యములు. వీనిలో స్థిరము పరమగునపుడు ద్రుతమునకు లోపము. ఇవి వరుసగా అమహన్మహద్వాచకముల కుదాహరణము. తఱచుగాననుటచే నీకార్యము కొన్నిశబ్దములందురాదు పదిఁగూడు- ఇట "ఉను" రాలేదు. ఇకారసంధియు రాలేదు. పదాఱు — ఉను రాలేదు. ఇకారసంధి మాత్రము వచ్చెను.

"పోరులఁ గర్వుండు... ..." పదాఱు అనుటకుఁ బ్రయోగమును జూపుచున్నాడు. సూత్రమున "ఉన్ను" అనుచోట ఉను +,నది, యని ఛేదము. ఉన్ అని నకారాంతముగా నాగమమును జెప్పినచో నుత్వవిశిష్టము కాసందున ద్రుతత్వ మీ వ్యాకర్తమతమున సిద్ధింపదు. ద్రుతముకానిచో "పదుమూఁడి" త్యాదులందు లోపముసిద్ధింపక యనిష్టరూపము కావలసివచ్చును. ద్రుతమునకు సమాసమున స్వాస్థ్య ముండదని స్మరించునది.

ఈ యుదాహృతసమాసములలో సామానాధికరణ్యము లేనందున ద్విగుసమాసము లనుకొనుట తగదు. ఇయ్యవి ద్వంద్వ సమాసములనుట యుచితము. ఇందలి "ఉను" అనునది సముచ్చయార్థద్యోతకమే యనఁదగును. పదియు నొక్కండ్రు మున్నగుచోట్ల స్పష్టముగా "యును" అనునది కానవచ్చుచునే యున్నది. (చూ. ౨౦ సూ.) వీనిని ద్విగుప్రకరణమునఁ జేర్చుటచేత ద్విగుసమాసములు అను ~~భ్రాంతి~~ ప్రౌఢవ్యాకర్తయుఁ బడని తోచుచున్నది.

సముచ్చయార్థక ఉవర్ణమును ఉవర్ణపూర్వకముగా "ఉను" అనియే యుండునన్నచో పదునొకండు మున్నగునవియు నాసూత్రముచేతనే సాధితములగును. తత్వమిదియే. ద్రావిడభాషయందు "ఉ" అనియే సముచ్చయార్థకశబ్దము గలదు.

**సూ. పదకొండేరు దొమ్మదులు పరంబులగునపుడు బిందుపూర్వక డకారంబును, ద్విరుక్త నివర్ణంబును, బిందువును గ్రమంబుగ దివర్ణంబున కగు. ౫౩**

ఉ॥ పంౘ్రెండు, పన్నిరుగురు, పన్నిద్దఱు, పందొమ్మిది, పందొమ్మంౘ్రు.

రెండిరు దొమ్ములు = రెండు, ఇరు, తొమ్మిది, అను సంఖ్యాశబ్దములు. పది + రెండు = పండ్ + రెండు = పంౘ్రెండు. పది + ఇరుగురు = పన్ని + ఇరుగురు = పన్నిరుగురు. (ఇకారమునకు సమాసము అగుటచే నిత్యసంధియని యూహింపవలయును. ఇరుగురు అనునది పదమగుటచే నపదాదిస్వరసంధి యనరాదు). సూత్రమున ద్విరుక్త నవర్ణమనిన౯ జాలబాగుగానుండును. ప్రక్రియాలాఘవమును గలదు. ద్విరుక్త నివర్ణమనుపదమును సరిగాదు. ద్విరుక్తమగు నివర్ణమనగా "నిని" అనియర్థమువచ్చును. ఇకారాంతమగు ద్విరుక్త నవర్ణము వచ్చునని చెప్పిన నాయర్థము లభించును. అనగా ద్విరుక్తనవర్ణము వచ్చును అనిగాని, ఇకారాంతమగు ద్విరుక్తనవర్ణము వచ్చుననిగాని సూత్రమున నుండ౯దగును. మొదటిపక్షమున లాఘవముగూడ౯ గలదు. పది + తొమ్మిది = పం + తొమ్మిది = పందొమ్మిది. (ఇట సరళాదేశ మూహింప౯దగును.) సరళాదేశమును విధింపకపోవుట లోప మన౯దగును.

పది + తొమ్మిది అనుపదములకు సమాసము వివక్షించునపుడు బాలవ్యాకరణముచేతనే పందొమ్మిది యను రూపము సిద్ధించుచుండగా నిత౯ డీ సమాసమును బింద్వాదేశ విధానముచే సాధించుట యనావశ్యకము. ఇయ్యది శేష గ్రంథమగుటచే ననుక్తవిషయములను జెప్పవలయునేగాని అందు౯ జెప్పబడిన విషయములను మఱల౯ జెప్పుట యనుచితము. అంతియకాక ఇందలి బిందువు ద్రుతముకానందున సరళాదేశము సిద్ధింపదు. విధింపనైనను లేదు. అందుచే నీ విధానము లోపభూయిష్ఠముగా నున్నది.

ఈ సూత్రము "బిందువు" అని సామాన్యముగ విధించినను నుడితొలి హ్రస్వముమీ౯ది దగుటచే నిందు నున్నయేగాని యర్ధబిందువురాదు. (చూ. బాల. సంధి. ౨౨ సూ.)

**సూ. పది యుత్తరపదంబగుచో నేను దొమ్ముల నుమ్ములకు బిందువును, ఎనిమిదైనును, ఏడునకు వర్ణవ్యత్యయంబును, ఆ పరుషంబునకు సరళంబును గ్రహంబుగ నగు. ౨౪**

ఉ॥ ఏ౯బది, ఏ౯బంౘ్రు; తొంబది, తొంబంౘ్రు; ఎనుబది, ఎనుబంౘ్రు; డెబ్బది, డెబ్బంౘ్రు; మొ॥

ఏనుదొమ్ముల నుమ్ములకు = ఏను, తొమ్మి, అను సంఖ్యావాచకశబ్దము లందలి ను, మ్మి, అను అనువర్ణములకు, వర్ణవ్యత్యయము = అక్షరములు ముందు వెనుకలగుట. ఆ పరుషంబునకు = పదిశబ్దము మొదటనున్న పకారమునకు. క్రమంబుగాన్ = వరుసగా.

ఏను, తొమ్మిది, అనువానికి "పది" అను సంఖ్యావాచకము పరముగా నున్నచో ను, మ్మి, అనువాని స్థానమున బిందువును, ఎని, (ఎనిమిదిలోనిది) అనుదానికి "పది" పరమయినచో "ఎను" అను సర్వాదేశమును, 'ఏడు' అను దానికి 'పది' పరమగుచో వర్ణవ్యత్యయమును వచ్చును. ఈ మూఁడు స్థలము లందును 'పది' లోని పకారము బకారముగా మాఱును.

ఏను + పది. (నువర్ణమునకు బిందువు — సరళాదేశము) ఏఁ + బది = ఏఁబది. దీర్ఘముమీఁద సాధ్యపూర్ణము లేదనుటచే నిట నిండుసున్న రాదు. ఇట్లే ఏఁబండ్రు (చూ. శబ్ద. ౯౩. సూ. వ్యాఖ్య.)

తొమ్మి + పది. మ్మివర్ణమునకుఁ బూర్ణబిందువు. పకారమునకు సరళాదేశము. తొం + బది = తొంబది. నుడి తొలిహ్రస్వమునకు మీఁదిదగుటచే నర్థబిందువురాదు. తొంబండ్రును ఇట్లే. ఎని + పది. ఎనుఆదేశము. ఎను + పది. సరళాదేశము. ఎనుబది. ఎనుబండ్రును ఇట్లే. (చూ. శ. ౯౩ సూ.)

ఏడు + పది. ఈ సూత్రముచే సరళాదేశము. వర్ణవ్యత్యయము. అక్షరములు తలక్రిందుకాగా "డుపి" అగును. అపదాదిస్వరసంధి. డె + బది. సమా. ౨౨ సూ.చే హ్రస్వము. డె + బది. (శబ్ద. ౧౦౦. సూ.చే ద్విత్వము.) డెబ్బది. ఇట్లే డెబ్బండ్రు.

వీనిలో తొంబది బాలవ్యాకరణముచే సాధింపఁబడెను. (చూ. బాల. సంధి. ౩౯ సూ.) అయినను పదిశబ్దము సమాసమున నుత్తరపదముగా నున్నపుడు మఱికొన్ని శబ్దములకు రావలసినకార్యములను జెప్పుచు దీనిఁగూడ వాని పద్ధతినే యీతఁడు సాధించెను. బాలవ్యాకరణ పద్ధతికంటె నీ పద్ధతిని సమాసము సిద్ధించుట సుకరము. అనగాఁ బ్రక్రియాలాఘవము గలదని భావము.

సూ. పది యుత్తరపదంబగుచోఁ బూర్వపదంబు దీర్ఘమునకు హ్రస్వం బగు నేను నేకు రాదు. ౨౩

ఉ॥ ముప్పది. ముప్పండ్రు. నలువది. నలువండ్రు. అఱువది. అఱువండ్రు. వెం॥

పది, అను శబ్దము సమాసమున నుత్తరపదమయినచోఁ బూర్వపదము నందలి దీర్ఘమునకు హ్రస్వమగును. ఏను — శబ్దమునందలి ఏకారమునకు మాత్రము రాదు. (చూ. ౨౫ సూ.)

మూఁడు + పది. (బాల. సమా. ౧౨ సూ.) డులోపము. మూ + పది. ఈ సూత్రముచే హ్రస్వమురాగా ము + పది యగును. శబ్ద. ౧౦౦ సూ.చే ద్విత్వము. ముప్పది. ఇట్లే ముప్పండ్రు.

నాలు + పది. ఈ సూత్రముచే హ్రస్వము. నలు + పది. గసడదవాదేశము. నలువది. ఇట్లే నలువండ్రు. నాలుగు అను ప్రాతిపదికమునందలి గువర్ణమును అలౌకికస్థితియందే లోపింపఁజేసి "నాలు" అనుదానిని శేషింపఁజేయవలయును. (ఈలోపము శబ్ద. ౯౩ సూత్రముచే నెట్లో సంపాదించుకొనవలయును గాబోలును).

ఱు + పది. హ్రస్వము — అఱు + పది. గసడదవాదేశము. అఱువది ఇట్లే అఱువండ్రు. ఏను నేకు రానందున ఏఁబది అనునది దీర్ఘముతోడనే వినవచ్చును.

సూ. కొన్నియెడల నీ సమాసపదంబులు యువర్ణ వ్యవహితంబులు నగు. ౨౬

ఉ॥ "అక్రూర. వనమునఁ బదియు రెండేఁడు లజ్ఞాతవాస మొక్కేఁడు జనపదంబుననుండి" భార. ఆది. 3 ఆ.౧౯. తే.గీ. ద్రోహులగు వేలుపులలోన దొరసియున్న పదియునొక్కండ్రు రుద్రులఁ బాఱవిడిచె. కాశీ. 2 ఆ.౮౬. మొ॥

ఈ సంఖ్యావాచక సమాసములలో యున్ అనువర్ణము మధ్యభాగమునఁ జేరుటయు గొన్నిచోట్లఁ గలదని తాత్పర్యము.

పది, రెండు, అనుపదముల సమాసమధ్యమున "యున్" అనునది చేరి పదియురెండు అని యయ్యెను. ఇందలి నకారమునకు హల్లుపరమగుటచే లోపమువచ్చెను. (ఇది సముచ్చయార్థకావ్యయావయవ మగుటచే ద్రుతము). దీనికిఁ బ్రయోగము "వనమున... ...నుండి" అనునది. పది ఒక్క అను శబ్దములసమాసము మధ్యమున యున్ చేరి పదియునొక్కండ్రు అని యయ్యెను. "ద్రోహులగు,... ...విడిచె" అనునది యిందుకుఁ బ్రయోగము,

ఈ సూత్రమున ''యువర్ణ వ్యవహితంబులు'' అనుచోట యువర్ణమనగా ద్రుతాంతమగు యువర్ణమని యర్థముచేసికొనవలయును. ఈ ద్రుతమునకు స్థిరము పరమగునపుడు లోపమువచ్చి ''యు'' అనియే వినఁబడును. కనుకనే పదియునొక్కండ్రు మున్నగుచోట్ల నకారము కాన్పించుచున్నది.

ఈ వ్యవధానము క్వాచిత్కమనుటచే పండ్రెండు, పదునొక్కండ్రు మున్నగురూపములును (యువర్ణము చేరనివి) సమ్మతములే.

సూ. కఱకంఠుఁడు బహువ్రీహి. ౨౩

(చూ. సంజ్ఞ. ౯ సూ. ఉ) దిని నహోబలపండితుఁడు మిశ్ర. బహువ్రీహి యనెంగాని యది యట్లగుట దుర్ఘటము.

"కఱకంఠుఁడ"నునది సిద్ధావస్థయందు బహువ్రీహి సమాసమే యగునని భావము. తద్భవమగుటచే దీనికి సాధ్యావస్థయు సమాసమును దెనుఁగున లేవు.

ఇందొకపదము (కఱ) వైకృతమగుటచే సిద్ధసమాసమనుటకు వలను పడదు. కంఠపదము త్రిసమము కానందునను రెండుపదములును వైకృతములే యయినంగాని సాధ్యసమాసములయందు బహువ్రీహి కానరాకుండుటచేతను బాలవ్యాకర్త కఱకంఠపదమును వ్యాకరణసాధ్యము కాదని తలంచి గ్రామ్య మనెను. అయినను శిష్టజన వ్యవహృతమగుటచే గ్రాహ్యమగునని భావించెను. అర్థమునుబట్టి బహువ్రీహియే కావలసియున్నను బహువ్రీహి నియమము లింటు కానరానందున నాతఁడు దీనిని గ్రామ్యమనియెను.

ప్రౌఢవ్యాకర్తయు దీనిని బహువ్రీహి యనియె యంగీకరించుచున్నాఁడు. అహోబల పండితాదుల ననుసరించి బాలవ్యాకర్త దీనిని మిశ్రబహువ్రీహి యని తలంచి తెనుఁగున మిశ్రబహువ్రీహి యశాస్త్రీయమని గ్రామ్యములలో దీనిం జేర్చెనని యయినను భావింపవచ్చును. ఆ పక్షమున బాలవ్యాకర్త మతము సరికాదనియు నీ సమాసము బహువ్రీహి సమాసమేయనియుఁ బ్రౌఢవ్యాకర్త చెప్పుచున్నాఁడు.

సూత్రమున బహువ్రీహి యనుట సిద్ధావస్థయందని గ్రహింపవలయును. ''గరకంఠ'' అను సిద్ధబహువ్రీహి వైకృతమయి కఱకంఠుఁడను రూపముఁ జెంచె నని యాతని యాశయము. తద్భవములందు గొన్ని వర్ణములు మాఱుటయుఁ గొన్ని మాఱకుండుటయుఁగూడ గలదు. ఇందు గరశబ్దము మాత్రము మాఱి కంఠశబ్దాక్షరములు వికారముఁ బొందలేదని భావము. అచ్చతెనుఁగుశబ్దములయందు

రకారముండుట వర్ణసమామ్నాయ సంప్రదాయ విరుద్ధము గాన దీనిని గ్రామ్యములలో ప్రౌఢవ్యాకర్తయుఁ జేర్చెను. సిద్ధసమాసమే (గరకంఠ) వికారముం జెంది విశిష్టరూపముతోఁ దెనుగున వ్యవహరింపఁబడుచుండుటచే దీనికిఁ దెనుగున సమాసకల్పనమే యనుచితమనియుఁ గావున నహోబలపతి మిశ్ర బహువ్రీహి యనుట సరిపడదనియు వ్యాకర్త వివరించెను.

ఈ సమాస మనింద్యగ్రామ్యమనుటయందును బహువ్రీహి సమాసమనుటయందును బాలప్రౌఢవ్యాకర్తలకేగాక యహోబలపతికిని నభిప్రాయములేదు. ఇది మిశ్రబహువ్రీహి యనుట సరికాదనియు సంస్కృత సమాసమే వైకృతమయ్యెననియు సాధ్యసమాసము కానేకాదనియుఁ బ్రౌఢవ్యాకర్త యభిప్రాయము.

సూ. కొన్నియెడల మహద్ద్వంద్వంబునం బూర్వపదాంత్యస్వరంబునకు దీర్ఘంబునుం జూపట్టెడు. ౨౮

ఉ॥ అన్నాదమ్ములు. ఉ॥ హరి.౪ ఆ.౧౫౨. అప్పాచెల్లెండ్రు. నిర్వ.౩ ఆ ౯౩. తల్లీదండ్రులు. భల్లా.౪ ఆ.

బహువ్రీహింగూర్చిన విషయము పూర్వసూత్రమునఁ జెప్పి యిక ద్వంద్వసమాస విషయమును జెప్పుచున్నాఁడు. [మహద్ద్వంద్వంబునన్ = మహద్వాచకములకుఁగాని మహతీవాచకములకుఁగాని చేయఁబడు ద్వంద్వసమాసమున పూర్వపదాంత్యస్వరంబునకు = సమాసమునందలి మొదటిపదము చివఱియచ్చునకు.]

ద్వంద్వసమాసమునంగల పదములు మహద్వాచకములుగాని, మహతీవాచకములుగాని, ఒకటి మహతీవాచకమును వేరొకటి మహద్వాచకమునుగాని, యయినచో మొదటిపదము చివఱనున్న యచ్చు దీర్ఘముగా మాఱునని యర్థము.

బాలవ్యాకరణమున నీ విషయము చెప్పఁబడనందున నీతఁడు తెలియఁజేసెను ఉ॥ అన్నాదమ్ములు. ఇది మహత్తుల ద్వంద్వమున కుదాహరణము. పూర్వపదమగు "అన్న" లోని చివఱియచ్చు దీర్ఘమయ్యెను. అన్న + తమ్ములు, బాల. సంధి. ౨౩ సూ.చే గసడదవాదేశము. అన్న + దమ్ములు. ఈ సూత్రముచే దీర్ఘము. అన్నాదమ్ములు.

అప్పాచెల్లెండ్రు — మహతీశబ్దముల ద్వంద్వమున కిది యుదాహరణము. ప్రక్రియ పైరీతిని వేద్యము. తల్లిదండ్రులు — మహతీవాచకమునకును మహద్వాచకమునకును వచ్చిన ద్వంద్వమున కుదాహరణము. ప్రక్రియ పైరీతినే.

అన్నాదమ్ములు మున్నగునవి యతిప్రాసాదిస్థలగతములుకావు కనుక యియ్యవి సరియగు నుదాహరణములు కాఁజాలవనియు నిట్టిప్రయోగములు విశ్వసింపఁదగవనియు బ్ర॥శ్రీ. వ. సీతారామస్వామి శాస్త్రిగారి యాశయము.

సూత్రమున "మహద్ద్వంద్వంబునన్" అనుచోట మహతీనాంచ మహతాంచ = మహతాం అని యేకశేషవృత్తియని గ్రహించుట ప్రౌఢవ్యాకర్తకభిమతము. కావుననే యుదాహరణములను ముచ్చిధములను జూపెను.

సూ. ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబసమం బగు. అగుచో నా ముపర్ణకంబునకు లోపం [illegible] ...

ఉ॥ అందచందములు. అని.౫ ఆ.౬౭. [illegible]. వేం. పంచ.౧ ఆ.౭౬౩. మొ॥

ద్వంద్వసమాసమునఁ బూర్వపదము స్త్రీ [illegible] మునని బాలవ్యాకర్త నియమించెను. (చూ. బాల. సమా. ౩ [illegible] తోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు.) [illegible] పూర్వపదమగుట కొన్నిచోట్లఁ గానవచ్చుచున్నది [illegible] బూర్వపదముగానున్న క్లీబసమ శబ్దమునందలి ముపర్ణకమునకు [illegible] కూడ వచ్చునని భావము.

అందము + చందము — ఈ సూత్రముచే సమాసమువచ్చి ముపర్ణకము లోపింపగా "అందచందములు" అగును. ఇట్లే [illegible]చ్చము + సచ్చము = పెచ్చసచ్చములు.

"అందముయొక్క + చందముయొక్క = అందచందములయొక్క." మున్నగు స్థలములయందు ముపర్ణకముగాకున్నను ముపర్ణకమునకు విధించు కార్యము ముగాగమంబునకు నగు (బాల. తత్స. ౪౧ సూ.) ననుసూత్రముచే నాగమ ముకారమునకును లోపమువచ్చును.

సరసవుపలుకు మున్నగు కర్మధారయములందు "సమాసవిభక్తికి లోపం బగు లట్లునకుఁ గాదు" అను సూత్రముచే ముపర్ణకమునకు లోపముగాదు.

మువర్ణకమునకు పుంవ్ద్భావదేశము విధింపఁబడుటచే విభక్తిలోపమును బాధించి పుంవుల వచ్చును. ద్వంద్వసమాసమున నట్టి బాధకము లేనందున మువర్ణకమునకు పై బాలవ్యాకరణసూత్రముచేతనే లోపమువచ్చును. కావున నిందు మువర్ణకలోపమును జెప్పుట యనావశ్యకము అని భావింపఁదగదు.

సామాసిక విభక్తిలోపము మువర్ణకమునకుఁ బ్రాప్తించినను ముగాగమమునకు రాదు. ఇయ్యది ప్రకృతికాగమమగుటచే యదాగమ న్యాయమునఁ బ్రకృతియనియే గ్రహింపఁదగును గాని ప్రత్యయమని గ్రహింపఁబడదు. అందుచేఁ బ్రత్యయమునకు విధింపఁబడిన లోపము ప్రకృత్యవయవమగు ముకారమునకు రాదు. కాని మువర్ణకమునకు లోపము ప్రాప్తించునపుడు ముగాగమమునకును "మువర్ణకమునకు విధించు కార్యము ముగాగమంబునకు నగు" నను సూత్రముచే మువర్ణక కార్యమగు లోపముదాఁప. సెయ్యుఁ బ్రాప్తి అప్పు వచ్చెనేని "గుణములపోఁక" మున్నగు సమాసములందు ముగాగమము వినఁబడక పోవును. కాని మువర్ణకమునకు విధించిన కార్యమనఁగా "మువర్ణకము" ప్రసమైకవచనము" మున్నగుశబ్దములతో సాక్షాత్తు మువర్ణకమునకు మాత్రమే విధింపఁబడినకార్యము. అదిమాత్రమే ముగాగమమునకు వచ్చును. విభక్తి, ప్రత్యయము, మున్నగు సామాన్యవాచకశబ్దములతో విధింపఁబడిన కార్యము (ఒక్క మువర్ణకమునకు మాత్రమే విధింపఁబడినది కాదు కావున) ముగాగమమునకు రాదు. కనుకనే సూత్రమున మువర్ణకమునకు విధించు కార్యము అని చెప్పఁబడెనుగాని "మువర్ణకమునకు వచ్చు కార్యము" అని సూత్రమునఁ జెప్పలేదు. మువర్ణకమునకు మాత్రము విధింపఁబడిన పుంవ్ద్భావదేశము మాముడి, చరిత్రాది మువర్ణకలోపము, మున్నగునవి ముగాగమమునకు వచ్చును గాని సామాసిక విభక్తిలోపము రాఁజాలదు. అందుచేతనే గుణముల పోఁక మున్నగు సమాసములలో ముకారమునకు లోపమురాలేదు.

గుణములపోఁక మున్నగువానియందువలె అందచందముల పోఁక, అందచందముల తీరు, అందచందములను, మున్నగు ముగాగమస్థలములందు మువర్ణకమునకు లోపము బాలవ్యాకరణముచే సిద్ధింపదు. ఆకారణముచే "మువర్ణకంబునకు" అని మువర్ణకమును గ్రహించి లోపము ప్రౌఢవ్యాకర్త విధింపవలసివచ్చెనని గూఢాభిప్రాయమును దెలిసికొనదగును.

సూ. ద్వంద్వం బప్రాణి వాచకకృదంత శబ్దఘటితం బేకవచనాంతంబు నగు. ౩౦

ఉ॥ కూడుగుడ్డ. "కూరగాయ" జై.౪ ఆ.౯౬. "దరిదాపు" భోజ.౨ ఆ.౬. "రేవగలు" రామా.౨ ఆ.౧౨. తాఁకుదగులు. హరి. ఉ ౫ ఆ.౯౦. నుశబ్దంబుచేఁ గూరగాయ లిత్యాదులు బహువచనాంతంబులు నగునని యెఱుంగవలయును.

అప్రాణివాచక కృదంతశబ్దఘటితంబు = అప్రాణివాచక శబ్దములతోఁ గూర్పఁబడి యున్నదియుఁ, గృదంతశబ్దములతో ఘటింపఁబడినదియు నగు.

అప్రాణివాచకశబ్దములతోఁ గూడిన ద్వంద్వమును, కృదంతశబ్దములతోఁ గూడిన ద్వంద్వమును ఏకవచనాంతముగకూడ నుండునని భావము. (అనగా బహువచనాంతమును గావచ్చును.)

ద్వంద్వముభయపదార్థ ప్రధానమగుటచే నుభయపదార్థములందు గల బహుత్వసంఖ్యను బోధించుచు బహువచనాంతముగా నుండును. బాలవ్యాకర్త అన్నదమ్ములు" మున్నగు ద్వంద్వములను బహువచనాంతములుగనే యుదాహరించెను. కాని తెనుగునఁ గొన్ని ద్వంద్వములు ఏకవచనాంతములుగా కూడ నుండుటచే నీ సూత్రముచే వానికి సాధుత్వమును జెప్పుచున్నాఁడు.

కూడు + గుడ్డ = కూడుగుడ్డ. కూడును గుడ్డయు ననియర్థము. ఇందలి పదములు ప్రాణములేని వస్తువులను బోధించుచున్నవి. అందుచే నేకవచనాంతమయ్యెను. "కూడు గుడ్డలు" అని బహువచనాంతముగను నుండవచ్చును.

కూరయుఁ గాయయు = కూరగాయ. ఇట బాల. సంధి ౧౫ సూ.చే గసడదవాదేశము. రేయియుఁ బగలును = రేవగలు. ఇదియునట్లే. తాఁకు తగులు = తాఁకుడగులు. తాకుటయు తగులుటయు ననియర్థము. తాకు, తగులు, అను ధాతువులకు ఉవర్ణకంబడు క్త్వాదులకగు (బా. కృ. ౨౧ సూ) అను సూత్రముచే "ఉ" అను కృత్ప్రత్యయము చేరినపదములగుటచే నియ్యది కృదంత శబ్దఘటితము.

సమాహారద్వంద్వము, ఇతరేతర యోగద్వంద్వము అని ద్వంద్వమును సంస్కృత వైయాకరణులు రెండువిధములుగాఁ జెప్పుచున్నారు. ఇందు మొదటి దేకవచనాంతము, రెండవది ద్వివచన బహువచనాన్యతరాంతమునగును.

అట్లే తెనుగునను సమాహారము వివక్షితమయినచో నేకవచనాంతములుగను నితరేతరయోగము వివక్షితమయినచో బహువచనాంతముగను ద్వంద్వముండు నని తలంపనగును. బాలవ్యాకర్త సమాసములు సాధారణముగా సంస్కృత లక్షణము ననుసరించియుండునని చెప్పుటచే సమాసములందు వచనమునుగూర్చి యేమియు చెప్పలేదు. సంస్కృతముకంటె భేదముగల వచనమును మాత్రము "ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు మిశ్రంబునకుఁ గాదు" అను సూత్రముచే విధించెను — ఇందుచే మిగిలిన సమాసములందు వచనము సంస్కృతము ననుసరించియే యుండునని భావము.

కనుక సమాహారము వివక్షితమగునపుడు "కూడు గుడ్డ"ని ఏకవచనాంతముగా నుండుననియు నితరేతరయోగము వివక్షితమయినచో "కూడు గుడ్డలు" అని బహువచనాంతముగా నుండుననియు సిద్ధించుచుండగా నీ సూత్ర మనావశ్యకము.

**సూ. భావద్వంద్వంబునం దొలిపదంబు టవర్ణకంబునకు లోపం బగు.**

టవర్ణకంబిటఁ గృత్ప్రత్యయంబున కుపలక్షణంబు 31

ఉ॥ 'ఔగాములు' (అవుట+కామి) పర.3 ఆ. చెల్లు చెల్లములు. (చెల్లుట+చెల్లమి) వేం. పంచ.1 ఆ. 263. వచ్చు రాములు. (వచ్చుట+రామి) పాండు.4 ఆ.66. వినివినములు. (వినికి+వినమి.) సా.2 ఆ.22 మొ॥ (వినికి=వినుట)

భావార్థమున వచ్చిన "ట, మిఁ, ఇకి" కృత్ప్రత్యయములు అంతమునఁ గల శబ్దములతో నేర్పడిన ద్వంద్వసమాసమున పూర్వపదముయొక్క టవర్ణకము మున్నగు కృత్ప్రియములు లోపించును అని భావము.

టవర్ణకంబనగా నొక్క టవర్ణకమే గాక టవర్ణకార్థమున వచ్చిన కృత్ప్రత్యయములన్నియు గ్రాహ్యములని వివరించెను. ఉపలక్షణమనగా సూచనమని తాత్పర్యము.

అగుట + కామి = అచ్చికంబులంద యియవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు. (బాల క్రియ. 103 సూ.) నను సూత్రముచే అగుట అను నది అవుట అని మారగా ఔట + కామి. గసడదవాదేశమురాగా ఔట + గామి. ఈ సూత్రముచే టకారలోపము ఔగామి = ఔగాములు. ద్వంద్వమగుటచే

బహువచనాంతమయ్యెను. ఇందు "అగుట" భావార్థక కృదంతము. కామి వ్యతిరేకభావార్థక కృదంతము. (చూ. బాల. క్రియ. 35, 37 సూ.) చెల్లుట + చెల్లమి = చెల్లుచెల్లములు ఇందు టువర్ణకలోపమురాగా చెల్లుచెల్లములు. సంధి 6 సూ.చే గసడదవాదేశ నిషేధము. వచ్చుట + రామి టులోపము = వచ్చురాములు. వినికి + వినమి. వినికి అనుపదము "ఇకికోర్వాదులకగు" నను సూత్రముచే ఇకి ప్రత్యయాంతము. టువర్ణకము కృత్ప్రత్యయంబున కుపలక్షకంబగుటచే నికి ప్రత్యయములోని 'కి' అనుదానికి లోపము.

టువర్ణకము కృదంతమునకు చివరియక్షరముగానుండును. అందుచే దానిచే నుపలక్షితమగు లోపముగూడ కృత్ప్రత్యయము చివరియక్షరముననే యని యూహించుకొనవలయును. కృత్ప్రత్యయంబుల కుపలక్షణంబనుటకు బదులు కృత్ప్రత్యయాంతాక్షరమున కుపలక్షణంబు అనుట యుచితము.

**సూ. ద్వంద్వంబునం బూర్వపదాంత్యావయవంబునకు లోపంబొందెనగు. ౩౨**

ఉ॥ 'పుట్టుగ్రుంకుగట్లు' య.౫ ఆ.౩౦. 'తొవదమ్మివిందు.' రామా.3 ఆ.౮౫. 'విన్న కన్నది.' వి.పు.౨ ఆ. పుట్టుగ్రుంకు గట్లనఁగా పుట్టుగట్టు, క్రుంకుగట్టు ఇట్లంతట నెఱుంగునది.

ద్వంద్వసమాసమున పూర్వపదము రెండుపదముల కూడికవలన నేర్పడిన పదమయ్యేనేని అందలి రెండవభాగమునకు లోపము వికల్పముగా నగును.

పుట్టుగట్టు + క్రుంకుగట్టు = పూర్వపదము "పుట్టుగట్టు." ఇందలి అంత్యావయవము "గట్టు" అనునది. దానికి లోపమువచ్చి "పుట్టు గ్రుంకుగట్లు" అయ్యెను. ఉదయాస్తమయపర్వతములని యర్థము. ఇందు పుట్టు, గట్టు, అని రెండు అవయవము లుండుటచేత రెండవయంశమునకు లోపము వచ్చెనని తెలిసికొనవలయును. తొవవిందు + తమ్మివిఁదు = 'విందు' లోపము — తొవదమ్మివిందు. విన్నది + కన్నది = 'అది' కి లోపము — విన్నకన్నది. గసడదవాదేశము ప్రయోగమునుబట్టి యూహించుకొనవలయును (చూ. సంధి. 6 సూ.)

**సూ. ఒకానొకచో ద్వంద్వంబు మిశ్రంబుగను, అందలి పూర్వపదంబు క్లీబసమంబుగను గానంబడియెడి. ౩౩**

ఉ॥ అవసరమక్కలు. 'క. అవసరమక్కలంగైర, దుష్కర్జము లెందు వేఁట దోఁటలయందున్, దవులైన పాఁతలెంకల, మవుటన్ మమజూడు మోపినప్పుడైనన్.' రామా. ౨ ఆ. ౯.

ఒక్కొకచో ద్వంద్వసమాసము మిశ్రముగా నుండును. అట్టిచో పూర్వపదంబు క్లీబసమంబుగను నుండుట గలదని తాత్పర్యము.

బాలవ్యాకరణమున ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగునని సూత్రముగలదు. దీనింబట్టి ద్వంద్వసమాసమున రెండవపద మాచ్ఛికముగా నుండవలయునని మాత్రము నియమము లభించుచున్నది. ప్రథమపదమునుగూర్చి నియమము కానరాదు. అయినను బాలవ్యాకర్త యిచ్చిన యుదాహరణములలో మిశ్రసమాసము లేనందున మిశ్రము అసమ్మతమను సందేహము కలుగుచున్నది. దానిని బోగొట్టుటకు ఈ సూత్రము వ్రాయఁబడెను. ద్వంద్వమున స్త్రీసమము పూర్వపదముగా నుండుననియు (బాల. సమా. 7 సూ.) బాలవ్యాకర్త యీ సూత్రమునఁ జెప్పుటచేఁ గ్లీబసమంబును పూర్వపదముగా నుండవచ్చునని యిందుఁ జెప్పుచున్నాఁడు. ప్రాయికగ్రహణముచే నీ యర్థము లన్నియు లభించుచున్నను స్పష్ట ప్రతిపత్తికొఱకీ సూత్రము రచించెనని యూహింపవలసియున్నది.

అవసరము + అక్కఱ = అవసరమక్కలు. ఇందుఁ బూర్వపదము తత్సమము. ఉత్తరపదమాచ్ఛికము. కనుక మిశ్రసమాసమయ్యెను. ఇందుఁ బూర్వపదము మువర్ణకాంతమగుటచేఁ గ్లీబసమమని వ్యాకర్తయభిప్రాయము. ఇందుకుఁ బ్రయోగమునుజూపెను.

అవసరము అనుపదమును గ్లీబసమమని ప్రౌఢవ్యాకర్త తలంచుట ప్రామాదికము. అవసరశబ్దము స్వతః పుంలింగము. క్లీబసమత్వమునేసూత్రమును విధింపలేదు. కంధరాదులం జేర్చుట కియ్యది స్త్రీలింగముగాదు. మహతీ తర స్త్రీలింగ విశేషణము కానందున బాల. తత్స. ౧౬ సూత్రమునకిది విషయము కాదు. ఆచ్ఛికశబ్దముకానందున ఆచ్ఛి. ౨ సూత్రముచేతను గ్లీబత్వమురాదు. అదంతామహద్వాచకమయినందుననే దీనికి మువర్ణకముచేరెనుగాని నపుంసకమగుటచేఁగాదు. ప్రౌఢవ్యాకర్త దీనిని నపుంసకసమ మనుట మువర్ణకాంతమగుటచేతనే యయియుండును. "పూర్వపదంబు మువర్ణకాంతమగుగ జేయఁబడియెడి" నని సూత్రితియురద్ధిన భాగుగాను౦చెడ్డి.

పూర్వపద క్లీబసమత్వవిధానముచేతనేకాని అవసరమక్కఱలు అను నుదాహరణమును జూపుటవలనఁగాని యిట ముపర్ణకమునకు సామాసికవిభక్తి లోపమురాదని యూహింపవలయును. ఇట్టి సమాసము లత్యంత విరళములని తెలిసికొననగును.

సూ. ఒక్కొకచో సమాసగత పూర్వపదంబు వ్యవహితోత్తరపదం బొంటితోడను వాని పెక్కింటితోడను నన్వయించెడి. ౩౪

ఉ॥ రాహుకంఠముదెగి దేహము ధరణిఁబడియె. భార. ఆది.౨ ఆ.౧౯. క. ఒక్కొక కన్నును జెవియును, జెక్కును జనుబొడ్డు మూపుఁ జెలువగుచేయున్! బ్రక్కయుఁ బదుదును గాలును, నక్కజముగ మనుజశకల మప్పుడుదయించెన్. సభా.౧ ఆ.౧౪౪. క. పరుల ధనమునకు విద్యా, పరిణతికిం దేజమునకు బలమునకు మనం, బెరియఁగ నసహ్యపడు నన్నరుఁడు దెవులులేని వేదనంబడు నధిపా. భార. ఉద్యో.౨ ఆ.౫౮. క. నాయింటం బదికడవల, నేయిఁ బెరుగుఁ బాలు ద్రావె నీ ప్రియతనయుండు. హరి. పూ.౫ ఆ.౨౧౫.

సమాసగతపూర్వపదంబు = సమాసమునందలి మొదటిపదము. వ్యవహితోత్తరపదం బొంటితోడను = మఱియొకపద మడ్డముగా నుండగా ముందు భాగముననున్న ఒక్క పదముతోడను. వాని పెక్కింటితోడను. వ్యవహితోత్తర పదము లనేకములతోన్.

పమాసముననుండు రెండుపదములలోఁ బూర్వపదము మఱియొకపద మడ్డముగా నున్నను ముందుపదములలో నొక్కదానితోఁగాని పెక్కు పదముల తోఁగాని యన్వయించుట కొన్నిచోట్లఁ గలదనిభావము.

రాహుకంఠము — రాహువుయొక్క కంఠమని షష్ఠీతత్పురుషము. ఇందు రాహువుయొక్క అను పూర్వపదము కంఠముతెగి అనుపదములతో వ్యవధాన మున్నను దేహపదముతో నన్వయించుచున్నది. రాహువుయొక్క కంఠముతెగి రాహువుయొక్క దేహము ధరణినిబడియెనని యర్థము.

"ఒక్కొక కన్ను" అను సమాసమునందలి "ఒక్కొక" అను పూర్వపదము కన్నను అను సమాసోత్తరపదము అడ్డముగానున్నను జెవిచెక్కు మొదలగు

ననేకపదములతో నన్వయించుచున్నది. ఇయ్యది పెక్కుపదములతో నన్వయిం చుట కుదాహరణము. ఇట్లే మిగిలినవియు.

"పరులధనమునకును. ...." ఇట పరులధనమునకు అనునది తత్పురుష సమాసము. ఇందలి పూర్వపదమగు పరులయొక్క అనునది విద్యాపరిణతికిఁ దేజమునకు, బలమునకు, అనుపదములతో నన్వయించుచున్నది.

పదికడవలనేయి అను సమాసమునఁ "బదికడవల" అను పూర్వపదము "నేయి" తోడనేకాక పెరుగు, పాలు, అనువానితోడను నన్వయించుచున్నది. ఈ యుదాహరణమునఁ బూర్వపదముగూడ నొక్కపదముకాక పది, కడవలు, అను రెండు పదములతోఁగూడిన సమాసము ఈ సమాసమునకు నేయి అను పదముతో సమాసమువచ్చెను. వెనుకటి యుదాహరణము లిట్టివికావు. పూర్వ పదము లేకైకములు.

వీనిలో రాహుకఁఠము అనునది సిద్ధసమాసమనియు మిగిలినవి సాధ్య సమాసములనియు వ్యాకర్త తలంచియుండును. కనుకనే "సమాసగత" అని సామాన్యముగాఁ జెప్పెను. అట్లుకానిచో సిద్ధఅనియో సాధ్యఅనియో విశేష ణముగూడఁ జేర్చియుండునుగదా! కాని సమాసగతపదములలోఁ బూర్వపద ముతో వెనుకనున్నపదము లన్వయించుట క్వాచిత్కముగా సంస్కృతభాష యందును గలదు (చూ. దేవదత్తస్య గురుకులమ్) సమాసపూర్వపదము పర ముగానున్న భిన్నపదములలోనికి విశేషణముగ నన్వయించుట యొచ్చటను లేదు. అకారణముచేతనే తెనుగునను సిద్ధసమాస పూర్వపదములకు ఈ సూత్రము విధించుకార్యము వర్తించునని చెప్పరాదు. రాహుకంఠము అనునదియు సాధ్య సమాసమే. రాహువుయొక్క అనుపదములోని వువర్ణకము లోపింపగా (చూ శబ్ద. ౨౬) రాహుయొక్క అనియుండును. ఈ తత్సమపదము కంఠము అను తత్సమపదముతో సమసించి రాహుకంఠము అని సాధ్యసమాసమయ్యెను. అని తెలియవలయును. మిగిలినయుదాహరణములు సాధ్యసమాసములనుట నిర్వి వాదము.

ఒక్కొక అనునది ద్విరుక్తము. ఇందు రెండుపదములు సమాసమువంటి వయ్యెనని తెలిసికొనవలయును. సంస్కృతమునను ఏకైకమ్ ఇత్యాదులు సమాస షద్భావమును బొందినవి. ద్విరుక్తమునందలి మొదటిపదమునకు బాలః సంధి. ౡగా సూత్రముచే విభక్తిలోపము వచ్చినను రెండవపదమునకు విభక్తిలోపిం

చుటు సమాసముకానిచో సంభవింపదుగదా. ఒక్కొకటి అని విడిగానున్నపుడు సమాసవద్భావము లేదన్నను గుదురునుగాని "యొక్కొక కన్ను" అనురీతిని వేఱొకపదముతో సమాసముఁ జెందినపుడు రెండవపదమునకు విభక్తిలోపించుటకై సమాసత్వము నంగీకరింపక తప్పదు.

ఇందలి నాల్గు ఉదాహరణములందును బూర్వపదములు భిన్న భిన్న జాతీయములు. రాహుపదము ఒకపక్షమున సిద్ధసమాసగతము. ఒక్కొక అనునది ద్విరుక్తము. సమాసకల్పము. పరుల అనునది ఏకపదము, సాధ్యసమాస ఘటితము. పదికడవల అనునది సమాసపదము.

సూ. కొన్నియెడల సిద్ధసమాస మధ్యగతపదంబులతోఁ దద్భిన్న పదంబుల కన్వయంబు చూపట్టెడి. ౩౫

ఉ॥ బహువేదఘోషములఁజేసి నిరస్త సమస్త కిల్బిషోత్కరులగుచున్న ధన్యులు. భార. అర.౧ ఆ.౧౧. వారియస్మదీయోరుచమూసమూహములు. హరి. ఉ.౨ ఆ ౧౦౪. అఖండితరూపవిలాస సంపదన్ వంచిత పంచబాణుఁడగువాని. నైష.౩ ఆ.౪౦. అందొకటిచే జనితాధరపీడయై. కళా.౪ ఆ.౨౭. మొ॥

కొన్నిచోటులందు సిద్ధసమాసగతపదములతో వేఱుగానున్నపదములన్వయించుటయుఁ గలదనిభావను.

సమాసపదముల మొత్తము అర్థముననే అనగా విశిష్టార్థముననే విడిగానున్నపదము లన్వయించుట యాచారము. సమాసమునందలి యొక్కొక్క పదముతో విడిపదములు వేఱుగా నన్వయింపరాదు. (సమాసార్థమేకీభూతముగా భాసించును కావున నా యర్థముతో నేకదేశముతో వేఱొకపదము అన్వయింపఁదగదని పెద్దల యాశయము). కాని యట్టి నియమమును విడచి సమాసమునందలి పూర్వపదముతోఁ గాని యుత్తరపదముతోఁ గాని విడిపదమన్వయించునని యీ సూత్రము చెప్పుచున్నది. వెనుకటి సూత్రమును ఇయ్యదియుఁగూడ నేకదేశాన్వయమును జూపుట కుద్దేశింపఁబడినవి. "బహువేద... ...ధన్యులు" ఇట నిరస్త అనుపదము సమాసమునందుఁ బూర్వపదముగాఁ గూర్పఁబడియున్నది. ఇందు "నిరస్త సమస్త కిల్బిషోత్కరులు" అనునది

కేవల సంస్కృతపదముల సమాసమగుటచే సిద్ధసమాసము వేదఘోషముల చేత నిరస్తమయిన అనగాఁ బోఁగొట్టఁబడిన సమస్తమగు పాపసమూహము గలవారు అని యన్వయము. ఇందు నిరస్త అను సిద్ధసమాసగత పూర్వపద ముతో బహువేదఘోషములఁజేసి అనుభిన్నపద మన్వయించుచున్నది. ఇది సిద్ధసమాస పూర్వపదముతో నన్వయించుట కుదాహరణము.

"వారియస్మదీయోరు........" ఇట "అస్మదీయోరుచమూసమూహ ములు" అనునది సిద్ధసమాసము. ఇందలి "ఉరుచమూ సమూహములు" అను నుత్తరపదము నర్థములోనికి "వారి" (యొక్క) అనుశబ్దము అన్వయించు చున్నది. ఇయ్యది సిద్ధసమాసములోనిదికాక భిన్నపదము. వారియొక్క ఉరు చమూ సమూహములని యన్వయము ఇట్టిదియు సమాసమున నేకదేశము తోడనే యన్వయించుచున్నది.

"అఖండిత.......అగువాని" — ఇట వంచితపంచబాణుఁడను సిద్ధ సమాసములోని పూర్వపదమగు వంచితశబ్దముతో "నఖండిత రూపవిలాస సంపదన్ "అను భిన్నపదము అన్వయించుచున్నది. రూపవిలాససంపదచే వంచింపఁబడిన యనియన్వయము.

"అందొకటిచే జనితాధరపీడయై" — ఇట జనితాధరపీడ అను సిద్ధ సమాసములోని "జనిత" అనుపదముతో నొకటిచే ననుభిన్నపద మన్వయించు చున్నది. ఒకదానిచే జనింపఁజేయఁబడిన యధరపీడగలదని యర్థము.

ఈ విధముగాఁ గొన్నిస్థలములం దేకదేశాన్వయము సమ్మతింపఁ బడు నని భావము.

పరిశీలింపఁగా బహువేదఘోషములఁజేసి అనుపదము నిరస్తపదము లోని కన్వయింపక సమాసమువలన లభించిన మొత్తమర్థమునకే హేతువుగా నన్వయింపఁజేయవచ్చును. లేదా నిరస్త సమస్త కిల్బిషోత్కరులగుటకు హేతు వుగా వేదఘోషముల నన్వయింపవచ్చును నిరస్త సమస్త కిల్బిషోత్కరులగు టకు హేతువేదియనగా బహువేదఘోషములు అని సమాధానమని భావము

ఇట్లే వంచితపంచబాణుఁడగుటకు కారణమేదియనగా నఖండితరూప విలాససంపదయని సమాధానమువచ్చును. ఇట్లే జనితాధర పీడయగుటకు "అందొక్కటి" కారణము. జనితాధరపీడగలదయి అనుచోటఁగల అయి అను పదములోనికి అందొక్కటి అనుదానిని హేతువుగా నన్వయింపవచ్చును.

కావున "వారి యస్మదీయోరుచమూసమూహము" అనునదియే నిరాక్షేపమగు నుదాహరణము అగుచున్నది. ఇందు వారియొక్క అను షష్ఠ్యంతమునకు వేఱొకపదములోని కన్వయమున కవకాశమే కానరాదుగదా.

సమాసమధ్యగతములని సూత్రమునఁగలదు. ఇట్లనుటచే సమాసమునఁ జాలపదములుండునపుడు ప్రథమపదము, అంత్యపదముగాక మధ్యభాగమున నున్న పదమని తలంపరాదు. త్రిపదసమాసములు సంస్కృతమున చాల నరుదు. ఉదాహరణములును అట్టివి చూపలేదు. సమాసమునఁ బూర్వపదములగు వంచిత, నిరస్త, జనిత, అనుపదములతోడను ఉత్తరపదమగు చమూసమూహములు అను దానితోడను భిన్నపదముల కన్వయ ముదాహరణములలోఁ జూపఁబడినందున సమాసఘటితములయిన పదములకనియె తాత్పర్యముగాని "మధ్య" పదమునకు సమాసమునందలి మధ్యభాగము అర్థమని భావింపరాదు. ఈ కారణములచే సూత్రమునందు "మధ్య" పదమును సూత్రకారుఁడు గూర్చుట సరికాదు.

**సూ. ఆచ్ఛికసమాసములం దఱచుగ వర్ణలోపాగమాదేశ వికారంబులు నిత్యవైకల్పికములుగాఁ బెక్కులు గానంబడియెడి. ఉ.**

అందాఁక (అంత+దాఁక) ఇట్లు ఇందాఁక, ఎందాఁక. అచ్చతెల్పు (అచ్చము+తెల్పు), ఆఁదోఁక (ఆవు+తోఁక), ఆవల(ఆ+వలను). ఇట్లు ఈవల, ఇబ్బంది (ఇరు+పంది), ఇరుసెవి. (ఇరుగు+చెవి), ఉద్దరి (ఉద్ద+దరి), ఎడవంక (ఎడమ+వంక), ఇట్లు వలవంక, ఎగుదల (ఎగువ+తల) ఇట్లు దిగుదల. ఏటవాలు (ఏటము+వాలు), కప్పురవీడెము (కప్పురము+వీడెము) కవ్వడి (కవ+వడి) కుఱుమాపు (కుఱుచ+మాపు) గందవొడి (గందము+పొడి) గుండ్రకడుపు (గుండ్రము+కడుపు) గొబ్బండు (గొప్ప+పండు) చిత్తరుబొమ్మ (చిత్తరువు+బొమ్మ) చిమ్మనగ్రోవి, (చిమ్మనము+గ్రోవి) చిఱుచప్పుడు (చిఱుత+చప్పుడు) చెంద్రకావి (చెంద్రము+కావి) ఇట్లు చందురకావి, చనుమఱు (చను+మఱుక) చప్పరమంచము (చప్పరము+మంచము) చొక్కసగతులు (చొక్కము+సగతులు) తెగుదారి (తెగువ+దారి) దట్టకెంపు (దట్టము+కెంపు) దొంతర (దొంతి+తరగ) నడురేయి (నడుము+రేయి) నాన్నాళ్ళు (నాలుగు+నాళ్ళు) నాటకసాల (నాటకము + సాల)

నిక్కల (నిక్కము+కల) నిడుమోము (నిడుద+మోము) నెత్తపలక (నెత్తము+పలక) పసిపట్టు (పసిమి+పట్టు) పెందుఱుము (పెనుపు+ తుఱుము) పెత్తనము (పెద్ద+తనము) పొంగట్టు (పొన్ను+గట్టు) బాపురె (బాపు+పురె) బెబ్బులి (పెద్ద+పులి) బెల్లమండెగ (బెల్లము+మండెగ) బొందళము (బొంత+దళము) బోనపుట్టిక (బోనము+పుట్టిక) మిండతపసి (మిండండు+తపసి) ముంగల (ముందు+కలను) ఇట్లు వెనుకల. ముయ్యేడు. (మూఁడు+ఏడు) ఇట్లు ముయ్యాఱు మొ॥ మోసల. (మొగ+సాల) వలిపవెన్నెల (వలిపము+వెన్నెల) వలచెవి (వలను+ చెవి) వాతెఱ (వా+తెఱపి) వాలుఁగమ్మ (వాలు+అమ్మ) వేగుఁజుక్క (వేగు+చుక్క) సగపాలు (సగము+పాలు) సాఁబాలు (సాము+ పాలు) సుంకసరకు (సుంకము+సరకు) ఇత్యాదు లూహ్యంబులు. ఇందు ఆఁడోకేత్యాదులు కొన్నిఁటియందు వర్ణలోపాగమాదేశవికారంబులు నిత్యములనియు అందాఁకేత్యాదులయందు వైకల్పికములనియు నెఱుంగవలయును. వీని కొక్కొక్కటికిఁ బ్రయోగంబులు పెక్కు గలవుగాని గ్రంథవిస్తరభీతిచే నవి యుదాహరింపఁబడవయ్యెను.

సంస్కృత సమేతరములయిన తెలుగుశబ్దములు ఆచ్ఛికంబులనఁబడును. అట్టి శబ్దములతోఁగూడిన సమాసములం దొక్కొకచో వర్ణలోపముఁ గొన్ని చోట్ల వర్ణాగమము గొన్నిచోట్ల వర్ణవికారము అనుకార్యములు కొన్నిచోట్ల నిత్యముగాను గొన్నిచోట్ల వైకల్పికములుగాను కలుగునసభావము.

ఉదా॥ అందాఁక — ఇటు "అంత" లోని తకారములోపించెను. ఈ లోప మాచ్ఛికసమాసమగుటచేతనే కలిగెను. ఇది వైకల్పికము. అంతదాఁక అనియు నుండును. అచ్చము + తెలుపు — ఇటు కర్మధారయమగుటచే విభక్తిలోపము రాఁక పుంపులు రావలసియుండగా నీ సూత్రముచె ముకారలోపమువచ్చి "అచ్చతెలుపు" అయ్యెను. ఇట్లే ఏటవాలు కప్పురపీడెము మున్నగుచోట్ల మువర్ణకలోపమయ్యె నని తెలియనగును.

ఇబ్బంది — ఇటు రులోపము బకారమునకు ద్విత్వాదేశము. (లోపాదేశ ములు రెండును వచ్చెను.) మిండతపసి అనుచోటఁ బూర్వపదము డుమంతంబగు టచేఁ గర్మధారయమునఁ బూర్వపదముగా నుండఁదగదు. (చూ, బాల. సమా.

౨౫ సూ.) ఇందునిపాతన్యాయమున నీ సూత్రముచేతనే సమాసమును విధించుచు డువర్ణకలోపముగూడ విధించెనని యెఱుంగునది.

ముద్యేడు—ఇట హ్రస్వద్విత్వములు నిత్యములని యీవఱకు విధించియే యున్నాడు. అయినను నట్టి వికారము ఆచ్ఛికసమాసమగుట వలననే వచ్చెం గాన నీ సూత్రమున నాదేశాది వికారముల కుదాహరణముగా నీయఁబడెను. ఈ సూత్రముచేతనే యీ పదము సాధ్యమయినను బాలవ్యాకరణమున సమా. ౧౩ సూత్రముచే డులోపద్విత్వాదులు విధించుటంజేసి యా సూత్రమును దిద్దుటకై హ్రస్వద్విత్వములు విధించుకొనవలసివచ్చెనని యూహింపఁదగును.

అంత + దాఁక — తలోపము — అందాఁక, వాలు + అమ్ము — రు ఆగమము వాలు + రు + అమ్ము = వాలురమ్ము మున్నగుచోట్ల నాగమము. బెబ్బులి అనుచోట పెద్దకు "బె" అనియు "పు" అనుదానికి "బ్బు" అనియు నాదేశములు. ఇరుగు + చెవి. ఇట గు లోపము సకారాదేశము అను రెండును వచ్చెను. (ఇట్లు కొన్నిచోట్ల రెండు కార్యములు వచ్చుటయుఁగలదు) దొంతి + తరగ. ఇట రెండుపదములయందును నంత్యవర్ణ లోపము.

ఆఁదోఁ కేత్యాదులం దీ కార్యములు నిత్యములని వ్యాకర్త వివరణమునఁ జెప్పెను. కాని అవుతోక అనియును వ్యవహారమునసున్నది. ప్రయోగములు పరిశీలింపఁదగును.

ఇందుదాహరించిన సమాసములకుఁ బ్రయోగములను గ్రంథవిస్తరభీతిచే నీయలేదుగాని యనేకములు గ్రంథములందు గలవని చెప్పెను.

## అలుక్సమాసము.

**సూ కొన్నియెడల సప్తమీతత్పురుషమునందు నవర్ణకంబునగు. ౩౭**

ఉ. కువలయంబున వారు. భార. ఆది. ౨ ఆ. ౨౨౮. వారణావతమున వారెల్ల. భార. ఆది ౬ ఆ. ౧౮౮. క. ధరణీతలనాథ పురుషునకు నిమ్నల భార్యయు పాచుఁజిత్తమున దుఃఖంబుల్. భార.అర. ౨ఆ. ౭౪. నిజకులంబునవారికెల్ల, హరి. పూ. ౧ఆ. ౯. అనఘ ! యణుహుఁ డే వంశంబున వాఁడు. హరి. పూ. ౨ ఆ. ౧౪౯. మొ. ను శబ్దంబుచేఁ గువలయంబునందలివారు, మొ.

సమాసములలో సామాన్యముగా విభక్తిలోపించును. కొన్నియెడల విభక్తి లోపింపకుండుటయుఁ గలదు. విభక్తి లోపింపకపోయినను సమాసములని చెప్పఁబడువానిని అలుక్సమాసములందురు. ఇట్టివి సంస్కృతమునందును "ఖేచరః

కాలః, వనేచరః' మున్నగునవి గలవు. లుక్, అనగా లోపము. అలుక్సమాస మనగా (విభక్తి) లోపములేని సమాసమని యర్థము.

కొన్ని సప్తమీతత్పురుష సమాసములయందు సప్తమీవిభక్తి ప్రత్యయ మగు నకారమును గానవచ్చుచుండుననియు దానికి సామాసికలోపము రాకుండుననియుఁ దాత్పర్యము. ఈ కార్యము వికల్పముగా నగును. "నవర్ణ కంబును" అగు ననుటచే నవర్ణకము రానిపక్షమున ~~లోపము~~ వచ్చునని యర్థము.

కువలయంబునన్ + వారు (స్థిరముపరమగుటచే ద్రుతలోపము మాత్రము వచ్చును. నవర్ణకము లోపింపదు.) కువలయంబునవారు. కువలయమునందలి వారని యర్థము. ఇట్లే వారణావతంబునన్ + వారు = వారణావతంబునవారు. వారణావతంబునందున్నవారని యర్థము. చిత్తమున దుఃఖమ్ముల్, నిజకులంబున వారికి, అనునవియు నిట్టియూహ్యములు.

ఇవన్నియు సమాసములు కావనియు వ్యస్తపదములేయనియుం దలంప వచ్చును. వీనిని సమాసములని తలంచుటయు విభక్తి లోపించదని చెప్పికొను టయు ననావశ్యకములని తోచుచున్నను బరిశీలింపగా సమాసములనుట యుచితమే. వారు, వాఁడు మున్నగు "అ" శబ్దరూపములు ఇక్కడ తచ్ఛబ్దా ర్థమును జెప్పక కేవలము ఉన్నవారు అనురీతిని కర్త్రర్థమును మాత్రమే బోధించు చున్నవి. ఇట్టి యర్థము వృత్తియందే గాని వాక్యమునం దప్రసిద్ధము. వాఁడు, వారు; ఇత్యాదులు తచ్ఛబ్దార్థమును బోధించునుగాని అట్టివాఁడు, ఉన్నవాఁడు మున్నగుచోట్ల తచ్ఛబ్దార్థమును బోధింపవు. ఆ కారణముచేత నివట సమాస మని యంగీకరింపఁబడెను.

ఇట స్పష్టముగా వారణావతమునందున్నవారు కువలయమునందున్న వారు అనురీతిని నధికరణార్థము భాసించుటచేత ఇంటివాఁడు, ఇంటిది, నావాఁడు మున్నగుచోట్లంబోలె స్వస్వామి భావసంబంధమును మాత్రమే బోధించునను టకు వలనుపడదు. అర్థము భాసించుటనుబట్టి యిది సప్తమ్యర్థ సమాసమేయని నిశ్చయించుట న్యాయ్యము. ఇది సప్తమీ ప్రత్యయమగు నకారమునకుగల లక్షణములన్నియుఁ గలిగియున్నది. ఉదంతశబ్దములకు వచ్చుటయు ఏకత్వము నందే వచ్చుటయు వీనికి సమానములు. కనుక నియ్యది సప్తమీ ప్రత్యయమే యనియు తచ్ఛబ్దము కర్త్రర్థమును మాత్రమే బోధించుటఁజేసి సమాసమే యనియుఁ బ్రౌఢవ్యాకర్త తలంచెను.

ఈ సూత్రముచే గతార్థమగుటంజేసి షష్ఠీతత్పురుషంబులందు నాగాగమంబు విభాషనగు(సమా. ౯సూ.)నను సూత్రము ననావశ్యకమని వెనుకఁజెప్పఁబడెను.

[ఈ సూత్రమున నవర్ణకంబు నగునని నవర్ణకమును విధించుచున్నట్లున్నది– "నవర్ణకలోపంబు రాకుండుటయుం గలదు." అనురీతిని లోపాభావమును విధించుట యుచితము. సమాసమునందు విభక్తికి లోపమువచ్చుచుండగా దానిని నివారించుట ఉచితముగాని లోపించిన నకారమును విధించుట ప్రక్రియా పద్ధతికి విరుద్ధము.]

## లుగలుక్సమాసములు.

సూ. అట్లు పోలెబలెవలె శబ్దంబు లివార్థకంబులు. ఉపమేయము ప్రథమాంతమగునపు డట్లు పరంబగుచో నుపమానంబులగు నామతదస్మద్యుష్మదాత్మార్థములకు షష్ఠియు, పోలెబలెలు పరంబులగుచో నామచ్ఛబ్దార్థములకుఁ బ్రథమయు, నస్మదర్థప్రభృతులకు ద్వితీయయు, వలె పరంబగుచో నామతచ్ఛబ్దార్థములకు షష్ఠియు, నస్మదర్థాదులకు షష్ఠీద్వితీయలయం దెదియే న్నొకటియుఁ గ్రమంబుగ నగు. ఉపమేయము ద్వితీయాద్యంతమగునపుడు, పోలె ప్రభృతులు పరంబులగుచో నుపమానంబుల కుపమేయ విభక్తులయగు. పోలినయెడఁ దచ్ఛబ్దమే తదాదులకు నుపలక్షణముగా గ్రహించునది. అట్లు కరణాద్యర్థాలకు గ్రాహకము. ౬౮

ఉ. క్రమముగఁ జూచునది. ఉపమేయము ప్రథమాంతమగునపుడు:– వానివలెననట్లు. 'ఉ. పాయక పాకశాసనికి భారత ఘోర రణాంతరంబునందు సారథ్యమునట్లు' భార. ఆది. ౧ ఆ. ౨౮. (ఉదాహరణములు కొన్ని కొంతకొంత వ్రాయఁబడునుగాన వానిని సందేహముఁ దీఱ నాయా గ్రంథములం దక్కడక్కడఁ జూచుకొనునది.) బలెనియట్లు 'తే. వసుజ, ¹శిక్షణంబు చేసితి రేని ఇతనియట్లు, చేత్తురు.' భార. ఆది. ౭ ఆ. ౨౦౮. ఇట్లు వలెనట్లు ... 'అభ్యసించితి² యన్నట్లు' భార. శాం. ౨ ఆ. ౧౧౦.

1. శిక్షణము చేసితిరయేని. ప్రా. 2. యట్లు. ప్రా.

'గజమునట్లు' 'ఆ. పుత్రదార బంధుమిత్రసక్తుఁడు రొంపిఁ, బడిన గజమునట్ల యెడవునందు. భార. శాంతి.౬ఆ.౩౧౮.' ఇట్లు, వానియట్లు—నాయట్లు, నీయట్లు, తనయట్లు. 'చంద్రికయుఁ జంద్రుండు వోలె.' కళా.౪ ఆ.౩౬. పేదవోలె అమృతమువోలె. 'క. అని పలికెడు చెలిపలుకులు, తనకమృతమువోలె హృదయతాపము నడఁపన్.' కళా.౬ ఆ.౨౭౪. [1]పరికాఁడువోలె.' భార.ఆది.౪ ఆ.౨౦౬. 'పాముల వాఁడు వోలె;' కాశీ.౨ ఆ.౮౭. 'నన్నుఁబోలె, నిన్నుఁబోలె.' 'శా. కాసీరా యిటువంటి నీతము లనేకంబుల్ నినుంబోలె వి, న్నా నేనున్.' శశాం.౩ ఆ.౬౯. ఇట్లు తన్నుఁబోలె. మొ॥ — రాముఁడుబలె. 'వేల్పుబలె.' కళా.౮ ఆ.౧౮౩. 'తామరపాకు నీరుబలె.' హరి.౩ ఆ. 'గోరుబలె.' కళా.౭ ఆ ౨౬౦. ఇట్లు వాఁడుబలె, నన్నుబలె, నిన్నుబలె, తన్నుబలె, మొ॥ — రామునివలె, వానివలె; నావలె; నన్నువలె, నీవలె నిన్నువలె, తనవలె, తన్నువలె. బహుత్వంబున బకులయట్లు చంద్రులువోలె, రాములుబలె, రాములవలె మొ॥ 'క. పూరు పురూరవులట్లు భ, గీరథ రఘుపతులయట్లు.' భార. ఆర.౨ ఆ.౨౮౫. 'ఎ-గీ. పరిభవంబులఁ, బడితి [2]నిట్టి నిన్నుఁ బాండవుల్ సూచుచు, నుండి, రొరులువోలె నుక్కడక్క—.' భార. ఆర ౧ ఆ.౧౩౬. 'క. మాయ ట్లిడుమలఁ, బడిన నరులుగలరె యొరులు పరమమునీంద్రా!' భార. ఆర.౨ ఆ ౩. 'వ. మమ్ముంబోలె నొడ్ల నాదరాధిక్యంబున భరంపడి సవిశేషంబుగా నధ్యయనంబు సేయింపకుండుట మాకు వరంబు.' భార. శాంతి.౬ ఆ.౨౯౭. ఇత్యాను లెఱుఁగునది. (ఇప్పటికిఁ గగినవి దొరకమింజేసి యిందు గొన్నింటికి బ్రయోగంబులు వ్రాయఁబడవయ్యె) ద్వితీయాద్యంతమగునపుడు — ఉ. 'భీరులఁబోలె నేలవెఱపించెదు మాటలమము?' భార. ఆర.౬ ఆ.౧౮౨. "క. జ్ఞానులచే మానులచే. దానులచే యోగసంవిధానులచేతన్, బూనిన బద్ధుండగునే, శ్రీనాథుఁడు భక్తియుతులచేతం బోలెన్?" భోజ.౧ ఆ.౧౦. "చ. వెనుకఁ గ్రమక్రమంబున నవీనముగా నుదయంబు [3]నొందెఁ జెం, పౌనర నృపాల!

1. పరికాఁడవోలె. పా. 2. నట్టినన్నుఁ. పా. 3. నొంది ఘెంపౌనర. పా

యీాతనికి నుత్తమ మధ్యమ వృద్ధ ధర్మ ద, ర్శనమున ద్రవ్యకర్మ గుణ జాతివిశేష వివేచనంబు బా, లురకునుబోలె మానసములో నిఖిల వ్యవహారహేతువై.'' కళా.౮ ఆ.౧౮౦. ''నీవు నమంబలె నౌర! వీరలన్, వేడుకఁజూతువో.'' కళా.౬ ఆ.౧౩౧. 'దేవరకుంబలె నవ్వ ఘూటికిన్, దొత్తగుచుం బనుల్ సల్పుదున్.' కళా.౪ ఆ ౧౧౮. ఇట్లితరంబు లూహ్యంబులు.

అట్లు, పోలెన్, బలెన్, వలెన్, అనుశబ్దములు 'ఇవ' అను సంస్కృత శబ్దము నర్థమునఁ బ్రయోగింపబడునట్టి తెనుగుశబ్దములు. ఈ శబ్దములు ఉపమాన వాచకములతో చేరియుండును. ఈ శబ్దములు చేరునపుడు ఉపమాన వాచకములకు విభక్తులలో భేదముగలదు అట్టి విశేషణములను ఈ సూత్రమునం జెప్పుచున్నాడు.

(1) అట్లు పోలెన్, బలెన్, వలెన్, అనునవి "ఇవ" అనుపదము నర్థము గల తెనుగుశబ్దములు. ఈ నాల్గు శబ్దములలో "అట్లు" అనుపదము ఉపమాన వాచక శబ్దమునకు పరముగా చేరునపు డుపమేయమునుబట్టి యుపమానమునకు విభక్తులు మాఱుచుండును. ఉపమేయము ప్రథమాంతముగా నున్నచో నుపమానము నామవాచకముగాని తదస్మద్యుష్మదాత్మార్థకములలో నొక్కటిగాని యయ్యేనేని అట్లు అనునది పరముగానున్నపుడు షష్ఠ్యంతమగును. (వాఁడు బకునియట్లు చచ్చెను.)

(2) ఉపమానము నామవాచకముగాని తచ్ఛబ్దార్థకముగాని యయినచో పోలె, బలె, అనుశబ్దములు పరముగానున్నపుడు ప్రథమాంతమగును. (చంద్రుఁడు పోలె.)

(3) ఉపమానములు నా, నీ, తా, శబ్దములగునేని పోలెన్ బలెన్ అనునవి చేరినపుడు ద్వితీయాంతములుగా నుండును. (నన్నుఁబోలెన్, నన్నుబలెన్)

(4) ఉపమానములు నామవాచకములుగాని తచ్ఛబ్దార్థకములుగాని యయినచో వలె శబ్దము పరమగునపుడు షష్ఠ్యంతములగును. (రామునివలెన్)

(5) ఉపమానములు నా, నీ, తా, శబ్దము లయ్యేనేని వలె పరంబగుచో షష్ఠ్యంతములుగా గాని ద్వితీయాంతములుగా గాని యుండును. (నావలెన్, నన్నువలెన్)

ఈ కార్యము లన్నియును నుపమేయము ప్రథమాంతముగా నున్నపుడే యని తెలియవలయును.

(6) ఉపమేయము ప్రథమాంతముకాక ద్వితీయాది విభక్తులు గలదేని ఉపమానములకును నుపమేయవిభక్తులే యగునుగాని మార్పులేదు.

(7) సర్వనామములలో నా, నీ, తా, శబ్దములకు మాత్రమే కొన్ని కార్యములు విధింపఁబడెను. ఈ, ఏ, మున్నగుశబ్దముల కేవిభక్తులువచ్చునో వివరింపఁబడలేదు. అయినను "ఆ" శబ్దమునకువచ్చు విభక్తులే ఈ, ఏ, మున్నగు శబ్దములకును సాధారణముగా వచ్చునని వివరించెను. (పోలికయున్న స్థలమునఁ దచ్ఛబ్దమువలెనే ఏతదాది శబ్దములకును కార్యములు వచ్చునని భావము.)

(8) పైనిచెప్పిన నాలుగు శబ్దములేకాక ఇవార్థమున "కరణి" మున్నగునవి మఱికొన్నిగలవు. అవి పరమగునపుడును "అట్లు" అనునది పరముగా నున్నపుడు వచ్చు విభక్తులే యగునని తెలియవలయును. అట్లు అనునది కరణి మున్నగువానికిని ఉపలక్షణమని తాత్పర్యము

ఉదాహరణములు.

(1) నారాయణునియొక్క అట్లు — విభక్తిలోపము. నారాయణునట్లు. ఇందు ఉపమేయము "నారాయణభట్టు" అని ప్రథమాంతముగా నున్నది. కాన ఉపమేయము షష్ఠ్యంతమయ్యెను ఉపమానోపమేయములను బూర్తిగాఁ దెలిసికొనుటకు కావ్యగ్రంథములను జూచుకొనుమని వివరణమున వ్యాకర్తయే సూచించెను.

బకునియొక్క + అట్లు — విభక్తిలోపము. బకునియట్లు. ఉపమేయము రాక్షసులు. అది ప్రథమాంతముగాన నుపమేయము షష్ఠ్యంతమయ్యెను

నలునియొక్క + అట్లు = నలునట్లు. జలధర సమితియొక్క + అట్లు విభక్తి లోపము. సమితిశబ్దము డుమంతము కాకుండుటచే నిగాగమములేదు. జలధర సమితియట్లు ఇయ్యది ప్రథమాంతమని భ్రమింపరాదు. గజమునట్లు — గజము యొక్క + అట్లు విభక్తిలోపము నుగాగమము (బాల. సం. ౩౪ సూ.) గజమునట్లు. ఇందలి పుత్ర......సక్తుఁడు. అను నుపమేయము ప్రథమాంతముగా నున్నది.

నామవాచకశబ్దములలో డుమంతములను ఇకారాంతములను ఉవర్ణకాంతములను నుదాహరించెను. ఇక ఆ, నా, నీ, తా, శబ్దముల కుదాహరణములం జూపుచున్నాఁడు.

వానియొక్క + అట్లు వానియట్లు నాయొక్క అట్లు = నాయట్లు నీయొక్క + అట్లు నీయట్లు తనయొక్క + అట్లు = తనయట్లు. అంతటను విభక్తి లోపమువచ్చెను.

(2) పోలెకు ఉదాహరణము — చంద్రుఁడువోలె ఇట ఉపమేయము ... . . ప్రథమాంతముగా నున్నది. అందుచే నుపమానమగు "చంద్రుఁడు" అనునది ప్రథమాంతమయ్యెను. ఉత్తరపదమున గసడదవాదేశము (ఇట దుప్రత్యయము లోపింపలేదు) పేదవోలె — ఇదియును ప్రథమాంతమే. కనుకనే పకారము వకారమయ్యెను. అమృతముపోలె. ఇదియును నట్లే. ఇందుపమానము "పలుకులు" ప్రథమాంతముగా నున్నది. పరిత్రాఁచువోలె ఇదియునట్లే. పాముల వాఁడు వోలె — ఇది తచ్ఛబ్దమున కుదాహరణము. ఇదియును ప్రథమాంతముగనే యున్నది (ఇట విభక్తిప్రత్యయము లోపింపలేదు)

రాముఁడుబలె — ఇచట బలె పరముగానుండ నామవాచకమునకుఁ బ్రథమ. ఇట్లే వేల్పు బలె, తామరపాకు నీరు బలె, గోరుబలె వాఁడుబలె అనువోటఁ దచ్ఛబ్దము ప్రథమాంతముగా నున్నది. (అంతటను విభక్తిలోపము లేదు.)

(3) నన్నుబోలె — ఇట పోలె పరముగానుండ నుపమానము అగు "నా" శబ్దమునకు ద్వితీయవచ్చెను. ఇట్లే నిన్నుఁబోలె, తన్నుఁబోలె అనునవియును. నన్నుబలె — ఇట "బలె" పరముగా నుపమానమగు నాశబ్దమునకు ద్వితీయ వచ్చెను. ఇట్లే నిన్నుబలె, తన్నుబలె, అనునవియును.

(4) రామునివలెన్ — ఇట నుపమానమగు నామవాచకమునకు వలె పరమగుటచే షష్ఠివచ్చెను. వానివలెన్ — ఇది తచ్ఛబ్దోదాహరణము (ఇట విభక్తి లోపించెను.)

(5) నాయొక్క + వలెన్ = నావలెన్. ఇట నుపమానమగు నాశబ్దమునకు వలె పరమగుటచే షష్ఠివచ్చెను. పక్షాంతరమున ద్వితీయ వచ్చి నన్ను వలెననియు నుండును. ఇట్లే నీయొక్క + వలెన్ = నీవలెన్. లేదా నిన్నువలెనని యగును. ఇది "నీ" శబ్దోదాహరణము. తనయొక్క + వలెన్ = తనవలెన్ — లేదా తన్నువలెననియు నుండును. ఇట షష్ఠి వచ్చినపుడు విభక్తిలోపించును, ద్వితీయవచ్చెనేని లోపింపదు.

ఈ యుదాహరణములన్నియు నుపమానమేకవచనాంతముగానున్న

స్థలములే. ఉపమానములు బహువచనాంతములుగా నున్నపుడు పైరీతినే విభక్తులు వచ్చును ఉదాహరణములను గొన్నింటిని జూపుచున్నాడు.

(1) ొకులయట్లు (2) చంద్రులువోలె, రాములుబలె (4) రాముల వలెన్. బహువచనములకు పైరీతి నుదాహరణములనిచ్చి యీ క్రిందిరీతిని కవి ప్రయోగములను జూపుచున్నాఁడు.

(1) పూరు పురూరవులయట్లు, భగీరథ రఘుపతులయట్లు (షష్ఠీవిభక్తి వచ్చెను.)

(2) "పరిభవంబుల... ...నుక్కుడక్కి" ఒరులువోలె (ప్రథమాంతము)

(1) "మాయట్లిడుమల.... .మునీంద్రా" మాయొక్క + అట్లు = మాయట్లు (షష్ఠి)

(3) "మమ్ముంబోలె... ...వరంబు." ఇట ద్వితీయ.

బహువచనాంతముల నన్నింటిని జూపుటకుఁ బ్రయోగములు దొరకమిని కొన్నింటికిమాత్ర ముదాహరణము లీయఁబడెనని గ్రంథకర్తయే వ్రాసెను.

(7) ఉపమేయము ద్వితీయాది విభక్తులతో నున్నచో నుపమానము నకును నుపమేయవిభక్తుల యగుననుట కుదాహరణములఁ గొన్నింటిని జూపుచున్నాఁడు.

"భీరులఁబోలె .. ...మమ్ము" — మమ్ము, భీరులఁబోలెన్ అని రెండును (ఉపమేయము, ఉపమానము ) ద్వితీయాంతములే

"జ్ఞానులచే... ...చేతంబోలెన్" — ఇట భక్తియుతులచేతం బోలెన్ — ఉపమానము. జ్ఞానులచే మున్నగునవి యుపమేయములు. రెండును దృతీయాంతములే.

"ఏ మహాత్ములచేత... ...బోలె" — మహాత్ములచేత — ఉపమేయము. అమృతకరునిచేతఁ బోలెన్ — ఉపమానము. రెండును దృతీయాంతములే.

"వెనుక... ...హేతువై" "ఇతనికి" ఉపమేయము. బాలురకును బోలె— ఉపమానము. "నీవు ననుంబలె... ...జూతువో" వీరలన్ — ఉపమేయము, నునుంబలె — ఉపమానము. రెండును ద్వితీయాంతములు.

"దేవరకుంబలె.,. ...సలుపుదున్" వధూటికి — ఉపమేయము. దేవరకుంబలెన్ — ఉపమానము. రెండును షష్ఠ్యంతములు. ఈవిధముగా నుపమేయమును బట్టియే విభక్తులుండును.

తెనుగున లుక్సమాసము అలుక్సమాసముమాత్రము గాక" లుగలుక్సమాసములని యింకొకతెగ సమాసములున్నట్లు ఈ వ్యాకర్త తలంచి యీసూత్రమున విహితములగునవి లుగలుక్సమాసములని సూచించియున్నాఁడు. కొన్నియెడల విభక్తిప్రత్యయము లోపించుటయుఁ గొన్నియెడల లోపమురాకుండుటయుఁ గల సమాసములగుటచే వీని నీతఁడిట్లు వ్యవహరించెను

పరిశీలింపగా నీ యివార్థకములతోఁగూడిన పదములను సమాసములని తలంపనక్కఱలేదు. భిన్నపదములనియే తలంపపచ్చును. ప్రథమా ద్వితీయాది విభక్తులన్నియును లోపింపక నిలిచియేయున్నవి. షష్ఠీవిభక్తి అనగా యొక్క అనునదిమాత్రము లోపించుచున్నది. ఇది వాక్యమునసైనను లోపించును. (చూ. కార. ౧౬ సూ) సంస్కృతమునందువలె నిందు స్వరాదిభేద ప్రయోజనమునులేదు. అనంతర సూత్రోదాహరణములందు "తిండికాడునుబోలె" మున్నగువానినిబట్టియు నివి సమాసములు కావని తెలియఁబడుచున్నది. సమాసమే యయినచో తిండికాఁడును బోలె అని ద్రుతమునకు స్వత్వమెట్లు వచ్చును? (చూ. బాల. సం. ౨౬ సూ.) సమాసమే యన్నచో నీ "ను" శబ్దమునకు సమాసమున స్థితియెట్లు కుదురును? విధానమయినం జేయలేదు గదా! కావున నియ్యవి సమాసములు కావనియు భిన్నపదములేయనియుఁ దలంపవలయును. అనంతరసూత్రముచేతనే సమాసమధ్యమునను శబ్దమును విధించెనని భావింపవలయును. కాని నిరర్థకముగా వీనిని సమాసములనుట యుచితముగాదు. కావున వీనిని సమాసములని భావింపక విభక్తిప్రత్యయ విధానమునకై యీ సూత్రమును గారక ప్రకరణమునఁ జేర్చుట యుచితము. అట్లయిన నూతనపద్ధతి నవలంబించి లుగలుక్సమాసములనుటయు నక్కఱలేదు.

**సూ. ప్రథమాంతములమీఁది పోలె బలె పోని శబ్దంబులు ద్రుతపూర్వకంబులు విభాష నగు.** ౩౯

ఉ॥ సమిద్ధ హవ్యవహుఁడుం బోలెన్. హరి. ఉ.౧౦. ఆ. తిండికాఁడునుబోలె. భార. స్త్రీ.౧ ఆ ౧౯. నిధిఁగన్న పేదయుఁబోలె. భార. ఆది.౮ ఆ.౧౬౭. అగ్నియుఁబోలె. భార. ఆది.౨ ఆ ౬౦. తగరునుబోలె. నిర్వ.౮ ఆ.౩౩. బూడిదపండునుబోలె. పాండు.౩ ఆ.౧౮. అమృతధారాపాతంబునుబోలె భార. అర ౨ ఆ.౩౩. తే. అనిన విని

యేమిచెప్పఁగ నచటనున్నవారలెల్లఁ జిత్తరువున వ్రాసినట్టి ప్రతిమలునుబోలె నతినిశ్చలత నొకింత తడవు గనుపట్టి రత్యద్భుతంబునొంది. కళా.౫ ఆ.౫. పవడంపుఁ జుట్టలుగు జందమునుంబలె. య.౫ ఆ.౩౦. ఉ మత్తత విప్రయోగి జనమర్దనుఁడైన ప్రసూనధన్వికిం గత్తులొసంగినట్టి జనఘాతుక ! మాధవ నామధేయ మత్యుత్తమ మేగతిం గలిగెనొకొద నీకు సుధాఖ్యగారకున్ హత్తినలీల రక్కసులకంచిత పుణ్యజనాఖ్యయుం బలెన్. శశాం.౪ ఆ.౯౧. భూషణవిశేషములుం బలె. కళా.౩ ఆ.౮. ఇత్యాదు లెఱుంగునది.

సాదృశ్యార్థకములయిన పోలె, బలె, శబ్దములును పోలిన అను నర్థమును (సదృశార్థమును) ఇచ్చు పోని అను విశేషణశబ్దమును ప్రథమాంతములకు పరముగానున్నచో వికల్పముగా ద్రుతము పూర్వభాగమునఁ గలవి యగుచుండును. అనగా నీ శబ్దములు పరముగానున్నపుడు ప్రథమాంతములగు పూర్వపదముల యంతమున ద్రుతము చేరునని భావము.

"సమిద్ధ......బోలెన్" ఇట పోలెన్ అనుదానికిఁ బూర్వమున ద్రుతము చేరుటచే పకారము సరళముగా మాఱెను. ద్రుతము బిందురూపమును బొందెను. (చూ. బాల. సంధి ౧౭ సూ.)

"తిండికాడునుబోలె" ఇట ద్రుతము స్వత్వరూపమున నున్నది. "నిధిఁ గన్న......బోలె" పేద అను ప్రథమాంతముపై నుండుటచే "పోలె" ద్రుతపూర్వకమయ్యెను. ఇట్లే మిగిలినవియుఁ జూచుకొనునది.

"పవడంపు......బలె" ఇటఁబలె అనునది ద్రుతపూర్వకమయ్యెను. ఇట్లే పుణ్యజనాఖ్యయుంబలెన్, భూషణవిశేషములుం బలెన్ అనునవియు.

పోని అనుదాని కుదాహరణములం జూపలేదు. ౪౩ సూత్రోదాహరణములం జూచునది.

ఈ సూత్రమున "ద్రుతపూర్వకము" లనక ను శబ్దపూర్వకములనుట యుచితము. ఇచట నుశబ్దమని వ్యవహరించనందున కళలగుననుదంత శబ్దముల మీఁద నీ ద్రుతము యువర్ణపూర్వకమగుట కవకాశము లేదు. కాని యిట నుదాహరణములందు ద్రుతములు యువర్ణపూర్వకములై కానవచ్చుచున్నవి ఈ యువర్ణమెట్లు వచ్చునని వ్యాకర్త భావించెనో తెలియదు ఈ ద్రుతము

సమాసమున స్వత్వమునెట్లు జెందెనో విచార్యము. సమాసములందు ద్రుతము నకు స్వత్వము రాదుగదా! స్వత్వమును విధించుటయు లేదు కావున ద్రుత పూర్వకములనుటకుబదులు 'నుశబ్దపూర్వకంబులు" అని సూత్రించి యుండ వలసినది

ఇవి సమాసములని తలంచుటంజేసి నుశబ్దము సమాసమధ్యమున నుండు టకు వీలుకాక ద్రుతపూర్వకత్వమును విధించెను కాని ద్రుతము అని విధించి నను యుపన్నపూర్వకత్వము "ను" శబ్దధర్మమే యిట కలుగుచున్నది

ఇవి సమాసములని యీ వ్యాకర్త భావించెనేని యీ సూత్రమే యనా వశ్యకము. శబ్ద. ౧౧౬ సూ॥ చెలినే యిట నుశబ్దము వచ్చునని యెను. (ఇవి) సమాసములని తలంచి సమాస మధ్యభాగమున రాతగినది నుశబ్దముండుట వలనుపడనందున నీ ద్రుతవిధానము చేయవలసివచ్చెను.

ఈ కార్యములు "న" దిగ్గకములగు "పోలె బోటి వలెను" మొదలుగు లగునపుడును వచ్చునని తెలిసికొనవలయును

సూ. కొన్నియెడల నుపమానంబులు పెక్కులగుచో సప్తి కపదాని కొక్కటిగ జూపఁబడి. ౪౦

ఉ॥ ఎ.కీ. కమలషండంబు నాగలోకంబు దలిరుఁ బాన్పు కల్పాంతమున జముబానసంబు నింటిలోపలఁబోలె. నిర్వ.ర ౮౬౧. "వీంద్రుడును వాంద్రుడును బలె" ప్రభా ౧ ౮౭. మొ॥

అనేకోపమానము లున్నపుడు అన్ని యుపమానములకును అంతమున ఈ యుపమావాచకశబ్దములు ప్రత్యేకముగా నొక్కొక్కటి యుండక చివరి యుపమానమునకు మాత్రమే చేరునని యర్థము.

"కమలషండంబు......లోపలఁబోలె" ఇందు కమలషండము, నాగ లోకము, తలిరుఁబాన్పు, జముబానసంబునిల్లు అను నాల్గును నుపమానములు. వీనిలో చివరి యుపమానమగు బానసంబు నింటిలోపల అనుదానికి మాత్రమే "పోలె" చేరెను.

"వీంద్రుడును వాంద్రుడును బలె" ఇట బలె అనునది వాంద్రు అను చివరి యుపమానమునకే చేరెను. వాంద్రుడును అనుదానిపై చేరలేదు.

ఇదియును సమాసఘటితముకాక వేఱుగానున్న పదమేయనుకొనినచో సముచ్చయ బలమునుచేత నన్నిపదములకును నన్వయించును. వాంద్రుడును

వీంద్రుడును వచ్చిరి. అనుచోటి క్రియాపద ముభయశబ్దములతోడ నన్వయించుచున్నదిగదా ! సమాసమని యభూత నిరర్థక కల్పనము చేయుటచే నిట్టి విధాన మావశ్యకమయ్యెను.

సూ. పోలె ప్రభృతులు తఱచుగఁ బ్రథమాది విభక్త్యంత నామంబులకంటెను, తాదర్థ్యార్థక క్రియలకంటెను పరంబులయి యుత్ప్రేక్షాద్యోతకంబులగు ౪౧

ఉ.ఎ.గీ. గచ్చుచమరిన దారుచక్రంపుబిళ్ళవోలె. స్వా.౫ఆ.౮౦. (ప్రకారాంతరము బిళ్ళయోయన. ఇట్లంతట నెఱుంగునది.) వ. శోక తప్తంబయిన తనహృదయంబు తడుపుచున్నదియుంబోలె. భార. అర. ౨ఆ. ౨౦౮. ధవుఁ గూర్మిఁ గొసరుచున్నదివోలె. స్వా.౫. ఆ.౮౦.ప. దినదినమునకుఁ గృశించెను గనుకనియునుద్రపయు నిరవకాశతఁ బోలెన్. కళా.౭ ఆ.౧౫౮. సీ. తనుఁబాసి శశి దవ్వుచనిన నెవ్వగఁ బోలె దొలిదిక్కు జవరాలు వెలుకఁబాఱె. స్వా ౫ ఆ.౮౦ ప. గార యిచ్చుటకును బోలె. స్వా.౬ ఆ.౧౦౭. తే. కలయ జగమునఁగలయట్టి నలుపులెల్లఁ దెలుపులుగఁజేసి నీడలు తెలుపుసేయఁగా వశముగామిఁ బాడము దుఃఖమునఁబోలె సాంద్రచంద్రిక తుహినబాష్పములుగురిసె. స్వా.౭ ఆ.౨౭. పయటకొంగది మాన్పఁగఁబోలెఁ గాళ్ళపైఁ బ్రబ్బికొనన్. కళా.౮ ఆ. ౧౮౦. సాహసప్పుటగ్గలికంబలె. చంద్ర. ఇట్లితరంబు లెఱుంగునది.

తాదర్థ్యార్థక క్రియలు = తదర్థకము అనఁగా దానికొఱకు అనునర్థము నిచ్చు క్రియాపదములు. మాన్పఁగన్ (మాన్పుటకు) అనుదానివంటి నుజీ ప్రత్యయాంతక్రియలు.

పోలెన్ మున్నగు శబ్దములు సాదృశ్యార్థకములని యీవఱకుఁ జెప్పఁబడెను. అంతియకాక కొన్ని స్థలములం దయ్యవి యుత్ప్రేక్షార్థమును గలిగించునని చెప్పుచున్నాఁడు.

పోలె మున్నగుశబ్దములు ప్రథమాదివిభక్తు లంతమునఁగల నామములకున్ను అన్నగా సుబంతములకును నుజీ ప్రత్యయాంత క్రియలకును పరముగా

నున్నయపుడు ఉత్ప్రేక్షాద్యోతకములగుచుండును. అనగా నివి సాదృశ్యమునే కాక సంభావనను (ఊహను.) గూడ బోధించునని భావము. సంస్కృతమునను ఇవాదు లీ రెండువిధముల యర్థమును బోధించును.

"దారుచక్రంపు బిళ్ళవోలె" ఇది దారుచక్రపు బిళ్ళయో యని యూహింపఁదగియున్నది అని యర్థము. ఇటఁ బ్రథమాంతమగు బిళ్ళ అను పదముపై "పోలె" అనునదిచేరి యుత్ప్రేక్షార్థమును సూచించుచున్నది. ఇట్లే తపుసు చున్నది, కొసరుచున్నవి, అనునవియుఁ బ్రథమాంతములు. నిరవకాశతన్, నెవ్వగన్, అనునవి (తృతీయాస్థానమున వచ్చిన) ద్వితీయాంతములు. (చూ. బాల. కార. ౨౨ సూ) ఇచ్చుటకును, ఇది చతుర్థ్యర్థక షష్ఠ్యంతము. దుఃఖమునన్ — ఇది తృతీయాస్థానిక సప్తమ్యంతము. మాన్పగన్ — ఇది నుటి ప్రత్యయాంతమగు అగు ధాతురూపము ఇది మాన్పన్ అను వేఱొక నుటి ప్రత్యయాంతముతోఁ గూడియున్నది. మాన్పగన్ అనగా మాన్పుటకొఱకని యర్థము. ఇదితాదర్థ్యార్థక క్రియ. అగ్గలికన్ — ఇది తృతీయాస్థానిక ద్వితీయాంతము. వీనిపై బలెన్ అనునదిచేరి యుత్ప్రేక్షాద్యోతకమగుచున్నది.

సూ. మఱియవి కొన్నియెడల నామ్ములఁబుల ప్రథమాది విభక్తులు కొన్నింటికిఁ బరంబులై తథార్థంబులయ్యెడి. ౪౨

ఉ. ఇపుడువోలె. కళా. ౭ ఆ.౨౧. మున్నువోలె. కళా. ౨ ఆ. ఎప్పుడు బలె. కళా. ౭ ఆ.౨౦౫. ఆ. మథనసమయ ఘూర్ణమానాబ్ధిఁబోలెఁ బెనోర్మితలదర. కళా.౨ ఆ.౪. వ. శరధి తరఁగలమీఁద నుంబోలె. స్వా.౩ ఆ.౨౮. ఇత్యాదు లూహ్యంబులు.

అవి = పోలె ప్రభృతులు. తథార్థకములు = తథా అను నవ్యయము నర్థముగలవి. పోలె మున్నగుశబ్దములు ఇవార్థమును ఉత్ప్రేక్షార్థమును కలిగి యున్నవని వెనుక చెప్పఁబడెను. అంతియకాక ప్రకారార్థముకూడ కలిగి యున్నవని చెప్పుచున్నాఁడు. ఆపోలె ప్రభృతిశబ్దములు నామవాచకములకుఁ గొన్నివిభక్తులు చేరియున్నపుడు పరముగానున్నవై "తథా" అను సంస్కృత శబ్దము నర్థమునిచ్చును.

ఇపుడువోలె = ఇప్పటియట్లు. ఇప్పటితీరున ననియర్థము. ఇట్లే మున్నువోలె = మునుపటియట్లు, ఎప్పటిబలె = ఎప్పటియట్లు మున్నగుతీరున నూహించునది.

సూ. అట్టి పోలె బోటి వంటి శబ్దంబులు వదర్థకంబులు. బోఁటి తనంతఁ బ్రత్యయార్థంబునగు. అట్టి ప్రభృతులు పరంబు లగుచో నట్టు ప్రభృతిపరకనామాదులకుంబలెఁ బూర్వపదంబులకు విభక్తులు త్రివిధంబులం బరఁగు. అను బోటివంటులు సమానంబులు. అవి పరంబులగుచో నాత్మార్థమునకు నామ తచ్ఛబ్దములకుంబోలెఁ గార్యంబు. పోలి పరంబగుచో డువర్ణకంబుమీఁద ద్రుతంబు నిత్యంబు.

ఉ. రామునియట్టి, వానియట్టి, నాయట్టి, నీయట్టి, తనయట్టి, నీయట్టి పుణ్యాత్మకుల్ గలరె? భాగ. ౧౦ స్కం పూ. ౧౭౩౬. ప. రెండవ మన్మథుండునుం బోనివాని. భార. ఆర. ౨ ఆ. 33. సురకన్యవోని, సురకన్యయుఁబోని, అవని నాథుఁడు గనియెను సురకన్యవోని కన్నియ భార. ఆది ౪ ఆ.౧౬౯. దేవివోని, దేవియుఁబోని. ఎ. గీ. వరుణేంద్రు దేవియుఁ బోనిదాని దేవయానిఁ గనియె. భార. ఆది 3 ఆ.౧౪౦. నికుంజంబుఁబోని, నికుంజంబునుబోని కనకశైల నికుంజంబును బోని. భార. ఆది ౬ ఆ.300. పిడుగులువోని. పిడుగులుంబోని. ఘోరపుం బిడుగులు వోని తూపులు. కళా.౮ ఆ.౫౯. నన్నుఁబోని, నిన్నుఁబోని, తన్నుఁబోని, మొ. రామునిబోఁటి, వాని బోఁటి, తనబోఁటి, నాబోఁటి, నన్నుబోఁటి, నీబోఁటి, నిన్నుబోఁటి మొ. క. వీఁడెల్లబోఁటి బాలుఁడు,గాఁడు. హరి. పూ.౫ ఆ.౧౪౯. ఇట్టి నాబోఁటి భీతుని నీకుఁ దోడనఁ బోలునే? రామా. అర.౨ ఆ.౮. నినుబోంట్లను నమ్మక యేమును బ్రతికెద. భార. శాంతి.3 ఆ.౨౪౧. ఇట్లు మాబోంట్లు, మముబోంట్లు, మీబోఁట్లు, మిముబోఁట్లు, మొ. ఉ. బోటుదనాలు చన్నె మిముబోంట్లకుఁ దక్కినవారికిం బలెన్. కళా. ౭ .౨౨౧ రామునివంటి, వానివంటి, తనవంటి, నావంటి, ననువంటి, నీవంటి, నినువంటి, మొ. దేవా! దేవరవంటి నీదు కరుణాదృష్టిన్. వి. పు.౭ ఆ.౩౮౨. శార్ఙ్చిచ్చువంటి శాపంబు. భార.ఆది.౨ ఆ.౧౪౧.

పెనునిట్ట తాటివంటి గుదియ. జై. ౨ ఆ. ౪౧ నీవంటి ఘనుఁడు. వి.పు.౨ ఆ.౩౦౫. నినువంటి నీతిపరులున్. శశా.3 ఆ.౬౯ నిన్ను వంటి పుణ్యానిరతుండు. వి. పు.౪. ఆ.౩౩౭. ఇట్లు మా వంటి, మమువంటి, మీ వంటి, మిమువంటి. యిత్యాదులు గ్రామ్యాంబులు. క. నావుడు ముని యిట్లను వత్సా! విను మా వంటి తైర్థికావలి కెల్లన్, మీ వంటి గృహస్థుల సుఖజీవనమునఁగాదె తీర్థసేవయుఁ దలపన్. స్కా.౧ ఆ ౬౫ ఎ. గీ. నాకు మిమ్ము వంటి లోకోత్తరుల కియ్యఁగలిగె నింతకంటె ఘనతగలదె? విష్ణు. పు.౭ ఆ.౩౬౮. ఇతరంబులు ప్రయోగంబుల నెఱుంగునది.

వదర్థకములు = సంస్కృతమున వత్ అను రూపమునసుండెడి ప్రత్యయము నర్థముగలవి. (రామవత్ = రామునివంటి)

అట్టి, పోని, బోటి, వంటి, అనుశబ్దములు వతిప్రత్యయము నర్థముగలవి. ఇయ్యవి విశేష్యములతోడనే యన్వయించును గావున క్రియాజన్య విశేషణములవలెనే (వచ్చిన, వచ్చు, మున్నగునవి) స్వయముగా విభక్తిప్రత్యయములతోఁ గూడియుండవు. కాని వీనిలో బోటి అనునది మాత్రము స్వయముగనే విభక్తిప్రత్యయములను బొందును.

"అట్టి" మున్నగు వదర్థకంబులు పరంబులగునపుడు అట్లు మున్నగునవి పరములగునపుడు వచ్చునట్లే పూర్వపదములకు విభక్తులు మూఁడువిధములుగా నుండును. అనగా (1) అట్లు పరమగునపుడు వచ్చెడి షష్ఠియు (2) పోలె బలెలు పరంబులగునపుడు వచ్చెడి ప్రథమా ద్వితీయలును (3) వలె పరంబగునపుడు వచ్చెడి షష్ఠీ ద్వితీయలును అను ముప్విధములగు విభక్తులుఁను వచ్చునని భావము.

ఈ నాల్గింటిలో బోఁటి వంటి అను రెండు శబ్దములకును కార్యములు సమానముగానుండును. "అట్లు" మున్నగు నాల్గింటిలో పోలె ... అనునవి సమానకార్యములఁ బొందును. ఇటు నట్లే బోటి వంటులు సమాసములు అని భావము.

ఈ బోటి వంటులు పరంబులగునపుడు ఆత్మార్థమునకు (ఆ.) నామతచ్ఛబ్దంబులకు వచ్చునట్లు విభక్తులు వచ్చునని భావము. ఆత్మార్థక శబ్దము

నకు అట్లు ప్రభృతులు పరంబులగునపుడు అస్మద్యుష్మచ్ఛబ్దములవంటి విభక్తులు వచ్చుచున్నవి. బోటి వంటులు పరంబులగునపుడు మాత్రము అట్లుకాక నామ తచ్ఛబ్దంబులకు వచ్చునట్లు విభక్తులు వచ్చును పోని పరంబగునపుడు పూర్వ పదము డువర్ణకాంతమయినచో దానిమీఁద ద్రుతము నిత్యముగా వచ్చును. ౩౯. సూత్రము వికల్పమనుచుండగా నిత్యముగా వచ్చుట కిట్లుచెప్పెను.

కొన్ని యివార్థకములు పరములగునపుడు ద్రుతమును ౩౯. సూత్ర ముచే విధించెను. అట్లే వదర్థకములకును ద్రుతపూర్వకత్వము వచ్చును పోని పరమగునపుడు మాత్రము పూర్వముననున్న డువర్ణకమునకు ద్రుతము నిత్య ముగా చేరును.

"అట్టి" కి ఉదాహరణములు — ఇట షష్ఠివచ్చును (అట్లు పరమగు నప్పుడువోలె)రామునియొక్క + అట్టి = రామునియట్టి మున్నగునవి. క్రమముగా అ, నా, నీ, తా, శబ్దములకు నుదాహరణములు చూపఁబడెను.

"రెండవ మన్మథుండునుం బోనివాని" ఇది పోని కుదాహరణము. ఇటఁ బ్రథమగాని ద్వితీయగాని వచ్చును.

"మన్మథుండునుం బోని" ఇట ప్రథమ ద్రుతముకూడ చేరెను.

సురకన్యవోని, సురకన్యయుఁబోని, ఇట ద్రుతపూర్వకత్వము వికల్ప ముగా నయ్యెను. (పూర్వపదము డుమంతము కాకపోవుటంజేసి ద్రుతము వైకల్పికము.) ఇట్లే దేవివోని, దేవియువోని, నికుంజంబుబోని, నికుంజంబును బోని, పిడుగులువోని, పిడుగులుఁబోని, అనునవియు నూహ్యంబులు.

నన్నుఁబోని, నిన్నుఁబోని, తన్నుఁబోని, నీ, నా, తా, శబ్దములకు పోని పరంబగునపుడు ద్వితీయవచ్చెను (నన్నుఁబోలె అనురీతిని)

రామునిబోఁటి, వానిబోఁటి, తనవోఁటి. ఈ మూఁడుస్థలములందును బోఁటి పరంబగుటచే షష్ఠివచ్చెను. (అత్మార్థమునకు నామతచ్ఛబ్దములకుం బోలె కార్యమువచ్చెను)

నాబోఁటి, నన్నుబోఁటి, నీబోఁటి, నిన్నుబోఁటి, ఇట షష్ఠీ ద్వితీయ లలో నొక్కటివచ్చెను. (నావలె, నన్నువలె అనురీతిని)

"వీఁడెల్ల బోఁటిబాలుఁడు గాఁడు" "ఇట్టి నాబోఁటి భీతుని..." ఇవి రెండును బోఁటికి కవిప్రయోగములు.

"నినుబోంట్లను ... ... బ్రతికెద" ఇందు బోఁటికి విభక్తిప్రత్యయము చేరుటయుఁ గలదనుట కియ్యది యుదాహరణము. (ఇట "బోఁటి"కి ద్వితీయా బహువచనప్రత్యయము చేరెను)

మాబోంట్లు — మనుబోంట్లు — మీబోంట్లు — మిముబోంట్లు. ఇవి షష్ఠీ ద్వితీయలు వచ్చుట కుదాహరణములు. (నావలె, నన్నువలె అనురీతిని) "బోటు దనాలు చన్నె మిముబోంట్లకు దక్కినవారికిన్ బలెన్" ఇ దుకు ప్రయోగము.

రామునివంటి, వానివంటి, తనవంటి, ఇయ్యవి షష్ఠికి ఉదాహరణములు. నావంటి, ననువంటి, నీవంటి, నినువంటి, ఇట షష్ఠీ ద్వితీయలు వచ్చెను. "దేవా! దేవరవంటి ..." ఇట "వంటి"కి ప్రయోగమును జూపెను. ఇట్లే కార్చిచ్చు వంటి, కాటివంటి, నీవంటి, నినువంటి, నిన్నువంటి, అనునవియు గ్రాహ్యములు. వంటి పరమగునపుడు బహువచనాంతములగుట కుదాహరణములు "మావంటి" మున్నగునవి.

"నావుడు ... మావంటి ... మీవంటి ... దలపన్"ఇది మావంటి, మీవంటి, అనువానికి కవిప్రయోగము. "నాకు మిమ్మువంటి లోకోత్తరుల ... ... గలదె" ఇది మిమ్మువంటి అనుదానికిఁ గవిప్రయోగము.

సూత్రమున "నాత్మార్థమునకు నామతచ్ఛబ్దంబులకుఁబోలె" అనుచోట నామతచ్ఛబ్దములలో నొక్కటి యుపమానముగఁ జెప్పినంజాలును. రెండవది వ్యర్థము.

ఇవి సమాసములు కావనియనుటయె యుచితమని యీవఱకుఁ జెప్పఁబడెను. అప్పు డీ సూత్రమును గారకప్రకరణమునఁ జేర్పవలయును. వీనిలోఁ బ్రథమా ద్వితీయా విభక్తులు లోపముం జెందవు. యొక్కకు లోపంబు బహుళం బనుటచే ననమాసముననైనను యొక్కషష్ఠికి లోపమువచ్చును. కావున వీనిని సమాసములని తలంపనక్కఱలేదని వెనుక చెప్పఁబడెను.

ఇది సమాస పరిచ్ఛేదము.

# తద్ధిత పరిచ్ఛేదము

సంస్కృతమున (పాణినీయమున) సుబంతములపైఁ జేరెడి కొన్ని భావార్థకాది ప్రత్యయములకు తద్ధితములని సంజ్ఞ చేయఁబడెను. వాని సాదృశ్యమున నిందును సుబంతములపైని జేఱెడి "తన" మున్నగు ప్రత్యయములను తద్ధితములని వ్యవహరించుచు నట్టి ప్రత్యయములను జెప్పెడి యీ ప్రకరణమునకు "తద్ధిత పరిచ్ఛేదము" అని సంజ్ఞచేసెను.

వివ॥ తద్ధితములనగా విశేష్య విశేషణములగు శబ్దములమీఁద భావాద్యర్థములయందు రాఁదగిన ప్రత్యయ విశేషములని యర్థము.

రామునియొక్క మున్నగు విశేష్యములమీఁదను ఆకొన్నవానియొక్క మున్నగు విశేషణములమీఁదను భావాద్యర్థమునఁ "దన" మున్నగు ప్రత్యయములు వచ్చుననియు వానిని తద్ధితములని వ్యవహరింతురనియు భావము.

**సూ. తద్ధితప్రత్యయములు పరంబులగునపుడు పదంబుల డువర్ణకాదులకు లోపంబగు.** ౧

బాలవ్యాకరణమునఁ దద్ధితప్రత్యయములు పరముగానున్నపుఁడు సుప్ప్రత్యయములకు లోపము విధింపలేదు. "సమాస విభక్తికి లోపంబగు" ను సూత్రమునందలి సమాసపదము వృత్తిసామాన్యమునకు ఉపలక్షకమని భావించి తద్ధితప్రత్యయము పరమగునపుడును విభక్తిప్రత్యయలోపము చేయవలసి వచ్చుచున్నది. అట్టి క్లేశమును బోగొట్టుటకై యీ సూత్రముచే విభక్తిలోపమును ప్రౌఢవ్యాకర్త విధించెను.

**సూ. తనవర్ణకంబు పరంబగునపుఁడు తచ్ఛబ్దార్థమునకు లోపంబు విభాషనగు.** ౨

ఉ॥ ఆఁకొన్నతనము. ఓర్వలేనితనము. మొ॥ పక్షమున ఆఁకొన్నవాని తనము. ఆఁకొన్నదాని తనము. ఓర్వలేనివాని తనము. ఓర్వలేనిదాని తనము. పెల్లాఁకొన్నతనాన. భీమ. ౨ ఆ.

"తనవర్ణకంబు త్వార్థంబునందగు" (బాల. తద్ధి ౧ సూ.) నను సూత్రముచే భావార్థమునఁ దనవర్ణకము వచ్చును. అట్టి తనవర్ణకము పరమగునపుఁడు

అనుప్రయుక్తమగు తచ్ఛబ్దార్థమునకు అనగా "ఆ" శబ్దమునకు లోపమువచ్చు నని భావము.

ఆఁకొన్నవానియొక్క + తన + ము. ఇటు ఆఁకొన్న అను ధాతుజ విశేషణమునకు. బాల. సమా. 5 సూత్రముచే తచ్ఛబ్దార్థ మనుప్రయుక్తమయ్యెను. అట్టి శబ్దమున కీ సూత్రముచే లోపమురాఁగా "ఆఁకొన్నతనము" అయ్యెను. లోపము వైకల్పికము కావున నయ్యది రానిపక్షమున "ఆఁకొన్నవానితనము" అని యగును. ఇట్లే మిగిలినవి యు నూహ్యములు. "పెల్లాఁకొన్నతనాన" అను నది ప్రయోగ ప్రదర్శనము.

ధాతుజవిశేషణములకే కాక యితరవిశేషణ శబ్దములకును దెనుఁగున విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దమనుప్రయుక్తమగుచుండును ఉదా. గొప్పవాడు, గొప్పది, ఇట్టిచోట్లను అనుప్రయుక్త తచ్ఛబ్దమునకు లోపమువచ్చును. గొప్పవానియొక్క + తనము = గొప్పతనము.

ఈ సూత్రమునఁ దనవర్ణకము పరమగునప్పుడు మాత్రమే తచ్ఛబ్దలోపము విధించినను తికాదులగు కొన్ని యితర తద్ధితములు పరమగునప్పుడును నీలోపము వచ్చుచున్నది. అందుచే నిచ్చటి తనవర్ణకము తికాదులకును ఉపలక్షకమని భావింపవలయును. చిన్నవానియొక్క + తికము = చిన్నతికము. ఇట్టిచోటు చిన్న, గొప్ప మున్నగువానికి తచ్ఛబ్దమనుప్రయుక్తముకాకయే విభక్తి వచ్చునని భావింపరాదు. చిన్నయొక్క, గొప్పయొక్క మున్నగు విభక్త్యంతము లప్రసిద్ధములు. ఇట్టి శబ్దములు ధర్మవాచకము లగునపుడు ఒక్కొకయెడ తచ్ఛబ్దానుప్రయోగము లేకుండినను ధర్మివాచకములుగా నున్నపుడుమాత్రము సాధారణముగా తచ్ఛబ్ద మనుప్రయుక్తమగుచునే యుండును.

సూ. మతుబర్థంబునం దరవర్ణకము పరంబగునప్పుడు పూజ సొన్నముల కడయచ్చునకు వైకల్పికముగాను నిత్యముగాను దీర్ఘం బగు. 3

ఉ॥ పూజారి, పూజరి, సొన్నారి.

బాల. తద్ధి 17 సూ. మతుబర్థంబునం దరివర్ణకమును విధించెను. అయరివర్ణకము పరమగునపుడు పూజయను శబ్దమునందలి కడయచ్చున కనగా అకారమునకు వికల్పముగను "సొన్న" అను శబ్దమునందలి కడయచ్చునకు నిత్యముగను దీర్ఘమువచ్చును.

పూజ + అరి. ఇట దీర్ఘము వైకల్పికము కావున పూజారి, పూజరి. అగి యగును. ఇట్లే సొన్నము + అరి. పూర్వసూత్రముచే ముపర్ణకలోపము. ఈ సూత్రముచే నిత్యదీర్ఘము. పొన్నారి. సువర్ణ ముగలవాఁడని యర్థము.

ఇట దీర్ఘమురాగా పూజా + అరి అని యున్నపుడు సంధి రావలసి యున్నది. సంధి యనఁగా పరరూపము కావున మఱల పూజరి అనియె కావలసి యున్నది. సంధి రాదన్నచో యడాగమము వచ్చి "పూజయరి" అను ననిష్ట రూపము కావలసివచ్చును. కావున నిట పూర్వపదమునకు దీర్ఘము వచ్చు నపుడు అరివర్ణకములోని అకారమునకు లోపముగూడ వచ్చుట వ్యాకర్తకు అభీష్టమని తలంపవలయును. లేదా "కడయచ్చునకు" అనఁగా సంధిలో ఏకా దేశముగా వచ్చిన అకారమునకు దీర్ఘమువచ్చుననియైనను దలంపవలయును.

ఈ అరివర్ణకము అచ్ఛికశబ్దములకే వచ్చును. బాలవ్యాకర్త అచ్ఛికము లనే యుదాహరించెను. అందుచే తత్సమ "పూజ" శబ్దమునకు అరివర్ణకము వచ్చుట యుచితముగాదు ఇట "పూజ" అనునది తద్భవమని తెలిసికొన వలయును. కనుకనే పూజారి శబ్దములోని జకారము దంత్యముగనే వినవచ్చు చున్నది.

**సూ. మతుబర్థంబునం జెంచునకుఁ దవర్ణకంబు పరంబగుచో నిత్వం బగు** ౪

ఉ॥ చెంచిత. క॥ చెంచితలం బింఛపత్రచేలాంచితలన్. భాగ. ౧౦ స్క-౦. పూ. (గ్రామ్యజనుల పాటలయందును జెంచీతయని యికార దీర్ఘంబ వినంబడియెడి.)

మతుబర్థమునవచ్చెడి తవర్ణకము పరమగునపుడు ఒకానొకచో ఎత్వము వచ్చునని చెప్పి "చెంచెత" అని బాలవ్యాకరణమున నుదాహరింపఁబడెను. (చూ. బాల. తద్ధి ౨౦ సూ.) కాని ఎకారము మాత్రమేకాక ఇకారముగూడ వచ్చునని యీ సూత్రము చెప్పుచున్నది.

ఇత్వంబును + అగు ఇత్వముగూడ నగునని యర్థము. అనగా ఎకార మొక్కటియేకాక ఇకారముగూడ వచ్చునని భావము

ఇందుకు ప్రయోగము చెంచితలం ... ...। అనునది. ఇట చిత అను వర్ణములఁగావృత్తి శబ్దాలంకారముకొరకు సమానస్వరముగా కవి ప్రయోగించె నని భావము. ఇందు "చి" అను వర్ణము ప్రాసస్థలమున లేకున్నను అను ప్రాస

స్థలమగుటచే మార్పరానిదని యర్థము. గ్రామ్యజనుల పాటలయందును దీర్ఘ మును ఇకారమునకు సంబంధించినదే యగుటయు నీ విషయమును బలపఱచు చున్నదని భావము.

సూ. చెడుగు దుడుకు నిడుపులకుఁ బుంస్త్వంబున మతుబర్థం బకారం బగు. ౨౪

ఉ॥ చెడుగఁడు. దుడుకఁడు. నిడుపఁడు.

చెడుగు, దుడుకు, నిడుపు, అను మూఁడు శబ్దములకు పురుషవాచకము లగునపుఁడు మతుప్ప్రత్యయము నర్థమున (కలవాఁడు అను నర్థమున) "అ" అను తద్ధిత ప్రత్యయము వచ్చును

చెడుగు + అ = చెడుగ ఇయ్యది పుంలింగ తుల్యంబగుటచేఁ "బుంలింగ మగు మహద్వాచకమునకు డుజ్ఞగు" (బాల తత్సమ ౨౨ సూ.) నను సూత్ర ముచే డుజ్ఞు వచ్చును. చెడుగ + ఁడు = చెడుగఁడు. "మహాత్ములగు మగాదు లకుం గయిరాదులకును డుజ్ఞప నుత్వంబుగాదు" (బాల ఆచ్ఛిక. ౪) అను సూత్రముచే నుత్వము నిషేధింపఁబడెను. ఇట్లే దుడుకు + అ + ఁడు = దుడు కఁడు. నిడుపు + అ + ఁడు = నిడుపఁడు.

మతుబర్థమనుటచే చెడుగుకలవాఁడు, దుడుకుకలవాఁడు, నిడుపుకల వాఁడు అని యర్థము వచ్చును.

బాలవ్యాకరణమున మతుబర్థమునందు "ఆ" "ఈ" (వగలాఁడు. అటు మటీఁడు) మున్నగు ప్రత్యయములు చెప్పఁబడెను. "అ" అను మతుబర్థ ప్రత్యయముగూడ బాల. తద్ధి. ౨౭ సూత్రముచే రావచ్చును. అడప = తాం బూల కరండవాహి. మతుబర్థంబునం దప్రత్యయంబు. అని యచ్చట వివరింపఁ బడెను. అయినను ఆ శబ్దములు స్త్రీసమములగుటచేతను నియ్యవి యచట నుదాహరింపఁబడకుండుటచేతను స్పష్టప్రతిపత్తికొఱకు కిట్లు విధింపఁబడెనని తెలియనగును.

"అచ్ఛికశబ్దంబులెల్లఁ దఱుచుగ స్త్రీసమంబులుం గ్లీబసమంబులు నయి యుండు" నను సూత్రమునందలి తఱుచు శబ్దముచేఁ బ్రాప్తించెడి పుంలింగ తుల్యత్వము ఈ "చెడుగ" మున్నగు శబ్దములకును వచ్చును. "పుంలింగ తుల్యము కాగాఁ బుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు" (బాల. తత్స. ౨౨.) నను సూత్రముచే డుజ్ఞు వచ్చును. పుంలింగ తుల్యత్వము రానిచో మహద్వాచక

మయినంతమాత్రమున డుజ్జు రాదు. పుంలింగ తుల్యమగుటచే నుత్వమును బ్రాప్తించుచుండగా మగాదులలోనిదగుటచే నిషిద్ధమయ్యెను. కావున నీ శబ్దము లను మగాదులలోఁ దప్పక చేర్పవలయును. చేర్పనిచో నుత్వము నిషేధింపఁ బడదు

సూ. వేఁడున కడ వర్ణకంబు స్వార్థంబునం దగు ౬

ఉ॥ వేఁడడము.

వేఁడు అను శబ్దమునకు స్వార్థముననే ''అడ'' అను ప్రత్యయము వచ్చును వేఁడు + అడ = వేఁడడ అమహ దదంతమగుటచే ముపర్ణకము చేరి ''వేఁడడము'' అగును. ''వేఁడు'' అనగా నెంతయర్థమో ''వేఁడడము'' అన్నను అంతే యర్థము. బాలవ్యాకరణమున నిట్టి ప్రత్యయము విహితముకాలేదు.

సూ. వెల్ల కడి వర్ణకంబు స్వార్థంబునం దగు. ౭

ఉ॥ వెల్లడి.

వెల్ల అను శబ్దమునకు స్వార్థమునందు ''అడి'' వర్ణకము వచ్చును. వెల్ల + అడి = వెల్లడి. నిత్యముగా సంధియయ్యెను. (చూ. బాల సంధి. ౧౧ సూ.) అజాది తద్ధితప్రత్యయములు పరమగునప్పుడీ సంధి యెల్లెడ నిత్యముగా నగునని గ్రహింపవలయును.

సూ. తెలివి విరివి వినికి లేమి రాపు లకు స్వార్థంబునం దిడి వర్ణ కంబగు. ౮

ఉ॥ తెలివిడి, విరివిడి, వినికిడి, లేమిడి, రాపిడి.

తెలివి, విరివి, వినికి, లేమి, రాపు, అను శబ్దములకు స్వార్థముననే "ఇడి" అను ప్రత్యయము వచ్చును. తెలివి + ఇడి = తెలివిడి. అపదాది స్వర నిత్య సంధి. (చూ. బాల సంధి ౧౧ సూ.) తెలివి అను పదమునకుఁగల యర్థమే ''తెలివిడి'' అనుదానికిని గల్గునని భావము. ఇట్లే మిగిలినవియు. తెలివి మున్నగునవి కృదంతములు. వానిపై ఇడి చేరి తద్ధితాంతములయ్యెను. ఇడి వర్ణకమును వేఁడుకయర్థమున బాలవ్యాకర్త విధించెనుగాని స్వార్థమున విధింపలేదు.

సూ. ఇతవర్ణకం బింపు బిగు పోరులకు స్వార్థంబునం దగు. ౯

ఉ॥ ఇంపితము. బిగితము. పోరితము.

ఇంపు, బిగు, పోరు, అను శబ్దములకు స్వార్థమున "ఇత" అను వర్ణకము వచ్చును ఇంపు + ఇత = ఇంపిత. ముపర్ణకము రాగా ఇంపితము. ఇట్లే మిగిలినవియు. ఇంపు అనునదియు ఇంపితము అనునదియు సమానార్థకములని భావము. ఇట్లే బిగు = బిగితము, పోరు = పోరితము సమానార్థకములు.

సూ. ఇదవర్ణకం బొప్పు తప్పు పెల్లులకు స్వార్థంబునందును క్రొవ్వు బెట్టులకు మతుబర్థంబునందును నగు. ౧౦

ఉ॥ ఒప్పిదము, తప్పిదము, పెల్లిదము, క్రొవ్విదము, బెట్టిదము.

ఒప్పు తప్పు పెల్లు అనువానికి స్వార్థంబున "ఇద" అను వర్ణకమువచ్చును. క్రొవ్వు, బెట్టు, అనువానికి మతుబర్థమున "ఇద" వర్ణకమువచ్చును.

ఒప్పు + ఇద = ఒప్పిద. ముపర్ణకము రాఁగా ఒప్పిదము. ఒప్పిదము అనగా ఒప్పుఅనియే యర్థము. ఇట్లే తప్పిదము; పెల్లిదము. ఈ మూడును స్వార్థమున "ఇద" వచ్చిన స్థలములు.

క్రొవ్వు + ఇద = క్రొవ్విద. ముపర్ణకము రాఁగా క్రొవ్విదము. క్రొవ్వు గలదియని యర్థము. బెట్టిదము బెట్టుగలదని యర్థము. ఇవి రెండును మతుబర్థమున "ఇద" ప్రత్యయమువచ్చిన స్థలములు.

సూ. స్వార్థంబునం దిరివర్ణకంబు వాపున కగు. ౧౧

ఉ॥ వాపిరి.

స్వార్థంబునందు వాపు అను శబ్దమునకు ఇరివర్ణకమువచ్చి "వాపిరి" యగును.

సూ. కరవర్ణకంబు నాయఁకశబ్దంబునకు భావంబునం దగు. ౧౨

ఉ॥ నాయఁకరము.

నాయఁకశబ్దంబునకు "కరం" వర్ణకంబు భావార్థంబున వచ్చును. నాయఁక + కర + ము = నాయకరము. ఇట కరవర్ణకము పరమగునపుఁడు ప్రకృతియందలి కకారమునకు లోపమువచ్చెను.

నాయఁక + కర = (కకారలోపము) నాయఁకరము. నాయఁకుని భావమని యర్థము. కకారలోపమును విధించు సూత్రమెద్దియు లేకున్నను ఈ వ్యాకర్తకు అట్టిలోపమువచ్చుట సమ్మతమని శబ్దరత్నాకరమునుబట్టి నిశ్చయింపవలయును.

ఈ సూత్రమును వ్యాఖ్యాతలు పలువిధములుగా గ్రహించిరి. కొందఱు నాయఁకశబ్దమునకు అరవర్ణకమనియు, కొందరు నాయఁకశబ్దమునకు రవర్ణకమనియు మఱికొందరు నాయఁకశబ్దమునకు కరవర్ణకమే యనియు గ్రహించిరి. కకారమునకు లోపముఁదెచ్చెడి సూత్రము లేకుండుటచేతనే యీ భిన్నమార్గములను పొరవలంబింపవలసివచ్చెను. కాని శబ్దరత్నాకరము స్పష్టముగా నాయఁకఅను శబ్దమునకు "కర" అను వర్ణకము విధింపఁబడుచున్నట్లు సాక్షియగుచుండుటచే గ్రంథకర్తకు సమ్మతమగు పాఠమునే చూపవలసివచ్చెను.

నాయఁడు, నాయరాలు, మున్నగుపదములు కానవచ్చుచున్నవి. వీనింబట్టి "నాయ" అనునొక ప్రాతిపదికము నంగీకరింపవలసియున్నది. ఈ శబ్దములందలి ప్రకృతినే గ్రహించి "కరఙ్" వర్ణకమును విధించిన నాయఁకరము, నాయంకరము, అనుపదములు సిద్ధించును. నాయఁడుగారియొక్క భావము లేదా ధర్మము "నాయఁకరము" అని వాడుకలోనున్నది. నాయఁకశబ్దమునుండి యీ శబ్దమును సాధించుటకంటె నాయశబ్దమునుండి సాధించుటయె న్యాయ్యముగా తోచుచున్నది. నాయకశబ్దము తత్సమము వేఱొక్కటి కానవచ్చుచున్నను "ఎఱుకునాయంకుఁ డొక్కరుడువచ్చి" మున్నగురీతిని పూర్ణబిందుయుతరూపము ప్రయోగములందుఁ జూపట్టుటచే సీతారామాచార్యులువారు అచ్ఛిక నాయఁకశబ్దము నొకదానిని అంగీకరింపవలసివచ్చెను. ఆవశ్యకమగుటచే నాచ్ఛికమగు నాయఁకశబ్దము నొకదాని నంగీకరించినను కరవర్ణకము నిట్టి శబ్దముపై విధించి ప్రకృతిగత కకారలోపమును జెప్పుటకంటె "నాయ" శబ్దమునుండి "నాయఁకరము" అనుపదమును సాధించుట బాగు. అపుఁడు "కరఙ్ వర్ణకంబు నాయశబ్దంబునకు భావంబునం దగు" నని సూత్రింపనగును.

**సూ. కారవర్ణకంబు చెలినయములకు భావంబునందును నుడి కొలతలకు స్వార్థంబునందు నగు. ఈ కకారమునకుఁ గొన్ని యెడల గకారం బగు. ౧౩**

ఉ॥ చెలికారము నయగారము. నుడికారము. కొలగారము.

చెలి, నయ అనుశబ్దములకు భావార్థమున "కార" అను ప్రత్యయమగును. అట్లే నుడి, కొలత అను శబ్దములకు స్వార్థముననే ఈ "కార" ప్రత్యయమువచ్చును. ఈ కార ప్రత్యయములోని కకారము కొన్నిస్థలములందు గకారముగా మాఱును.

చెలి + కార = చెలికార. ము వర్ణకము రాఁగా చెలికారము. చెలియొక్క భావము (మిత్రత్వము) అని యర్థము. ఇట్లే నయగారము. ఇట కకారము గకారమయ్యెను. ఇవి రెండును భావార్థకములు.

నుడి + కారము = నుడికారము. నుడి యనగా నేమియర్థమో నుడికార మన్నను అదియే అర్థము. అందుచే దీనిని స్వార్థకమని చెప్పెను. కొలగారము. ఇట కొల యను నర్థమే కొలగారము అనుదానికిని వచ్చును. ఇచట కకారము గకార మయ్యెను.

కొలగారము అను పదమునకు కొలతకిచ్చెడు కూలి అనియే యర్థము. వ్యవహారమున నున్నది. శబ్దరత్నాకరమునను అట్లే వ్రాయఁబడెను. ఇట్టితరి యిచట స్వార్థమునఁ బ్రత్యయము వచ్చెననుట విచార్యము.

సూ. చలికి మిరివర్ణకంబు స్వార్థంబునం దగు. ౧౪

ఉ॥ చలిమిరి.

చలి అను శబ్దమునకు స్వార్థముననే "మిరి" అను ప్రత్యయము చేరును. చలి + మిరి = చలిమిరి. చలిమిరి అనగా చలి అనియే యర్థము.

సూ. టివర్ణకం "బొండు" నంత్యవర్ణంబునకు భావంబునందగు. ౧౫

ఉ॥ ఒంటి.

ఒండు నంత్యవర్ణంబునకు = ఒండు అను పదముయొక్క చివరి యక్షరమునకు. ఒండు అను శబ్దమునకు భావార్థమునందు "డు" అను అక్షరమునకు బదులు టి అను అక్షరము (ఆదేశముగా) వచ్చును.

ఒండు. ఇట "డు" పోయి "టి" చేరఁగా ఒంటి అని యయ్యెను. ఒంటరితనము అని యర్థము. (ప్రత్యయము ఆదేశముగా వచ్చుట నూతనము)

సూ. పరిమాణార్థంబునం బ్రథమైకవచనంబునందయెడు వర్ణకం బగు ౧౬

విశేష్యంబు భిన్నవచన విభక్తికంబయ్యు పరిమాణార్థకశబ్దములకుఁ బరిమాణార్థంబునఁ బ్రథమైకవచనంబునందే యెడు వర్ణకంబు వచ్చునని యర్థము.

ఉ॥ మూరెఁడు తోక. మానెఁడు బియ్యము. పుట్టెఁడు తవిదలు. పుట్టెఁడు తవిదలకు. రెండుపుట్లు గింజలు, ఇట్లు,

పరిమాణ మనగా కొలత. పరిమాణార్థమును బోధించుచు ఎడు అను ప్రత్యయము వచ్చును. ఈ ప్రత్యయ మెల్లపుడును ప్రథమైకవచనాంతమునకే వచ్చునని యర్థము.

మూర + ఎడు = మూరెడు. తూము + ఎడు = తూమెడు.

ఈ ప్రత్యయము ప్రథమైకవచనమునందే వచ్చుననుటచే విశేష్యము ఏ వచనముననున్నను ఏ విభక్తియందున్నను ఇయ్యది మాత్రము ప్రథమైకవచనాంతమునకే చేరుననియు విశేష్యము ననుసరించి బహువచనాంతము లగు వానికిఁగాని, ద్వితీయాది విభక్త్యంతములగువానికిఁగాని చేరదనియుఁ దెలియు చున్నది. ఈ విషయమునే 'విశేష్యంబు భిన్నవచన... ... ...'అని వివరించెను

మూర, తూము, మున్నగు పదములు విశేష్యమునుబట్టి బహువచనాంతములుగాగాని ద్వితీయాది విభక్త్యంతములుగాగాని యుండి (వానిమీద) ఎడుప్రత్యయమును పొందవనియు ప్రథమైకవచనాంతముమీదనే యెడు ప్రత్యయము చేరుననియుఁ దాత్పర్యము

మూరెడుతోక, తూమెడుబియ్యము. ఇవి ఏకవచనాంత విశేష్యస్థలములు పుట్టెడ్లు తవిదలు. ఇట విశేష్యము బహువచనాంతముగ నున్నను పుట్టి ఏకవచనాంతము మీదనే యెడు చేరెను. పుట్టెడు తవిదలకు రెండుపుట్లగింజలు. ఇచట విశేష్యము (తవిదలకు) బహువచనాంతమును షష్ఠీవిభక్త్యంతమును నయినను పుట్టి అను ప్రథమైకవచనాంతముమీదనే ఎడుప్రత్యయము చేరెను. మానార్థకశబ్దము బహువచనాంతమయినచో ఎడుప్రత్యయము రాదనుటకు "రెండుపుట్లగింజలు" అనునది యుదాహరణము. ఇట పుట్టిశబ్దము బహువచనాంతముగా నుండుటచే నెడుప్రత్యయము రాలేదు.

బాలవ్యాకరణమున నేకత్వమునం దెడువర్ణకంబు విధింపఁబడెను. (బా. తద్ధి ౨౩ సూ.) అనగా నేకవచనాంతశబ్దములమీద నెడువర్ణకమందు విధింపఁబడెనని భావించి పుట్లు + ఎడు = పుట్లెడు అని కానట్లే పుట్టికి + ఎడు = పుట్టికెడు అనియుఁగాదు కావున ప్రౌఢవ్యాకర్త బహువచనాంతమునకు కానట్లే ద్వితీయాదివిభక్త్యంతములకును ఎడుప్రత్యయము రాదని దిద్దవలసి యున్నట్లు భావించి ప్రథమైకవచనమునందె యెడువర్ణకం బగునని సూత్రమును నిర్మించియుండును. శ్రీ దూసి రామమూర్తి శాస్త్రిగారును ఇట్లే తలంచి "పరిమాణ మర్థముగాగల శబ్దమునకంటె నేకవచనముమీద నెడుప్రత్యయము

గలుగునని భావము" అని వ్రాసిరి. కాని బాలవ్యాకర్త ఎడుప్రత్యయ మేకవచ నాంతమునకు వచ్చునని భావింపలేదు. ఏకత్వమునుబోధించు శబ్దమునకు అనగా నేకవచనప్రత్యయము చేరదగిన శబ్దమునకు వచ్చుననిమాత్రమే భావించెను. తద్ధితప్రత్యయము పరమగునపుడు వృత్తియగుటచే సమాసమునందువలె నేకవచనప్రత్యయము లోపించుననియె యాతని యభిప్రాయము.

ఒకపుట్టికి ధాన్యమునకు మున్నగుచోట్ల ఒకపుట్టెడు ధాన్యమునకు అను రీతిని షష్ఠ్యాద్యంతములకును ఎడుప్రత్యయము వచ్చుచుండుటచే నాతడు విభక్తిప్రథమయే కావలయునని శాసింపలేదు.

కావున ప్రౌఢవ్యాకర్త సవరణ సరిగానున్నట్లు కానరాదు బాలవ్యాకర్త సూత్రనిర్మాణము సరిగనే యున్నదని తలంపవచ్చును.

లేదా ప్రౌఢవ్యాకర్త ప్రథమైకవచనాంతమున నెడుప్రత్యయము చేరునని భావింపక ఎడుప్రత్యయాంతములు అనగా పుట్టెడు మున్నగుపదములు ప్రథమైకవచనాంతములుగా నుండునని యభిప్రాయపడుచున్నాడు అనియును తలంచుటకు వలనుకాదు. పుట్టెడుధాన్యము, పుట్టెడు తవిసలు, పుట్టెడు తవిదలకు అనురీతిని విశేష్యము ఏవచనముననున్నను ఏవిభక్తియందున్నను ఎడుప్రత్యయాంతముమాత్రము ప్రథమైకవచనాంతముగనే యుండుననుటకు వీలులేదుగదా. తవిదలకు పుట్టెడికి మున్నగుతీరున నెడుప్రత్యయాంతము షష్ఠ్యాద్యంతముగను కానవచ్చుచున్నది.

కావున బాలవ్యాకరణసూత్రమును సవరింపవలసిన యావశ్యకత కానరాదు.

సూ. దఘ్నార్థంబునం దత్సమపదంబులమీదను బంటి గానంబడియెడి. ౧౭

ఉ॥ "కటిబంటి నెత్తురుకాలువల్." రామా. ౧ ఆ.

లోతును తెలియఁజేయునపుడు తత్సమపదంబులమీద సయితము బంటి అను ప్రత్యయమువచ్చును. "కటిబంటి" కటి అను తత్సమపదమునకు "బంటి" చేరినట్లు ప్రయోగమును జూపుచున్నాఁడు.

బాలవ్యాకరణమున "దఘ్నార్థమున బంటికొలదులగు" (తద్ధి. ౨౩ సూ.) అని బంటిప్రత్యయము విధింపఁబడియెను. మోకాలిబంటి రొమ్ముబంటి అని

"బంటి" వచ్చుటకు రెండు ఉదాహరణములను జూపినను రెండును అచ్ఛిక ములే యగుటచేఁ దత్సమముల కీ ప్రత్యయమురాదని తోచుచున్నది. కావునఁ దత్సమములకును రావచ్చునని బోధించుటకై యీ సూత్రము వ్రాయఁబడెను "తన" ప్రత్యయము మాత్రము తత్సమములకుఁగూడ వచ్చుచున్నను బాల వ్యాకరణమునందలి మిగిలిన తద్ధితప్రత్యయములుమాత్ర మాచ్ఛికశబ్దములకే యుద్దేశింపఁబడుటచే "బంటి" ప్రత్యయముగూడ నాచ్ఛికములకుమాత్రమే వచ్చునని తలఁతురు గదా!

బాలవ్యాకరణమున విధింపఁబడిన "బంటి", "కొలది" అను రెండిఁటి లోపలను కొలదిమాత్రము ప్రత్యేకశబ్దమే యనుట యుచితము. కొలది అను నది స్వతంత్రముగను బరిమాణార్థముననే ప్రయోగింపఁబడుచున్నది. కావున నయ్యది ప్రత్యేకపదమేయని భావించి యీ వ్యాకర్త దానికి తత్సమపదముల మీదఁ బ్రయోగమును జూపలేదు. బంటిమాత్రము స్వతంత్రముగాఁ గాన రానందునఁ బ్రత్యయమనియె యీ వ్యాకర్త తలంచి సవరించెను.

సూ. ప్రాచుర్యార్థంబునం దెలుగుపదంబులమీదను మయట్ప్రత్యయము చూపట్టెడి ౧౮

ఉ॥ తనమయము. "వ. విచ్చలవిడిని దనమయంబుగా గగనంబున నిగుడు నచ్చక్రంబుం గనుంగొని" ఉ. హ. ౩. ఆ. తమమయము. "ఎ.గీ. సమదవృత్తిఁ గేలిసలిపెఁ జకోరచయంబు చదలు తమమయంబుగాఁగ" నిర్వ.౬ ఆ. మెదడు ప్రోవులమయము. "తే. ప్రథనభూమి మెదడు ప్రోవులమయమయ్యె మిక్కుటముగ. హరి. ఉ.౧౦ ఆ. మొ॥

ప్రాచుర్యార్థమునందు 'తత్ప్రకృతవచనే మయట్' అని పాణిని సూత్రముచే సంస్కృతమున "మయట్" అను ప్రత్యయము విధింపఁబడెను. ఆ ప్రత్యయము సంస్కృతశబ్దములకేకాక తెనుగుశబ్దములకును గానవచ్చుటచే నీ సూత్రము రచింపవలసివచ్చెను ప్రాచుర్యమనగా వ్యాప్తి యగుట అని భావము.

తనమయము. "తా" అను తెనుగుశబ్దమునకు మయ అను ప్రత్యయము ఇచ్చుట వచ్చెను. తనచేత వ్యాప్తమయినదని యర్థము. "విచ్చలవిడిని... ... గనుంగొని" ఇది యుదాహరణ ప్రయోగము. "సమదవృత్తిఁ గేలిసలిపె... గాఁగ"

ఇది బహుత్వార్థక 'తా' శబ్దముపై "మయ" వచ్చుట కుదాహరణము. తమ మయము. తమచేత వ్యాపింపఁబడినదని యర్థము. ప్రోవులమయము. ఇది బహువచనాంత నామవాచకమునకు "మయ" వచ్చుట కుదాహరణము.

సంస్కృతప్రత్యయము తెనుఁగుశబ్దములపై వచ్చుట చిత్రమే! అయినను ఇందలి ప్రయోగములన్నియు కవిత్రయమువారివే యగుటచే నత్యంత ప్రమాణములని తెలియఁదగును

ఈ ప్రత్యయము సంస్కృతమున "అన్నమయము" "జలమయము" మున్నగురీతిని ప్రయోగములందుఁ బ్రసిద్ధమే తెనుఁగుశబ్దముల కిప్పటు ప్రౌఢ వ్యాకర్త విధించుటంబట్టి "తనమయము" మున్నగునవి సిద్ధించుచున్నవి. కాని రామునిమయము మున్నగుతీరునఁ దత్సమపదముల కియ్యది వచ్చుట ప్రయోగములను విచారించి నిశ్చయింపవలయును. సామాన్యముగాఁ దద్ధితము లాచ్ఛికములకే విధింపఁబడెను. తత్సమములకు తన ప్రత్యయముతప్ప నింకెవ్వియును రావు. కావున నీ సూత్రమునందలి "తెనుఁగు" అనుపదమునకు "తెనుఁగునకు వర్ణములు ముప్పదియారు" అనుచోటంబోలె నాచ్ఛికము అనియే అర్థము గ్రహింపవలయును. తత్సమములకును నియ్యది విధింపఁ దలంచెనేని "ఆంధ్రభాషకు వర్ణంబు లేబదియైదు" అనుచోటం బలె నాంధ్రపదమునే గ్రహించి యుండునని యూహింపఁదగును.

**సూ. ఒకానొకచో మతుబర్థంబున నవర్ణకంబు చూపట్టెడి. ౧౫**

**ఉ॥ క. అనిలజ నీ కిట్లని పల్కను జనునే తలప లేడికడుపునఁ బులి పుట్టునె యిట్టి దివ్యతేజంబున వాఁడధమాన్వయమునఁ బుట్టునె చెపుమా. (దివ్యతేజంబున వాఁడు=దివ్యతేజముగలవాఁడు) భా॰ర.ఆది.౭.ఆ. ఇతరంబులు ప్రయోగదృష్టంబులు గ్రాహ్యంబులు.**

కొన్నియెడల మతుబర్థమున న అను వర్ణకము (తద్ధితప్రత్యయము) చూపట్టుచున్నదని భావము. మతుబర్థమనఁగా "కలవాఁడు, కలది" అనుతీరున వచ్చెడి కలుగు ధాత్వర్థము.

**అనిలజ ... చెపుమా. ఇందు దివ్యతేజంబున అనునది యుదాహరణము. దివ్యతేజముగల యని యర్థము వివరింపఁబడియెను.**

దివ్యతేజంబు + న = దివ్యతేజంబున. ఇటు తద్ధితప్రత్యయము పరమగుటచే మువర్ణకము లోపింపవలసియున్నది. కాని యుదాహరణబలమువలననే లోపింపదనియుఁ గల్పించుకొనవలసియున్నది. లోపములేకుండుటయు విధింపఁబడిన నుచితముగ నుండెడిది ఇయ్యది విశేషణమెయగుటచేఁ బ్రత్యేకముగాఁ బ్రయోగములందుఁ జూపట్టదనియు విశేష్యముతోడనేగూడి ప్రయోగింపఁబడుననియు నూహించుకొనఁదగును

పరిశీలింపగా దివ్యతేజంబుతోఁ గూడియున్నవాఁడు అనుసర్థమును బోధించుచున్నదిగాన కువలయంబునవారు (చూ. సమా. ౩౨ సూ.) అనునట్లే అలుక్సమాసముగా భావింపవచ్చును తృతీయార్థక నవర్ణకాంతముతోఁ గూడిన తత్పురుష సమాసము కానగును. కావున నీ సూత్రము పరిత్యాజ్యము.

సమాసపరిచ్ఛేదమునందలి ౧, ౩౨, సూత్రములును ఈ (తద్ధిత. ౧౯ సూ) సూత్రమును నకారమునకు సంబంధించినవియే కనుక ఈ మూఁడు సూత్రములును ఏకసూత్రముచేతనే గతార్థములగునట్లు సూత్రనిర్మాణముగావింపవలసియుండగా నీ పద్ధతి గౌరవదోషయుక్తమయ్యెను. సమా. ౩౨ సూత్రముచేతనే మిగిలిన రెండుసూత్రముల యర్థమును లభించుననియు నూహింపవచ్చును. (చూ. సమా. ౩౨ సూ.)

ఇది తద్ధితపరిచ్ఛేదము.

# క్రియా పరిచ్ఛేదము

సూ. తద్ధర్మార్థక విశేషణం బసహాయమైం త్రికాలవాచి యగు. ౧

ఉ॥ వారి యనువయించు సితకృష్ణతంతురాజిత తంత్ర మది భార. ఆ ౧ ఆ.౧౦౮. అనువయించు=అనువయించుచున్న. వ. నా నేర్చువిధంబున. (నేర్చు=నేర్చిన.) భార. ఆది ౧ ఆ.౨౦ నాపడు ప్రయాసము లూరకపోకయుండ. (పడు=పడిన.) కళా.౪ ఆ.౯. ద్రుపదు వీటిలోన దొమ్మికయ్యము రేఁచెఁ బసులఁ బట్టి విరటుపట్టణమున. మఱియు నెన్నిలేవు మార్తాండతనయుండు తొడరి మనకుఁ జేయు దుండగములు. (చేయు=చేసిన.) జై.౧ ఆ.౯౨ "ఆ. జనమేజయుచేయు సర్పయాగమున." (చేయు=చేయఁగల.) భార. ఆది ౧ ఆ.౧౨ మొ॥

తద్ధర్మార్థకవిశేషణంబు = ఎడు, ఎడి, వానిలోపమునుగల తృవర్ణకార్థక విశేషణములు. (వచ్చెడి, వచ్చెడు, వచ్చు, మున్నగునవి.) అసహాయతన్ = కాలమును సూచించుశబ్దముల సాహాయ్యము లేనియపుడు. త్రికాలవాచి = సందర్భానుగుణముగ మూఁడుకాలములలో నేకాలమునయినను జెప్పునది.

బాలవ్యాకరణమునఁ దద్ధర్మార్థమున నని ప్రత్యేకముగ నెట్టి విశేషణములను ధాతువులనుండి సాధించియుండలేదు. కాని తద్ధర్మార్థములనగా తృవర్ణకార్థమున విధింపఁబడిన ప్రత్యయములుగల శబ్దములేయని యందలి వ్యవహారమునుబట్టి తెలియఁబడుచున్నది. చేయు, చేసెడు అనునవి తద్ధర్మార్థకములని యందు వ్యవహరింపఁబడెను. (చూ. బాల. సంధి. ౩౩ సూ.) కావున నిచ్చట అట్టివానినే తద్ధర్మార్థకములనుగా గ్రహింపవలెను.

కాలమునుబోధించు శబ్దములేకుండుటచే తద్ధర్మార్థకవిశేషణములు సందర్భానుగుణముగా మూఁడుకాలములలో నేకాలమునయినను బోధించునని యర్థము.

వారి యనువయించు ... ... అనువయించు. తద్ధర్మార్థక విశేషణము. ఇది తంత్రము అనుదానికి విశేషణము. అనువయించుట యేకాలమునకు సంబం

ధించినదో యిట వేఱొకశబ్దముచేతఁ దెలియఁబడలేదు. అందుచే సందర్భమును బట్టి ఆవశ్యకమయినకాలము బోధింపఁబడుచున్నది. అనువయించు అనగా అనువయించుచున్న అని వర్తమానకాలమ్ము బోధింపఁబడుచున్నది. అనువయించుచున్న అనగా నేయుచున్న అనియర్థము నేర్చు, పడు, చేయు, అను నవి నేర్చిన, పడిన, చేసిన, అని భూతార్థమును బోధించును.

జనమేజయుచేయు సర్పయాగమున... ...। ఇట చేయు అనగాఁ జేయఁగల అని భవిష్యదర్థమును బోధించును.

ఇట్లు విశేషణములు మూఁడుకాలములను సందర్భమునుబట్టి బోధించుచుండును. ఇందలి యుదాహరణములనుబట్టి మూఁడుకాలములను ఒక్కచోట బోధించునని యర్థముకాదు. ఒక్కొకచో నొక్కొక్కకాలమును సందర్భమును బట్టి బోధించునని తాత్పర్యము.

ఇట "నసహాయతన్" అనుపదమునకు సహాయముగాఁ గాలబోధకమగు శబ్దములేనియపుఁడు అని యర్థముచేయుటలో కొన్నిచిక్కులు గలవు. కాల బోధకములయిన శబ్దము లున్నను లేకున్నను సందర్భమునుబట్టి యొకకాలమును బోధించుచునే యుండునుగదా! కాలబోధకశబ్దము లున్నపుడు మాత్రము కాలత్రయబోధకమగుటకు బాధకమేమియులేదు ఇవుడు వారియనువయించు. మున్ను మనకుఁజేయు దుండగములు ఇఁక. నాజనమేజయుచేయు సర్పయాగమున. అని కాలబోధకశబ్దము లున్నను మూడుస్థలములందును మూడుకాలములకు సంబంధించిన క్రియను జెప్పుటకు అటంకములేదుగదా. కాలబోధకము లగు ప్రత్యయములు తద్ధర్మార్థక విశేషణమున నెప్పుఁడును జేరవు. అందుచే నసహాయతగా నున్నయపుఁడు త్రికాలవాచియగునని నియమమును జెప్పుట సరిగాలేదు. అట్టి యభిప్రాయమే వ్యాకర్తకుఁ గలదేని సహాయతయందుఁ ద్రికాలవాచిత్వములేదని ప్రత్యుదాహరణముగూడఁ జూపియేయుండును. అట్లు చూపలేదు.

కావునఁ దద్ధర్మవిశేషణము అసహాయతచేత అనగా కాలబోధకచిహ్నము లేవియు దీనియందు లేకుండుటచేత కాలత్రయమును బోధించుచుండునని యర్థము చేయుటలయును. కాని వ్యాకరణశాస్త్రమున శాసింపఁబడు విధులకు గారణములను జెప్పనక్కఱలేద. శాస్త్రంబున "వర్తమానంబున లట్టగు" "భూతంబున లిట్టగు" అనురీతిని కారణముచెప్పకయే యాయాకార్యములు విధింపఁబడు

చుండును. అయినను సుస్పష్టముగాఁ దెలియుటకై కారణమును జెప్పెనని భావింపవలయును. "తద్ధర్మార్థక విశేషణము త్రికాలవాచియగును" అనియే విధింపఁదగిన యంశము.

తద్ధర్మము అనగా ఒకకాలముగాదు. తద్ధర్మకాలము అను వ్యవహారము ప్రామాదికము. బాలవ్యాకర్త యిట్టి తద్ధర్మార్థక విశేషణములను తృవర్ణకార్థకములని వాడెను. అనగా కర్త్రర్థమున మాత్రమే ప్రత్యయములు ధాతువునకు చేరగా నీరూపములు సిద్ధించెను. అందువలన వీనిని కాలబోధకములుగాఁ దలంపరాదు. కాని యీ విశేషణములు కర్త్రర్థకములన్నచో (బాలవ్యాకర్త చెప్పినతీరున) కర్మవాచకములతో సమానాధికరణములుగా నన్వయించుట కుదురదుగదా! అనువయించు అను విశేషణము "వారు" అను కర్తతో నన్వయించిన సరిపడును. కాని యిచ్చట "వారు" అనుదానితో నన్వయింపదు. "సితకృష్ణ తంతురాజిత తంత్రము" అనుదానితో (కర్మతో) నన్వయించును. అయినను విరోధములేదు. "కర్మాదేః కర్తృత్వం" అను చింతామణి సూత్రము చొప్పున కర్త్రర్థకమయినను కర్మతో నన్వయించుచున్నదని తెలియవలయును. (చూ. బాల. సమా. ౨౬ సూ.) కావున వీనికి యథార్థముగా కాలబోధకత్వము లేదు. సందర్భమే యాక్రియకు సంబంధించిన కాలమును బోధించును. త్రికాల వాచిత్వము ఆ విశేషణమునకు లేదు. త్రికాలములకు సంబంధించిన విశేష్యము లకును ఈ తద్ధర్మార్థక విశేషణము సంబంధింపవచ్చునని మాత్రమే దీయే తత్సూత్రతాత్పర్యముగా గ్రహింపవలయును.

సర్పయాగముచేయుట ఏకాలమునకు సంబంధించినదయినను "చేయు" అను విశేషణము ఆ సర్పయాగము అను కర్మతో నన్వయించునని సారాంశము. కాలమును మాత్రము ఆ "చేయు" అనునది సూచింపదు. సందర్భమునుబట్టియే ఆచేయుట యేకాలమునకు సంబంధించినదియో తెలిసికొనవలయును. "చేయు సర్పయాగము" ఇచట చేసిన సర్పయాగము అనికాని చేయుచున్న సర్పయాగము అనికాని చేయఁగల సర్పయాగము అనికాని అర్థము "చేయు" అను శబ్దముచేతను రాదు. అందుచే మూడువిధములలో సందర్భమునుబట్టి ఏదియో యొకయర్థమును ఊహించుకొనుచున్నాము. ఒక యర్థమున శబ్దము తత్త్ర పనిధగుటచేతనే యున్నియర్థములందును ప్రయోగింపఁబడుచున్నది.

సూ ఒకానొకచోఁ దద్ధర్మార్థకములగు నుండు చను చేరు కొనులు ప్రశ్నార్థ కైకారపరకంబు లగునపుడు వాని కడయచ్చులకు లోపంబు విభాష నగు. అగుచో నుండు డకారంబునకు నకారం బగు. ౨

చేరుకొను అనఁగా ననుప్రయుక్తమగు కొను ధాతువని యర్థము.

ఉ॥ క. అ, మ్మరియాద దప్పు మెలఁగిన, బురుషార్థంబునకు హానిపుట్టకయున్నే. భార. విరా.౧ ఆ ౧౨౨. మునీంద్ర నీకుఁ జన్నే నలినాక్షులందు మది నిల్పఁగ. భార. ఆది.౮ ఆ.౧౭౯. అహితముం భయముం దొరకొన్నె నాకు నాపుత్రులకున్. భార. సభా.౨ ఆ౧౩౩ పక్షమున ఉండునే. మొ॥

ఒకానొకచోఁ దద్ధర్మార్థకములగు నుండు చను ధాతుపులకును అనుప్రయుక్తమగు కొను ధాతువునకును ప్రశ్నార్థముగల "ఏ" అనునది పరమగునపుఁడు చివరియచ్చునకు లోపము వికల్పముగావచ్చును. ఉండు ధాతువునకు అంత్యాచ్చు లోపించినపుడు డకారము నకారముగా మారిపోవును.

"అమ్మరియాద... ...!" ఉండున్ + ఏ ఇట ఉండున్ అను క్రియాపదమున రెండచ్చులు గలవు. అందు చివరిదగు నుకారము లోపించి డకారము నకారముగా మారగా (ఉండ్న్ + ఏ = ఉన్ న్ + ఏ) ఉన్నే యయ్యెను, డకారము నకారముగా మారినయపుఁడు అనుస్వారము స్థిరము పరముగానున్నపుడు నిలువదు గావున లోపించెను.

"మునీంద్ర నీకు చన్నే." చనున్ + ఏ. చివరియచ్చగు ఉకారము లోపింపగా చన్న్ + ఏ = చన్నే అని యయ్యెను.

"అహితముం దొరకొన్నె." ఇట దొరకొను అనునది దొర అనుదానికి అను ప్రయుక్తమగు కొను ధాతువు. దొరకొనున్ + ఏ. చివరియచ్చు (ఉకారము) లోపింపగా దొరకొన్న్ + ఏ = దొరకొన్నె అని యయ్యెను.

ఈలోపము వైకల్పికము గావున రానిపక్షమున ఉండున్ + ఏ = ఉండునే. చనున్ + ఏ = చనునే. దొరకొనున్ + ఏ = దొరకొనునే. అని రూపాంతరములు లుండును,

ఈలోపము తద్ధర్మార్థక ప్రథమపురుషైకవచనాంతము లగునపుడే వచ్చును.

ఇచట ఉండున్ అను రూపమును గ్రహింపక ఉండు అనుదానిని గ్రహించుట సరికాదు.

సూ. తద్ధర్మభూతక్రియ లార్యద్యర్థపరకంబులయి ప్రశ్నార్థకంబు లగు. 3

ఉ॥ 'సీ. మీవంశమున నరదేవోత్తములైన సద్ధర్మమార్గంబు సలుపుదయ్య.' భార. సభా.౧ ఆ.౨౬. క. "సన్మానితులయి వర్తింతురయ్య ని దైవజ్ఞుల్." భార. సభా. ౧-33. "పంచితయ్య" భార. సభా.౧ అ.౭3.

తద్ధర్మార్థక క్రియలును భూతకాలార్థక క్రియలును అయ్య మున్నగు శబ్దములు పరమునం గలవై ప్రశ్నార్థకములగును.

మీవంశమున... ...। ఇట "సలుపుదు" అనునది తద్ధర్మార్థక మధ్యమ పురుషైకవచనాంతక్రియ. "చలుపుదువు" అనియుండగా లిఙ్మాత్ముల వకారంబునకు లోపంబు విభాష నగు. (బాల. క్రియ. ౨౪ సూ.) నను సూత్రముచే వకారలోపమురాగా చలుపుదు + ఉ అనియుండ సవర్ణాదిస్వర నిత్యసంధివచ్చి "చలుపుదు" అని యగును. దీనిపై "నయ్య" చేరి ప్రశ్నార్థకమయ్యెను. చలుపుదయ్య ।= చలుపుచున్నావా ।= చేయుచున్నావా । అని భావము.

సన్మానితులయి... ...। "వర్తింతురు" ఇది తద్ధర్మార్థక ప్రథమపురుష బహువచనాంతక్రియ. దీనికి అయ్య శబ్దమునుంజేరి ప్రశ్నార్థకమయ్యెను. వర్తింతురయ్య ।= వర్తించుచున్నారా అని ప్రశ్నార్థకమయ్యెను.

"పంచితయ్య" ఇట పంచితివి అను భూతకాలిక క్రియయొక్క వకారము లోపింపగా (చూ. బాల. క్రియ. ౨౪ సూ.) మిగిలినరూపము. మధ్యమపురుషైకవచనాంతము (పంచితివి. వకారలోపము. పంచితి + ఇ = పంచితి.) దీనిపై నయ్యచేరగా పంచితయ్య అయ్యెను. పంచితివా అని యర్థము.

ఈ క్రియలు తద్ధర్మభూతార్థములను బోధించుచునే ప్రశ్నార్థకము లగును. ప్రశ్నార్థమును బోధించునపుడు వాని స్వార్థమును విడువవు. పంచితయ్య ఇంతకుపూర్వము పంచితివా యని యర్థముగదా. అనంతరసూత్రము చొప్పున దద్ధర్మక్రియలు వ్యతిరేకార్థ వ్యంజకములును అగును.

సూ. ఒక్కొకచోఁ దద్ధర్మక్రియ యార్యాద్యర్థపరకంబయి వ్యతిరేక వ్యంజక ప్రశ్నార్థకం బగు. ౪

ఉ॥ "చ. తనయుఁడు తండ్రి యగ్రజుఁడు తమ్ముఁడనం జనునయ్య రాజ్యముం గొనునెడ. నిర్వ.3 ఆ ౯౫ ప. 'సురాంగనలెల్ల నిట్టి నీచేతకు మెత్తురమ్మ' స్వా.3 ఆ 33. మొ॥

వ్యతిరేకవ్యంజక ప్రశ్నార్థకంబు = వ్యతిరేకార్థమును సూచింపఁజేయుచున్న ప్రశ్నము అర్థముగ గలది.

ఒక్కొకస్థలమునఁ దద్ధర్మార్థక క్రియ అయ్యాదిశబ్దము లంతమునఁగలదై వ్యతిరేకార్థమును తోచునట్లుఁజేయు ప్రశ్నార్థకమగును.

తనయుఁడు... ...! చనున్ + అయ్య. ఇది యార్యార్థకమగు అయ్య అనునది పరముగానున్న చనున్ అను తద్ధర్మక్రియ. ఇచట అనంజనునయ్య అను పదసమూహము అనరాదు అను వ్యతిరేకార్థమును సూచించుచున్న ప్రశ్నార్థకముగా నున్నది

సురాంగనలెల్ల... ... మెత్తురు అను తద్ధర్మ ప్రథమపురుష బహువచన క్రియకు అమ్మ అనునది చేరుటచే "మెచ్చరు" అను వ్యతిరేకార్థమును సూచించు ప్రశ్నముగా నున్నది.

ఈ ప్రశ్నము వ్యతిరేకస్వాభిప్రాయమును సూచించునని గ్రహింపఁదగును.

పై రెండుసూత్రములును (౩, ౪ సూ.) పదముల సమ్మేళనమూవలన నేర్పడిన యర్థవిశేషములను జెప్పుచున్నవి శబ్దమునకేమియు విధింపఁబడ లేదు. ఇది యీ శబ్దశాస్త్రమగు వ్యాకరణమునకు సంబంధింపదు. పదార్థబోధ విషయమగు నీ విశేషము ప్రసంగవశమునఁ జెప్పెనని తలంపవలెను.

సూ ఆర్యాద్యర్థమొక్కచో నటుశబ్దపూర్వకంబు వగు. ౫

ఉ॥ చెల్లునటయ్య; చెల్లునటమ్మ, దయసేయక తిన్ననివేమను వెన్నలన్ వేతురటమ్మ యింతకనువేదురు సెల్లునటమ్మ యింతికిన్ స్వా.3 ఆ 33. మొ॥

పూర్వసూత్రమునఁ జెప్పఁబడిన తద్ధర్మార్థకముమీఁది యార్యాద్యర్థక పదములు ఒక్కొకసమయమున "అటు" అను శబ్దము పూర్వముగాఁ గలిగియుండును. అట్టిచోటను వ్యతిరేకవ్యంజక ప్రశ్నార్థకమే యగునని భావింపుఁడు

చెల్లునటయ్య. ఇటు చెల్లున్ అను తద్ధర్మక్రియకుఁ బరముగానున్న అయ్య శబ్దము అటు శబ్దపూర్వకమయ్యెను. చెల్లున్ + అయ్య. అయ్యకుఁ బూర్వమున అటు అనునది చేరగా చెల్లునటయ్య అనియయ్యెను చెల్లదు అని వ్యతిరేకార్థమును వ్యంజింపఁజేయు ప్రశ్నమగుచున్నది.

పై మూఁడవసూత్రము నుదాహరణములందును ఆర్యాద్యర్థక శబ్దము గలదు. కాని యచట నటుశబ్దపూర్వకమగుట వ్యాకర్తను ఉద్దిష్టము కాజాలదు. అదియె యిష్టమయ్యెనేని వ్యతిరేకవ్యంజక ప్రశ్నార్థములను మాత్రమే యిటు నుదాహరించి యంతటితో విరమింపక వ్యతిరేకార్థశూన్యములగు నుదాహరణములనుగూడఁ జూపియుండును. చెల్లునటయ్య చెల్లునటమ్మ అని వ్యతిరేకార్థవ్యంజకప్రశ్నస్థలములనుమాత్రమేగదా యుదాహరించెను. కాక సందితయ్య వంటి భూతార్థక్రియకుఁగూడ అటు పూర్వకమయినదగుండుటకు ఉదాహరణము నిచ్చి యుండును. కావున నీ సూత్రపుకార్యము నాల్గవసూత్రమునకే సవరణ యని తెలియఁదగును.

౩, ౪, ౫, సూత్రములకార్యములు వ్యాకరణవిషయములు కాఁజాలవు. ఇవి యర్థమును వివరించునవి మాత్రమే. అర్థమునుగూడ వివరింపఁ దలంచిరేని యింక ననేకవిషయములు చెప్పవలసియుండును లేదా యీ మూఁడుసూత్రములను వాక్యప్రకరణమునఁ జేర్చుట యుచితము.

**సూ. మహద్బహుకర్తృకక్రియకు నేకవచనంబు విభాష నగు. ౬**

ఉ॥ "క. తనయెఱిఁగిన యర్థం బొరుఁ డనఘా యిది యెట్లు చెప్పుమని యడిగినఁ జెప్పనివాఁడును సత్యముచెప్పనివాఁడును ఘోరనరక పంకమునఁ బడున్. భార. ఆది.౧ అ.౧౩౨ ప. పద్యమున. క. బలవంతుఁడు పయినెత్తిన బలహీనుఁడు ధనము కోలుపడిన యతఁడు ప్రముచ్చిలి ప్రేఁగు నతఁడుఁ గామాకులచిత్తుఁడు నిద్రలేక కుందుదు రధిపా. భార. ఉద్యో.౨ అ.౨౧. ప. మొ॥

మహద్బహుకర్తృక క్రియకు = మహత్తులగు అనేకులు కర్తలుగాఁగల క్రియనుజెప్పు శబ్దమునకు.

మహత్తులను జెప్పెడి కర్తృవాచకములు ఒక్కటికంటె నెక్కువగానున్నయెడల వానికిసంబంధించిన క్రియాపదము వికల్పముగా నేకవచనాంతముగా

నుండును. బహుత్వమును జెప్పుటచే క్రియకు బహువచనమే ప్రాప్తించు చుండగా నేకవచనముగూడ నిట విధింపఁబడుచున్నది.

తనయొఱిఁగిన... ...! ఇట పడున్ అను క్రియలోనికి అడిగినఁ జెప్పని వాఁడును, సత్యము చెప్పనివాఁడును అను నిరువురు కర్తలును అన్వయింపవలసి యున్నది. కావున ''పడును'' అనుక్రియ బహుకర్తృకమును మహత్కర్తృక మునుగూడ నయ్యెను అయినను క్రియ ఏకవచనాంతముగనే యున్నది. ''పడు దురు'' అని బహువచనాంతముగా లేదు

ఈకార్యము వైకల్పికము గావున ఏకవచనము రానిపక్షమున బహువచ నమును వచ్చును. అందుకు ''ఒలవంతుఁడు పయినెత్తిన... .. అనునది యుదాహరణము. ఇట బలహీనుఁడు, ధనము కోలుపడినయతఁడు, మ్రుచ్చిలి వ్రేఁగునతఁడు, కామాకులచిత్తుఁడు, అను నలుగురును కర్తలుగా నుండుటచే బహువచనము క్రియకువచ్చి ''కుందుదురు'' అని యయ్యెను.

క్రియాపదము కర్తృవాచకపదములతో వేరువేరుగా నన్వయించుటను వివక్షించినచో నేకవచనము ప్రాప్తించుచునే యున్నది. సంస్కృతమునను ఇట్లు కర్తృవాచకపదము లనేకము లున్నయపుఁడు ఏకవచనముఁగూడ వచ్చు చున్నది. అయినను స్పష్టప్రతిపత్తికొఱకు ఈ సూత్రము చెప్పఁబడెనని తెలియ వలయును.

మహద్వాచకములగు కర్తృవాచకశబ్దములు ఏకవచనాంతములుగా నున్నప్పు డే క్రియ కేకవచనము వచ్చునుగాని బహువచనాంతములుగా నున్న పుడుమాత్ర మీ సూత్రముచేఁ గ్రియ కేకవచనమురాదని తెలిసికొనవలయును. ఏకవచనాంతములును మహద్వాచకములును అగు కర్తృవాచకపదములు అనే కములుండునపుఁడు క్రియ కేకవచనము వచ్చునని యర్థము చెప్పికొనవలయును.

అడిగినఁ జెప్పనివారును, సత్యము చెప్పనివారును అని బహువచనాంత ములుగా నుండెనేని మహద్వాచకములగు కర్తృవాచకశబ్దములు అనేకము లున్నపుడు బహువచనమే వచ్చునుగాని క్రియ కేకవచనము రారాదు. అందుచే సూత్రమున ''నేకవచనాంత మహద్బహుకర్తృకక్రియకు'' అని యుండిన సరిపడును.

పరిశీలింపగా సూత్రమున మహత్పద మనావశ్యకము. కర్తలు అమ హత్తు లగునపుఁడు క్రియ కీ యేకవచనము రానిచో నట్లుచెప్పవలసియుండును.

కర్తలమహత్తులయినచో నెట్లును క్రియ ఏకవచనము వచ్చును (చూ. బాల. క్రియ. ౨౫ సూ.) అయినను ఈ ఏకవచనము వైభాషికమగుటచే నియ్యది రాని పక్షమున బహువచనము వచ్చునను సందేహము కలుగకుండుటకై యమహత్తుల నిందు తప్పించునభిప్రాయముతో మహత్పదమును జేర్చెనని భావింపవలయును.

సూ. కొన్నియెడలం ద్వరితార్థకసూచకంబై భావిని భూతంబు చూపట్టెడి. ౭

ఉ॥ తావచ్చె సుదర్శనాయుధుఁడు. భాగ. ౧౦ స్కం. పూ. ౧౭౩౮. మొ॥

కొన్నియెడల త్వరనుసూచించునపుఁడు భవిష్యదర్థమునసే భూతార్థకక్రియ ప్రయోగింపఁబడును.

"తావచ్చె సుదర్శనాయుధుఁడు" ఇటు సుదర్శనాయుధుఁడు త్వరగా రాగలఁడని యర్థము. ఇట వచ్చె ననుక్రియ భూతార్థకము. కాని అతివేగముగా రాగలఁడని భవిష్యదర్థమునసే త్వర సూచింపఁబడుటచే భూతకాలక్రియ ప్రయోగింపఁబడెను.

(సంస్కృతమున నిట్టిచోట వర్తమానార్థక క్రియను వాడుదురు. "వర్తమాన సామీప్యే వర్తమానవద్వా" అని శాస్త్రము. "కదా గమిష్యసి" అను ప్రశ్నమునకు "ఏష గచ్ఛామి" అని బదులుచెప్పవచ్చును.)

సూ. వ్యతిరేకక్రియ యర్థత్రయ బోధకం బగు. ౮

అర్థత్రయము=వర్తమాన భూత భవిష్య దర్థములు.

ఉ॥ వర్తమానమునకు — పాఱుఁడు లేచి దిక్కులకు. (పాఱుఁడు= పాఱుచున్నవాఁడు కాఁడు.) భాగ ౮ స్కం. ౧౯౮. "పలుకదు సఖులతో లలితాంగి" (పలుకదు=పలుకుచున్నదికాదు) భార. అర. ౨ ఆ. ౨౩. భూతమునకు — క. నలు గాన మివ్వనంబున. (కానము=కనిన వారముకాము.) భార. అర. ౨ ఆ. ౧౦౭ "ఱెక్కలురావు పిల్లలకు" (రావు=వచ్చినవికావు.) భాగ ౭ స్కం. ౩౩౩. భవిష్యత్తునకు—"పోసు

"దేవుఁడున్ రాఁడను." (రాఁడు=రాఁగలవాఁడు కాఁడు) భాగ.౧౦ స్క-౦. పూ.౧౭౨౭. "ఆ నలున కాని నళినదళనేత్ర వరియింప దట్టె." (వరియింపదు = వరియించునది కాదు) భార అర.౨ ఆ.౫౨. ఇత్యాదు లెఱుంగునది.

వ్యతిరేకక్రియ = వ్యతిరేకార్థమున నుండెడిక్రియ. లజ్యంత క్రియ యని భావము. వ్యతిరేకార్థకములగు క్రియలు సందర్భానుసారముగా భూతభవిష్యద్వర్తమానార్థములను బోధించుచుండునని యర్థము.

"పాఱఁడు లేచి దిక్కులకు" ఇచట పాఱఁడు అనుక్రియ వర్తమానకాలమును అనగా పాఱుచుండలేదు అనునర్థమును బోధించును. ఇట్లే మిగిలిన యుదాహరణములను నూహ్యములు.

ఆలోచింపగా వ్యతిరేకార్థకక్రియ కాలమును బోధింపదు. ఈ క్రియకు కాలముతో సంబంధములేదు ధాత్వర్థముయొక్క అభావమును మాత్రమే బోధించును. అయభావము ఏకాలమునందలిదో బోధించుటకు క్రియకు శక్తి లేదు. అట్టి కాలవిశేషమును సందర్భము బోధించును. కనుకనే పాఱఁడు అనుపదమునకు పాఱుచున్నవాఁడుకాఁడు అను వివరణ మపేక్షితమయ్యెను. ఒక్కొకచో ధాత్వర్థమున భావము రెండుమూఁడు కాలములకు సంబంధించినదియుఁ గావచ్చును. "పలుకదు సఖులతో లలితాంగి" ఇట లలితాంగి పలుకకుండుట వర్తమానకాలమునకు మాత్రమే సంబంధింపదు పలికినదికాదు పలుకుచున్నదియుఁగాదు అని రెండుకాలములందును పలుకకుండుటయే యిట జరిగెను. కనుక వ్యతిరేకక్రియ (తద్ధర్మక్రియవలెనే) కాలమును బోధింపదనియు కాలము సందర్భమునుబట్టియే బోధింపఁబడుననియు ధాత్వర్థము యొక్క అభావము మాత్రమే బోధింపఁబడుననియు తెలిసికొనవలసియున్నది. తద్ధర్మార్థకక్రియ యెట్లు కాలసంబంధములేక ధాత్వర్థముయొక్క సత్త్వము మాత్రమే యర్థమగునో యట్లే వ్యతిరేకక్రియయు ధాత్వర్థాభావమును బోధించును. పాఱఁడు = పరుగిడఁడు అనిమాత్రమే యర్థము. ఆ పరుగిడకుండుట ఏకాలమునకు సంబంధించినదియో దీనివలనఁ దెలియఁబడదు.

తద్ధర్మక్రియయు వ్యతిరేకక్రియయుఁ గాలబోధకములు కాకుండుట చేతనే మూఁడుకాలములకు సంబంధించిన యర్థములను బోధించునవుఁడును ప్రయోగింపఁబడుట విరుద్ధముకాకున్నది. ఈ రెండుదశముల క్రియలును కర్తర్థ

ప్రత్యయాంతములు మాత్రమేయని తెలియవలయును. సంస్కృతమున నిట్లే కర్త్రర్థ మాత్రమున ణిని ప్రత్యయముచేరిన శబ్దములు గ్రాహీ (గ్రహించువాఁడు) స్థాయీ, మున్నగునవి గలవు.

"వరియింపదు" అనునది భవిష్యత్తున కుదాహరణము కావున వరియింపదు = వరియింపఁగలదికాదు అని వివరించుట యుచితము. వ్యాకర్త వివరించిన "వరియించునది" అనునది తద్ధర్మార్థకము. అంతియకాని భవిష్యదర్థమును స్ఫురింపఁజేయు ప్రతిపదముకాదు

సూ. ప్రార్థనమునం దన్ప్రత్యయాంత క్రియలమీఁదఁ గదకదవు పూర్వకంబు లన్నాము లనుప్రయుక్తంబు లగు. ౯

ఉ॥ ప్రోవఁగదన్న; ప్రోవఁగదవన్న; ప్రోవఁగదయ్య, ప్రోవఁగదవయ్య; ప్రోవఁగదమ్మ, ప్రోవఁగదవమ్మ; ప్రోవఁగదె, ప్రోవఁగదవె; ప్రోవఁగదవే, సుకీర్తిమనఁగదన్న, భాగ.౧౦. స్క.౦. పూ.౧౫౦. చెప్పఁగదయ్య. భాస్కరశతక. తుదియెప్పుఁడు మద్విరహాంబురాశికిన్ జెప్పఁగదమ్మ భాగ.౧౦ స్క.౦. పూ.౧౧౩౦. శా. తండ్రీ నాకు ననుగ్రహింపఁగదె వైద్యంబంచుఁ బ్రార్థించినన్. స్వా.౫. ఆ.౧౭. నీపాదకమలసేవయు నీపాదార్చకులతోడి నెయ్యము నితాంతాపార భూతదయయును దాపసమందార నాకు దయసేయఁగదే. భాగ.౧౦ స్క.౦. పూ. ౧౨౬౯. పురంబుఁజేర నింకెవ్విధిఁ గాంతుఁ జెల్పఁగదవే తెరు వేది శుభంబు స్వారో.౨ ఆ ౩౯ మొ॥

ప్రార్థనార్థంబునందు నుజీ ప్రత్యయాంత క్రియలమీఁద 'కద, కదవు' అనునవియు వానిమీఁద 'నన్నా'దులును జేరును,

అన్ ప్రత్యయాంతక్రియలు = నుజీ ప్రత్యయాంతక్రియలు. కద కదవు పూర్వకంబులు = కద, కదవు, అనునవి పూర్వభాగమునఁ గలవి. అన్నాదులు = అన్న, అయ్య, అమ్మ, ఎ, ఏ, మున్నగునవి.

ప్రార్థనార్థమునఁదు లూఙంతధాతువును బాలవ్యాకర్త సంగ్రహించియుండెను. (చూ. బాల. ఆశీర్వాద సంప్రార్థన విధులందు లూఙాదు. క్రియా. సూ.) కాని నుజ్యంతమును ప్రార్థనార్థకమని యూహించి చెప్పుటను జెప్పియుండ

లేదు. తుమర్థభావలక్షణాదులందు మాత్రమే యన్నంత (నుజ్యంత) మగుట అందుఁ గానవచుచున్నది. అన్నంత క్రియ తుమర్థాదులనేకాక ప్రార్థనార్థముం గూడ బోధించుననియు నట్టిచోఁ గద కదవు పూర్వకాన్నాదు లనుప్రయుక్తము లగుననియు నిందుఁ జెప్పఁబడెను

నుజ ప్రత్యయాంతములు_"అన్"అని అంతమునఁ గలవియగును. అందుచే వానిని అన్నంతములని ప్రౌఢవ్యాకర్త వాడుచుండునని తెలియనగును.

ప్రోవఁగదన్న. (ప్రోవన్ + కద + అన్న) ఇట ప్రోవన్ అనునది ప్రోచు ధాతువు నన్నంతరూపము. దీనిమీదఁ గద అనునది పూర్వమునంగల అన్న అనునది (కద + అన్న = కదన్న.) అనుప్రయుక్త మయ్యెను.

ప్రోవఁగదవన్న (ప్రోవన్ + కదవు + అన్న = ప్రోవఁగదవన్న) ఇది "కదవు" పూర్వమునఁగల "అన్న" అనునది అనుప్రయుక్తమగుట కుదాహరణము.

ఉదాహరణములు వరుసగా అన్న, అయ్య, అమ్మ, ఎ, ఏ, లకుఁ జూపఁబడెను, "సుకీర్తిమై మనఁగదన్న" మున్నగునవి ప్రయోగములుగాఁ జూపఁబడెను.

సూ. ప్రార్థనాదులం దన్ప్రత్యయాంత క్రియలమీఁది యిమ్మన కీకారంబు విభాష నగు. ౧౦

ఉ॥ సీ. ఓర్పుమై నుప్పిండి యుపవాసముండనీ మగనాలి సరిఁ బోల్పఁదగదు విధవ. (ఉప్పిండి=ఉప్పిండిగ) కాశి.౨ ఆ ౮౩ ప. మ. మునిధర్మంబులకెల్ల దవ్వని జనంబుల్ నవ్వినన్ నవ్వనీ. కళా. 3 ఆ.౨౮. స్రగ్ధర. కననీ గొడ్రాలు బిడ్డన్ గగనకుసుమముం గల్గనీ జాయి మాటల్ విననీ ముక్తుండు వెండిన్ విపులఁ బొడమనీ. పాండు. 3 ఆ.౧౨౮ ప. మొ

ప్రార్థనాద్యర్థంబులందు అన్నంత క్రియకు ఇచ్చుధాతు వనుప్రయుక్త మగుచుండును. అట్టిచో నిచ్చుధాతు మధ్యమ పురుషైకవచనాంతరూపమగు "ఇమ్ము" అనుదానికి "ఈ" అనునది ఆదేశముగా వచ్చునని భావము.

ఉదా॥ ఓర్పుమై ... ... । ఉండన్ + ఇమ్ము. ఉండన్ + ఈ = ఉండనీ.

మునిధర్మంబుల ... ... । నవ్వన్ + ఇమ్ము నవ్వన్ + ఈ = నవ్వనీ. ఇట్లే కననీ, కల్గనీ, విననీ, పొడమనీ, అనునవియుఁ దెలియవలయును. ప్రార్థనార్థమున నిచ్చు ధాత్వను ప్రయోగముకూడఁ గలదని యీ ప్రసంగముచేతనే జ్ఞాపితమగుచున్నది.

సూ. ఒకానొకచో రండు పొండు లకు రా పొం డనియు రూపంబు గానంబడియెడి. ౧౧

ఉ॥ క. నిండుదలంపునఁ దగ రా పొం డను గౌరవములేని పౌర పొచ్చెమునం గొండంత పసిడియిచ్చిన నుండంగాఁజనునె వారియొద్దను దంత్రీ. య 3 ఆ. ౯౦ ప.

ఒక్కొకచో వచ్చు ధాతు మధ్యమపురుష బహువచనాంతరూపమగు "రండు" అనుదానికిని పోవు ధాతు మధ్యమపురుష బహువచనాంతరూపమగు "పొండు" అనుదానికిని అవ్యవహితముగా ప్రయోగమున్నపుడు "రాపొండు" అను ఆకారము వచ్చునని సూత్రార్థము.

ఉదా. నిండుదలంపున ... ... । ఇటు "రాపొండు" అనునది "రండు పొండు" అనుపద ద్వయమునకు బదులుగాఁ బ్రయోగింపఁబడెను.

సూ కొన్ని యెడల భావార్థకరూపము నుశబ్దపరకంబులు యానంతర్యార్థకం బయ్యెడి. ౧౨

అనుటయు లుబ్ధకుం డిట్లనియె. భార. అర. ౫ ఆ. 3౨ మొ.

కొన్ని స్థలములందు భావార్థకరూపము ను అను శబ్దము పరమందు గలదయి 'తర్వాత' అనునర్థము నిచ్చును.

అనుటయు ... ... । ఇటు "అనుట" అనుపదము భావార్థక టువర్ణకాంతము. దీనిమీద 'ను' శబ్దను చేరెను. ఆ నుశబ్దము కళయగు ననుదంత శబ్దమునకుఁ బరమగుటచే యువర్ణపూర్వకముగా వచ్చెను. అనుటయున్ అని యయ్యెను. అనినపిమ్మట అని యిచట నానంతర్యము బోధితమగుచున్నది.

బాలవ్యాకరణమున "నానంతర్యంబున డువర్ణకంబు ద్రుతాంతంబగు" నని డువర్ణకము మాత్రము విధింపఁబడెను. అదియేకాక అనంతర్యార్థమున మఱియొకరీతి శబ్దముగూడఁ గలదని యిటుఁ జెప్పఁబడెను.

సూత్రమునను శబ్దపరకమగు భావార్థకరూపమునకంతకును నానంతర్యార్థకత్వము విధింపఁబడెను. ఇట్లు చెప్పుటచే 'అనుటయు' అనుదానికంతకును 'తర్వాత' అనిమాత్రమే యర్థముచెప్పినట్లగును. కాని అనినతరువాత ననియ్యే దాని యర్థము. ధాత్వర్థము నశింపదుగదా. ఇట్టి ప్రమాదములేకుండ బాలవ్యాకర్త ద్రుతాంతమగు డువర్ణకమునకు మాత్రమే యానంతర్యార్థకత్వమును జాగ్రత్తగా విధించెను. ధాత్వర్థమునకు భంగమురాకుండ ప్రత్యయమునకు మాత్ర మానంతర్యార్థమును జెప్పుటచే ''తోతెంచుడున్'' అనుచోట తోతెంచిన తరువాత నని యర్థమువచ్చుచున్నది. ఇచ్చట అట్లుగాక ''అనుటయున్'' అను దానికే అనంతర్య మర్థమనుట సరిపడదు. కావున నిట నుశబ్దము నానంతర్యార్థమున విధించుట యుచితము.

సూ. భావంబునం దనుప్రయుక్తంబగు కొనుటకుం గోలు విభాష నగు. ౧౩

ఉ॥ ఇచ్చుకోలు, పుచ్చుకోలు మొ పక్షమున ఇచ్చుకొనుట, పుచ్చుకొనుట మొ.

భావార్థమునందు ధాతువుమీద ననుప్రయుక్తమగు కొను ధాతువు టువర్ణకాంతరూపమునకుఁ 'గోలు' అనునది వికల్పముగా నాదేశమగును.

ఉదా. ఇచ్చుకొనుట అనుచో కొనుట అనుదానికి కోలు అని యాదేశమురాఁగా 'ఇచ్చుకోలు' అని యయ్యెను.

క్రియాఫలంబు కర్తృగామియగుచో కొనుధాతు వనుప్రయుక్తంబగు నను (బాల. క్రి. ౨౬) సూత్రముచే నిచ్చుధాతువునకు కొను అనుప్రయుక్తమయ్యెను. దీని భావార్థకరూపము ఇచ్చుకొనుట అనునది ఇందలి కొనుట అను భాగమునకు 'కోలు' అని యాదేశమురాఁగా 'ఇచ్చుకోలు' 'పుచ్చుకోలు' అయ్యెను. ఈ యాదేశము వైభాషికము కావున రానిపక్షమున నిచ్చుకొనుట పుచ్చుకొనుట అనియు నుండును.

బాలవ్యాకరణమున టువర్ణకమును క్రియాపరిచ్ఛేదముననే విధించెను. దానిననుసరించి టువర్ణకమునకు సంబంధించిన విషయము నీతఁడును కృదంత పరిచ్ఛేదమునం జెప్పక క్రియాపరిచ్ఛేదముననే చెప్పెనని తెలియవలయును.

సూ కొఱకు కంటె పొంటెలు పరంబులగునప్పుడు భావార్థక టువర్ణకంబునకు లోపంబు విభాషనగు. ౧౪

ఉ॥ క. దానిఁ జూపుకొఱకునె కాదె యీయయ్యఁ బట్టి తెచ్చుట కళా. ౩ ఆ. ౧౬౦. తే. భూమి పాలించుకొఱకునై పుట్టినాఁడ. వి. పు ౧ ఆ. క. పతి కలుగుకంటె సౌఖ్యము సతులకు నొండొకటి కలదె చర్చింపంగా, బతిలేమి సర్వశూన్యము పతిగలిగిన సతికి నింద్రపద వదియేలా! వి.క. ౬ ఆ. ౧౧౭ ప. క. ఏ పగిదిని బ్రతుకరాదె యిటు చెడుకంటెన్. హరి. పూ ౭ ఆ. అనృత విక్రమముం బ్రకటించుకంటె. నిర్వ. ౭ ఆ ౨౧ ప. ఎ గీ. అఖిలతృణలతాతరునిచయంబుఁ జీడపట్టె నిట్టలంబుగ జడిపట్టు పొంటె. హరి. పూ ౭ ఆ. ౧౬౦ ప. మొ॥ పక్షమున చూపుటకొఱకు, కలుగుటకంటె, పట్టుటపొంటె. మొ॥

భావార్థక టువర్ణకాంతము సుప్పులు చేరఁదగిన ప్రాతిపదికము. ఇట్టిచోఁ గొఱకు, కంటె, పొంటె, అను చతుర్థీవిభక్తిప్రత్యయములు పరమగునపుడు పూర్వశబ్దమునందలి టువర్ణకము వికల్పముగా లోపించును.

దాని... ...। చూపుటకొఱకున్ అనియుండగా టువర్ణకము లోపించి చూపుకొఱకు ననియయ్యెను. చూపుటకొఱకు ననియునుండును. ఇట్లే పాలించుకొఱకున్ అనునదియు కలుగుకంటె, చెడుకంటె, ప్రకటించుకంటె అనునవి కంటె వర్ణకము పరమగునపుడు టువర్ణకలోపమున కుదాహృతులు. జడిపట్టు పొంటె. ఇట పట్టు పొంటె అనునది పొంటె ప్రత్యయము పరమగునపుడు టువర్ణకలోపమున కుదాహరణము.

**సూ. ఒకొక్కచో భూతార్థకాసమాపకక్రియ హేత్వర్థకంబు నగు. ౧౪**

ఉ॥ రాహు కంఠము దెగి దేహము ధరణిఁ బడియె. భార. ఆది ౨ ఆ. ౧౫ ప. బిట్టడలు మనంబునం గదిరి హా యనువారును. భార. విరా. ౭ ఆ. ౪ ప. ఏ డ్డెఱ వ్రేసిన మోముదాకి తిరిగె గనుడి. నిర్వ. ౩ ఆ. ౨౭ ప. అడియఁడున్ మేనుచ్చి హా లక్ష్మణా యంచుం గూలె. రా. అర. కాం. ౨ ఆ. ౪౫ ప. సీ. పొరలెత్తి ఘనసారతరువులఁ దనుదాన దొరఁగిన పచ్చకప్పురపు రజము. స్వా. ౨ ఆ. ౪౪ మొ॥

భూతార్థకాసమాపకక్రియ యనగా క్త్వార్థకమగు క్రియ. తెగి. లా॥ మున్నగునవి. ఒకొక్కచో భూతార్థమున వచ్చిన యికారముగల ధాతువునకు

హేత్వర్థంబును నుండునని యర్థము. అనగా ఇకారము భూతార్థముననేకాక కొన్నియెడల హేత్వర్థముననును వచ్చునని భావము.

సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగునని బాలవ్యాకర్త సమానాశ్రయములలో బూర్వకాలికమునకు మాత్రమే యివర్ణము విధించెను. అట్టివానికేకాక హేత్వర్థముననును గొన్ని క్రియలకు ఇవర్ణము వచ్చునని యీ సూత్రము చెప్పుచున్నది.

రాహు కంఠము ... ...। ఇట 'తెగి' అనునది క్త్వార్థకక్రియ. దీని కిచట తెగుటచేతనని యర్థము. రాహు కంఠము తెగుటచేత దేహము ధరణిం బడియెనని యన్వయము. దేహముపడుటకు కంఠముతెగుట హేతువు కావునఁ "దెగు" అను ధాతువునకు ఇవర్ణము వచ్చెను.

ఇట్లే "బిట్టడలు మనంబునం గదిరి... ...। అడలు గదురుటచే హాయను చున్నారు. హాయనుట, కడలు గదురుట హేతువయ్యెను. కావునఁ "గదురు" అను ధాతువునకు ఇవర్ణము వచ్చెను.

ఇట్లే తాకుటచే గరుడి తిరిగెను. మేను ఉచ్చుటచేఁ గూలెను. పౌర లెత్తుటచేఁ దొరఁగెను. అని హేత్వర్థము భాసించుచుండుటచేఁ గదిరి, తాకి, ఉచ్చి, ఎత్తి, అని ఇవర్ణాంతములుగాఁ గ్రియలు ప్రయోగింపఁబడెను.

"తెగి" అనుచోట బాలవ్యాకరణముచేత నివర్ణము వచ్చుట కవకాశము లేదు. బాలవ్యాకరణమున రెండుక్రియలు ఏకాశ్రయమునందున్నపుడే పూర్వ కాలక్రియ కికారమువచ్చునని చెప్పఁబడియె. (చూ. బాల. క్రియ. ౩౫ సూ.) ఇటఁ దెగు పడు అను క్రియలు సమానాశ్రయములుకావు. కంఠమునందుఁ దెగుటయు దేహమునందుఁ బడుటయుఁ గలవు. ఆ కారణముచేఁ దెగు ధాతువున కివర్ణమురాకయుండగా నీ సూత్రముచే హేత్వర్థమున విధింపఁబడెను. ఇట్లే కదురుటయు హాయనుటయు సమానాశ్రయములుకావు. కదురుట అడలు నందును హాయనుట వారు అనుదానిచే బోధింపఁబడు కీచకులయందును గలదు. తాకుట వీడ్తెఱయందును తిరుగుట గరుడియందును గలవు. ఉచ్చుట బాణము నందును కూలుట యేణంబునందును గలవు. ఎత్తుట పౌరలయందును దొరఁ గుట రజంబునందునుం గలవు. ఇట్లు సమానాశ్రయములు కానందున నీవిధి యావశ్యకమయ్యెను.

గా॥ కవిత్రయేతర ప్రయోగంబులం గొన్నియెడల నిప్రత్యయాదులు పరంబు లగునపుడు పకారం బించుక్చకారంబునకేనిఁ గానఁబడును. ౧౬

ఉ॥ క. ఎవ్వారిని బోరించని క్షణమొక్కటియుఁ దరింపఁగ వమే. కళా. ౨ ఆ. ౪ ప. క ఊహించ నొక నాల్గుగడియల సంచారము గలయు. కళా ౩ ఆ ౫౭. అపి శబ్దార్థముచే "అంగన భీతులకెల్ల భీతి దుర్చుము వెసఁబొమ్ము నమ్ము మనుచుం గదలెన్. కళా. ౬ ఆ ౧౪ మొ॥

వ్యతిరేకార్థక నిప్రత్యయము మున్నగునవి పరమగునపుడు ఇంచుగాగమచకారమునకైనను పకారమురాకుండుట గలదు. కాని యిట్టిది కవిత్రయము వారియందులేదు అనగా కవిత్రయమువారు పకారముచేసియే ప్రయోగించిరనియు తదితరులు కొందరు పకారముచేయకయుఁ బ్రయోగించిరని యభిప్రాయము.

ఇుగాగమ చకారమునకు పకారముచేయకుండుట గలదనియు నట్లే యించుగాగమ చకారమునకును పకారాదేశము రాకుండుట గలదనియు సూచించుటకై "యించుక్చకారంబునకేని" అని చెప్పఁబడియెను.

బాలవ్యాకరణమున ధాత్వంత చకారమునకు పకారాదేశము కొన్ని సూత్రములచే (క్రియ. ౨౭, ౨౨, ౯౦. సూ.) విధింపఁబడెను. ధాతువునందు సహజముగానుండు చకారము కొన్నియెడల వకారమగుటయు (పిలువడు) కొన్నియెడల (క్రియ. ౨౯ సూ.) వకారముగా గాని పకారముగా గాని మాఱక నిజరూపముతోడనే (పిఁచక, నోఁచక.) యుండిపోవుటయు గలదని యందుఁ జెప్పబడినను ఆగమచకారమునకుమాత్రము క్త్వపరంబగునపుడు పకారము రాకుండుట యెచటను జూపఁబడలేదు. అందుచే నాగమ చకారమునకుఁగూడ పకారమురాకుండుట గలదని విశేషమిచుట చూఱుపుటకీ సూత్రము రచింపఁబడెను.

ఎవ్వారిని......। పోరించని అనునది వ్యతిరేక క్త్వార్థకార్థక నిక్రి ప్రత్యయాంతము. క్త్వపరమగుటచే "చ"కారము "ప"కారము కావలసియున్నను కాలేదు. చకారము ప్రాసస్థలమున నుండుటచే ప్రమాదపతితమను కొని మార్చుటకు వలనుపడదు.

ఊహించ... ...। ఇట ఊహించన్ అనునది నుజ్యంతము. చకారము ప్రాసస్థలముననే యున్నది.

ఇంచు కృకారమునకేకాక చుగాగమ చకారమునకును ఉదాహరణము చూపుచున్నాడు.

అంగనభీతుల . . । తీఱుచు అనునది చుగాగమాంతము. ఇది యతి స్థలము ఇట చకారము పకారమే యన్నచో యతి భంగముకలుగును. కావున పకారము రాలేదని నిశ్చయము.

సూ పకారంబు కొన్నియెడల శత్రర్థపరక చువర్ణంబునకుం గానం బడెడి. ౧౭

ఉ॥ మోవిమోవి జేరుపుచుచు. కళా. ౭ ఆ. ౧౬౨. గర్జింపుచు. జై. ౨ ఆ. ౮౬౫. మొ॥

శత్రర్థమునవచ్చు చువర్ణకము పరమగునపుడును గొన్నియెడల క్రియల యందున్న చువర్ణమునందలి చకారమునకు పకారమువచ్చుట కానవచ్చు చున్నదని యర్థము.

బాలవ్యాకరణమునుబట్టి చకారము పకారము కావలయునన్నచో ముత్తు పరముగా నుండవలయును లేదా ప్రేరణేంచుక్కు పరముగానైన నుండవల యును. లేదా దుగాగమయినం బహుముగా నుండవలయును. ఈ నిమిత్తములు లేనిచో చకారము పకారముగా మాఱదు. ఈ నిమిత్తములు లేకున్నను చకా రము పకారమగుచున్నదని యీ సూత్రము చెప్పుచున్నది.

మోవిమోవి... . ఇట చేరుపుచును (చేరుచు + చున్) అనుచోట చేరు అను ధాతువునకు ప్రేరణార్థక చుగాగమముచేరగా చేరుచు అని యయ్యెను. దానికి శత్రర్థమున చువర్ణముచేరినది. ఇపుడు బాలవ్యాకరణముచే చకారమునకు పకారమురాదు ఈ సూత్రముచే శత్రర్థపరక చువర్ణమగుటచే పకారమువచ్చెను.

గర్జింపుచు. ఇదియు శత్రర్థపరక చువర్ణమునందలి చకారమునకు పకా రమువచ్చిన స్థలమే. పూర్వోదాహరణమున చుగాగమ చకారము ఆచ్ఛికస్థము. ఈ యుదాహరణమున నిచ్ చుగాగమ చకారము తత్సమపదస్థము. ఇదియే విశేషము.

సూత్రమున చువర్ణంబునకు పకారంబు విధింపఁబడినను చువర్ణము నందలి చకారమునకు పకారము గానంబడియెడినని యర్థము పరిచేసికొన వలయును.

**సూ. అన్నంత క్రియచేయు యోగంబునఁ బ్రేరణార్థకంబగు. ౧౮**

ఉ॥ "చొక్కుచుఁ జొక్కఁజేయుచు." కళా. ౭ ఆ. ౧౫౭.

ఉ. కేశవు డవ్విరాట్తనువుఁ గృష్ణసమాఖ్య వహింపఁజేసెనో. కళా.౮ ఆ ౧౧ మొ॥

(చొక్కఁజేయు=చొక్కించు. ఇట్లంతట నెఱుంగునది.)

అన్నంతక్రియ = అన్ అనునది అంతమునఁగల క్రియ. అనగా నుజీ ప్రత్యయాంతక్రియ. చేయు యోగంబునన్ = చేయు అను ధాతువు అను ప్రయుక్తమగునపుడు

అన్నంత క్రియకు చేయు ధాతువు అను ప్రయోగముం బొందినపుడు అన్నంత క్రియయొక్క అర్థము ప్రేరణార్థముగలదై యుండును.

"చొక్కుచుఁ జొక్కఁజేయుచున్" చొక్కన్ + చేయుచున్ = చొక్కఁ జేయుచున్ చొక్కించుచున్ అనియర్థము.

కేశవు డవ్విరాట్తనువు ... ...। వహింపన్ + చేసెన్ = వహింపఁజేసెన్. వహింపించెనని యర్థము.

చొక్కన్, వహింపన్, అను అన్నంత ధాతువులకు చేయు ధాతువను ప్రయుక్తమగుటచే ప్రేరణార్థము వచ్చెను.

ధాతువునకించు గాద్యాగమములు ప్రేరణార్థమున బాలవ్యాకరణమున విధింపఁబడెను. అట్టి ప్రేరణార్థము చేయు ధాతుయోగమునను వచ్చుచుండుటం జేసి యిట విధింపఁబడెను.

**సూ. వ్యాపారోన్ముఖత్వంబున నన్నంత క్రియలకుఁ బూను ధాతు వనుప్రయుక్తంబగు. ౧౯**

ఉ॥ "సీ. పయిం బరాపరిక చెప్పెడమిఁ బాకముతప్పి పరడఁ బూజిన పాల కొండఁ బాజె." స్కా.౩ ఆ.౧౫౪, మొ॥

ధాత్వర్థమగు వ్యాపారము జరుగుటకు సంసిద్ధమగుచుండుట తోచునేని అన్నంతక్రియకు "పాఱు" ధాతువను ప్రయుక్తంబగును.

పయింబరామరిక... ...। పండన్ + పాఱిన = పండఁబాఱిన. ఇట పండుటకు సంసిద్ధమయిన అనియర్థము. పండన్ అను అన్నంత క్రియకు పాఱిన అనునది చేర్పఁబడెను. ఇట్లే ఎండన్ + పాఱెను = ఎండఁబాఱెను. ఎండుటకు సిద్ధమయ్యెను (పండఁబాఱెను = పండుట కారంభించెను. ఎండఁబాఱెను = ఎండుటకారంభించెను. అని భావము.)

**సూ. తిగుచు ధాతువు నన్నంతరూపములు తివ్వఁదివ ననియు. ౨౦**

ఉ॥ "క. ఎవ్వరికిని మోపెట్టను దివ్వనశక్యంబుగాని దృఢకార్ముకమున్." భార, ఆది ౭ ఆ. ౨౯. "కొప్పువట్టి తివంబోవ." కళా. 3 ఆ. ౧౨౭.

తిగుచు ధాతువునకు నుఙీ పరంబగునపుడు "ఆగమాన్య చకారంబులక ద్విరుక్తంబులకు ముత్తుపరంబగునపుడు పవలగు" నను సూత్రముచే చకారమునకు వకారమువచ్చి "తిగువన్" అని యగుచుండగా తివ్వన్ తివన్ అనియు రూపంబులగునని సూత్ర తాత్పర్యము.

"ఉ. ఎవ్వరికిని... ..." తివ్వను = తిగువను (తివ్వనుశక్యంబుగాని అనగా తిగుచుటకు శక్యంబుగాని యని యర్థము) ఇది తివ్వన్ అనుటకు ఉదాహరణము. ప్రాసస్థలమున "వ్వ" ఉండుటచే మార్పశక్యముగాదు.

"కొప్పువట్టి తివంబోవ" తివంబోవన్. కొప్పువట్టి తిగువబోవగానని యన్వయము. ఇది "తివన్" అనుట కుదాహరణము.

తివ్వన్ అని యొక్కరూపమునుమాత్రము విధించినంజాలును. అక్కటాదులలోఁజేర్చి జడ్డకులోపంబుచేయగా "తివన్" అనునది సిద్ధించును. కాని తివన్ అనుదానికొఱకు సూత్రమెట్లును అవశ్యకము కావున బాలవ్యాకరణ సూత్రాపేక్ష యక్కఱలేకుండ సిద్ధించుటకై ప్రక్రియాలాఘవము నపేక్షించి యిందే "తివన్" అనియు విధింపఁబడెను.

**సూ. కంఠె వర్ణకంబు పరంబగునపుడు విశేషణ నవర్ణకంబుమీఁది యమహత్తచ్ఛబ్దార్థమునకు లోపంబు విభాషనగు. ౨౧**

ఉ॥ "క. లోకత్రయరాజ్యము మును నిరమిత్రముగాఁ గనిన కంటె. లక్ష్మీ.3 ఆ. ౧౩౮. విభుని పంచినకంటె. హరి. ఉ. ౪ ఆ. తే. శరణుజొచ్చిన రక్షింపఁ జాలియుండి మనుపకుండిన కంటె కల్మషముకలదె. విక్ర.3 ఆ.౯౩. కుడిచినకంటెను క్షేత్రము పడసిన తెఱ వధికమంద్రు పాడికిఁ జనుచోన్. విజ్ఞా. వ్య. ౪౮. పక్షమున కనినదాని కంటె. మొ॥

విశేషణ నవర్ణకంబనగా "ఉన్న కలజీ నవర్ణ ... (బాల. క్రియ. సూ ) అను సూత్రముచే విధింపఁబడిన నవర్ణకము. ఈ నవర్ణకముచేరిన పదము ధాతుజవిశేషణ మనఁబడును. (చూ. బాల క్రియ. ౪౭ సూ.) కావున దీనిని విశేషణ నవర్ణకమనియెను.

అమహత్తచ్ఛబ్దార్థము = అదిశబ్దము (దానిన్ మున్నగునవియున్ను)

కంటె అను చతుర్థీ విభక్తి ప్రత్యయము పరమగునపుడు నవర్ణకాంతమగు క్రియాజన్యవిశేషణముమీఁద నుండెడి "యది" శబ్దమునకు లోపము వికల్పముగా వచ్చును.

ధాతుజవిశేషణములమీఁద విభక్తిప్రత్యయము వివక్షించునపుడు తచ్ఛబ్దమనుప్రయుక్తమగును. (చూ. బాల సమా. ౯ సూ.) అట్టి తచ్ఛబ్దము (అమహద్వాచకమయినచో) కంటె వర్ణకము పరంబగునపుడు లోపించునని సూత్రతాత్పర్యము.

లోకత్రయ ... కనినకంటెన్. ఇట కనిన అను ధాతుజవిశేషణమునకు కంటెన్ అను చతుర్థీవిభక్తి వివక్షితముకాఁగా తచ్ఛబ్ద మనుప్రయుక్తమయి కనినదానికంటెన్ అని యగును ఈ సూత్రముచే దాని అను తచ్ఛబ్దరూపము లోపించుటచే కనిన కంటెన్ అని యయ్యెను. లోపము వైకల్పికము కావున కనిన దానికంటెన్ అనియు నుండును.

పంచినదానికంటెన్. తచ్ఛబ్దార్థలోపమురాఁగా. పంచినకంటెన్ మనుపకుండినదానికంటెన్. తచ్ఛబ్దార్థలోపము. మనుపకుండిన కంటెన్. కుడిచినదానికంటెన్. తచ్ఛబ్దార్థకలోపము. కుడిచినకంటెన్.

కేవల ధాతుజవిశేషణముమీఁద కంటెవర్ణకము చేరుటకు బాలవ్యాకరణమునుబట్టి యవకాశములేదు. అందుచే తచ్ఛబ్దము లోపించెనని చెప్పవలసి వచ్చెను.

౯౭

పరిశీలింపఁగా నిచ్చట సవర్ణకాంతము విశేషణమనుట యుచితముగాదు. విశేషణమయినచో దీనిచే విశేషింపఁబడు విశేష్యము కానరాదు. వచ్చిన వాఁడు, వచ్చినది, మున్నగుచోట్ల నప్రయుక్తమగు తచ్ఛబ్దమునకు అర్థవిశేషము లేదు. వచ్చిన అను విశేషణార్థమే బోధింపఁబడుచుండును. ఏదేని విశేష్యము లేనిచో విశేషణము అధ్యాహృతమయిన "వస్తువు" అను విశేష్యముతోఁగాని అనుప్రయుక్తమగు తచ్ఛబ్దమున కర్థమగు వస్తువుతోఁగాని యన్వయింపక తప్పదు. ఇచ్చట నట్టి విశేష్యమెద్దియుఁ గుదురుపడదు. "శరణు... గలదె" ఇటు మనుపకుండినదానికంటె వేఱయిన కల్మషము కలదా! అనిగదా యర్థము. ఇచట మనుపకుండినది యెవరు? అట్టి దేనికంటె వేఱగు కల్మషము లేదు. కావున నిట "మనుపకుండుట" అని యర్థము చెప్పుట యుచితము. ఇచ్చట నట్లే భాసించుచును నున్నది మనుపకుండుటకంటె వేఱగు కల్మషము లేదు. అనగా మనుపకుండుట మహాకల్మషము అని యర్థము వచ్చుచున్నది. కావున కంటె వర్ణకము పరంబగునపుడు నవర్ణకము భావార్థకంబగునని సూత్రించినచో భాసించుచున్న యర్థమున కనురూపముగా నుండును. అపుడు నిరమిత్రముగా కనుటకంటె, విభుని పంచుటకంటె, మనుపకుండుటకంటె, కుడుచుటకంటె అని క్రమముగా నర్థము వచ్చును.

సూ. క్రియావిధేయ విశేషణంబులఁ బూర్వ మేది యగు ధాతువున కన్నంతమునకు లోపంబు విభాష నగు. ౨౨

ఉ॥ క్రియా విశేషణములకు :— పెల్లుడోరఁగు నెత్తురునై. భార. భీష్మ. ౧ ఆ ౨౭౦ "క. సౌందర్యవిలాసాదులయందున తగులువడి యితరమురయని మగవారుం దలఁచు గలర." కళా. ౭ ఆ. ౯౪. క. తెల్లము నా కెఱిగింపుము. వి.పు. ౨౮.

విధేయవిశేషణములకు :— "క. లవణంబు కప్పు మడుగుము. శు. హరి. ౪ ఆ ౧౫౪. తగు వస్తువు లప్పన మంపువారు. కళా. ౭ ఆ. ౪౫. వరుని ప్రేమ నడువఁ దెరువాటుగొట్టె. కళా. ౭ ఆ. ౨౩౯. "చ. భవజ్జనకుఁ బరీక్షితున్ భుజగజాల్మ్ముఁ డపవ్యావిషోగ్రధూమకేతన హాళిఁ జేసి చేసె నతిదాంతుఁ గృతాంత నికేతనాతిథిన్. భార. ఆది. ౧

ఆ.౧.౨౮. పక్షమున పెల్లుగఁ దొరఁగు కప్పముగ నడుగుము. కృతాంత నికేతనాతిథిఁగ. మొ॥ మంత్రులగా నొనరించితె. భార. సభా. ౧ అ. ౨౬ ప. మొ॥

ఆగుధాతువు నన్నంతరూపములు కన్, కాన్, అనునవి. ఇయ్యవి క్రియా విశేషణములమీఁదను విధేయ విశేషణములమీఁదను అనుప్రయుక్తములగు చుండును. అట్టివానికి లోపము విభాషనగునని భావము.

కన్, కాన్, అనునవి బాల. క్రియ ౧౧౩ సూ॥చే విశేషణముల కను ప్రయుక్తములగును. అట్టివానికి వైకల్పిక లోపము నీ సూత్రము విధించుచున్నది.

పెల్లుగా దొరఁగు అనుటకుబదులు పెలుదొరఁగు అని ప్రయోగింపఁ బడెను. పెల్లు అనునది తొరఁగు అను క్రియలోనికి విశేషణము. దీనిమీఁది కాన్ అనునది లోపించెను.

"తఱచుగలరు" ఇట తఱచు అనునది కలరు అను క్రియలోనికి విశేషణము. దీనిమీది "కాన్" లోపించెను. తఱచుగాఁగలరు అని యర్థము. ఇట్లే తెల్లముగాననుచోటను "కాన్" లోపించెను. ఇవిమూఁడును క్రియావిశేషణ స్థలములు.

లవణంబుకప్పము...... ఇందు కప్పము విధేయము, విశేషణము. దీనిపైనుండెడి "కాన్" అనునది లోపించెను. లవణము కప్పముగా నడుగుమని యర్థము.

ఇట్లే తగువస్తువు లప్పనముగా నంపువారు, వరుస్ప్రేమ తెరువాటుగాఁ గొట్టెన్, పరీక్షితున్ కృతాంత నికేతనాతిథిఁగాన్ జేసెన్. అని యన్వయము. ఈ విధేయవిశేషణములమీఁది "కాన్" లోపించెను.

ఈలోపము వైభాషికము కావున రానిపక్షమున కుదాహరణముగా "మంత్రులఁగా నొనరించితె" అని చూపఁబడెను. మంత్రులఁగాన్ అనుచోట "కాన్" లోపింపలేదు.

బాలవ్యాకరణమునఁ గ్రియావిశేషణములకుఁ "గాన్" అనుదానిని నిత్యముగా ననుప్రయుక్తమగునని విధించెను. (చూ. బాల. క్రియ. ౧౧౩ సూ.) కాని కొన్నిచోట్లనది కానరాకుండుటచే దానికి లోపము నీ సూత్రముచే ప్రౌఢ వ్యాకర్త విధించెను.

బాలవ్యాకరణమునఁ గ్రియావిశేషణములకు మాత్రమే అన్నంతమగు నగు ధాతువున కనుప్రయోగము విధింపఁబడెను కాని విధేయ విశేషణములుకూడఁ గ్రియలోనికే యన్వయించును గావున నవియుఁ గ్రియావిశేషణములే యగు టంజేసి కాన్ అనున దనుప్రయుక్తమగుచున్నది ఇట్లు నిత్యముగా "కాన్" ఈ స్థలమందు వచ్చుటచేత నియ్యది కానరాని స్థలములందు సాధుత్వము సిద్ధించుటకై యీలోపము విధింపవలసివచ్చెను.

ఆలోచింపఁగా విధేయవిశేషణములకు 'కాఁగా' అనుదాని యనుప్రయోగము నిత్యముకాదు. వీనికి బాలవ్యాకరణముచే ననుప్రయోగము విధింపఁబడలేదు. కాని భాషాస్వభావమునుబట్టి విధేయ విశేషణములు క్రియలోనికి కర్తలుగనో కర్మలుగనో యన్వయించును. అట్టిచో నన్వయింపఁదగిన క్రియ అగు ధాతువుకూడఁ గానవచ్చును. అట్టియగు ధాతువు అన్నంతముగాఁ బ్రయోగింపఁబడుట తఱచుగాఁ గానవచ్చుచున్నది. అవిధముగాఁ బ్రయోగదృష్టమగు కాఁగా అనుదానికే లోపము విహితమయ్యెను గాని బాలవ్యాకరణముచే విహితమగుచున్నదని భావింపఁదగదు.

**సూ. ఒకానొకచో నన్నంతమగు నగుధాతువు దీర్ఘంబునకు భావ్యర్థంబున నున్న పరంబగునపుడు హ్రస్వమును గానంబడీయెడి. ౨౩**

ఉ॥ తరుణీ యేరికిఁ జెల్లునె యరయఁగ నేమింతెవాఁగ మనుకొనని దిగో పిరువీఁకగ నున్నది తాఁగర మద్భుతమయిన సవతి కయ్యము చేతన్. కనున్నది=కానున్నది యని యర్థము. పిరువీఁకుకర్త. కళా.౧ ఆ. ౩౨ప. "నీకు నాథుఁడుగ నున్న మహామహు నా నృపాలు నాకెప్పుడు చూడగా గలుగు?" (నాథుఁడుగ నున్న=నాథుఁడు కానున్న యని యర్థము). కళా.౫ ఆ. ౭౨ ప. మొ॥

ఒకానొకచో "కాఁగా" అనుపదమునకు "ఉన్న" పరమయి భావ్యర్థము వచ్చునపుడు "కాఁగా" లోని దీర్ఘము హ్రస్వమగుటయుఁ గలదు.

బాలవ్యాకరణ మున "దానికి హ్రస్వంబు విభాష నగు" నన సూత్రముచే హ్రస్వము విధింపఁబడెను. కాని క్రియావిశేషణములకును, సమ్యగ్విశేషములకును అనుప్రయుక్తమగు కాఁగా అనుదానిని మాత్రమే యందుదాహరించుటచే

భావ్యర్థమున నున్న పరంబగునపుడు హ్రస్వమురాదను తలంపునఁ బ్రౌఢవ్యాకర్త యీ హ్రస్వమును విధించెను

ఉదా. తరుణీ ... పిరువీఁకుగనున్నది ...। ఇటఁ గనున్నది అనునది గానున్నది అనుదానికి హ్రస్వమువచ్చినరూపము. కాగలదని యిటు భావ్యర్థము వచ్చును. పిరువీఁకు (పీకులాట) కాఁగలదని యర్థము ఇట "కన్" అనునది క్రియావిశేషణమునకుఁగాని నుజ్యంతమునకుఁగాని అనుప్రయుక్తముకాదు పిరువీఁకు అనునది కర్తగాని విశేషణముకాదని తెలియఁజేయుటకే "పిరువీఁకు కర్త" అని సూచించెను.

"నీకు సాధుఁడుగనున్న" ఇట "కనున్న" అనుదానికిఁ "గాగల" యని యర్థము కానున్న అనియు రూపములు ఉండవచ్చును. ఇదియు భావ్యర్థకమే యగుటచే బాలవ్యాకరణసూత్రముచే హ్రస్వమురానందున విధింపఁబడెను.

సూ. శబ్దపల్లవక్రియలు కొన్ని ద్విరుక్తంబులగుచో నుత్తరపదంబు
పూర్వావయవమునకు లోపంబు విభాష నగు. ౨౪

ఉ॥ "చటుల ఖురోద్భటాశ్వ శ్రేణిఁబొంది విరయంబునఁ దునిమి తూఁటాడియాడి" భార. విరా. ౫ ఆ. ౫౬ ప. సీ. ఇందు రారావయ్యా విందులు విందులం చర్థిఁ బిల్వఁగ వడయాడి యాడి. హరి. పూ. ౫ ఆ. ౧౯౩ ప. "పోరాడియాడి చెన్నొందవెనేసి" హరి. పూ. ౭ ఆ. "వ. పరస్పర జయార్థులగుచు వాదడిచియడిచి. కాశీ. ౫ ఆ. ౧౯. "సీ. ఎడనెడను గవళ్ళఁ దడఁబడకుండంగ గుఱుకులు మదిఁ బాదుకొలిపి" కళా. ౪ ఆ. ౪౧. తదీయరూపమున్ మదిఁ దలపోసిపోసి. సగ. ౨ ఆ. మొ॥ పక్షమున తూటాడి తూటాడి మొ॥

ధాత్వాదులకు ధాతువు లనుప్రయుక్తమయి విలక్షణమగు నర్థమును జెప్పునేని శబ్దపల్లవము లనఁబడును. (చూ. బాల. క్రియ. ౧౧౪. సూ.)

శబ్దపల్లవములు ద్విరుక్తములగునపుడు ఉత్తరపదము (ఆమ్రేడితము) లోని పూర్వభాగమునకు లోపము వికల్పముగా వచ్చును.

"చటుల ... ... తూటాడియాడి" తూటాడి యనుశబ్దపల్లవము ద్విరుక్తమయ్యెను. అందు రెండవపదములోని మొదటిభాగమగు "తూటు" అనుదానికి

లోపమువచ్చెను. తూటాడి తూటాడి అనియుండగా రెండవపదమునందలి మొదటిభాగము తూటు అనునది లోపించి "తూటాడి యాడి" అనియయ్యెను.

ఇట్లే "నడయాడి నడయాడి" నడకులోపము నడయాడియాడి "పోరాడి పోరాడి" ఇట పోరునకులోపము పోరాడి యాడి "వాదడిచి వాదడిచి" ఇట "వాదు" లోపించి "వాదడిచి యడిచి" అయ్యెను పాదుకొలిపి పాదుకొలిపి. పాదు లోపింప పాదుకొలిపి కొలిపి "తలపోసి తలపోసి" తల అను ఆమ్రేడిత పూర్వభాగము లోపించి తలపోసిపోసి యయ్యెను ఈ లోపము వైభాషికము కావున దానిపక్షమున "తూటాడి తూటాడి" మున్నగురీతి నుండునని గ్రంథ కర్త వివరించెను.

ఈ శబ్దపల్లవములు ఒక్కపదముగా నేర్పడి యేకార్థమును ఇచ్చుచుండును ఆట్టి ఏకపదకల్పములయినవానికి పునరుక్తి రావలసినచో నంతకును రావలసియుండగా రెండవపదము కొంతభాగముమాత్రమే వినవచ్చుట సరిపడదని భావించి యీ సూత్రముచే లోపమును విధించెను.

సూ॥ శబ్దపల్లవక్రియలును ద్వ్యవయవక్రియలును సమాస్తంబులయి పునర్గృహీతంబు లగుచోఁ దత్పూర్వావయవములకు లోపంబు విభాష నగు. ౨౫

ఉ॥ "ఆ లతాంగిఁ దోడ్కొని చనుదెమ్ము తేననువుఁ గూడని పక్షమునందు. భోజ ౨ ఆ. ౨౪౯." ఇలకుం దివికిం దన నిచ్చి నిచ్చియే నని వెసనార్చు. రా. ఉర. ౨ ఆ. ౧౨౬. మొ॥ పక్షమున. చనుదే. చననిచ్చి. మొ॥

శబ్దపల్లవములు పూర్వసూత్రమున వివరింపఁబడెను. ద్వ్యవయవక్రియ లనఁగా రెండవయవములు ల క్రియలు. శబ్దపల్లవములు రెండుభాగములుకలిగి యున్నను ఆ రెండిటియర్థ మేకం బై విలక్షణమగు నర్థము సముదాయమున భాసించును. ద్వ్యవయవక్రియలయందు అట్లు విలక్షణార్థము భాసింపదు. రెండుక్రియలును వాని వాని యర్థములనె బోధించుచు పరస్పర మన్వితము లగుచుండును. ఇదియే వీనికి భేదము.

ఇట్టి ద్వివిధక్రియలును పూర్వవాక్యమున సమాప్తములయి తరువాతి వాక్యారంభమున మఱల గ్రహింపఁబడెనేని పునర్గృహీతములందుఁ బూర్వభాగ మునకు లోపము వికల్పముగా నగునని సూత్రార్థము.

అలతాంగి ... ... చనుదెమ్ము తేననువు ...। చనుదెమ్ము అని పూర్వ వాక్యము సమాప్తమయి తే ననువుగూడని యని మఱల గృహీతమయ్యెను. చను దెమ్ము అనునది శబ్దపల్లవము. ఇందలి రెండవపదమునందలి పూర్వభాగమగు చను అనుదానికి లోపమువచ్చి "తేన్" అనిమాత్రమే గృహీతమయ్యెను. ఇది అత్యంతాద్యర్థములందు ఏకవాక్యమున వచ్చిన ద్విరుక్తికాదు. ఇట వాక్యాంత రమున సందర్భానుగుణముగ పూర్వక్రియయే మఱల గ్రహింపఁబడెను. ఇందు ఉత్తరభాగము ద్విరుక్తమునందువలె పూర్వక్రియతో సమానరూపముతో నుండదు. అందుచే నిది పునరుక్తి యనఁదగదు. కనుకనే పూర్వసూత్రముచేత లోపమురాలేదు. మఱల విహితమయ్యెను.

ఇలకుం దివికిం జననిచ్చు నిచ్చి ... ...। చనన్ అను నుజ్యంతక్రియయు ఇచ్చున్ అను తద్ధర్మక్రియయు పరస్పరాన్వితములయి యిచ్చటనున్నవి. చన నిచ్చున్ = పోవుట కనుమతించును. అనియర్థము. చనన్ ఇచ్చున్ అను రెండవయవములు కూడుటచే ద్వ్యవయవక్రియయని వ్యవహరించెను. ఇట చన నిచ్చున్ అని పూర్వవాక్యమున సమాప్తమయి ఇచ్చి అని పునర్గృహీతమగు నపుడు చనన్ అను పూర్వావయవము లోపముంజెందెను. 'ఉక్తార్థానామ ప్రయోగః' అను న్యాయమునుబట్టి పూర్వావయవమునర్థము ప్రకరణమునుబట్టియే లభించుటచేత మఱల ప్రయోగము విడువఁబడెను. ఇట్టిన్యాయముచేతనే సిద్ధించుచుండగా నీలోపమునువిధించుట స్పష్టార్థము. ఈన్యాయ మనిత్యము కావున ప్రయోగించినను దోషముకాదు

సూత్రవిహితమగులోపము వైకల్పికమగుటచే చనుదేన్, చననిచ్చి, అనియు ప్రయోగింపవచ్చునని వివరించెను.

సూ॥ ఒకానొకచో సహార్థంబున యుష్మదస్మదర్థంబు లభిహితంబు లగునపుడు క్రియలు తత్కర్తృకంబులు ౘ భాష నగు. ౨౬

ఉ॥ "ఉ. విప్రకులుండ వెల్వడుము వేగమ నీవును నీ నిషాది యున్" భార. ఆది. ౨ ఆ. ౬౩. మన కార్యాదు సంజయుఁ డీతని యుప దేశంబు వట్టి ధర్మమున మునుంతుని నాశ్రయింపవయ్యా యటని

బొందిన బ్రదుకు దీవుఁ దమ్ములు సుతులున్. భార. ఉద్యో.౨ ఆ.౩౨౧. నేను నాసేనయు దాడిపెట్టెద విశృంఖలతన్. హరి. ఉ ౩ ఆ.౯౪. ఆ. ఎలుఁగు రాలుపడగ నిట్లను బదునాలుగేండ్లు రాఘవుండు నీవు న న్నరణ్యభూములందు రక్షించి నేఁడు కాఱడవి నెట్టులొంటి విడిచె దనిన. జై.౬ ఆ.౬౮. మొ॥ పక్షమున. మోహాంధుండు భీష్ముండుఁ గేశవ నీవుం గడగుండు. భార. సభా.౨ ఆ.౬౩. మొ॥

సహార్థంబునన్ = సహయను సంస్కృతపదముయొక్క అర్థమున (అనగా కూడన్ అనునర్థమువచ్చునపుడు). యుష్మదస్మదర్థములు = నీనాశబ్దములు. అభిహితంబులు = క్రియచేతఁ జెప్పఁబడునవి. తత్కర్తృకంబులు = నీనాశబ్దములు కర్తలుగా గలవి.

నీనాశబ్దంబులును సముచ్చయార్థము తోఁగూడి వేఱొక కర్తయుఁగూడ నున్నపుడు కర్తృప్రయోగముననున్న క్రియలు నీనాశబ్దములు కర్తలుగాఁగలవి వికల్పముగాననగును. అనగా వేఱొక కర్త యున్నను వానినిబట్టి క్రియకుఁ బ్రథమపురుష ప్రత్యయములురాక నీనాశబ్దములనుబట్టి మధ్యమోత్తమపురుష ప్రత్యయములే వచ్చుననిభావము.

"విప్రకులుండ .. నీవును నీ నిషాదియున్." ఇచ్చట నీవును నీ నిషాదియును అని యిద్దఱునుగూడ వెల్వడుము అనుక్రియలోనికి కర్తలుగా నన్వయించుచున్నారు. అయినను "నీ" శబ్దమునుబట్టియే క్రియకు మధ్యమపురుషము ఏకవచనమునువచ్చెను. (వెల్వడుము అనుక్రియచేత కర్త అభిహితమయ్యెను.) కనుక వెల్వడుము అనుక్రియకు "నీ" శబ్దమే కర్తయయ్యెనని తెలియవలయును. ఈకార్యము వైభాషికము కావున "నీవును నీ నిషాదియును వెల్వడుఁడు" అనియు నగును.

"మన కాప్తుఁడు ... బ్రదుకు దీవు దమ్ములు సుతులున్" ఇట క్రియ "బ్రదుకు" అనునది. ఈవు తమ్ములు సుతులునుకూడ అను సహార్థమునుగలదు బ్రదుకుడు అనుక్రియ కర్త్రర్థకమయియున్నది. కనుక ఈవు అనుకర్తనే యీక్రియ బోధించుచున్నది. అనగా "నీవు" అనుదానినిబట్టి క్రియకు మధ్యమపురుషైకవచనము వచ్చెను. తమ్ములు సుతులు అనువానినిబట్టి ప్రథమపురుషగాని బహువచనముగాని రాలేదు. పక్షాంతరమున బ్రదుకుడు రీవు తమ్ములు సుతులున్ అనియుం డును. ఈ రెండును నీ-శబ్దమున కుదాహరణములు.

నేను......దాడిపెట్టెద...। పెట్టెద అనుక్రియ నేను నాసేన అని రెండు కర్తలున్నను క్రియ కర్త్రర్థమున నుండుటచే నా శబ్దమునుబట్టియే పురుష వచనములం బొందెను. క్రియ తత్కర్తృకము కానపుడు పెట్టెదము అని యుండును.

“ఎలుఁగురాలుపడగ......విడిచెదనిన.”విడిచెదు అనుక్రియ రాఘవుండు నీవును కూడనని రెండుకర్తలున్నను క్రియకర్త్రర్థమునందుండుటచే “నీ” శబ్దము కర్త గాఁగలదయ్యెను. పక్షాంతరమున “నెట్టులొంటి విడిచెదర”నియుండును.

సహార్థమున్నను యుష్మదర్థకము కానరానందు కుదాహరణమును “మోహాంధుండు......గడఁగుండు” అనిచూపెను. ఇట “కడఁగుఁడు” అను క్రియ నీవు అనుదానినిబట్టి యేకవచనాంతముకాక నీవును భీష్ముండును అను రెండుకర్తలనుబట్టియె బహువచనాంతమయ్యెను. నీవు అనునది యొక్కటియె కర్తయగుచో “కడంగుము” అనియుండును. ఇట్లే అస్మచ్ఛబ్దస్థలమును నూహింపఁదగును.

సూత్రమున “సహార్థంబున” అనుపదము ఉచితముగాదు. సముచ్చయార్థంబున (చార్థంబున) ననుట తగును ఉదాహృతస్థలములందంతటను “ను” అను సముచ్చయార్థకశబ్దమేగలదు. “నీవును నీ నిషాదియున్” ఇటను శబ్దములు చార్థమునే బోధించును. ఇట్లే ఈవున్ను అనియు నాసేనయున్ నీవున్ అని యుంతటు చార్థకమేగలదు. రాఘవుండు నీవు నన్నచోట స్థిరపరకత్వమున నువర్ణములోపించె ననఁదగును. ఇట సహార్థమురాదు. సహార్థమే వచ్చెనేని సహార్థకముతోఁగూడిన యప్రధానమునకు తృతీయావిభక్తి రావలసియుండును. (రాముఁడు సీతతోడ వచ్చెను.)’ కరణసహార్థ తుల్యార్థయోగంబులం దృతీయకుఁ దోడవర్ణకంబగు’నను బాలవ్యాకరణసూత్ర మిందుకుఁ బ్రమాణము. సహార్థమే వచ్చెనేని క్రియతోడ నన్వయము ప్రధానకర్తకు మాత్రమే సంభవించును. అప్రధానము కర్తగాఁ గ్రియలోని కన్వయింపదు. అట్టిచో నీనాశబ్దములకు మాత్రమే క్రియలోని కర్తలుగా నన్వయమువచ్చునపుడు క్రియలకు తత్కర్తృకత్వము మఱల విధింపనక్కఱలేదు. వేఱొకకర్త లేనేలేదుగదా.

సహార్థము అనగా తోడ అనునది కాదనియు “కూడన్” అనునర్థమే గ్రంథకర్త కభీష్టమనియుఁ దలంపవలసియున్నది. “నీవును నీ నిషాదియుఁ గూడ వెళ్ళుడుము” అని యుచట “కూడ” నను నర్థమే భాసించుచున్నది. ఇదియే సహార్థమని భావింపవలయును. ఇట్టిచోట్ల కూడ ననునది సహార్థకముకాదు,

కూడుధాతువు నన్నంతరూపము. ఇట్లు భ్రమకలిగించు "సహార్థంబున" అను శబ్దమును బ్రయోగింపక "సముచ్చయార్థమునందు" అని నిస్సందేహముగా నుండునట్లు సూత్రరచనయుండుట బాగు.

పైని వివరించినరీతిని సముచ్చయార్థముతోఁగూడిన "నీ, నా" శబ్దము లభిహితంబులగునపుడు ఇతరకర్తలును బ్రథమాంతములుగనే యుండును. నీనా శబ్దములతోఁబాటు ఇతరములును క్రియలోనికిఁ గర్తలుగా నన్వయించుచునే యుండును "నీ, నా" శబ్దములుమాత్రమే క్రియలకు కర్తృవాచకములగుట యెన్నడును బొసఁగదు. కావున నితర కర్తృవాచకములున్నను "నీ, నా" శబ్దములనుబట్టిమాత్రమే క్రియలకుఁ బురుషవచనములు వచ్చునని సూత్ర తాత్పర్యముగా గ్రహింపవలయును.

కర్తృవాచకము లనేకములయినపుడు అయ్యవి వేర్వేరుగాఁ గాని అన్ని యుఁగలసి మొత్తముగాఁ గాని క్రియతో నన్వయింపవచ్చును. వేర్వేరుగా నన్వయించునన్నచో కర్తృవాచకము లేకవచనాంతములయినచోఁ గ్రియ యేక వచనముచేరును. అన్నియుఁగలసి మొత్తముగాఁ గ్రియతో నన్వయించుట వివక్షితమయ్యేనేని క్రియ బహువచనాంతమగును. కర్త్రన్వయవివక్ష ననుసరించి క్రియకు వచనమువచ్చును కనుకనే 'మహద్బహుకర్తృకక్రియ కేకవచనంబు విభాష నగు' (క్రియ. ౬ సూ.) నని యాతఁడు సూత్రించెను. ఈ యుదాహరణములందుఁ బ్రత్యేకాన్వయము వివక్షితమగుటచే నేకవచనము క్రియకు చేరెననియు బహుత్వము వివక్షితమయ్యేనేని "నీవును నీ నిషాదియున్ వెల్వడుఁడు" అని క్రియ బహువచనాంతముగా నుండుననియుఁ దెలిసికొనవచ్చును.

ప్రత్యేకాన్వయము వివక్షితమయినపుడు నీనాశబ్దములు ప్రయుక్తము లయినచో "నన్యయుష్మదస్మత్కార్యం బుత్తరోత్తరంబు బలీయంబు." (బాల. కార. ౩౬ సూ.) అనుసూత్రముచే నీనాశబ్దములనుబట్టియే క్రియకుఁ బురుష వచనములు వచ్చుచున్నవి. అందుచే నీసూత్ర మనావశ్యకము. అనగా ననేక కర్తృస్థలమున "నీ నా" శబ్దముల ప్రయోగముగూడ నున్నచో బాలవ్యాకరణానుసారముగా నీనాశబ్దముల ననుసరించియే క్రియలకు బురుషవచనములు వచ్చుచుండగా మరల నీ సూత్రమును రచించుట అనావశ్యకమని భావము.

అన్యయుష్మదస్మత్కార్యం బుత్తరోత్తరంబు బలీయంబు" అనుసూత్రము "నేనును మీరును ధన్యులరు." మున్నగు కేవల విశేషణములయందు మేలయిన [illegible] ఘార్థము మీరును వచ్చితిరి మున్నగు క్రియలయందు [illegible]

ఆ సూత్రము వర్తించును. కనుకనే యీ సూత్రము (క్రియ. ౨౬.) విధించిన యుష్మదస్మత్కర్తృకత్వము రానిపక్షమున "భీష్ముండు గేశవ నీవుం గడఁగుండు" అనుచోట భీష్ముండు అనుదానింబట్టి ప్రథమపురుష ప్రత్యయమురాక "నీవు" అను కర్తనుబట్టి మధ్యమపురుష ప్రత్యయమేవచ్చి "కడఁగుండు"అని యయ్యెను. ఈ స్థలమందు మధ్యమపురుష రావలయునన్నఁ బ్రకృత సూత్రము వర్తింపదు కావున "నన్యయుష్మ" దిత్యాదిసూత్రము నాశ్రయింపక తప్పదుగదా!

**సూ. కర్తృభూతక్రియతోడం దత్కర్త కన్వయం బగు. ౨౭**

ఉ॥ నీవు రావచ్చును. బోవచ్చును. మొ॥ ఇందు రాఁ బో నను కర్తృభూతక్రియలతో వానికిఁ గర్తయగు నీ వనుదాని కన్వయంబని యెఱుంగవలయును.

కర్తృభూతక్రియ=వేఱొకక్రియకుఁ గర్తయగుచున్న భావార్థక క్రియాశబ్దము. తత్కర్తకు=భావార్థకక్రియయొక్క కర్తకు.

ఒక క్రియకుఁ గర్తయగు భావార్థక క్రియావాచి పదముతో దాని కర్తకు అనగా భావార్థక క్రియయొక్క కర్తను జెప్పెడి శబ్దమునకు అన్వయము కలిగియుండును. అనగా బ్రథానమగు క్రియలోఁ గర్తయగుచున్న భావార్థక శబ్దముతో దాని కర్త కన్వయంబగును.

బాలవ్యాకరణమున "వలయ్వాది క్రియలకుం గర్తయగు భావంబునం దునుజియగు" (క్రియ. ౧౩౩ సూ.) నను సూత్రముచే భావార్థమునందు నుఙ్ ప్రత్యయము విధింపఁబడెను. అట్టి నుఙ్యంతక్రియలోనికి దాని కర్త కన్వయము కలుగునని యిటఁ జెప్పఁబడుచున్నది.

నీవు రావచ్చును. ఇట "రాన్" అనునది కర్తృభూతక్రియ అనగా వచ్చును అను క్రియలోనికి "రాన్" అనునది కర్త యగును. అందుచే "రాన్" అనునది కర్తృభూతక్రియ యని చెప్పఁబడుచున్నది. రాన్ = వచ్చుట, వచ్చును = తగును అని యర్థము. వచ్చును అను క్రియలోనికి రాన్ అనునది కర్తయగుచో నీవు అను పదము దేనితో నన్వయించును? అను శంకకు సమాధానముగా "రాన్" అను కర్తృభూతక్రియలోనికి "నీవు" అనునది కర్తగా నన్వయించునని తాత్పర్యము.

"ఇక్కడ నీవు పోవచ్చును" అనుచోట నీవు అనుదానికి "పోన్" అను భావార్థక పదములోని కన్వయము. నీవు పోవుట తగునని యర్థము.

ఈ స్థలములందు గల యన్వయక్రమమును విశదపఱచుటకు మాత్రమే యీ సూత్రము రచింపఁబడెను. నూతనముగా నన్వయమును విధించుటగాని బాలవ్యాకరణములోని లోపమును దీర్చుటగాని యీ సూత్రమునకుఁ బ్రయోజనములు గావు. ప్రౌఢవ్యాకర్త వివరణము స్పష్టార్థమే.

**సూ.** ఒఓలకు సందేహార్థంబులకు వలయుచోఁ గొన్నియెడలఁ గదా కదే లనుప్రయుక్తంబు లగు ఉద్దేశ్యంబు ద్వ్యవయవంబేని విధానంబం దొక్కటి కడదాని కగు. ౨౮

ఉ॥ ఎంత కృతార్థులమో కదా! వి. పు. ౭ ఆ. ౪౭. శాంతంబు కాదో కదే! భోజ. ౩ ఆ. ౨౩౨. అవునో కాదో కదా! రామా. ౬ ఆ. ౧౩౦. మొ॥

సందేహార్థకములకు = సందేహసూచనము అర్థముగాఁగలవి. ఒ, ఓ, అను శబ్దములు సందేహార్థకములు. ఈ యవ్యయశబ్దములకు కావలసినేని కొన్నిచోట్ల కదా, కదే, అనునవి అనుప్రయుక్తములగుచుండును. ఉద్దేశ్యము రెండు భాగములుగల దేని వానిలోఁ జివఱి భాగమునకు మాత్రమే కదా కదేల విధానము సంభవించును. అని సూత్ర తాత్పర్యము.

ఉద్దేశ్యము. దేనినిఁగూర్చి కార్యము చెప్పఁబడునో (విధింపఁబడునో) అయ్యది యుద్దేశ్యమనఁబడును. ఒక వస్తువు నుద్దేశించి ఒక విషయమును జెప్పుట విధానమనఁబడును.

"ఎంతఁగృతార్థుల మో కదా" (కృతార్థులము + ఓ + కదా.) ఇట ఓ అను దానికి "కదా" అనుప్రయుక్తమయ్యెను. "శాంతంబుకాదో కదే" ఇది ఓ అను దానికి కదే అనుప్రయుక్తమగుట కుదాహరణము.

**సూ.** తఱచుగం గ్రియలమీఁది కదకదవుల కన్నాదుల పర్యాయంబున ననుప్రయుక్తంబు లగు. ౨౯

ఉ॥ "ఆ. అలసితివిగదన్న! యాఁకొంటివిగదన్న!" భాగ. ౧౦ స్కం. పూ. ౨౪౯. "వీయపురాలవైతివి గదవే యిప్పుడు." విజ. ౩ ఆ. ౧౨౪. మొ॥ తఱచుగ ననుటచే ఉ. పూతపసిండివంటి వలపుం బచరించు కులంబు నీలికిన్ లేతగదమ్మ యిత్తెఱగులేమి. స్వా. ౩ ఆ. ౩౩

దయాంబురాశివిగదమ్మ. భాగ. ౧౦స్కం. పూ. ౧౭౮౨. ఇత్యాదు లూహ్యంబులు.

తెనుగుభాషయందు కద, కదవు, అనునవి కొన్నిపదములమీఁదఁ జేర్చి ప్రయోగింపఁబడుచుండును. అట్టి కద కదవులు క్రియలమీఁదఁ జేరియున్నచో వానికి అన్న, ఏ, అమ్మ, మున్నగునవి పర్యాయముగా ననుప్రయుక్తములగుట తఱచుగాఁ గానవచ్చుచున్నదని భావము. పర్యాయమనగా నొక్కొకటి ఒక్కొకసారి వచ్చుట.

"అలసితిగదన్న" ఇట అలసితిని అను క్రియాపదముపైనున్న కద అను దానికి అన్న అనున దనుప్రయుక్తమయ్యెను. ఇట్లే ఆకొంటిని అనుక్రియకు మీఁదనున్న కదకు అన్న అనుప్రయుక్తమయ్యెను. ఇట్లే మిగిలినవి యూహ్యములు.

ఐతి + కదవు + ఏ = ఐతిగదవే. ఇట ఏ అనుప్రయుక్తమయ్యెను. తఱచుగాఁ గ్రియలమీఁద వచ్చుననుటచే నొక్కొకచోట సుబంతములమీఁద నున్న కద కదవు లకును నన్నాదు లనుప్రయుక్తములగుట కలదని తెలియఁబడుచున్నది.

పూత ... లేఁతగదమ్మ ... లేమ. ఇట లేఁత అనుదానిమీఁది కదకు అమ్మ అనుప్రయుక్తమయ్యెను. లేఁత అనునది తిఙంతముగాదు. సుబంతము. అయినను అమ్మ అనుప్రయుక్తమయ్యెను. "దయాంబురాశివిగదమ్మ" ఇట అంబురాశియు సుబంతమే. దీనిమీఁది కదకు అమ్మ అనుప్రయుక్తమయ్యెను. సూత్రమునందలి క్రియలు అనుపదమునకు సమాపకక్రియలని తాత్పర్యము.

**సూ. అన్ప్రత్యయాంతమగు నగుధాతువు కొన్నియెడలఁ బెక్కుచోట్ల కొక్కటియె నగు.** ౩౦

ఉ॥ "తే. ధర్మజుఁడు తూర్పు భీముఁడు దక్షిణంబు నర్జునుఁడు పడమర గవలర్థి నుత్తరంబుగా వేటఁబోయిరి రాజముఖ్యులనఘు లింతకు వత్తురు వినుతబలులు. భార. అర.౬. ఆ. ౧౫౮. పక్షమునఁ దూర్పుగ, దక్షిణంబుగ, పడమరగ ననియు నుండవచ్చును.

కొన్నియెడల అన్ప్రత్యయాంతమగు ధాతువు (కాన్ అనునది) పెక్కుచోట్లఁ బ్రయోగింపవలసియుండగా నొక్కచోటనే ప్రయోగించుటయు నగును.

ధర్మజుఁడు... ...ఉత్తరంబుగాన్ అని యొక్కచోటనే కాన్ అనునది ప్రయోగింపఁబడెను. తూర్పుగాన్ దక్షిణంబుగాన్ పడమరగాన్ అని యుండ వలసియున్నను నట్లన్నిచోట్ల "కాన్" ప్రయోగింపఁబడలేదు. ఇకాఁర్యము క్వాచిత్కమగుటచే నన్నిచోట్లను కాన్ అనునది ప్రయోగించుటయుఁ గలదు. ఆ విషయమును "పక్షమునన్" అని గ్రంథకర్తయే వివరించెను.

సూ. కాదె కదార్థకంబగు. 30

"ఎ. గీ. శౌరికృపగాదె నాకు నక్షయబలంబు జై. ౨ ఆ.౬౮.

కాదె అను నవ్యయము కదా అనుదాని యర్థమునఁ బ్రయోగింపఁబడు చుండును. శౌరి... ...శౌరి కృపగదా అను నర్థమున శౌరి కృపగాదె అని ప్రయోగింపఁబడెను.

ఇది మొదలు నాల్గుసూత్రములు కేవల మర్థమును చెప్పునవియే యగు టచే వ్యాకరణమునకు సంబంధింపవు వ్యాకరణము శబ్దశాస్త్రముగదా.

సూ. అయికానవ్యయంబులు స్వయమర్థకంబులగు. 3౨

వాఁడయి వచ్చెను. వాఁడుగా వచ్చెను. వాఁడు తనంత వచ్చె ననుట. ఉ. తలంపరు నీకుదెల్ప నీవై పరికింపవంచు దురహంకృతి నా యమగన్న దంపతుల్. కళా. ౭. ౩, అక్షీణప్రభావుండు సర్వకళాసం జనకుండు నారదుఁడుగా రాఁజూచి. నిర్వ ౫ ఆ. 3౫. వెం॥

అయి, కాన్, అను నవ్యయంబులు రెండును స్వయముగా నను నర్థము నిచ్చును. స్వయముగా ననగా వేరొకరి ప్రేరణములేక తనంతట తానే అను నర్థమని వ్యాకర్త యభిప్రాయముగా వివరణమునుబట్టి తెలియవచ్చును.

ఉదా. వాఁడయి వచ్చెను, వాఁడు గావచ్చెను, ఇచ్చట వాఁడు తనంత తాను వచ్చెనని యర్థము.

తలంపరు... ...ఇఁచ్చది అందుకుదాహరణము నీవై పరికింపవనగా నీవు స్వయముగా పరికింపవని యర్థము. ఇది "అయి" కుదాహరణము. "నారదుండు గా రాఁజూచి" ఇట నారదుండు స్వయముగా రాఁగాఁజూచి అని యర్థము. ఇది కాన్ అనుదాని కుదాహరణము. అయి అనునది అగు ధాతువుమీఁద 'ఇ' ప్రత్యయము చేరినరూపము. కాన్ అనునది అగుధాతువు నన్నంతరూపము. ఈ రెండుపదములకును క్త్వాంత తుమున్నంతాద్యర్థములు సుప్రసిద్ధములుగా

నుండుటచే స్వయమర్థకములగుట చెప్పవలసి వచ్చెను. ఇతరార్థములును వీని కుండును కావున స్వయమర్థకంబులును అగునని సూత్రమున సముచ్చయముం డుట లెస్సయని సుబోధినీకారులు చెప్పుట యుచితమే.

నీవై పరికింపవంచు అనుచోట అయి అను పదము స్వయమర్థకముగాదు. అసంభవమును సూచించును. నీవైరావు నీచేతనై యీపని జరుగదు. నీవెంత బోధించినను నేనై వినను. మున్నగుతీరున నెన్నడును అట్లు జరుగదను నర్థము వచ్చునుకాని తనంత తానను నర్థము రాలేదు. "నీవై పరికింపవు" ఇట నీవెంత మాత్రమును పరికింపవను నర్థమే యిట సందర్భానుగుణముగా నున్నది. "నారదుఁడు గారాజుూచి" అనునది యతిప్రాసాదిస్థలోదాహరణముకాదు.

సూ. అకానిత్యర్థకంబగు. 33

ఉ॥ అపజయమకాలక్షించి. భార. అర. ౨ ఆ. ౬౩. మొ॥

"అ" అనునవధారణార్థకముమీఁద "కాౘ"అను నగు ధాతువు నన్నంతరూపము. ప్రయుక్తమయ్యెనేని రెంటును గలసి "ఇతి" అను దాని యర్థము (అని) గలదగునని భావము.

అపజయము + అ + కాన్ = అపజయమకాన్. అపజయమని లక్షించి యని యర్థము.

ఆలోచింపగా పైరీతి నర్థముచెప్పుట సరికాదు. ఉదాహృతస్థలమున "నప జయమే యగుట నూహించి" అని యర్థము వచ్చుచున్నది. అట్టియర్థమే సంద ర్భానుగుణము. శబ్దములనుబట్టి అట్టియర్థము సరళముగా వచ్చుచుండగా విలక్ష ణార్థమును గల్పించుట యుచితముగాదు. "అ" అను నవ్యయమునకు ప్రసిద్ధ మగు నవధారణార్థమును విడచుటయు "అ, కాన్" అనునవి అప్రసిద్ధమగు నిత్యర్థమును బోధించుటయును సరళముగాఁ గన్పట్టదు. ఇచట "కాన్"అను నది భావార్థక ప్రత్యయాంతమని చెప్పిన బాగుగా సరిపడును. అపజయమే యగుట లక్షించి యని యర్థమువచ్చును.

సూ. కరఁగు తలఁగు మెఱయ్యాదులంతర్భావిత ప్రేరణంబులు 34

అంతర్భావిత ప్రేరణార్థకములు = ప్రేరణార్థముగూడ తమలో నిముడ్చుకొనినవి,

కరఁగు తలఁగు మెఱయు మున్నగు క్రియలు స్వార్థకములేకాక ప్రేరణార్థకములుగూడ నగును. అనగా నించుగాదులు చేరకయే ప్రేరణార్థమును బోధించునని భావము.

దీనికి బ్రయోగములు శబ్దరత్నాకరమునుబట్టియే యూహింపవలయును. సుబోధినీకారు లట్లే యుదాహరించిరి.

కరఁగు (అప్రేరణము) రమణభుజానిపీడన గరంగిన కాంతల. లక్ష్మీ౯ ౩ ఆ. ప్రేరణమున. కరగించు. ఎ గీ. కుసుమబాణుని బాణముల్ గూడ నైదు గరఁగి నేరిమి వాటించి (బాణములను కరఁగునట్లుచేసి యని ప్రేరణార్థము) భార. విరా. ౨ ఆ. ౨౩.

తలఁగు. (అప్రేరణము) నలుఁడును ధరణీరాజ్యము తలఁగగ భార. అర ౨ ఆ. ౯౬. తలఁగగ = పోవగాన్ అని యర్థము (ప్రేరణము) ఒరుల దుఃఖంబులు తలఁగఁబట్టిన ధర్మశీలుఁడు. భార. అది. ౬ ఆ. ౨౭౩ప॥ తలఁగింపఁబట్టిన యని యర్థము.

మెఱయు. (అప్రేరణము) "మెఱసి యే నుపచారము వేడ్క సేయగా" భాను. ౩ ఆ. మెఱసి = ప్రకాశించి. (ప్రేరణ) "అపారబలంబుల్ మెఱయునెడ." భార. అది. ౫ ఆ ౧౬౪ ప. మెఱయునెడ = మెఱయఁజేయునపుడు. ఆదిపదముచే "అఁగు" మున్నగు వానిని గ్రహింపవలయును. దీని కప్రేరణార్థము ప్రసిద్ధము. ప్రేరణార్థమునకు — చెలులాఁగినచోట వసు. ౩ ఆ. చెలులు ఆపిన చోట నని యర్థము.

**సూ. అడుగ్వాదులు ద్వికర్మకంబులు.** ౩౫

అడుగు మున్నగు ధాతువులు కొన్ని. రెండు కర్మలు కలిగియుండునని భావము.

సంస్కృతమునను దుహ, యాచృ, మున్నగు ధాతువులు ద్వికర్మకములని చెప్పఁబడెను. అట్లే యిటను "అడుగు" మున్నగు ధాతువులు ద్వికర్మకములగునని తెలియవలయును.

"ఆంజనేయుఁడు సీతను క్షేమ మడిగెను." ఇట సీత, క్షేమము, అను రెండును కర్మలే.

ఇది క్రియాపరిచ్ఛేదము.

# కృదంత పరిచ్ఛేదము

ధాతువులకు విధింపఁబడిన డుఙ్ భిన్నప్రత్యయంబు కృత్తు అని బాల వ్యాకర్త చెప్పెను. అనగా ధాతువులనుండి యేర్పడిన నామవాచకములే కాక ఇప్రత్యయాంతములు నుజీ ప్రత్యయాంతములు (చేసి, చేయన్) మున్నగునవి యుఁ గృదన్తములేయని భావము. అట్టి కృదంతములనెల్ల నీ ప్రకరణమునఁ జెప్పలేదు. క్రియాపరిచ్ఛేదమునఁ గొన్ని కృదంతములను అనగా నవ్యయము లును విశేషణములను అయిన కృదంతములను జెప్పి నామవాచకములగు కృదంతములనుమాత్రమే యిందు నిరూపించెను. చేసి చేయన్ మున్నగునవియుఁ గృదంతములే యని బాలవ్యాకరణమునుబట్టియేగాక సంస్కృత వ్యాకరణ సామ్యమునుబట్టియుఁ దెలియఁబడుచున్నది.

సూ. డయ్యు దయ్యు నొచ్చు పుచ్చుల కివర్ణకంబగు అగుచో వాని కడ హల్లులు పకారంబు లగు. ౧

ఉ॥ డప్పి. దప్పి. నొప్పి. పుప్పి.

డయ్యు దయ్యు నొచ్చు పుచ్చు అను నాలుగు ధాతువులకును "ఇ" అను ప్రత్యయము వచ్చును. ఇ ప్రత్యయము చేరునపుడు పై ధాతువులలోని అంత్య సంయుక్త హల్లులు రెండును పకారములుగా మారును.

డయ్యు + ఇ = డప్పు + ఇ = డప్పి. దయ్యు + ఇ = దప్పు + ఇ = దప్పి. నొచ్చు + ఇ = నొప్పు + ఇ = నొప్పి. పుచ్చు + ఇ = పుప్పు + ఇ = పుప్పి.

ఈ రూపములు బాలవ్యాకరణమున సాధింపఁబడలేదు కనుక నిచ్చట సాధించెను. కృత్తుల కర్థంబులు యథావ్యవహారంబుగ గ్రాహ్యంబులు. అని బాలవ్యాకర్త చెప్పియున్నాఁడు. కావున నిందలి కృత్తులకును నట్లే ప్రయోగ ముల ననుసరించి యర్థమును గ్రహింపవలయును. ఈ ప్రత్యయము భావార్థకము. డప్పి అనగా పిపాస.

డకారము (కొన్నియెడల) దకారముగా మాఱునని బాలవ్యాకరణంబునఁ (ప్రకీ. ౧౪ సూ.) జెప్పంబడినందున నిందు డప్పి, దప్పి అను శబ్దములను వేరుగా సాధింపనక్కఱలేదు. దయ్యుధాతువును సూత్రమున విడువవచ్చును. ఇందలి పుచ్చుధాతువు పుచ్చుగుపట్టు అను నర్థముగలదియని తెలియవలయును. గ్రహణార్థకమగు పుచ్చుధాతువు నిట గ్రహింపరాదు.

సూ. రాయున కిడి వర్ణకంబు నగు. ౨

ఉ॥ రాయిడి. రాపు.

"రాయు" అను ధాతువునకు ఇడి అను వర్ణకముకూడ వచ్చును. అనగా ఇడి వర్ణకమును బాలవ్యాకరణమునఁ జెప్పఁబడిన మాయ్వాది పువర్ణకమును గూడ వచ్చునని భావము. ఉదా: రాయు + ఇడి = రాయిడి (లేదా రాపు.) రాచు అను పూర్వముద్రితపాఠము సరికాదను సుబోధినిలోని వ్రాతసరియే.

సూ. ఈర్చుబ్బుకందు దువ్వు వడ్డించులకెన వర్ణకంబగు. అగుచో ఈర్చుబ్బుల చకార బకారంబులు పకారంబులగు. వడ్డించు నించు లుప్తంబగు. ౩

ఉ॥ ఈర్పెన, ఉప్పెన, కందెన, దువ్వెన, వడ్డెన.

ఈర్చు, ఉబ్బు, కందు, దువ్వు, వడ్డించు, అను ధాతువులకు "ఎన" అను ప్రత్యయమగును ఈ ప్రత్యయము పరమగునపుడు ఈర్చు ధాతువునందలి చకారమును ఉబ్బుధాతువునందలి బకారములు రెండును పకారములుగా మాఱిపోవును. అట్లే వడ్డించు ధాతువులోని ఇంచు అను భాగమునకు లోపము వచ్చును.

ఈర్చు + ఎన పకారాదేశము. ఈర్పు + ఎన. నిత్యసంధి. ఈర్పెన.

ఉబ్బు + ఎన. బకారద్వయమునకు పకారద్వయాదేశము. ఉప్పు + ఎన సంధి ఉప్పెన. కందు + ఎన. సంధి. కందెన. దువ్వు + ఎన. సంధి దువ్వెన.

వడ్డించు + ఎన. ఇంచులోపము. వడ్డ్ + ఎన + వడ్డెన. లోకమున ఉబ్బు, కందు, అను శబ్దములును గానవచ్చుచున్నవి. అవి "ఉ" వర్ణకాంతములని యూహింపనగును. (చూ. బాల. కృద. ౨౧ సూ.) అట్టిరూపములెగాక ఎన ప్రత్యయాంతములును నుండునని ప్రౌఢవ్యాకర్త యాశయము.

వడ్డించులో ఇంచు అను భాగమునకంతకును లోపమును విధింపక బిందుపూర్వక చువర్ణమునకుమాత్రమే విధించినను నపదాదిస్వరసంధివచ్చి "వడ్డెన" అని యగును. కాని సంధి విధాయకసూత్ర మక్కరలేకయే రూప నిష్పత్తి యగుటను లాఘవమును సూత్రనిర్మాణమునందలి సౌకర్యలాఘవము లను అపేక్షించి "ఇంచు" లోపమును విధించెనని తలంపవలయును. వడ్డెన అనురూపము నైకారయుక్తముగా నిచ్చటు సాధించెను. వడ్డన అనునదియే వ్యవ

హారమునఁ దలచుగా వినవచ్చును. శబ్దరత్నాకరమున "వడ్డెన"కు ప్రయోగ ములను జూపలేదు. మహాకవుల ప్రయోగములనుబట్టి నిశ్చయింపవలయును.

సూ. పురవర్ణకంబు కాఁచు వాఁచు దాయ్యాదులకగు. ౪

ఉ॥ కాఁపురము, దాఁపురము, దాపురము. వెం॥

కాఁచు దాఁచు దాయు మున్నగు ధాతువులకు "పుర" అను ప్రత్యయము వచ్చును. కాఁచు + పుర. బాల. కృ ౨౫ చే చువర్ణలోపము. కాఁపుర. ప్రథమైకవచనము వర్ణకము రాఁగా "కాపురము". ఇట్లె దాఁపురము దాఁచుట అని యర్థము దాయు ధాతువునకు దాపురము అనియే కృదంతరూపము. (ఇందర్ధ బిందు వుండదు) సమీపించుట, ప్రాప్తి, అని యర్థములు. ధాతువుల అర్థమును బట్టి కృదంతముల యర్థము లూహ్యములు.

సూ. ఎక్కు దిగులకుం బ్రేరణార్థంబున మతివర్ణకంబగు. అగుచో నెగు ఎక్కున కాదేశంబగు. ౫

ఉ॥ ఎగుమతి, దిగుమతి, ఇట్ల ఎగువ.

ఎక్కు, దిగు అనుధాతువులకు ప్రేరణార్థమున "మతి" అను ప్రత్యయము చేరును. ఎక్కునకు మతివర్ణకంబు అగునపుడు "ఎగు" అను నాదేశమును వచ్చును.

ఎక్కు + మతి. ఎగు ఆదేశముఁ రాగా, ఎగు + మతి = ఎగుమతి. దిగు + మది = దిగుమతి. ఎక్కుధాతువునకుఁ బ్రేరణార్థ మనగా ఎక్కించుట అనగాఁ బంపించుట యని యర్థము. దిగుధాతువునకుఁ బ్రేరణార్థ మనగా దిగునట్లు చేయుట. అనగా దింపించుట యని యర్థము. "ఇట్ల ఎగువ" అనగా ఈవిధముగనే "వ" అను ప్రత్యయము పరమగునపుడును ఎక్కు ధాతువునకు ఎగు ఆదేశము వచ్చునని భావము. ఎగువ.

వేఱొక ప్రదేశమునకుఁ బంపుట ఎగుమతి యనియు వేఱొక ప్రదేశము నుండి తెప్పించుట దిగుమతియనియు వ్యవహారము.

సూ. వువర్ణకంబులియ్యాదులకగు

ఉ॥ ఉలివు.

ఉలియు మున్నగు ధాతువులకు "వు" అనువర్ణకము వచ్చును.

ఉలియు + వు బాల కృ ౭ సూ. చే యువర్ణలోపము. ఉలి + వు = ఉలివు. బాల. కృద. ౧౩ సూత్రముచేతనే (వువర్ణకంబు మన్వాదులకగు) వువర్ణకమురా వచ్చును కాని అంతలోపమువచ్చు ఘాతుపుం మన్వాదులలో చేరనట్లు అందలి యుదాహరణములనుబట్టి తోచుచున్నందున నిటు వువర్ణకము విధింపఁబడెను.

సూ. కాచు వీచులకు వలివర్ణకంబగు. ౩

ఉ॥ కావలి, వీవలి.

కాచు వీచు అనుధాతువులకు వలి వర్ణకము వచ్చును. కాచు + వలి చు లోపము (బాల. కృ ౭ సూ.) = కావలి. వీచు + వలి. చులోపము. వీ + వలి = వీవలి. ఈ ప్రత్యయము కర్త్రర్థమున వచ్చెననుట యుచితము. కావలి అనగా కాచువాఁడనియు వీవలి అనగా వీచువాఁడు (గాలి) అనియు నర్థములు. కాఁపు అనునది (కర్త్రర్థమునను భావార్థమునను) బాలవ్యాకరణముచే సిద్ధించును. (చూ. బాల. కృద. ౧౧ సూ.)

ఇది కృదంత పరిచ్ఛేదము.

# వాక్య పరిచ్ఛేదము

పదములకు సంబంధించిన విధుల నన్నిటిని వెనుకటి ప్రకరణములందుఁ జెప్పెను. ఇపుడు వాక్యములకు సంబంధించిన విషయములను జెప్పుచున్నాఁడు. పదవాక్యముల లక్షణమును ముందు చెప్పఁగలడు. బాలవ్యాకరణమున నిట్టి ప్రకరణము లేదు. ఆవిషయముల నాతఁడు వివరింపలేదు. వాక్యముకూడ శబ్దవిశేషమే కావున నిదియు వ్యాకరణశాస్త్రప్రమేయమే యని విచారించుచున్నాఁడు.

సూ. వాక్యమునా యోగ్యతాకాంక్షాసహితంబగు నర్థముగలయాసత్తియుక్తపదసముదాయంబు. ౧

యోగ్యత యనగాఁ బదార్థములకుఁ బరస్పర సంబంధమునందు బాధ కలుగకుండుట. ఆకాంక్ష యనగా నిలుపుదలలేక పయింబయిఁ బోయెడి పదార్థములమీఁది యాకారము. అది వినువారికి తెలిసికొనవలయుననియెడి యపేక్షారూప మయినది. ఆసత్తి యనఁగాఁ బదముల చేరిక.

యోగ్యతయు, ఆకాంక్షయు, ఆసత్తియు లేక నిప్పుచేఁ దడుపుచున్నాఁడు. గోవు గుఱ్ఱము. అని యిట్లు చెప్పుటచేతను బుద్ధిమఱుపులేక నేఁడు దేవదత్తుఁడని చెప్పి మఱియొకనాఁడు పోవుచున్నాఁడు అని చెప్పుటచేతను ఇవిసముదాయము వాక్యముగా నేర్పడదనుట నది వాక్యమని చెప్పఁదగినది కాదని తాత్పర్యము.

వాక్యములందుఁ గొన్ని క్రియాన్వయముకలవి, కొన్ని తదితరాన్వయము కలవి. వాని కుదాహరణములు మీఁద స్పష్టములు గాఁగలవు క్రియలనగా వర్తమానాద్యర్థకములయిన సమాపకక్రియలు క్త్వాతద్వ్యతిరేక శతృతుమున్ చే దానంతర్యార్థకము లసమాపకక్రియలు. ఇందు మొదటివి మూఁడు క్రియా భిన్నకర్తృకంబులు. వెనుకటివి మూఁడు క్రియావిభిన్నకర్తృకంబులు

యోగ్యత ఆకాంక్ష అను ధర్మములుగల యర్థములను బోధించుచు, దగ్గరగానున్న పదముల సముదాయము వాక్యము నాఁబడును.

యోగ్యతాకాంక్షాసహితంబగు = యోగ్యతతోడను ఆకాంక్షతోడను కూడియున్న. (ఈపదము "అర్థము"నకు విశేషణము.) ఆసత్తియుక్తపదసముదాయము = ఆసత్తితోఁ గూడియున్న పదముల సమూహము యోగ్యత, ఆకాంక్ష అనునవి అర్థమునకు సంబంధించినవియు, ఆసత్తి శబ్దమునకు సంబంధించినదనియుఁ దెలియఁదగును.

యోగ్యత యనగా పదముల యర్థముల కొరదానితో నింకొక్కటి యన్వ యించుటకు తగియుండుట. "నిప్పుచేఁ దడుపుచున్నాఁడు" అనుచోట పదార్థ ములకు పరస్పరసంబంధము అర్హముగా లేదు. బాధితము. తడుపుటకు జలము మున్నగు ద్రవపదార్థములు యోగ్యసాధనము లగునుగాని నిప్పుసాధనము కాఁ జాలదు. నిప్పుచే జరిగెడిపని కాల్చుట మున్నగునవియేగాని తడుపుట కాఁ జాలదు. ఈ యర్థములకుఁ బరస్పరము (బాధకలవి యగుటచే) అన్వయ యోగ్యత లేదు.

ఆకాంక్షయనగా నొకపదము నర్థము వినినవెనువెంటనే కల్గెడి వేఱొక పదార్థమునందలి యాదరము. దీనికి సంబంధించిన వేఱొకపదార్థమును దెలిసి కొనుటకుంగూర్చిన యపేక్షయేయని భావము ఒకపదార్థము తెలియఁబడగనే దీనికి సంబంధించిన వేఱొకపదార్థమును గుఱించిన ప్రశ్నమున సమాధానముగా నన్వయింపఁదగిన పదార్థమయియుండుట. అసంబద్ధములగు పదార్థములకు ఆకాంక్షయుండదు, గోవు గుఱ్ఱము అనుపదములకుఁ బరస్పరాకాంక్ష

యుండదు "గోవువచ్చెను" అని యున్నచో గోవు అనుపదార్థము తెలియగనే గోవేమయ్యెను అని ఆకాంక్ష కలుగుచుండగా "వచ్చెను" అనుపదము ఆ యాకాంక్షను బోఁగొట్టును ఇట్లే "వచ్చెను" అనుపదము నర్థము తెలియఁబడగనే "ఏది" అనుకర్తనుగూర్చిన యాకాంక్ష కలుగగా గోవు అనుపద మా యాకాంక్షను బోగొట్టును. ఇట్టి యాకాంక్ష "గోవు గుఱ్ఱము" అనుచోట లేనందున నది వాక్యము కాఁజాలదని భావము.

ఆసత్తి యనఁగాఁ బదము లధికవ్యవధానములేక యుచ్చరింపఁబడుట. యోగ్యతాకాంక్షలుగల పదార్థములను బోధించు శబ్దములయినను కాల వ్యవధానమధికముగా నుండునట్లు పలుకఁబడునేని వానివలన నర్థబోధము కలుగదు వాక్యమునందలి పదములలో నేఁడొకపదమును రేపు వేఱొకపదమును నుచ్చరించెనేని వానికిఁగల పరస్పరసంబంధము తెలియఁబడక వాక్యార్థము తెలియఁబడదు. అనగాఁ బదార్థములు మఱపురానిరీతిని దగ్గరకాలములో పదములు పలుకబడవలయుననుట

వాక్యములలో కొన్ని (వాక్యములు) క్రియతో నన్వయించును. కొన్ని క్రియేతరములతో నన్వయించును. వీనికుదాహరణములు ఏడవసూత్రపు వివరణమునంగలవు. క్రియతో నన్వయముగల వాక్యములనఁగా సంపూర్ణవాక్యములనియు క్రియేతరాన్వయముగల వాక్యములనఁగా నసంపూర్ణవాక్యములనియుఁ దెలియనగును.

క్రియావాచీ ధాతుః అను చింతామణి సూత్రము మున్నగువానింబట్టి క్రియలనగాఁ గేవల ప్రత్యయరహితములగు వచ్చు, పోవు, మున్నగు ధాతువులేయని తెలియఁబడుచున్నది. కాని సమాపక క్రియాపదములనే తాను క్రియలని వాడుచున్నట్లు "క్రియలనఁగా" మున్నగు వాక్యముచేఁ బ్రౌఢవ్యాకర్త చెప్పుచున్నాఁడు. వర్తమాన భూతభవిష్యద్వ్యతిరేక తద్ధర్మాద్యర్థకములగు లట్, లిట్, లృట్, లఙ్, లూట్. అను ప్రత్యయము లంతమునఁగల సమాపకక్రియలు మాత్రమే "క్రియల"ని తెలియవలయునని భావము.

ఇవియే క్రియలయినచో వచ్చి, పోవన్, మున్నగునవి యేమగునని శంక కలుగుచుండగా నయ్యవి యసమాపకక్రియలని చెప్పఁబడవలయునని సూచించుచున్నాఁడు.

క్రియాభిన్న కర్తృకములు. = సమాపకక్రియల కర్తలకంటె వేఱు కాని కర్తలుగలవి. క్రియావిభిన్న కర్తృకంబులు = సమాపకక్రియల కర్తలకంటె వేఱయినకర్తలుగలవి.

క్త్వార్థకము = చదివి మున్నగునవి. తద్వ్యతిరేకము చదువక మొదలగు వ్యతిరేకక్త్వార్థకములు. శత్రర్థకము = శతృప్రత్యయార్థముగలది. చదువుచున్ ము తుమున్నర్థకము = చదువన్ ము చేదర్థకము = చేత్ అను నవ్యయము యొక్క అర్థముగలది చదివినన్ ము. అనంతర్యార్థకము = తరువాత నను నర్థముగలది చదువుడున్ ము ఈయారును నసమాపకక్రియ లనఁబడును. అనగా నీ క్రియలతో వాక్యము పూర్తికాదు. ఆకాంక్ష యుంకను నివర్తింపదు. వాక్యమును బూర్తిచేయునవి వర్తమానాద్యర్థక దుఙంతక్రియలుమాత్రమేయని తాత్పర్యము. ఈ యసమాపకక్రియలలో మొదటి మూఁడిటికిని అనగా ఇ, కజీ, చున్ అను ప్రత్యయము లంతమునఁగల క్రియల (చదివి, చదువక, చదువుచున్.)కు సమాపకక్రియల కర్తలే కర్తలుగా నుండును.

రాముఁడు వచ్చి చదివెను, రాముఁడు రాకయే చదివెను. రాముఁడు వచ్చుచుం జదివెను. ఈ వాక్యములందు చదివెను అనునది సమాపకక్రియా పదము. దీనికిఁ గర్త రాముఁడనునది. వచ్చి, రాక, వచ్చుచున్ అను నసమాపక క్రియలకును ఆపదమే కర్తృబోధకము. కావున నిట సమాపకక్రియలకు నసమాపకక్రియలకును గర్తయొకఁడే యగుచున్నాఁడు.

మిగిలిన మూఁడసమాపకక్రియలును అనగా నుజీ, నన్, డున్, అనునవి సమాపకక్రియల కర్తలుగాక వేఱొకకర్తలు కలిగియుండును.

వానలుగురిసినం బంటలుపండును. ఇట చేదర్థక "నన్నం"తమునకు వానలు అనునది కర్తృవాచకము. పండును అనుక్రియకు పంటలు అనునది కర్త, ఇట్లిచట కర్తలు భిన్న భిన్నములు.

"జాబిలి తోతెంచుడుం గువలయంబులు వికసిల్లె" ననుచోట నానంతర్యార్థక దువర్ణకాంతక్రియకును వికసిల్లెనను సమాపకక్రియకును గర్తలు వేరుగదా. తోతెంచుటకు జాబిలియు వికసించుటకు కువలయంబులును గర్తలగుచున్నవి..

ఈ మూఁడును క్రియాసమాన కర్తృకములు నగు రాముఁడు చదువం బోయెను. (చదువుటకు బోయెనని తాత్పర్యము) ఇట చదువుటకును బోవు

టకును రాముఁడే కర్త. బాలుఁడు చదివిన నుత్తీర్ణతంబొందును. ఇట చదువుకును పొందుటకును బాలుఁడే కర్త. అనంతర్యార్థకస్థలమున మాత్రము నొక్కే కర్తయుండుట ప్రసిద్ధముగాదు. కావున నీ మూఁడును క్రియావిభిన్న కర్తృకములు తఱచుగా నగుననిమాత్రమే గ్రంథకర్త వాక్యమున కర్థముగా గ్రహింపవలయును అట్లే క్త్వార్థకాదులు సమానకర్తృకములగుననుటయుఁ దఱచుగా ననియే గ్రహింపవలయును. రామునిచే దేవదత్తుడు కొట్టంబడి మడిసె నను చోట సమానకర్తృకములు కావనియేకదా బాలవ్యాకర్త యాశయము. ఇచటఁ గొట్టుటకు కర్త రాముఁడు. మడియుటకుఁ గర్త దేవదత్తుఁడు. ఇట్టి కర్తృభేదముండుటచేతనే బాలవ్యాకర్త ఇప్రత్యయమును విధించునపుడు సమాన కర్తృకములనక సమానాశ్రయములని చెప్పికొనియెను. (చూ. బాల. క్రి. ) కావున భిన్నాభిన్న కర్తృకత్వములు రెండును ప్రాయికములనియే తలంపనగును.

క్రియలనగా సమాపకక్రియాపదములని యీతని వ్యవహారమని వెనుకఁ జెప్పితిని.

**సూ. పదమనఁగాఁ బ్రయోగార్హంబు ననన్వితంబు నేకంబు నర్థబోధకంబునైనవర్ణము, లేక వర్ణసముదాయము. ౨**

**ఉ ఖంబు, లేక ఘటంబు మొ॥ ప్రయోగానర్హము, ఖ, ఘట మొ॥ అన్వితము — ఖంబు ఘటంబునందోఁచెడి. మొ॥ అనేకము — ఖంబును, ఘటంబును. మొ॥ అనర్థబోధకము. క, చ, ట, త, ప, మొదలగునవి.**

వాక్యమనగా నెద్దియో మొదటిసూత్రమున వివరించి పదమనగా నేమియో యిందు వివరించుచున్నాడు.

ప్రయోగార్హము = ప్రయోగించుటకు తగినది. అనన్వితము = ఇతర పదములతో నన్వయముపొందనిది. ఏకంబు = ఒక్కటి. అర్థబోధకము = అర్థమును శబ్దవ్యాపారముచే బోధించునది. వర్ణము = అక్షరము. వర్ణసముదాయము = అక్షరములగుంపు.

కేవలము ప్రకృతిగాని కేవల ప్రత్యయముగాని ప్రయోగార్హములు గావు. అట్టివిగాక ప్రయోగించుటకుఁ దగినదియు, వేఱొకపదముతో నన్వయించిన మొత్తముగాక వేఱుగానున్నదియు, వేఱొకపదముతో నన్వయము

లేకున్నను రెండుపదముల సమూహముగాక ఒంటిగానుండునదియు, అర్థముతోఁగూడినదియు నగునొక యక్షరముగాని యనేకాక్షరములుగాని పదమని చెప్పఁబడును.

ఉదా. ఖంబు — ఇది యేకాక్షరపదము. ఘటంబు — ఇది అనేకాక్షర పదము. ఖ, ఘట, మున్నగు ప్రాతిపదికములు ప్రయోగింపఁదగవు. ఏదియో విభక్తిప్రత్యయముచేరి ఘటము, ఘటముచేత, మున్నగురీతిని ప్రయోగింపఁబడునది పదమనఁబడును. అందుచే "ఘట" మున్నగు ప్రకృతులకు పదసంజ్ఞ రాకుండుటకై ప్రయోగార్హము అనుమాట లక్షణమున చేర్చఁబడెను. అనన్వితంబు. వేఱొకపదముతో నన్వయించినచో నారెండునుగలసి యొకపదమని చెప్పఁబడవు. ఖంబు ఘటంబును దోఁచెడి. ఇట ఖంబు దోఁచెడి, ఘటంబు దోఁచెడి అని అన్వితములగుచున్నవి. అట్లన్వితములగు రెండేసిపదముల మొత్తము పదమని చెప్పఁబడదు ఏకంబు. రెండుపదముల మొత్త మొకదానితోనొకటి యన్వితముకాకున్నను పదమని చెప్పఁబడదు ఖంబును, ఘటంబును. ఇట రెండుపదంబులును ఒకదానితోనొకటి యన్వయింపలేదు. ఇవి రెండును స్వతంత్రముగనే క్రియలోనికి అన్వయించినవి. అందుచే వీనికి బరస్పరాన్వయము లేకున్నను రెండునుగలసి పదమని చెప్పఁబడవు. అర్థబోధకము — అర్థమును బోధింపక కేవల ధ్వనిరూపములయిన వర్ణములు పదములనఁబడవు. కనుక క, గ, మున్నగునవి పదములుకావు అందుచే నర్థబోధకమును కావలయునని చెప్పఁబడెను.

ఇట్టివి కొన్నిపదములు ఒక్కవర్ణముగను మఱికొన్ని యనేకవర్ణములుగను నుండును. అందుచే వర్ణము లేక వర్ణసముదాయము అని చెప్పఁబడెను. ఇట సముదాయమనగా ఒక్కటికంటె నధికమయినదని భావము. ఖంబు. ఇది ఏకాక్షరపదము. ఘటంబు. రెండక్షరములుగలది.

ఇంద ననన్వితంబనగా వేఱొకపదముతో నన్వయించినమొత్తము పదము కాదనిమాత్రమే భావము. వేఱొకపదముతో నన్వయింపఁగూడదని తాత్పర్యము గాదు. వేఱొకపదముతో నన్వయింపగూడదన్నచో వాక్యమున దలి పదములన్నియు. ఒంటిపదములు కాకపోవలసివచ్చును వాక్యము పదసముదాయము గదా కావలయును. కాని ఏకము అను విశేషణముచేతనే యీ విశేషణమువలనఁ గల్గు లాభము సిద్ధించును. పదాంతరముతో నన్వయించిన పదము ఏక(పద)ము

కాదుగదా. ఖంబును ఘటంబును అనునవి (రెండునుకలసి) ఎట్లు ఏకపదము కాఁజాలవో అట్లే ఖంబు ఘటంబునం గలదను వాక్యమును పదముకాఁజాలదు. అందుచే లక్షణమున ననన్వితంబు అనుదళ మనావశ్యకము. వర్ణమనగా నేకాక్షర ప్రాతిపదికము గలదని భావము. కానిచో "ఖంబు" అనునది రెండక్షరములు గల పదమగుటచే నుదాహరణము కాకపోవును. వర్ణమనగా నచ్చుగాని యచ్చుతోఁగూడిన హల్లుఉగాని యగును. "ఖ" అను ప్రాతిపదికమునందు ఖకారము అకారము అను రెండువర్ణములు గలవు. కావున నిది యేకవర్ణపదము కాదనవలసివచ్చును. వర్ణసముదాయమనగా రెండువర్ణములుగాని అంతకు మించిన సంఖ్యగల వర్ణములుగాని గ్రహింపఁబడును. "ఘట" అనునది రెండక్షరములుగల ప్రాతిపదికముగదా.

సూ. పదములవి నామములు క్రియ లవ్యయంబులని త్రివిధంబులు ౩

నామములు నా వస్తువాచకశబ్దములు. సందర్భవశంబున నవి కొన్ని కర్తలనియుఁ గర్మలనియుఁ జెప్పఁబడును. ధాత్వర్థవ్యాపారాశ్రయము కర్త. ధాత్వర్థఫలాశ్రయము కర్మము. క్రియ లనగా వ్యాపారావబోధకములయినవి. అవి సకర్మములు అకర్మములు అని ద్వివిధంబులు. కర్మముగలది సకర్మకము కర్మములేనిది యకర్మకము.

కర్తృ కర్మ క్రియలుగూడఁ బ్రయోగ మనంబడును. అది కర్తరి ప్రయోగము కర్మణిప్రయోగము నని ద్వివిధము. క్రియచేఁ గర్త చెప్పఁబడునేని యది కర్తరిప్రయోగము. కర్మము చెప్పఁబడునేని కర్మణి ప్రయోగము. కర్తరిప్రయోగము సకర్మక్రియగలచో సకర్మక కర్తరి ప్రయోగమనియు నకర్మకక్రియగలచో నకర్మకకర్తరి ప్రయోగమనియుఁ జెప్పంబడును.

అవ్యయములనగా విభక్తిశూన్యములు. అవి ప్రతిపదోక్తములు లాక్షణికములు అని ద్వివిధములు. ప్రకృతిసిద్ధములు ప్రతిపదోక్తములు. లక్షణసిద్ధములు లాక్షణికములు

అవి = పూర్వసూత్రమునఁ జెప్పఁబడిన లక్షణముగలవి. త్రివిధంబులు = మూడువిధములయినవి.

ఆపదములు నామములు క్రియలు అవ్యయములు అని మూఁడువిధములుగా నుండును అందు నామములనగా వస్తువును బోధించునవి ఇట వస్తువు అనగా లింగవచన విభక్తులుగల పదముచే బోధింపఁబడునది. అనగా సత్వ వాచకము. (సుబంతవాచ్యంబు సత్వంబునాఁబడునను బాలవ్యాకరణముచూడఁ దగును.) ఇట నైయాయికులమతము ననుసరించి వస్తుపదమున కర్థము చెప్ప రాదు. వారిమతమున వస్తువనగా సర్వపదార్థములు నగును. అవ్యయములు, క్రియలునుగూడ వారిమతము ననుసరించినచో వస్తువాచకములే యగును.

నామములనగా విభక్తిప్రత్యయముచేరిన ప్రాతిపదికములని భావము. అవ్యయంబులు. అన్నివిభక్తుల యర్థమునను అన్నివచనముల యర్థమునను ఒక్కతీరున నుండునవి. క్రియలనగా తిఙ్ప్రత్యయములు చేరినధాతువులు.

వీనిలో నామములు సందర్భమునుబట్టి యొకొ్కకచోఁ గర్తలనియు నొకొ్కకచో గర్మలనియుఁ జెప్పఁబడును. దేవదత్తుఁ డన్నమును వండెను. ఇట దేవదత్తుఁడను నామము కర్తయు, అన్నమును అనునామము కర్మయును నగుచున్నవి. కర్తయనగా ధాతువునర్థమగు వ్యాపారమునకు ఆశ్రయము. కర్మయనంగా ధాతువు నర్థమగు ఫలమున కాశ్రయము.

ధాతువులకు వ్యాపారము ఫలము అని రెండర్థములుండును వండు అను ధాతువునకు నిప్పుచేయుట కుండ పొయ్యిమీదఁ బెట్టుట మున్నగు వ్యాపారమును బియ్యపుగింజలు ఉబ్బి మెత్తబడుట అను ఫలమునుగూడ నర్థములే. వీనిలో ధాతువు నర్థమగు వ్యాపారము దేవదత్తునియందుండును గావున నతఁడు కర్తయయ్యెను. ధాతువు నర్థమగు ఫలము (గింజ ఉబ్బి మెత్తఁబడుట = అనగా అన్నమగుట) అన్నమునందుండును గావున నది కర్మయయ్యెను. ఇట్లింతట నూహింపఁదగును.

క్రియలనఁగా వ్యాపారమును బోధించునవి. క్రియలకు కర్మలుండునేని సకర్మకములనియుఁ గర్మలులేనిచో నకర్మకములనియు వ్యవహారము. రాముఁ డన్నమును వండెను. ఇచట వండు ధాతువు సకర్మకము. రాముఁడువచ్చెను. ఇట వచ్చు ధాతువు అకర్మకము.

కర్తృకర్మ క్రియలను (గూర్చి) వాక్యముగాఁ గూర్చుట ప్రయోగమనఁబడును. కర్తృకర్మ క్రియలుగూడన్ అనునది ఉపలక్షణము. అకర్మకో ప్రయోగంబునఁ గర్తృక్రియలుమాత్రమే యున్నను నద్దానిని ప్రయోగమని

మఱి యనక తప్పదుగదా ఇట్టి ప్రయోగము కర్తృప్రయోగము కర్మప్రయోగము అని రెండువిధములుగా నుండును.

(కర్తరిప్రయోగము కర్మణిప్రయోగము అనుట సమర్థనీయము. కర్తరి కర్మణి అనునవి సంస్కృతవిభక్తితో గూడినపదములు వీనికిఁ దెనుగునఁ బ్రవేశము సమ్మతము కాఁజాలదు. కర్తరిప్రయోగ, కర్మణిప్రయోగ, అనువానిని అలుక్సమాసములని సమర్థించుకొనవలయును. కర్తృప్రయోగము కర్మప్రయోగము అనుట యుచితము.)

క్రియలు కర్తనుగాని కర్మనుగాని బోధించును కర్తను బోధించునపుడు కర్తనుబట్టియుఁ గర్మనుబోధించునపుడు గర్మనుబట్టియు క్రియకు పురుషవచన ప్రత్యయములు వచ్చును. "రాముఁడు వండెను." ఇట వండెననునది కర్తను బోధించుచున్నది. "రామునిచే వండఁబడెను" అనుచోట వండఁబడెననునది కర్మను బోధించును. క్రియచేత కర్మచెప్పఁబడెనేని కర్తృప్రయోగమనియు కర్మచెప్పఁబడెనేని కర్మప్రయోగమనియుఁ జెప్పఁబడును.

కర్తృప్రయోగములలోఁ గొన్నియెడల కర్మయుండును మఱికొన్ని యెడలఁ గర్మయుండదు. కర్మయున్నచో సకర్మకము లేనిచో నకర్మకము ననంబడును. కావున కర్తృప్రయోగము సకర్మక కర్తృప్రయోగము, అకర్మక కర్తృప్రయోగము అని ద్వివిధములుగా నున్నవి. కర్మయుండుటయు లేకుండుటయుఁ గ్రియలనుబట్టి సంభవించును. అనగాఁ గొన్ని క్రియలు అకర్మకములు గొన్ని క్రియలు సకర్మకములును నగుచుండును.

అవ్యయములనగా వేఱువేఱు విభక్తిప్రత్యయములుగాని వచనప్రత్యయములుగాని లేనిశబ్దములు. వచ్చి, రాక, అహో, మున్నగునవి. వీనికి విభక్తి ప్రత్యయములు చేరలేదు. సంస్కృతమున సుప్ప్రత్యయములుగాని తిఙ్ప్రత్యయములుగాని చేరనిచో నవి పదములు కానందునఁ బ్రయోగార్హత నొందవు. అందుచే నవ్యయములకును ప్రథమైకవచనప్రత్యయముచేరి లోపించుచుండును. కాని యన్నివిభక్తుల యర్థమునందును, అన్నివచనముల యర్థమునందును వేర్వేరు ప్రత్యయములుచేరక ప్రథమైకవచన ప్రత్యయముమాత్రమే చేరును. తెనుగున నట్లే యవ్యయములకు ప్రథమైకవచనప్రత్యయముచేరి లోపించునని భావించినచో భిన్న భిన్న ప్రత్యయములు చేరనివి యవ్యయము లని లక్షణమగును.

తెనుఁగున (బాలప్రౌఢవ్యాకర్తలు.) సుప్తిఙంతములే పదములని చెప్పనందున నవ్యయములకు సుప్ప్రత్యయములు చేరకున్నను ప్రయోగార్హములగు పదములే యవియగునని భావింపవచ్చును. అట్లయినచో విభక్తివచనప్రత్యయములుచేరని వవ్యయములనియు లక్షణము సరిపడును.

అవ్యయములు ప్రతిపదోక్తములు లాక్షణికములు అని రెండువిధములుగా నుండును. ప్రతిపదోక్తములనగా వ్యాకరణ ప్రక్రియంబొందక స్వతస్సిద్ధములగు అయ్యో, అహా, పోలెన్, వలెన్, మున్నగునవి. లాక్షణికములనగా లక్షణము (వ్యాకరణము) వలన సిద్ధించిన యవ్యయములు. చేసి, చేయక మున్నగునవి. చేయుధాతువునకు ఇప్రత్యయము, యకారమునకు సకారము మున్నగుకార్యములు చేయఁగా చేసియనునది సిద్ధించెను. కావున నిది లాక్షణికము. ఇట్లే చేయక మున్నగునవియు వ్యాకరణసిద్ధములగుట తెలియఁదగును.

(ప్రకృతిసిద్ధములు = సహజములు.)

**సూ. పదములకుఁ బరస్పరముగల సంబంధ మన్వయమనంబడు ౪**

పదములకు ఒకదానితో నింకొకదానికిఁగల కర్తృక్రియాభావాది సంబంధమే యన్వయమనంబడును. రాముఁడువచ్చెను. అనుచోట రాముఁడు అనుపదము వచ్చెను అనుక్రియలోనికిఁ గర్తగను వచ్చెను అనుపదము రాముఁడు అను పదముతో చేయఁబడిన పనిగను అన్వయించుచున్నవి. ఇట్టిరీతియే యన్వయమనఁబడును.

**సూ. విషయబోధకము వాక్యము. ౫**

**విషయము = తెలియఁదగిన యంశము.**

వాక్యమనగా నెట్టిదియో యీ ప్రకరణమునఁ బ్రథమసూత్రమునఁ జెప్పఁబడెను. అట్టివాక్య మెట్టియర్థమును బోధించునో యిందు వివరించుచున్నాఁడు.

వాక్యమొక సంపూర్ణవిషయమును బోధించునని సూత్రతాత్పర్యము. సూత్రమునందలి పదముల వరుసనుబట్టి యుద్దేశ్యవిధేయభావమును నిర్ణయించినచో (వాక్యము విషయబోధకము అనుతీరునఁగాక) ఏయది విషయబోధకమగునో అయ్యది వాక్యము. అని చెప్పినట్లగును. అట్లయినచో మఱల వాక్యలక్షణమునే చెప్పినట్లగును. అపక్షమున స్పష్టముగాఁ దెలియుటకై

లక్షణాంతరమును జెప్పెనని తలంపవలయును క్రియతోఁగూడిన కారకములే యొకవిషయమును బూర్ణముగా బోధింపఁగలవు క్రియలేనిచో రెండుమూఁడు పదములు ఆసత్తియోగ్యతాకాంక్ష లున్నను పూర్ణవిషయమును బోధింపఁ జాలవు. అట్టివానిని వాక్యమని చెప్పఁదగదు. "రామునియొక్క బంటు" అను రెండుపదములవలన నొకవిషయము బోధింపఁబడదు "రామునియొక్క బంటు వచ్చెను" అని క్రియచేరినచో విషయబోధకమగును అట్టిదియే వాక్యమనఁ బడును ఇట్టి విశేషమును దెల్పుటకే లక్షణాంతరమును జెప్పెనని తలంప వలయును. విషయమును శబ్దసామర్థ్యముచే బోధించునదిమాత్రమే వాక్యమగు ననియు నిటఁదెలిసికొనవలయును హస్తసంజ్ఞాదులు విషయబోధకములయి నను వాక్యమనఁబడవుగదా!

**సూ. ఉద్దేశ్యవిధేయభిన్నంబు విషయంబు.** ౬

విషయముద్దేశ్యవిధేయములతోఁగూడినది. అనగా విషయము నందుద్దేశ్యము విధేయమునని రెండుగలవని యర్థము. ఉద్దేశించి చెప్పఁదగినది యుద్దేశ్యము. మీఁదఁ దెలియఁదగినది విధేయము. ఉద్దేశ్యము వక్తృశ్రోతలకుభయులకుఁ దెలియును. విధేయము వక్తకు మాత్రము దెలియును. విశేష్యాదిక ముద్దేశ్యము. క్రియాదికము విధేయము. విశేష్యాదికము=విశేష్యము, విశేషణము, సర్వనామము. క్రియాదికము=క్రియ, విశేష్యము, విశేషణము, సర్వనామము. ఆదిపద ద్వయముచే అన్నంతక్రియలును నేలాద్యవ్యయములును గ్రాహ్యములు. విశేష్యాదు లుద్దేశ్యవిధేయములు రెండును నగు. క్రియ లుద్దేశ్యములు కానేరవు.

ఉద్దేశ్యవిధేయములకుఁ గ్రమముగా నుదాహరణములు —

ఈ హయంబులు పవనగతిం బఱచు. భార. అర. ౨ ఆ. ౧౬౭. ఇందు హయంబులు విశేష్యము ఉద్దేశ్యము. పఱచున్ — క్రియ, విధేయము. వాగ్భూషణమే సుభూషణము. భర్తృ. విద్వత్పద్ధతి. ౧౯. ఇందు వాగ్భూషణము విశేష్యము, ఉద్దేశ్యము. సుభూషణము — విశేష్యము, విధేయము. వీరభోజ్యముసుమ్ము రాజ్యము. భార. అర. ౨

ఆ.౨౨౨. ఇందు రాజ్యము విశేష్యము, ఉద్దేశ్యము. వీరభోజ్యము — విశేషణము, విధేయము. బాహుకుండనువాఁడెవ్వఁడో ? భార. అర.౨ ఆ.౧౮౫. ఇందు బాహుకుండు — విశేష్యము ఉద్దేశ్యము. ఎవ్వండో — సర్వనామము విధేయము. అవివేకి చెడున్. స్వా 3 ఆ ౧3౫. ఇందు అవివేకి — విశేషణము, ఉద్దేశ్యము. చెడున్ — క్రియ విధేయము. వచ్చినవాఁడు ఫల్గునుఁడు. భార. ఉద్యో 3 ఆ.౮౫. ఇందు వచ్చిన వాఁడు విశేషణము ఉద్దేశ్యము. ఫల్గునుఁడు — విశేష్యము, విధేయము. అక్రోధనుఁడు కరంబధికుండు. భార. ఆది.3 ఆ.౧౪౫. ఇందు అక్రోధ నుఁడు విశేషణము, ఉద్దేశ్యము. అధికుఁడు విశేషణము విధేయము. "మూఁడవవాఁ డెవ్వఁడు" భార. అర.౨ ఆ.౧౮౮. ఇందు మూఁడవ వాఁడు విశేషణము, ఉద్దేశ్యము. ఎవ్వండు — సర్వనామము విధేయము. "కొందఱు పిశాచంబని పఱచిరి" భార. అర ౨ ఆ.౧౦౨. ఇందు కొందఱు సర్వనామంబు, ఉద్దేశ్యము. పఱచిరి — క్రియ విధేయము. "ఇది నలురథఘోషము. భార. అర.౨ ఆ ౧౮౨. ఇందు ఇది సర్వ నామము ఉద్దేశ్యము. అవిషయము — విశేషణము, విధేయము. "వీరె వ్వరయ్య" భార. ఆది.౬ ఆ.౮౯. ఇందు వీరు — సర్వనామము, ఉద్దే శ్యము. ఎవ్వరు — సర్వనామము, విధేయము. "మృగాకులోగ్రవశం బుల కరుగనేల?" భార. అర.౨ ఆ.౭౧. ఏలా వాలాయము సేయు. స్వా.3 ఆ.౯౪. ఇందు అరుగన్ చేయన్ ఇవి అన్నంతక్రియలు ఉద్దే శ్యములు. ఏల, ఏలా, ఇవి యవ్యయములు విధేయములు. మఱియు "సేవితరులఁ గొలువనేటికి" భార. ఉద్యో.౪ ఆ.౫౯. ఇత్యాదు లూహ్యంబులు.

భిన్నంబు = యుక్తము = కూడియున్నదనిభావము.

ఒకవిషయమున దు ఉద్దేశ్యము విధేయమునని రెండుభాగములుండునని సూత్రార్థము. వాక్యములందొకదాని నుద్దేశించి వేఱొక్కటి విధింపఁబడు

బడునో యది విధేయమనియుఁ జెప్పంబడును. ఈ విధేయమే మీఁదఁ దెలి యఁదగిన యంశముగానుండును. ఉద్దేశ్యము వక్తకును శ్రోతకును ఇంతకు మున్ను తెలిసినయంశమ యగుచుండును. విధేయముమాత్రము వక్తకొక్కనికే తెలిసియుండును.

ఈ హయంబులు......। ఇట హయంబులు ఉద్దేశ్యము పవనగతిం బఱచుట విధేయము. ఈ హయములు అను నుద్దేశ్యము ఉభయులకును దెలి యును. పవనగతిం బఱచుట వక్తకుమాత్రమే తెలియును. ఇట్లే మిగిలిన యుదాహరణములందును ఉద్దేశ్యవిధేయము లూహింపఁదగును. ఉద్దేశ్యము క్రియతప్ప మిగిలినపదములన్నియుఁ గావచ్చును. అనగా విశేష్యము విశేష ణము సర్వనామము అన్నంతక్రియలు వీలాద్యవ్యయములుంగూడ నుద్దేశ్యముగా నుండవచ్చును. విధేయము విశేష్యాదులేగాక క్రియలుకూడఁ గావచ్చును. ఉదాహరణములయం దుద్దేశ్యవిధేయములు వివరింపఁబడెను.

సూ. సంపూర్ణ మసంపూర్ణమని వాక్యంబు ద్వివిధంబు. ౭

సమాపకక్రియలుగల వాక్యము సంపూర్ణవాక్యము. అసమా పకక్రియలుగల వాక్యము అసంపూర్ణము.

ఉ॥ దానివిడిచిపోవగానోప కఱచుచు నంతరిక్షమునను హంస లెల్లఁ బిండుగట్టి తిరుగుచుండె. భార. అర.౨ ఆ.౧౩. క. నలుఁడును ధరణీరాజ్యము దలఁగఁగ సర్వంబు నపహృతంబయిన గడుం దలరి దమయంతిఁ గోడ్కొని వెలువడియె నశేషరాజ్యవిభవచ్యుతుఁడై. భార. అర.౨ ఆ ౬౪. మధ్యాక్కర. నన్ను నారాజునకు నెఱింగించి కరుణ నాయందుఁ గావింపు మూఁరంగ ననుఁడు నిషధవిషయమునకరిగి యా హంస వీరసేనజునకు దాని గుణరూపవిభవముల్ సెప్పె భార. అర.౨ ఆ.౨౨ మొ॥ ఇందు విడిచి, ఓపక, అఱచుచు నిత్యాది క్రియా భిన్నకర్తృకంబులగు నసమాపకక్రియలుగల ఉండెన్ వెలువడియెన్ చెప్పెన్ ఇత్యాది సమాపకక్రియలతోడి వాక్యము సంపూర్ణవాక్యము. తలఁగఁగన్, అయినన్, అనుఁడున్, ఇత్యాది క్రియావిభిన్నకర్తృకంబు

లగు నసమాపకక్రియలతోఁడి వాక్య మసంపూర్ణవాక్యమునని యెఱుంగ వలయును.

వాక్యము సంపూర్ణమనియు నసంపూర్ణమనియు రెండువిధములుగా నుండును. అందు క్త్వాతుమున్నర్థకాదులగు (చేసి, చేయన్) నసమాపకక్రియల తోఁగూడిన వాక్యము అసంపూర్ణమని చెప్పఁబడును ఇంకను వాక్యమునం దభిప్రాయము పూర్తిగాఁ దెలియనందునను నాకాంక్ష శాంతింపకపోవుట చేతను నసంపూర్ణవాక్యమనుటయుచితమే సమాపకక్రియతోఁగూడిన వాక్యము సంపూర్ణవాక్య మనఁబడును.

దానివిడిచిపోవగా... ...। ఇందు విడిచి, పోవగాన్, ఓపక, అఱచుచు, పిండుగట్టి, తిరుగుచున్, అను నాఱుపదములును నసమాపకక్రియలే. ఉండెన్ అనునదిమాత్రము సమాపకక్రియ. హంసలెల్ల దానిని విడిచిపోవగాన్, హంస లెల్ల... పోవఁగానోపక, హంసలెల్ల నంతరిక్షమునఁ బిండుగట్టి, హంసలెల్ల నఱచుచున్ అనురీతిని అసంపూర్ణవాక్యములుగలవు. దానివిడిచి... ... ఉండెన్. అనునది సమాపకక్రియతోఁ గూడుటచే సంపూర్ణవాక్యము. ఇట్లంతటఁ జూచు కొనునది.

ఇందుఁ గ్రియాఽభిన్న కర్తృకములగు నసమాపకక్రియలుగల దానినే సంపూర్ణవాక్యమున కుదాహరణముగాఁ జూపెను. అయినను గ్రియావిభిన్న కర్తృకములగు నసమాపకక్రియలుగలవియు సంపూర్ణవాక్యము లుండవచ్చును. నలుఁడును ధరణీరాజ్యము తలఁగఁగ... ...। ఇత్యాదివాక్యమునను తలఁగఁగన్, అయినన్, అను క్రియావిభిన్న కర్తృకములగు నసమాపకక్రియలుగల వెలువడి యెన్ అను సమాపకక్రియతోఁడి వాక్యమును సంపూర్ణమే యనఁబడును.

క్రియాఽభిన్న కర్తృకములగు అనగాఁ గ్రియాసమాన కర్తృకములగు విడిచి, ఓపక, అను సమాపకక్రియలుగల వాక్యములును అసంపూర్ణవాక్యము లనఁబడును.

సూ. వాక్యసముదాయము మహావాక్యము నాఁబడు. అయ్యది రామాయణాదికము. లా

వాక్యసముదాయము=వాక్యముల సమూహము.

అనేకవాక్యముల సమూహము మహావాక్యము నాఁబడును. రామాయ ణాదికములగు గ్రంథములు (ఆద్యంతము) అనేకవాక్యములతోఁగూడియుండును

గావున మహావాక్య మనఁబడును. ఇట్లే గ్రంథమంతయును మహావాక్యము నాఁబడును.

సూ. క్రియాన్వయవాక్యంబులు కొన్ని వ్యంగ్యార్థద్యోతకంబులగు. ౯

భావక్రియలుగలవాక్యము వ్యతిరేకక్రియలుగల వాక్యమునకును వ్యతిరేకక్రియలుగల వాక్యము భావక్రియలుగల వాక్యమునకును, ఉభయము లుభయములకును వ్యంజకము లగునని యర్థము. అపుడు భావక్రియలు ఏన్యంతతద్ధర్మార్థకములుగాను లేక యినన్నంతములుగాను, దద్ధర్మార్థకములుగాను — వ్యతిరేకక్రియ లేన్యంతవ్యతిరేకార్థకములుగాను, వ్యతిరేకార్థకములుగాను నుండును.

వాఁడు వచ్చునేని (లేక) వాఁడు వచ్చిన వీఁడువచ్చును. వాఁడు వచ్చునేని (లేక) వాఁడు వచ్చిన వీఁడు రాఁడు. (వీనికి వ్యంగ్యార్థములు. వాఁడు రాఁడేని వీఁడు రాఁడు. వాఁడు రాఁడేని వీఁడు వచ్చును.) నీ వియ్యవేని నే నియ్యను. నీ వియ్యవేని నే నిత్తును. (వీనికి వ్యంగ్యార్థములు. నీ విత్తువేని నే నిత్తును. నీ విత్తువేని నే నియ్యను.) ఆదిపదంబుచే నితరంబు లూహ్యంబులు. ఇదియే తన్మార్గసూచనాక్రమము. ఇట్లు దీనినింక ననేక ప్రకారంబులఁ జెప్పనువచ్చును.

సమాపకక్రియలతో నన్వయించు వాక్యములు కొన్ని వ్యంగ్యార్థములను స్ఫురింపఁజేయుచుండును. అందు సమాపకక్రియలు వస్తువుయొక్క ఉండుటను గాని లేకుండుటనుగాని చెప్పుచుండును. అట్టివానిని వరుసగా భావక్రియలు, అభావక్రియలు అని ఇందు వ్యవహరించెను. భావక్రియలు అభావమును, అభావక్రియలు భావమును భావాభావక్రియలు అభావ భావములను వ్యంజింపఁ జేయుటవలన మూఁడువిధములగునని భావము.

అపుడు (వ్యంగ్యార్థద్యోతకములగునపుడు) వ్యంజకవాక్యములలో నుండెడి భావక్రియలు ఏని అను నవ్యయము అంతమునఁగల తద్ధర్మార్థకములుగాను, లేదా ఇనన్ అను ప్రత్యయమంతమునఁగల తద్ధర్మార్థకముగాను, కేవల తద్ధర్మార్థకములుగాను నుండును.

ఈ వ్యంజకవాక్యములు రెండు ఖండములుగా నుండును. అందు మొదటి ఖండమున భావక్రియలున్నచో "నేని" అంతమునఁ గలవిగాఁగాని "ఇనన్"

న్నంతముగా గాని యుండును. రెండవ ఖండమున తద్ధర్మార్థకమే యుండును. వ్యతిరేకక్రియ యయినచోఁ బూర్వఖండమున నేన్నంతముగాను నుత్తరఖండమునఁ గేవలము వ్యతిరేకార్థముగను నుండునని. పైన్యర్థక ఉదాహరణములందు స్పష్టముగా నీవిషయము తెలిసికొనవచ్చును "వాఁడు వచ్చునేని వీఁడు వచ్చును." ఇది భావక్రియలుగల వాక్యము. ఇది వాఁడు రాఁడేని వీఁడు రాఁడు అను వ్యతిరేకక్రియలుగల వాక్యమునకు వ్యంజకమగుచున్నది. ఈ వాక్యమునందు వచ్చునేని అనుటకుబదులు "వచ్చినన్" అని యసమాపక క్రియ యుండినను నిట్టే యర్థమువచ్చును "వాఁడు వచ్చునేని వీఁడు రాఁడు" ఇది యుభయక్రియలుగల వాక్యము (వచ్చును అనునది భావక్రియ. రాఁడు అనునది అభావక్రియ) ఇది యుభయక్రియలుగల వాక్యమునకు వ్యంజక మగును. ఇందు భావాభావక్రియలు వరుసగానున్నవి. ఇవి క్రమముగా అభావ భావక్రియలను "వాఁడు రాఁడేని వీఁడు వచ్చును" అనురీతిని వ్యంజింపఁ జేయును. ఇట వచ్చునేని అను పదములకుబదులు "వచ్చినన్"అను నసమాపక క్రియ యున్నను నిట్టే యర్థమువచ్చును.

"నీవియ్యవేని నేనియ్యను" (ఇందు ఇయ్యవు ఇయ్యను అనునవి యభావ క్రియలు) ఇది యభావక్రియలుగల వాక్యము. ఇది నీవిత్తువేని నేనిత్తునను భావ క్రియలుగల వాక్యమును వ్యంజింపంజేయును.

"నీవియ్యవేని నేనిత్తు"నను వాక్య ముభయక్రియలుగలది. ఇందు ఇయ్యవు అనునది అభావక్రియ. ఇత్తుననునది భావక్రియ. ఇది "నీవిత్తువేని నేనియ్యను" అనురీతి నుభయక్రియలుగల వాక్యమునకు వ్యంజకము. ఇందభావభావ క్రియలు వరుసగా భావాభావ క్రియలను వ్యంజింపఁజేయును. ఉభయక్రియలు గల వాక్యములు రెండువిధములు. (1) భావాభావ క్రియావాక్యము (2) అభావ భావ క్రియావాక్యము. ఇవి వరుసగా అభావభావ క్రియావాక్యమునకును, భావాభావ క్రియావాక్యమునకును వ్యంజకములగుచున్నవి. వీనికి రెండిటికిని రెండుదాహరణములు చూపఁబడెనని తెలియనగును.

ఇట్లింకను ననేకప్రకారముల వ్యంజకములగుచుండును.

**సూ. ఇట్లువియె, అనిన, నని పౌర్వ్యర్థకథనప్రారంభపరిసమాప్తిం గ్రమంబుగ నగు.** ౧౦

**పౌర్వ్యర్థకథన ప్రారంభమునఁ బూర్వవాక్యాంతంబునందు**

"ఇట్లనియె" ననియును ప్రారబ్ధవాక్యపరిసమాప్తియందు 'అనిన' అనియును బదంబులు క్రమంబుగఁ బ్రయుక్తంబు లగునని యర్థము.

ఉ॥ వ. అయ్యింద్రునకుఁ గలి యట్లనియె. తే. గీ. అవనిలో దమయంతీస్వయంవరంబు విస్తరిల్లుట విని కడువేడ్కతోడ, నేను దమయంతిచే వరియింపఁబడుదునని తదర్థమై యరిగెద నాసఁజేసి. వ. అనిన నందరు నగి. భార. అర. ౨. ఆ. ౫౬, ౫౭, ౫౮ మొ॥

"ఇట్లనియెన్" అనుపదములు భావ్యర్థకథనమున ననఁగా జరుగఁబోవు నర్థమును జెప్పునపుడు ఆరంభమునం బ్రయోగింపఁబడుననియు అట్టి యర్థమును సమాప్తిచేయునపుడు "అనినన్" అనుపదము ప్రయోగింపఁబడుననియు సూత్రార్థము.

ఇంద్రునితో కలి జరుగఁబోవు విషయమును "అవనిలో ... జేసి" అను పద్యముతోఁ జెప్పుచున్నాడు. ఇది భావ్యర్థ కథనము. దీనిప్రారంభమున "ఇట్లనియెన్" అనియు సమాప్తియందు "అనిన" నగియుఁ బ్రయోగింపఁబడెను.

ఇటు భావ్యర్థమున నని చెప్పఁబడెనుగాని భూతార్థ వర్తమానార్థము లయినను ఈవిధి వర్తించుచునేయున్నది.

ఈ విధాన ముపలక్షణ మనవలయును. ఇట్టి సందర్భములలో శబ్దశక్తిని బట్టియు నర్థమున కనుగుణమగు రీతినిబట్టియు బహువిధముల వాక్యము లుండవచ్చును. ఇట్లనియెన్ అనుటకుబదులు ఇట్లు వచియించెను. ఈరీతింబల్కెను. మున్నగురీతి నుండవచ్చును. అనినను దానికిబదులు అనగన్, అనుడున్ మున్నగు పదాంతరముల ప్రయోగమును దుష్టముగాదు సందర్భానుగుణముగా నాయా పదములు ప్రయోగింపఁబడుచుండును.

## సూ. కొన్నియెడలం దదాదులు విశేషణంబులధ్యాహారంబులగు.౧౧

ఉ॥ క. కలకంఠకంఠి కన్నీరొలికిన సిరియింటఁ నుండనొల్లదు సుమతీ. సుమతిశతకము. ౩౭. (ఇంటన్ = ఆయింట) పురుషుండు రెండుదెఱఁగుల ధరనుత్తముఁడనఁగ బరఁగుఁ దానెయ్యెడలం బరుసములు వలుకకునికిన్ దురితంబులు వొరయఁపనులఁ జొరఁగుటవలనన్.

(రెండు తెఱఁగులన్ = ఈ రెండుతెఱఁగులచేత.) భార. ఉద్యో. ౨ ఆ. ४౧. మొ॥

ఆ యీ మున్నగు విశేషణశబ్దములు కొన్నియెడలఁ బ్రయోగింపఁబడ కున్నచో నధ్యాహార్యములగుచుండును. అనఁగాఁ గల్పించుకొనవలయునని భావము.

కలకంఠకంఠి...... ఇంటన్ అనుపదమునకు విశేషణముగా "ఆ" శబ్దము అధ్యాహరింపఁబడును. ఏయింటఁ గన్నిరొలికెనో ఆయింటనని యర్థము. ఇట్లే రెండుతెఱఁగుల ననుచోట "ఈ" శబ్ద మధ్యాహృతమయి ఈ రెండుతెఱఁగులనని యర్థమగును.

సూ. కొన్నియెడల సంబంధంబునం బూర్వవాక్యంబునందలి పదం బధ్యాహార్యంబగు. ౧౨

ఉ॥ గొంతిసంకటపాటు కోడలి బన్నంబు. భార. భీష్మ. ౨. ఆ. పంక్తిముఖు నాతని తమ్ములఁ గుంభకర్ణునిం దనయుని మేఘనాదుని. నిర్వ ౨ ఆ. ౧४ దానవేశ్వరునకుఁ దమ్ములకును. నిర్వ. ౨ ఆ. ౮౨. మొ॥

శేషషష్ఠీవిభక్త్యంతముగ నుండుపదముచే సంబంధము బోధింపఁబడును. అట్లు సంబంధము బోధింపఁబడునపుడు పూర్వవాక్యమునందలి పదము అధ్యాహరింపఁబడుట కొన్నియెడల నగును.

గొంతిసంకటు...... గొంతిసంకటు పాటు అనుచోటఁగల గొంతియొక్క అను సంబంధమును బోధించెడి శబ్దము "కోడలి" అనుపదముతోడను అధ్యాహృతమయి యన్వయించును. ఇటఁ గొంతికిని కోడలికిని గల అత్తకోడళ్ళ సంబంధమిట బోధింపఁబడుచున్నది కాన గొంతిసంకటుపాటు అను పూర్వ వాక్యమునందలి "గొంతి" అను షష్ఠ్యంతము ఇటకును అధ్యాహృతమగుచున్నది.

పూర్వవాక్యమనఁగాఁ బూర్వమునసున్న వేఱొకవాక్యమని యర్థముచేయ రాదు. వాక్యభేదములేకున్నను వెనుకనున్నపదము నధ్యాహారముచేయుటయుఁ గలదు. గొంతిసంకటుపాటును, కోడలి బన్నంబునుగూడ "తీర్చెదను అను ఒకే క్రియతో నన్వయించును కావున నిట భిన్నవాక్యంబులేదు. ఇట్లే

మూఁడుదాహరణములందును వాక్యములు వేఱుకావు. ఏకవాక్యములే. అందుచేఁ "బూర్వవాక్యమునందలి అనుమాట లాక్షణికమయి పూర్వముననున్న అని మాత్రము అర్థమునుబోధించునని తెలిసికొనవలయును. ఇట అన్నికర్తృవాచక పదములును క్రియలోని కన్వయించినంతమాత్రమున వేఱు వేఱు వాక్యములని చెప్పనక్కఱలేదు. ఇట్టివాని ననేక కర్తృక క్రియలని వెనుక యీతఁడు వాడెను. అంతియకాక ద్వంద్వసమాసాది స్థలములందు తల్లిదండ్రులు వచ్చిరి అనుచోట తల్లివచ్చెను, తండ్రివచ్చెను. అని వేర్వేరు వాక్యములను కల్పించుకొనుట లేదుకదా. అట్లే యిప్పటను గొంతిసంకటపాటు .. ...। కోడలి బన్నంబు... ...। అని వేర్వేరు వాక్యములను సృష్టించుకొనన నక్కరలేదు. భిన్నవాక్యములను కల్పించుకొనిన యపుడుమాత్రమే "పూర్వవాక్యమునందలి" యను పదము సరిపడును.

పంక్తిముఖు... ...నాదుని। ఇట నాతని తమ్ముని అనుచోటనున్న "అతని" అను షష్ఠ్యంతము తనయునిన్ అను పదమునకును అన్వయించుచున్నది.

"దానవేశ్వరునకుఁ దమ్ములకును" ఇట దానవేశ్వరునకును దానవేశ్వరుని తమ్ములకునని యన్వయము ఇట "దానవేశ్వరునకు" అను పూర్వ ప్రయుక్తపదము అల్పముగామార్చి యధ్యాహారముచేయుట గమనింపవలయును. దానవేశ్వరునకు అను కువర్ణకముతోనున్న పదమును యొక్క షష్ఠ్యంతముగా దానవేశ్వరునియొక్క తమ్ములకును అనువిధమున గ్రహింపవలయును

పూర్వసూత్రోదాహరణములందు అధ్యాహృతపదము సమానాధికరణ (విశేషణ)ముగా నుండును ఇట వ్యధికరణముగా నుండును. ఈ భేదమునుబట్టి సూత్రము భేదించెను.

ఇందు సంబంధ మనగాఁ జుట్టరికమని యర్థముచెప్పుటకంటె శేష షష్ఠ్యర్థమగు సంబంధమని చెప్పుట యుచితము. కానిచో చుట్టరికములేని స్థలమున నధ్యాహారమునకై వేరొకసూత్ర మావశ్యకమగును. "ఏవాని బంధుమిత్రులు జీవధనంబులును దప్పిఁ జెందును" అనుచోట "నేవానియొక్క" అను షష్ఠ్యంతము జీవధనంబులును అనుపదంబుతోడను నన్వయించుటకై యధ్యాహారము గావించుకొనవలయును. అట జీవధనంబులకును ఏవానికిని చుట్టరికము లేదు. సంబంధ సామాన్యమే. కావున సంబంధపదమునకు శేషషష్ఠ్యర్థమగు

స్వస్వామిభావాది సంబంధము అర్థమని తెలిసికొనుట యుచితము. శబ్దపరిచ్ఛేదము ౪౬ సూత్రమున సంబంధమనగా స్వస్వామిభావాదికమునే గ్రహించుచున్నారము. ఇచ్చటను సంబంధపదమున కట్లే యర్థముచేయుట యుచితము.

సూ. న్యూనవచోవాక్యంబునం దవ్వచనంబు లధ్యాహార్యంబు లగు. ౧౩

(న్యూనవచనంబులు – ఐన, ఏని, ఏ, ఓ, మొ.)

ఉ॥ ఎత్తెఱంగున ధర్మక్రియం జిత్తంబునం జేర్పవలయు జీవించు తఱిన్." భార. అను. ౪ ఆ ౨౫౧. (ఎత్తెఱంగునన్=ఎత్తెఱంగుననైనను, లేక ఎత్తెఱంగుననేని అని యిక్కడ ఐన, ఏని, యవ్యయంబు లధ్యాహార్యంబులు. ఇట్లు మీఁదను నెఱుఁగునది.) అక్కట మందభాగ్యునకు నట్టి తనూభవరత్నమెవ్విధిన్ దక్కునె. భార. ద్రోణ.౨ ఆ.౨౪౦. తరుణీ యేరికిఁ జెల్లునె యరయఁగ నే మింతవార మనుకొన. కళా.౧ ఆ.౭౨. వీని నెమ్మెయిన్ బట్టి వధింతు. విష్ణు. ౭ ఆ. ౧౬౩. అన్నం బొండొకలేదు. పాండు. ౪ ఆ. ౧౭౬. దైవ మకటా యిటనైనను దెచ్చునె యేమివచ్చనే. చంద్ర. కర్మములు మేలునిచ్చును. భాగ.౧౦ స్క.౦. పూ. ౩౨. (కర్మములు, కర్మములే యని యిక్కడ నేవార్థమధ్యాహార్యము.) డప్పిఁ జెందును. (చూ. మీఁదు.) డప్పిఁ జెందునో యని యిక్కడ "నో" యధ్యాహార్యము. మొ॥

న్యూనవచోవాక్యంబునన్ = ఆవశ్యకములగు పదములు ప్రయోగింపఁబడక తక్కువగానున్న వాక్యమునందు. న్యూనములగు పదములుగల వాక్యమునఁదునని యర్థము. తద్వచనమ్ములు = న్యూనార్థమును జెప్పెడి శబ్దములు.

సాధారణముగా ఐనన్, ఏని, మున్నగు నవ్యయముల యర్థము గమ్యమానమగుచుండుటచే నాశబ్దములు ప్రయోగింపఁబడకుండుట చూపట్టుచున్నది. అట్టితఱి నా శబ్దములు అనగా "ఐనన్, ఏని, ఏ, ఓ" మున్నగునవి యధ్యాహార్యములగునని తాత్పర్యము. ఇట ఐనన్ ఏని మున్నగువానికి "న్యూనవచనంబులు" అనునది సంజ్ఞకాదని తెలియఁదగియును,

ఎత్తెఱఁగున... ...। ఎత్తెఱఁగుననైనను నని యిటునర్థమురావలయును. కాని అయర్థమును బోధించు "ఐనన్" అనుపదము ఇట తక్కువయ్యెను. ఆ తక్కువయగుపదము నధ్యాహార మొనర్చుకొని యెత్తెఱఁగుననైనన్ అని యర్థమును సంపాదింపవలయును.

"ఉక్కట... ...దక్కునె ?" ఎవ్విధినైనను అని యిటను ఐనన్ అనునది యధ్యాహార్యము. ఇట్లే యేరికినైనను, ఎమ్మెయినైనను, అనియుఁ దెలియ నగును.

అన్నంబొండొక లేదు. ఇట "అన్నంబొండిక" అను పాఠము సుబోధిని లోఁ జూపఁబడెను. ఆ పాఠమే యిట యుక్తముగాఁ దోచుచున్నది. అన్నం బొండొక అను పాఠమున ఒక అనునది ప్రత్యయరహితముగాఁ గానవచ్చు చున్నది. ప్రత్యయరహితముగానుండి కేవలము "ఒక" అని ప్రాతిపదికముగాఁ బ్రయోగింపఁబడుట యుచితముకాదుగదా. కావున "నొండొక" అను పాఠ మపపాఠము. అసాధువు. ఒక అనునది సమాసమునందుం బూర్వపదముగానున్న పుడు విభక్తిలోపించును గావున "నొకయన్నము" అనురీతి నుండవచ్చునుగాని వ్యస్తముగానున్నప్పుడు ఒక యని ప్రయోగింపఁబడదు. అన్నంబు + ఒండు + ఇక, అనియే యిటుపదములు. అన్నఁబొండు = అన్న మొక్కటి యయినను. లేదు అను నర్థమిట వివక్షితము. అన్న మొక్కటి యయినను లేదు. ఇతరములగు వస్త్రభూషణ సౌఖ్యాదులవిషయము చెప్పనేల ? అని యర్థము స్ఫురించును.

దైపమకటాయిట... ...। ఇటనైనను నని యర్థము.

ఈ యుదాహరణములందు ఐనన్ అనిగాని దానితో సమానార్థకమగు "ఏని" అనిగాని అధ్యాహార్యము.

కర్మములు... ...। ఇట కర్మములే అని "ఏ" అధ్యాహార్యము. దప్పిఁ జెందునో యని ఇట "ఓ" అధ్యాహార్యము.

సంస్కృతమున నాలంకారికులు ఇట్టి స్థలములను దోషముల కుదాహ రణములుగాఁ జూపిరి. ఇట్టిదానిని ప్రతాపరుద్రీయమున వాచ్యవర్జితము అను దోషముగను కావ్యప్రకాశమున ననభిహితవాచ్యమను పేరుగల దోషముగను జూపిరి. అట్టిస్థలములనే యీతఁడు న్యూనపదోవాక్యములని చెప్పెనని తెలి యఁదగును. "మనోరథ దూరవర్తి" యనుచోట మనోరథా నామపి దూరవర్తి

అను నర్థము రావలసియున్నదనియు నట్టియర్థమును జెప్పెడి శబ్దముచ్చటలేదు కావున నిదియొక దోషమనియు వారి యాశయము.

**సూ. కొన్నియెడలం గర్తృకర్మక్రియ లధ్యాహార్యంబులగు. ౧౪**

ఉ॥ కర్తకు :— నన్నుజూచి నగరె? (జనులు కర్త అధ్యాహార్యము.) భార. అర. ౨ ఆ ౧౩౬. క. సరకు గొనరు సురవరులను గురుశక్తిని భీష్మబాహ్లికులఁ గైకొన రుద్ధురత జరాసంధుని వెరవరిగా మెచ్చరు మహేశవరగర్వమునన్. (హంసడిభకులు కర్త అధ్యాహార్యము) ఉ. హ. ౪అ ౧౧౧ మొ॥ కర్మమునకు – దవదహనం బుదగ్రతను దాహముచేయుచునున్నఁ జూచి (దాహముచేయుటను కర్మము అధ్యాహార్యము.) భార. అర. ౨ ఆ. ౧౨౩. మొ॥ క్రియకు. ప్ర. అక్కడ నెవడున్నాడు? ఉ. రాముఁడు (ఉన్నాఁడు అధ్యాహార్యము.) మొ.

కొన్నియెడల కర్తగాని కర్మగాని క్రియగాని యధ్యాహార్యమగును. వాక్యమునకు ముఖ్యాంగములయిన కర్తృకర్మ క్రియలుగూడఁ గొన్నిచోట్ల నధ్యాహార్యములు కావచ్చునని భావము.

దవదహనంబు... ...। ఇట దాహముచేయుట అను క్రియలోనికిఁ గర్మయగు వనము అధ్యాహార్యము. దవదహనము వనమును ఉదగ్రతతో దాహము చేయుచు నుండగాఁ జూచి అని యన్వయము. ఉదగ్రతరుదాహము అను పాఠము ప్రౌఢవ్యాకర్తృ సమ్మతముగాదు అట్లయినచో దాహమునకు తరువులు కర్మయగును గావున నధ్యాహార మనావశ్యకమగుటచే నుదాహరణమే కాకపోవును.

**సూ. అనేక కర్తృకక్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబు అగు. ౧౫**

ఉ॥ వీవాని బంధుమిత్రులు జీవధనంబులును డప్పిఁజెందును గృశునింగా వాని నెన్నఁగాఁదగు. భార శాంతి ౧ ఆ ౯౨ సుర గంధర్వప్రభృతులు ధరణీశైలాపగాబ్ధి ధాత్రీజాదుల్ ఖరవర నీకేతుపక్షి వరయుఁగ గావించు! రామా. అర. ౨ ఆ. ౩౪౭. [illegible]

విశ్రమించిరి. ఉ. హరి.౪ ఆ.౩౧. వ. సర్వభూతంబులు దేవాసురులు వినాశగతులుకారె. రా. అర.౨ ఆ ౩౪౫. మొ॥

ఒక క్రియలోని కనేక కర్త లన్వయించుటయు నుండును. అట్టిక్రియ యనేక కర్తృక క్రియ యని యిట గ్రాహ్యము కర్తలు అనేకములయిన యపుడు కర్తృవాచకపదములలో క్రియాపదమునకు సమీపముగానున్న పదము ననుసరించి మహత్త్వా మహత్త్వములును ఏకత్వ బహుత్వములును క్రియాపదమునకు వచ్చునని యభిప్రాయము.

ఏవాని......। ఇటఁ జెందుట యను క్రియకు బంధుమిత్రులు, జీవ ధనములుంగూడ కర్తలే అయినను "జెందును" అను క్రియాపదమునకు సమీపముగా జీవధనంబులు అను పద ముండుటచే దానినిబట్టి చెందు అను ధాతువునకు అమహద్రూపము వచ్చెను. కనుకనే బహువచనమునకుబదులు ఏకవచనముగూడ వచ్చెను. భూతార్థమున నమహద్వాచక క్రియకు బహువచనస్థానమున నేకవచనము వచ్చునుగదా. (చూ బాల. క్రియ ౨౫ సూ॰) బంధుమిత్రులు అను కర్తనుబట్టి క్రియాపద మేర్పడినచోఁ జెందిరి అని మహద్బహురూపముతో నుండవలసియుండును. బంధుమిత్రులు అను కర్తకంటె జీవధనంబులు అనుకర్త "చెందునను" క్రియకు సమీపముగా నున్నది.

సురగంధర్వ ~~గంధర్వ~~ప్రభృతులు, ధాత్రీజాదులు, అను కర్తలలో రెండవది క్రియాపదమునకు దగ్గరగానుండుటచేఁ గావించెన్ అనునది అమహద్వాచకము ఏకవచనాంతము నయ్యెను.

తమసేనలు, వారు, అను రెండింటిలో రెండవదానింబట్టి విశ్రమించిరి అని మహద్బహువచనాంతమయ్యెను. సర్వభూతంబులు, దేవాసురులు, అను వానిలో రెండవదానింబట్టి కారె అను క్రియ మహద్బహువచనాంతమయ్యెను.

ఈ సూత్రమున లింగశబ్దమునకు మహత్త్వాదు లర్థముగాఁ దలంపవలయును. సంస్కృతమునందువలెఁ దెనుగున శబ్దములకు లింగవ్యవహారము లేదు. క్రియాపదములం దతిదేశమయినను లేదుగదా. (అచ్ఛికశబ్దంబులెల్లఁ దఱచుగా స్త్రీసమంబులుం గ్లీబసమంబులు నయ్యియుండునను సూత్రముచే సుబంతములకు సూత్రము లింగ మతిదేశింపఁ బడెను గదా ) కావున నిట మహత్త్వా మహత్త్వములనియే యర్థము.

సూ. భూతార్థాసమాపకక్రియ వలయుచో వాక్యాంతరజనిస్థానం బగు. అగుచోఁ గర్త తత్కర్తలందలిదియ యెద్దియే నొంటగు. ౧౬

వలసినప్పుడు కొన్నియెడల భూతార్థకాసమాపకక్రియనుండి వాక్యాంతరము పొడముము. అప్పుడు దానికిఁ గర్త యా యసమాపక క్రియాకర్తృసముదాయంబునం దుండునదియే యేదైన నొక్కటియగు నని యర్థము.

ఉ॥ మ. ధవళాక్షుల్ చని కాంచిరంత నెదురన్ దత్తీరదేశంబునం దవదాతాంబుజఫేనపుంజనిభు నయ్యశ్వోత్తముం దవ్వులన్. వ. 'కని కద్రువ వినతంజూచి' (ఇక్కడ కని, కనగా నందునను నర్థము నిచ్చుచున్నది.) భార. ఆది.౨ ఆ.౩౦, ౩౧. వ. దేవలోకంబున కరుగువారెదుర ద్వాపరంబులో వచ్చు కలిం గని శక్రుం డిదియేమి యెందులకుం బోయెద వని యడిగిన నయ్యింద్రునకుఁ గలి యిట్లనియె. (ఇక్కడ కని. కనిరి. అందు నను నర్థము నిచ్చుచున్నది.) భార. అర.౨ ఆ,౫౮. ఇట్లింతట నూహ్యంబులు. చ. శుంభ నిశుంభు లుగ్రకోపనులయి డాసి శుంభుఁ డతిభైరవసైన్యసమేతుఁడై రయంబునఁ గవిసెన్. మార్క.౦.౭ ఆ.౧౮౫ మొ॥

ఏతల్లక్షణానుక్తవిశేషప్రయోగంబులుం గలవు. ఉ॥ వ. నలుఁడు... ...దమయంతీ ద్వితీయుండై యుండి భుభుక్షాపీడ సహింపనోపక హిరణ్యపక్షంబులతో దమ ముంగటఁ దిరుగుచున్న పక్షులం గని యవి భక్ష్యం బగునని యప్పక్షులం బట్టికొన సమకట్టి కట్టిన పుట్టంబు వాని పై వైచిన నవి పుట్టంబుతోన గగనంబున కెగసి నవ్వుచు విగతవస్త్రుండై న నలున కిట్లనియె. (ఇందు ఉండి అనునంతవఱకుఁ గల యసమాపకక్రియలకుఁ గర్తలు నలదమయంతులు. ఓపక అనునది మొదలు వైచినన్ అనునంతవఱకుఁ గల యసమాపకక్రియలకుఁ గర్త నలుఁ డొక్కఁడె ద్రష్టవ్యము. భార. అర.౨ ఆ.౬౬. సీ. ఆహారసన్నద్ధులయి భీమ

కర్ణనందన మేఘవర్ణులు ధర్మతనయు పాదంబులకు మ్రొక్కి పంకజాక్షునకు దండము పెట్టి యంతఃపురమున కరిగి కుంతికి నెఱిఁగి వీడ్కొనివచ్చి వివ్వచ్చు గ్రుచ్చి కౌఁగిటఁజేర్చి గు స్తరించి, యనఘ నేఁ దురగంబు గొని వచ్చునందాక నంగరక్షకుఁడవై యధిపుఁ గాచియుండు మని మాద్రి పుత్రులను పచరించి ద్రౌపదికిఁ జెప్పి మఱియును దానవారి యడుగులకు వ్రాలి యద్దేవు ననుమతమున నరిగె ననుమోదమున యౌవనాశ్వపురికి. ఇందు వచ్చి అనునంతవఱకుఁ గలయసమాపకక్రియలకుఁ గర్తలు భీమ కర్ణనందన మేఘవర్ణులు. గ్రుచ్చి యనునది మొదలు అరిగె ననునంతవఱకుఁ గల యసమాపకక్రియలకుఁ గర్త భీముఁ డధ్యాహార్యము. జై. ౧ ఆ. ౧౩౮. ఇట్టివి ప్రయోగంబులవలన నెఱుంగునది.

భూతార్థకాసమాపకక్రియ = క్త్వార్థకము. వచ్చి, చూచి, మున్నగునవి. వాక్యాంతరజని స్థానంబు = వేఱొకవాక్యము జనించుట కాధారము (జని = పుట్టుట)

వాక్యంబునఁ గ్త్వార్థకశబ్దంబుండెనేని యయ్యదియ సమాప్తవాక్యమగును. కావున నాక్రియ నాధారముగాఁ జేసికొని వేఱొకవాక్య ముదయించును. అట్లుదయించిన వాక్యాంతరమునకుఁ గర్త వెనుకటి వాక్యమునందలి కర్తలలో నిడేయగునని భావము. అనగా మొదటివాక్యమునం దనేక కర్తలుండగా రెండవ వాక్యమునందు వానిలో నొక్కటిమాత్రము కర్తయగునపుడు ఈ సూత్రమున కుదాహరణమగును.

ధవలాక్షులు....। ఇందు కని అను క్త్వార్థకము "శక్రునివ వినతంజూచి" యను వాక్యాంతర ముదయించుటకు ఆధారమయ్యెను. "కని" అను నసమాపక క్రియకు ధవలాక్షులందఱును గర్తలు. కాని రెండవ వాక్యమునందు ఆ ధవళాక్షులలో నొక్కతెయగు సుభద్రమాత్రమే కర్తయగును.

ఇట్లే "కల్గిం గనుట' లో శక్రాదులందఱును గర్తలగుచుండగా నడుగుటలో శక్రుఁడు మాత్రమేకర్తయగును. ఇట్లే శుంభ నిశుంభులు డాయుటలోఁ గర్తలగుచుండగా కవిఘ్నుటలో శుంభుఁడు మాత్రమే కర్తయయ్యెను.

ఈ సూత్రమునకుఁ జెప్పఁబడని విశేషప్రయోగములు మఱికొన్ని గలవు వినదగినవి. ఊహ్యములవియు "వితల్లక్షణాభు....। అను వాక్యములు

సూచించెను. అనగా నసమాపక క్రియనుండి యుత్పన్నమయిన ద్వితీయవాక్యమునఁగల కర్తమీఁది యుదాహరణములందువలె వాచ్యముగాక యధ్యాహార్యమగుటయుఁ గలదనిభావము. అట్టివి రెండు స్థలము లుదాహరించుచున్నాఁడు.

"నలుండు......ఇట్లనియె" ఇందు ఉండుటలో (ఉండి) దమయంతీ నలులిద్దఱును గర్తలగుచుండగా నోపకుండుట మున్నగు క్రియలలో నలుఁడు మాత్రమే కర్తయగుచున్నాఁడు ఇట "నలుఁడు" అనుపదము వెనుకటి యుదాహరణములందువలె వాక్యమునలేదు అధ్యాహారము చేసికొనవలయును ఇదియే పూర్వోదాహరణములకంటె నిటఁగల భేదము.

"ఆహవసన్నద్ధులయి......పురికి" ఇందు భీమాదులు మువ్వురు కర్తలుగాఁ జెప్పఁబడిరి. కాని మ్రొక్కుట మొదలుకొని "వచ్చి" యనునంతవఱకుఁగల పనులలో మువ్వురును గర్తలగుచున్నను వివ్వచ్చుం గ్రుచ్చికౌగిటం జేర్చుకొనుట మున్నగు క్రియలలోఁ గర్ణనందన మేఘవర్ణులుఁగూడ కర్తలనుట యనుచితము. పినతండ్రియగు వివ్వచ్చును గర్ణనందనుండు నమస్కరింపవలయునుగాని కౌగిలించుకొనుట యుచితముగాదు. కనుకనే తరువాతి వాక్యమున "నే" అని ఒక్కనినే కర్తగా సూచించెను. మువ్వురును గర్తలయినచో మేము అని చెప్పునుగదా! కావునఁ గౌగిటఁ జేర్చుట మున్నగు క్రియలలో కర్తృవాచకమగు భీముఁడనుపద మధ్యాహార్యమగుచున్నది.

ఇందు "నలుండు......దమయంతీ ద్వితీయుండై" అనుచోట "ఉండి" అను క్రియలో నలదమయంతు లిర్వురును గర్తలని ప్రౌఢవ్యాకర్త వ్రాయుట విచారణీయము. నలుండు అనుపదము మాత్రము 'ఉండి' అను క్రియలోనికిఁ గూడ నన్వయించుచున్నది. ఉండి అను క్రియలోనికి దమయంతి కర్త్రిగాదు. దమయంతీ ద్వితీయుండై అనుపదము "నలుఁడు" అనుదానికి విశేషణము. దమయంతికూడ నుండెనను విషయము అర్థసిద్ధమగునేకాని దమయంతి శాబ్దముగఁ గ్రియలోనికి కర్త్రిమాత్రము కాఁజాలదు కనుకనే యిట్టిచోట సమాపక క్రియ చెప్పవలసియున్నచో "నుండెను" అని యేకవచనాంతముగనే యుండును కాని "యుండిరి"అని బహువచనాంతముగా నుండదు. ఉభయులును గర్తలయినచో "నుండిరి" అనియే యుండునుగదా? "పుత్రేణ సహాగతః పితా" ఇత్యాదులఁదయినను నాగమనక్రియలోనికి పితయొక్కఁడే కర్తయగును.

పుత్రుని యాగమనము అర్థసిద్ధము మాత్రమే. ఇట దమయంతీ పదమునకు "ద్వితీయ" పదముతోడను మాత్రమే యన్వయము క్రియతో నన్వయములేదు. కావున నిట నన్నిక్రియలయందును "నలుండు" అనుపదమే కర్తృవాచకము. అధ్యాహారమక్కఱలేదు. ఇది యుదాహార్యముకారాదు. తరువాతిదిమాత్ర ముదాహరణము కావచ్చును కాని యిట్టి ప్రయోగములు (అహవసన్నద్ధులయి......ఇత్యాదికము) ప్రామాదికములనుటయే యుచితము. భారతమున నిట్టి ప్రయోగములు లేవు

క్త్వార్థకమగు "ని" ప్రత్యయము సమానకర్తృకములకే వచ్చుట సామాన్యముగా నున్నది. ఇందలి యుదాహరణములం దట్లుగాక సమాపకక్రియకును క్త్వార్థకమునకును గర్తలు భిన్నముగానున్నారు అసమాపక క్రియలోనికిఁ గర్తలనేకులగుచుండగా సమాపక క్రియలోనికి వారిలో నొక్కఁడుమాత్రమే కర్తయగుచున్నాఁడు కనుక నీ సూత్రముచేఁ "గర్తృభేదమున్నను" "ఇ" ప్రత్యయాంతక్రియ ప్రయోగింపవచ్చున"ని యనుమతింపఁ బడుచున్నది.

విచారింపగా నిట్టి ప్రయోగములు చింత్యములే యనవచ్చును. భారత కవులిట్టి ప్రయోగములను జేసియుండలేదనవచ్చును. ఇందలి "ధవళాక్షుల్ ..." అనుచోట కని అను పదములోనికి కద్రువయే కర్త్రియని భావింపవలయును. ధవళాక్షుల్ చని కాంచిరి అని వెనుకటివాక్యము సమాప్తమయ్యెను. కని అను క్రియలోనికి కర్తగా ధవళాక్షులనుపదము నధ్యాహరించుకొనుటకంటె సమీపమునను్న కద్రువ అనుపదమే కర్తృవాచకమనుట సమంజసముగదా. కద్రువ (వెనుకఁజెప్పినరీతిగా) యశ్వోత్తమునుంగని వినతంజూచి యని యర్థము. కావున నిది యుదాహరణము కాఁజాలదు.

"దేవలోకంబున... ...కలింగని... ..." ఇట కలింగనన్ అనియే సాధుపాఠమయియుండును. లేఖక దోషముచే కని యని మూపట్టుచున్నదని భావింపఁదగును. కనన్ అని యున్నపు డయ్యది భావలక్షణస్థలము కావున సమానకర్తృకత్వముండవలయునను నిర్బంధములేదు. (చూ. చైత్రుండు వండనతిథి వచ్చెను )

భారతకవు లిట్టి ప్రయోగములు చేసినట్లు వేఱొకస్థలమునఁ గానరాకుండుటచేతను, యతిప్రాసాదిస్థలము కానందున దృఢమగు నుదాహరణమని తలంచుట కాధారములేనందునను నిట్టి ప్రయోగములు విమర్శనీయములు,

మార్కండేయపురాణ ప్రయోగముగూడ సరియయినదికాదని పాఠాంతరము (... ఉగ్రకోపనులయి॥ రా నిశుంభుఁడతిభైరవ ...) ఉండుటంబట్టియే యూహింప వచ్చును. సుబోధినీకారులును దాని అనుపాఠముకంటె "రా నిశుంభుఁడ" అని యుండుటయే యుచితమని వ్రాసిరి. అట్టి పాఠమున నిది యుదాహరణము కాఁజాలదు.

## సూ. కొన్నియెడల నవయవకర్తృకక్రియ తదవయవి కర్తృకం బగు. ౧౩

ఉ॥ తలవడంకుచునుండు తన పితృవరుల. (తలవడంకుచు నుండు=తలవడఁకుట గలవారగుచునుండుసని యర్థము.) భార. ఆది. ౨ ఆ. ౧౫౧ తేకువసెడియె నీ పాఱుఁడు. (చెడియెన్ — చెడుట కలవాఁ డాయెనని యర్థము.) భార. అర. ౪ ఆ. ౩౫౩. ఇట్లంత నెఱుంగునది. చెలువేదెఁ జందురుండు. భార. ఉద్యో. ౨ ఆ. ౧౦౭. ఎ.గీ. సుభట వర్గంబు లొక్కట సొబగుమాలె. రా. యు. ౧౧౪౦. అక్కట యీ లతాంగి హృదయంబున నీదెసఁ గూర్మియెంతయున్ నెక్కొనియున్నది. మార్క. ౨ ఆ. ౩౦౯. తే. బడలికలువాసి చనుము. స్వా ౨ ఆ ౪౭. మొ॥

అవయవమనగాఁ బ్రధానవస్తువునకు సంబంధించిన యొకభాగముగాని యొకధర్మముగాని అయినట్టిదని తెలిసికొనవలయును.

క్రియలోనికి అట్టి అవయవము కర్తగా నుండవలసియుండగా నా యవ యవముగల యవయవియే కర్తయగుచుండుట కొన్నియెడలఁ గలదని తాత్ప ర్యము. ధాత్వర్థ వ్యాపారాశ్రయము అవయవమే యగుచుండగా యవయవినే కర్తగా భావించి క్రియనన్వయించుట కొన్నిచోట్లఁ గలదనిభావము.

"తలవడంకుచు ... ..." ఇట వడఁకుటలోఁ గర్త తలయే. ఇది యవ యవము. అవయవి పితృవరులు. తల అను నవయవము కర్తగాఁ గలదయ్యును వడకుట "పితృవరులు" అను నవయవిలోని కన్వయించి ఆపదమును (పితృ వరులు) కర్తృవాచకముగాఁ జేసికొనెను. అపుడు తలవడఁకుచునుండు అను క్రియకు తలవడంకుచునుండుట గల అని యర్థమువచ్చునని గ్రంథకర్తయే వివరించెను. కర్త మాఱుటవలన నర్థము మార్పుఁజెందదనని భావింపవలయును,

(ఇందు పితృవరులు అను వస్తువునకు "తల" ఒక అవయవమనగా భాగరూప మైనది.) "తేకువసెడియె నీపాఱుఁడు" ఇచ్చట పాఱుఁడు అవయవి. చెడుట అవయవము ఇట చెడినది తేకువయే కావున నదియే కర్త కావలసియుండగా పాఱుఁడనునది కర్తయగుచున్నది. పాఱుఁడనునది కర్తయగుటకుఁ దగినట్లు చెడియెననుపదము "చెడుటగలవాఁడయ్యెను" అను నర్థమునిచ్చును. ఇట చెడుట పాఱునియొక్క ధర్మము. ఇచ్చట నవయవమునకును (చెడుటకును) నవయవికిని (పాఱునికిని) ధర్మధర్మిభావము సంబంధము. పూర్వోదాహరణమున నంగాంగి భావము సంబంధము.

"చెలువేదెఁ జందురుండు" ఇట చందురుండు అవయవి. చెలువు అవయవము. చంద్రుఁడు సౌందర్యవిహీనుఁడయ్యెనని యర్థము. "ఏదెన్" అను దానికి చెలువుకర్త కావలసియుండగా చంద్రుఁడు కర్తయయ్యెను. చంద్రుఁడు చెలువేదుట గలవాఁడయ్యె నని భావము. చంద్రునికిని చెలువునకును ధర్మధర్మి భావము సంబంధము.

"సుభట... ...మాలెన్" సొబగు అవయవము. సుభటవర్గము అవయవి. మాలెన్ (పోయెన్) అను క్రియకు సొబగు కర్త కావలసియుఁడగా సొబగున కవయవియగు సుభటవర్గము కర్తయయ్యెను. ఇట సొబగునకును సుభటులకును ధర్మధర్మి భావమే సంబంధము.

"అక్కట... ...యున్నది" నెక్కొనియున్నది అను క్రియకు కూర్మి కర్త కావలసియుండగా లతాంగి కర్తయగుచున్నది. కూర్మి అవయవము. లతాంగి అవయవి. కూర్మి ధర్మము. లతాంగి ధర్మి. (నెక్కొనియెన్, నెక్కొని యుండుట కలదయ్యెనని యర్థము) ఇది సరియగు నుదాహరణము కాఁజాలదు. ఇందు లతాంగి అనుపదము క్రియలోని కన్వయింపక హృదయంబున (లతాంగి యొక్క హృదయంబున) ననుపదముతో నన్వయింపవచ్చును. ఆపక్షమున నుదాహరణము కాఁజాలదు.

"బడలికలు వాసి చనుము" (వాసి = పోయి) "నీవు బడలికలు పోవుట కలవాఁడవయి చనుము" అని యర్థము. "బడలికలు" అవయవము. నీవు, అవయవి. బడలికకును నీవు అనుదానికిని ధర్మధర్మి భావము సంబంధము,

అవయవావయవిభావ మనగా సామాన్యముగా నంగాంగిభావమని యర్థము వచ్చును. అనగా భాగము భాగి అనువానికిఁ గల ధర్మమని తోచుచున్నది. కాని మొదటి యుదాహరణమునందు తప్ప మిగిలినవానిలో విశిష్ట సంబంధ

ధము లేదు. అచ్చట ధర్మధర్మి భావము మాత్రమే గలదు కావున నవయవా వయవిభావమనగా గుణగణి భావము లేదా సమవాయసంబంధముచే నాధే యాధారభావమనిగాని తలంపవలయును.

సూ. వాక్యసంగ్రహంబునం దినన్నంత క్రియాపూర్వకంబులగు కాక కాన్యవ్యయంబు లనుక్తవాక్యపదగ్రాహకంబులగు. ౧౮

ఉ॥ కాకకు — తే. నీవు నలునకుఁ జేర్మితో దేవివైనఁగాక నీ సముజ్జ్వల రూపకాంతి విభవ నిత్యసౌభాగ్య భాగ్యాభిజాత్య భద్ర లక్షణావళులవి సఫలంబులగునె. భార. అర.౨ ఆ.౨౦. (వాక్య వ్యాసమునందు — నీవు నలునకుఁ జేర్మితో దేవివైన నీ సముజ్జ్వల రూపకాంతి విభవనిత్యసౌభాగ్య భాగ్యాభిజాత్య భద్రలక్షణావళులవి సఫలంబులగును. కాకున్న నీ సముజ్జ్వల రూపకాంతి విభవ నిత్య సౌభాగ్య భాగ్యాభిజాత్య లక్షణావళులవి సఫలంబులుకావు.) కానికి — "ఆ. నలునకాని నళినదళనేత్ర వరియింపదట్టె" (వాక్య వ్యాసము నందు నలునే వరియించుంగాని వేఱొకని నళినదళనేత్ర వరియింప దట్టె) భార. అర.౨ ఆ ౫౨. మొ॥

వాక్యసంగ్రహమునందు = సూక్ష్మీకరించిన వాక్యమునందు. ఇనన్నం తము = చేదర్థంబునందు వృత్తంబగు భావలక్షణంబునందు నవర్ణకంబు ద్రుతాం తంబగు. (బాల. క్రియ. ౪౧ సూ.) అను సూత్రముచే వచ్చిన నవర్ణక మంత మునఁగలది. ఈ నవర్ణకమునకుఁ బూర్వమున "ఇకారము" నియతముగా నుండును. (భూతంబునం దిగాగమంబగు బాల. క్రియ. ౧౭ సూ.) కావున దీనిని "ఇనన్" అంతమునఁ గలదని చెప్పెను.

కాక, కాని, అను నవ్యయములు ఇనన్నంత క్రియలు పూర్వమునఁ గల వగుచు ఉక్తమగు సంగ్రహవాక్యమున నుండెనేని అనుక్తమగు విస్తరవాక్యము నందలి పదములకు వ్యంజకములగుచుండునని భావము. సంగ్రహవాక్యమువలన విస్తరవాక్యము గమ్యమానమగుచుండును. అట్టియెడల సంగ్రహవాక్యమునందు అనుక్తములయిన పదములను కాక, కాని, అవ్యయములు స్ఫురింపఁజేయునని భావము.

కాక అను నవ్యయ మనుక్తవాక్యపద గ్రాహకమగుట కుదాహరణము. "నీవునలునకు... ...అగునె" ఇందు కాక అనుదానికి అయినన్ అను ఇనన్నంత క్రియ పూర్వమునఁగలదు. ఇయ్యది స్ఫురింపఁజేయుచున్న వ్యాసవాక్యమును వివరణమునందు "నీవు... ...సఫలంబులు కావు" అని వ్యాకర్తయే చూపెను. ఇందు కాక అనునది "అయినన్ అగును. కానిచో కావు" అనుపదములకు గ్రాహకమగుచు విస్తరవాక్యమును స్ఫురింపఁజేయుచున్నది.

"నలునకాని... ...అట్టి" ఇందుకాని అను నవ్యయము "వరియించును వేఱొకని అనుపదములకు గ్రాహకమగుచు విస్తరవాక్యమును స్ఫురింపఁజేయును

సూత్రమునం దినన్నంత క్రియాపూర్వకము లగువానిని మాత్రమే గ్రహించినను ఇనన్నంత క్రియాపూర్వకములు కానివానికిని ఈ కార్యము వచ్చునని యుదాహరణమునుబట్టియే యూహింపనగును. నలునకాని అనుచోట కాని అనుదానికిఁ బూర్వమున ఇనన్నంత క్రియ లేదుగదా. ఇట నవధారణార్థకమగు "అ" అను నవ్యయము పూర్వమునఁగలదు

సూ కొన్నియెడలం గాని క్రియాపూర్వకంబు పూర్వ విరుద్ధోత్తరార్థకంబగు. ౧౯

వాక్యంబులందుఁ బూర్వార్థమునఁ గ్రియమీఁదవచ్చిన కాని యవ్యయ ముత్తరార్థవాక్యముయొక్క యర్థము పూర్వార్థవాక్యము యొక్క యర్థమునకు విరుద్ధముగానుండుననుటను దెలుపుచున్నదియని యర్థము.

ఉ॥ వాఁడు వచ్చునుగాని కార్యవ్యాసంగముచేత రాఁడాయెను. వాఁడు రాఁడుగాని నీ నిర్బంధముచేత వచ్చినాఁడు. మొ॥

కాని = కాని అనుపదము క్రియాపూర్వకంబు = సమాపకక్రియ పూర్వమునఁగలది. పూర్వవిరుద్ధోత్తరార్థకంబు = పూర్వభాగమునకు విరుద్ధమగు రెండవభాగము గలది.

కాని అను నవ్యయము అనుక్తవాక్యపద గ్రాహకమగునని పూర్వసూత్రమునఁ జెప్పఁబడెను. అంతియేకాక మఱికొన్నిస్థలములలో వ్యంగ్యవాక్యమును

స్ఫురింపఁజేయక వాచ్యములగు వాక్యములందే వైరుధ్యమునుమాత్రము స్ఫురింపఁజేయునను విషయము ఈ సూత్రము చెప్పుచున్నది.

కొన్నియెడల సమాపక క్రియాపూర్వకమగు కాని అను నవ్యయము పూర్వవాక్యమునకు విరుద్ధముగానుండు నుత్తరవాక్యముగలది యగునని భావము.

"వాఁడు వచ్చునుగాని....." ఇట వచ్చునను సమాపకక్రియకు తరువాతనున్న "కాని" పదము రాఁడు అను విరుద్ధార్థ వాక్యమును స్ఫురింపఁ జేయుచున్నది. ఇట్లే "వాఁడు రాఁడు......" అనుచోట రాఁడు అను సమాపకక్రియకు తరువాతనున్న కాని పదము వచ్చినాఁడను వ్యతిరేక క్రియను సూచించుచున్నది. అనగా రెండు వాక్యములలో మధ్యభాగమున కాని అను నవ్యయమున్నచో నా రెండు వాక్యములును పరస్పర విరుద్ధార్థకములుగా నుండునని భావము.

సూ. కొన్నియెడల వ్యాసవాక్యమునకు ముందు సంగ్రహవాక్యంబు నొందగు. ౨౦

ఉ॥ వ. అయ్యా! యేను నీకుం బ్రియంబుసేసెద; నీ హృదయేశ్వరియయిన దమయంతి పాలికిం బోయి నీ గుణంబులు దానికి వర్ణించి చెప్పి యక్కన్య యన్యుల నపేక్షింపక నీయంద బద్ధానురాగ యగునట్లు చేసెద. భార. అర.౨ ఆ.౧౮. వ. ఇదియెట్లు? ధర్మపరిపాలనపరులై వీరులై రణనిహతులైన రాజులక్షయసుఖంబు లనుభవింపక నతిథులై యింద్రుల కెంతకాలంబయ్యె రాని కారణంబేమి? భార. అర.౨ ఆ.౩౦. వ. శక్రుం డిదియేమి? యెందులకుం బోయెదవని యడిగిన. భార. అర.౨ ఆ.౯౬. మొ॥

కొన్నియెడల నొకవిషయమునే సంగ్రహముగాను విస్తరముగాను గూడ వేఱు వేఱు విధములుగాఁ జెప్పుచుందురు. (అట్టితరి పునరుక్తిదోషము లేదు.) అట్టి స్థలమున సంగ్రహవాక్యము పూర్వమునను వ్యాసవాక్య మనంతరమునను బ్రయోగింపఁబడునని భావము.

"అయ్యా యేను నీకుం బ్రియంబుసేసెద" ఇది సంగ్రహవాక్యము. "నీ హృదయేశ్వరి......చేసెద." అనునది వ్యాసవాక్యము. ఈ వాక్యములలో

మొదటివాక్యమునఁ బ్రియముచేసెదనని సామాన్యముఁజెప్పి యనంతరవాక్యమున నా ప్రియమెట్టిదియో విశేషమును జెప్పెను. ఇట్లు వాక్యము లొకయర్థమునే బోధించుచున్నను రీతిభేద ముండుటచేఁ బునరుక్తిదోషము లేదని తెలిసికొనవలెను.

"ఇదియెట్లు ?" ఇది సంగ్రహవాక్యము. "ధర్మపరిపాలనపరులై..... కారణంబేమి ?" ఇది వ్యాసవాక్యము. ఇవియును ప్రశ్న సామాన్య విశేషములను వరుసగా బోధించును.

"ఇదియేమి ?" ఇది సంగ్రహవాక్యము. "ఎందులకుం బోయెదవని యడిగిన" ఇది వ్యాసవాక్యము.

**సూ. కొన్నియెడల వాక్యంబు వాక్యాంతరగర్భంబు నగు. ౨౧**

ఉ॥ వ. ఇందుల కెంతకాలంబయ్యె రానికారణంబేమి ? భార. అర.౨ ఆ.3౦. మొ॥ (చూ. క్రిందు)

వాక్యమధ్యమున వేఱొకవాక్యము చేరినచో గర్భితమను దోషముగా నాలంకారికులు చెప్పిరి కాని కొన్నియెడల నట్టిదోష ముండదనుటకై వాక్యగర్భమున వాక్యాంతరము చేరుటయుఁ గలదని సూత్రము చెప్పుచున్నది.

ఇందులకు రానికారణంబేమి ?" అను వాక్యమధ్యమున ఎంతకాలంబయ్యె. అను వాక్యాంతరము చేరియున్నది. ఈ వాక్యము పూర్వసూత్రోదాహరణమునందలి భాగము కావున నా సూత్రవివరణమున దీనిని బూర్ణముగాఁ జూడనగునని "చూ. క్రిందు" అని వ్యాకర్త సూచించెను.

**సూ. పోవుట నిశ్చయార్థంబునం దగు. ౨౨**

ఉ॥ "అల్లుని గల్యాణగుణోత్తరుం బడయ కెట్లుం బోవఁ బోవ్పంచు." నిర్వ.3 ఆ.౮3. మొ॥

పోవుట అను సమాపక క్రియాపదము నిశ్చయము అను నర్థమునం బ్రయోగింపఁబడునని భావము. పోవుట అనుపదమునకు వెడలుము అను నర్థమే గాక నిశ్చయార్థముగూడ నుండుటచే నీ సూత్రము రచింపఁబడెను.

"అల్లుని కల్యాణ......" ఎట్లుంబోవను ఏవిధముగ నైనను వెడలను. పోవుట నిశ్చయము. ఇచట నెదుటివ్యక్తిని అచ్చటనుండి వెడలిపోవుని

చెప్పుట తాత్పర్యముగాదు. తాను వెడలకపోవుట నిశ్చయము అను నంశమే చెప్పఁబడుచున్నది.

సూ. పద్యంబులకుం గులకం బగు. ౨౩

కులకంబనఁ బద్యమునకుఁ బద్యాంతరముతో నన్వయము.
ఉ. "తా నొకపందు చెచ్చెరన్ — కొని వ్రచ్చుడు". భార ఆది. ౨ ఆ.౧౯౮, ౧౯౯ పొ॥

పద్యములలో నొక పద్యములోని పదములు వేఱొక పద్యముతో నన్వయించుటయుఁ గలదని భావము.

"తానొకపందు చెచ్చెరన్" ఇందు చెచ్చెరన్ అను పదముతోఁ బూర్వ పద్యము పూర్తియయ్యెను. "కొనివ్రచ్చుడు" అనునది వేఱొక పద్యమునందలి మొదటి భాగము. ఇందు మొదటిపద్యము నంతమున వాక్యము పూర్తికాలేదు. రెండవ పద్యములోని పదములతోఁ గలసి వాక్యము పూర్తియగును. "ఒక పందు" అను పదము రెండవ పద్యములోని "కొని" అను నసమాపక క్రియలోనికి అన్వయించుచున్నది. ఇట్టి యన్వయము దుష్టముకాదని భావము.

సంస్కృతమున నయిదు పద్యములకుఁ గాని యంతకు మించిన సంఖ్య గల పద్యములకుఁగాని యేకాన్వయమున్నచోఁ గులకమందురు. కాని యిట నట్టి పద్యసంఖ్యా విశేషము వివక్షితము కాదనియుఁ "బద్యమునకుఁ బద్యాంతరముతో నన్వయము మాత్రమే కులకమనియు సామాన్యముగా వివక్షితమయ్యె నని వ్యాకర్తయే "కులకంబన" నిత్యాదిగా సూచించెను.

లోకమునందలి శబ్దములకు వ్యాకర్తలు వేఱువిధమున సంజ్ఞచేయుట కొన్నిచోటులఁ గానవచ్చుచున్నది. రెండుసారులును మూఁడుసారులును గూడ పునరుక్తమగు శబ్దమునకు ఆమ్రేడితమని వ్యవహారమున నుండగా (చూ॥ ఆమ్రేడితం ద్విస్త్రిరుక్తమ్. అమరము) "తస్యపర మామ్రేడితమ్"అని పాణిని ద్విరుక్తమునకు మాత్రమే యామ్రేడిత సంజ్ఞను నియమించెను. అట్లే యితఁడును "కులక" శబ్దార్థమును వేఱువిధముగా నిర్ణయించెను. అని తెలియవలయును. కులక శబ్దార్థము నితఁడిట్లు గ్రహించుటకు "క్వచిత్కులక సంబంధోప్యత్రనాహిత కృద్భవేత్" అను నథర్వణకారికయే మూలము. లేదా కులకశబ్దమిట నుపలక్షకమని యయినను భావింపవచ్చును.

ఇది వాక్యపరిచ్ఛేదము.

# ముక్తలక్షణ వివేచనము

## సంజ్ఞ.

సూ. దీర్ఘపూర్వకమగు లఘురేఫము హ్రస్వపూర్వక మగుచో నలఘురేఫంబగు. ౧

ఉ॥ క. వెఱవక కలలోఁ జేసిన కోఱగామికి వగచుచోట గుణ రత్నము చే, కుఱె నీకు నలిగి తన్నినఁ, బఱపుపయిం బడినయట్లు పద్మ దళాక్షీ. ఉ. హ.౫ ఆ.౧౧౩ మొ॥

ఆయాసందర్భములయందుఁ గొన్ని కొన్ని విషయములు చెప్పవలసి యుండగా చెప్పక విడుచుటచే నట్టివానిని జెప్పుటకీ ప్రకరణమారంభింపఁ బడెను. గ్రంథమంతయుఁ బూర్తియయిన పిమ్మట గ్రంథకర్తకు మఱికొన్ని విషయములు చెప్పవలసినట్లు తోఁచుటచే నిటు వానిని బ్రత్యేకముగాఁ జెప్పు చున్నాఁడు.

ముక్త = విడువఁబడిన, లక్షణ = విధులయొక్క, వివేచనము = విమర్శించుట. వెనుక చెప్పక విడిచిన కొన్ని విధులను ఈ ప్రకరణమున వివరించు చున్నాడని తాత్పర్యము. సంజ్ఞా సంధి సమాస ప్రకరణములకు సంబంధించిన యంశములను వరుసగాఁ గొన్నిఁటిని సూచించుచున్నాఁడు.

తెనుఁగునఁ గొన్ని పదములలో నొక్కొకచో దీర్ఘమునకు హ్రస్వము వచ్చుచుండును. (చూ. బాల. ప్ర. ౧౧, ౧౨. సూ.) అట్లు దీర్ఘమునకు హ్రస్వము వచ్చెనేని యా హ్రస్వమునకు తర్వాతనున్న లఘు రేఫము అలఘు రేఫముగా మాఱును.

ఉ॥ చేకూరు, చేకుఱు "వెఱవక ... ... దళాక్షీ" ఇటు చేకూరు అను పద ములోని ఊకారము బాల. ప్ర. ౧౧ సూ.చే హ్రస్వమయ్యెను. అట్లు హ్రస్వ మగుటచే దానితర్వాతనున్న రేఫము శకటరేఫముగామాఱి చేకుఱెన్ అని యయ్యెను. ఇది ప్రాసస్థలమున నుండుటచే మార్పరానిది. కావున ప్రామాణికము.

సూ. అలఘురేఫము లుప్తోచ్చ మగుచో లఘురేఫంబగు. ౨

ఉ॥ తే. గీ. నీవును నాపదకోర్చి భంగపాటు తీర్చికొనుము. భార. విరా. ౧ ఆ. ౫౮ మొ॥ లఘుశ్చ భవేద్గురుః కుత్రచిద్గురుశ్చలఘుశ్చ భవేత్। ఉచ్చారణస్య కల్ప్యత్వాన్నిదానం తత్రసద్వచః॥ అని యథర్వణాచార్యులు. మఱియు నాన్యేషాం వైధర్మ్యం లఘ్వలఘూనాం రయోస్తు నిత్యం స్యాత్. అనయోస్సంగతిం యస్తుకరోతి కవితాకృతౌ। అస్యా అత్యంతదోషత్వాద్దుష్కవిస్సహికథ్యతే॥ అని ప్రథమాచార్యులును, ద్వితీయాచార్యులును నియమించి యుండుటంజేసి యవి పూర్వరేఫంబులే యగుటకు వల్లకాదు. (చేకూరు – లఘురేఫము. తీఱు – అలఘురేఫము.)

లుప్తాచ్కము = లోపించినయచ్చుగలది.

అలఘురేఫమునందలి యచ్చు లోపించినచో నా యలఘురేఫము లఘురేఫముగా మాఱిపోవును అని సూత్రార్థము.

తెనుఁగునఁ గొన్ని పదములలోఁ గొన్ని యచ్చులకు లోపమువచ్చుట గలదు. (చూ బాల. ప్ర. ౧౭. ౧౮ సూ) అట్టి స్థలమున నీ సూత్రముచే నలఘురేఫము లఘురేఫముగా మాఱిపోవునని యభిప్రాయము తీఱిచి, తీర్చి.

"నీవును నాపదకోర్చి .. కొనుము" ఇట తీఱిచి అను పదమునందలి అవర్ణముమీఁది యికారము బాల. ప్ర. ౧౮ సూత్రముచే లోపించెను. కావున నీ సూత్రముచే నా యలఘురేఫము లఘురేఫముగా మాఱెనని తెలియనగును. ఓర్చి, తీర్చి అను పదములు రెండును ప్రాస, యతి, స్థలముల నుండుటచే మార్చుటకు వీలుకాదు. కావునఁ బ్రామాణికములు.

ఒక పదమునందలి రేఫము ఒకచోట లఘువుగను వేఱొకచోట నలఘువుగను ఉన్నదనుట శాస్త్రజ్ఞులకు సమ్మతమే యని యథర్వణాచార్యులకారికను "లఘుశ్చభవేత్ ... సద్వచః" అని ప్రమాణీకరించెను. కొన్ని స్థలములందు లఘువు గురువుగను గురువు లఘువుగను మాఱుచుండుననియు నుచ్చారణము మహాకవుల ప్రయోగమునుబట్టి కల్పించుకొనవలెననియు నథర్వణకారికాశయము.

వెనుకఁజెప్పఁబడిన చేకుఱె. తీర్చి అను రెండు స్థలములందును వరుసగా "చేకుఱె, తీర్చి" అని లఘ్వలఘురేఫములే గలవనిచెప్పి లఘ్వలఘుయతులకు [illegible] లఘ్వలఘురేఫములకును యతి ప్రాసమైత్రిగలదని చెప్పినచో [illegible]

ముగా నుండుననియు నీ సూత్రము లనావశ్యకములనియుఁ దలంచుట కవకాశము గాన్పించుచుండగా నట్లు చెప్పుటకుఁ జింతామణ్యథర్వణకారికలు విరోధించును గావున వలను పడదని "మఱియు... వల్లకాదు" అను గ్రంథముచేఁ జెప్పుచున్నాఁడు.

లఘ్వలఘువులగు రవర్ణములకు నిత్యముగా వైధర్మ్యము (యతిప్రాస విరోధము) గలదు. అన్యములకనగా లఘ్వలఘువులగు యవలలకు మాత్రము నట్టి యతిప్రాస విరోధములేదు అని నాన్యేషామిత్యాది చింతామణి సూత్రార్థము. ఏకవి కావ్యనిర్మాణమున నీ లఘ్వలఘు రేఫములకు మైత్రిని గావించునో యాతఁడు దుష్కవి యని చెప్పఁబడును. అని "అనయోస్సంగతి" మిత్యాద్యథర్వణకారికాశయము. ఈవిధముగాఁ బ్రథమాచార్యులనగాఁ జింతామణి కర్తయు, ద్వితీయాచార్యులనఁగా నథర్వణాచార్యులును లఘ్వలఘు రేఫములకు యతిప్రాసమైత్రిని నిషేధించుటచేఁ బూర్వోదాహరణములందు ఏకవిధములగు రవర్ణములే గలవని చెప్పక తప్పదు. అట్టి యేకవిధత్వమును సంపాదించుటకై యీ సూత్రము లావశ్యకములయ్యెనని భావము. అనగా "చేకూరెన్" అనునప్పటి లఘురేఫమే "చేకుఱెన్" అనునపుడును గలదనియు "తీఱిచికొనుము" అనునప్పటి యలఘురేఫమే "తీర్చికొనుము" అనునపుడును గలదనియుఁ జెప్పుటకుఁ జింతామణి కారికావళులకు విరుద్ధమగుటచే వలను పడదని తాత్పర్యము. బాలవ్యాకర్తయు "యవలలు లఘ్వలఘువులు మైత్రింబొరయును రేఫంబులు పొరయవు" (ప్ర. కీ. ౨౪ సూ) అని వీనిమైత్రిని నిషేధించెను.

**సూ. ద్విత్వరహితంబగు ద్వితీయావిభక్తి యుకారమున కచ్చు పరంబగుచో సంధి రాదు.** ౩

ఉ॥ నను నెఱిఁగె. నిను నెఱిఁగె. మొ॥

ద్విత్వరహితంబగు = ద్విరుక్తహల్లులలో ద్విత్వము లోపించినదగు. ద్వితీయావిభక్తి = ద్వితీయావిభక్తి ప్రత్యయమునకు సంబంధించిన.

మొదట ద్విత్వము గలిగి తరువాత ద్విత్వము లోపించినట్టి ద్వితీయావిభక్తి ప్రత్యయమునకు సంబంధించిన యుకారమునకు సంధి రాదని సూత్రార్థము.

విన్ను, నన్ను, తన్ను, మిమ్ము, మమ్ము, తమ్ము, అను ద్వితీయాంత పదములయందలి ద్విరుక్త నకారమకారములలో నొక హల్లునకు (శబ్దపతి. ౭౩: సూ.) గొన్నియెడల లోపమువచ్చును. అట్లు లోపింపగా ద్విత్వరహితములగు

హల్లుతోఁగూడిన ద్వితీయాంత పదముల యంతమునఁగల ఉకారమున కచ్చు పరంబగుచో సంధిరాదని తాత్పర్యము.

నమున్ + ఎఱిగె = నమనెఱిగె. ఇట నన్నున్ అను పదములోని ద్విత్వము శబ్ద. ౨౩ సూత్రముచే లోపించెను. ప్రథమేతర విభక్తి సూత్రముచే వైకల్పిక సంధి ప్రాప్తించుచుండగా నట్టిరూపము (ననెఱిగెన్) అసాధువగుటచే నీ సూత్రముచే నివారించెను. ఇట్లే నినున్ + ఎఱిగె = నినునెఱిగె. (ఇట్లే మిము నెఱిగె మున్నగునవియు).

ఈ సూత్రము ద్వితీయావిభక్తి స్థోకారమునకు మాత్రమే సంధి రాదని చెప్పుచున్నది. కాని విభక్తిస్థమునకేకాక ప్రకృతి స్థోకారమునకును ఇట్టి సంధి నిషేధము వర్తించుచున్నది. విలున్ + అందె = విలునందె అనియే యుండును. విలందె అని యుండదు. ద్వితీయాంతమునకే కాక ప్రథమాది విభక్త్యంతము నకు నీ నిషేధము చూపట్టుచున్నది. కను + అదటె = కన్నదటె. "కనదటెన"ని యుండదు.

బాలవ్యాకరణమునందలి "జడ్డక్కరంబుతోఁ బదాది స్వరంబు గూడుచో జడ్డకు లోపంబులేదు". (ప్ర. ౯ సూ) అను సూత్రముచే తనే యీ యనిష్ట రూపము నివారింపఁబడుచున్నది. కావున నీ సూత్ర మనావశ్యకమని తెలియ వలయును నన్నున్ + ఎఱిగె అని యుండునపుడు సంధి వివక్షితమయినచోఁ బదాదిస్వరము జడ్డక్కరముతోఁ గూడును. కావున ద్విత్వలోపము ప్రాప్తింపదని తాత్పర్యము. కనుకనే బాలవ్యాకర్త యీ సూత్రమునకు "నన్నడిగె" ననియు నుదాహరించెను.

## సమాసము.

**సూ. తఱచుగ సర్వనామంబుతోడం గర్మధారయంబు చూపట్టదు.౪**

కర్మధారయ సమాసమున సామాన్యముగా రెండవ పదము సర్వనామ ముగా నుండదని యర్థము సర్వనామంబుతోడన్ అని తృతీయాంతముగా నుండెడి పదముచేఁ బూర్వపదంబు ఉత్తరపదంబగు సర్వనామముతోడఁ గర్మ ధారయముగా సమసింపదను నర్థము లభించును. సర్వశబ్దంబులు సంబంధంబు నందు తచ్ఛబ్దంబుతోడ సమసించు (బాల. సమా. ౮ సూ.) అచ్చిక శబ్దంబు తోడ త్రిసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు (బాల. సమా. ౫ సూ.)అను సూత్రములలోఁ దృతీయా నిర్దిష్టములయిన పదము లుత్తర పదములగునట్లే యుచ్చుటను నుత్తర పదములగుటను నిషేధించెననియే తెలియఁదగును.

కర్మధారయ సమాసమునఁ బూర్వపదముల విషయము మాత్రమే బాల వ్యాకర్త చెప్పియుండగా నుత్తరపదములుగా సర్వనామములు సామాన్యముగా నుండరాదని యీతఁడు చెప్పుచున్నాఁడు

కర్మధారయ సమాసమునఁ బూర్వపదములుగా సర్వనామము లనేకము లుండును. త్రికమే పూర్వమున నుండునను నియమము లేదు పెక్కు విధములు, అన్ని వస్తువులు, పలుదెఱఁగులు, మున్నగురీతిని సర్వనామములు కర్మధారయ మునఁ బూర్వపదములుగా నుండుట కభ్యంతరము లేదు. ఉత్తర పదముగా నుండుట మాత్రము సామాన్యముగా సర్వనామములకు కానరానందున నీ నియమము గావించెనని తెలియనగును. సర్వనామములయినను త్రిసమములయినచోఁ బూర్వపదముగా నుండుట కాటంకము లేదు. త్రికము మాత్రము మహద్వాచక మయినను గర్మధారయ సమాస పూర్వపదముగా నుండుననుటను మాత్రము బాలవ్యాకరణము శాసించెను.

సూ. ద్విగువు మహదర్థఘటితం బదృష్టంబు. ౨౮

మహదర్థఘటితంబు = మహదర్థమును బోధించు శబ్దముతోఁ గూడినది. అదృష్టంబు = కానరానిది.

ద్విగుసమాసమునందు మహద్వాచక శబ్దములుండవని తాత్పర్యము. ముజ్జగములు, నల్దిక్కు, మున్నగు ద్విగుసమాసములు అమహదర్థమునే బోధించుచున్నవి. ముమ్మనుష్యులు మున్నగురీతిని మహదర్థకమగు సాధ్య ద్విగు సమాసము సాధువు కాదని తాత్పర్యము.

ద్విగు సమాసమున రెండు పదములు ఒకే వస్తువును బోధించును కావున రెండును ఒక్కతీరున మహద్వాచకములు గాని యమహద్వాచకములు గాని యగుచుండును. మూఁడు + లోకములు, నాలుగు + దిక్కులు, ఇటు రెండును అమహద్వాచకములు. ముగ్గురు + మనుజులు ఇటు రెండును మహద్వాచకములు. కావున సమాసము రాదు అని యర్థము అంతియేగాని విశేషణము మాత్రమే అమహదర్థకమయినందున సమాసము రాలేదనరాదు.

ద్విగు సమాసము మహద్వాచకమగునప్పుడే కానఁగున సిద్ధించునని తాత్పర్యము.

ఇది. సమస్తలక్షణ సమాసనము.

శుభమస్తు

# అకారాది సూత్రానుక్రమణిక


| వరుసనెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 1 | అంతాదులకు వారు పరంబగుచో వాకు లోపంబును రురలకు ఉఊలాదేశంబు నగు | 147 |
| 2 | అందఱాద్యులు నిత్యబహువచనాంతములు | 88 |
| 3 | అకప్రత్యయాంతావ్యయంబు కళయ | 12 |
| 4 | అకొనిత్యర్థకంబగు | 339 |
| 5 | అట్టిపోనిబోటివంటి శబ్దంబులు పదర్థకంబులు; బోటితనంతఁ బ్రత్యయార్థంబు నగు | 288 |
| 6 | అట్టి యిట్టి యెట్టి విశేషంబుల మీది తచ్ఛబ్దవకార | 285 |
| 7 | అట్లుపోలెబలెవలెశబ్దంబు లివార్థకంబులు | 277 |
| 8 | అడుగ్వాదులు ద్వికర్మకంబులు | 340 |
| 9 | అత్యంతార్థంబు నందు నగు | 166 |
| 10 | అదరులు లోనగు శబ్దములును | 89 |
| 11 | అది ఇది యెది యనువానికిఁ దృతీయా సప్తమ్యేకవచన | 122 |
| 12 | అనుకొనులోనగు ధాతుజవిశేషణముల యంత్యోకార | 40 |
| 13 | అనేక కర్తృకక్రియకు సమీపకర్తయొక్క లింగ | 365 |
| 14 | అన్నంతక్రియ చేయుయోగంబునం బ్రేరణా | 323 |
| 15 | అన్ప్రత్యయాంతమగు నగు ధాతువు కొన్నియెడల బెక్కుచోట్ల కొక్కటియు నగు | 337 |
| 16 | ఆమహాదర్థంబున భిన్నవస్తుసముదాయం బర్థమగుచో | 113 |
| 17 | అయికొనవ్యయంబులు స్వయమర్థకంబు లగు | 338 |
| 18 | అయ్యాది తృతీయాదివిభక్తులు పరంబులగుచో | 121 |
| 19 | అయ్యాది యేకత్వంబున సమాసగతషష్ఠ్యంత యత్కి | 126 |
| 20 | అయ్యాది యేకాంతంబు మహాద్విశేష్యకంబు | 56 |
| 21 | అయ్యాది యొక్కచోఁ బెక్కుచోట్ల కొక్కటియ | 186 |
| 22 | అయ్యాది వ్యవహితంబునగు | 184 |
| 23 | అర్థవిశేషంబునం దేకత్వంబునను కొన్నిశబ్దంబుల | 95 |
| 24 | అర్ఘాదులకడయచ్చున కుత్వంబును వైకల్పికంబుగా | 78 |

| వరుస నెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 25 | అలఘురేఫము లుప్తాచ్ఛమగుచో లఘురేఫంబగు | 378 |
| 26 | అలరుంబోఁడీత్యాదు లుపమానపూర్వపదకర్మధార | 252 |
| 27 | ఆంధ్రభాషకు వర్ణంబు లేఁబదియైదు | 2 |
| 28 | ఆ ఈ ఏ శబ్దములకు బూజ్యతయందు మహదేక | 119 |
| 29 | ఆ ఈ శబ్దములకును ఏశబ్దమునకును మహదర్థంబున | 114 |
| 30 | ఆ ఈ శబ్దములును ఏశబ్దంబును నమహదర్థంబున | 120 |
| 31 | ఆచ్ఛికసమాసంబులం దఱచుగ వర్ణలోపాగమా | 273 |
| 32 | ఆత్మార్థం బాకాంక్షకచో నామాస్మదర్థాభిధాయియగు | 137 |
| 33 | ఆదరార్థంబునం ద్విరుక్తి యగు | 166 |
| 34 | ఆమ్రేడితము పరంబగునపుడు కృతహ్రస్వంబునకు | 47 |
| 35 | ఆ యీత్యాది ఘటితంబులు విశేషణోభయ | 246 |
| 36 | ఆర్యార్థక మొక్కచో నటుశబ్దపూర్వకంబునగు | 310 |
| 37 | ఇటనే హ్రస్వంబగు; అగుచో వా దీర్ఘంబునకు | 118 |
| 38 | ఇట పూర్వపదంబు నత్వంబున కిత్వంబు బహు | 228 |
| 39 | ఇట్లనియె, అనిన నని భావ్యర్థకథనప్రారంభపరిసమాప్త | 359 |
| 40 | ఇతవర్ణకం బింపుబిగుపోరులకు స్వార్థంబునందనగు | 296 |
| 41 | ఇదవర్ణకం బొప్పుతప్పు పెల్లులకు స్వార్థంబు | 297 |
| 42 | ఇప్రత్యయాంతావ్యయమునకు సంధియు లేదు | 24 |
| 43 | ఇయ్యవి క్రియావ్యవహితంబులు నగు | 45 |
| 44 | ఇరు రెంటున కాదేశంబగు | 154 |
| 45 | ఈ ఏ ఒకశబ్దములకంటె బరంబయిన యంతశబ్దము | 111 |
| 46 | ఈర్చుబ్బుకందుదువ్వువడ్డించుల కెనవర్ణకంబగు | 342 |
| 47 | ఉండిపదంబు పరంబగుచో ఫలనకంగువర్ణకమట్లు | 191 |
| 48 | ఉదంతములగు నమహత్తుల కంటువర్ణకము పరంబగు | 74 |
| 49 | ఉద్దేశ్యవిధేయభిన్నంబు విషయంబు | 354 |
| 50 | ఉద్దేశార్థమునందు ద్వితీయకు గుఱించియు నను ప్ర | 182 |
| 51 | ఊరుచోటుమేన్వాదు లున్లగ్విషయంబులు | 162 |
| 52 | ఎక్కటి యొక్కటి | 148 |
| 53 | ఎక్కుడిగులకుం బ్రేరణార్థంబున మతివర్ణకంబగు | 348 |
| 54 | ఎద్దుదేవరశబ్దములకు లులలుపరంబులగునపుడు | 110 |
| 55 | ఎనిమది నివరంబున కత్వంబగు | 156 |

| వరుసనెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 56 | ఎవ్వరిత్యాదులందలి రివర్ణంబునకు లోపంబువిభాషనగు | 130 |
| 57 | ఏఁడేరేడేవిశబ్దంబులర్థవిశేషంబునందికారాంతంబులగు | 146 |
| 58 | ఒ ఓలకు సందేహార్థకంబులకు వలయుచో | 336 |
| 59 | ఒకండాద్యులు పరంబులగుచోఁ దఱచుగనున్ | 256 |
| 60 | ఒకచో హ్రస్వంబు దీర్ఘంబగు | 5 |
| 61 | ఒకశబ్దంబొక్కచో నల్పార్థకంబగు | 144 |
| 62 | ఒకానొకచో గుణవాచక ధాతుజవిశేషణంబు లవయవ విశేషపూర్వకంబులై | 242 |
| 63 | ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబులగు నుండు చను | 308 |
| 64 | ఒకానొకచోఁ దోడకుఁ దోడుత నని రూపాంతర | 190 |
| 65 | ఒకానొకచో ననుకరణవిరహితంబుగ సంస్కృత | 21 |
| 66 | ఒకానొకచో జకారం బుభయంబునగు | 7 |
| 67 | ఒకానొకచోఁ దోడకుఁ బ్రత్యేకప్రయోగంబు | 187 |
| 68 | ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబ | 268 |
| 69 | ఒకానొకచో ద్వంద్వంబు మిశ్రంబును, అందలి పూర్వపదంబు క్లీబసమంబునుగ గానంబడియెడి | 267 |
| 70 | ఒక్కచో ద్విగువు మిశ్రం బేకవచనాంతంబునగు | 254 |
| 71 | ఒక్కచో ద్వితీయాంత విధేయవిశేషణంబునకుం | 220 |
| 72 | ఒకానొకచో నన్నంతమగు నగుధాతువు | 328 |
| 73 | ఒకానొకచో ననిర్దిష్టార్థమం దొకశబ్దమునకుం | 145 |
| 74 | ఒకానొకచో నిరుగురున కిద్ద రాదేశంబగు | 154 |
| 75 | ఒకానొకచో మతుబర్థంబున నవర్ణంబు చూపట్టెడి | 303 |
| 76 | ఒకానొకచో రండుపాండులకు రాపాండని | 317 |
| 77 | ఒకానొకచో సహార్థంబున యుష్మదస్మదర్థంబు | 381 |
| 78 | ఒక్కచో నుదంతంబగు నజడంబు తృతీయకును | 207 |
| 79 | ఒక్కచో విశేషణంబులును విశేష్యంబులగు | 59 |
| 80 | ఒక్కచో సమాసాంతర్గతవిశేష్యంబుల కగువిశేషణంబుల షష్ఠికిని బ్రథమ చూపట్టెడి | 212 |
| 81 | ఒక్కొకచో జడంబున సప్తమికిం బ్రథమయు నగు | 211 |
| 82 | ఒక్కొకచోఁ దద్ధర్మక్రియ యాద్యాద్యర్థపరకంబులు వ్యతిరేక వ్యంజక ప్రశ్నార్థకంబగు | 310 |
| 83 | ఒక్కొకచో నామంబెయగు | 134 |

| వరుస నెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 84 | ఒక్కొకచో భూతార్థకాసమాపకక్రియ | 319 |
| 85 | ఒక్కొకచో విశేష్యవిశేషణంబులు వ్యత్యస్తంబులు | 59 |
| 86 | ఒక్కొకచో సమాసగత పూర్వపదంబు వ్యవ | 269 |
| 87 | ఒక్కొకశబ్దంబుల యత్వంబున కొత్వంబు | 140 |
| 88 | ఒక్కొకాదులకు డువర్ణకంబు పరంబగునపుడు | 140 |
| 89 | ఓ శబ్దం బొక్కచో సంబోధ్యవాచకంబునకు ముం దితర శబ్దవ్యవహితంబయి కానంబడియెడి | 63 |
| 90 | ఔపవిభక్తికాంతంబులగు చేయినేయి లోనగు | 160 |
| 91 | కంటె వర్ణకము పరంబగునపుడు గొన్నియెడల | 73 |
| 92 | కంటెవర్ణకంబు పరంబగునపుడు విశేషణ సవర్ణకంబుమీది | 324 |
| 93 | కతిపయ సంభారవాచకశబ్దములును | 85 |
| 94 | కపిలశబ్దభవము కవిలశబ్దంబొండు గానంబడెడి | 19 |
| 95 | కరఁగు తలఁగు మెఱయ్యాదు లంతర్భావిత | 339 |
| 96 | కరవర్ణకంబు సాయఁకశబ్దంబునకు | 297 |
| 97 | కర్తృబహుత్వంబున వసతనకుఁ దమతమయునగు | 189 |
| 98 | కర్తృభూతక్రియతోడం దత్కర్తకన్వయంబగు | 335 |
| 99 | కర్మధారయంబు బిరుదాత్యుత్తరపదంబయ్యేనేని | 226 |
| 100 | కర్మధారయంబియ్యది మిశ్రంబు సిద్ధసమాసంబట్లయగు | 230 |
| 101 | కఱకంఠుఁడు బహువ్రీహి | 261 |
| 102 | కవిత్రయేతరప్రయోగంబులం గొన్నియెడల నిత్రప్పత్యయాదులు పరంబులగునపుడు | 321 |
| 103 | కాచువీచులకు వలివర్ణకంబగు | 344 |
| 104 | కాదె కదార్థకంబగు | 338 |
| 105 | కారకంబులనం గర్మాదులు | 178 |
| 106 | కారము క్షారశబ్దభవము | 15 |
| 107 | కారవర్ణకంబు చెలినయములకు భావంబునందును, నడికొలతలకు స్వార్థంబునందు నగు | 298 |
| 108 | కిమేకార్థశబ్దంబులు క్రమంబున నజ్ఞాతవస్తూద్దేశ్య | 101 |
| 109 | కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి | 72 |
| 110 | కొండొకయెడ ఋఉవర్ణకములు పరంబగునపుడును | 153 |
| 111 | కొన్ని చోట్ల షష్ఠీసమాసంబునం దుకారంబున | 86 |

| వరుస నెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 112 | కొన్ని యవ్యయంబులు బహువచనాంత తుల్యంబులు | 88 |
| 113 | కొన్ని యెడల గర్తృ కర్మక్రియ లధ్యాహార్యంబు | 365 |
| 114 | కొన్ని యెడలం గాని క్రియాపూర్వకంబు | 374 |
| 115 | కొన్ని యెడలఁ జేత విభక్త్యర్థక వర్ణకంబులకును | 184 |
| 116 | కొన్ని యెడలం దదాదులు విశేషణంబు లధ్యా | 360 |
| 117 | కొన్ని యెడలఁ దెనుఁగులమీఁది సాంస్కృతిక | 31 |
| 118 | కొన్ని యెడల ద్వంద్వంబునం బదంబుమీఁది | 32 |
| 119 | కొన్ని యెడలం ద్వరితానాదరార్థంబుల రెంటను నగు | 167 |
| 120 | కొన్ని యెడలం ద్వరితార్థసూచకంబయి భావిని | 313 |
| 121 | కొన్ని యెడల నజడంబు తృతీయా సప్తములకును | 208 |
| 122 | కొన్ని యెడల నజడంబు ద్వితీయకును బ్రథమ | 210 |
| 123 | కొన్ని యెడల నవకగు కొనంబడియెడి | 157 |
| 124 | కొన్ని యెడల నవర్ణంబు పరంబగునపుడు పూర్వ | 41 |
| 125 | కొన్ని యెడల నవయవ కర్తృకక్రియ తదవయవి | 371 |
| 126 | కొన్ని యెడల నిచోట్లన నాపామాయాగమంబులగు | 228 |
| 127 | కొన్ని యెడల నీసమాసపదంబులు యువర్ణ వ్యవహితం | 260 |
| 128 | కొన్ని యెడల నుపమానంబులు పెక్కులగుచో | 285 |
| 129 | కొన్ని యెడల ను శబ్దప్రయోగమునం దోడకు | 188 |
| 130 | కొన్ని యెడలఁ బ్రామాణిక ప్రయోగంబులం | 26 |
| 131 | కొన్ని యెడల భావార్థకరూపము నుశబ్దపరకం | 317 |
| 132 | కొన్ని యెడల మహదర్థంబుననే శబ్దంబునకు | 116 |
| 133 | కొన్ని యెడలమహద్ద్వంద్వంబునం బూర్వపదాంత్య | 262 |
| 134 | కొన్ని యెడల రేఫసంయుక్త తవర్గకంబు ముందటి | 129 |
| 135 | కొన్ని యెడల వాక్యంబు వాక్యాంతరగర్భంబు నగు | 376 |
| 136 | కొన్ని యెడల విధేయవిశేషణ మొండ బహువచనాంతం | 222 |
| 137 | కొన్ని యెడల విశేషణంబు ద్వితీయాదులకుఁ బ్రథమ | 214 |
| 138 | కొన్ని యెడల విభక్తిపరిణామంబు గ్రామ్యంబు | 228 |
| 139 | కొన్ని యెడల విశేషణోభయపదంబు త్రిక | 248 |
| 140 | కొన్ని యెడల వ్యాసవాక్యమునకు ముందు సంగ్రహ | 375 |
| 141 | కొన్ని యెడల షష్ఠ్యంతతదాది శబ్దపూర్వకంబులు | 165 |
| 142 | కొన్ని యెడల సంబంధంబున బూర్వవాక్యంబు | 361 |

| వరుసనెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 143 | కొన్ని యెడల సప్తమీ తత్పురుషమునందు నవర్ణ | 275 |
| 144 | కొన్ని యెడల సిద్ధసమాసమధ్యగత పదంబులతో | 271 |
| 145 | కొన్ని యెడల హేతువునం దన్నంత క్రియ | 194 |
| 146 | కొన్ని శబ్దంబు లర్థవిశేషంబున ద్విరుక్తంబులయి | 167 |
| 147 | కొఱకు కంటె పొంటెలు పరంబులగునపుడు | 318 |
| 148 | కోట పేటలు వైకృతములు | 17 |
| 149 | క్రియాన్వయంబున రెండు పదంబులకు స్వస్వామి | 216 |
| 150 | క్రియాన్వయవాక్యంబులు కొన్ని వ్యంగ్యార్థ | 358 |
| 151 | క్రియావిధేయవిశేషణంబుమీఁది యగుధాతు | 326 |
| 152 | క్రీడావిశేషవాచకశబ్దములును | 90 |
| 153 | క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబులతోడంబలె | 231 |
| 154 | గుణవాచకంబు క్రియావిశేషణంబగుచో నొక్క | 241 |
| 155 | గుణవాచకంబులు కొన్నింటి నిగాగమంబునకు | 240 |
| 156 | గుణరసవాచకములైన దేశ్యవిశేషణశబ్దములును | 87 |
| 157 | గ్రామ్యంబు తత్తజ్జాతివర్ణనంబునం బ్రయోగార్హ | 20 |
| 158 | చతుర్థికిం బొంటె వర్ణకంబునగు | 190 |
| 159 | చలికి మిరివర్ణకంబు; స్వార్థంబునందగు | 299 |
| 160 | చిట్టడవిఁజిట్టి | 29 |
| 161 | చెడుగు దుడుకు నిడుపులకుఁ బుంస్త్వంబున మకు | 295 |
| 162 | జడపదంబులమీఁది తోడకు మెయిమైలు వికల్పంబుగ | 71 |
| 163 | జడపదం బనుకరణవిరహితంబ తఱచుగ నగు | 22 |
| 164 | టివర్ణం బమహదర్థంబున నొక్కొఁడాదుల డువర్ణ | 143 |
| 165 | టివర్ణకంబొంటు నంత్యవర్ణంబునకు భావంబునందగు | 299 |
| 166 | డయ్యు దయ్యునొచ్చు పుచ్చులకివర్ణకంబగు | 341 |
| 167 | డుమంతంబులగు తత్సమాది శబ్దంబులకుం గొన్ని | 93 |
| 168 | తచ్ఛబ్దాంతములగు ధాతుజవిశేషణంబుల మీఁద | 223 |
| 169 | తద్ధర్మభూతక్రియ లార్యాద్యర్థపరకంబులయి | 309 |
| 170 | తద్ధర్మార్థక విశేషణం బసహాయతం ద్రికాలవాచి | 305 |
| 171 | తద్భవములందును నలఘురేఫము గలదు | 13 |
| 172 | తద్ధిత ప్రత్యయములు పరంబగునపుడు పదంబుల | 292 |
| 173 | తనవర్ణకంబు పరంబగునపుడు తచ్ఛబ్దార్థమునకు | 292 |

| వరుసనెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 174 | తమ్ముఁగుఱ్ఱలు చిలుకమొకరి యిత్యాగులు | 245 |
| 175 | తవర్ణకంబు పరంబగుచో రేఫంబుమీఁది యిత్తునకు | 128 |
| 176 | తవర్ణకంబు స్వార్థకంబగు | 126 |
| 177 | తఱచుగఁ గర్మధారయ సమాసంబునం బెన్నాదుల | 35 |
| 178 | తరచుగఁ క్రియలమీఁది కదకదవుల కన్నా | 336 |
| 179 | తఱచుగ ధాన్యవాచకశబ్దములు | 90 |
| 180 | తఱచుగ సర్వనామంబుగోడం గర్మధారయంబు | 381 |
| 181 | తఱచుగ స్త్రీసమంబులగు దేశ్యశబ్దంబులకుఁ గడపల | 91 |
| 182 | తామర కొనపరంబగునపుడు పుగాగమంబగు | 34 |
| 183 | తాము తమరు తారునగు | 132 |
| 184 | తిగుమ ధాతువు నన్నంతిరూపములు తివ్వ | 324 |
| 185 | తెనుఁగునం గొన్ని తత్సమదేశ్యశబ్దములకుం ఱం | 74 |
| 186 | తెనుఁగునం గొన్ని శబ్దములు విశేష్యవిశేషణంబు | 61 |
| 187 | తెలివి విరివి వినికి లేమి రాపులకు స్వార్థంబునం | 296 |
| 188 | త్రికంబున కమహదర్థంబునం బ్రథమైకవచనబహు | 120 |
| 189 | దఘ్నార్థంబునం దత్సమపదంబులమీఁదను బంటి | 301 |
| 190 | దాని యత్వంబున కిత్వైత్వంబులు పర్యాయంబున | 127 |
| 191 | దీర్ఘంబు దీర్ఘంబ | 6 |
| 192 | దీర్ఘపూర్వకమగు లఘురేఫము హ్రస్వపూర్వకము | 378 |
| 193 | దేశ్యంబునం గొన్నియెడల మహన్మహత్యర్థక | 105 |
| 194 | దేశ్యంబునం దక్కుడాదులు నిత్యైకవచనాంతములు | 81 |
| 195 | దేశ్యంబులం గొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబులగు | 66 |
| 196 | ద్వంద్వం బప్రాణివాచక కృదంత శబ్దఘటిత | 265 |
| 197 | ద్వంద్వంబునం బూర్వపదాంత్యావయవంబునకు | 267 |
| 198 | ద్విగువు మహదర్థఘటితం బదృష్టంబు | 382 |
| 199 | ద్వితీయాగులం దసంయుక్త రవర్ణకంబు నత్వంబున | 148 |
| 200 | ద్వితీయాదులందు రురియగు | 92 |
| 201 | ద్వితీయైకవచన బహువచనంబుల రెంటను నివర్ణకంబగు | 121 |
| 202 | ద్విత్వయుక్తలాంతంబుమీఁది లులకును | 76 |
| 203 | ద్విత్వరహితం బగు ద్వితీయావిభక్తియుకారమున | 390 |
| 204 | ధ్వన్యనుకరణశబ్దంబులు కొన్నింటి కింద | 240 |

| వరుసనెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. | |
|---|---|---|---|
| 205 | ధ్వన్యనుకరణశబ్దంబులు ద్విరుక్తంబుల యగు | 45 | |
| 206 | ధ్వన్యనుకరణశబ్దముల కనుధాతువుపరంబగుచోఁ | 44 | |
| 207 | ధాతుజవిశేషణంబులు తథార్థకావ్యయంబుతోడం | 234 | |
| 208 | ధాతుజ విశేషణభావార్థకపూర్వవ్యవహితా | 200 | |
| 209 | నకారం బసాధారణంబు ద్రుతంబు | 9 | |
| 210 | నామతదేత ద్యత్కిమర్థంబులకుం బునర్గ్రహణంబున | 135 | |
| 211 | నామపదంబు లార్థ్యాద్యర్థపరకంబులయి వ్యతిరేక | 168 | |
| 212 | నామపునర్గ్రహణంబున భిన్నంబునభిన్నంబునయి | 132 | |
| 213 | నానుసర్వనామంబులకును గళలగు నవ్యయంబుల | 169 | |
| 214 | నిన్ను నన్నుఁ దన్ను వీనియందలి ద్విత్వమునకేనియు | 131 | |
| 215 | నిర్దేశవిధానోచ్చారణంబుల దఱచుగ అవరాదులు | 8 | |
| 216 | నీ మీ నే మే హల్లులకు లోపంబు విభాషనగు | 131 | |
| 217 | నెన్నడాదులన్ నెఱిదగు | 41 | |
| 218 | న్యూనవచోవాక్యంబునఁ దద్వచనంబు లభ్యా | 363 | |
| 219 | పకారంబు కొన్నియెడల శత్రర్థపరకచువర్ణంబునకుం | 322 | |
| 220 | పదమనఁగా బ్రయోగార్హంబు ననన్వితంబు నేకంబు | 348 | |
| 221 | పదములకుఁ బరస్పరముగల సంబంధ మన్వయమ | 353 | 199 |
| 222 | పదములవి నామములు క్రియలవ్యయంబులని | 350 | 348 |
| 223 | పదాద్యంతగతం బాశబ్దం బమహదర్థకంబు సమస్తంబు | 125 | 296 |
| 224 | పదికి రెండిరు దొమ్మిదులు పరంబులగునపుడు | 25 | 296 |
| 225 | పదియిత్వంబున కుత్వంబగు | | 318 |
| 226 | పదియుత్తరపదంబగుచో నేను దొమ్మల నుమ్మలకు | | 323 |
| 227 | పదియుత్తరపదంబగుచోఁ బూర్వపదంబు దీర్ఘంబునకు | | 329 |
| 228 | పద్యంబులకుఁ గులకంబగు | | 330 |
| 229 | పరిమాణార్థంబునం బ్రథమైకవచనంబునంద | | 40 |
| 230 | పలుశబ్దంబునకుఁ రురలు పరంబగునపుడు గువర్ణంబును | | 24 |
| 231 | పురవర్ణకంబు కొఁచు దాఁచు దాయ్యాదులకగు | | 165 |
| 232 | పూజ్యతేయందొక్కచో నామ తదేద్యుష్మదస్మచ్ఛబ్దంబు | | 166 |
| 233 | పూజ్యతాతిశయంబున యుష్మదర్థ బహువచనం | | 225 |
| 234 | పూ పూవు | | 432 |
| 235 | పైయాగమంబులు కొన్నియెడల ద్విత్వయుక్తంబు | | |

| వరుసనెంబరు. | సూత్రము. | పుటసంఖ్య. |
|---|---|---|
| 298 | షష్ఠీస్థానికంబగు కువర్ణకంబొక్కొకచో ద్వితీయాది | 195 |
| 299 | సంఖ్యాప్రయుక్తవిశేషణ మేకాంతంబయి | 53 |
| 300 | సంఖ్యావాచకంబులకు విభక్తిపరంబగునపుడు | 150 |
| 301 | సంపూర్ణ మసంపూర్ణమని వాక్యంబు ద్వివిధంబు | 356 |
| 302 | సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దంబులకుం | 100 |
| 303 | సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యెఁ | 98 |
| 304 | సద్రుతం బంత శబ్దంబు తనలమపూర్వకంబు స్వయమర్థ | 164 |
| 305 | సమానార్థకములయిన యీడెనసరిసాటిలోనగు | 85 |
| 306 | సమాసఘటితంబీశబ్దంబొక్కొచో సూచనార్థకంబగు | 239 |
| 307 | సమాసమందుఁ దత్సమంబు పరంబగునపుడును | 38 |
| 308 | సర్వనామంబులకు మహదర్థంబునం దఱచుగ | 145 |
| 309 | సర్వపర్యాయంబైన యెల్లశబ్దమునకు సప్తమియు | 32 |
| 310 | సస్యవాచకశబ్దములును | 84 |
| 311 | స్వార్థంబునం దిరివర్ణకంబు వాఁపున కగు | 297 |
| 312 | హలవసానంబులు పరంబులగునపుడు లు రు వర్ణకం | 68 |
| 313 | హలవసానంబులు పరంబు లగునపు డేమిశబ్దము | 42 |
| 314 | హ్రస్వవ్యస్త త్రికంబుమీఁది దిచ్వులకు ద్విత్వంబునగు | 121 |

సూచన:— పాఠకులు ఇందు చూపిన సవరణల ముందుగా చేసికొని తరువాత చదువ గలరని నమ్ముచున్నాము.

ప్రకాశకులు.

## ముఖ్యములగు తప్పొప్పుల సూచన.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| | 11 | సూత్ర | సూత్రము |
| | 25 | వార్తికముచే | వార్తికములచే |
| | 18 | విధానమును | విధానము |
| | 19 | | "3వ సూత్రము విషయముగూడ బాల వ్యాకర్తకు సమ్మతముగాదు. అతడు తన వ్యాకరణమున నెచ్చటను హ్రస్వమును దీర్ఘముగా గ్రహింపలేదు." ఈ భాగమును తీసివేసి చదువుకొనవలెను. |
| | 25 | ప్రయోగములు బాలవ్యాకర్తకు సమ్మతములుగాకయే యాతండీ విషయములు | ప్రయోగములనుగూర్చి బాలవ్యాకర్త సూత్రింపలేదు. |
| [illegible] | 25 | యుక్తయిగా | యుక్తముగా |
| [illegible] | 8 | మేటిమగల | లేటిమగల |
| 1[illegible] | 27 | జీలగట్టి | జీలకట్టి |
| [illegible] | 2 | శబ్దము | శబ్దభవము |
| ,, | 24 | మిశ్రమ | మిశ్ర |
| 1[illegible] | 27 | నాశబ్దముల | యాశబ్దముల |
| 2[illegible] | 14 | వర్ణంబునం | వర్ణనంబునం |
| 21 | 4 | విధే | విధా |
| ,, | 9 | విధే | విధా |
| 2[illegible] | 18 | ద్రక్త్రాస్య | ద్రక్త్రార్ధి |
| ,, | 19 | దాంతర్ధి | దాంతర్హి |
| 27 | 16 | ముంకుటచే | ముండెనని |
| 2[illegible] | 18 | సంశ్లేషే | సంశ్లేషా |
| 2[illegible] | 6 | మార్చు | మార్పు |
| 3[illegible] | 8 | కుఱు | చిఱు |
| 31 | 8 | నిత్యమను | రాదను |
| 3[illegible] | 2 | ముల | మ్ముల |
| 3[illegible] | 21 | మిత్తమని | మిత్తని |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 35 | 27 | ప్రకీచే | ప్రకీ।చే |
| 36 | 5 | నకారంబున | పదాంతనకారంబున |
| ,, | 12 | కొదువక | కొదుకక |
| 40 | 9 | ౪ | ౫ |
| 43 | 8 | సుతుల | సుతులు |
| 49 | 2 | (రెండవపంక్తిగా "నామప్రకరణము" అని యుండవలయును.) | |
| 51 | 25 | లేదు | గలదు |
| 52 | 13 | విశేషణములు | విశేషణముగా |
| ,, | 18 | కాని। | కాని విశేష్యములు |
| 66 | 24 | స్త్రీసమంబులకు | స్త్రీసమంబులగు |
| 67 | 29 | స్త్రీసమంబు | స్త్రీవాచకంబు |
| 68 | 7 | చేతను స్త్రీసమములగుట చేతనుగూడ | చేతను, సంబోధనాంతము లగుటచేతను |
| 73 | 4 | నిత్యమనియు | అనిత్యమనియు |
| 76 | 26 | అరవేటల్లియ | అరరే యల్లియ |
| ,, | 27 | జోరునఁ | బోరునఁ |
| ,, | 28 | సంగడాలే | సంగడాలా |
| 77 | 28 | సూత్రంబు | సూత్రంబున |
| 78 | 6 | గంబునందు | గంబులందు |
| 81 | 18 | నపుడు | నపుడు నిగాగమంబు |
| 82 | 2 | బ్రదిలి | బ్రిదిలి |
| ,, | 24 | బహుళకంబు | బాహుళకంబు |
| 92 | 22 | పచమునకు | పదమునకు |
| ,, | 16 | ఏకవచనంబున | ఏకవచనంబున ననఁగా |
| 101 | 26 | 3 అ. | 3 అ.264 |
| 107 | 21 | రాజ. సూ.చే | రాజ. సూ.చే.లు.రు.గా మాఱిన బహువచనాంతములు |
| 111 | 4 | దకారంబునకు | దకారంబునకు డకారంబును |
| 112 | 16 | తచ్ఛబ్లాతః | తచ్ఛబ్దాతః అను సూత్రము |
| 115 | 6 | వేనిచేలన్ | ఏనిచేతన్ |
| 116 | 29 | ఏవ్వారు | ఏవారు |
| 117 | 9 | యనియు | యనియు బహుత్వ వివక్షయందు అవి యనియు |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 118 | 12 | ఎవ్వాఁడు- | ఎవ్వాఁడు-వాదీర్ఘ |
| ,, | 16 | ద్విత్వము | ద్విత్వలోపము |
| ,, | 21 | నెవ్వాఁడు | నేవాఁడు |
| ,, | 27 | బాల. సమా.౧౮ | బాల. సమా.౧౩ |
| 119 | 4 | ప్రమాదము | ప్రమాదమున |
| ,, | 10 | ఏతఁడు | ఏతఁడు; ఆకె (ఆ+అక+ఎ) |
| ,, | 23 | అనియగుట | మున్నుగురితినగుట |
| 120 | 15 | ప్రతికంబున | ప్రతికంబునక |
| 125 | 3 | వానికిని, సూత్రము | వానికిమాత్రము |
| ,, | 7 | గావు | గాపు |
| ,, | 21 | గావు | గాపు |
| ,, | 22 | గావు | గాపు |
| 128 | 25 | రూపాంతము | రూపాంతరము |
| 129 | 12 | ఆ,ఇ,ఉ,ఏ | అ,ఇ,ఉ,ఎ |
| 131 | 29 | చేయుదు | చేయుచు |
| 133 | 22 | నర్థగమున | నర్థమున |
| 139 | 10 | ఈ యుదాహరణమున... ...జనదు. | (ఇది తీసివేయవలయును) |
| 140 | 27 | ఒక్కొక్కాదుల | ఒక్కొకాదుల |
| 142 | 23 | రానియపుడు | ను, లోపించి |
| ,, | 28 | రురుగాగమ | రురువుగాగమ. |
| 145 | 6 | దున్నిన | దున్మిన |
| 146 | 22 | సూత్రమున | సూత్రమున సెల్లశబ్దమునకు |
| 153 | 16 | ఉకారంబును | డకారంబును |
| 156 | 18 | అత్యము | అత్వము |
| 160 | 3 | మహాత్కార్యము | అమహాత్కార్యము |
| 168 | 7 | జేర్చ | జేర్ప |
|  | 22 | వికల్నమగు | వికల్పమగు |
| 169 | 9 | శబ్దము | శబ్దముల |
| 172 | 13 | రామునియొక్క | రాములయొక్క |
| 173 | 9 | చున్నది | చున్నవి |
| 175 | 7 | ఇటు | ఇట |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 176 | 28 | రొుక | రొుక |
| 179 | 11 | విశేషణము | విశేషము |
| 180 | 12 | ఏదో | ఏదే |
| 185 | 3 | దాన | దాశ |
| ,, | 6 | విభక్త్యర్థక | విభక్త్యర్థక |
| ,, | 7 | వ్యాకరణ | బాలవ్యాకరణ |
| 188 | 10 | తోటియల్లుడు | తోడియల్లుఁడు |
| ,, | 11 | తోటికోడలు | తోడికోడలు |
| ,, | 16 | విదుల | విధుల |
| 189 | 6 | =తోడనున్ | తోడనున్ |
| ,, | 8 | అనుచోట | అనుచోట బ్రాహ్మణుల అనుదానికిని |
| 192 | 10 | బడినది | బడినని వి |
| 193 | 5 | నిర్ధారణముతప్ప | నిర్ధారణమునఁదప్ప |
| 194 | 25 | జిప్రత్యయ | సుజిప్రత్యయ |
| 208 | 10 | వ్యవహితముననున్న | వ్యవహితముగానున్న |
| ,, | 12 | షష్ఠ్యంతము | షష్ఠ్యంతమయి |
| 202 | 6 | ధాతుజ | (1) ధాతుజ |
| 204 | 29 | పరప | పఱుప |
| 210 | 13 | సూత్రించెను | సూచించెను |
| 216 | 6 | నాసనా | శాసనా |
| 223 | 26 | సుత్వమును | సుత్వమున కత్వమును |
| 221 | 27 | వివక్షితము | వివక్షితము. |
| 230 | 29 | దీనికి | వీనికి |
| 231 | 28 | సంచరించె | సంచలించె |
| 232 | 5 | 3ర | 3౯ |
| 234 | 22 | ఆద్యక్షరానంలే | ఆద్యక్షరానంతర |
| 244 | 23 | యుదాహాణమున | యుదాహరణమున |
| ,, | 80 | శరీర శరీర | శరీర శరీరి |
| 246 | 16 | పెనునిట్టి | పెనునిట్ట |
| 247 | 9 | నేరము | నేరములు |
| 249 | 8 | ప్రయోజనములు | ప్రయోగములు |
| 251 | 4 | వ్యాఖ | వ్యాఖ్య |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 252 | 23 | నుపమానోత్తర | నుపమానపూర్వ |
| 254 | 14 | మిశ్రం | మిశ్రం |
| ,, | 25 | ద్విగురువు | ద్విగువు |
| ,, | 10/2 | గావున | గావున కిత్త్వమే |
| 257 | 9 | పదియారు | పదియాఱు |
| ,, | 10 | పదారు | పదాఱు |
| ,, | 12 | పదారు | పదాఱు |
| ,, | 23 | భ్రాంతి | నభిప్రాయము |
| 261 | 18 | అర్థమును | అర్థమునుబట్టి |
| 263 | 19 | మువర్ణము | మువర్ణకము |
| 268 | 29 | మునుగఁ | ముగను |
| 269 | 8 | విభక్తిక | విభక్తి |
| 276 | 7 | లోపము | అంగు విభక్తి |
| 277 | 2 | ఈసూత్ర......విరుద్ధము | “కువలయంబు సందలివాడు” “కువలయంబునవారు” అను రూపములు సమాసమున నుండును. ఇందు రెండవ రూపము ఈ సూత్రముచే సిద్ధంపఁజేసెను. మొదటి రూపముబాలవ్యాకరణముచేత సేసిద్ధించును. |
| 287 | 17 | తద్ధార్థంబు | తద్ధార్థకంబు |
| 317 | 4 | ప్రయోగముఁగూడ | ప్రయోగముకూడ |
| 321 | 24 | చూటపుట | చూపుట |
| 342 | 16 | ఈర్ప్సన | ఈర్ప్సన |
| 343 | 2 | వడెన | వడ్డెన |
| 360 | 16 | యున్నది. | యున్నది. “ముందుఁ జెప్పఁబోవు విషయమునకుఁ బూర్వము “ఇట్లనిరె”ననియు నా విషయము : బూర్తిగావించిన పిమ్మట “అనినన్”అనియుఁ బ్రయుక్తము › పను.”అను నర్థమిట సముచితము. “భవిష్యత్కాల సంబంధియగు నర్థమును జెప్పునప్పుడు” అని తలంచుట సరసముగాదు. అట్లయినచోఁ బైదోషములు వర్తింపవు. |
| 366 | 18 | గంధర్వగంధర్వ | గంధర్వ |
| 366 | 28 | బడలేదు. | బడెను. |